వ్యా. దేవాదిగ్రహములు మనుజులశరీరమును విశేషముగ జెరుపక తమతమ స్వభావసిద్ధములగుగుణములచేతను ప్రభావముచేతను ఇతరుల కగపడకయే అద్దమున ప్రతిబింబంబును సూర్యకాంతపుమణియందు సూర్యకిరణంబులును ప్రవేశించుభంగి పురుషుని శరీరమున తటాలున శీఘ్రముగ ప్రవేశించి యావహించెదరు. (ఇచ్చట "అదూషయన్తః" అనుచోట నఞ్ గొంచెము అనునర్థమును చెప్పును. అనగ విశేషముగ మనుజునిశరీరమును జెరుపక యించుక చెరుపునని యర్థము.)

భూతోన్మాదప్రాప్తిసమయపూర్వరూపాదినిర్దేశము.

మూ. ఆఘాతకాలో హి సపూర్వరూపః ప్రోక్తో నిదానేఽథసురాదిభిశ్చ,
ఉన్మాదరూపాణిపృథజ్నిబోధ కాలం చ గమ్యాక్ పురుషాంశ్చ తేషామ్.

వ్యా. పైజెప్పబడిన దేవాదిభూతము లావహించుసమయంబును పూర్వరూపములును, నిదానస్థానమునం దేడవయధ్యాయమున జెప్పబడినవి. మరియు దేవాదిగ్రహముల యున్మాదమున గల్గులక్షణములు, అవి యావహించుతిథి మున్నగుకాలవిశేషములు, అట్టిగ్రహము లావహించుపురుషులు ఈవిశేషములన్నియు నీక్రింద సవిస్తరముగ వివరించి చెప్పబడును. వానివిశేషములనెల్ల చక్కగ గమనించి వినుమని శిష్యసంబోధనము. (భూతము లావహించుసమయము "ఉన్మాదయిష్యతామపి ఖలు దేవర్షి.........ఇత్యాఘాతకాలా వ్యాఖ్యాతా భవన్తి." (ని. అ. ౭. సూ. ౧౬.) అనియు; "తత్ర దేవాది ప్రకోప.........ఉన్మాదాభినిర్వృత్తిః" అని పూర్వరూపంబులును వివరింపబడినవి.)

దేవగ్రహోన్మాదలక్షణము.

మూ. తద్యథా:—సౌమ్యదృష్టిం గమ్భీరమప్రధృష్ట (ష్య) మకోపనం
అస్వప్న భోజనాభిలాషిణం, అల్పస్వేదమూత్రపురీషవాచం(వాతం)
శుభగన్ధం ఫుల్లపద్మవదనమితి దేవోన్మత్తం విద్యాత్. 20

వ్యా. దేవగ్రహ మావహించియున్నమనుజుడు శాంతమైన దృష్టికల్గి యుండును. గంభీరమైన స్వభావంబును, ధైర్యంబును కల్గియుండును. కోపంబును నిద్రాభోజనములయం దభిలాషయు లేకయుండును. చెమటయు మూత్రపురీషంబులును వాతంబును స్వల్పముగ వెడలును. మంచి పరిమళము కల్గియుండును. వానిముఖము వికసించిన కమలమును బోలి యుండును. ఈలక్షణములుగల్గినట్టి దేవగ్రహావేశముచే గల్గినయున్మాదమని యెరుంగునది.

ఇచ్చట నీవిషయము నెరుంగునది:—దేవత లెప్పుడును మనుష్యులతోకూడ నుండరు. మాటలాడరు. మనుష్యశరీరమును స్పృశింపరు. కావున నెప్పుడును మనుష్య

శరీరమును స్పృశించి యావహించుట యసంభవము. కావున ఆదేవతలే మనుజుల నావహించి బాధించెదరని చెప్పువారికి భూతవిద్య బొత్తుగ తెలియదు. మరియు వాస్తవ్యమైనట్టి దేవతలసన్నిధిలో రక్తమాంసవసాదుల నాహారముగ జేసికొనుచు రాత్రులలో సంచరించుచు గ్రహరూపము నొందియుండు పరిచారకులు సంఖ్యాతీతముగ నుందురు. అట్టి క్రూరగ్రహములు బలి పూజాసత్కారాదుల నభిలషించి నిదానముల జెప్పిన కారణాదిసంవిధానము తటస్థపడినసమయమున నాయాగ్రహమునకు విహితమైనకాలమున మనుజులపై నావహించి పీడింపదొడంగును. అంతమాత్రముననే అట్టిగ్రహము లావహించినపుడు దేవాదిలక్షణములు కానవచ్చినపుడు దేవాదిగ్రహములని లోకమున జెప్పుటయే కాని వాస్తవ్యముగ దేవాదులు మనుజుల నావహించుట యసంభవము. ఈవిషయమును సుశ్రుతాచార్యులిట్లుపదేశించిరి:—"న తే మనుష్యైస్సహ సంవిశన్తి, న వా మనుష్యాన్ క్వచిదావిశన్తి, యే త్వావిశన్తీతి వదన్తి మోహాత్ తే భూతవిద్యావిషయాదపోహ్యాః. తేషాం గ్రహాణాం పరిచారకా యే కోటీసహస్రాయుతపద్మసంఖ్యాః, అసృగ్వసామాంసభుజః సుభీమాః నిశావిహారాశ్చ తమావిశన్తి."

## ఋషిగ్రహోన్మాదము.

మూ. గురువృద్ధసిద్ధర్షీణాం అభిశాపాఽభిచారాఽభిధ్యానాఽనురూప చేష్టాహారవ్యాహారం తైరున్మత్తం విద్యాత్. 21

వ్యా. గురువులు, వృద్ధులు, సిద్ధులు, ఋషులు వీరిని తిరస్కరించుటవలన వారు కోపించి శాపముబెట్టుటచేనైనను అభిచారతంత్రములచేనైనను ధ్యానించుటచేనైనను సంభవించినయున్మాదమునందు ఆయాశాపాదులు ఏయేరూపముగ నుండునో వానికనురూపములగు ఆహారంబును చేష్టలును కల్గియుండును. ఆయాహారచేష్టాదులబట్టి గురువృద్ధాదికృతశాపాదులచే సంభవించిన యున్మాదములని యెరుంగునది.

## పితృగ్రహోన్మాదము.

మూ. అప్రసన్నదృష్టిమపశ్యంతం నిద్రాళుం ప్రతిహతవాచం అనన్నాభిలాషం అరోచకాఽవిపాకపరీతం చ పితృభిరున్మత్తం విద్యాత్. 22

వ్యా. పితృగ్రహముచే నావహించినపురుషుడు కోపముతోకూడిన దృష్టి కల్గియుండును. బాగుగ చూడకుండును. ఎల్లప్పుడు నిద్రబోవుచుండును. తడబడి మాట్లాడును. అన్నమునం దిచ్ఛలేకుండును. అరోచకంబును కల్గియుండును. భుజింపబడిన యాహారము జీర్ణము కాకుండును. ఈలక్షణములబట్టి పితృగ్రహమావేశించుటచే గల్గిన

యున్మాదమని యెరుంగునది. (ఇచ్చట అన్నము నోటికి రుచిగల్గియున్నను తిన నిచ్చలే కుండుట అనన్నాభిలాషము (అన్నద్వేషము) అన్నము తినుట కిచ్చకల్గియున్నను నోటికి రుచితప్పి యింపుగాకుండుట ఆరోచకమునని యీరెంటికిని భేదము నెరుంగునది.)

## గంధర్వగ్రహోన్మాదలక్షణము.

మూ. (చణ్డం సాహసికం తీక్ష్ణం గమ్భీరమప్రధృష్యం) ముఖవాద్యనృత్య గీతాఽన్నపానస్నానమాల్యధూపగన్ధరతిం, రక్తవస్త్రబలికర్మహాస్య కథానుయోగప్రియం, శుభగన్ధం చ గన్ధర్వోన్మత్తం విద్యాత్.

వ్యా. హింసాస్వభావము, సాహసము, తీవ్రత, గంభీరస్వభావము, ఇతరులచే భయమునొందకుండుట, నోటివాద్యము గానము నృత్యము అన్నపానములు స్నానము పుష్పమాలికలు ధూపములు గంధము అనువానియందు మిక్కిలి ప్రీతికల్గియుండుట, రక్తవస్త్రముల ధరించుటయందును పూజావిధుల నాచరించుటయందును హాస్యము నందును కథలమాట్లాడుటయందును మిక్కిలి ప్రీతికల్గియుండుట, శరీరమున మంచిపరిమళము కల్గియుండుట ఈలక్షణము లున్నది గంధర్వగ్రహోన్మాదమని యెరుంగునది.

## యక్షగ్రహోన్మాదలక్షణము.

మూ. అసకృత్ స్వప్నరోదనహాస్యం (హాసినం) నృత్తగీతవాద్యకథాఽన్న పానమాల్యధూపగన్ధరతిం, రక్తవిప్లుతాక్షం, ద్విజాతివైద్యపరి వాదినం, రహస్యభాషిణం చ రక్షోన్మత్తం విద్యాత్. 24

వ్యా. రాక్షసగ్రహావేశముచే నున్మాదము కల్గినవాడు పలుమారు నిద్రబోవుచు ఏడ్చుచు నవ్వుచు నుండును. నృత్తము గీతము అన్నపానములు పుష్పమాలికలు ధూపము గంధము వీనియం దధికముగ నాసక్తికల్గియుండును. కన్నులెఱ్ఱనై కలకబారినట్లుండును. బ్రాహ్మణులతోడను వైద్యులతోడను కలహించును. రహస్యముగ మాట్లాడును. ఈలక్షణములబట్టి యక్షగ్రహోన్మాదమని యెరుంగునది.

## రాక్షసగ్రహోన్మాదలక్షణము.

మూ. నష్టనిద్రం, అన్నపానద్వేషిణం, అనాహారమప్యతిబలినం, శస్త్ర-శోణిత-మాంస - రక్తమాల్యాఽభిలాషిణం, సంతర్జకం చ రాక్షసోన్మత్తం విద్యాత్. 25

వ్యా. నిదురబట్టకుండుట, అన్నపానములయందు ద్వేషముకల్గుట, ఆహారములేకున్నను అధికమైన బలము కల్గియుండుట, ఆయుధములయందును మాంసమునందును ఎఱ్ఱని

పుష్పమాలికయందును అభిలాషకల్గియుండుట, ఇతరుల బెదరించుట ఈలక్షణములు కల్గినది రాక్షసగ్రహోన్మాదమని యెఱుంగునది.

## బ్రహ్మరాక్షసగ్రహోన్మాదలక్షణము.

మూ. ప్రహాస-నృత్యప్రధానం దేవవిప్రవైద్యద్వేషాఽవజ్ఞాభిః స్తుతివేదమన్త్రశాస్త్రోదాహరణైః కాష్ఠాదిభిః ఆత్మపీడనేన చ బ్రహ్మరాక్షసోన్మత్తం విద్యాత్. 26

వ్యా. బ్రహ్మరాక్షసగ్రహము ఆవేశించినమనుజుడు బిగ్గరగ (కారణము లేకయే) నవ్వును. నృత్యముచేయును. దేవతలయందును బ్రాహ్మణులయందును వైద్యులయందును ద్వేషబుద్ధి కలిగినవారిని (వాదోపవాదములచే) అవమానము చేయుచుండును. స్తోత్రపాఠములను వేదములను మహామంత్రములను వ్యాకరణాదిశాస్త్రములను పలుమారు నుదహరించి యుచ్చరించును. కఱ్ఱలు మొదలగువానిచే శరీరమును బాదుకొనును. ఉపవాసాదులచే నాత్మకు బాధకల్గించుకొనును. ఈలక్షణములబట్టి బ్రహ్మరాక్షసగ్రహముచే గల్గినయున్మాదమని యెఱుంగునది.

## పిశాచగ్రహోన్మాదలక్షణము.

మూ. అస్వస్థచిత్తం, స్థానమలభమానం, నృత్యగీతహాసినం, బద్ధాఽబద్ధప్రలాపినం, సఙ్కరకూటమలినరథ్యాచేల తృణాఽశ్మకాష్ఠాధిరోహణరతిం, భిన్నరూక్షస్వరం, (భిన్నరూక్షవర్ణస్వరం) నగ్నం, విధావన్తం, నైకత్రతిష్ఠన్తం, దుఃఖాన్యావేదయన్తం, నష్టస్మృతిం చ పిశాచోన్మత్తం విద్యాత్. 27

వ్యా. పిశాచగ్రహ మావేశించినవాడు చిత్తము స్వాధీనమున లేకుండును. తనకొకస్థానములేదని చెప్పును. నృత్యముచేయును, సంగీతముపాడును, కారణములేకయే నవ్వును. ఒకప్పుడు సంబంధముకలమాటలను మరియొకప్పుడు సంబంధములేనిమాటలను మాట్లాడును. ఒకప్పుడు అర్థములేనిమాటల వదరును. కుప్పదిబ్బలమీదను, మలినమైన మెట్టమీదను, త్రోవయందును, గుడ్డపేలికలమీదను, రాతిగుట్టమీదను, కొయ్యలగుట్టమీదను ఎక్కుటయం దిచ్ఛగల్గియుండును. పగిలిన కంచుగంటవలె రూక్షమైన (కఠినమైన) కంఠస్వరము కల్గియుండును. ఒకచోటనైన నిలుకడలేక నలుప్రక్కల దిరుగుచుండును. దుఃఖకరములగు విషయముల దెలుపుచుండును. గతించినవిషయములజ్ఞప్తి లేకుండును. ఈలక్షణములబట్టి పిశాచగ్రహోన్మాదమని యెఱుంగునది.

### దేవగ్రహావేశయోగ్యపురుష-కాలములు.

మూ. తత్ర చౌక్షాచారం (శౌచాచారం) తపస్స్వాధ్యాయకోవిదం, నరం ప్రాయః శుక్లప్రతిపది త్రయోదశ్యాం చచ్ఛిద్రమవేత్య అభిధర్షయన్తి దేవాః. 28

వ్యా. పైజెప్పఁబడిన దేవాదిగ్రహములలో దేవగ్రహములు పరిశుద్ధమైన యాచారంబును తపస్సంపన్నుండును వేదాధ్యయనమును చక్కఁగ నెరింగినవాఁడు నగు పురుషుని, శుక్లపాడ్యమినాడైనను త్రయోదశినాడైనను ప్రాయికముగ సమయము నెరింగి యావేశించును. (ఇచ్చట శౌచాచారాదిసంపన్నుడు భూతావేశమునకు పాత్రుడగుట యుక్తముగాకున్నను పూర్వజన్మకృతకర్మపరిపాకవశమునంజేసి పాత్రుడగునని యెరుంగునది. మరియు శౌచాచారాదులు భూతావేశమున కర్హపురుషలక్షణములనియు, శుక్లప్రతిపదాదికాలము భూతావేశకాలమనియు నెరుంగునది. ఇత్తెరంగుననే క్రింద వివరణములయందును పురుష-కాలముల నెరుంగునది. "చౌక్షాచారం" అనుచోట "చౌక్షః-శుచిః, ఆచారోయస్య-సచౌక్షాచారః" అని చక్రపాణివ్యాఖ్యాన మున్నది.) ఇచ్చట 'ప్రాయః' అనుటవలన ఇతరకాలమునందును ఆవహించవచ్చునని యర్థము. ఇత్తెరంగుననే తక్కినస్థలములయందు నూహించునది.

### ఋషిగ్రహావేశపురుష-కాలములు.

మూ. స్నానశుచివివిక్తసేవినం, ధర్మశాస్త్రశ్రుతివాక్యకుశలం ప్రాయః, షష్ఠ్యాం నవమ్యాం చ ఋషయః; (ధర్షయన్తి.) 89

వ్యా. స్నానమునందును పరిశుద్ధమందును ఏకాంతనివాసమునందును ఆసక్తికలిగి ధర్మశాస్త్రములను వేదములను చక్కఁగ నెరింగినవానిని షష్ఠినాడైనను నవమినాడైనను ఋషులు ప్రాయికముగ ఆవహించెదరు.

### పితృగ్రహావేశపురుష-కాలములు.

మూ. మాతృ-పితృ-గురు-వృద్ధ-సిద్ధ-ఆచార్యోపసేవినం, ప్రాయో దశమ్యామమావాస్యాయాం చ పితరః; (ధర్షయన్తి.) 30

వ్యా. తలిదండ్రులను, గురువులను, పెద్దలను, సిద్ధులను, మంత్రములను విద్యను ఉపదేశించిన యాచార్యులను, సేవజేయువారిని, ప్రాయికముగ దశమినాడైనను అమావాస్యనాడైనను పితృగ్రహము లావేశించును.

## గంధర్వగ్రహావేశపురుష-కాలములు.

మూ. గన్ధర్వాః స్తుతి-గీత-వాదిత్ర-రతిం, పరదారగన్ధమాల్యప్రియం, చౌక్షాచారం, ప్రాయో ద్వాదశ్యాం చతుర్దశ్యాం చ, (ధర్షయన్తి.) 31

వ్యా. స్తోత్రపాఠములయందును సంగీతమునందును వాద్యమునందును ఆసక్తికలవానిని పరస్త్రీలయందును గంధమాల్యములయందును ప్రీతికలవానిని సదాచారముకలవానిని ప్రాయికముగ ద్వాదశినాడైనను చతుర్దశినాడైనను గంధర్వగ్రహము లావహించును.

## యక్షగ్రహావేశపురుష-కాలములు.

మూ. సత్వ బల రూప గర్వ శౌర్యయుక్తం, మాల్యాఽనులేపనహాస్యప్రియం, అతివాక్ప్రవణం, ప్రాయశ్శుక్లైకాదశ్యాం సప్తమ్యాం చ యక్షాః; (ధర్షయన్తి.) 32

వ్యా. సత్వగుణము, శరీరబలము, సౌందర్యము, గర్వము, శౌర్యము, ఈగుణములు కల్గినవానిని, పుష్పమాలికలయందును గంధాద్యనులేపనములయందును పరిహాసమునందును ప్రీతికలవానిని, అధికముగ మాటలాడువానిని యక్షగ్రహములు ప్రాయికముగ శుక్లైకాదశినాడైనను సప్తమినాడైనను యక్షగ్రహము లావహించును.

## బ్రహ్మరాక్షసగ్రహావేశపురుష-కాలము.

మూ. స్వాధ్యాయతపోనియమోపవాస బ్రహ్మచర్యదేవయతిగురుపూజాఽరతిం, భ్రష్టశౌచం, బ్రాహ్మణమబ్రాహ్మణం వా బ్రహ్మవాదినం, శూరమానినం, దేవాగారసలిలక్రీడనరతిం ప్రాయః శుక్లపఞ్చమ్యాం పూర్ణచన్ద్రదర్శనే చ బ్రహ్మరాక్షసాః; (ధర్షయన్తి.)

వ్యా. వేదాధ్యయనము, తపశ్చరణము, నియమము, ఉపవాసవ్రతము, బ్రహ్మచర్యము, దేవ-యతి-గురు-పూజ వీనియందు మిక్కిలి యాసక్తికల్గియు శౌచాచారము లేకుండు బ్రాహ్మణుసైనను తత్వవిచారము చేయుఁనబ్రాహ్మణుసైనను, తాను శూరుడనియభిమానము కల్గినవానినైనను ప్రాయికముగ శుక్లపంచమినాడైనను, పూర్ణచంద్రునితోగూడిన పూర్ణిమనాడైనను బ్రహ్మరాక్షసగ్రహము లావేశించును. మరియు దేవాలయములయందును జలమునందును క్రీడింప నాసక్తికలవానిని కూడ బ్రహ్మరాక్షసగ్రహము లావేశింపజూచును.

## రాక్షస-పిశాచగ్రహముల యావేశకాలములు.

మూ. రక్షఃపిశాచాస్తు హీనసత్వం పిశునం(స్త్రైణం) (స్తేనం) లుబ్ధం శఠ
ప్రాయోద్వితీయాతృతీయాఽష్టమీషు; (ప్రాయః ఛ్ఛిద్రమవేక్ష్య
అభిధర్షయన్తి ద్వితీయాతృతీయాఽష్టమీషు).

వ్యా. సత్వగుణము లేకుండుట, కలహముల బెట్టుట, స్త్రీలోలుడగుట, (బంగ
దొంగలించుట), లుబ్ధత్వము, శఠత్వము, ఈగుణములు కలవానిని ద్వితీయ, తృతీయ
అష్టమి, ఈదినములయందు ప్రాయికముగ సమయముజూచి రాక్షసగ్రహంబులును పిశా
గ్రహంబులును ఆవేశించును. ("ఛ్ఛిద్రమవేక్ష్య" అనుచోట ఉచ్ఛిష్టాదిస్థలములయ
దుండుట మున్నగునపరిశుద్ధరూపములగు నపచారముల జూచి అట్టి అపకాశములయం
గ్రహము లావేశించునని యర్థము. ఈయర్థము పైవాక్యము లన్నిటియందును సమ
యించి యర్థముచేయునది.)

## అనుక్తగ్రహసంగ్రహము.

మూ. ఇత్యపరిసంఖ్యేయానాం గ్రహాణామావిష్కృతతమాః, హ్యష్ట
వేతే వ్యాఖ్యాతాః.

వ్యా. ఉన్మాదములకు కారణభూతములగు గ్రహములు లెక్కెడ నలవిగాక ల
మున గలవు; వానిలో ముఖ్యముగ స్ఫుటముగ గమనింపదగిన గ్రహముల నెనిమిదిమా
మిచ్చట భూతవిద్యాప్రస్తావమున వివరింపబడినవి.

## అసాధ్యభూతోన్మాదము.

మూ. సర్వేష్వపి తు ఖల్వేషు యో హస్తావుద్యమ్య రోషసంరమ్భా
నిశ్శఙ్కం అన్యేష్వాత్మని వా నిపాతయేత్, స హ్యసాధ్యో జ్ఞేయ
తథా యస్సాశ్రునేత్రః, మేఢ్రప్రవృత్తరక్తః, క్షతజిహ
ప్రస్రుతనాసికః, ఛిద్యమానచర్మా, అప్రతిహన్యమానపా(వా)
సతతం వికూజన్, దుర్వర్ణస్తృషార్తః పూతిగన్ధశ్చ హింసా
న్మత్తో జ్ఞేయః, తం పరిత్యజేత్.

వ్యా. పైజెప్పబడి భూతోన్మాదము లన్నిటియందును ఎవడు తనచేతుల రెం
పైకెత్తి కోపావేశముచేత భయ మించుకేనియు లేక యితరులపైనైనను పడవై చ
అట్టివానియున్మాదము సాధ్యము కానేరదు. మరియు కన్నుల నీరుగారుట, మేఢ్ర

నుండి రక్తముకారుట, నాలుక కొరికికొనుట, (లేక పుండగుట), ముక్కున ద్రవము స్రవించుట, ఒడలిపై చర్మమును తానే పగులదీసికొనుట, నోటి కడ్డులేక తనకిచ్చవచ్చినట్లు వదరుట, ఎల్లప్పుడును కూకలిడుట, శరీరవర్ణము చెడి మారుట, దప్పి యధికమగుట, శరీరముపై దుర్గంధముపుట్టుట, ఇట్టి లక్షణములుగల యున్మాదరోగి హింసింపగోరి యావహించినభూతముచే నాక్రమింపబడినవాడు కావున అట్టి యున్మాదము అసాధ్యము, వానికి చికిత్స జేయంజనదు.

ఇచ్చట నీవివరణము నెరుంగునది.—పైజెప్పినరీతిగ భూతములు మనుజుల నావహించి యున్మాదమును కల్గించుటకు ఆభూతములయుద్దేశములు మూడువిధములు. మనుజుని హింసింపజూచుట, సంభోగసుఖముల ననుభవించుట, పూజాబలి మున్నగు వానియం దభిలాష, ఈమూటిలో చంపునుద్దేశముతో నావహించినభూతముచే గల్గిన యున్మాదమునందు రోగిని ఆభూతము తప్పక చంపును. కావున నది యసాధ్యము. ఆయున్మాదమే యిచ్చట "హింసార్థ్యున్మత్తః" అని నిర్దేశింపబడినది. హింసాభిలాషచే నావహించినభూతమువలన సంభవించినయున్మాదరోగి యనియర్థము. అట్టి యున్మాదరోగమున పైజెప్పబడిన లక్షణములు కనబడును. ఇవియేకాక రోగినిచంపుటకు కావలసిన క్రూరకృత్యముల నన్నిటిని ఆభూతము నెరవేర్చి తుదకు రోగిని సమాప్తిచేయజూచును. దీనికి చికిత్స జేసియు లాభము లేదు.

తక్కిన రెండువిధములఫలమును కోరి యావహించిన భూతోన్మాదములయందు ఆభూతముల యుద్దేశము నెరింగి క్రీడానుభవమును, పూజాదిసత్క్రియల నాచరించినచో నాభూతములు తృప్తినంది తొలంగును. అప్పుడే యున్మాదము నివర్తించి మనుజుడు సుఖించును. కావున అవిరెండును సాధ్యములు.

ఈవిషయమంతయు నిదానస్థానమున "త్రివిధం తూన్మాదకరాణాం భూతానామున్మాదనే ప్రయోజనం. తద్యథా—హింసా, రతిః, అభ్యర్చనం చేతి, ......... తమసాధ్యం విద్యాత్, సాధ్యావితరౌ" (నిదాన-అ. ౭. సూ. ౧౭) అని వివరముగ జెప్పబడినది. ఆవిషయమే యీక్రిందను చెప్పబడును.

## రత్యర్చనాకామోన్మాదచికిత్స.

మూ॥ రత్యర్చనాకామోన్మాదినౌ తు భిషగభిప్రాయాచారాభ్యాం బుద్ధ్వా
తదఙ్గోపహారబలిమిశ్రేణ, మన్త్రభైషజ్యవిధినోపక్రమేత. ౬౭

వ్యా. సంభోగాదిక్రీడావిశేషములగోరుభూతము ఆవహించుటచే గల్గినయున్మాదము కలవాడు రతికామోన్మాది. బలిపూజాదిసత్కారములగోరుభూతము ఆవహించు

టచే గల్గినయున్మాదముకలవాడు అర్చనాకామోన్మాది. అట్టి యున్మాదములు కల వైద్యుడు ఆవహించియుండు భూతముయొక్క అభిప్రాయముచేతను ఆచారాదిచేష్టావిశేషములచేతను ఆభూతముయొక్క అభిలాష నెరింగి, ఆయభిలాషానుగుణముగ వర్తించుట చేతను పూజాదివిధుల నిర్వర్తించుటచేతను భూతముయొక్క అభిలషితమును నెరవేర్చి, పిమ్మట తత్తదనుకూలమగు ఔషధములచేతను మంత్రవిధులచేతను చికిత్స జేయ నుపక్రమించవలెను.

## ఉన్మాదచికిత్సాక్రమము.

మూ. తత్ర ద్వయోరపి నిజాగన్తునిమిత్తయోః ఉన్మాదయోః,
సమాసవిస్తరాభ్యాం భేషజవిధిమనువ్యాఖ్యాస్యామః. 38

వ్యా. అందు నిజాగంతు భేదములచే రెండుతెరంగులైన యున్మాదరోగములకు సంగ్రహముగను విస్తృతముగను చికిత్సావిధాన మీక్రింద వివరింపబడును.

## వాతోన్మాదచికిత్స, స్నేహపానము.

మూ. ఉన్మాదే వాతజే పూర్వం స్నేహపానం విశేషవిత్,
కుర్యాదావృతమార్గేతు సస్నేహం మృదుశోధనమ్. 39

వ్యా. వాతప్రకోపమునకల్గిన యున్మాదమునందు వాతవిశేషలక్షణముల నెరింగిన వైద్యుడు రోగికి తొలుత స్నేహపానము చేయించవలెను. వాతముయొక్క స్రోతోమార్గము అడ్డగింపబడియుండు నెడ స్నేహద్రవ్యముతోగూడిన మృదువైన ఔషధముచే శోధనము చేయించవలెను.

ఇచ్చట వాతము మేదఃకఫములచేత నావరింపబడకుండునపుడు స్నేహపాన ముచితము. అటుగాక వాతము ఆవృతమై యున్నపుడు స్నేహపానము చేసినచో శూలమును అంగసుప్తిని వాపును వృద్ధినొందును. కావున వైద్యుడు వాతముఆవృతమా? అనావృతమా? అని గమనించి ఆవృతము కాకుండునపుడు స్నేహపానమును, కఫమేధస్సులచే వాత మార్గము నిరోధింపబడినపుడు స్నేహయుక్తమైన మృదుశోధనమును చేయవలెనని పైశ్లోకమున రెండువిధములు చికిత్స నిర్దేశింపబడినది. ఈయర్థమును సూచించుటకే "విశేషవిత్" అని వైద్యవిశేషణము చెప్పబడినది. నిరుద్ధవాతమున స్నేహపాననిషేధము సిద్ధిస్థానమున నిట్లు చెప్పబడినది:—"మేదః కఫాభ్యామనిలో నిరుద్ధః శూలాఙ్గసుప్తిశ్వయథూన్ కరోతి, స్నేహం నియుఞ్జన్నబుధస్తు తస్తై సంవర్ధయత్యేవ హితాన్ వికారాన్" (సిద్ధి-అ. ౧.)

### కఫజ-పిత్తజోన్మాదములయందు చికిత్సాక్రమము.

మూ. కఫపిత్తోద్భవేఽప్యాదౌ వమనం సవిరేచనం,
స్నిగ్ధస్విన్నస్య కర్తవ్యం; శుద్ధే సంసర్జనక్రమః. 40
నిరూహం స్నేహవస్తిం చ శిరసశ్చ విరేచనం,
తతః కుర్యాద్యథాదోషం తేషాం భూయస్త్వమాచరేత్. 41

వ్యా. కఫముచేకల్గిన యున్మాదమున తొలుత స్నేహస్వేదవిధుల జేసి పిదప వమనంబును, పిత్తముచేగల్గిన యున్మాదమున స్నిగ్ధస్విన్నశరీరము కలవానికి తొలుత విరేచనంబును చేయించవలెను. శుద్ధకోష్ఠునకు పేయాదిసంసర్జనక్రమము ననుసరించి యాహారవిధి చేయనగును. పిమ్మట నిరూహవస్తిని స్నేహవస్తిని శిరోవిరేచనము దోషబలానుసారముగ చేయించవలెను. మరియు దోషము ప్రబలముగ నున్నచో నిరూహాదివస్తులను మాటిమాటికిని దోషములు శమించువరకును చేయనగును.

### సంశోధనఫలము.

మూ. హృదిన్ద్రియశిరఃకోష్ఠే సంశుద్ధే వమనాదిభిః,
మనఃప్రసాదమాప్నోతి స్మృతిం సంజ్ఞాం చ విన్దతి. 42

వ్యా. హృదయంబును చక్షురాదీంద్రియంబులును శిరస్సును కోష్ఠంబును పైజెప్పిన వమన-విరేచన-శిరోవిరేచన-నిరూహ అనువాసనములను పంచకర్మములచే శుద్ధమైనయెడ మనస్సును నిర్మలమగును. దానంజేసి జ్ఞాపకశక్తియు జ్ఞానంబును కల్గును. (ఇచ్చట సంశోధనముచే శరీరమునందలి మనస్సునకు స్థానమైన హృదయము శుద్ధమైనపుడు మనస్సును శుద్ధమగునని యెరుంగునది.)

### అపస్మారమున నంజనాదిప్రయోగము.

మూ. శుద్ధస్యాచారవిభ్రంశే తీక్ష్ణం నావనమఞ్జనం,
తాడనం చ మనోబుద్ధిదేహసంవేజనం (దేహసంతర్జనం) హితమ్.
యస్సక్తోఽవినయే పట్టైః సంయమ్య సుదృఢైస్సుఖైః,
అపేతలోహకాష్ఠాద్యే సంరోధ్యశ్చ తమోగృహే. 44

వ్యా. పైజెప్పిన శోధనచికిత్సచే నున్మాదను శమించక ఆచారమున భ్రంశముకల్గి యున్మాదమునువర్తించి యున్నయెడ తీక్ష్ణమైన నస్యంబును అంజనంబును ప్రయోగింపందగును. మరియు కొట్టుటయు, మనస్సునకును బుద్ధికిని శరీరమునకు ఉద్వేగము కల్గించుటయు, (బెదరించి భయపెట్టుటయు) హితకరము. అంతటను శమించక ఇతరులను కొట్టుట

మున్నగు క్రూరకృత్యముల జేయుచున్నయెడ వానిని గట్టిదైనను సుఖస్పర్శంబులును నగు చర్మపట్టములచేత కాళ్లను చేతులను గట్టిగ కట్టి ఇనుపకమ్ములు కట్టెలు మున్నగునవి లేని చీకటింటిలో నున్మాదరోగినిచేర్చి బైటరానీయక తలుపుమూసి యుంచవలెను.

## తర్జనాద్యుపాయములు.

మూ. తర్జనం త్రాసనం దానం హర్షణం సాన్త్వనం భయం,
విస్మయో విస్మృతేర్హేతోః నయన్తి ప్రకృతిం మనః. 45

వ్యా. బెదరించుట, ఉలికిపడునట్లుచేయుట, వాడు కోరినదానినిచ్చుట, సంతోషముకల్గించుట, వానిమనసు కాశ్చర్యముకల్గుపనులజేయుట, మంచిమాటలచెప్పి యనునయించుట, భయపెట్టుట, ఇవియన్నియు బుద్ధిభ్రంశమును తొలగించి మనస్సును స్వభావస్థితికి దెచ్చును.

## అపస్మారమున ప్రదేహాదులు.

మూ. ప్రదేహోత్సాదనాఽభ్యఙ్గధూమాః (పాః) పానం చ సర్పిషః,
ప్రయోక్తవ్యం మనోబుద్ధిస్మృతిసంజ్ఞా ప్రబోధనమ్. 46
సర్పిఃపానాదిరాగన్తోః మన్త్రాదిశ్చేష్యతే విధిః,
అతస్సిద్ధతమాన్ యోగాన్ శృణూన్మాదవినాశనాన్. 47

వ్యా. ప్రలేపములు, ఉద్వర్తనములు, అభ్యంగము, పొగవేయుట, (లేక పొగ పీల్చుట, ఘృతపానము, ఇవియన్నియు మనశ్శాంతిని బుద్ధిని జ్ఞాపకశక్తిని జ్ఞానమును కల్గించును. మరియు నాగన్తూన్మాదమున ఘృతపానాదివిధులును మంత్రతంత్రాదివిధానంబులును చేయనగును. ఇంతదనుక చికిత్సాక్రమము చెప్పబడినది. పిమ్మట ఉన్మాదహరములగు ఘృతాదిసిద్ధయోగములు ఈక్రింద వివరింపబడును.

## ఉన్మాదహరహింగ్వాదిఘృతము.

మూ. హిఙ్గుసౌవర్చలవ్యోషైః ద్విపలాంశైః ఘృతాఢకం,
చతుర్గుణే గవాం మూత్రే సిద్ధమున్మాదనాశనమ్. 48

వ్యా. ఇంగువ, సౌవర్చలలవణము, త్రికటుకములు (శుంఠి పిప్పలి మిరియాలు), వీనిని రెండేసిపలములుగ గూర్చి నూరి కల్కముచేసి కల్కమునకు నాల్గింతలు ఘృతమును ఘృతమునకు నాల్గింతలు గోమూత్రమును కలిపి ఘృతపాక విధిప్రకారము పక్వముచేసి యుపయోగించినయెడ నున్మాదమును హరించును.

## కల్యాణఘృతము.

మూ. విశాలా త్రిఫలా కౌన్తీ (కాన్తా) దేవదార్వేలవాలుకం,
స్థిరా నతం రజన్యౌ ద్వే సారిబే ద్వే ప్రియఙ్గుకా. 49
నీలోత్పలైలామఞ్జిష్ఠా దన్తీదాడిమకేసరం,
తాలీసపత్రం బృహతీ మాలత్యాః కుసుమం నవమ్. 50
విడఙ్గం పృశ్నిపర్ణీం చ కుష్ఠం చన్దనపద్మకౌ,
అష్టావింశతిభిఃకల్కైః ఏతైరక్షసమన్వితైః 51
చతుర్గుణే జలే సమ్యక్ ఘృతప్రస్థం విపాచయేత్,
అపస్మారే జ్వరే కాసే శోషే మన్దేఽనలే క్షయే. 52
వాతరక్తే ప్రతిశ్యాయే తృతీయకచతుర్థకే,
ఛర్ద్యర్శోమూత్రకృచ్ఛ్రేషు విసర్పోపహతేషు చ. 53
కణ్డూపాణ్డ్వామయోన్మాదవిషమేహగదేషు చ,
భూతోపహతచిత్తానాం గద్గదానామచేతసామ్. 54
శస్తం స్త్రీణాం చ వన్ధ్యానాం ధన్యమాయుర్బలప్రదం,
అలక్ష్మీపాపరక్షోఘ్నం సర్వగ్రహవినాశనమ్. 55
కల్యాణకమిదం సర్పిః శ్రేష్ఠం పుంసవనేషు చ.

(ఇతి కల్యాణకం ఘృతమ్.)

వ్యా. పెద్దపాపర, త్రిఫలము (కరక తాని ఉసిరికకాయలు), రేణుకలు, దేవదారు, కూతురుబుడమ (నాగుదోస), ముయ్యాకుపొన్న, పిన్నయేలకులు, పసుపు, మ్రానిపసుపు, సుగంధపాల, నల్లసుగంధపాల, ప్రేంకణము, నల్లకలువలు, పెద్దయేలకులు, మంజిష్ఠి, దంతివేళ్లు, దానిమ్మబెరడు, నాగకేసరములు, తాళిసపత్రి, వాకుడు, జాజిమొగ్గలు, వాయువిడంగములు, నక్కతోకపొన్న, చెంగల్వకోష్టు, చందనము, పద్మకము, ఈయిరువదెనిమిదిటిని ప్రత్యేక మొక్కొకకర్ష ప్రమాణము (కాలుపలము) వంతున చేర్చి కల్కముచేసి యాకల్కమును ఒకప్రస్థపరిమితమైన(పదునారుపలములు)ఘృతమున జేర్చి ఘృతమునకు నాల్గింతలు(నాల్గుప్రస్థములు) జలమును జేర్చి ఘృతపాకవిధిప్రకారము పక్వముచేయునది. ఇది కల్యాణఘృతమని చెప్పబడును.

దీనిని అపస్మారము, జ్వరము, కాసము, శోషము(నంజు), అగ్నిమాంద్యము, క్షయము, వాతరక్తము, పీనసము, తృతీయ-చతుర్థకవిషమజ్వరములు, వాంతి, అర్శో

రోగము, మూత్రకృచ్ఛ్రము, విసర్పము, దురద, పాండురోగము, ఉన్మాదము, విషములు, మేహరోగములు, అను నీవ్యాధులయం దుపయోగింపనగును. మరియు భూతావేశముచే చిత్తభ్రమముకలవారికిని, గద్గదమైన కంఠస్వరముకలవారికిని, శరీరముపై ప్రజ్ఞతప్పి మూర్ఛనొందినవారికిని, సంతతిలేక గొడ్డుబోతులుగ నుండుస్త్రీలకును, ఈఘృతము చాల ప్రశస్తముగ నుండును. మరియు నీఘృతము ఆయువును శరీరబలమును వృద్ధినొందించును. అలక్ష్మిని పాపము రక్షోగ్రహబాధను తొలగించును. పలుతెరంగులైన గ్రహముల నన్నింటిని నాశమొందించును. సంతానము కల్గనివారికి పురుషసంతతిని కల్గించుట కిది మిగుల శ్రేష్ఠమైనది.

(ఇచ్చట త్రిఫలములు మూడును. ఒక్కొక్కటి కర్షప్రమాణముగ గ్రహింపనగును. కరక, తాని, ఉసిరిక ఈమూటికిని చేర్చి త్రిఫలములు అని సంజ్ఞ యేర్పడినది. ఈవిషయమును సుశ్రుతమునందు "హరీతక్యామలకవిభీతకాని త్రిఫలా" (సు. సూ. అ. 38.) అని త్రిఫలములన హరీతకీ, ఆమలకము, విభీతకము ఈమూటికిని సంజ్ఞయని పరిభాషాసూత్రమును చెప్పియున్నారు. మరియు నీతంత్రకారుడును "జరణాన్తేఽభయామేకాం ప్రాగ్భక్తే ద్వే విభీతకే, భుక్త్వా తు మధుసర్పిర్భ్యాం చత్వార్యామలకాని చ. ప్రయోజయేత్ సమామేకాం త్రిఫలాయా రసాయనమ్" (చి. అ. ౧) అనువాక్యముచేత కరక-తాని-ఉసిరికల మూటికి త్రిఫలమను సంజ్ఞను కంఠతః చెప్పియున్నారు. కావున నెచ్చటనైనను త్రిఫలశబ్దముచేత ఈమూటిసముదాయమే గ్రహింపబడును. ఇత్తెరంగుననే దశమూలశబ్దముచేతను, పఞ్చమూలశబ్దముచేతను ఆయాసాంకేతికమైన ద్రవ్యసముదాయమే గ్రహింపబడును.

పైజెప్పినరీతిగ సాంకేతికమైన త్రిఫలాదిశబ్దములను నిర్దేశించిన యోగములయందు పరిమాణమును అట్టి సాంకేతికద్రవ్యములలో ప్రత్యేకముగ నిర్ణయింపదగునా? లేక వేరువేరుద్రవ్యములకు నిర్ణయింపదగునా?యన్నచో భాగనిర్ణయ మిట్లెరుంగునది:— ఏస్థలమునందు ద్రవ్యమును ప్రధానముగజేసి నిర్ణయింపబడునో అచ్చట భాగము ఒక్కొక్క ద్రవ్యమునకును వేరువేరుగను గ్రహింపదగును. అట్లుగాక ప్రమాణమును ప్రధానముగజేసి నిర్దేశించినస్థలములయందు త్రిఫలాదిశబ్దములచేత ద్రవ్యసముదాయమునకే పరిమాణమును గ్రహింపవలయును. ఎట్లనగా:— గుల్మచికిత్సితమున "నీలినీం త్రిఫలాం రాస్నాం......... పలికాని జలాఢకే" (చి. అ. ౫. శ్లో. ౧౦౬) అనుచోట నీలిన్యాదిద్రవ్యములు ప్రధానముగ నిర్దేశింపబడినవి. కావున త్రిఫలపదముచే బోధింపబడిన మూడుద్రవ్యములును తక్కినీలినిరాస్నాదులవోలె వేరువేరుగ నొక్కొక్కపలమును గ్రహింపవలయును.

మరియు “త్రిఫలాయాః త్రయోభాగాః త్రయః త్రికటుకస్య చ” (చి. అ. ౧౬.) “త్ర్యూషణా త్రిఫలాకల్కబిల్వమాత్రం” ఇవి మున్నగుస్థలములయందు భాగములు ప్రధానముగ నిర్దేశింపబడినవిగాని ద్రవ్యములు ప్రధానముగ నిర్దేశింపబడలేదు. కావున అచ్చట త్రిఫలాసముదాయముచేరి మూడుభాగములనియు త్రికటుకసముదాయము చేరి మూడుభాగములనియు అర్థము చేయవలయును. “త్రిఫలాయాః” యని షష్ఠీనిర్దేశముచేత “రాజ్ఞః పురుషః” ఇత్యాదిస్థలములవలె ద్రవ్యవాచకమైన త్రిఫలాశబ్దము అప్రధానము కావున ఇచ్చట సముదాయమునకు భాగనిర్ణయ మేర్పడును. ఇత్తెరంగున నే దశమూల, పఞ్చమూలాది సాంకేతికశబ్దములను ప్రయోగించినస్థలములయందును ప్రాధాన్యమునుబట్టి భాగనిర్ణయము అచ్చటచ్చట చేయందగును.)

## మహాకల్యాణఘృతము.

మూ. ఏభ్య ఏవ స్థిరాదీని జలే పక్త్వైకవింశతిమ్. 56
రసే తస్మిన్పచేత్ సర్పిః గృష్టిక్షీరే చతుర్గుణే,
వీరాద్విమాషకాకోలీ స్వయంగుప్తర్షభర్ధిభిః. 57
మేదయా చ సమైః కల్కైః తత్స్యాత్కల్యాణకం మహత్,
బృంహణీయవిశేషేణ సన్నిపాతహరం పరమ్. 58

(ఇతి మహాకల్యాణకం ఘృతమ్.)

వ్యా. పైజెప్పబడిన కల్యాణయోగమునందు “స్థిరాసతం” అనునది మొదలు “చన్దనపద్మకా” అనునంతవరకు చెప్పబడిన ద్రవ్యముల నిరువదియొక్కటి మాత్రము చేర్చి కషాయమును సిద్ధముచేసి వడగట్టి యీకషాయము నాల్గుపాళ్లును, తొలియీత యీనిన ఆవుయొక్కపాలు నాలుగుపాళ్లును ఘృతము నొక్కపాలును చేర్చి అందు క్షీరకాకోలి, మినుము, అడవిమినుము, కాకోలి, దూలగొండి, ఋషభకము, ఋద్ధి, మేద వీనినన్నిటిని సమభాగములుగ జేర్చి కల్కముచేసి ఘృతమున కలిపి ఘృతపాకవిధి ననుసరించి పక్వముచేయునది. ఇది మహాకల్యాణఘృత మనబడును. ఈఘృతము పైజెప్పిన గుణములు గల్గుటయేకాక విశేషముగ శరీరపుష్టిని కల్గించును. సన్నిపాతముల నన్నిటిని హరించును.

కల్పనావిధి:—పైయోగమునచెప్పబడిన ఇరువదియొనిమిదికల్కద్రవ్యములలో తొలుత నేడుద్రవ్యములను వదలి “స్థిరాసతం” అని చెప్పబడిన ముయ్యాకుపొన్న మొదలగు నిరువదియొకద్రవ్యములను చేర్చి పదునారుప్రస్థముల నీళ్లుపోసి నాల్గవపాలు

(4 నాల్గు ప్రస్థములు) మిగులునట్లు కషాయముగా చి వడగట్టి యుంచుకొనునది. క్షీరకాకోలి మున్నగు ద్రవ్యము లెనిమిదియుచేరి నాల్గుపలము లుండునట్లు ఒక్కొక్కదానిని రెండేసి కర్ష ములవంతు చేర్చి కల్కముచేసినచో ప్రస్థపరిమితమైన ఘృతమునకు నాల్గవవంతు కల్కమగును. ఈకల్కమును పైజెప్పినకషాయమును, (కషాయమునకు సమభాగమైన) ఆవుపాలను వీనినన్నిటి నొకటిగజేర్చి ఘృతపాకవిధి ప్రకారము పక్వముచేయవలయును. ఇట్లు కల్పించినచో ఘృతమునకు నాల్గవపాలు కల్కంబును, నాలుగింతలు కషాయంబును, కషాయమునకు సమభాగము క్షీరంబును ఏర్పడును. మఱియు నిచ్చట కషాయమునకు భాగనిర్ణయము చెప్పకున్నను క్షీరసాహచర్యముచే క్షీరమునువోలె ఘృతమునకు చతుర్గుణ మని తెలియునది.

## మహాపైశాచికఘృతము.

మూ. జటిలాం పూతనాం కేశీం చారటీం మర్కటీం వచాం,
త్రాయమాణాం జయాం వీరాం చోరకం కటురోహిణీమ్. 59
కాయస్థాం సూకరీం ఛత్రామతిఛత్రాం పలఙ్కషాం,
మహాపురుషదన్తాం చ వయఃస్థాం నాకులీద్వయమ్. 60
కటమ్భరాం వృశ్చికాలీం స్థిరాం చాహృత్య తైర్ఘృతం,
సిద్ధం చాతుర్థకోన్మాదగ్రహాపస్మారనాశనమ్. 61
మహాపైశాచికం నామ ఘృతమేతద్యథాఽమృతం,
బుద్ధిస్మృతికరం చైవ బాలానాం చాఙ్గవర్ధనమ్. 62
(ఇతి మహాపైశాచికం ఘృతమ్.)

వ్యా. జటామాంసి, కరక్కాయలు, గంధమాంసి, మునుగుదామర, దూలగొండి, వస, కలుక్రానుగ, చిరుసెల్లి, క్షీరకాకోలి, కచోరములు, కటుకరోహిణి, తిప్పతీగ, నేలతాడిగడ్డలు, దనియాలు, సదాపవిత్తులు, గుగ్గిలము, పిల్లిపీచర, ఉసిరికకాయలు లేక (పిన్నయేలకులు), సన్నరాష్ట్రము, దుంపరాష్ట్రము, గొంతెమగోరు, తెలుమణిచెట్టు, ముయ్యాకుపొన్న, వీనినన్నిటిని సమభాగములుగ జేర్చి కల్కముచేసి కల్కమునకు నాల్గు భాగములు ఘృతమును, ఘృతమునకు నాల్గింతలు జలమును జేర్చి పక్వముజేయునది. ఇది మహాపైశాచికఘృత మనబడును. అమృతమునుబోలి యుత్తమమైనది. దీనిని సేవించి నచో చాతుర్థికజ్వరములును, ఉన్మాదములును, గ్రహములును, అపస్మారములును నశించును. బుద్ధియు, జ్ఞాపకశక్తియు కల్గును. పసిబాలులకు శరీరమును పెంచును.

### లశునాదిఘృతము.

మూ. లశునానాం శతం త్రింశదభయా త్ర్యూషణాత్పలం,
గవాం చర్మమసీప్రస్థో ద్వ్యాఢకం క్షీరమూత్రయోః. 63
పురాణసర్పిషః ప్రస్థః ఏభిస్సిద్ధం ప్రయోజయేత్,
హిఙ్గుచూర్ణపలం శీతే దత్వా చ మధుమానికామ్. 64
తద్దోషాగన్తుసంభూతానున్మాదాన్విషమజ్వరాన్,
అపస్మారాంశ్చ హన్త్యాశు పానాభ్యఞ్జననావనైః. 65
(ఇతి లశునాద్యం ఘృతమ్.)

వ్యా. వెల్లుల్లిగడ్డలు (100) నూరు, కరక్కాయలు (30) ముప్పది, త్రికటుకములు (శుంఠి, పిప్పలి, మిరియాలు), చేరి ఒకపలము, ఆవులచర్మముయొక్కమసియొక ప్రస్థము, క్షీరము, మూత్రమును చేరి రెండాఢకములు, ప్రాతనెయ్యి యొకప్రస్థము, వీనినన్నిటిని చేర్చి ఘృతపాకవిధిగ పక్వముచేసి అందు ఇంగువచూర్ణమును ఒకపలమును చేర్చి చల్లారినపిదప ఒక్కమానిక (యెనిమిదిపలములు) తేనెను కలిపి యుంచునది. ఇది లశునాద్యఘృతమని చెప్పబడును. దీనిని సేవించినచో త్రిదోషములచేతను, ఆగంతుక కారణములచేతను కల్గినయున్మాదములును, విషమజ్వరములును, అపస్మారములును, శీఘ్రముగ హరించును. ఈఘృతమును పానమునకును, అభ్యంగనమునకును, నస్యమునకు నుపయోగించునది. ఇచ్చట "త్ర్యూషణాత్పలం" అనుచో త్ర్యూషణద్రవ్యములు అప్రధానములుగ నిర్దేశింపబడినవిగాన త్రికటుకసముదాయము చేరి ఒకపలమని యర్థము చేయనగును.

### ద్వితీయలశునాదిఘృతము.

మూ. లశునస్యావినష్టస్య తులార్ధం నిస్తుషీకృతం,
తదర్ధం దశమూలస్య ద్వ్యాఢకేఽపాం విపాచయేత్. 66
పాదశేషే ఘృతప్రస్థం లశునస్య రసం తథా,
కోలమూలకవృక్షామ్లమాతులుఙ్గార్ద్రకై రసైః. 67
దాడిమాంబుసురామస్తుకాఞ్జికాఙ్మ్లైస్తదర్ధికైః,
సాధయేత్త్రిఫలాదారులవణవ్యోషదీప్యకైః. 63
యమానీచవ్యహిఙ్గ్వమ్లవేతసైశ్చ పలార్ధికైః,
సిద్ధమేతత్పిబేత్, శూలగుల్మార్శోజఠరాపహమ్. 69

బ్రధ్నపాణ్డ్వామయప్లీహయోనిదోషజ్వరక్రిమీన్,
వాతశ్లేష్మామయాన్సర్వానున్మాదాంశ్చాపకర్షతి. 70
(ఇత్యపరం లశునాద్యం ఘృతమ్.)

వ్యా. చెడక రసవంతముగనుండు వెల్లుల్లిపాయలను పొట్టొలిచి యేబదిపలములును దశమూలములసముదాయము ఇరువదియైదుపలములును, రెండు ఆఢకముల (128 పలముల) నీళ్లలో వేసి నాల్గవపాలు (32 పలములు) మిగులునట్లు కషాయము కాచి వడకట్టి యుంచునది. ఒకప్రస్థము (16 పలములు) ఘృతమును చేర్చి, అందు వెల్లుల్లిపాయలరసము, రేగుపండ్లరసము, ముల్లంగిరసము, చింతపండురసము, మాదీఫలరసము, అల్లపురసము, దానిమ్మపండ్లరసము, సురామద్యముయొక్క పైతేట, పులిగంజి వీనిని ఒక్కొక్కదానిని కషాయమునకు అర్ధభాగముగ (ఒకొక్కప్రస్థము) వంతున పైజెప్పిన ఘృతమున జేర్చి; అందు త్రిఫలములు, దేవదారుచెక్క, సైంధవలవణము, త్రికటుకములు, ఓమము, కురాసానియోమము, చవ్యము, ఇంగువ, అమ్లవేతసము వీనిని ప్రత్యేకము అర్ధపలమువంతు కల్కముచేసి చేర్చి ఘృతపాకవిధిప్రకారము పక్వముచేయునది. ఇదియును లశునాదిఘృత మనబడును. దీనిని అగ్నిబలానుసారముగ సేవించినయెడ శూలము, గుల్మము, అర్శోరోగము, ఉదరరోగము (మహోదరము), బ్రధ్నము (అండవృద్ధి), పాండురోగము, ప్లీహవృద్ధి, యోనిదోషము, జ్వరములు, క్రిమిరోగములు, వాతశ్లేష్మరోగములు, ఉన్మాదము వీనినన్నిటిని హరించును.

### కొన్ని ఘృతయోగములు.

మూ. హిఙ్గునా హిఙ్గుపర్ణ్యా చ, సకాయస్థవయఃస్థయా,
సిద్ధం సర్పిర్హితం, తద్వద్వయఃస్థాహిఙ్గురోచకైః. 71
కేవలం సిద్ధమేభిర్వా పురాణం పాయయేద్ఘృతం,
పాయయిత్వోత్తమాం మాత్రాం శ్వభ్రే,రున్ధ్యాద్గృహేఽపి వా.

వ్యా. ఇంగువను, ఇంగువచెట్టుయొక్క ఆకులను చేర్చియైనను; సన్నయేలకులను, సరస్వతియాకును చేర్చియైనను; సన్నయేలకులను, ఇంగువను, సౌవర్చలలవణమును చేర్చియైనను పక్వముచేయబడిన ఘృతమును పానముచేసినచో నున్మాదములు హరించును. మరియు పైజెప్పినరీతిగ ద్రవ్యములను చేర్చి కాచబడిన ప్రాతనేతియైనను, లేక కేవలము ప్రాతనేతినిమాత్రమునైనను ఉత్తమమాత్రగ త్రాగించి (త్రాగి) గోతియందైనను చీకటియింటియందైనను ఉన్మాదరోగి నుంచవలెను.

### పురాణఘృతగుణము.

మూ. విశేషతః పురాణం చ ఘృతం తం పాయయేద్భిషక్,
త్రిదోషఘ్నం పవిత్రత్వాత్ విశేషాద్గ్రహనాశనమ్. 72

వ్యా. మరియు నున్మాదరోగికి మిక్కిలి ప్రాతదియగుఘృతమును పలుమారు త్రాగించవలెను. అయ్యది మిక్కిలి పరిశుద్ధమగుటంజేసి వాతాదిత్రిదోషములను హరించును. విశేషముగ గ్రహముల పారందోలును.

### దశవర్ష-శతవర్షస్థితపురాణఘృతములు, వానిగుణములు.

మూ. గుణకర్మాధికం పానాత్ ఆస్వాదాత్ కటుతిక్తకం,
ఉగ్రగన్ధం పురాణం స్యాత్ దశవర్షస్థితం ఘృతమ్. 73
లాక్షారసనిభం శీతం తద్ధి సర్వగ్రహాఽపహం,
మేధ్యం విరేచనేష్వగ్ర్యం ప్రపురాణమతః పరమ్. 74
నాఽసాధ్యం నామ తస్యాస్తి యత్స్యాద్వర్షశతస్థితం,
దృష్టం స్పృష్టమథాఘ్రాతం తద్ధి సర్వగ్రహాపహమ్. 75
అపస్మారగ్రహోన్మాదవతాం శస్తం విశేషతః,

వ్యా. పదిసంవత్సరములకాలము ప్రాతబడినఘృతము ఆస్వాదించినచో కటుతిక్తములుకల్గి తీవ్రమైన వాసనకల్గియుండును. దీనిని త్రాగినయెడ మిక్కిలి గుణవత్తరమై చక్కగ పనిచేయును. దీనిని చూచుటకు లక్కద్రవమునుబోలె రంగుకల్గి శీతవీర్యము కల్గి సర్వగ్రహముల పారందోలుప్రభావముతో కూడియుండును. ఇదియే పురాణ ఘృతము.

అంతకుపై నూరుసంవత్సరములకాలము గడచినఘృతము ప్రపురాణఘృతమనబడును. ఇది మేధను (బుద్ధిని) దృఢపరచును. విరేచనద్రవ్యములలో నుత్తమము. ఈ ఘృతమునకు సాధింపరాని దెద్దియు నుండదు. దీనిని చూచినను తాకినను మూర్కొనినను సర్వగ్రహముల పారందోలును. కావున నిది అపస్మారము, గ్రహములు, ఉన్మాదము మున్నగు మానసికరోగములు కలవారికి చాల ప్రశస్తముగ నుండును.

### ఉన్మాదమున కంజనాదివిధులు.

మూ. ఏతానౌషధయోగాన్వా విధేయత్వమగచ్ఛతి. 76
అఞ్జనోత్సాదనాలేపనావనాదిషు యోజయేత్,

వ్యా. పైజెప్పబడిన చికిత్సలచే నున్మాదము లొంగక నివర్తించకుండునెడ నీక్రింద చెప్పబడు నౌషధయోగములను అంజనమునకును, ఉద్వర్తనమునకును, ఆలేపనమునకును, నస్యము మున్నగువానిని చేయుట కుపయోగింపనగును.

ఉన్మాదమున శిరీషాదినస్య-అంజనములు.

మూ. శిరీషో మధుకం హిఙ్గు లశునం తగరం వచా. 77
కుష్ఠం చ బస్తమూత్రేణ పిష్టం స్యాన్నావనాఞ్జనం,

వ్యా. దిరిసెనపువిత్తు, అతిమధురము, ఉల్లిపాయలు, గ్రంథితగరము,వస, చెంగల్వ కోష్టు, వీనిని మేకపంచితమునుబోసి నూరి యున్మాదరోగికి నస్యమును అంజనమును చేయవలెను.

ఉన్మాదమున నస్యాంజనములకు వ్యోషాదియోగము.

మూ. తద్వద్వ్యోషం హరిద్రే ద్వే మఞ్జిష్ఠాహిఙ్గుసర్షపాః. 78
శిరీషబీజం చోన్మాదగ్రహాఽపస్మారనాశనమ్,

వ్యా. త్రికటుకములు, పసుపు, మ్రానిపసుపు, మంజిష్ఠి, ఇంగువ, తెల్లావాలు, దిరిసెనపువిత్తు, వీనినన్నిటిని చేర్చి పైజెప్పినవిధముగ మేకపంచితమున నూరి కణికలుచేసి నస్య-అంజనములు చేసినయెడ నున్మాదంబును,గ్రహంబులును,అపస్మారంబును నివర్తించును.

అపామార్గాదిఅంజనము.

మూ. పిష్ట్వా తుల్యమపామార్గం హిఙ్గ్వాలం హిఙ్గుపత్రికామ్. 79
వర్తిస్స్యాత్ మరిచార్ధాంశా పిత్తాభ్యాం గోసృగాలయోః,
తయాఽఞ్జయేదపస్మారభూతోన్మాదజ్వరార్దితాన్. 80
భూతార్తానమరార్తాంశ్చ నరాంశ్చైవ దృగామయే,

వ్యా. ఉత్తరేణి, ఇంగువ, హరిదళము, హింగుపత్రి, వీనిని సమభాగములుగను గ్రహించి, వీనిసముదాయమున కర్ధభాగము మిరియాలును జేర్చి గోవుయొక్కయు నక్కయొక్కయు పిత్తద్రవముల జేర్చి నూరి వర్తి(కణిక)చేసి నీడ నెండించి కండ్లకు కలికమువేసినయెడ అపస్మారము భూతోన్మాదములు జ్వరములును నశించును. మరియు భూతావేశముకలవారును దేవగ్రహపీడితులు కంటిరోగములయందును పైజెప్పిన యంజనము నుపయోగించునది.

అంజనమునకు మరీచయోగము.

మూ. మరిచం చాతపే మాసం సపిత్తం స్థితమఞ్జనమ్. 81

వైకృతం పశ్యతః కార్యం దోషభూతహతస్మృతేః,

వ్యా. మిరియాలను గోపిత్తద్రవమున నానబెట్టి యొకమాసము ఎండలో (సూర్యపుటమున) బెట్టి కండ్ల కలికము బెట్టినయెడ వాతాదిదోషప్రకోపముచేనైనను భూతావేశముచేనైనను స్మృతితప్పి యొడలెఱుంగక యుండుట నివర్తించును. వికృతముగ వెఱ్ఱి చూపు చూచువారి కిది చాల మంచిది.

## అపస్మారాదులయందు పానాదులకు సిద్ధార్థకాదియోగము.

మూ. సిద్ధార్థకో వచా హిఙ్గు కరఞ్జో దేవదారు చ. 82
మఞ్జిష్ఠా త్రిఫలా శ్వేతా కటభీత్వక్ కటుత్రికం,
సమాంశాని ప్రియఙ్గుశ్చ శిరీషో రజనీద్వయమ్. 83
బస్తమూత్రేణ పిష్టోఽయ మగదః పానమఞ్జనం,
నస్యమాలేపనం చైవ స్నానముద్వర్తనం తథా. 84
అపస్మారవిషోన్మాదకృత్యాఽలక్ష్మీజ్వరాపహః,
భూతేభ్యశ్చ భయం హన్తి రాజద్వారే చ శస్యతే. 85
సర్పిరేతేన సిద్ధం వా సగోమూత్రం తదర్థకృత్,

వ్యా. తెల్లావాలు, వస, ఇంగువ, కానుగవిత్తులు, దేవదారుచెక్క, మంజిష్ఠి, త్రిఫలములు, తెల్లదింటెన, జ్యోతిష్మతి (మెరపుతీగె-నల్లకంగుని) పట్ట, త్రికటుకములు, ప్రేంకణము, కానుగగింజలు, పసుపు, మ్రానిపసుపు, వీనినన్నిటిని సమభాగములుగ గూర్చి మేకపంచితమున నూరియుంచునది. ఇయ్యది విషహారమగు నౌషధము. ఈయౌషధమును పానమునకును, అంజనమునకును, నస్యమునకును, ఆలేపనమునకును, స్నానోదకమున జేర్చుటకును, ఉద్వర్తన (నలుగుపెట్టుట) మునకును, ఉపయోగించినయెడ, అపస్మారము, విషము, ఉన్మాదము, అభిచారికప్రయోగములు, అలక్ష్మి, జ్వరము, భూతావేశము, వీని నన్నిటిని హరించును. దీనిని అంజనముగ నుపయోగించి రాజస్థానమునకు బోయినచో రాజు తనకు వశ్యుడై యుండి కార్యములన్నియు జయించకలడు.

మరియు పైజెప్పినద్రవ్యములను కల్కముగజేర్చి ఘృతమునకు నాల్గింతలు గోమూత్రమును కలిపి పానాంజనాదుల కుపయోగించినను పైజెప్పిన యపస్మారాదుల హరించును.

## వాత-కఫజోన్మాదమున ధూమపానవిధి.

మూ. ప్రసేకే పీనసే గన్ధైః ధూమవర్తిం కృతాం పిబేత్. 86

వై రేచనికధూమో క్తైః శ్వేతాద్యై ర్వా సహింగుభిః,
శల్లకోలూకమార్జారజమ్బూకవృకబ స్తజైః. 87
మూత్రపి త్తశకృల్లోమనఖైః చర్మభిరేవ చ,
సేకాఞ్జనం ప్రధమనం నస్యం ధూమం చ కారయేత్. 88
వాతశ్లేష్మాత్మ కే ప్రాయః;

వ్యా. ఉన్మాదరోగమునందు నోట జొల్లుకారుచున్నను, పీనసమునందును, సూత్ర స్థానమున "గన్ధాశ్చాగరుపత్రాద్యాః" అని యుపక్రమించి చెప్పబడిన అగరు మున్నగు గంధద్రవ్యములచేనైనను, "శ్వేతాజ్యోతిష్మతీచైవ......ధూమశ్శీర్ష విరేచనః" (సూ. అ. 5. శ్లో. 25) అని చెప్పబడినది. తెల్లదింటెన, మాల్కంగుని, మున్నగు శిరోవిరేచన ద్రవ్యములచేనైనను; ఇంగువనుకూడ చేర్చి విధ్యుక్తప్రకారము ధూమవర్తిని సిద్ధముచేసి పొగపీల్చవలయును. మరియు ముండ్లపంది, గుడ్లగూబ, పిల్లి, నక్క, తోడేలు, గొఱ్ఱె, ఈజంతువులయొక్క మూత్రము, పిత్తము, పురీషము (పేడ),రోమములు, గోళ్లు, చర్మము వీనిలో యథాసంభవముగ గ్రహించి సేకమునకును, అంజనమునకును, ధమననస్యమునకును పొగవేయుటకును నుపయోగింపనగును. ఈధూమపానయోగమును ప్రాయికముగ వాత శ్లేష్మములచే గల్గినయున్మాదముల కుపయోగించునది.

### పైత్తికోన్మాదమున తిక్తకాదిఘృతము.

మూ. పైత్తికే తు ప్రశస్యతే. 89
తిక్తకం జీవనీయం చ సర్పిః స్నేహాశ్చ మిశ్రకః,
శీతాని చాన్నపానాని మధురాణి మృదూని చ (లఘూని చ).90

వ్యా. పిత్తోన్మాదమునందు మహాతిక్తఘృతమునైనను, వాతరక్తచికిత్సితమున చెప్ప బడిన జీవనీయఘృతమునైనను, గుల్మచికిత్సితమున చెప్పిన మిశ్రకస్నేహమునైనను, పానాదుల కుపయోగించునది. మరియు గుణవీర్యస్పర్శములచే శీతములగు మధురములైన యన్నపానములను, మృదువుగనుండు తేలికగ జీర్ణములగు నన్నపానాదుల నుపయో గింపదగును.

### ఉన్మాదమున సిరావ్యధనవిధి.

మూ. శఙ్ఖకేశాన్తసంధౌ వా మోక్షయేత్ జ్ఞో భిషక్సిరాం,
ఉన్మాదే విషమే చైవ జ్వరేఽపస్మార ఏవ చ. 91

వ్యా. కణతలకును, తలవెంట్రుకలకును, సంధియందుండు సిరలు వ్యధనముచేసి రక్తమును విధ్యుక్తప్రకారము వెడలింపవలయును. ఈసిరావ్యధనమును ఉన్మాదము నందును, విషమజ్వరమునందును, అపస్మారమునందును చేయందగును. (ఇచ్చట సుశ్రుతమున చెప్పబడినవిధిప్రకారము సిరావ్యధనము చేయదగును.)

### ఉన్మాదనివృత్త్యుపాయము.

మూ. ఘృతమాంసవితృప్తం వా నివాతే స్థాపయేత్సుఖం,
త్యక్త్వా మతిస్మృతిభ్రంశం సంజ్ఞాం లబ్ధ్వా ప్రముచ్య(బుధ్య)తే.

వ్యా. మరియు నున్మాదరోగికి ఘృతముతోకూడిన మాంసమును తృప్తిగబెట్టి గాలి లేకుండ నొకగదిలో సుఖముగ నుంచవలయును. అట్లు చేసినచో బుద్ధిభ్రంశమును, చిత్తభ్రమము, ఘూర్తిగ వదలి మంచిజ్ఞానముకలిగి యున్మాదముచే విడువబడును.

ఇచ్చట "నివృత్తవిషమద్యో యః.........సత్త్వవాన్ న స యుజ్యతే" అను శ్లోకముచేత నున్మాదరోగికి మాంసభక్షణమును నిషేధించి యున్నది. అట్లు "ఘృతమాంస వితృప్తం" అని మాంసభక్షణము విధించుట యెట్లు సంగతమగును? అన్నచో ఉన్మాద రోగమునందు అవస్థాభేదమునుబట్టి యొకసమయమున మాంసభక్షణ మాగికమగునని ఇచ్చట విధింపబడినది. భయహర్షాదులు ఉన్మాదమునకు హేతువులుగనున్నను చికిత్సా ప్రస్తావమున "సాన్త్వనం హర్షణం భయం" అని భయాదులును అవస్థాభేదములచే పైజెప్పినన్యాయము ననుసరించి యున్మాదనివర్తకములగును కావున ఇచ్చట మాంసభక్షణ విధి విరుద్ధముకాదని యెఱుంగునది.

### ఉన్మాదనివర్తనోపాయములు.

మూ. ఆశ్వాసయేత్సుహృద్వా తం వాక్యైః ధర్మార్థసంహితైః,
బ్రూయాదిష్టవినాశం వా దర్శయేదద్భుతాని వా. 93
బద్ధం సర్షపతైలాక్తం న్యసేద్వోత్తానమాతపే,
కపికచ్ఛ్వాథ వా తప్తైః లోహతైలజలైః స్పృశేత్. 94
కశాభిస్తాడయిత్వా వా సుబద్ధం విజనే గృహే,
రుద్ధ్వాచ్ఛేతో హి విభ్రాన్తం ప్రజత్యస్య తథా శమమ్. 95

వ్యా. మిక్కిలి స్నేహితుడైన యాప్తుడు ధర్మార్థములతోకూడిన ప్రియవాక్యములచే నున్మాదరోగిని యూరడించవలెను. లేక వానికి చాల ప్రియమైనజనులైనను, వస్తువులైనను, పోయినవని వానికి చెప్పవలయును. మనస్సున కాశ్చర్యమును కల్గించువిషయ

ములనైన జూపవలయును. లేక ఆపనూనెను వానిశరీరమునకెల్ల పూసి కాలు
కదలకుండ గట్టిగ కట్టి కటికియెండలో వెలికిల పరుండబెట్టవలయును. లేక దురద
యాకును శరీరముపై పూయవలయును. లేక ఇనపఖడ్డీలనైనను, తైలమునైనను,
నైనను, మిక్కిలి వేడియగునట్లు నిప్పునకాచి వానిశరీరముపై తాకించవలయును.
లేనిచోయింటియందు గుంజకు విరగకట్టి కొరడాలతో కొట్టవలయును. ఇట్టి యు
ములుజేసినయెడ నున్మాదరోగికి చెదరిపోయినమనస్సు మరల శాంతినొంది యథ
నుండును.

## ఉన్మాదరోగికి మనశ్శాంతికై భయోపాయములు.

మూ. సర్పేణోద్ధృతదంష్ట్రేణ, దన్తైః సింహైర్గజైశ్చ తం,
త్రాసయేచ్ఛస్త్రహస్తైర్వా తస్కరైః శత్రుభిస్తథా.
అథ వా రాజపురుషా బహిర్నీత్వా సుసంయతం,
త్రాసయేయుర్వధేనైనం తర్జయన్తో నృపాజ్ఞయా
దేహదుఃఖభయేభ్యో హి పరం ప్రాణభయం స్మృతం,
తేన యాతి శమం తస్య సర్వతో విప్లుతం మనః.

వ్యా. మఱియు పాములను వానికోరల నూడబెరికి చూపియైనను; సింహవ
ఏనుగలను, చూపియైనను; కత్తి మున్నగునాయుధముల చూపియైనను; దొంగలను
వుల చూపియైనను; ఇదిగో నిన్ను చంపెదము అని యున్మాదరోగిని భయపెట్టవల
లేక యున్మాదరోగిని నిర్జనప్రదేశమునకు తీసికొనిపోయి గట్టిగ కట్టి రాజభటులు మ
గారియాజ్ఞచొప్పున నిన్ను చంపెద మని భయపెట్టవలయును. ఇట్టి యుపాయ
యున్మాదరోగము శమించును.

లోకమున శరీరమునకు బాధకలిగించుపనులకంటె ప్రాణముల కపాయ
కల్గించుభయము మిక్కిలి గొప్పదిగావున అట్టి ప్రాణాపాయకరములగు నుపాయ
భయపెట్టినయెడ మనస్సు చంచలమై నిరంకుశముగ వ్యాపించుచున్నది మరల
తమై శాంతినొందును. కావున పైజెప్పినరీతిగ ప్రాణభయమును చూపవలయునని భ

## ఇష్టద్రవ్యనాశాదిజనితోన్మాదచికిత్స.

మూ. ఇష్టద్రవ్యవినాశాత్తు మనో యస్యోపహన్యతే,
తస్య తత్సదృశప్రాప్తిసాన్త్వాశ్వాసైః శమం నయేత్.
కామశోకభయక్రోధహర్షేర్ష్యాలోభసంభవాన్,
పరస్పరప్రతిద్వన్ద్వైరేభిరేవ శమం నయేత్.

వ్యా. తనకిష్టమైనవస్తువు నశించుటచే కల్గినయున్మాదమునందు వాస్తవముగ నాద్రవ్యమును మరల సంపాదింప తరముగాకున్నను దానికి సమానమైన వేరొండు దానిని వానికిచ్చి ఓర్పుచెప్పి సముదాయించినచో నయ్యది శమించును. మరియు, కామము, శోకము, భయము, క్రోధము, సంతోషము, ఈర్ష్య (ఓర్వలేనితనము),లోభము, అను నీ కారణములచేకల్గిన యున్మాదమును ఈకారణములలో నాయాదానికి విరుద్ధమైన వేరొండు కారణముచేతనే శమింపజేయనగును. (కామముచే కల్గినయున్మాదమును శోకమును కల్గించియు, భయముచే కల్గినయున్మాదమున క్రోధమును చూపియు ఇత్తెరంగున పరస్పరవిరుద్ధములైన మనోవ్యాపారముల గల్గించి మనశ్శాంతిని పొందింపవలయునని భావము. మరియు నున్మాదములు వాత-పిత్త-కఫ-సన్నిపాత-ఆగంతురూపములగు కారణములచే నైదువిధములని చెప్పబడినది. ఇచ్చట కామశోకాదికారణములచే మరికొన్ని యున్మాదముల జూపి చికిత్స విధింపబడుట యెట్లులన:—ఉన్మాదసామాన్యమున "భయహర్ష పూర్వో మనోభిఘాతః" అని భయాదులచే మనోభిఘాతము గల్గుట యున్మాదకారణమని చెప్పబడినది కావున అట్టి భయశోకాదులచే జనించు నున్మాదములకూడ సంగ్రహసూత్రమున నిర్దేశింపబడినవి. మఱియు అట్టి భయశోకాదులు వాతప్రకోపములకు కారణములగుటంజేసి వానిచే గల్గు నున్మాదములన్నియు వాతోన్మాదముననే యంతర్భూతములగును. కావున ఐదున్మాదములను నియమమునకు భంగములేదని యెఱుంగునది.)

### ఉన్మాదచికిత్సాయుక్తి.

మూ. బుద్ధ్వా దేశం వయః సాత్మ్యం దోషం కాలం బలాబలే,
చికిత్సితమిదం కుర్యాదున్మాదే భూతదోషజే. 101

వ్యా. దేవాదిగ్రహములచేతను, వాతాదిదోషములచేతను సంభవించినయున్మాదములయందు జాంగలాదిదేశభేదమును, బాల్యాదివయోభేదమును, సాత్మ్యమును, శీతోష్ణకాలభేదమును, రోగియొక్క బలాబలమును వీనినన్నిటని చక్కగ గమనించి పైజెప్పిన చికిత్సలలో తత్తదుచితమైన చికిత్సను చేయందగును.

### దేవాదిగ్రహోన్మాదమున చికిత్సావిధానము.

మూ. దేవర్షిపితృగన్ధర్వైః ఉన్మత్తస్య తు బుద్ధిమాన్,
వర్జయేదంజనాదీని తీక్ష్ణాని క్రూరకర్మ చ. 102
సర్పిష్పానాది తస్యేహ మృదుభైషజ్యమాచరేత్,
పూజాం బల్యుపహారాంశ్చ మన్త్రాఞ్జనవిధీం స్తథా. 103

శాన్తికర్మేష్టిహోమాంశ్చ జపస్వస్త్యయనాని చ,
వేదోక్తాన్ నియమాంశ్చాపి ప్రాయశ్చిత్తాని చాచరేత్. 104
భూతానామధిపం దేవమీశ్వరం జగతః ప్రభుం,
పూజయన్ ప్రయతో నిత్యం జయత్యున్మాదజం భయమ్. 105

వ్యా. మరియు దేవతలు, ఋషులు, పితృదేవతలు, గంధర్వులు, అను నీగ్రహ భేదములచే గల్గినయున్మాదములయందు బుద్ధిమంతుఁడగు వైద్యుడు తీక్ష్ణమైన అంజనములు మున్నగువానిని తాడనము మొదలగు క్రూరమయినపనులను చేయంజనదు. అట్టి గ్రహములయందు ఘృతపానము మున్నగు మృదువైనయౌషధములును; పూజ, బల్యుపహారములు; మంత్రతంత్రవిధి, మృదువైన అంజనములు, శాంతికర్మలు, ఇష్టిహోమాదులు, జపతపంబులు, స్వస్తివాచనంబులు, వేదవిహితములగు నియమంబులు, ప్రాయశ్చిత్తంబులు మున్నగువానిని నాచరింపదగును.

మరియు సకలభూతముల కధిపతియు ప్రపంచములకెల్ల (శుభమునొసగూర్చి కాపాడువాడును అగుపరమేశ్వరుని నిశ్చలచిత్తముతో పూజించినయెడ వానియున్మాదముచే నొకప్పుడు భయము కలుగనేరదు.

## భూతోన్మాదపహారదేవపూజాదివిధి.

ము. రుద్రస్య ప్రమథా నామ గణా లోకే చరన్తి యే,
తేషాం పూజాం చ కుర్వాణ ఉన్మాదేభ్యః ప్రముచ్యతే. 106
బలిభిర్మంగలైర్హోమైరోషధ్యగదధారణైః,
సత్యాచారతపోజ్ఞానప్రదాననియమవ్రతైః. 107
దేవగోబ్రాహ్మణానాఞ్చ గురూణాం పూజనేన చ,
ఆగంతుః ప్రశమం యాతి సిద్ధైర్మన్త్రౌషధైస్తథా. 103

వ్యా. మరియు రుద్రసంబంధమైన ప్రమథగణములు, లోకమున సంచరించుచుందురు. అట్టి గణదేవతలను పూజించినయెడ నున్మాదమును నివర్తించును. మరియు బలులు, మంగళకరమైనకృత్యములు, హోమములు వీనిచేయుట, ఓషధులను, గ్రహముల నివర్తింపజేయు ఔషధములను ధరించుట, సత్యము, ఆచారము, తపస్సు, పారమార్థిక జ్ఞానము, దానము, నియమవ్రతములు, వీని నాచరించుట, దేవతలు, గోవులు, బ్రాహ్మణులు, గురువులు, వీరిని పూజించుట వీనిచేతనుకూడ ఆగంతూన్మాదము శమించును.

మరియు సిద్ధౌషధములచేతను, మంత్రములచేతనుగూడ నివర్తించును. (ఇచ్చట 'శాన్తికర్మేష్టిహోమాంశ్చ" అని యుపక్రమించి చెప్పబడినది దైవవ్యపాశ్రయరూపమయిన చికిత్సయని యెరుంగునది.)

ఉన్మాదము అనుక్తచికిత్సాతిదేశము.

మూ. యచ్చోపదేక్ష్యతే కిఞ్చిదపస్మారచికిత్సితే,
ఉన్మాదే తచ్చ కర్తవ్యం సామాన్యాద్ధేతుదూష్యయోః. 109

వ్యా. ఉన్మాదములకు హేతువులు, మనోభిఘాతము మున్నగునవి. దూష్యము హృదయము అపస్మారమునందును హేతుదూష్యము లివియే యగును. కావున అపస్మారము నుద్దేశించి క్రిందచెప్పబడుచికిత్సయు నున్మాదమునందును చేయదగియుండును.

ఉన్మాదము జనింపకుండు నుపాయము.

మూ. నివృత్తామిషమద్యో యో హితాశీ ప్రయతః శుచిః,
నిజాగన్తుభిరున్మాదైః సత్త్వవాన్ న స యుజ్యతే. 110

వ్యా. మద్యమాంసముల వదలి పథ్యములేసి యాహారముల జేయుచు ఇంద్రియముల నిగ్రహించి పరిశుద్ధఆచారములు గల్గి మనస్సును సత్త్వప్రధానముగ నుంచుకొనియుండువానిని నిజాగంతూన్మాదములు నొకప్పుడును చెంద నేరవు.

విగతోన్మాదలక్షణము.

మూ. ప్రసాదశ్చేన్ద్రియార్థానాం బుద్ధ్యాత్మమనసాం తథా,
ధాతూనాం ప్రకృతిస్థత్త్వం విగతోన్మాదలక్షణమ్. 111

వ్యా. ఇంద్రియార్థములైన శబ్ద-స్పర్శ-రూప-రస-గంధములును, బుద్ధి-ఆత్మ-మనస్సులును, నిర్మలముగనుండి (వికృతిజెందకయుండి) రసాదిధాతువులును, వాతాదిదోషములును, సమస్థితినున్నయెడ యున్మాదముచే విడువబడినవాడని యెరుంగునది.

అధ్యాయవిషయసంగ్రహము.

తత్రశ్లోకః.—

మూ. ఉన్మాదానాం సముత్థానం లక్షణం సచికిత్సితం,
నిజాగన్తునిమిత్తానాముక్తవాన్ భిషగుత్తమః. 112

వ్యా. నిజాగంతుభేదములచే రెండుతెరంగులైన యున్మాదములయొక్క వేరువేరు

కారణములును,వానిలక్షణములును, చికిత్సలును, వైద్యశ్రేష్ఠుడైన అగ్నివేశుండు ఉన్మాద చికిత్సితమను నీయధ్యాయమునందు విపులముగ జెప్పెను.

ఇత్యగ్నివేశకృతే తన్త్రే చరకప్రతిసంస్కృతే, చికిత్సాస్థానే
ఉన్మాదచికిత్సితం నామ నవమోఽధ్యాయః.

ఇత్తెరంగున అగ్నివేశకృతంబును, చరకప్రతిసంస్కృతంబును నగు చరకసంహిత యను నాయుర్వేదతంత్రమునందలి చికిత్సాస్థానమున ఉన్మాదచికిత్సితమనునది నవమాధ్యాయము సమాప్తము.

---

## దశమాధ్యాయము

అవతరణిక:—రోగములయొద్యోత్పత్తిక్రమమున "భయోత్త్రాసశోకైః ఉన్మాదానాం, వివిధాశుచిసంస్పర్శాత్ అపస్మారాణామ్" (ని. అ. ౮) అని యున్మాదమును చెప్పినపిదప అపస్మారము చెప్పబడినది.

మరియు నున్మాదమునుబోలె నపస్మారంబును మానసికరోగము. కావున నీరెండు సంబంధములచే నున్మాదానంతరము అపస్మారచికిత్సితము చెప్పబడును.

మూ. అథాఽతోఽపస్మారచికిత్సితం వ్యాఖ్యాస్యామః. 1

ఇతి హ స్మాహ భగవానాత్రేయః. 2

వ్యా. ఉన్మాదచికిత్సితమును జెప్పినపిదప నపస్మారచికిత్సితము భగవత్స్వరూపుడగు నాత్రేయు డుపదేశించినదానికన్న న్యూనాతిరేకము లేకుండునట్లు వివరింపబడును.

### అపస్మారసంజ్ఞావ్యుత్పత్తి.

మూ. స్మృతేరపగమం ప్రాహురపస్మారం భిషగ్విదః,
తమః ప్రవేశం బీభత్సచేష్టం ధీసత్వసంప్లవమ్. 3

వ్యా. బుద్ధియు సత్వగుణంబును నశించుటవలన తమోగుణం బధికమై చీకటిలో నున్నవానివలె నేమియు నెరుంగక నోట నురుగువెడలుట, అవయవవిక్షేపము మున్నగు బీభత్సచేష్టలతో గూడి శరీరముపై స్మృతిలేకుండు నవస్థావిశేషము అపస్మార మనబడును. (అంగవిక్షేపాదిబీభత్సచేష్టలతోగూడి శరీరముపై స్మృతితప్పి యొడలెరుంగకుండుట అపస్మారస్వరూపమని భావము. స్మృతియొక్క అపాయము అపస్మారము అని యన్వర్థసంజ్ఞ.) వాగ్భటాచార్యులును "స్మృత్యపాయో హ్యపస్మారః" అని యీయర్థమునేచెప్పిరి.

సుశ్రుతాచార్యు లిట్లు-అన్వర్థతను చెప్పెను:—"స్మృతిర్భూతార్థవిజ్ఞానమపస్తత్పరివర్జనే, అపస్మార ఇతి ప్రోక్తః తతోఽయం వ్యాధిరన్తకృత్." కడచినవిషయముల దలంచు మనశ్శక్తిని పోగొట్టునది యపస్మారమని ఫలితార్థము.

అపస్మారము సంభవించుపురుషులు.

మూ. విభ్రాన్తబహుదోషాణాం అహితాఽశుచిభోజినామ్ (జనాత్),
రజస్తమోభ్యాం విహతే సత్త్వే దోషావృతే హృది. 4
చిన్తాకామభయక్రోధశోకోద్వేగాదిభిస్తథా,
మనస్యభిహతే నృణాం అపస్మారః ప్రవర్తతే. 5

వ్యా. ఉన్మాదమున వ్యాపించు అనేకదోషములు కల్గినవారును అపథ్యంబులును అపరిశుద్ధంబులును నగు నాహారముల భుజించువారును నగుమనుజులకు, రజస్తమోగుణములచేత సత్త్వగుణము అభిహతమై, వాతాదిదోషములచే హృదయము వ్యాపింపబడి, చింత, కామము, భయము, క్రోధము, శోకము, ఉద్వేగము మున్నగువానిచే మనస్సు అభిఘాతము నొందియున్నపుడు పైవివరింపబడిన యపస్మారము సంభవించును.

అపస్మారసంప్రాప్తి.

మూ. ధమనీభిః శ్రితా దోషాః హృదయం పీడయన్తి హి,
సమ్పీడ్యమానో వ్యథతే మూఢో భ్రాన్తేన చేతసా. 6
పశ్యత్యసన్తి రూపాణి పతతి ప్రస్ఫురత్యపి,
జిహ్వాక్షిభ్రూః స్రవల్లాలః హస్తౌ పాదౌ చ విక్షిపన్. 7
దోషవేగే చ విహతే సుప్తవత్ ప్రతిబుధ్యతే,

వ్యా. హృదయస్థానమునందలి సంజ్ఞావహములగు ధమనులతోఁగూడి వాతాదిదోషములు హృదయమును బాధించును. దానంజేసి మనుజుడు చాల బాధనొంది చంచలమైన మనస్సుకలవాడై యేమియు నెరుంగక లేనివికృతరూపముల జూచుచు కాళ్లుచేతుల విదిర్చుచు క్రిందపడును. ఆసమయమున నోటనుండి జొల్లుకార్చుచు నాలుకను కన్నులను కనుబొమలను వికృతముగ గదలించుచు హస్తపాదములను పలువిధరంగుల గదలించుచు నుండును. దోషములవేగము శమించినపుడు నిదుర మేల్కాంచి లేచినవానివలె తెలివివచ్చి తటాలున లేచును.

ఇచ్చట వాతాదిదోషముల ప్రకోపకారణము లున్మాదమునకు జెప్పినవియే యగును. కావున వేరువేరుగ జెప్పలేదు. ఈవిషయము తొమ్మిదవయధ్యాయాంతమున

"యచ్చోపదేక్ష్యతే కిఞ్చిత్......సామాన్యాద్ధేతు దూష్యయోః." అనువాక్యముచే తంత్రకారులు సూచించిరి.

వాగ్భటాచార్యులు:—"ఉన్మాదవత్ ప్రకుపితైః చిత్తదేహగతైః మలైః" అని ముక్తకంఠముగ నుడివిరి. మరియు నున్మాదమునకన్న విశేషములగుహేతువులు "అహితాశుచిభోజనాత్" అని రెండుకారణములు పైని నిర్దేశింపబడినవి.

చతుర్విధాపస్మారభేదములు, అందు వాతికాపస్మారలక్షణము.

మూ॥ పృథగ్దోషైస్సమస్తైశ్చ వక్ష్యతే స చతుర్విధః. 8
కమ్పతే ప్రదశేద్దన్తాన్ ఫేనోద్వామీ శ్వసిత్యపి,
పరుషారుణకృష్ణాని పశ్యేద్రూపాణి చానిలాత్. 9

వ్యా॥ వాత-పిత్త - కఫములచే వేరువేరుగను, మూడిటి(సన్నిపాతము)సముదాయముచేతను జనించుటంజేసి యపస్మారము నాల్గుతెరంగులగును. అందు వాతాపస్మారమున శరీరము వణకును. పెటపెట పండ్లుగొరకును. నోట నురుగు వాంతి యగును. శ్వాసము తీవ్రముగ వెడలును. అగపడువస్తువులన్నియు పరుషంబులుగను, అరుణవర్ణంబులుగను, కృష్ణవర్ణంబులుగను కనబడును. (స్మృతితప్పి మైమరచునప్పుడు పైజెప్పినలక్షణములు కల్గి తటాలున క్రిందపడునని యర్థము.)

పైత్తికాపస్మారలక్షణము.

మూ. పీతఫేనాఙ్గవక్త్రాక్షః పీతాసృగ్రూపదర్శనః,
సతృష్ణోష్ణా (ష్మా) నలవ్యాప్తలోకదర్శీ చ పైత్తికః. 10

వ్యా॥ పిత్తాపస్మారమున స్మృతితప్పుసమయమున నోట పచ్చనినురుగు వెడలును. శరీరంబును ముఖంబును కన్నులును పచ్చగ నుండును. కంటికగపడునవియన్నియు రక్తవర్ణముకలిసిన పసుపురంగు కల్గియున్న ట్లగపడును. దప్పియు శరీరము ఆవిరివెడలునట్లు నుండును. లోకమెల్ల నిప్పుచే నాకర్షింపబడిన ట్లగపడును. (ఈలక్షణములబట్టి పిత్తాపస్మారమని యెరుంగునది.)

శ్లైష్మికాపస్మారలక్షణము.

మూ. శుక్లఫేనాఽఙ్గవక్త్రాక్షః శీతో హృష్టాఙ్గజో గురుః,
పశ్యేత్ శుక్లాని రూపాణి శ్లైష్మికో ముచ్యతే చిరాత్. 11

వ్యా॥ కఫాపస్మారమున నోట తెల్లనినురుగు వెడలును, శరీరంబును ముఖంబును కన్నులును తెల్లనై, శరీరము చల్లబడి గగుర్పాటుతోగూడి బరువై వస్తువులనన్నిటిని

తెల్లనివిగ చూచుచు, స్మృతితప్పును. ఇది శ్లేష్మమున గల్గినయపస్మారము. ఈయపస్మారమున చాలకాలము శరీరము తెలియక పడియుండును. (ఇచ్చట "శ్లైష్మికో ముచ్యతే చిరాత్" అని విశేషవిధిగ నిర్దేశించుటవలన వాత-పిత్తాపస్మారములయందు శీఘ్రముగ నొడలెరుంగునని తెలిసెడి).

సాన్నిపాతికాపస్మారము, అపస్మారసాధ్యాఽసాధ్యవిభాగము.

మూ. సర్వైర్వేతైస్సమస్తైస్తు లిఙ్గైః జ్ఞేయస్త్రిదోషజః,
అపస్మారస్సచాఽసాధ్యః యః క్షీణస్యాఽనవశ్చ యః. 12

వ్యా. వాతాదులకు వేరువేరుగ పైజెప్పబడినలక్షణములన్నియు కల్గినది త్రిదోష (సన్నిపాత) ప్రకోపమున గల్గినయపస్మారమని యెరుంగునది. ఇయ్యది యసాధ్యము. మరియు ధాతువులు క్షీణించినవానికి సంభవించినదియు, చాలకాలమునుండి యనువర్తించి బాధించునదియు పైజెప్పిన నాల్గుభేదములలో నేయపస్మారమైనను అవియన్నియు నసాధ్యములగును.

అపస్మారము సంభవించుకాలనియమము.

మూ. పక్షాద్వా ద్వాదశాహాద్వా మాసాద్వా కుపితా మలాః,
అపస్మారాయ కుర్వన్తి వేగం కిఞ్చిదథాన్తరమ్. 13

వ్యా. ఆయాకారణములచే ప్రకోపమునొందినదోషములు పదునైదుదినముల కొకతూరియైనను, పండ్రెండుదినముల కొకతూరియైనను ఒకనెల కొకతూరియైనను వానివానివేగమును జూపి యపస్మారమును కల్గించును. ఒకవేళ పైజెప్పినకాలమునకు కొంచెము వెనుకముందుకూడ వేగమును జూపి యపస్మారమును కల్గించుటయును కలదు.

ఇచ్చట నీవిషయము నెరుంగునది:—వాతాదిదోషములు వానివాని ప్రకోపమునకు జెప్పియున్నకారణములచే ప్రకోపమునొందినను అప్పుడే వానివేగమునుజూపక, (భూమియందు విత్తనము లణగియున్నను వర్షముకురిసినను అంకురోత్పత్తికి నియతమైన శరత్ ఋతుకాలమును ప్రతీక్షించి నియతకాలముననే మొలకలెత్తుభంగి) యణగియుండి నియమితమగు పక్ష-ద్వాదశాహ-మాసకాలమువరకును ప్రతీక్షించియుండి ఆకాలమున వేగమును జూపి యపస్మారమును కల్గించును. అట్టికాలనియమము వ్యాధిప్రభావమునంజేసి కల్గినది. మరియు నొకపక్షమునకు పిత్తంబును, పండ్రెండుదినములకు వాతంబును, నెలదినములకు కఫంబును వేగమును జూపునని కొందరు తంత్రకారులు కాలనియమము చెప్పిరి. పైజెప్పినవిషయము తంత్రాంతరమున నీట్లున్నది:—"దేవే వర్షత్యపి యథా

భూమౌ బీజాని కానిచిత్, శరది ప్రతిరోహన్తి తథావ్యాధిసముచ్ఛ్రియాః." ఈతంత్రకారులును విషమజ్వరప్రస్తావమున నిట్లు చెప్పిరి:—"అధిశేతే యథా భూమిం బీజం కాలే చ రోహతి, అధిశేతే తథా ధాతుం దోషః కాలే చ కుప్యతి." (చి. అ. 3. శ్లోక. ౬౮).

## అపస్మారచికిత్సాక్రమము, సామాన్యచికిత్స.

మూ. తైరావృతానాం హృత్స్రోతో మనసాం సంప్రబోధనం,
తీక్ష్ణైరాదౌ భిషక్ కుర్యాత్కర్మభిర్వమనాదిభిః. 14

వ్యా. అపస్మారరోగమునందు ప్రకుపితమైన దోషములచే నావరింపబడిన హృదయముయొక్కయు, మనస్సుయొక్కయు, స్రోతస్సులను (మనస్సు వ్యాపించుమార్గములు) దోషసంబంధములేక వానివ్యాపారములయందు చక్కగ ప్రవర్తింపజేయుటకై తీక్ష్ణములైన వమనవిరేచనాదులశోధనములచే తొలుత చికిత్స చేయవలెను.

## వాతికాద్యపస్మారములకు సంశోధనము.

మూ. వాతికం వస్తిభూయిష్ఠైః పైత్తం ప్రాయో విరేచనైః,
శ్లైష్మికం వమనప్రాయైరపస్మారముపాచరేత్. 15

వ్యా. అందు వాతికాపస్మారమును వస్తిని ప్రధానముగా పలుచికిత్సలచేతను; పైత్తికాపస్మారమును విరేచనప్రధానమైనచికిత్సలచేతను, శ్లైష్మికాపస్మారమును వమనప్రధానచికిత్సలచేతను, తొలుత నుపచరించవలెను.

## అపస్మారమునకు సంశమనయోగములు.

మూ. సర్వతః సువిశుద్ధస్య సమ్యగాశ్వాసితస్య చ,
అపస్మారవిమోక్షార్థం యోగాన్సంశమనాఞ్ఛృణు. 16

వ్యా. పైజెప్పినరీతిగ ఆమాదోషము ననుసరించి చేయబడిన సంశోధనములచే పూర్తిగ శుద్ధమయినకోష్ఠముగల అపస్మారరోగికి సేదదీరినపిదప అట్టి యపస్మారము నివర్తించుటకై సంశమనయోగములు నీక్రింద జెప్పబడును.

## పఞ్చగవ్యఘృతము.

మూ. గోశకృద్రసదధ్యమ్లక్షీరమూత్రైః సమైర్ఘృతం,
సిద్ధం పిబేదపస్మారకామలాజ్వరనాశనమ్. 17

(ఇతి పఞ్చగవ్యం ఘృతమ్.)

వ్యా. ఆవు పేడయొక్క స్వరసము, ఆవు పెరుగు, (పులిసినది) ఆవుపాలు, ఆవు పంచితము, ఆవు నెయ్యి, ఈయైదింటిని సమభాగములుగ గూర్చి ఘృతపాకవిధిప్రకారము పక్వముచేసినయెడ నియ్యది పంచగవ్యఘృత మనబడును. దీనిని సేవించినయెడ అపస్మారము, కామల, జ్వరము, ఇవి నశించును.

## మహాపఞ్చగవ్యఘృతము.

మూ. ద్వే పఞ్చమూలే త్రిఫలా రజన్యౌ కుటజత్వచం,
స_ప్తపర్ణ మపామార్గం నీలినీం కటురోహిణీమ్. 18
శమ్యాకం ఫల్గుమూలఞ్చ పౌష్కరం సదురాలభం,
ద్విపలాని జలద్రోణే పక్త్వా పాదావశేషితే. 19
భార్గీం పాఠాం త్రికటుకం త్రివృతం నిచులాని చ,
శ్రేయసీ మాఢకీం మూర్వాం ద_న్తీం భూనిమ్బచిత్రకౌ. 20
ద్వే శారిబే రోహిషఞ్చ భూతీకం మదయ_న్తికాం,
క్షిపేత్పిష్ట్వాఽక్షమాత్రాణి తేన ప్రస్థం ఘృతాత్పచేత్. 21
గోశకృద్రసదధ్యమ్లక్షీరమూత్రైశ్చ తత్సమైః,
పఞ్చగవ్యమితి ఖ్యాతం మహ_త్తదమృతోపమమ్. 22
అపస్మారే తథోన్మాదే శ్వయథావుదరేషు చ,
గుల్మార్శఃపాణ్డురోగేషు కామలాయాంహలీమకే. 23
శస్యతే ఘృతమేతత్తు ప్రయో_క్తవ్యం దినేదినే,
అలక్ష్మీగ్రహారోగఘ్నం చాతుర్థకవినాశనమ్. 24
(ఇతి మహాపఞ్చగవ్యం ఘృతమ్.)

వ్యా. హ్రస్వపంచమూలములు, మహాపంచమూలములు, త్రిఫలములు, పసుపు, మ్రానిపసుపు, కొడిశపాలపట్ట, యేడాకులపొన్న, ఉత్తరేణి, నీలివేరు, కటుకరోహిణి, రేలగుజ్జు, బ్రహ్మమేడివేళ్లు, పుష్కరమూలము, దూలగొండి, వీనిని ప్రత్యేకము రెండేసి పలములవంతున చేర్చి ఒకద్రోణపరిమితమైన జలమునగూర్చి నాల్గవపాలు (అధకము) మిగులునట్లు కషాయము కాచి వడగట్టి యుంచునది. పిమ్మట భారంగి, చిరుబొద్ది, త్రికటుకములు, తెగడ, నీరుప్రబ్బలి, కరక్కాయలు, కందులు, చాగపట్ట, దంతి, నేలవేము, చిత్రమూలము, సుగంధపాల, నల్లసుగంధపాల, కామంచిగడ్డి, చిప్పగడ్డి, మల్లె వీనిని ప్రత్యేక మొక్కొక్కకర్షమువంతున జేర్చి పైకషాయముపోసి నూరి కల్కముచేసి

అందు ఒక ప్రస్థపరిమితమైన ఆవునేతిని చేర్చి, ఆవుపేడరసము, ఆవుపెరుగు (పుల్లనివి), ఆవుపాలు, ఆవుపంచితము, వీనిని ఒక్కొక్కదాని ఘృతమునకు సమభాగముగ జేర్చి ఘృతపాకవిధిప్రకారము పక్వము చేయునది.

ఇది మహాపంచగవ్యఘృత మనబడును. దీనిని ప్రతిదినమునందును సేవించినయెడ అమృతమునుబోలె అపస్మారము, ఉన్మాదము, వాపు, మహోదరము, గుల్మము, అర్శో రోగము, పాండురోగము, కామల, హలీమకము, అలక్ష్మి, గ్రహావేశము, చాతుర్థిక జ్వరము వీనినన్నిటిని హరించును. (ఇచ్చట హలీమక మనునది పాండురోగభేదము. "ద్వే పఞ్చమూల్యౌ త్రిఫలాం" అనుచోట ద్రవ్యప్రధానముగ నిర్దేశింపబడినది కావున దశమూలములను, త్రిఫలములను ఒక్కొక్కద్రవ్యమును వేరువేరుగ కర్షప్రమాణము గ్రహించునది.)

## బ్రాహ్మీఘృతము.

మూ. బ్రాహ్మీరసవచాకుష్ఠశఙ్ఖపుష్పీభిరేవ చ,
పురాణం ఘృతమున్మాదాలక్ష్మ్యపస్మారపాపనుత్. 25

వ్యా. మిక్కిలి ప్రాతదియయిన ఆవునేతిలో సరస్వతియాకు (పల్లారియాకు రసము, వస, చెంగల్వకోష్ఠు, శంఖపుష్పి,వీనినిచేర్చి పక్వముచేసినయెడ ఈఘృతము ఉన్మాదమును, అలక్ష్మిని, అపస్మారమును హరించును. (ఇచ్చట ద్రవకల్కములకు పరిమాణము చెప్పియుండలేదు కావున ఘృతమునకు నాల్గింతలు బ్రాహ్మీరసమును, వస మున్నగు కల్కద్రవ్యములు ఘృతమునకు నాల్గవపాలును చేర్చి ఘృతపాకవిధిప్రకారము చేయనగును.)

## సైంధవాదిఘృతము.

మూ. ఘృతం సైన్ధవహిఙ్గుభ్యాం వార్షే బాస్తే చతుర్గుణే,
మూత్రే సిద్ధమపస్మారహృద్గ్రహామయనాశనమ్. 26

వ్యా. ప్రాత ఆవునెయ్యియందు సైంధవలవణము, ఇంగువ ఈరెంటిని, కల్కముగను, ఒకసంవత్సరము వయసుగలమేకపోతుయొక్క మూత్రము ఘృతమునకు నాల్గింతలుగను, చేర్చి తైలపాకవిధిగ పక్వముచేసి యుపయోగించినచో అపస్మారమును, హృద్రోగమును హరించును. (ఇచ్చట "స్త్రీణాం తీక్ష్ణం గవాం మూత్రం న తు పుంసాం తథావిధం, పిత్తాంశికాస్త్రియో యస్మాత్ సౌమ్యాస్తు పురుషాః స్మృతాః" అనుపారిభాషికవాక్యము ననుసరించి మూత్రము స్త్రీజాతిది గ్రహించవలసియున్నను ప్రకృతమున యౌగికమని యుద్దేశించి తంత్రకారులు "బాస్తే"అని పుంలింగమును నిర్దేశించెను కావున మేకపోతుయొక్కమూత్రమును ఈయోగమున గ్రహింపదగును.

### వాతశ్లేష్మాపస్మారమునకు వచాదిఘృతము.

మూ. వచాశమ్యాకకైడర్యవయఃస్థాహింగురోచకైః,
సిద్ధం పలంకషాయుక్తైర్వాతశ్లేష్మాత్మకే ఘృతమ్. 27

వ్యా. వస, రేల, టేకుమ్రానిచెక్క, కాకోళి, ఇంగువ, సౌవర్చలవణము, గుగ్గిలము వీనిని కల్కముచేసి కల్కమునకు నాల్గింతలు జలమును కలిపి పైకల్కమును ఘృతమునకు నాల్గవవంతు జేర్చి పక్వముచేసి సేవించినచో వాతంబును శ్లేష్మంబును అధికంబుగాగల అపస్మారము నివర్తించును.

### అపస్మారమునకు జీవనీయఘృతము.

మూ. తైలప్రస్థం ఘృతప్రస్థం జీవనీయైః పలోన్మితైః,
క్షీరద్రోణే పచేత్సిద్ధమపస్మారవినాశనమ్. 28

వ్యా. ఒకప్రస్థము నువ్వులనూనె, ఒకప్రస్థము ఆవునెయ్యి, జీవనీయగణమున జెప్పబడిన ద్రవ్యములు ప్రత్యేక మొక్కొక్కపలమువంతు చేర్చి చేయబడినకల్కము ద్రోణపరిమితమైన ఆవుపాలు, వీనినన్నిటిని నొకటిగ జేర్చి ఘృతపాకవిధిప్రకారము పక్వముచేసి సేవించినయెడల అపస్మారము నివర్తించును.

### వాత-పిత్తఅపస్మారములకు కాశ్మర్యఘృతము.

మూ. కంసే క్షీరేక్షురసయోః కాశ్మర్యేఽష్టగుణే రసే,
కార్షికైః జీవనీయైశ్చ ఘృతప్రస్థం విపాచయేత్. 29
వాతపిత్తోద్భవం క్షిప్రం అపస్మారం నియచ్ఛతి,

వ్యా. చెరకురసము ఒకకంసము (ఆఢకము), ఆవుపాలు ఒక ఆఢకము, నేల గుమ్ముడురసము ఘృతమునకు ఎనిమిదింతలు (ఎనిమిదిప్రస్థములు) ఆవునెయ్యి ఒకప్రస్థము వీనినన్నిటిని నొకటిగ జేర్చి జీవనీయగణద్రవ్యములను ప్రత్యేక మొక్కొక్కకర్షము వంతున గ్రహించి కల్కముచేసి ఘృతమునకు నాల్గవవంతు కలిపి ఘృతపాకవిధిప్రకారము పక్వముచేసి పానముచేసినచో వాతిక-పైత్తిక అపస్మారములను అతిశీఘ్రముగ హరించును.

### పిత్తాపస్మారములకు ఘృతయోగములు.

మూ. తద్వత్కాశవిదారీక్షుకుశక్వాథశృతం ఘృతమ్. 30
మధుకద్విపలే కల్కే ద్రోణే చామలకే రసాత్,
తద్వత్సిద్ధో ఘృతప్రస్థః పిత్తాపస్మారభేషజమ్. 31

వ్యా. కాశదర్భ, నేలగుమ్మడిగడ్డ, చెరకు, కుశదర్భ, వీనిని సమభాగములుగ జేర్చి నీళ్లుపోసి నాల్గవపాలు మిగులునట్లు కషాయము కాచి కషాయమునకు నాల్గవపాలు ఘృతమును జేర్చి పక్వముచేయునది. ఈఘృతము వాత-పిత్త అపస్మారములను హరించును.

మరియు అతిమధురము రెండుపలములు కల్కముచేసి ఉసిరికకాయలరసము ద్రోణ పరిమితమును, ప్రస్థపరిమితమైన ఘృతమున కలిపి ఘృతపాకముగ పక్వముచేసి సేవించిన యెడ పిత్తాపస్మారములు నివర్తించును.

### అపస్మారమున నభ్యంగాదివిధి.

మూ. అభ్యఙ్గస్సార్షపం తైలం బస్తమూత్రే చతుర్గుణే,
సిద్ధం స్యాద్గోశకృన్మూత్రైః స్నానోత్సాదనమేవ చ. 32

వ్యా. ఆవనూనెయందు నాల్గింతలు మేకపంచితమును కలిపి తైలపక్వముగచేసి ఆతైలముచే శరీరమునకు అభ్యంగనముచేసికొని ఆవుపేడతో నలుగుపెట్టుకొని గోమూత్రముచే స్నానముచేసినయెడ అపస్మారము నివర్తించును.

మూ. కటభీనిమ్బకట్వఙ్గమధుశిగ్రుత్వచాం రసే,
సిద్ధం మూత్రసమం తైలమభ్యఙ్గార్థే ప్రశస్యతే. 33

వ్యా. మాల్కంగుని, వేపపట్ట, దుండిగపుమ్రానిపట్ట, ఎఱ్ఱమునగపట్ట, వీనిని కషాయముచేసి యీకషాయము మూడుపాళ్లును తైలమునకు సమభాగము గోమూత్రమును, ఈద్రవసముదాయమునకు నాల్గవపాలు తైలమును చేర్చి తైలపక్వముచేసినయెడ ఈతైలము అపస్మారరోగులకు చాల ప్రశస్తమైనది.

ఇచ్చట ఈతైలయోగముల రెంటియందును కల్కద్రవ్యములు చెప్పలేదు కావున కల్కములేకయే కేవలద్రవముతో తైలపక్వముచేయునది.

### అపస్మారనాశక అభ్యంగనతైలము.

మూ. పలంకషావచాపథ్యావృశ్చికాల్యర్కసర్షపైః,
జటిలాపూతనాకేశీనాకులీహిఙ్గుచోరకైః. 34
లశునాతిరసాచిత్రాకుష్ఠైర్విడ్భిశ్చ పక్షిణాం,
మాంసాశినాం యథాలాభం, బస్తమూత్రే చతుర్గుణే. 35
సిద్ధమభ్యఞ్జనం తైలమపస్మారవినాశనం,
ఏతైశ్చైవౌషధైః కార్యం ధూపనం సప్రలేపనమ్. 36

వ్యా. పల్లేరు, వస, కరక్కాయలు, తేలుమణిచెట్టు, జిల్లేడువేరు, ఆవాలు, జటామాంసి, తెల్లగరిక, సర్పాక్షి, ఇంగువ, కచోరములు, వెల్లుల్లిపాయలు, దుంపరాష్ట్రము, పిన్నపాపర, చెంగల్వకోష్టు, మాంసమునుతిను పక్షులయొక్క మలము వీనినన్నిటిని, కల్కముచేసి తైలమునకు నాల్గవవంతు చేర్చి, మేకపంచితమును తైలమునకు నాలుగుపాళ్లు చేర్చి తైలపాకవిధిగ పక్వముచేసియుంచునది. ఈతైలమును అభ్యంగనమును చేసికొనినయెడ అపస్మారము నివర్తించును.

మరియు, పైచెప్పినద్రవ్యములను చూర్ణముచేసి ధూపమునకు ప్రలేపమునకును నుపయోగింపనగును.

## అపస్మారహరప్రదేహము, ధూపము.

మూ. పిప్పలీం లవణం శిగ్రుం హిఙ్గు హిఙ్గుశివాటికాం,
కాకోలీం సర్షపాన్ కాకనాసాం కైడర్యచన్దనే 37
శునస్కన్ధాస్థినఖరాన్వృశ్చికాంశ్చేతి పేషయేత్,
బస్తమూత్రేణ పుష్యర్క్షే ప్రదేహః స్యాత్సధూపనః. 38

వ్యా. పిప్పళ్లు, సైంధవలవణము, మునగపట్ట, ఇంగువ, ఇంగూపత్రి, కాకోలి, ఆవాలు, కాకిదొండ, టేకుమానిచెక్క, చందనము, కుక్కయొక్క మెడయందలియెముకలు, గోళ్లు, ప్రక్కటెముకలు వీనినన్నిటిని సమభాగములుగ జేర్చి పుష్యమీనక్షత్రమునాడు నూరి శరీరముపైనపూసినను, లేక ధూపము వేసినను అపస్మారము నివర్తించును.

## అపస్మారహరోద్వర్తనము.

మూ. అపేతరాక్షసీకుష్ఠపూతనాకేశిచోరకైః,
ఉత్సాదనం మూత్రపిష్టైర్మూత్రైరేవావసేచనమ్. 39
జలౌకశ్శకృతాతద్వద్దగ్ధైర్వా బస్తలోమభిః,
ఖరాస్థిభిర్హస్తినఖైస్తథా గోపుచ్ఛలోమభిః. 40

వ్యా. అపేతరాక్షసి (తులసి), చెంగల్వకోష్ఠు, వస, కచోరములు, వీనిని గోమూత్రమున నూరి శరీరమున కుద్వర్తనముచేసి గోమూత్రమున స్నానముచేయునది.

మరియు జలగలయొక్క మలము నైనను, మేకవెండ్రుకలు బూడిదచేసియైనను, గాడిదయెముకలు పొడియైనను, యేనుగగోళ్లనైనను, ఆవుతోకయందలి వెండ్రుకలు కాల్చియైనను శరీరమున కుద్వర్తనముచేసినయెడ అపస్మారము శమించును.

### అపస్మారహరనస్యము.

మూ॥ కపిలానాం గవాం మూత్రం (పిత్తం) నావనం పరమం హితం,
శ్వసృగాలబిడాలానాం సింహాదీనాం చ శస్యతే. 41

వ్యా॥ కపిలవర్ణముగల ఆవుయొక్క మూత్రమునైనను, కుక్క, నక్క, పిల్లి, సింహము మున్నగు వానియొక్క మూత్రమునైనను అపస్మారరోగికి నస్యముచేయుట చాల ప్రశస్తము.

### అపస్మారహరనావననస్య-నస్యయోగములు

మూ. భార్గీ వచా నాగదన్తీ శ్వేతా శ్వేతా (శత) విషాణికా,
జ్యోతిష్మతీ నాగదన్తీ పాదోక్తా మూత్రపేషితాః. 42
యోగాస్త్రయోఽతః షడ్బిన్దూన్ పఞ్చ వా నావయేద్భిషక్,
త్రిఫలావ్యోషపీతద్రుయవక్షారఫణిజ్జకైః. 43
శ్యామాపామార్గకారఞ్జఫలైర్మూత్రేఽథ బస్తజే,
సాధితం నావనం తైలం అపస్మారవినాశనమ్. 44

వ్యా॥ భారంగి, వస, కలిగొట్టువేరు, ఈమూటినైనను; తెల్లదింటెన, పిల్లిపీచర ఈరెంటినైనను; మాల్కంగుని, కలిగొట్టు, ఈరెంటినైనను; గోమూత్రమున నూరి అపస్మారరోగికి అయిదారుబిందువులు, ముక్కులో నస్యముచేయునది.

త్రిఫలములు, త్రికటుకములు, దేవదారు, యవక్షారము, మరువము, నల్లతెగడ, ఉత్తరేణివిత్తులు, కానుగవిత్తులు, వీనిని కల్కముచేసి ఈకల్కము నాల్గవపంతును, తైలమును, నాల్గుభాగములు మేకపంచితమును, వీనినన్నిటిని నొకటిగఁజేర్చి తైలపక్వముచేసి నావననస్యముచేసినయెడ నపస్మారము నశించును.

### అపస్మారహరప్రథమననస్యము.

మూ. పిప్పలీ వృశ్చికాలీ చ కుష్ఠం చ లవణాని చ,
భార్గీ చ చూర్ణితం నస్తః కార్యం ప్రథమనం పరమ్. 45

వ్యా॥ పిప్పళ్లు, తేలుమణిచెట్టు, చెంగల్వకోష్టు, పంచలవణములు, భారంగి వీనినన్నిటిని చూర్ణముచేసి అపస్మారరోగమున నాసారంధ్రములనుండి పీల్చుట చాల ప్రశస్తము. ఇది ప్రథమననస్యము.

### అపస్మారహరఅంజనవర్తులు.

మూ. కాయస్థాం శారదాన్ ముద్గాన్ ముస్తోశీరయవాంస్తథా,
సవ్యోషాన్బస్తమూత్రేణ పిష్ట్వా వర్తీః ప్రకల్పయేత్. 46

అపస్మారే తథోన్మాదే సర్పదష్టే గరార్దితే,
విషపీతే జలమృతే చైతాః స్యుః అమృతోపమాః. 47

వ్యా- కరక్కాయలు, పచ్చపెసలు, తుంగగడ్డలు, వట్టివేళ్లు, యవలు, త్రికటుకములు వీనిని మేకపంచితమున నూరి కణికలుగచేసి నీడలో నెండించి యుంచునది. అపస్మారము, ఉన్మాదము, పాముువిషము, కృత్రిమవిషము, వీనియందును, విషపానము చేసినను, జలముచే చచ్చినను, వీనియన్నిటియందు పైజెప్పినవస్తువును, చాది కలికము వేసినచో అమృతమునువోలె తీవ్రమగుపని జేయును.

కొన్ని వర్త్యంజనములు.

మూ. ముస్తం వయస్థాం త్రిఫలాం కాయస్థాం హిఙ్గు శాద్వలం,
వ్యోషం మాషాన్ యవాన్మూత్రైః బాస్తమైషార్షభైస్త్రిభిః 48
పిష్ట్వా కృత్వా చ తాం వర్తిం అపస్మారే ప్రయోజయేత్,
కిలాసే చ తథోన్మాదే జ్వరేషు విషమేషు చ. 49

వ్యా- తుంగగడ్డలు, తిప్పతీగ, త్రిఫలములు, ఉసిరికకాయలు, కాకోలి, ఇంగువ, గరిక, త్రికటుకములు, మినుములు, యవలు, వీనినన్నిటిని సమభాగములుగ జేర్చి మేక, గొఱ్ఱె, వృషభము, ఈమూటియొక్కమూత్రములచేత నూరి వర్తిజేసి నీడన యెండించి యీవర్తిని అపస్మారము, కిలాసకుష్ఠము, ఉన్మాదము, విషమజ్వరములు వీనియందు అంజనమునకై యుపయోగింపనగును.

అపస్మారమున కొన్ని అంజన-ధూపప్రయోగములు.

మూ. పుష్యోద్ధృతం శునఃపిత్తం అపస్మారఘ్నమఞ్జనం,
తదేవ సర్పిషా యుక్తం ధూపనం పరమం మతమ్. 50
నకులోలూకమార్జారగృధ్రకీటాహికాకజైః,
తుణ్డైః (చూర్ణైః) పక్షైః పురీషైశ్చ ధూపనం కారయేద్భిషక్. 51

వ్యా- పుష్యనక్షత్రమునాడు కుక్కయొక్క పిత్తమును గ్రహించి కన్నులకు కలికమిడినచో నపస్మారము హరించును. మరియు అట్టి కుక్కపిత్తమును నేతితో గలిపి అపస్మారరోగికి ధూపమువేయుటయు చాల ప్రశస్తము. మరియు ముంగిస, గుడ్లగూబ, పిల్లి, గద్ద, తేలు మున్నగుకీటములు, పాము, కాకి, వీనిముక్కులను, లేక రెక్కలను, పురీషమును గ్రహించి యపస్మారరోగికి ధూపమువేయుట చాల మంచిది.

### పైజెప్పిన చికిత్సాక్రమప్రయోజనము.

మూ. ఆభిః క్రియాభిస్సిద్ధాభిః హృదయం సమ్ప్రబుధ్యతే,
స్రోతాంసి చాపి శుధ్యన్తి తతః సంజ్ఞాం స విందతి. 52

వ్యా. పైజెప్పబడిన ఘృతప్రయోగాదిసిద్ధక్రియలచే నపస్మారరోగికి హృదయము తెలివినంది అందుండు సంజ్ఞావహస్రోతస్సులు పరిశుద్ధములగును. అంతట వాడు యథాస్థితిగ తెలివికల్గి యుండును.

### అపస్మారమునందు అనుబంధచికిత్స.

మూ. యస్యాఽనుబన్ధస్త్వాగన్తుః దోషలిఙ్గాధికాకృతిః,
దృశ్యతే తస్య కార్యం స్యాత్ ఆగన్తూన్మాదభేషజమ్. 53

వ్యా. దోషములచేగల్గిన యపస్మారములందు ఆగంతుకారణములగు భూతావేశాదికారణములు అనుబంధములై యుండి వాతాదిదోషలక్షణములకన్న ఆగమరూపమైన భూతములలక్షణము లధికముగ కానవచ్చినచో, అట్టి యపస్మారమునకు ఆగంతూన్మాదమునకుజెప్పిన చికిత్సల జేయనగును.

ఇచ్చట నీవివరణము నెరుంగునది:—అపస్మారము వాత-పిత్త-కఫ-సన్నిపాతభేదములచే నాల్గువిధములు. ఈవిభాగమే "పృథగ్దోషైః సమస్తైశ్చ వక్ష్యతే స చతుర్విధః" (శ్లో. ౮) అని చికిత్సోపక్రమమున జెప్పబడినది. అష్టోదరీయాధ్యాయమునను రోగవిభాగములపరిగణనము జేయుంతరి:—"చత్వారోఽపస్మారాః" "చత్వారోఽపస్మారా ఇతి వాత-పిత్త-కఫ-సన్నిపాతనిమిత్తజాః" (సూ-అ-౧౯. వాక్యము. 3, ౫౭.) అని నాల్గువిధములుగనే వివరింపబడినది. కావున అపస్మారము దోషజమేకాని ఆగంతుజము కానేరదు. ఈవిషయమునే "అపస్మారో మహావ్యాధిః సస్యాద్దోషత ఏవతు" అని తంత్రాంతరమున దోషజత్వమే రూఢిగస్థిరపరచబడినది. ఇత్తెరంగున నపస్మారము కేవల దోషజమైనను, దానికి అనుబంధముగ భూతావేశరూపమైన యాగంతుకారణముగూడ నొకప్పుడు సంభవించును. కాని యున్మాదమునబోలె ప్రధానముగ సంబంధములేదు. (తొలుత దోషప్రకోపముచే వ్యాధిసంభవించి పిదప భూతసంబంధము కల్గి దానిలక్షణముల జూపును.) ఈవిషయమునే నిదానమున—"తేషామాగన్తురనుబన్ధో భవత్యేవ, కదాచిత్,......తస్య విశేషవిజ్ఞానం యథోక్తలిఙ్గైః లిఙ్గాధిక్యం అదోషలిఙ్గానురూపం కించిత్." (నిదాన. అ. ౮. సూ. ౧౩.) అని యుపదేశించి మరియు ఆగంతురోగము దోషజమును, దోషమును ఆగంతువును పరస్పరముత్తరకాల మనుబంధముగ సంబంధించుటయు వ్యాధి సామాన్యమున కలదు. ఈవిషయమును, "ఆగన్తురన్వేతి నిజం వికారం

నిజస్తథాగన్తు మపి ప్రవృద్ధః......కర్మసమార భేత" (సూ. అ. ౧౯. శ్లో. ౩౯.) అని యుపదేశించిరి.

పైవివరణముచేత అపస్మారమున దోషజముననే అనుబంధ(అప్రధాన)రూపముగ ఆగంతులక్షణము లుండునుకాని ప్రధానముగ నున్మాదమునుబోలె ఆగంతువునే ప్రధానముగజేసి యపస్మారము జనించుటలేదని సిద్ధాంతితము. అట్టియెడ దోషలక్షణములకన్న నాగంతులక్షణములే యధికముగ గానవచ్చిననాడు అట్టి యాగంతువునకు ఆగంతూన్మాదమునకు జెప్పినచికిత్సలనే చేసి శమింపజేయవలెనని యీశ్లోకమున జెప్పబడినది. ఇత్తెరంగుననే యేవ్యాధియందైనను అనుబంధరూపముగ నున్నను ప్రబలలక్షణములతో కూడియుండునెడ ప్రధానవ్యాధికి విరోధములేకుండ అప్రధానమునకును చికిత్స చేయవలెను. ఈవిషయము "ప్రధానమవిరోధయన్" అని తంత్రాంతరమున జెప్పబడినది.

## అగ్నివేశప్రశ్నము.

మూ. అనంతరమువాచేదమగ్నివేశః కృతాంజలిః,
భగవన్ ప్రాక్సముద్దిష్టః శ్లోకస్థానే మహాగదః. 54
అతత్వాభినివేశో యః తద్ధేత్వా కృతిభేషజం,
తత్ర నోక్తమతః శ్రోతుం ఇచ్ఛామి తదిహోచ్యతామ్. 55
శుశ్రూషవే వచః శ్రుత్వా శిష్యాయాహ పునర్వసుః,
మహాగదం సౌమ్య శృణు సహేత్వాకృతిభేషజమ్. 56

వ్యా. పైజెప్పినరీతిగ నుపదేశించిన గురువుతో అగ్నివేశుడు అంజలిబద్ధుడై ఇట్లడిగెను:—"ఓగురువర్యా! ఇంతకుమున్ను సూత్రస్థానమున రోగముల నిర్దేశించుతఱి అతత్వాభినివేశము అనునట్టి మహాగదము నిర్దేశింపబడినది. ("ఏకో మహాగదః అతత్వాభినివేశః." (సూ. అ. ౧౯. శ్లో. ౨౯.) అని చెప్పబడినది.) దానికి సంబంధించిన హేతువులును, లక్షణములును, చికిత్సయు చెప్పబడలేదు. వానినెల్ల వినవలచెద నాకానతిండు" అని అడిగిన శిష్యునివాక్యము విని పునర్వసు మహాగదమును హేతు - లక్షణ - ఔషధపూర్వకముగ వివరించి చెప్పెద వినుమని శిష్యునితో నిట్లు చెప్పందొడంగెను.

## అతత్వాభినివేశహేతువులు, సంప్రాప్తి.

మూ. మలినాహారశీలస్య వేగాన్ప్రాప్తాన్నిగృహ్ణతః,
శీతోష్ణస్నిగ్ధరూక్షాద్యైర్హేతుభిశ్చాతిసేవితైః. 57
హృదయం సముపాశ్రిత్య మనోబుద్ధివహాః సిరాః,

దోషాః సందూష్య తిష్ఠన్తి రజో మోహావృతాత్మనః. 58
రజస్తమోభ్యాం వృద్ధాభ్యాం బుద్ధౌ మనసి చావృతే,
హృదయే వ్యాకులే దోషైరథ మూఢోఽల్పచేతసః. 59
విషమాం కురుతే బుద్ధిం నిత్యానిత్యే హితాహితే,
అతత్త్వాభినివేశం తమాహురాప్తా మహాగదమ్. 60

వ్యా. అపరిశుద్ధములైన ఆహారాదుల సేవించు స్వభావముకలవాడును, మలమూత్రాదివేగముల నిరోధించువాడును, నగువానికి శీతంబును, ఉష్ణంబును, రూక్షంబు నగు ఆహారాదుల విశేషముగ సేవించుటవలన వాతాదిదోషములు ప్రకోపమునొంది హృదయస్థానమున జేరి యచ్చటనుండు మనోబుద్ధి వహంబులగుసిరలను చెరచి రజస్తమోగుణము లధికముగా నున్నపుడు బుద్ధియందును మనస్సునందును దోషములు వ్యాపించి వానిమార్గముల నిరోధించును. అట్టియెడ హృదయము కలతనొందును. దానంజేసి మనుజుడు అల్పజ్ఞానముకలవాడై నిత్యానిత్యవస్తువులవిషయమునను, హితాహితములవిషయమునను, వ్యత్యస్తమైన బుద్ధికలవాడై నిత్యమును అనిత్యంబుగను, అనిత్యంబును నిత్యముగను, హితమును అహితముగను, అహితమును హితముగను, వ్యత్యస్తముగ తలచుచుండును. ఇయ్యది అతత్త్వాభినివేశము అనుగొప్పవ్యాధి. (ఈవ్యాధియును ఉన్మాదాపస్మారములబోలె రజస్తమోగుణప్రాబల్యముచేత కల్గు మానసికరోగము.)

## అతత్త్వాభినివేశచికిత్సాక్రమము.

మూ. స్నేహస్వేదోపపన్నం తం సంశోధ్య వమనాదిభిః,
కృతసంసర్జనం మేధ్యైరన్నపానైరుపాచరేత్. 61
బ్రాహ్మీస్వరసయుక్తం యత్ పంచగవ్యముదాహృతం,
తత్సేవ్యం శఙ్ఖపుష్పీ చ యచ్చ మేధ్యం రసాయనమ్. 62
సుహృదశ్చానుకూలాస్తం స్వాప్తాః ధర్మార్థవాదినః,
సంయోజయేయుర్విజ్ఞానధైర్యస్మృతిసమాధిభిః. 63

వ్యా. పైజెప్పిన మహాగదపీడితునకు తొలుత స్నేహస్వేదవిధులను విధ్యుక్తప్రకారముచేసి పిమ్మట నాయాదోషానుసారముగ వమనవిరేచనాదులచే సంశోధనమును చేసి సంసర్జనక్రమము ననుసరించి ఆహారవిధుల నిర్వర్తించవలయును. పిమ్మట పరిశుద్ధంబులు బుద్ధి నిర్మలముగ జేయునవియు నగు అన్నపానాదులచే నుపచరించవలయును. బ్రాహ్మీఘృతమును పైయధ్యాయమున జెప్పబడిన పంచగవ్యఘృతమును సేవింపనగును. శంఖపుష్పి మున్నగుబుద్ధిని వృద్ధినొందించు రసాయనముల సేవించవలయును.

మరియు వాని కనుకూలులును ఆప్తులు నగుమిత్రులు ధర్మార్థముల బోధించుచు విజ్ఞానమును, ధైర్యమును, స్మృతిని మనస్సున కేకాగ్రతను, వానికి కల్గించుచు మనస్సునకు కల్గిన వ్యత్యస్తజ్ఞానమును తొలగించి వాస్తవ్యజ్ఞానమును కల్గించవలయును. (అతత్వాభినివేశమున వస్తువులయొక్క వాస్తవ్యమైన జ్ఞానమును వదలి విరుద్ధములైన జ్ఞానము నందు మనస్సు ప్రవేశించుట యని యర్థము. ఇచ్చట ఈమహాగదము నుద్దేశించి చెప్పబడినగ్రంథము. సింధు కాశ్మీరాదిదేశములయందు వాడుకలో నున్నది. ఈగ్రంథము అనార్షమని కొందరివ్యాఖ్యాతల యభిప్రాయము. ఈతంత్రకారులు వ్యాధినిర్దేశమున "ఏకో మహాగదః అతత్వాభినివేశః." అని నిర్దేశించినప్రకారము దానిలక్షణరూపచికిత్సితముల నిరూపించుటయు నవసరము. కావున ఉన్మాదాపస్మారములబోలె మానసికమునుబోలె నియ్యది మానసికరోగమగుటంజేసి వానిచికిత్స జెప్పినవెంటనే దీనిచికిత్స వివరించుటయు సంగతమని మాయభిప్రాయము.)

### అతత్వాభినివేశహరయోగములు.

మూ. ప్రయుంజ్యాత్ తైలలశునం పయసా వా శతావరీమ్,
బ్రాహ్మీరసం కుష్ఠరసం వచాం వా మధుసంయుతామ్. 64

వ్యా. మరియు వెల్లుల్లిపాయలతోకూడిన తైలమునైనను, పిల్లిపీచరరసముతో కూడిన పాలనైనను, సరస్వతియాకురసమును,చెంగల్వకోష్టురసమును, వేరువేరుగ పాలతో కలిపియైనను; వసను తేనెతో కూర్చియైనను, పైజెప్పిన మహావ్యాధియందు సేవించవలయును. ఇచ్చట పైజెప్పినవి ఐదుయోగములని యెరుంగునది.

### అపస్మారమున రసాయనప్రయోగము.

మూ. దుశ్చికిత్స్యో హ్యపస్మారశ్చిరకారీ కృతాస్పదః,
తస్మాద్రసాయనైరేనం ప్రాయశః సముపాచరేత్. 65

వ్యా. అపస్మారము నుపేక్షించినచో చాలకాలమువరకు రూఢమూలమై బాధించుస్వభావముగలది. కావున కష్టముచే చికిత్సచేయవలసియుండును. అట్టిపరిస్థితి యందు రసాయనయోగములచే తరచుగ నుపచరించవలయును.

### అపస్మారమున జలాదులనుండి రక్షణావశ్యకత.

మూ. జలాగ్నిద్రుమశైలేభ్యో విషమేభ్యశ్చ తం సదా,
రక్షేదున్మాదినం చైవ సద్యః ప్రాణహరా హి తే. 66

వ్యా. జలము, అగ్ని, వృక్షములు, పర్వతములు ఇతరములగు నిమ్నోన్నతప్రదేశములు, ఇవియన్నియు తత్కాలముననే ప్రాణముల కపాయము గల్గించునది కావున

ఉన్మాదాపస్మారములు కలరోగిని యెల్లప్పుడును పైజెప్పినజలాదులచెంత పోనీయక యెల్లప్పుడును కాపాడునది. (పైజెప్పిన వ్యాధులయందు స్వాధీనము తప్పియు, వ్యాధి ప్రకోపించుసమయము ఇయ్యది యని తెలియకుండుటయు సైజము. కావున అట్టిరోగులను తటాకము మున్నగుప్రదేశములకు పోనిచ్చినచో అట్టిసమయము వ్యాధిప్రకోపించి అపాయముగల్గించును కావున వానిని జలాదులచెంత చేరనీయక మెలకువతో గమనించవలయునని ముఖ్యాభిప్రాయము.)

### అధ్యాయవిషయసంగ్రహము.

తత్ర శ్లోకాః—

మూ. హేతుం కుర్వన్త్యపస్మారం దోషాః ప్రకుపితా యథా,
సామాన్యతః పృథక్త్వాచ్చ లిఙ్గం తేషాఞ్చ భేషజమ్ 67
మహాగదసముత్థానం లిఙ్గం చోవాచ సౌషధం,
మునిర్వ్యాసమాసాభ్యామపస్మారచికిత్సితే. 68

వ్యా. అపస్మారము జనించుకారణములు, ప్రకుపితములగు దోషములు, అపస్మారములగల్గించువిధము (సంప్రాప్తి), అపస్మారములకు సామాన్యవిశేషలక్షణములు, వాని సామాన్యవిశేషచికిత్సలు, మహాగదము జనించుటకు కారణములు, లక్షణములు, చికిత్స వీనినన్నిటిని వ్యాససమాసరూపముగ అపస్మారచికిత్సితమను నీయధ్యాయమున అగ్నివేశులు చెప్పెను.

ఇత్యగ్నివేశకృతే తన్త్రే చరకప్రతిసంస్కృతే, చికిత్సాస్థానే
అపస్మారచికిత్సితం నామ దశమోఽధ్యాయః.

ఇత్తెరంగున అగ్నివేశకృతంబును, చరకప్రతిసంస్కృతంబును నగు చరకసంహితయను ఆయుర్వేదతంత్రమునందలి చికిత్సాస్థానమున అపస్మారచికిత్సితమనునది దశమోధ్యాయము సంపూర్ణము.

---

## ఏకాదశాధ్యాయము.

అవతరణిక:—అపస్మారవేగముచే నిమ్నోన్నతప్రదేశములనుండి పడుటవలనను ఉరఃక్షతము కల్గవచ్చును. దానివలన క్షతక్షీణము సంభవింపవచ్చును. అట్టిసంబంధమును బట్టి యపస్మారమును చెప్పినపిదప క్షతక్షీణచికిత్సితము చెప్పబడును:—

మూ. అథాతః క్షతక్షీణచికిత్సితం వ్యాఖ్యాస్యామః. 1
ఇతి హ స్మాహ భగవానాత్రేయః. 2

వ్యా. అపస్మారచికిత్సితమును జెప్పినపిదప క్షతక్షీణచికిత్సితము భగవానుడగు నాత్రేయు లుపదేశించినదానికన్న న్యూనాతిరేకము లేకుండునట్లు వివరింపబడును.

క్షతక్షీణచికిత్సితాధ్యాయప్రారంభము.

మూ. ఉదారకీర్తిః బ్రహ్మర్షిః ఆత్రేయః పరమార్థవిత్,
క్షతక్షీణచికిత్సార్థమిదమాహ చికిత్సితమ్. 3

వ్యా. అధికమైన కీర్తికలవాడును, బ్రహ్మర్షియు, పరమార్థమును తెలిసినవాడు నగు నాత్రేయమహర్షి క్షతక్షీణులచికిత్సను తెలుపుటకై అట్టి చికిత్సితమును తెలుపునట్టి యధ్యాయమును చెప్పందొడంగెను.

ఉరఃక్షతనిదానము, సంప్రాప్తి.

మూ. ధనుషాఽఽయస్యతోఽత్యర్థం భారముద్వహతో గురుమ్,
పతతో విషమోచ్చేభ్యో బలిభిస్సహ యుధ్యతః. 4
వృషం హయం వా ధావన్తం దమ్యం వాన్యం నిగృహ్ణతః,
శిలాకాష్ఠాశ్మనిర్ఘాతాన్ క్షిపతో నిఘ్నతః పరాన్. 5
అధీయానస్య వాత్యుచ్చైః దూరం వా వ్రజతో ద్రుతం,
మహానదీం వా తరతః హయైర్వా సహ ధావతః. 6
సహసోత్పతతో దూరం తూర్ణం చాతిప్రనృత్యతః,
తథాన్యైః కర్మభిః క్రూరైః భృశమభ్యాహతస్య చ. 7
విక్షతే వక్షసి వ్యాధిః బలవాన్ సముదీర్యతే,
స్త్రీషు చాతిప్రసక్తస్య రూక్షాఽల్పప్రమితాశినః. 8

వ్యా. బలవంతముగ ధనుస్సును లాగి మితిమీరి బాణప్రయోగము చేయుట మిక్కిలి యధికమైన భారమును మోయుట, మిట్టపల్లములుగా నుండు ప్రదేశముల యందుపడుట, తనకన్న బలాధికులుగ నున్నవారితో మల్లయుద్ధముచేయుట, పరువిడుచున్న వృషభమునైనను, గుఱ్ఱమునైనను, ఇతరజంతువులనైనను, అడ్డగించి బలాత్కారముగపట్టుట, మిక్కిలి మదించినయేనుగు మున్నగుబలవత్తరములైన జంతువుల నెదిరించి పోట్లాడుట; రాళ్లను, కట్టెలను ఒడిసెలరాళ్లను విసరుట; శత్రువులను కొట్టుట, మిక్కిలి బిగ్గరగ వేదము మున్నగువానిని జదువుట, మిక్కిలి వేగముతో చాలదూరము పరువిడుట, గొప్పనదులను ప్రవాహమునందు చేతులతో నీదికొనుచు దాటుట, వేగముగ పరు

విడుచుండుట, గుఱ్ఱములతోడ తాను పరువిడుట, శీఘ్రముగ నెగురుచు గంతులిడుట, లేక నాట్యమాడుట, ఇవి మున్నగు క్రూరములగుపనులచేత నభిఘాతము కలిగినవానికి వక్షఃస్థలమున అభిఘాతము తగిలి కలుగును. అట్టి యభిఘాతముచేతను, స్త్రీసంచార మధికముగ నుండుటవలనను, రూక్షమయిన యాహారము భుజించుటచేతను, తాను భుజించుపరిమితికన్న స్వల్పముగ భుజించుటచేతను, కాలము నతిక్రమించి భుజించినను, లేక ఒక్కటేరసమును భుజించుటచేతను; బలవత్తరమైన ఈక్రిందచెప్పబడు క్షతక్షయమను నీవ్యాధి కల్గును.

## క్షతక్షీణలక్షణములు.

మూ. ఉరో విరుజ్యతే తస్య భిద్యతేఽథ విభజ్యతే,
ప్రపీడ్యతే తతః పార్శ్వే శుష్యత్యఙ్గం ప్రవేపతే. 9
క్రమాద్వీర్యం బలం వర్ణో రుచిరగ్నిశ్చ హీయతే,
జ్వరో వ్యథా మనోదైన్యం విడ్భేదోఽగ్నివధాదపి. 10
దుష్టః శ్యావః సుదుర్గన్ధః పీతో విగ్రథితో బహుః,
కాసమానస్య చ శ్లేష్మా సరక్తః సంప్రవర్తతే. 11
స క్షతః క్షీయతేఽత్యర్థం తథా శుక్రౌజసోః క్షయాత్,

వ్యా. పైజెప్పిన ఉరఃక్షతమునందు రొమ్మునవగులదీయునట్లు నొప్పిపుట్టును. చీల్చువిధముగ బాధకల్గును. ఇరుప్రక్కలయందును గట్టిగ నొత్తిపట్టిన విధముగ బాధ కల్గును. శరీరము కృశించును, వణకును. శరీరమునందలి వీర్యము, బలము, శరీరబలము, వర్ణము, కాంతి, జఠరాగ్ని, ఇవియన్నియు వరుసగ నానాట బలముచెడి క్షీణించును. జ్వరము, మనస్సునందు వ్యథ, దీనభావము, ఇవి కల్గును. మలము జఠరాగ్ని మందగించియున్నను వ్యాధిస్వభావంబునంజేసి పలుమారు వెడలుచుండును. దగ్గినపుడు వాతాదులచే దుష్టంబును, శ్యామవర్ణంబును, లేక పీతవర్ణంబును, దుర్గంధంబును కల్గి చిక్కనైనకఫము రక్తముతోకూడి నోట వెడలుచుండును. ఇవి ఉరఃక్షతలక్షణములు. ఈరోగముగలరోగి శుక్రంబును, ఓజస్సును, క్షీణించుటవలన నానాట క్షీణించుచుండును.

## క్షతక్షయపూర్వరూపము.

మూ. అవ్యక్తం లక్షణం తస్య పూర్వరూపమితి స్మృతమ్. 12

వ్యా. పైజెప్పిన లక్షణములన్నియు సంపూర్ణముగాక సూక్ష్మముగ గానవచ్చినచో నవియే పూర్వరూప మనబడును.

## ఓ క్షతక్షయసామాన్యలక్షణములు. ఓ

మూ. ఉరోరుక్ శోణితచ్ఛర్దిః కాసో వైశేషికః క్షతే,
క్షీణే సరక్తమూత్రత్వం పార్శ్వపృష్ఠకటిగ్రహాః.　　　13

వ్యా. ఉరఃక్షతమునందు రొమ్మునొప్పితోకూడి రక్తము వాంతి యగును. దగ్గు విశేషముగ గల్గును. క్షీణమునందు రక్తముతోకూడిన మూత్రము వెడలును. ఇరు ప్రక్కలయందును, నడుమునందును బిగపట్టినట్లు నొప్పికల్గును.

ఇచ్చట నీవిషయము నెరుంగునది:—ఉరఃక్షతమనియు,క్షతక్షీణమనియు నిచ్చట వ్యాధులు రెండువిధములు. అందు ఉరఃక్షతకారణంబు "ధనుషాయస్యతో౽త్యర్థం" అని చెప్పబడినది. అట్టి ఉరఃక్షతమును కారణముగ చేసి దానికి తోడుగ రూక్షాల్పాశనాది కారణములు గూడ కలసి క్షతక్షయము అనువ్యాధి యేర్పడును. ఈవ్యాధిలక్షణము "ఉరో విరుజ్యతే" అని యుపక్రమించి పూర్తిగ జెప్పబడినది. మరియు కొందరు ఈ వ్యాధిని ప్రత్యేకముగ క్షతము క్షయము అని రెండువిధములుగ విభజించి అందు "ఉరోరుక్......క్షతే" అనువాక్యముచేత క్షతలక్షణంబును, "క్షీణే సరక్తమూత్రత్వమ్." అనువాక్యముచేత క్షీణలక్షణములగునని వేరువేరుగ చెప్పిరి. మొత్తమున తొలుత నురఃక్షతము కల్గి దానంజేసి శుక్రంబున ఓజస్సును క్షీణించుటవలన శరీరధాతువులు క్షీణించినపుడు అదియే క్షతక్షయమని చెప్పుట సమంజసముగ నుండును.

## ఓ క్షతక్షీణసాధ్యాసాధ్యలక్షణములు. ఓ

మూ. అల్పలిఙ్గస్య దీప్తాగ్నేః సాధ్యో బలవతో నవః,
పరిసంవత్సరో యాప్యః సర్వలిఙ్గస్తు వర్జయేత్.　　　14

వ్యా. జఠరాగ్నిదీప్తిగలిగి శరీరబలము చక్కగనుండి పైజెప్పినలక్షణములన్నియు గల్గక కొన్నిమాత్రము గల్గి నూతనముగ జనించిన క్షతక్షయము సాధ్యమైయుండును. అటుగాక ఒకసంవత్సరకాలము గడచి ఈవ్యాధికి చెప్పినలక్షణములన్నియు పూర్తిగ కల్గి జనించినక్షతక్షయము సాధ్యముకానేరదు కావున విడువందగును.

## ఓ క్షతక్షయసామాన్యచికిత్సితము. ఓ

మూ. ఉరో మత్వా క్షతం లాక్షాం పయసా మధుసంయుతాం,
సద్య ఏవ పిబేజ్జీర్ణే పయసా౽ద్యాత్సశర్కరమ్.　　　15

వ్యా. ఉరఃక్షతముకల్గినవెంటనే లక్కను తేనెతోను పాలతోను గలిపి త్రాగవలయును. అది జీర్ణమైనపిదప పాలను చక్కెరను కలిపి ఆహారమును భుజించవలయును.

—ఊ క్షతక్షయమున విశేషచికిత్స. ఊ—

మూ. పార్శ్వవస్తిరుజీ చాల్పపిత్తాగ్నిస్తాం సురాయుతాం,
భిన్నవిట్కః సముస్తాతివిషా పాఠాం సవత్సకామ్. 16

వ్యా. క్షతక్షయరోగమున ఇరుప్రక్కలయందును, వస్తియందును, నొప్పికల్గి పిత్తంబును జఠరాగ్నియు స్వల్పముగ నున్నపుడు పైజెప్పిన లక్కను సురామద్యముతో కలిపి త్రాగవలయును. మరియు మలము అధికముగ వెడలుచున్నపుడు లక్కతో కూడ తుంగగడ్డలు, అతివస, చిరుబొద్ది, కొడిశపాలవిత్తులు వీనినన్నిటిని సమభాగములుగ జేర్చి సేవింపనగును.

ఇచ్చట "సవత్సకా" మనుచోట "ద్వివత్సకా"మని కొందరు పఠించెదరు. అట్టియెడ కొడిశపాలను రెండుభాగములుగ చేర్చుకొనవలయునని యర్థము. కొందరు కొడిశపాలలో స్త్రీపురుషభేదములచే రెండుభేదములు కల్గియున్నదనియు, అందు తెల్లనిపువ్వులు కల్గినది పురుషజాతియనియు ఎఱ్ఱనిపువ్వులుగల్గి శ్యామవర్ణంబై మిక్కిలి చిన్నవియగు పువ్వులును కాయలును గల్గినది స్త్రీజాతియనియు అవిరెండును 'ద్వివత్సకా.'అనుపదముచే గ్రహింపబడునని చెప్పెదరు. వత్సకభేదము ఈతంత్రకారులు కల్పస్థానమున ఇట్లు చెప్పిరి:—"బృహత్ఫలః శ్వేతపుష్పః స్నిగ్ధపత్రః పుమాన్ భవేత్, శ్యామా చారుణపుష్పా స్త్రీ ఫలపుష్పైస్తథాణుభిః." (క. అ. ౫.)

—ఊ క్షతక్షయమున లాక్షాప్రయోగము. ఊ—

మూ. లాక్షాం సర్పిర్మధూచ్ఛిష్టం జీవనీయగణం సితాం,
త్వక్క్షీరీం సమతాం క్షీరే పక్త్వా దీప్తానలః పిబేత్. 17

వ్యా. లక్క, తేనె, మైనము, జీవనీయగణద్రవ్యములు, చక్కెర, తవక్షీరి వీనిని నేతిలో కలిపి పాలను కూడ చేర్చి ఘృతపాకవిధిగ పక్వముచేసి అగ్నిదీప్తి కల్గియుండునపుడు క్షతక్షయరోగి త్రాగవలయును.

—ఊ క్షతక్షయమున సంధానకక్షీరయోగము. ఊ—

మూ. ఇక్ష్వాలికాబిసగ్రన్థిపద్మకేసరచన్దనైః,
శృతం పయో మధుయుతం సంధానార్థం పిబేత్ క్షతీ. 18

వ్యా. రెల్లు, తామరకాడలు, గ్రంథితగరము, పద్మకేసరములు (తామరపువ్వులోనికేసరములు) చందనము, వీనినన్నిటిని సమభాగములుగ జేర్చి పాలలో గలిపి క్షీరపాకవిధిగ పక్వముచేసి అందు తేనె కలిపి త్రాగినచో అభిఘాతముచే రొమ్ము పగిలియున్నయెడ దానిని చక్కపరచును.

## క్షతక్షయమున యవచూర్ణయోగము.

మూ. యవానాం చూర్ణమాదాయ క్షీరసిద్ధం ఘృతప్లుతం,
జ్వరే దాహే సితాక్షౌద్రసక్తూన్వా పయసా పిబేత్. 19

వ్యా. క్షతక్షయమున జ్వరంబును రొమ్మునంటయు కల్గినప్పుడు యవలయొక్క చూర్ణమును పాలలో కలిపి పక్వముచేసి అందు ఘృతమును చేర్చియైనను, సత్తుపిండిని పాలలో గలిపి అందు చక్కెరను, తేనెను కలిపియైనను త్రాగవలయును.

## క్షతక్షయమున మధూకాద్యవలేహము.

మూ. మధూకమధుకద్రాక్షాత్వక్క్షీరీపిప్పలీబలాః,
కాసీ పార్శ్వాస్థిశూలీ చ లిహ్యాత్సఘృతమాక్షికాః. 20

వ్యా. ఇప్పపువ్వులు, అతిమధురము, ద్రాక్షపండు, తవక్షీరి (వెదురుప్పు), పిప్పళ్లు, చిట్టాముట్టి, వీనినన్నిటిని సమభాగములుగ చేర్చి కాసము, శ్వాసము, పార్శ్వశూల, అస్థిశూల, ఈయుపద్రవములతో కూడిన క్షతక్షయమునందు పైజెప్పిన చూర్ణమున నెయ్యి తేనె కలిపి సేవించునది.

## క్షత-క్షయమున ఏలాదివటి.

మూ. ఏలాపత్రత్వచోఽర్ధాక్షాః పిప్పల్యర్ధపలం తథా,
సితామధుకఖర్జూరమృద్వీకాశ్చ పలోన్మితాః. 21
సంచూర్ణ్య మధునా యుక్త్వా గుడికాస్సంప్రయోజయేత్,
అక్షమాత్రాం తతశ్చైకాం భక్షయేన్నా దినే దినే. 22
కాసం శ్వాసం జ్వరం హిక్కాం ఛర్దిం మూర్ఛాం మదం భ్రమం,
రక్తనిష్ఠీవనం తృష్ణాం పార్శ్వశూలమరోచకమ్. 23
శోషప్లీహాఢ్యమాత్రాంశ్చ స్వరభేదం క్షతం క్షయం,
గుటికా తర్పణీ వృష్యా రక్తపిత్తం చ నాశయేత్. 24
(ఇతి ఏలాదిగుటికా.)

వ్యా. ఏలకులు, లవంగపత్రి, లవంగపట్ట ఇవి ప్రత్యేకము అర్ధకర్షము; పిప్పళ్లు అరపలము; చక్కెర, అతిమధురము, ఖర్జూరపుకాయలు, ద్రాక్షపండు ఇవి ప్రత్యేకమొక్కొకపలము; ఇత్తెరంగున వీనినన్నిటి నొకటిగ జేర్చి చూర్ణముచేసి, కర్షప్రమాణము మాత్రలుగ తేనె కలిపి చేసి ప్రతిదినంబును పూటకు ఒక్కొకమాత్రవంతున సేవించునది.

దీనివలన కాసము, శ్వాసము, జ్వరము, ఎక్కిళ్లు, వాంతి, మూర్ఛ, మదము (తిక్కయెత్తినట్లుండుట), భ్రమము (ఒడలు తిరుగునట్లుండుట), నోట రక్తము నుమియుట, దప్పి, ప్రక్కనొప్పి, అరోచకము, ధాతుక్షయము, ప్లీహాభివృద్ధి, అఢ్యవాతము (ఊరుస్తంభవాతము), స్వరభేదము, ఉరఃక్షతము, క్షయము (క్షతక్షయము), ఇవి యన్నియు నశించును. మరియు నీగుటిక తర్పణము (ఆప్యాయతనొందించునవియు), వృష్యము నగును. (ఇచ్చట అఢ్యవాతమనుదానికి వాగ్భటాచార్యులు—"తమూరుస్తంభమిత్యాహుః ఆఢ్యవాత మదాపరే" (అష్టాంగ. ని. అ. ౧౫. శ్లో. ౫౧.) అని యూరుస్తంభమునకు ఆఢ్యవాత మనునది పర్యాయపదముగ జెప్పిరి. మాధవనిదానాదుల యందు నిట్లే యున్నది.) "మధునా యుక్త్వా" అని చెప్పుటవలన నెంత తేనె చేర్చినచో మాత్రలుగ చేయుటకు సౌకర్యముగ నుండునో అంత తేనె చేర్చవలెనని తెలిసెడి.

### క్షతక్షయహరములగు కొన్ని యోగములు.

మూ. రక్తేఽతివృత్తే దక్షాణాం యూషైస్తోయేన వా పిబేత్,
చటకాణ్డరసం వాపి రక్తం వా చ్ఛాగజాఙ్గలమ్. 25
చూర్ణం పౌనర్నవం రక్తశాలితణ్డులశర్కరం,
రక్తష్ఠీవీ పిబేత్సిద్ధం ద్రాక్షారసపయోఘృతైః. 26

వ్యా. క్షతక్షయమున రక్త మధికముగ వెడలునెడ కోడిగ్రుడ్డులోని రసమును యూషములతో కలిపి త్రాగవలెను. లేక ఊరపిచ్చుకగ్రుడ్డు రసమునైనను, మేకనెత్తురునైనను, జింక మున్నగు జాంగలజంతువుల రక్తమునైనను యూషములతో కలిపి త్రాగవలెను.

మరియు తెల్లగలిజేరువేళ్లు ఎఱ్ఱవరివడ్లబియ్యము ఈరెంటిని చూర్ణముచేసి ద్రాక్షారసమును ఆవుపాలను నెయ్యిని చేర్చి పక్వముచేసి సేవించవలెను. (ఇచ్చట పునర్నవ-రక్తశాలితండులచూర్ణమును, చక్కెరను ద్రాక్షారసము పాలు ఈరెంటితో కలిపి పాకము పట్టి అందు (పైచూర్ణమును) కలిపి నెయ్యిచేర్చి అవలేహపాకముగ పక్వముచేసి సేవించునది. ఈవిధానమునే జతూకర్ణతంత్రమున నిట్లుచెప్పిరి:—"పునర్నవా రక్తశాలీ ద్రాక్షా సితాచూర్ణం పయోఘృతయుతం సిద్ధం.")

### వాతహరయోగములు.

మూ. మధూకమధుకక్షీరసిద్ధం వా తణ్డులీయకం,
మూఢవాతస్త్వజామేదః సురాభృష్టం ససైన్ధవమ్. 27

క్షామః క్షీణః క్షతోరస్క_స్త్వనిద్రః సబలేఽనిలే,
శృతక్షీరసరేణాద్యాత్ సక్షౌద్రఘృతశర్కరమ్. 28

వ్యా. ఇప్పపువ్వులు, అతిమధురము, చిట్టిపేల్లు వీనిని చూర్ణముచేసి పాలతో చేర్చి కాచి క్షతక్షయమున త్రాగవలెను. మూఢవాతమున మేకమేదస్సును సురామద్యమును చేర్చి వేయించి అందు సైంధవలవణమును చేర్చి సేవించవలెను. మరియు శరీరము కృశించి ధాతువులు క్షీణించి ఉరఃస్థలమున నభిఘాతముచేత క్షతమైయున్నపుడు నిద్ర పట్టక బాధపడుచున్నయెడ పాలుకాచి దానిమీగడలో తేనెను ఘృతమును చక్కెరను చేర్చి పైని పక్వముచేయఁబడిన మేకమాంసమును తినవలెను.

### క్షతక్షయహరలేహము.

మూ. శర్కరాం యవగోధూమౌ జీవకర్షభకౌ మధు,
శృతక్షీరాఽనుపానం వా లిహ్యాత్ క్షీణః క్షతీ కృశః. 29

వ్యా. యవలు, గోధుమలు, జీవకము, ఋషభకము వీనిని చూర్ణముచేసి అందు చక్కెరను తేనెను కలిపి తిని కాగినపాలను అనుపానముగ త్రాగవలెను. క్షతక్షయమును కృశత్వమును హరించును.

### మాంసరక్తవర్ధకయోగము.

మూ. క్రవ్యాదమాంసనిర్యూహం ఘృతభృష్టం పిబేచ్చ సః,
పిప్పలీక్షౌద్రసంయుక్తం మాంసశోణితవర్ధనమ్. 30

వ్యా. మాంసమును తినునట్టి పక్షిమృగాదులమాంసరసమును నేతితో పక్వముచేసి అందు పిప్పలిచూర్ణమును తేనెను కలిపి సేవించినచో క్షతక్షీణులకు కృశించినమాంసరక్తములు వృద్ధినొందును.

### శుక్రవృద్ధికరఘృతము.

మూ. న్యగ్రోధోదుమ్బరాశ్వత్థప్లక్షశాలప్రియఙ్గుభిః,
తాలమస్తకజమ్బ్వాత్వక్ ప్రియాలైశ్చ సపద్మకైః. 31
సాఽశ్వకర్ణైః శృతాత్ క్షీరాత్ దద్యాజ్జాతేన సర్పిషా,
శాల్యోదనం క్షతోరస్కః క్షీణశుక్రశ్చ మానవః. 32

వ్యా. మఱ్ఱిపట్ట, అత్తిపట్ట, రావిపట్ట, జువ్విపట్ట, ఏపిపట్ట, ప్రేంకణము, తాటిచెట్టుకొనయందు లేతమోపు, నేరేడుపట్ట, చారపప్పు, పద్మకము, మద్దిపట్ట వీనినన్నిటిని

చేర్చి ఆవుపాలను కాచి అందుండి చిలికి తీయబడినవెన్నను కాచిననేతిని కలిపి యెఱ్ఱ వరిబియ్యపుఅన్నమును ఉరఃక్షతమునను శుక్రక్షయమునందును భుజింపవలెను.

## ఉరఃక్షతమున యష్ట్యాదిఘృతము.

మూ. యష్ట్యాహ్వానాగబలయోః క్వాథే క్షీరసమం ఘృతం,
పయస్యాపిప్పలీవాంశీకల్కసిద్ధం క్షతే శుభమ్. 33

వ్యా. అతిమధురము, జిబిలిక ఈరెంటిని క్వాథవిధిప్రకారము కషాయముకాచి వడగట్టి యాకషాయమునకు సమభాగము క్షీరంబును ఈరెంటికిని నాల్గవవంతు ఆవునేతిని కలిపి, అందు పాలకూర పిప్పళ్లు వెదురుప్పు ఈమూటిని సమభాగములుగ గూర్చి చేయబడినకల్కమును ఘృతమునకు నాల్గవవంతును కలిపి ఘృతపాకవిధిప్రకారము పక్వము చేయబడినఘృతమును ఉరఃక్షతమున నుపయోగించుట చాల మంచిది.

## కోలాదిఘృతము.

మూ. కోలలాక్షారసే తద్వత్ క్షీరాష్టగుణసాధితమ్,
కల్కైః కట్వఙ్గ(ఙ్గ)దార్వీత్వగ్వత్సకత్వక్ఫలైః ఘృతమ్ 34

వ్యా. రేగుచెక్క, లక్క ఈరెంటిని కషాయముకాచి యీకషాయమును ఘృతమునకు నాల్గింతలును, ఆవుపాలు ఘృతమునకు ఎనిమిదింతలును, పాలకు నాల్గవపాలు ఘృతమునుచేర్చి అందు దుందిలపుపట్ట, మ్రానిపసుపుపట్ట, కొడిసెపాలపట్ట, దానివిత్తులు ఈనాల్గిటిని సమభాగములుగ గూర్చి చేయబడినకల్కమును ఘృతమునకు నాల్గవవంతు కలిపి, ఘృతపాకవిధిగ పక్వముచేయబడిన ఘృతము ఉరఃక్షతమున నుపయోగించుట చాల ప్రశస్తము.

ఇచ్చట కోలలాక్షారసము ఘృతమునకు నాల్గింతలును, పాలు ఘృతమునకు ఎనిమిదింతలును, దుండిగము మున్నగువానికల్కము ఘృతమునకు నాల్గవపాలును చేర్చి పక్వము చేయనగును. లేక క్షీరము అష్టగుణమని చెప్పియున్నది కావున తత్సాహచర్యముచే కషాయంబును ఘృతమునకు అష్టగుణితముగ జేర్పనగును.

## అమృతప్రాశఘృతము.

మూ. జీవకర్షభకౌ వీరాం జీవంతీం నాగరం శటీం,
చతస్రః పర్ణినీర్మేదే కాకోల్యౌ ద్వే నిదిగ్ధికే. 35
పునర్నవే ద్వే మధుకం సాత్మగుప్తాం శతావరీం,
ఋద్ధిం పరూషకం భార్గీం మృద్వీకాం బృహతీం తథా. 36

శృఙ్గాటకం తామలకీం పయస్యాం పిప్పలీం బలాం,
బదరాక్షోటఖర్జూరవాతామాభిషుకాణ్యపి. 37
పలాని చైవమాదీని కల్కాన్ కుర్వీత కార్షికాన్,
ధాత్రీరసవిదారీక్షుఛాగమాంసరసం పయః. 38
కుర్యాత్ప్రస్థోన్మితం తేన ఘృతప్రస్థం విపాచయేత్,
ప్రస్థార్ధం మధునః శీతే శర్కరార్ధతులాం తథా. 39
ద్వికార్షికాణి పత్రైలా హేమత్వఙ్మరిచాని చ,
(పలార్ధకం చ మరిచత్వగేలాపత్రకేసరాన్)
వినీయ చూర్ణితం తస్మాత్ లిహ్యాన్మాత్రాం సదా నరః; 40
అమృతప్రాశమిత్యేతన్నరాణామమృతం ఘృతం,
సుధామృతరసం ప్రాశ్యం క్షీరమాంసరసాశినా. 41
నష్టశుక్రక్షతక్షీణదుర్బలవ్యాధికర్శితాన్,
స్త్రీప్రసక్తాన్ కృశాన్ వర్ణస్వరహీనాంశ్చ బృంహయేత్. 42
కాసహిక్కాజ్వరశ్వాసదాహతృష్ణాస్రపిత్తనుత్,
పుత్రదం వమిమూర్ఛాహృద్యోనిమూత్రామయాపహమ్. 43
(ఇత్యమృతప్రాశఘృతమ్.)

వ్యా. జీవకము, ఋషభకము, పెద్దగుమ్ముడు, మునుబాల, శుంఠి, కచోరాలు, ...ర్ణీచతుష్టయము (కోలపొన్న, ముయ్యాకుపొన్న, నక్కతోకపొన్న, అడవిమినుము), ...ంద, మహామేద, కాకోలి, క్షీరకాకోలి, పెద్దవాకుడు, చిన్నవాకుడు, గలిజేరు, యెఱ్ఱ ...లిజేరు, అతిమధురము, పెద్దదూలగొండి, పిల్లిపీచరగడ్డ, ఋద్ధి, చిట్టీత, గంటుబారంగి, ...క్షపండు, ములక (ములువంగ), నమ్మదంప (నిమ్మటాయలు), నేలయుసిరిక, నేల ...మ్ముడు, పిప్పళ్లు, చిట్టాముట్టి, రేగుపండ్లు, అక్రోటుపండు, ఖర్జూరపుపండు, బాదం ...ప్పు, భిషుక (పిస్తాపప్పు) ఈపండ్లను సమానగుణములైన (మధురస్నిగ్ధాదిగుణములుగల), ...రములగుపండ్లను పైజెప్పినద్రవ్యములను దినుసుకు ఒక్కొక్కకర్షమువంతున చేర్చి ...క్కముచేయునది. మరియు, ఉసిరికకాయలరసము, నేలగుమ్ముడురసము, చెరకురసము, ...కపోతుమాంసరసము, పాలు ఈద్రవములను ఒక్కొక్కప్రస్థమువంతున జేర్చి అందు ...స్థపరిమితమైన ఆవునేతిని పైజెప్పినకల్కమును ఘృతమునకు నాల్గవవంతును చేర్చి ...ృతపాకవిధిప్రకారము పక్వముచేసి యుంచునది. ఈఘృతము చల్లారినపిదప అర్ధప్రస్థము

(8 పలములు) తేనె, అర్ధతులము (50 పలములు) పంచదారను కలిపి అందు లవంగపత్రి, ఏలకులు, జాపత్రి, మిరియాలు, లేక (మిరియాలు, లవంగపట్ట, ఏలకులు, లవంగపత్రి, నాగకేసరములు) వీనిని ఒక్కొక్కటి రెండేసికర్షముల (అర్ధపలము) వంతున చూర్ణముచేసి కలిపి సిద్ధముచేయునది. ఇయ్యది అమృతప్రాశఘృత మనబడును. దేవతలకు అమృతము ఎట్టిదో మనుజులకు ఈఘృతము అట్టిది. దీనిని ప్రతిదినమును తగుమైన ప్రమాణముతో సేవించుచు క్షీరమును, మాంసమును చేరినయాహారమును భుజించవలయును.

ఇయ్యది శుక్రము క్షీణించినవారు, క్షతక్షీణులు, బలహీనులు, వ్యాధిచే కృశించినవారు, స్త్రీప్రచారముచే కృశించినవారు, శరీరవర్ణంబును, కంఠస్వరంబును చెడినవారును, కాసము, ఎక్కిళ్లు, జ్వరము, శ్వాసము, తాపము, దప్పి, రక్తపిత్తము, వాంతి, మూర్ఛ, హృద్రోగము, యోనిరోగములు, మూత్రరోగులు అను నీవ్యాధులచే పీడింపబడినవారును, వీరికందరకును అమృతమునుబోలె శరీరమును పుష్టిని కాంతిని గలిగించి పైజెప్పిన కాస హిక్కాదిరోగముల నన్నిటిని హరించును. సంతానములేనివారికి శుక్ర ఆర్తవదోషములను హరించి సంతానము కలిగించును.

ఇచ్చట ద్రవములు అనేకములుగ నుండుటచేత "పఞ్చప్రకృతి యత్ర స్యుః ద్రవాణి స్నేహసంవిధౌ, తత్ర స్నేహసమాన్యాహుః." అనుపరిభాష ననుసరించి ఒక్కొక్కరసమును ప్రస్థపరిమితమైన ఘృతమునకు సమానముగ చేర్పనగును. ఈయర్థము పరిభాషాసిద్ధమయినను, ఆట్టిపరిభాషను దృఢపరచుటకై మరల "కుర్యాత్ప్రస్థోన్మితం" అని వాచనికముగ చెప్పబడినది. మరియు "ద్వికార్షికాణి.........మరిచాని చ." అనుచోట లవంగపత్రి మున్నగునవి చేరి సముదాయము అర్ధపలముగ నుండవలయునని కొందరును, ప్రత్యేకము అర్ధపలమువంతున జేర్పవలయునని కొందరు చెప్పెదరు.

## శ్వదంష్ట్రాదిఘృతము.

మూ. శ్వదంష్ట్రోశీరమఞ్జిష్ఠాబలాకాశ్మర్యకత్తృణం,
దర్భమూలం పృథక్పర్ణీం పలాశర్షభకౌ స్థిరామ్. 44
పలికం సాధయేత్తేషాం రసే క్షీరచతుర్గుణే,
కల్కైః స్వగుప్తాజీవన్తీమేదర్షభకజీవకైః. 45
శతావర్యృద్ధిమృద్వీకాశర్కరాశ్రావణీబిసైః,
ప్రస్థస్సిద్ధో ఘృతాద్వాతపిత్తహృద్ద్రవ(హృద్భవ)శూలనుత్. 46

మూత్రకృచ్ఛ్రప్రమేహార్శఃకాసశోషక్షయాపహాః,
ధనుస్త్రీమద్యభారాధ్వఖిన్నానాం బలమాంసదః. 47
(ఇతి శ్వదంష్ట్రాదిఘృతమ్.)

వ్యా. పల్లేరు, వట్టివేరు, మంజిష్ఠి, చిట్టాముట్టి, గుమ్ముడు, కామంచిగడ్డి, దర్భవేళ్లు, కోలపొన్న, మోదుగ, ఋషభకము, నేలపొన్న (ముయ్యాకుపొన్న) వీనిని ప్రత్యేక మొక్కొకపలముపంతున గూర్చి క్వాథపరిభాషానుసారము నాలుగింతలు నీళ్లు పోసి నాల్గవపాలు మిగులునట్లు కషాయము సిద్ధముచేసి యాకషాయము ఆవుపాలు ఘృతమునకు నాల్గుభాగములు, ఒకప్రస్థము ఆవునెయ్యి వీనినన్నిటి నొకటిగ కలిపి అందు దూలగొండి, పాలకూర, మేద, ఋషభకము, జీవకము, పిల్లిపీచరగడ్డలు, ఋద్ధి, ద్రాక్షపండు, చక్కెర, బోడతరము, తామరకాడలు వీనినన్నిటిని సమభాగములుగ గూర్చి కల్కముచేసి యాకల్కమును ఘృతమునకు నాల్గవవంతు కలిపి ఘృతపాకవిధిప్రకారము పక్వముచేసి సేవించినయెడ వాతపిత్తములచే గల్గినహృద్రోగమును శూలను హరించును. మరియు మూత్రకృచ్ఛ్రము, ప్రమేహము, అర్శోరోగము, కాసను, శోఫ, క్షయము వీనినన్నిటిని హరించును. ధనుస్సు నాకర్షించుటచేతను, స్త్రీసంభోగముచేతను, మద్యము నధికముగ త్రాగుటచేతను, త్రోవనడచుటచేతను, భారమును మోచుటచేతను, శరీరము మిక్కిలి కృశించినవారికి శరీరబలంబును మాంసంబును వృద్ధినొందును.

ఇచ్చట "నిక్షిప్య క్వాథయేత్తోయం క్వాథ్యద్రవ్యాచ్చతుర్గుణం, పాదశిష్టం గృహీత్వాతు స్నేహస్తే నైవ సాధయేత్." అను క్వాథపరిభాష ననుసరించి పైజెప్పిన శ్వదంష్ట్రాదిక్వాథ్యద్రవ్యములన్నియు చేరి పదునొకండుపలము లగునుకావున అందు నాల్గింతలు (నలువదినాల్గుపలములు) పలములు జలమును చేర్చి నాల్గవపాలు మిగుల కాచి అందు ప్రస్థపరిమితఘృతమును నాల్గుప్రస్థములు పాలును, నాల్గవవంతు కల్కమును చేర్పనగును.

### మధుకాదిఘృతము.

మూ. మధుకాష్ట(మధూకాష్ట)పలద్రాక్షాప్రస్థక్వాథే ఘృతం పచేత్,
పిప్పల్యష్టపలే కల్కే ప్రస్థం, సిద్ధే చ శీతలే. 48
పృథగష్టపలం క్షౌద్రశర్కరాభ్యాం విమిశ్రయేత్,
సమం సక్తు క్షతక్షీణే రక్తగుల్మే చ తద్ధితమ్. 49

వ్యా. అతిమధురము ఎనిమిదిపలములును, ద్రాక్షపండు ఒకప్రస్థము (పదునారు పలములును) చేర్చి అందు నాల్గింతలు నీళ్లుబోసి నాల్గవవంతు మిగుల కషాయముకాచి

రసాకషాయమున ప్రస్థపరిమితమైన నెయ్యి చేర్చి, అందు పిప్పళ్లకల్కమును ఎనిమిదిపలములు కలిపి ఘృతపాకవిధిప్రకారము పక్వముచేసియుంచి చల్లబడినపిదప ఎనిమిదిపలములు తేనెను ఎనిమిదిపలములు చక్కెరను కలిపి ఘృతమునకు సమభాగముగ సత్తుపిండిని చేర్చి క్షతక్షీణమునందును రక్తగుల్మమునందును సేవించుట చాల హితకరము.

ఇచ్చట అతిమధురంబును ద్రాక్షపండును చేరి క్వాథ్యద్రవ్యములు ఒకటిన్నర ప్రస్థము (ఇరువదినాల్గుపలములు) అగును. అందు క్వాథపరిభాషానుసారముగ నాల్గింతలు (ఆరుప్రస్థములు) జలముచేర్చి పాదావశిష్టముగ కాచినకషాయము ఒకటిన్నరప్రస్థమగును. అందు ప్రస్థపరిమితఘృతమును, పిప్పలీకల్కమును ఎనిమిదిపలములును చేర్చి సిద్ధముచేసి చల్లనైనపిదప తేనెను చక్కెరను వేరువేరుగ నెనిమిదేసిపలములును, సత్తుపిండి ఘృతమునకు సమంబుగను చేర్చి సేవింపవలెనని యెరుంగునది.

## ధాత్ర్యాదిఘృతము.

మూ. ధాత్రీఫలవిదారీక్షుజీవనీయరసైర్ఘృతం,
అజాగోపయసోశ్చైవ సప్తప్రస్థాన్ పచేద్భిషక్. 50
సిద్ధశీతే సితాక్షౌద్రద్విప్రస్థం వినయేచ్చ తత్,
యక్ష్మాఽపస్మారపిత్తాసృక్కాసమేహాక్షయాపహమ్. 51
వయస్థాపనమాయుష్యం మాంసశుక్రబలప్రదం,
ఘృతం తు పిత్తేఽభ్యధికే లిహ్యాత్, వాతేఽధికే పిబేత్. 52
లీఢం నిర్వాపయేత్పిత్తం అల్పత్వాద్ధన్తి నాఽనలం,
ఆక్రామత్యనిలం పీతం ఊష్మాణం నిరుణద్ధి చ. 53

వ్యా. ఉసిరికపండ్లరసము, నేలగుమ్మడుగడ్డరసము, చెరకురసము, జీవనీయగణద్రవ్యములరసము (కషాయము), ఆవునెయ్యి, మేకపాలు, ఆవుపాలు ఈయేడిటిని వేరువేరు ఒక్కొక్కప్రస్థముపంతున చేర్చి యేడుప్రస్థముల పరిమితిగల సముదాయమును ఘృతపాకవిధిప్రకారము పక్వముచేసి చల్లారినపిదప అందు చక్కెర పదునారుపలంబులును, తేనెను పదునారుపలంబులును కలిపి సేవించినయెడ రాజయక్ష్మమును, అపస్మారములను, రక్తపిత్తమును, కాసమును, ప్రమేహమును, క్షయములను హరించును. వయస్సును స్థిరముగ నిలుపును. ఆయుంవును వృద్ధినందించును. మాంసమును పుష్టినందించి శుక్రమును శరీరబలమును కల్గించును.

పైజెప్పబడిన ఘృతములను పిత్త మధికముగ నున్నపుడు నాకుటకు యోగ్యముగ పేరి యుండునపుడు మితపరిమాణము కల్పించి నాలుకతో నాకవలెను. అట్లు సేవించిన యెడ పిత్తమును శమింపజేసి పరిమాణము స్వల్పముగ నుండుటవలన జాఠరాగ్నిని చల్లార్పకుండును.

మరియు వాత ముత్కటముగ నుండునెడ ఘృతమును కరిగించి త్రాగుటకు యుక్తముగ నున్నపుడు అధికపరిమాణముతో త్రాగవలెను. అట్టి పానమువలన వాతమును శమింపజేసి వాతసంబంధముచే తీవ్రముగ జ్వలించుచుండు జాఠరాగ్నిని సమస్థితికి దెచ్చును. ఇదియే ఘృతపానవిధి సామాన్యముగ నెరుంగునది.

(లేక యీవిధముగ నర్థముచేయునది:—పైజెప్పబడిన అమృతప్రాశనాదిఘృతములు లేహయోగ్యములు (నాలుకతో నాకిన చప్పరించతగినవి.) పానయోగ్యములు (త్రాగుటకు యుక్తముగ ద్రవరూపములు)నని రెండువిధములు. అందు శర్కర, సత్తువు, తేనె, మున్నగువాని జేర్పమని చెప్పినవి లేహయోగ్యములు. వీనిని పిత్తాధికమున నుపయోగింపందగును. చక్కెర మున్నగువానిని చెప్పనిఘృతములు ద్రవరూపములగుటచే పానయోగ్యములుగ నుండును. వీనిని వాతప్రకోపమున నుపయోగించినచో వాతమును శమింపజేసి జాఠరాగ్నిని సమస్థితి నుంచును. అనియర్థము.)

### 1. క్షతక్షీణాదులకు సర్పిర్గుడములు.

మూ. క్షామక్షీణకృశాఙ్గానాం ఏతాన్యేవ ఘృతాని తు,
త్వక్ క్షీరీశర్కరా(పిప్పలీ)లాజాచూర్ణైః స్త్యానాని యోజయేత్.
సర్పిర్గుడాన్ సమధ్వంశాన్, జగ్ధ్వా చాను పయః పిబేత్,
రేతో వీర్యం బలం పుష్టిం తైరాశుతరమాప్నుయాత్. 55

వ్యా. పైజెప్పిన ఘృతయోగములయందు తవక్షీరి, చక్కెర, పేలాలు వీనిచూర్ణమును ఘృతము ముద్దయగునంత పరిమితముగ జేర్చి తవక్షీరి మున్నగు చూర్ణములకు సమభాగముగ తేనెను కూడ కలిపి యుండలుచేసిన నయ్యది సర్పిర్గుడ మనబడును. దీనిని శరీరము బడలియున్నపుడును, కృశించినపుడును, సేవింపనగును. వీనిని సేవించినవెంటనే ఆవుపాలను త్రాగవలెను. దీనివలన రేతస్సును వీర్యంబును బలంబును వెంటనే వృద్ధియగును. శరీరము శీఘ్రముగ పుష్టినందును.(ఇచ్చట గుడమన వటికాపర్యాయనామము. "తన్నామ వటికా వటీ, మోదకో వటికాపిణ్డీ గుడో వర్తిః తథోచ్యతే." అని పరిభాష.)

## 2. బలాదిసర్పిర్గుడయోగము.

మూ. బలా విదారీ హ్రస్వా చ పఞ్చమూలీ పునర్నవా,
పఞ్చానాం క్షీరివృక్షాణాం శుఙ్గాః ముష్ట్యంశకా అపి. 56
ఏషాం కషాయే ద్విక్షీరే విదార్యాజరసాంశికే,
జీవనీయైః పచేత్కల్కైః అక్షమాత్రైః ఘృతాఢకమ్. 57
సితాపలాని పూతే చ శీతే ద్వాత్రింశకం క్షిపేత్,
గోధూమపిప్పలీవాంశీచూర్ణం శృఙ్గాటకస్య చ. 58
సమాక్షికం కౌడవికం తత్సర్వం ఖజమూర్ఛితం,
స్త్యానం సర్పిర్గుడాన్ కృత్వా భూర్జపత్రేణ వేష్టయేత్. 59
తాన్ జగ్ధ్వా పలికాన్ క్షీరం మద్యం చానుపిబేత్ కఫే,
శోషే కాసే క్షతే క్షీణే శ్రమస్త్రీభారకర్శితే. 60
రక్తనిష్ఠీవనే తాపే పీనసే చోరసి స్థితే,
శస్తాః పార్శ్వశిరశ్శూలే భేదే చ స్వరవర్ణయోః. 61
(ఇతి ద్వితీయసర్పిర్గుడాః.)

వ్యా. చిట్టాముట్టి, నేలగుమ్మడి, హ్రస్వపంచమూలములు (ముయ్యాకుపొన్న, కోలపొన్న, వాకుడు, పెద్దములక, పల్లేరు), గలిజేరు, క్షీరవృక్షములయొక్క (మఱ్ఱి, అత్తి, జువ్వి, రావి, ఇప్ప అను నీయైదువృక్షములయొక్క) ఊడలు, ఈపదుమూడు ద్రవ్యములను ప్రత్యేక మొక్కొకపలమువంతున జేర్చి అందు కెనిమిదింతలు (నూట యిరువదినాల్గుపలములు) నీళ్లుపోసి యిరువదినాల్గుపలములు మిగులునట్లు కషాయము కాచి వడగట్టి, అందు మేకపాలును ఆవుపాలును వేరువేరుగ కషాయమునకు సమభాగముగను, నేలగుమ్మడిరసము మేకమాంసరసమును జేరి కషాయమునకు సమభాగముగను జేర్చి, జీవనీయగణద్రవ్యముల నొక్కొకటి కర్షము (కాలుపలమువంతున) ఉండునట్లు చేర్చి కల్కముగ నూరి యీకల్కమునుకూడ పైద్రవసముదాయమున కలిపి, ఒక ఆఢక (అరువదినాల్గుపలముల) పరిమితమైన ఆవునేతిని చేర్చి, (ఈద్రవ-కల్క-ఘృతముల నన్నిటి నొకటిగ కలిపి) ఘృతపాకవిధిప్రకారము పక్వముజేసి వడకట్టి యుంచునది.

పైజెప్పిన ఘృతము చల్లారినపిదప అందు చక్కెరను ముప్పదిరెండుపలములును కలిపి; గోధుమలు, పిప్పళ్లు, వెదురుప్పు, నమ్మదుంపలు వీనిచూర్ణము ఒకకుడవము(నాల్గు పలములు)ను తేనె నాల్గుపలములును కలిపి కవ్వముతో నన్నియు కలియునట్లు చిలికి,

ఆసముదాయ మొక్కటిగ కలిసి పేరి ముద్దయైనపిదప భుజపత్రి ఆకుతో కట్టి యుంచునది.

ఆయౌషధము నొక్కపలము ఒకఉండవంతున ఉండలుజేసి పూట కొకటివంతున సేవించవలెను. ఆవుపాలనైనను మద్యమునైనను ఔషధమును తినినవెంటనే త్రాగవలెను. ఇత్తెరంగున శోషము, కాసము, ఉరఃక్షతము, క్షయము, శ్రమముచేనైనను స్త్రీసంపర్కముచేనైనను భారము నధికముగ మోయుటచేనైనను శరీరము కృశించుట, రక్తము నుమియుట, తాపము, పీనసము, రొమ్ముపడిసెము, ప్రక్కశూల, తలనొప్పి, స్వరభేదము, వర్ణభేదము, అనునీవ్యాధులయందెల్ల సేవించుట చాల ప్రశస్తము.

ఇచ్చట జీవనీయగణమన:—మనుబాల, కాకోళి, క్షీరకాకోళి, మేద, మహామేద, పిల్లపెసర, కారుమినుము, జీవకము, ఋషభకము, అతిమధురము, ఇవియన్నియు చేరినగణము. క్షీరిపంచకము:—"ఉదుమ్బరోవటో౽శ్వత్థో మధూకః ప్లక్ష ఏవచ, పఞ్చైతే క్షీరిణో వృక్షాః" అని చెప్పబడినది.

ఘృతకల్పనావిధి:—ఇచ్చట ఘృతపాకమున 'చతుర్గుణే ద్రవే సాధ్యం' అను సామాన్యపరిభాషానుసారముగ కషాయాదిద్రవములుచేరి ఘృతమునకు నాల్గింత లుండవలెను. అందు ప్రధానమైనఘృతము ఆఢకపరిమితమని చెప్పబడినది. క్వాథము క్షీరద్వయము విదారి-మాంసరసములును చేరినద్రవము ఆఢకఘృతమునకు నాల్గింతలు (నాల్గాఢకములు)ఉండవలెను. చిట్టాముట్టి మున్నగు క్వాథద్రవ్యములసముదాయము పదుమూడు పలము లగును. అష్టమాంశజలపరిభాషానుసారముగ క్వాథ్యద్రవ్యములయందు ఎనిమిదింతలు జలము (నూటయిరువదిపలములు) పోసి ఘృతమునకు సమముగ నుండునట్లు (ఆఢకము మిగులునట్లు) కషాయముకాచవలెను. ఆవుపాలును మేకపాలును ఒక్కొకటి ఘృతసమానభాగములుగ నుండవలెను. విదారీరసంబును లేక మాంసరసంబును జేరి ఘృతసమముగ నుండవలెను. ఇట్లు కూర్చినచో ఘృతమునకు చతుర్గుణము ద్రవమగును. అందు జీవనీయద్రవ్యముల నొక్కొకకర్షమువంతున కల్కముచేసి చేర్చునది. "కల్కైరక్షమాత్రైః" అని కల్కపరిమాణము చెప్పబడినది. కావున పరిభాష యనవసరము. ఇది సిద్ధాంతము. మరియు క్వాథకల్పనమున పక్షాంతరముల వ్యాఖ్యాతలు కనబరచియున్నారు. విస్తరభీతిచే నిట సిద్ధాంతమును మాత్రము జూపి యంతట విరమించినాడ. మరియు నిచ్చట సిద్ధమైన యౌషధమును భూర్జపత్రమున జుట్టినచో వీర్యాధికమగునని "భూర్జపత్రేణ వేష్టయేత్" అని తంత్రకారు లుపదేశించిరి.

### 3. మూడవసర్పిర్గుడయోగము.

మూ. త్వక్ క్షీరీశ్రావణీద్రాక్షామూర్వార్షభకజీవకైః,
వీరర్ధిక్షీరకాకోలీబృహతీకపికచ్ఛుభిః. 62
ఖర్జూరఫలమేదాభిః క్షీరపిష్టైః పలోన్మితైః,
ధాత్రీవిదారీక్షురసప్రస్థైః ప్రస్థం ఘృతాత్పచేత్. 63
శర్కరార్ధతులాం శీతే క్షౌద్రార్ధప్రస్థమేవ చ,
దత్వా సర్పిర్గుడాన్ కుర్యాత్ కాసహిక్కాజ్వరాపహాన్. 64
యక్ష్మాణం తమకం శ్వాసం రక్తపిత్తం హలీమకం,
శుక్రనిద్రాక్షయం తృష్ణాం హన్యుః కార్శ్యం సకామలమ్. 65
(ఇతి తృతీయాః సర్పిర్గుటికాః.)

వ్యా. తవక్షీరి, బోడతరము, ద్రాక్షపండు, చాగ, ఋషభకము, జీవకము, నేలగుమ్మడిగడ్డ, ఋద్ధి, క్షీరకాకోలి, పెద్దములక, దూలకోవిలవిత్తులు, ఖర్జూరపుపండు, మేద, వీనిని ప్రత్యేకము పలమువంతున గ్రహించి ఒకప్రస్థము ఆవుపాలతో నూరి కల్కము జేసి, ఈకల్కమును ఉసిరికకాయలరసము ఒకప్రస్థంబును, నేలగుమ్మడిగడ్డరసము ఒకప్రస్థమును, చెరకురసము ఒకప్రస్థమును, ఒకప్రస్థము ఆవునేతిని ఒకటిగ కలిపి ఘృతపాకవిధిప్రకారము పక్వముచేసి వడకట్టి చల్లారినపిదప అర్ధతులము(ఏబదిపలములు) చక్కెరను, అర్ధప్రస్థము (ఎనిమిదిపలములు) తేనెను పైఘృతమున కలిపి (అన్నియు నొకటిగ కలియునట్లు కవ్వముతో కలియబెట్టి) పైజెప్పినవిధముగ సర్పిర్గుడముల చేయ నగును.

దీనిని సేవించినచో కాసము, ఎక్కిళ్లు, జ్వరము, రాజయక్ష్మము, తమకము, శ్వాసము, రక్తపిత్తము, హలీమకమను పాండుభేదము, శుక్రక్షయము, నిద్రానాశము, దప్పి, శరీరకార్శ్యము, కామల, అనునీవ్యాధుల నన్నింటిని హరించును.

### 4. నాల్గవసర్పిర్గుడయోగము.

మూ. నవమామలకం ద్రాక్షామాత్మగుప్తాం పునర్నవాం,
శతావరీం విదారీం చ సమజ్ఞాం పిప్పలీం తథా. 66
పృథగ్దశపలాన్ భాగాన్ పలాన్యష్టౌ చ నాగరాత్,
యష్ట్యాహ్వసౌవర్చలయోః ద్విపలం మరిచస్య చ. 67

క్షీరతైలఘృతానాం చ త్ర్యాఢకే శర్కరాశతే,
క్వథితే; తాని చూర్ణాని దత్వా బిల్వసమాన్ గుడాన్. 68
కుర్యాత్; తాన్ భక్షయేత్ క్షీణః క్షతః శుష్కశ్చ మానవః,
తేన సద్యో రసాదీనాం వృద్ధ్యా పుష్టిం స విన్దతి. 69
(ఇతి చతుర్థసర్పిర్గుడాః.)

వ్యా. క్రొత్తఉసిరికపండ్లు, ద్రాక్షపండు, దూలగొండివిత్తులు, గలిజేరు, పిల్లిపీచర గడ్డలు, నేలగుమ్మడిగడ్డ, మంజిష్ఠి, పిప్పళ్లు, ఇవి ప్రత్యేకము పదేసిపలములు, శుంఠి ఎనిమిదిపలములు, అతిమధురము, సౌవర్చలలవణము ఈరెండును ఒక్కొకపలమువంతున ...రి రెండుపలములు, మిరియాలు ఒకపలము, (ఈభాగముల ప్రకారము వీనినన్నిటిని ...ర్చి యెండించి చూర్ణముచేసి వస్త్రగలితముచేసి యుంచుకొనునది); పాలు ఒకఆఢ ము (అరువదినాల్గుపలములు)ను, నువ్వులనూనె యొకఆఢకమును, ఆవునెయ్యి ఒకఆఢ మును చేరి మూడుఆఢకముల పరిమితమునందు నూరుపలములు చక్కెరచేర్చి చక్కగ క్వమై క్షీరభాగమంతయు చుండినపిదప పైజెప్పినచూర్ణమును కలిపి పక్వముచేసి దించి ల్లారినపిదప బిల్వ(ఒకపలము)పరిమితములుగ నుండలుచేసి పదిలముగ నుంచునది.

ఈసర్పిర్గుడములను క్షతక్షీణులును శరీరము శుష్కించినవారును అగ్నిబలాను ...రముగ ప్రతిదినంబును పూటకొకటివంతున తిన్నయెడ శరీరమునందలి రసాదిధాతువు ప్పుడె వృద్ధినొంది పుష్టిని పొందును. (ఇది నాల్గవసర్పిర్గుడయోగము).

ఇచ్చట "యష్ట్యాహ్వసౌవర్చలయోః ద్విపలం" అన్నచోట యష్టి-సౌవర్చల ములు రెండును చేరి రెండుపలములని యర్థము. ఈవిషయము జతూకర్ణతంత్రమున:— ఘృతతైలపయస్త్ర్యాఢకే సితాంచ తులాం ప్రపాచ్య, ద్రాక్షావిదారీవృశ్చీవశతావరీ ...ష్ణాశుణ్ఠీబలాధాత్రీశ్చ దశపలికాః ప్రపాచయేత్ యష్ట్యాహ్వాం రుచకంచ పలికమ్" ను వాక్యముచే తెలిసెడి. మరియు "క్వథితే తాని చూర్ణాని దత్వా" అని చెప్పుటవలన ...లభాగము పూర్తిగ నిగిరి చక్కెర యుక్తమైన పాకమువచ్చినపిదప చూర్ణమును లుపవలెనని తెలిసెడి. "బిల్వసమాన్" అనుచోట బిల్వమన నొకపలపరిమాణమని ...ర్థము. "బిల్వం పలమేవాత్ర కీర్త్యతే"అని పలపర్యాయముగ పరిభాష చెప్పి ...యున్నది.

## ౫. సర్పిర్మోదకయోగము (ఐదవది).

మూ. గోక్షీరాదర్ధాఢకం సర్పిః ప్రస్థ, మిక్షురసాఢకం,
విదార్యాః స్వరసాత్ ప్రస్థం, రసాత్ప్రస్థం చ తైత్తిరాత్. 70

దద్యాత్; సిద్ధ్యతి తస్మింస్తు పిష్టానిక్షురసై రిమాన్,
మధూకపుష్పం కుడవం, ప్రియాలకుడవం తథా. 71
కుడవార్ధం తుగాక్షీర్యాః, ఖర్జూరాణాం చ వింశతిం,
పృథగ్విభీతకానాం చ పిప్పల్యాశ్చ చతుర్థికామ్. 72
త్రింశత్పలాని ఖణ్డాచ్చ మధూకాత్ కర్షమేవ చ,
తథాఽర్ధపలికాన్యత్ర జీవనీయాని దాపయేత్. 73
సిద్ధేఽస్మిన్ కుడవం క్షౌద్రం శీతే క్షిప్త్వాఽథ మోదకాన్,
కారయేన్మరిచాఽజాజీపలచూర్ణాఽవచూర్ణితాన్. 74
వాతాసృక్పిత్తరోగేషు క్షతకాసక్షయేషు చ,
శుష్యతాం క్షీణశుక్రాణాం రక్తే చోరసి సంస్థితే. 75
కృశదుర్బలవృద్ధానాం పుష్టివర్ణబలార్థినాం,
యోనిదోష-కృతస్రావహతానాం చాఽపి యోషితామ్. 76
గర్భార్థినీనాం, గర్భశ్చ స్రవేద్యాసాం, మ్రియేత వా,
ధన్యా బల్యా హితాస్తాభ్యః శుక్రశోణితవర్ధనాః. 77

(ఇతి సర్పిర్మోదకః.)

వ్యా. ఆవుపాలు అర్ధాఢకము (రెండుప్రస్థములు = ముప్పదిరెండుపలములు), ఆవునెయ్యి యొకప్రస్థము (పదునారుపలములు), చెరకురసము ఒకఆఢకము (అరువది నాల్గుపలములు = నాల్గుప్రస్థములు), నల్లనేలగుమ్మడిగడ్డస్వరసము ఒకప్రస్థము, తిత్తిరి (తీతువుపిట్ట) మాంసరసము ఒకప్రస్థము, ఇత్తెరంగున ద్రవములతోఁ కూడిన ఘృతమును పక్వముచేయుచు పాకము ప్రారంభమున నీక్రింద చెప్పబడుద్రవ్యముల చూర్ణమును కలుపవలెను.

ఇప్పపువ్వులు ఒకకుడవము (నాల్గుపలములు), చారపప్పు ఒకకుడవము, తవక్షీరి అర్ధకుడవము (రెండుపలములు), ఖర్జూరపుకాయలు ఇరువది, తానికాయలు ఒకచతుర్థిక (ఒకపలము), పిప్పళ్లు ఒకపలము, కల్కండ ముప్పదిపలములు, అతిమధురము ఒక కర్షము (కాలుపలము), జీవనీయగణమున జెప్పబడినజీవన్తి (మనుబాల) మున్నగుద్రవ్యములు ప్రత్యేకము అర్ధపలము, ఈవిభాగప్రకారము అన్నిటిని చేర్చి చూర్ణముచేసి చెరకురసమున మెత్తగ నూరి, పైనిచెప్పినఘృతము పక్వమగునప్పుడు అందుః చేర్చి, లేహ పాకవిధిగ పక్వముచేసి దించి చల్లబడినపిదప అందు ఒకకుడవము తేనె కల్పి, మిరి

యాలు జీలకర ఈరెంటిని పలపరిమితమును చూర్ణము చేసి పైయౌషధమునచల్లి మోదకముల(మాత్రల)చేయవలెను.

ఈమోదకములు వాతరక్తపిత్తరోగములయందు సేవింపదగును. ఉరఃక్షతము కాసము క్షయము ఈవ్యాధులు నశించును. శుక్రము క్షీణించి శరీరము కృశించువారికి రొమ్మున రక్తము చేరియున్నపుడు విశేషముగ నుపయోగింపదగును. మరియు కృశించినవారును, బలహీనులును, వృద్ధులును శరీరపుష్టిని బలమును శరీరవర్ణమును కోరువారును యోనిదోషముచేతను గర్భస్రావముచేతను బాధపడినస్త్రీలును, గర్భధారణమును కోరుస్త్రీలును, పలుమారు గర్భస్రావ మగుచుండుస్త్రీలును, బిడ్డలు బ్రతుకకుండుస్త్రీలును, వీరికందరకును పైజెప్పబడిన మోదకములు చాల హితకరంబులును ప్రశస్తంబులునై యుండును. పురుషులకు శుక్రమును స్త్రీలకు శోణితమును వృద్ధినందించును. (ఇచ్చట జీవనీయద్రవ్యముల వివరణమును రెండవసర్పిర్గుడవ్యాఖ్యానమున జూచునది.)

### వ్యవాయశోషి కుపచారము.

మూ. వస్తిదేశే, విశుల్వణే స్త్రీప్రసక్తస్య మారుతే, వాతఘ్నాన్
బృంహణాన్ వృష్యాన్ యోగాంస్తస్య ప్రయోజయేత్.	78

వ్యా. అధికముగ స్త్రీసంభోగము చేయుటచే వాతము ప్రకోపమునొంది వస్తిప్రదేశమున శూల మున్నగుబాధల గల్గించుచున్నయెడ వాతహరంబులును శరీరపుష్టికరంబులును వృష్యంబులును నగునౌషధయోగముల నుపయోగించవలెను.

### కాసజ్వరహరక్షీరపానము.

మూ. శర్కరాపిప్పలీచూర్ణైః సర్పిషా మాక్షికేణ చ,
సంయుక్తం వా శృతం క్షీరం పిబేత్కాసజ్వరాపహమ్.	79

వ్యా. ఆవుపాలలో చక్కెర పిప్పలిచూర్ణము తేనె వీనిని జేర్చి క్షీరపాకవిధి ప్రకారము పక్వముచేసి త్రాగిన క్షతక్షయమున కల్గినకాసంబును జ్వరంబును హరించును.

### యూషములు.

మూ. ఫలామ్లం సర్పిషా భృష్టం విదారీక్షురసే శృతం,
స్త్రీషు క్షీణః పిబేద్యూషం జీవనం బృంహణం పరమ్.	80

వ్యా. నేలగుమ్మడిగడ్డరసమును చెరకుపాలను చేర్చి పక్వముచేయబడిన యూష

మున దానిమ్మపండ్లు మున్నగు వానిపులుపురసమును చేర్చి నేతితో తిరుగబోతపెట్టి త్రాగినచో స్త్రీసంభోగముచే క్షీణించినవారికి బలంబును శరీరపుష్టియు కల్గును.

క్షతక్షీణులకు మంథము.

మూ. సక్తూనాం వస్త్రపూతానాం మన్థం క్షౌద్రఘృతాన్వితం, యవాన్న
సాత్మ్యో(యావన్నసాత్మ్యః) దీప్తాగ్నిః క్షతక్షీణః పిబేన్నరః.

వ్యా. సత్తుపిండిని వస్త్రగళితము చేసి మంథమును చేసి అందు తేనెను నేతిని యథోచితముగ చేర్చి యవాన్నము అలవాటుకలవాడును అగ్నిదీప్తికలవాడును నగు క్షతక్షీణరోగి త్రాగవలెను. (మంథమన వేపుడుబియ్యమును సన్ననిపాడి చేసి చల్లనినీళ్లలో మిక్కిలి పలుచనగాను ఘనంబును గాకుండునట్లు సిద్ధముచేసినది మంథ మనబడును. ఈ విషయము:—"సక్తవస్సర్పిషా యుక్తాః శీతవారిపరిప్లుతాః, అనత్యచ్ఛాఽతిసాన్ద్రాశ్చ మన్థ ఇత్యభిధీయతే." అని చెప్పబడినది.)

క్షతక్షీణులకు వ్యంజనములు.

మూ. జీవనీయోపసిద్ధం వా జాఙ్గలం ఘృతభర్జితం,
రసం ప్రయోజయేత్ క్షీణే వ్యఞ్జనార్థం సశర్కరమ్. 82

వ్యా. జీవనీయగణద్రవ్యముల జేర్చి జాంగలజంతువులమాంసమును సిద్ధముచేసి నేతితో వేయించి యామాంసమునైనను మాంసరసమునైనను చక్కెరకలిపి, ఆహారముతో గూడ వ్యంజనముగ చేర్చి క్షతక్షీణు లుపయోగింపవలెను.

క్షతక్షీణులకు క్షీరమాంసరసయూషములు.

మూ. గోమహిష్యశ్వనాగాజైః క్షీరైః మాంసరసైస్తథా, యవాన్నం
(యథాన్నం) భోజయేద్యూషైః ఫలామ్లైః ఘృతసంస్కృతైః. 83

వ్యా. క్షతక్షయరోగముకలవారు ఆవుపాలనైనను, గేదెపాలనైనను, గుఱ్ఱముపాలనైనను, ఏనుగుపాలనైనను, మేకపాలనైనను, మాంసరసములనైనను, మాంసరసమును, పుల్లనిపండ్లరసమును చేర్చి నేతితో సంస్కరింపబడిన యూషములనైనను యవాన్నముతో కలిపి భుజింపవలెను.

మందాగ్నులకు దీపనపాచనవిధి.

మూ. దీప్తేఽగ్నౌ విధిరేష స్యాత్, మన్దే దీపనపాచనః,
యక్ష్మిణాం విహితో గ్రాహీ భిన్నే శకృతి చేష్యతే. 84

వ్యా. క్షతక్షీణులకు జాఠరాగ్ని దీప్తముగ నున్నచో పైజెప్పబడిన ఘృతములను ఆహారవిధిని ఆచరింపదగును. అటుగాక జాఠరాగ్ని మందగించి యున్నయెడ యక్ష్మరోగచికిత్సితమున జెప్పబడిన దీపనపాచనముల సేవింపనగును. మలము పలుమారు వెడలునెడ యక్ష్మరోగమున జెప్పిన గ్రాహి (మలమును నిరోధించు) ఔషధముల సేవింపనగును.

## అగ్నిమాంద్యాదులకు సైంధవాదిచూర్ణము.

మూ. పలికం సైన్ధవం శుణ్ఠీ, ద్వే చ సౌవర్చలాత్పలే,
కుడవాంశాని వృక్షామ్లం దాడిమం పత్రమర్జకాత్. 85
ఏకైకం మరిచాజాజ్యోః, ధాన్యకాద్ద్వే చతుర్థికే,
శర్కరాయాః పలాన్యత్ర దశ ద్వే చ ప్రదాపయేత్. 86
కృత్వా చూర్ణమతో మాత్రాం అన్నపానే ప్రయోజయేత్,
రోచనం దీపనం బల్యం పార్శ్వార్తిశ్వాసకాసనుత్. 87
(ఇతి సైన్ధవాదిచూర్ణమ్.)

వ్యా. సైంధవలవణము ఒకపలము, శుంఠి యొకపలము, సౌవర్చలలవణము రెండు పలములు, చింతపండు, దానిమ్మపండు, తెల్లగగ్గెరఆకు, ఇవి ప్రత్యేక మొక్కొకకుడవము, మిరియాలు ఒకపలము, జీలకర ఒకపలము, దనియాలు రెండుచతుర్థికము(పలము)లు, చక్కెర పండ్రెండుపలములు, ఈభాగప్రకారము అన్నిటిని చేర్చి చక్కగ చూర్ణముచేసి అగ్నిబలానుసారముగ పరిమాణము గల్పించి యన్నపానములయందు ప్రయోగింపనగును. దీనివలన నోటికి రుచిపుట్టును. అగ్ని దీపించును, శరీరబలము కల్గును పార్శ్వశూలయు శ్వాసంబును నివర్తించును.

## ధాన్యకాదిషాడబచూర్ణము.

మూ. ఏకా షోడశికా ధాన్యాత్, ద్వే ద్వేఽజాజ్యజమోదయోః,
తాభ్యాం దాడిమవృక్షామ్లం ద్విర్ద్విః సౌవర్చలాత్పలమ్ 88
శుణ్ఠ్యాః కర్షం దధిత్థస్య మధ్యాత్ పఞ్చపలాని చ,
తచ్చూర్ణం షోడశపలే శర్కరాయాః విమిశ్రయేత్. 89
షాడబోఽయం ప్రదేయస్స్యాదన్నపానేషు పూర్వవత్,
మన్దానలే శకృద్భేదే యక్ష్మిణామగ్నివర్ధనమ్. 90
(ఇతి షాడబః.)

వ్యా. దనియాలు ఒకపలము, జీలకర రెండుపలములు, ఓమము రెండుపలములు, దానిమ్మపండు చింతపండు ఈరెండును ప్రత్యేకము పైజెప్పినరెండిటికిని ద్విగుణము (ఒక్కొ-కటి నాల్గేసిపలములు), సౌవర్చలలవణము ఒకపలము, శుంఠి ఒకకర్షము (కాలు పలము), వెలగపండులోనిగుజ్జు ఐదుపలములు వీనినన్నిటిని యెండించి చూర్ణముచేసి పదు నారుపలములచక్కెరలో కలిపి యీషాడబచూర్ణమును అన్నపానములయందు చేర్చి యుపయోగించునది. ఇచ్చట "తాభ్యాం దాడిమవృక్షామ్లం ద్విః ద్విః" అనుచోట తాభ్యాం-పైజెప్పినజీలకర ఓమములకంటె, 'ద్విః ద్విః' రెండేసిభాగములు, వృక్షామ్ల-దాడిమం-చింతపండును దానిమ్మపండును అని యర్థము. (ఒక్కొ-కటి నాలుగేసిపలములని ఫలితార్థము.) ఈభాగభేదమునే జతూకర్ణతంత్రమున నిట్లు చెప్పిరి:—"పలికే ధాన్యకరు చకే, ద్వేజీరకదీప్యకౌ, శుణ్ఠ్యాశ్చ పలం, కపిత్థదాడిమవృక్షామ్లానాం కుడవమ్."

## నాగబలాకల్పము.

మూ. పిబేన్నాగబలామూలం అర్ధకర్షవివర్ధితం,
పలం క్షీరయుతం మాసం క్షీరవృత్తిరనన్నభుక్. 91
ఏష ప్రయోగః పుష్ట్యాయుర్బలారోగ్యకరః పరః,
మణ్డూకపర్ణ్యాః కల్పోఽయం శుణ్ఠీమధుకయోస్తథా. 92

వ్యా. జిబిలికెపేళ్లు ఒకపలము గ్రహించి పాలలో నూరి కలిపి సేవించునది. పిదప దినమునకు అర్ధకర్షమువంతున హెచ్చించుచు నొకనెలదినములు క్రమముగ పాలతో నూరి కలిపి సేవించునది. దీనిని త్రాగునపుడు అన్నమునువదలి ఆహారమునకు బదులు పాలను మాత్రము త్రాగవలెను. ఈప్రయోగమువలన శరీరపుష్టియు, ఆయువును, బలం బును కల్గి ఆరోగ్యము కల్గును. ఆరోగ్యమునకు ఇది చాల యుత్తమము. మరియు నీకల్పము ననుసరించి వల్లారాకును, శుంఠిని, అతిమధురమునుకూడ నుపయోగింపనగును.

ఇచ్చట నీవివరణము నెరుంగునది:—పైజెప్పినరీతిగ దినమున కర్ధకర్షము వృద్ధి చేయుచు నొకమాసమగుసరికి పరిమాణము మితిమీరును. కావున సమంజసముగ దోచదు. కావున "అర్ధకర్షవివర్ధితం పలం, క్షీరయుతం, మాసం పిబేత్" అని అన్వయించవలెను. దినమున కర్ధకర్షమువంతున నారంభించి అర్ధకర్షముచొప్పున ఒకపలపరిమాణము అగు నంతవరకును వృద్ధిచేసి పిమ్మట ప్రతిదినము ఒకపలమువంతున నెలదినములు సేవించవలెనని యర్థము. ఈయర్థమునే సర్వాంగసుందరవ్యాఖ్యాతయు నభిప్రాయమును సూచించుచు నిట్లు చెప్పిరి:—"నాగబలామూలసపలం క్షీరయుతం పిబేత్, కిం భూతం? అర్ధకర్షాభివర్ధి

తమ్, మాసం యావత్ ఇతి కాలఉక్తః" ఈవ్యాఖ్యానమునుబట్టి పలపరిమాణమే పరమావధియని తేలినది. ఈపక్షమే యుత్తమము.

జతూకర్ణతంత్రమునను ఇట్లున్నది:—"నాగబలామూలం అర్ధకర్షవృద్ధ్యా పలమానం, మాసం పేయం, క్షీరమాత్రావృత్తినా" అర్ధకర్షప్రారంభమున దినవృద్ధిచే పలమైన పిదప పలప్రమాణమునే మాసదినములు సేవింపవలెనని యభిప్రాయము.

## అనుక్తచికిత్సాసంగ్రహము.

మూ. యద్యత్సంతర్పణం శీతమతిదాహి హితం లఘు,
అన్నపానం నిషేవ్యం తత్ క్షతక్షీణైస్సుఖార్థిభిః. 93
యచ్చోక్తం యక్ష్మిణాం పథ్యం కాసినాం రక్తపిత్తినాం,
తచ్చ కుర్యాదవేక్ష్యాఽగ్నిం వ్యాధిం సాత్మ్యం బలం తథా. 94

వ్యా. సంతర్పణంబులును, శీతవీర్యముచే చల్లదనమును కల్గించునవియు, తాపమును కల్గింపకుండునవియు, లఘుగుణముకల్గి తేలికగ జీర్ణమగునవియు, నగు నన్నపానములన్నియు క్షతక్షీణులకు చాల హితకరములు కావున వానినెల్ల సేవింపనగును.

మరియు యక్ష్మరోగులకును కాసరోగులకును రక్తపిత్తరోగులకును పథ్యములుగ జెప్పిన యన్నపానాదులన్నియు క్షతక్షీణులకును హితములుగ నుండును. వానినన్నిటిని రోగియొక్క జాఠరాగ్నిబలమును, వ్యాధిపరిస్థితిని, రోగికి సాత్మ్యమును శరీరబలమును, చక్కగ గమనించి తత్తదనుసారముగ నుపయోగింపనగును.

## క్షతక్షీణచికిత్సితావశ్యకత.

మూ. ఉపేక్షితే భవేత్తస్మిన్ అనుబన్ధో హి యక్ష్మణః,
ప్రాగేవాగమనాత్తస్య తస్మాత్తం త్వరయా జయేత్. 95

వ్యా. పైజెప్పబడిన క్షతక్షీణరోగము రాజయక్ష్మమున కనుబంధము; కావున దీనికి శీఘ్రముగ చికిత్సజేయక యుపేక్షించినచో యక్ష్మరోగము సంప్రాప్తమగును. కావున యక్ష్మరోగము వచ్చుట కవకాశమియ్యక అతిశీఘ్రముగనే చికిత్సచేయవలెను.

## అధ్యాయవిషయసంగ్రహము.

తత్ర శ్లోకౌ:—

మూ. క్షతక్షయసముత్థానం, సామాన్యపృథగాకృతిం,
అసాధ్య-యాప్య-సాధ్యత్వం, సాధ్యానాం సిద్ధిరేవ చ. 96

ఉక్తవాన్ జ్యేష్ఠశిష్యాయ క్షతక్షీణచికిత్సితే,
తత్త్వార్థవిత్ వీతరజస్తమోదోషః పునర్వసుః. 97

వ్యా. క్షతక్షయముయొక్క నిదానములు, దానిసామాన్యలక్షణములు, వేరువేరుగ (ఉరఃక్షత-క్షయములకు) లక్షణములు, అసాధ్య-యాప్య-సాధ్యలక్షణములు, సాధ్యము లగువానికి దగినచికిత్సలు, వీనినన్నింటిని తత్త్వార్థవేత్తయు, రజస్తమోదోషవినిర్ముక్తుం డును, నగుపునర్వసువు తనజ్యేష్ఠశిష్యుడగు నగ్నివేశునకు క్షతక్షీణచికిత్సితమను నీయధ్యా యమున వివరముగ జెప్పెను.

ఇత్యగ్నివేశకృతే తన్త్రే చరకప్రతిసంస్కృతే, చికిత్సాస్థానే
క్షతక్షీణచికిత్సితం నామ ఏకాదశోఽధ్యాయః.

వ్యా. ఇత్తెరంగున నగ్నివేశకృతంబును చరకప్రతిసంస్కృతంబును నగుచరక సంహితయను నాయుర్వేదతంత్రమున చికిత్సాస్థానమునందలి క్షతక్షీణచికిత్సితమనునది యేకాదశాధ్యాయము సమాప్తము.

---

## ద్వాదశాధ్యాయము

అవతరణిక:—క్షతక్షీణమునకు "భృతమభ్యాహతస్య చ" అని అభిఘాతము కారణముగ జెప్పబడినది. శ్వయథువు కూడ మర్మోపఘాత మొకకారణముగ జెప్పబడి నది. ఈరెంటికిని హేతువుచే సామ్యముండుటంజేసి క్షతక్షీణచికిత్సితమును జెప్పినపిదప శ్వయథు(వాపు)చికిత్సితము చెప్పబడును:—

మూ. అథాతశ్శ్వయథుచికిత్సితం వ్యాఖ్యాస్యామః. 1
ఇతి హ స్మాహ భగవానాత్రేయః. 2

వ్యా. క్షతక్షీణచికిత్సితమును జెప్పినపిదప శ్వయథుచికిత్సితమును భగవత్స్వ రూపుడగు నాత్రేయు లుపదేశించినదానికన్న న్యూనాతిరేకము గాకుండునట్లు వివరించెద నని యర్థము.

శ్వయథునుగురించి యగ్నివేశునిప్రశ్నము.

మూ. భిషగ్వరిష్ఠం సురసిద్ధజుష్టం మునీన్ద్రమత్ర్యాత్మజమగ్నివేశః,
మహాగదస్య శ్వయథోర్యథావత్ ప్రకోప-రూప-ప్రశమానపృచ్ఛత్. 3

వ్యా. వైద్యశ్రేష్ఠుడును, దేవతలచేతను సిద్ధాదులచేతను సేవింపబడినవాడును, అత్రికుమారుడునగు నాత్రేయమహర్షిని, అగ్నివేశులు శ్వయథురోగమునకు సంబంధించిన హేతువులను, రూపమును, పూర్వరూపమును, క్రమముగ దాని ప్రశమనోపాయమును చెప్పుమని యడిగెను.

## ఆత్రేయులు శోథమును వివరించుట.

మూ. తస్మై జగాదాఽగదవేదసిన్ధుప్రవర్తనాద్రిప్రవరోఽత్రిజస్తాఀ,
వాతాదిభేదాత్ త్రివిధస్య సమ్యక్ నిజానిజైకాఙ్గజసర్వజస్య. 4

వ్యా. ఆయుర్వేదమనుగంగానదిని లోకమున ప్రవర్తింపజేయుటకు హిమాలయమునుబోలిన యాత్రేయమహర్షి, నిజ-అనిజ (ఆగంతు)-ఏకాంగజ - సర్వాంగజరూపమైనదియు, వాతాదిదోషభేదములచే మూడువిధంబులునైన శోఫరోగమునకు సంబంధించిన పైజెప్పబడిన హేతు-రూప-పూర్వరూప-చికిత్సలను అగ్నివేశునకు వివరముగ నిట్లు జెప్పందొడంగెను. ఇచ్చట ఆకాశగంగను భూమియందు వ్యాపింపజేయుటకు హిమాలయము ప్రధానప్రవర్తకుడైనవిధముగ నాయుర్వేదమును శిష్యపరంపరగ ప్రవర్తింపజేయుటకు ఆత్రేయులు ప్రవర్తకాచార్యులనియు "వేదసిన్ధుప్రవర్తనాఽద్రిప్రవరః." అనువిశేషముచే దెలుపబడినది. మరియు ఏకాంగజశబ్దముచేత అర్ధాంగజ-ఏకావయవజ శోఫంబును గ్రహింపబడును.

## దోషజశోథ జనించుటకు కారణములు.

మూ. శుద్ధ్యామయాఽభక్తకృశాఽబలానాం క్షారామ్లతీక్ష్ణోష్ణగురూపసేవా, దధ్యామమృచ్ఛాకవిరోధిదుష్టగరోపసృష్టాన్ననిషేవణం చ.
అర్శాంస్యచేష్టా, న చ దేహశుద్ధిర్మర్మోపఘాతః, విషమాప్రసూతిః,
మిథ్యోపచారః ప్రతికర్మణాం చ, నిజస్య హేతుఃశ్వయథోః ప్రదిష్టః.

వ్యా. వమనవిరేచనాదిశోధముల నధికముగ జేసికొనుటచేనైనను, జ్వరాదిరోగములచేనైనను, భోజనముజేయక యుపవాసములచేనైనను శరీరము కృశించి బలము నానాట క్షీణించినవారికి శోఫ జనించును. మరియు క్షారము (కారము)ను పులుపునుకల ద్రవ్యములను, చిరకాలమునకు జీర్ణించుస్వభావముకల గురుద్రవ్యములను విశేషముగ సేవించుట; పెరుగును, పక్వముకానిపదార్థములను, మట్టిని, ఆకుకూరలను తినుట; మట్టిని తినుట, పరస్పరసంయోగముచే విరుద్ధములగు క్షీరమత్స్యాదుల నొకటిగ జేర్చి తినుట, కీటాదులచే దుష్టమైన యన్నమునైనను విషదుష్టమైన యన్నమునైన భుజించుట, అర్శో

రోగము, పనులేమియును లేక నిశ్చలముగనుండుట, యుక్తమైన కాలమున శరీరమును శోధనము జేయకుండుట, మర్మస్థలములయం దభిఘాతము కల్గుట, అకాలమునను అక్రమముగను ప్రసవించుట వమనాదిపంచకర్మల జేసికొనినప్పుడు వానినియమము ననుసరింపక యపథ్యములైన యాహారాదుల సేవించుట ఇవియన్నియు నిజ(దోషజ)శోథము జనించుటకు కారణములగును. (ఇచ్చట మర్మోపఘాతమున దోషములచే మర్మస్థలములయం దభిఘాతము కల్గుట యని యర్థము. బాహ్యహేతువులచే గల్గుమర్మోపఘాతము ఆగంతుశోథకు కారణమగును.)

## ఆగంతుశోథకారణములు.

మూ. బాహ్యాస్త్వచో దూషయిత్వాఽభిఘాతః కాష్ఠాశ్మశస్త్రాగ్నివిషాయసాద్యైః, ఆగన్తుహేతుః.

వ్యా. కట్టెలు, రాళ్లు, ఆయుధములు, అగ్ని, విషము, ఇనుపమేకులు మున్నగు వానిచే గల్గినయభిఘాతము ఆగంతుశోథకు కారణము; ఇయ్యది శరీరమునందు పైభాగమునందు త్వక్కును చెరచి శోథమునకు కారణమగును.

## ఆశ్రయభేదముచే శోథభేదములు.

మూ. త్రివిధో నిజశ్చ సర్వాఽర్ధగాత్రావయవాశ్రితత్వాత్. 7

వ్యా. పైజెప్పినరీతిగ నిజ-ఆగంతుభేదములచే రెండువిధములైన శోథయు సర్వశరీరము నాశ్రయించినదియు, అర్ధశరీరము నాశ్రయించినదియు, అవయవము నాశ్రయించినదియు నను భేదములచే మూడేసివిధములుగ నుండును. (ఆశ్రయభేదముచే నిజశోథయు, ఆగంతుశోథయు నొక్కొకటి మూడేసివిధముల నుండునని భావము. 'నిశ్చ' అనుచకారమువలన ఆగంతుశోథయు మూడువిధములని యర్థము.)

## శోథసామాన్యసంప్రాప్తి.

మూ. బాహ్యాస్సిరాః ప్రాప్య యదా కఫాసృక్పిత్తాని సన్దూషయతీహ వాయుః, తైర్బద్ధమార్గః స తదా విసర్పన్ ఉత్సేధలిఙ్గం శ్వయథుం కరోతి. 8

వ్యా. పైజెప్పినకారణములచే వాతము ప్రకోపమునొంది వానివానికారణములచే ప్రకుపితములగు కఫ-రక్త-పిత్తములను శరీరబాహ్యస్థలమునందలి సిరలను జేర్చి అట్టిసిరలను చెరచి, కఫ-రక్త-పిత్తములచే మార్గ మడ్డగింపబడుటవలన ధారాళముగ సంచరింపనేరక చర్మముననే సంచరించుచు ఉత్సేధ (ఎత్తుగనుండుట) చిహ్నముగల శ్వయథువును

(వాపును) కల్గించును. (ఇచ్చట "ఉత్సేధలింగం" అనుపది శోఫమునకు నియతలక్షణము. శరీరమున మామూలుపరిస్థితికన్న నున్నతముగ నుండునది శోఫమని యర్థము.)

### శోఫవిశేషసంప్రాప్తి.

మూ. ఉరస్థ్సితైరూర్ధ్వమధశ్చ వాయోః స్థానస్థితైః, మధ్యగతస్తు మధ్యే, సర్వాఙ్గగస్సర్వగతైః క్వచిత్థ్సైః దోషైః క్వచిత్ స్యాత్ శ్వయథుస్తదాఖ్యః. 9

వ్యా. ప్రకోపించినదోషములు రొమ్మునచేరినయెడ రొమ్మునకు పైభాగమునందును, వాతమునకు స్థానమైన పక్వాశయమున జేరి శరీరమున కధోభాగమునందును, ఉరస్స్థలమునకును పక్వాశయమునకు మధ్యమున జేరినపుడు శరీరమధ్యభాగమునందును, శరీరమునందెల్ల వ్యాపించియుండునపుడు సర్వశరీరమునందును, కంఠము తాలువు మున్నగు నేకదేశమున చేరి ఆయాస్థలములయందును శోఫమును కల్గించును. అట్టియెడ నాయాస్థలభేదమునుబట్టి ఆయాపేరుచే శోథము వ్యవహరింపబడును. (ఊర్ధ్వగతశోథము, అధశ్శోథము, మధ్యశోథము, సర్వాంగశోథము, ఏకాంగశోథము అని చెప్పబడును.)

### శోఫపూర్వరూపములు.

మూ. ఊష్మాతథాస్యాద్దవథుస్సిరాణాంఆయామఇత్యేవచపూర్వరూపం,

వ్యా. వాపు జనించుటకు మునుమున్ను శరీరమున నావిరివెడలునట్లు వేడిగ నుండును. కన్నులనుండి వేడిగ నావిరి వెడలును. శోథజనించుస్థలమున సిరలు విశాలముగ వ్యాపించును. (ఇవియన్నియు శోథమునకు పూర్వరూపములు. దవథులక్షణము తంత్రాంతరమున "దవథుశ్చక్షురాదిభ్యః తీవ్రమూష్మప్రవర్తనమ్." అని చెప్పబడినది.)

### శోఫలకు వాతికాదిభేదనిర్ణయము.

మూ. సర్వస్త్రిదోషోఽధికదోషలిఙ్గైః తచ్ఛబ్దమభ్యేతి భిషగ్జితం చ. 10

వ్యా. శోఫములన్నియు వాతపిత్తకఫముల మూడిటిప్రకోపముననే కల్గును. ఐనను ఆమూడులలో నెయ్యది మిక్కిలి యధికముగ నుండునో, ఆశబ్దముచేత అట్టిశోఫము వ్యవహరింపబడును. (వాత మధికముగనుండుశోఫము వాతికమనియు, పిత్త మధికముగ నుండునది పైత్తికమనియు, కఫ మధికముగనుండునది శ్లైష్మికమనియు రెండేసిదోషము లధికముగ నుండునది వాత-పిత్త-వాతకఫ-పిత్తకఫజనితములనియు చెప్పబడునని భావము.)

మరియు నట్టిదోషాధిక్యమునుబట్టియే ఆయాశోఫకు దగినట్లులు చికిత్సయు విధింపబడును. (కావున శోఫములను దోషాధిక్యమును ఆయాలక్షణములబాహుళ్యమునుబట్టి నిర్ణయించి తత్తదనుగుణముగ చికిత్సచేయవలెనని భావము.)

### శోథసామాన్యలక్షణములు.

మూ. సగౌరవం స్యాదనవస్థితత్వం సోత్సేధముష్మాథ సిరాతనుత్వం, సలోమహర్షాఽఙ్గవివర్ణతా చ సామాన్యలిఙ్గం శ్వయథోః ప్రదిష్టమ్. 11

వ్యా. వాపు మిగుల భారమై యున్నతంబై యొక్కచోటైనను నిల్కడలేకుండుట, వేడిగ నుండుట, సిరలు సన్నగిలి వ్యాపించుట, వాపుకల్గినచోట రోమములు నిక్కబొడిచియుండుట, శరీరము వర్ణముమారుట ఇవి వాపులన్నిటియందును సామాన్యములుగ నుండులక్షణములు.

### వాతికశోఫలక్షణములు.

మూ. చలస్తనుత్వక్ పరుషోఽరుణోఽసితః ప్రసుప్తిహర్షార్తియుతోఽనిమిత్తః, ప్రశామ్యతి ప్రోన్నమతి ప్రపీడితో దివా బలీ చ శ్వయథుస్సమీరణాత్. 12

వ్యా. వాతప్రకోపమునగల్గిన శోఫము వాపు నిల్కడలేక చంచలముగ నుండును. వాపుకల్గినచోట చర్మము పలుచనై గరుకుబారి అరుణవర్ణంబైనను నల్లనిరంగైనను కల్గియుండును. చేతతాకినచో వాపుగలస్థలమున స్పర్శము నెరుంగకుండును. గల్లుగల్లు మను విధముగ బాధకల్గును. వాపు చికిత్సజేయకున్నను ఒకవేళ తనంతనే శమించి వేరొకవేళ ప్రకోపము నొందుచుండును. వాపుకల్గినస్థలమున వేలితో నదిమినయెడ గుంటబడి తనంతనే యుత్తరక్షణముల పైకుబుకును. పగటిపూట బలిష్ఠముగ నుండును. ఈలక్షణములు కలది వాతమున కల్గినశోఫమని యెరుంగునది.

ఇచ్చట "హర్షార్తియుతో నిమిత్తతః, ప్రశామ్యతి." అనుపాఠము నవలంబించి వాతహారస్నేహోష్మాదులచే శమించునని యర్థముచేసెదరు. ఈయర్థమును వాగ్భటాచార్యులు "స్నిగ్ధోష్ణమర్దనై శ్శామ్యేత్" అని చెప్పిరి.

### పైత్తికశోఫలక్షణము.

మూ. మృదుస్సగన్ధోఽసితపీతరాగవాన్ భ్రమజ్వరస్వేదతృషామదాన్వితః, య ఉష్యతే స్పర్శరుగక్షిరాగకృత్ సపిత్తశోథః భృశదాహపాకవాన్. 13

వ్యా. పిత్తముచే జనించినశోఫము మెత్తనై వాసనతో గూడి నల్లనిరంగైనను పచ్చనిరంగైనను, ఎరుపురంగైనను కల్గియుండును. భ్రమము, జ్వరము కల్గును. చెమట బట్టును. దప్పికల్గును. ఉన్మత్తకాయతిన్నవిధముగ తిక్కయెత్తినట్లుండును. తాకినప్పుడు మంటబుట్టును. నొప్పికల్గును. కన్ను లెఱ్ఱబారియుండును. మిక్కిలి మంటతో గూడి పుండగును. ఈలక్షణములుకల్గినవి పిత్తశోఫమని యెరుంగునది.

### శ్లైష్మికశోఫలక్షణము.

మూ. గురుః స్థిరః పాణ్డురరోచకాన్వితః ప్రసేకనిద్రావమివహ్నిమాన్ద్యకృత్, స కృచ్ఛ్రజన్మప్రశమో నిపీడితో న చోన్నమేద్రాత్రిబలీ కఫాన్వితః. 14

వ్యా. కఫముచే జనించుశోఫ బరువుగను, గట్టిగను నుండును. పాండువర్ణముగల్గి అరోచకముతో కూడియుండును. నోట జొల్లుకారుచు అధికనిద్రకల్గి యొకసమయమున వాంతి యగుచుండును. అగ్ని మందగించును. శోఫము చాలకాలమునను వ్యాపించి చిర కాలముపరకు శమించక బాధించుచుండును. వాపుకలిగినచోట వ్రేలితో నదిమినయెడ గుంటబడి ఆగుంట పైకియుబకకనే యుండును. రాత్రివేళలయందు వాపు అధికముగ నుండును. ఈలక్షణములుగలది కఫముచే కల్గినదని యెరుంగునది. (రాత్రివేళలయందు స్రోతస్సులు అడ్డగింపబడియుండుటవలనను, చేష్టలదట్టియుండుటవలనను, శరీరమునందలి ద్రవము వృద్ధినొందును. కావున కఫాత్మకమైనశోఫ బలిష్ఠముగా నుండును. పగటియందు స్రోతోమార్గమును అడ్డులేకయుండుటచేతను, పనులయం దాసక్తులు గల్గియుండుట చేతను కఫము వృద్ధినొందకుండును కావున పగటిపూట తక్కువగ నుండును. వాతముచే జనించుశోఫము మాత్రము పగటిపూట బలిష్ఠముగ నుండునని యెరుంగునది.)

### అసాధ్యశోఫలక్షణములు.

మూ. కృశస్య రోగైరబలస్య యో భవేత్, ఉపద్రవైర్వా వమిపూర్వకైర్యుతః, స హన్తిమర్మానుగతోఽథ రాజిమాన్ పరిస్రవేత్ హీనబలస్య సర్వగః. 15

వ్యా. రోగములచే శరీరము కృశించి బలము క్షీణించినవానికి గల్గినశోఫంబును, త్రిశోథీయాధ్యాయమున జెప్పబడినవాంతి మున్నగునుపద్రవములతో గూడినశోఫంబును, శరీరమునందలి మర్మస్థానములబుట్టిన శోఫంబును, రేఖలతో కూడినదియు, నీరుగారుచుండు శోఫంబును, బలహీనునకు శరీరమునందెల్ల వ్యాపించినశోఫంబును రోగిని చంపును. (అసాధ్యమనుట).

శోఫోపద్రవములు త్రిశోథీయమున నిట్లు చెప్పబడినవి:—"ఛర్దిశ్శ్వాసోఽరుచిస్తృష్ణా జ్వరోఽతీసార ఏవచ, సుప్తిశ్శోషః సదౌర్బల్యః శోథోపద్రవసఙ్గ్రహః." (సూ. అ. ౧౮). వాంతి, శ్వాసము (ఆయాసము), అరుచి, దప్పి, జ్వరము, అతిసారము, స్పర్శము తెలియకుండుట, శరీరము శుష్కించుట, బలహీనము, ఇవియన్నియు శోథమున గల్గు నుపద్రవములు అని యర్థము. మరికొన్ని యసాధ్యలక్షణములు స్థలాంతరమున జూచునది.

## సుఖసాధ్యశోఫలక్షణములు.

మూ. అహీనమాంసస్యయఏకదోషజఃనవోబలస్థస్యసుఖస్ససాధయేత్,

వ్యా. శరీరమునందలి మాంసము కృశించనివానికి జనించినది, ఏకదోషముచేతనే కల్గినదియు, చాలకాలము గడవక నూతనముగ నుండునదియు, మిక్కిలి బలిష్ఠునకు జనించినదియు నగుశోఫము సుఖసాధ్యమగును. పైజెప్పబడిన సుఖసాధ్యలక్షణములు పూర్తిగ లేనిదిని కృచ్ఛ్రసాధ్యమని యెఱుంగునది. (త్రిశోథీయాధ్యాయమున నిదానలక్షణాదులు విపులముగ జెప్పబడినవి.)

## శోఫసామాన్యచికిత్సావిధి.

మూ. నిదానదోషర్తువిపర్యయక్రమైః ఉపాచరేత్తంబలదోషకాలవిత్.

వ్యా. శరీరవ్యాధ్యాదిబలమును వాతాదిదోషముల ఆమనిరామాదిభేదములను, శీతోష్ణరూపమై (వ్యాధ్యవస్థారూపమైన) కాలవిశేషమును చక్కగ దెలిసినవైద్యవరుడు, పైజెప్పినరీతిగ సుఖసాధ్యావస్థనుండు శోఫముయొక్క నిదానమునకును వాతాదిదోషదూష్యములకును ఋతువునకు విరుద్ధములగులంకణము మున్నగుచికిత్సలచే నుపచరించవలెను.

## శోఫచికిత్సాక్రమము.

మూ. అథాఽఽమజం లఙ్ఘనపాచనక్రమైః,విశోధనైరుల్బణదోషమాదితః,
శిరోగతం శీర్షవిరేచనైరధో విరేచనైరూర్ధ్వహరైస్త
థోర్ధ్వగమ్. 17
ఉపాచరేత్; స్నేహభవం విరూక్షణైః, ప్రకల్పయేత్ స్నేహ
విధిం చ రూక్షజే, విబద్ధవిట్కేఽనిలజే నిరూహణం ఘృతం తు
పిత్తాఽనిలజే సతిక్తకమ్. 18

పయశ్చ మూర్ఛాఽరతిదాహతర్షితే విశోధనీయే తు సమూత్ర
మిష్యతే, కఫోత్థితం క్షారకటూష్ణసంయుతైః సమూత్రతక్రాఽఽ
సవయుక్తిభిర్జయేత్. 19

వ్యా. ఆమావస్థనుండుదోషములచే గల్గినశోఫమును లంఘన-పాచనరూపములైన చికిత్సల తొలుత జేయవలెను. దోషములు ప్రబలములుగ నుండు నెడ వమనవిరేచనాది శోధనములచే నాయాదోషానుసారముగ జేయవలెను. అందు శిరస్సుననుండు శోఫమునకు నస్యాదిప్రయోగమువలన శిరోవిరేచనముల జేయనగును. అధోగత(నాభికి క్రిందిభాగము నందలి శోఫమునకు విరేచనములచేతను, ఊర్ధ్వగతశోఫమునకు వమనములచేతను చికిత్స జేయనగును. మరియు స్నేహద్రవ్యముల నుపయోగించుటచే గల్గినశోఫమునకు (దానికి విరుద్ధములగు) విరూక్షణములగు ఔషధాదులచేతను, విరూక్షణజనితమగుశోఫమునకు స్నేహవిధిచేతను చికిత్సచేయవలెను. (ఇది హేతువిపరీతచికిత్స).

మరియు మలము బద్ధగించియుండునపుడు శోఫము వాతికమైనచో నిరూహణ వస్తియు చేయనగును. వాతపిత్తముల ద్వంద్వముచే గల్గిన శోఫమునకు తిక్తద్రవ్యములగు నింబాదిద్రవ్యముల జేర్చి పక్వముచేయబడిన ఘృతము నుపయోగింపనగును. శోఫమున మూర్ఛయు అరతియు తాపంబును దప్పియు కల్గియున్నయెడ శోధనమునకై గోమూత్రముతోకూడి పక్వముచేయబడిన పాల నుపయోగింపనగును. కఫముచే జనించినశోఫము నందు క్షారకటురసంబులును ఉష్ణవీర్యంబును కలద్రవ్యములతోగూడిన మూత్రమును తక్రమును ఆసవములను యుక్తియుక్తముగ నుపయోగించి చికిత్సజేయవలెను.

### శోఫములయందు విసర్జించవలసినయపథ్యములు.

మూ. గ్రామ్యాఽబ్జానూపం పిశితమబలం శుష్కశాకం నవాన్నం
గౌడం పిష్టాన్నం దధి తిలకృతం విజ్జలం మద్యమమ్లమ్,
ధానా వల్లూరం సమశనమథో గుర్వసాత్మ్యం విదాహి,
స్వప్నం చాఽరాత్రౌ శ్వయథు గదవాన్ వర్జయేన్మైథునం చ. 20

వ్యా. గ్రామములనుండు కోడి మున్నగుజంతువులయొక్కయు జలచరములగు మత్స్యాదులయొక్కయు, జలప్రాంతముననుండు జంతువులయొక్కయు మాంసంబులును, ఎండి సత్తుతీసినశాకములు, క్రొత్తబియ్యపుఅన్నంబును, బెల్లముతోగూడిన పూర్ణము బూరెలు మున్నగునవియు, పిండితోగూడిన యన్నంబును, పెరుగుఅన్నంబును నువ్వుల కుండియన్నంబును, చవ్వనినీళ్లను, పులిసినమద్యంబును, బొరుగులు (అటుకులు), ఎండిన

మాంసము (ఉప్పాచలు), సమశనము (పథ్యములను అపథ్యములను చేర్చి యొ
జేర్చి భుజించుట), గురుత్వమును కల్గించుపదార్థములు, అసాత్మ్యములగు (అలవా
లేని)పదార్థములు, విదాహిపదార్థములు, వీనినిసేవించుట పగటియందు నిదురిం
మైథునము, వీనినన్నిటిని శోఫరోగముకలవాడు విసర్జింపనగును. (పైజెప్పినవన్నియు
మునకు కారణములే యగుటంజేసి వర్జనీయములే యగును; ఐనను వీనిని విసర్జిం
యవశ్యకృత్యమని సూచించుటకై యిచ్చట వాచనికముగ జెప్పబడినదని యెరుంగు
ఈశ్లోకము కుసుమితలతావేల్లితవృత్తము).

[ఈతంత్రమున ఛందోవిషయమై చర్చించుటయప్రస్తుతమైనను పాఠభేదము
నర్థభేదము సంభవించుటవలన నించుక యీక్రింద విమర్శింపబడును:—పైకనినవృ
ధృతియను పదునెనిమిదవఛందంబునకు జేరినది. దీనిలక్షణమును "కుసుమితలతావేల్లి
మ్తౌ, న్యౌ, యౌ, ఇన్ద్రియర్తుస్వరాః" అని పిఙ్గళాచార్యులు చెప్పియున్నారు.
కవీయమునను ఈలక్షణము ననుసరించియే చెప్పబడినది. ఈవృత్తమున మ-త-న-య-
య అనుగణములుండవలెను. ప్రకృతమూలమున "గ్రామ్యాబ్జానూపంపిశితమబలం...
మైథునం చ" అనునది పైగనబరచినలక్షణమునకు సరిగ నున్నది. అర్థమును సమంజసమ
నున్నది.

వాగ్భటాచార్యులును ఈశ్లోకమునే అనువదించిరి. కాని ముద్రితకోశముల
నపపాఠముగ గన్పట్టుచున్నది. ఎట్టులన:—

"గ్రామ్యానూపం పిశితమబలం శుష్కశాకం తిలాన్నం, గౌడం పిష్టాన్నం ద
లవణం విజ్జలం మద్యమమ్లమ్, ధానా వల్లూరం సమశనమథో గుర్వసాత్మ్యం విదాహి
స్వప్నం రాత్రౌ శ్వయథుగదవాన్ వర్జయేన్మైథునం చ."

ఇచ్చట మొదటిపాదమున నొకయక్షరము తక్కువ. గణములు చెడినది. మూ
నాల్గుపాదములును అదేరీతిగ నున్నది. ఇది యాచార్యునిలోపము కానేరదు. అంథపర
పరగా గల్గినయనాలోచితపాఠభేదము. సర్వాంగసుందరమునను "కుసుమితలతావేల్లిత
వృత్తం" అని వ్రాసి లక్షణమునుగూడ గనపరచిరి. అట్లుండ మూలకారుని తప్పుగ
దలచుట సాహసము. ముద్రాపకులపొరబాటు నుండవచ్చును.

ఈయపపాఠమునవచ్చిన చిక్కేమన:—అన్నిరోగములయందు (విషాదిరో
ములయందుదక్క) పగటినిద్రయు రాత్రిజాగరణంబును హితములుగావు. రాత్రి నిద్ర
నిషేధము ఎచ్చట నుండదు. అట్లుండ ఈపాఠమున "స్వప్నం రాత్రౌ"అని రాత్రి
నిద్రానిషేధముచేయుట అప్రశస్తము, అనర్థదాయకము. "స్వప్నం చాఽరాత్రౌ" అను

ప్రకృతపాఠమున అకారప్రశ్లేషముచేత అరాత్రౌ-రాత్రికంటె భిన్నమైన పగటియందు, అని యర్థమగును. పగటినిద్ర మాత్రము నిషిద్ధమగును. కావున నీయపభ్రంశపాఠమును వదలి యీతంత్రకారులపాఠము ననుసరించి కోశములనన్నిటిని దిద్దికొనుట చాల ప్రశస్తము. విజ్ఞులు గమనించెదరుగాత!]

## కఫజశోఫచికిత్స.

మూ. వ్యోషం త్రివృత్తిక్తకరోహిణీ చ సాఽయోరజస్కా-త్రిఫలారసేన, పీతం కఫోత్థం శమయేత్తు శోఫం; గవ్యేన మూత్రేణ హరీతకీ చ. 21

హరీతకీనాగరదేవదారు సుఖామ్బుయుక్తం సపునర్నవం వా, సర్వం పిబేత్త్రిష్వపి మూత్రయుక్తం స్నాతశ్చ జీర్ణే పయసాఽన్నమద్యాత్. 22

వ్యా. త్రికటుకములు, తెగడ, కటుకరోహిణి, వీనిని సమభాగములుగ గూర్చి కల్కముచేసి యాకల్కమును, లోహసిందూరము(భస్మము)ను త్రిఫలములకషాయమును అనుపానముగ జేసి త్రాగినయెడ కఫముచే జనించినశోఫమును శమింపజేయును. లేక కరక కాయలకల్కమును గోమూత్రానుపానముచే త్రాగవలెను. కరకకాయలబెరడు, శుంఠి, దేవదారుచెక్క, గలిజేరు వీని చూర్ణమును సుఖోష్ణముగనుండు నీళ్లతోనైనను త్రాగవలెను. పైజెప్పబడినయోగములు మూటిని గోమూత్రమున కలిపి వాతాదిదోషముల మూటియందునుగూడ సేవింపనగును. ఈయౌషధము జీర్ణమైనపిదప స్నానముచేసి పాలతో కలిపి యన్నమును భుజింపవలెను.

## వాతికశోఫశమన చికిత్స.

మూ. పునర్నవానాగరముస్తకల్కాః ప్రస్థేన ధీరః పయసాఽక్షమాత్రాః, మయూరకం మాగధికాం సమూలాం సనాగరాం వా ప్రపిబేత్ సవాతే. 23

వ్యా. గలిజేరువేళ్లు, శుంఠి, తుంగగడ్డలు, వీని నొక్కొక కర్షముపంతున జేర్చి మెత్తగ నూరి కల్కముజేసి యొకప్రస్థపరిమితమగు ఆవుపాలతో కలిపి సగము మిగులు నట్లు చుండ కాచి వాతికశోఫమున త్రాగవలెను. మరియు ఉత్తరేణివేరు, పిప్పళ్లు, పిప్పలిమూలము(మోడి), శుంఠి వీనిని పైజెప్పినరీతిగ నొక్కొకకర్షముపంతున చేర్చి కల్కముచేసి యొకప్రస్థము ఆవుపాలతో కలిపి అర్ధశేషముగ కాచి వాతశోఫమున

త్రాగవలెను. (ఇచ్చట ప్రస్థపరిమితమైన క్షీరము మాత్రాధికమగును కావున అర్ధాంశము మిగులునట్లు కాచవలెను.)

### వాతపిత్తశోఫశమనచికిత్స.

మూ. దన్తీత్రివృత్త్ర్యూషణచిత్రకైర్వా పయశ్శృతం దోషహరం పిబేన్నా, ద్విప్రస్థమాత్రం తు పలార్ధికైస్తైః అర్ధావశిష్టం పవనే సపిత్తే. 24

వ్యా. దంతివేళ్లు, తెగడ, త్రికటుకములు, చిత్రమూలము, వీనిని ప్రత్యేకము అర్ధపలమువంతున జేర్చి కల్కముచేసి రెండుప్రస్థములు ఆవుపాలతో కలిపి సగము మిగులునట్లు కాచి పిత్తముతోకూడిన వాతముచే గల్గిన శోఫమునం దుపయోగించునది (త్రాగవలెను). ఇచ్చట ఔషధద్రవ్యములకన్న క్షీరము ప్రమాణాధికమగును కావున క్షీరమును మితముగ జేర్చవలెనని కొందరు చెప్పెదరు.

### కొన్నిశోఫశమనోపాయము.

మూ. సశుణ్ఠీపీతద్రురసం ప్రయోజ్యం శ్యామోరుబూకోషణసాధితంవా
త్వగ్దారువర్షాభుమహౌషధైర్వా గుడూచికానాగరదన్తిభిర్వా. 25
సప్తాహమాత్రం త్వథవాపి మాసం పయః పిబేత్ భోజనవారివర్జి
గవ్యం సమూత్రం మహిషీపయోవా క్షీరాశనో మూత్ర
మథో గవాం వా. 26

తక్రం పిబేద్వా గురుభిన్నవర్చాః సవ్యోషసౌవర్చలమాక్షికం చ,
గుడాఽభయాం వా గుడనాగరం వా సదోషభిన్నామ
విబద్ధవర్చాః. 27

విడ్వాతసంగే పయసా రసైర్వా ప్రాగ్భక్తమద్యాత్ ఉరుబూక
తైలమ్, స్రోతోవిబన్ధేఽగ్నిరుచిప్రణాశే మద్యాన్యరిష్టాంశ్చ
పిబేత్ సుజాతాన్. 28

వ్యా. శుంఠి, దేవదారుచెక్క, ఈరెంటికషాయమునైనను త్రాగవలెను. మరియు నల్లతెగడ, ఆముదపువేళ్లు, పిప్పళ్లు, (మిరియాలు), వీనిని కల్కమును ఒంటెపాలతో చేర్చియైనను; దాల్చినిచెక్క(లవంగపుపట్ట), దేవదారుచెక్క, గలిజేరువేళ్లు, శుంఠి, వీని చేర్చియైనను; తిప్పతీగె, శుంఠి, దంతివేళ్లు వీని చేర్చియైనను, ఒంటెపాలను పక్వముచేసి

యేడుదినములైనను ఒక నెలదినములైనను ఆహారమునకుబదులు సేవించుచు భోజనమును నీళ్లను విసర్జించియుండవలెను. మరియు ఆవుపాలతో గోమూత్రమును కలిపియైనను, గేదెపాలతో గోమూత్రమును కలిపియైనను, గోమూత్రమునైనను, పైజెప్పినరీతిగ నేడుదినములైనను ఒకమాసముదినములైనను సేవించుచు, పాలనే ఆహారముగ జేయుచు నుండవలెను.

మరియు గురుత్వముకల్గి మలము పలుచనై వెడలుచున్నపుడు త్రికటుకములను సౌవర్చలలవణమును వీనిని చూర్ణముచేసి మజ్జిగతో కలిపి అందు మితముగ తేనెజేర్చి పైజెప్పినరీతిగ త్రాగవలెను. దోషముతోగూడి ఆమమైనమలము బద్ధగించి వెడలుచున్నపుడు కరకకాయలచూర్ణమునైనను శుంఠిచూర్ణమునైనను బెల్లముతో గలిపి సేవించవలెను. మలంబును వాతంబును సరళముగ వెడలకుండునపుడు ఆముదమును ఆవుపాలతోనైనను, మాంసరసముతోనైనను చేర్చి భుజించుటకుముందు త్రాగవలెను. మరియు స్రోతస్సులు బంధింపబడి అగ్నిమాంద్యంబును అరుచియు కల్గినపుడు చక్కగ సిద్ధముచేయబడిన మద్యములను అరిష్టములను త్రాగవలెను.

## శోఫాములకు గండీరాద్యరిష్టము.

మూ. గణ్డీరభల్లాతకచిత్రకాంశ్చ వ్యోషం విడఙ్గం బృహతీద్వయం చ, ద్విప్రస్థకం గోమయపావకేన ద్రోణే పచేత్కూర్చిక (కాంజిక) మస్తునస్తు. 29

త్రిభాగశేషం చ సుపూతశీతం ద్రోణేన తత్రావ్కృతమస్తునా చ, సితోపలాయాశ్చ శతేన యుక్తం లిప్తే ఘటే చిత్రకపిప్పలీనామ్. 30

వైహాయనే స్థాపితమూదశాహాత్ప్రయోజయం స్తద్వినిహన్తి శోఫాన్, భగన్దరాంర్శః క్రిమికుష్ఠమేహాన్ వైవర్ణ్యకార్శ్యానిలహిక్కనశ్చ. 31

(ఇతి గణ్డీరాద్యరిష్టమ్.)

వ్యా. ఏరుపంగ లేక(గురిజకూర), జీడిగింజలు, చిత్రమూలము, త్రికటుకములు, వాయువిడంగములు, వాకుడు, ములక వీనిని రెండుప్రస్థములు గ్రహించి కూర్చి కయనెడు క్షీరవికృతియొక్కద్రవమును ద్రోణపరిమితమున పైజెప్పినద్రవ్యముల జేర్చి మూడవపాలు మిగులునట్లు ఏరుడుపిడకల మూటున పెట్టి పక్వముచేసి చల్లారినపిదప వడగట్టి

అందు సామాన్యమైన పెరుగుమీఁది తేటను ఒక ద్రోణపరిమితమును కూడ కలిపి నూరు పలముల కలకండను అందు కలిపి యుంచునది. ఒక క్రొత్తకుండకు చిత్రమూలమును పిప్పళ్లను నూరి లోపలపూసి యెండబెట్టి యాకుండలో పైఁజెప్పినయౌషధమును జేర్చి యాకుండను పదిదినములవరకు భూమికి తగలకుండునట్లు వ్రేలాడకట్టి యుంచి పిమ్మట నాయరిష్టమును బలానుసారముగ సేవించినయెడ శోఫలు నివర్తించును. మరియు భగంనదరము, అర్శోరోగము, క్రిమిరోగము, కుష్ఠములు, ప్రమేహములు, వైవర్ణ్యము(వర్ణము మారియుండుట)కృశత్వము, వాతముచే కల్గినయెక్కిళ్లు ఇవియన్నియు నశించును.

ఇచ్చట కూర్చికయని పెరుగునైనను, మజ్జిగనైనను, పాలతో సమభాగముగ కలిపి పక్వముచేసినయెడ పాలు విరిగి తేటగ నొకభాగమును ఘనపదార్థంబుగ నొక భాగంబుగను ఏర్పడును. అయ్యది పెరుగుతో జేసినది దధికూర్చికయనియు, మజ్జిగతో చేసినది తక్రకూర్చికయనియు పిలువబడును. దీనిలక్షణము తంత్రాంతరమున నిట్లు చెప్పబడినది:—"దధ్నా సహచ యత్పక్వం క్షీరం సదధికూర్చికా, తక్రేణ పక్వం యత్ క్షీరం సా భవేత్తక్రకూర్చికా." ఈయోగమున "కూర్చికవస్తునః" అనుపదముచేత దధికూర్చికయందలి తేటనీరు అని అర్థమగును. "ప్రాకృతవస్తునా చ" అనుచోట సాధారణమైన పెరుగుమీఁది తేట నీరు యని యర్థము.

## శోఫాదులకు అష్టశతారిష్టము.

మూ. కాశ్మర్యధాత్రీమరిచాభయాక్షద్రాక్షాఫలానాం చ సపిప్పలీ
నామ్, శతం శతం జీర్ణగుడాత్తులాఞ్చ సంక్షుద్య కుమ్భే మధునా
ప్రలిప్తే 32
సప్తాహముష్ణే ద్వ్యగుణం తు శీతే స్థితం జలద్రోణయుతం
పిబేన్నా, శోథాన్విబన్ధాస్కఫవాతజాంశ్చ నిహన్త్యరిష్టోఽష్ట
శతోఽగ్నికృచ్చ. 33

(ఇతి అష్టశతారిష్టః.)

వ్యా. నేలగుమ్మిడిగడ్డ, ఉసిరికకాయలబెరడు, మిరియాలు, కరకకాయలబెరడు, ద్రాక్షపండు, పిప్పళ్లు, ఈయేడుదినుసులును ఒక్కొక్కటి నూరేసిపలముల పంతున చేర్చి అందు నూరుపలములు పాతబెల్లమును కలిపి మెత్తనగునట్లు దంచి తేనెపూసినకుండలో నునిచి అందు ఒక ద్రోణము నీళ్లుపోసి మూసి వాసనకట్టి యెండకాలమైనచో నేడుదినములును, శీతకాలమైనచో పదునాలుగుదినములును భద్రముగనుంచునది. ఈయరిష్టమును

అష్టశతారిష్ట మనబడును. దీనిని అగ్నిబలాద్యనుసారముగ సేవించినయెడ శోఫములన్నియు నివర్తించును. మరియు బలాదివిబంధములను, కఫవాతములచే కల్గినరోగములను హరించును. జఠరాగ్నిని దీపింపజేయును.

### పునర్నవాద్యరిష్టము.

మూ. పునర్నవే ద్వే చ బలే సపాఠే దన్తీం గుడూచీమథ చిత్రకం చ,
నిదిగ్ధికాం చ త్రిఫలాని పక్త్వా ద్రోణావశేషే సలిలే తతస్తమ్. 34
పూత్వా రసం ద్వే చ గుడాత్పురాణాత్తులే మధుప్రస్థయుతం సుశీతమ్, మాసం నిదధ్యాద్ఘృతభాజనస్థం పల్లే యవానాం పరతస్తు మాసాత్. 35
చూర్ణీకృతైరర్ధపలాంశికైస్తం పత్రత్వగేలామరిచాంబులోహైః, గన్ధాన్వితం క్షౌద్రఘృతప్రదిగ్ధే జీర్ణే పిబేద్వ్యాధిబలం సమీక్ష్య. 36
హృత్పాండురోగం శ్వయథుం ప్రవృద్ధం ప్లీహజ్వరారోచకమేహగుల్మాన్, భగన్దరం షడ్జఠరాణి కాసం శ్వాసం గ్రహణ్యామయకుష్ఠకణ్డూః. 37
శాఖానిలం బద్ధపురీషతాం చ హిక్కాం కిలాసం చ హలీమకం చ, క్షిప్రం జయేద్వర్ణబలాయురోజస్తేజోన్వితో మాంసరసాన్నభోజీ. 38

(ఇతి పునర్నవాద్యరిష్టః.)

వ్యా. తెల్లగలిజేరు, ఎఱ్ఱగలిజేరు, చిట్టాముట్టి, పేరాముట్టి, చిరుబొద్ది, దంతి, తిప్పతీగ, చిత్రమూలము, ములక, వీనిని ప్రత్యేకము రెండేసిపలములవంతున చేర్చి నలియగొట్టి నాల్గుద్రోణములు నీటిలోవేసి ద్రోణమాత్రము మిగులునట్లు కషాయము కాచి వడగట్టియుంచుకొని అందు రెండుతులములు (రెండువందలపలములు) ప్రాతబెల్లమును కలిపి ఒకప్రస్థము తేనెను చల్లారినపిదప పోసి నేతితో మాగినకుండలో పోసి యవధాన్యములరాశిలో పదిలముగ నొకమాసము నునిచి నెలదినములు గడచినపిదప అందు దాల్చినిచెక్క, ఆకుపత్రి, యేలకులు, మిరియాలు, కురువేరు, లోహచూర్ణము, వీనిని ప్రత్యేక మర్ధపలముచొప్పున గ్రహించి చూర్ణించి, పైయౌషధమున కలిపి నేతిని

తేనెను పూసిన యొకప్రాంతకుండలో నునిచి రోగియొక్క వ్యాధిబలానుసారముగ సేవించునది.

దీనివలన హృద్రోగము, పాండురోగము, శోఫ, ప్లీహము, జ్వరము, అరోచకము, ప్రమేహములు, గుల్మములు, భగందరము, ఛిద్రోదరము, జలోదరము, దక్క తక్కిన ఉదరములారు, శ్వాసకాసములు, గ్రహణీరోగము, కుష్ఠము, దురద, హస్తపాదాదులయందుకలిగిన వాతరోగములు, మలబద్ధకము, ఎక్కిళ్లు, కిలాసకుష్ఠము, హాలీమకము, ఈరోగముల నన్నిటిని హరించును. శరీరమునకు వర్ణమును కల్గించి బలమును, ఆయువును, ఓజస్సును, తేజస్సును, వృద్ధినొందించును. మరియు దీనిని సేవించునపుడు మాంసరసముతో కూడినయన్నమును భుజింపవలయును. ఇయ్యది పునర్నవాద్యరిష్ట మన బడును.

ఇచ్చట "ద్రోణావశేషే సలిలే" అనియుండుటచేత క్వాథము చతుర్థావశిష్ట మయినది ద్రోణపరిమితమని తెలియుచున్నదిగాన నాల్గుద్రోణములు జలమున పునర్నవాదిక్వాథ్యద్రవ్యములను ప్రత్యేకము రెండేసిపలములవంతున చేర్చి చతుర్భాగావశేషముగ కషాయమును సిద్ధముచేయవలయును.

## త్రిఫలాద్యరిష్టము.

మూ. ఫలత్రికం దీప్యకచిత్రకౌ చ సపిప్పలీలోహరజో విడఙ్గం, చూర్ణీ
కృతం కౌడవికం ద్విరంశం క్షౌద్రం పురాణస్య తులాం గుడస్య. 39
మాసం నిదధ్యాత్ ఘృతభాజనస్థం యవేషు తేనైవ నిహన్తి
రోగాన్, యే చార్శసాం పాణ్డువికారిణాం చ ప్రోక్తా హితాః
శోఫిషు తేఽప్యరిష్టాః 40

(ఇతి త్రిఫలాద్యరిష్టః.)

వ్యా. త్రిఫలములు, ఓమము, చిత్రమూలము, పిప్పళ్లు, ఉక్కురాపొడి, వాయువిడంగములు, వీనినన్నిటిని సమభాగములు చేర్చి రెండుప్రస్థములు పరిమితముండునట్లు చూర్ణముచేసి యాచూర్ణమునకు నాల్గింతలు (8 ప్రస్థములు) నీళ్లు పోసి నాలుగవపాలు (రెండుప్రస్థములు) మిగులునట్లు కషాయముకాచి యాకషాయమున రెండుకుడవములు తేనెయు, ప్రాతబెల్లము నూరుపలములును, కలిపి వీనినన్నిటిని నొక నేతితోమాగిన కుండలోపోసి పదిలముగ మూతమూసి ధాన్యపురాసిలో నొకనెలరోజులుంచి సేవించినచో పైజెప్పిన హృద్రోగ పాండురోగాదులన్నియు శమించును.

మరియు అర్శోరోగహరములుగను పాండురోగహరంబుగను చెప్పబడిన అరిష్టములన్నియు శోఫరోగములయందు చాల హితకరములై యుండును.

ఇచ్చట త్రిఫలములు మున్నగునవి యెనిమిది ద్రవ్యములను ప్రత్యేక మొక్కొక్క కుడవమువంతున ముప్పదిరెండుపలములు (రెండు ప్రస్థములు) అగును. ఈ ద్రవ్యచూర్ణము నకు నాలుగింతలు నీళ్లుపోసి చతుర్థాంశము మిగులకాచినచో రెండు ప్రస్థములు కషాయ మేర్పడును. ఈకషాయమును వడగట్టి అందు నూరుపలములు, ప్రాతబెల్లమును, రెండు కుడవములు తేనెను చేర్చవలయునని యెరుంగునది.

## శోఫనాశకచూర్ణములు.

మూ. కృష్ణా సపాఠాగజపిప్పలీ చ నిదిగ్ధికా చిత్రకనాగరే చ,
సపిప్పలీమూలరజన్యజాజీ ముస్తం చ చూర్ణం సుఖతోయపీతమ్.
హన్యాత్త్రిదోషంచిరజంచశోఫం,కల్కశ్చభూనిమ్బమహౌషధస్య,
అయోరజస్త్ర్యూషణయావశూకచూర్ణం చ పీతం త్రిఫలాకషాయైః. 42

వ్యా. పిప్పళ్లు, చిరుబొద్ది, గజపిప్పళ్లు, ములక, చిత్రమూలము, శుంఠి, పిప్పలీ మూలము (మోడి)పసుపు, జీలకర, తుంగగడ్డలు, వీనినన్నిటిని సమభాగములుగ జేర్చి చూర్ణముచేసి సుఖోష్ణముగనుండు వేడినీళ్లతో పుచ్చుకొనిన త్రిదోషములచే నైనట్టి చిర కాలమునుండియు బాధించుచుండు శోఫముల హరించును. మరియు నేలవేము, శుంఠి, లోహభస్మము, త్రికటుకములు, యవక్షారము, వీనిని చూర్ణముచేసి త్రిఫలాకషాయ ముతో సేవించినను శోఫములు హరించును. (ఇచ్చట 'త్రిదోషజం' అనుచోట వాతాదు లతో వేరువేరుగనైనను అన్నిటిచేనైనను సంభవించినశోఫము హరించునని యర్థము.)

## శోఫాదులకు క్షారవటి.

మూ. క్షారద్వయం స్యాల్లవణాని చత్వార్యయోరజో వ్యోషఫలత్రికే
చ, సపిప్పలీమూలవిడఙ్గసారం ముస్తాఽజమోదా[illegible]
బిల్వమ్. 43
కలిఙ్గకాశ్చిత్రకమూలపాఠే యష్ట్యాహ్వయం [illegible]
పలాంశమ్, సహిఙ్గు కర్షం త్విణుశుష్కచూర్ణం ద్రోణం [illegible]
మూలకశుణ్ఠకానామ్. 44
స్యాద్భస్మనస్తత్ సలిలేన సాధ్యమాలోడ్య [illegible]

గ్ధమ్, స్త్యానం తతః కోలసమాస్తు మాత్రాం కృత్వా సు
ష్కాం విధినోపయుంజ్యాత్. 4
ప్లీహోదరశ్విత్రహలీమకార్శః పాణ్డ్వామయాఽరోచకశోష శ
షాః, విషూచికాగుల్మగరాశ్మరీశ్చ సశ్వాసకాసాః ప్ర
దేత్సకుష్ఠాః. 4

(ఇతి క్షారగుటికా

వ్యా. సర్జక్షారము, యవక్షారము, లవణచతుష్టయము (సౌవర్చలలవణ సైంధవలవణము, బిడాలవణము, ఔద్భిదలవణము), లోహచూర్ణము, త్రికటుకము త్రిఫలములు, మోడి, వాయువిడంగములలోని విత్తనములు, తుంగగడ్డలు, ఓమ దేవదారు, బిల్వము, కొడిసెపాలవిత్తులు, చిత్రమూలము, చిరుబొద్ది, అతిమధుర అతివస, ఇవి ప్రత్యేక మొక్కొక్కపలము, ఇంగువ ఒకకర్షము, వీనినన్నిటిని మెత్తగ చూర్ణముచేసి ముల్లంగి శుంఠి ఈరెండిటిని భస్మముజేసి యాభస్మమును ఒకద్రోణ పైజెప్పినచూర్ణమును నాల్గింతలనీళ్లలోకలిపి ప్రొయిమీదబెట్టి గరిటెచే కలియద్రిప్పు మాడకుండ ముద్దగ నగునంతవరకును వండవలెను. ఆయౌషధము ముద్దగ పక్వమైనపి రేగుపండంతేసి మాత్రలజేసి చక్కగ నెండించి యుంచునది. ఇది క్షారగుటిక య బడును.

ఈగుటికను పూట కొకటిచొప్పున తిన్నయెడ ప్లీహము, ఉదరము, శ్విత్రకుష్ఠ హలీమకము, అర్శోరోగము, పాండురోగము, అరోచకము, శోషము, శోఫము, విష చిక, గుల్మము, గరమనువిషము, అశ్మరియను మూత్రరోగము, శ్వాసకాసములు, కు ములు, అను నీరోగముల నన్నింటిని హరించును.

ఇచ్చట లవణచతుష్కమనః—దీర్ఘం జీవితీయాధ్యాయమున "సౌవర్చలం సై వంచ బిడమాద్భిదమేవచ సాముద్రేణ సహైతాని పఞ్చ స్యుర్లవణాని చ" (సూ. అ. శ్లో. ౧౧) అని చెప్పబడిన పంచలవణములలో సాముద్ర మొక్కటిదక్క తక్కినసా లవణములును గ్రహింపబడును. ఈవిషయము "ఏకద్విత్రిచతుః పఞ్చలవణాని క్ర ద్భవేత్" అని తంత్రాంతరమున జెప్పబడినది.

శోఫాదులకు గుడార్ద్రకప్రయోగము.

మూ. ప్రయోజయేదార్ద్రకనాగరం వా తుల్యం గుడేనార్ధపల
వృద్ధ్యా, మాత్రా పరం పఞ్చపలాని మాసం జీర్ణే పయోయూ
రసాశ్చ భక్తమ్. 4

గుల్మోదరార్శః శ్వయథుప్రమేహాఞ్ శ్వాసప్రతిశ్యాయాలసకావిపాకాన్, సకామలాశోషమనోవికారాన్ కాసం కఫం చైవ జయేత్ప్రయోగః. 48

(ఇతి గుడార్ద్రకప్రయోగః.)

వ్యా. పచ్చియల్లమును బెల్లమును సమభాగముగ చేరి అర్ధపలపరిమితముగ చేర్చి మెత్తగ దంచి మొదటిదినము సేవించునది. రెండవదినము మొదలు (అల్లము బెల్లము చేరి) దినమున కర్ధపలమువంతున హెచ్చించుచు అయిదుపలము లగువరకును ప్రతిదినము సేవించునది. పదిదినములకు ఐదుపలములగును. పదునొకండవదినము మొదలు ప్రతిదినము నైదుపలములే సేవించునది. ఇత్తెరంగున నొకమాసము సేవించునది. దీనిని సేవించునపుడు మందు జీర్ణమైనపిదప పాలను యూషములను మాంసరసములను చేర్చి యన్నము భుజింపనగును.

దీనిప్రయోగమువలన గుల్మములు, ఉదరములు, అర్శస్సు, శోఫ, ప్రమేహములు, శ్వాసము, పీనసము, ఆలసకము, అజీర్ణము, కామల, శోషము, మనోవికారములగు నపస్మారాదులు, కాసము, కఫము, ఇవియన్నియు నశించును. (ఇచ్చట ''పంచపలాని'' అల్లము బెల్లమును చేరి యర్ధపలముగ నుండునట్లు దినాభివృద్ధివంతున ఐదుపలములయిన యెడ అది పరిమాణమునకు పరమావధియని యర్థము. వేరువేరుగ నర్ధపలమును జేర్చు నెడ మాత్రాధికమై రెండును చేరి పదిపలములు పరమావధియగును. మాత్రాధిక్యమునంజేసి యగ్ని బొత్తుగ చల్లారును. కావున రెండును చేరి యర్ధపలమనియు పరమావధి రెండును చేరి యైదుపలములనియు చెప్పుట సమంజసము).

## అర్ద్రకరసప్రయోగము.

మూ. రసస్తథైవార్ద్రకనాగరస్య పేయోఽథజీర్ణేపయసాఽన్నమద్యాత్,

వ్యా. మరియు పచ్చియల్లమును రసముదీసి యారసమును బెల్లమును అర్ధపలమువంతున పైజెప్పినరీతిగ దినాభివృద్ధిచేయుచు అదేరీతిగ నొకమాసము సేవించి జీర్ణమైన పిదప పాలతో నన్నము భుజించినను పైజెప్పినవ్యాధులన్నియు నివర్తించును.

## శిలాజతుప్రయోగము.

మూ. జత్వశ్మజం (శిలాహ్వయం) చ త్రిఫలారసేన హన్యాత్త్రిదోషం శ్వయథుం ప్రసహ్య. 49

(ఇతి శిలాజతుప్రయోగః.)

వ్యా. శిలాజతువును త్రిఫలాకషాయముతో సేవించినచో త్రిదోషములచే కలిగినశోఫము నివర్తించును.

## కంసహరీతకీయోగము.

మూ. ద్విపఞ్చమూలస్య పచేత్కషాయే కంసేఽభయానాం చ శతం గుడస్య, లేహే సుసిద్ధేఽథ వినీయ చూర్ణం వ్యోషం త్రిసౌగన్ధ్య ముపాస్థితే చ. 50

ప్రస్థార్ధమాత్రం మధునస్సుశీతే కిఞ్చిచ్చ చూర్ణాదపి యావశూకాత్, ఏకాభయాం ప్రాశ్య తతశ్చ లేహాత్ శుక్తిం నిహన్తి శ్వయథుం ప్రవృద్ధమ్. 51

శ్వాసజ్వరాఽరోచకమేహగుల్మప్లీహత్రిదోషోదరపాణ్డురోగాన్, కార్శ్యామవాతావసృగమ్లపిత్తవైవర్ణ్యమూత్రానిలశుక్రదోషాన్.

(ఇతి కంసహరీతకీ.)

వ్యా. ద్విపంచమూలములు (బిల్వవేరు, దుండిగపువేరు, గుమ్మడివేరు, కలిగొట్టువేరు, తక్కెలవేరు, (ఇవి మహాపంచమూలములు); ముయ్యాకుపొన్నవేరు, కోలపొన్నవేరు, వాకుడువేరు, పెద్దములకవేరు, పల్లేరువేరు, (ఇవి హ్రస్వపంచమూలములు) ఈ రెండుగణములును చేరి ద్విపంచమూలములు) ఆఢకపరిమితమును గ్రహించి అందు నాలుగాఢకములు నీళ్లుపోసి నాల్గవవంతు కంస-(అరువదినాల్గుపలముల) పరిమితము మిగుల కషాయముకాచి వడగట్టి యాకషాయమున నూరు కరకకాయలను, ఒకతులము (నూరుపలములు) బెల్లమును చేర్చి వండునది. అయ్యది పాకమువచ్చునపుడు త్రికటుకములచూర్ణమును నాల్గుపలములును, త్రిసుగంధ (లవంగపుపట్ట, లవంగపుపత్రి, ఏలకులు) చూర్ణమును రెండుపలములును కలిపి, లేహపాకముగ పక్వముచేసి చల్లారినపిదప అందు అర్ధప్రస్థము (ఎనిమిదిపలములు) తేనెచేర్చి, రెండుపలములు యవక్షారముచేర్చి పదిలముగ నుంచునది. (ఇది కంసహరీతకియని చెప్పబడును).

పైజెప్పిన యౌషధములోనుండు నొకకరకకాయను తిని, వెంటనే యాలేహమును నొకశుక్తి(అర్ధపలము) మాత్రమును ప్రతిపూటకు సేవించునది. దీనివలన శోఫము నివర్తించును. మరియు శ్వాసము, జ్వరము, అరోచకము, ప్రమేహములు, గుల్మములు, ప్లీహావృద్ధి, త్రిదోషములచేగల్గిన యుదరములు, పాండురోగములు, కృశత్వము, ఆమవాతము, వాతరక్తము, (రక్తపిత్తము), అమ్లపిత్తము, వివర్ణత్వము, మూత్రరోగము, వాతరోగములు, శుక్రదోషము వీనినన్నింటిని హరించును.

ఇచ్చట నీకల్పనావిధానము నెఱుంగునది:—"కషాయే కంసే" అని సిద్ధమైనకషాయపరిమాణము చెప్పబడినది, కావున సామాన్యపరిభాష ననుసరించి ద్విపంచమూలముల సముదాయము(క్వాథ్యము)ను కంసపరిమాణము (అరువదినాల్గుపలములు)చేర్చి క్వాథ్యమునకు నాల్గింతలు (నాల్గుఆఢకములు) జలమును చేర్చి చతుర్థభాగావశిష్టముగ క్వాథమును సిద్ధము చేయవలెను.

ఆక్వాథమున నూరుపలములు బెల్లమును జేర్చి పాకమువచ్చునపుడు త్రికటుకచూర్ణమును త్రిసుగంధచూర్ణమును చేర్చవలయును. ఈచూర్ణములకు పరిమాణమును చెప్పియుండలేదు కావున ఇతరస్థలముల చెప్పియుండున్యాయము ననుసరించి పరిమాణము నిర్ణయింపనగును. ఎట్లనగా:—అగస్త్యహరీతకీయోగమున "పిప్పలీచూర్ణం దద్యాత్ కుడవమాత్రయా"అని నూరుపలముల గుడపాకముచే సిద్ధమగుయోగమున కటుచూర్ణమును నాల్గుపలములుగ జెప్పబడినది. చ్యవనప్రాశనయోగమున "పిప్పలీ ద్విపలా దేయా"అని ఏబదిపలములపాకముచే సిద్ధమగుయోగమున పిప్పలిచూర్ణమును పరిమాణము రెండుపలములుగ జెప్పబడినవి. కావున నూరుపలమున గుడపాకముచే సిద్ధమగు నీయోగమందును పైన్యాయము ననుసరించి త్రికటుకచూర్ణమును నాల్గుపలములు చేర్చవలయును. మరియు చ్యవనప్రాశనయోగమున పరిమళమునకై జేర్చునట్టి చాతుర్జాతమునకు పలపరిమాణము జెప్పబడినది. తదనుసారముగ నిచ్చట సుగంధమునకై జేర్పబడు త్రిసుగంధము రెండుపలములపరిమితము జేర్పదగును. ఈన్యాయము ననుసరించి ఇతరస్థలములయందు కటుద్రవ్యములకు పరిమాణము జెప్పకుండునపుడు గుడాదిపాకము నూరుపలములకు నాల్గుపలములును సుగంధద్రవ్యములు నూటికి రెండుపలములవంతునను జేర్పవలయును. మరియు యవక్షారమునకు పరిమాణమును జెప్పక "కించిత్"అని చెప్పబడినది. కించిత్పరిమాణము అనగా త్రికటుకచూర్ణములో సగమని అర్థముచేసి చేర్పనగును. కొందరు "కించిత్" అనునది కర్షప్రమాణమునకు పర్యాయమని చెప్పెదరు.

### శోఫములకు పటోలాదిఘృతము.

మూ. పటోలమూలామరదారుదన్తీ త్రాయన్తిపిప్పల్యభయావిశాలాః,
యష్ట్యాహ్వాయన్తిక్తకరోహిణీచ సచన్దనాస్యాన్నిచులాని దార్వీ.
కర్షోన్మితైస్తైః క్వథితః కషాయః ఘృతేన పేయః కుడవేన యుక్తః,
వీసర్పదాహజ్వరసన్నిపాతతృష్ణావిషాణి శ్వయథుం చ హన్తి. 54

వ్యా. చేదుపొట్లవేరు, దేవదారుచెక్క, దంతివేళ్లు, కలుత్రానుకపట్ట, పిప్పళ్లు, కరకకాయలు, పెద్దపాపర, అతిమధురము, కటుకరోహిణి, చందనము, నీరుప్రబ్బలి,

ఈద్రవ్యములను ప్రత్యేకము కర్షప్రమాణమువంతున చేర్చి యెనిమిదింతలు నీళ్లుపోసి నాల్గవపాలు మిగుల కషాయముకాచి అందు కుడవమాత్రము (నాల్గుపలములు) నేతిని కలిపి త్రాగినయెడ విసర్పము, తాపము, జ్వరము, సన్నిపాతము, దప్పి, విషములు, శోఫము, వీనినన్నింటిని హరించును.

ఇచ్చట:—“కర్షాదితః పలం యావత్ దద్యాత్ షోడశకం జలమ్, తతశ్చ కుడవం యావత్ తోషమష్టగుణం భవేత్.” అనుపరిభాషానుసారముగ మూడుపలముల పరిమితమైన పటోలమూలాదిక్వాథ్యద్రవమున అష్టగుణజలమును (ఇరువదినాల్గుపలములు) చేర్చి నాల్గవపాలు (ఆరుపలములు) మిగుల కషాయము కాచవలెను. అందు నాల్గుపలములు నేతినిచేర్చి త్రాగవలెను. చేదుపొట్ల మున్నగునవి పండ్రెండును కర్షము వంతునచేరి సముదాయము మూడుపలములు క్వాథ్యమగును.

## చిత్రకాదిఘృతము.

మూ. సచిత్రకం ధాన్యయవాన్యజాజీ సౌవర్చలం త్ర్యూషణవేతసామ్లం,
బిల్వాత్ఫలం దాడిమయావశూకౌ సపిప్పలీమూలమథాపి
చవ్యమ్. పిష్ట్వాఽక్షమాత్రాణి జలాఢకేన పక్త్వా ఘృతప్రస్థమథ
ప్రయుంజ్యాత్! 55
ఆర్శాంసి గుల్మం శ్వయథుం చ కృచ్ఛ్రం నిహన్తి వహ్నించ
కరోతి దీప్తిమ్.

వ్యా. చిత్రమూలము, దనియాలు, ఓమము, జీలకర, సౌవర్చలలవణము, త్రికటుకములు, అమ్లవేతసము, మారేడుపండు, దానిమ్మకాయలు, యవక్షారము, పిప్పలిమూలము (మోడి), చవ్యము వీనిని ప్రత్యేకము కర్షమాత్రముగ గ్రహించి నూరి కల్కము చేసి యొకఆఢకజలమునచేర్చి నాల్గవవంతు మిగుల కషాయముకాచి అందు ప్రస్థపరిమిత ఘృతమునుచేర్చి ఘృతపాకవిధిప్రకారము పక్వముచేసి ప్రతిదినము సేవించినచో నర్శోరోగంబులును, గుల్మంబును, కష్టసాధ్యమగు శోఫంబును హరించును. జాతరాగ్నిని దీపింప చేయును. (ఇచ్చట “బిల్వాత్ పలమ్” అని పఠించి బిల్వము పలప్రమాణమనియు తక్కినవి ప్రత్యేకము కర్షప్రమాణమనియు భాగభేదమును కొందరు చెప్పెదరు).

## చిత్రకఘృతము.

మూ. పిబేద్ఘృతం వాఽష్టగుణాంబుసిద్ధం సచిత్రకక్షారముదారవీర్యం,
కల్యాణకం వాఽపి సపఞ్చగవ్యం తిక్తం మహాద్వాఽప్యథతిక్తం వా.

వ్యా॰ ఘృతమున చిత్రమూలమును యవక్షారమును (ఘృతమునకు నాల్గవవంతు) చేర్చి, ఘృతమునకు ఎనిమిదింతలు నీళ్లుపోసి ఘృతపాకవిధిగ కాచి సేవించునది. ఇది మిక్కిలి బలిష్ఠమైన వీర్యము కల్గినది. మరియు కల్యాణఘృతముసైనను, పంచగవ్య ఘృతముసైనను, తిక్తకఘృతముసైనను, మహాతిక్తకఘృతముసైనను సేవించినయెడ శోఫ మును హరించును.

చిత్రకఘృతయోగము.

మూ. క్షీరం ఘటే చిత్రకకల్కలిప్తే దధ్యాగతం సాధు విమథ్య తేన,
తజ్జంఘృతంచిత్రకమూలగర్భం తక్రేణసిద్ధంశ్వయథుఘ్నమగ్ర్యమ్
అర్శోఽతిసారానిలగుల్మమేహాంశ్చైతన్నిహన్త్యగ్నిబలప్రదంచ,
(అర్శాంసి సామానిలగుల్మమేహాం స్తద్ధన్తిదీప్తంచకరోతివహ్నిం),
తక్రేణచాద్యాత్సఘృతేనతేనభోజ్యానిసిద్ధామథవాయవాగూమ్.
(ఇతి చిత్రకఘృతమ్.)

వ్యా॰ చిత్రమూలమువేరును నూరి కల్కముచేసి యాకల్కమును ఒకకుండలో ప్రక్కన పూసి (యెండించి) చక్కగ కాగినపాలను ఆకుండలో బోసి చేమిరిబెట్టి యుంచునది. అయ్యది చక్కగ పేరినపిదప కవ్వముతో చిలికి వెన్నదీసి కాచి యా నేతిని యామజ్జిగలో జేర్చి నేతికి నాల్గవవంతు చిత్రమూలకల్కమును కలిపి ఘృతపాక విధిగ పక్వముచేసిన నయ్యది చిత్రకఘృతము. ఇయ్యది శోఫమును హరించుటకు చాల శ్రేష్ఠమైనది.

మరియు అర్శోరోగంబులును, అతిసారంబును, వాతరోగంబులును, గుల్మంబు బును, ప్రమేహంబులును నివర్తించును. అగ్నికి బలమును కల్గించును మరియు దీనిని సేవించునప్పుడు పైజెప్పినరీతిగ సిద్ధముచేయబడిన మజ్జిగను జేర్చి భోజ్యముల నన్నిటిని పైజెప్పినరీతిగ పక్వముచేయబడిన పెరుగువలన నేర్పడిననేతిని జేర్చి సంస్కరించి భుజింపవలెను. లేక అట్టి మజ్జిగను నేతిని చేర్చి సిద్ధముచేయబడిన యవాగువును ఆహార ముగ జేయవలెను.

శోఫములయం దుపయోగ్యములగు యవాగువులు.

మూ. జీవన్త్యజాజీశటిపుష్కరాహ్వైః సకారవీచిత్రకబిల్వమధ్యైః,
సయావశూకైః బదరప్రమాణైః వృక్షామ్లయుక్తా ఘృతతైల
భృష్టా. 60

అర్శోఽతిసారాఽనిలగుల్మశోఫహృద్రోగమన్దాగ్ని హితా య
వాగూః; యా పఞ్చకోలైః (పఞ్చమూలైః) విధినైవ తేన
సిద్ధా భవేత్ సాచ సమా తయైవ. 61

వ్యా. మనుబాల, జీలకర, కచోరము, పుష్కరమూలము, నల్లజీలకర, (లేక ఓమము), చిత్రమూలము, మారేడుకాయలోనిగుజ్జు, యవక్షారము వీనిని ప్రత్యేకము ఒక్కొకదానిని బదరప్రమాణము (రెండుశాణములు-అర్థకర్షము) వంతునజేర్చి చింతపండు పులుపును కలిపి, నేతితోను తైలము (నువ్వులనూనె)తోను తిరుగబోతబెట్టి పక్వముచేయబడిన యవాగువు నుపయోగించినచో నర్శోరోగంబులును, అతిసారంబులును, వాతవ్యాధులును, గుల్మంబులును, శోఫములును, హృద్రోగంబును, మందాగ్నియు హరించును. (పైజెప్పిన యవాగువును అర్శోరోగాదులయందు ఆహారముచేయుటకు చాల హితకరమని భావము.)

మరియు పంచకోలములను జీవంత్యాదిద్రవ్యములకు బదులుగ జేర్చి పైజెప్పిన రీతిగ సిద్ధముచేయబడిన యవాగువును పైజెప్పిన గుణముల గల్గియుండును.

### శోఫరోగికి కులుత్థయూషాదులు.

మూ. కులుత్థయూషశ్చ సపిప్పలీకః మౌద్గశ్చ సత్ర్యూషణయావశూకః,
రసస్తథా విష్కిరజాఙ్గలానాం సకూర్మగోధాశిఖిశల్లకానామ్. 62
సువర్చికా గృఞ్జనకం పటోలం సవాయసీమూలకవేత్రనిమ్బం,
శాకార్థినాం శాకమితి ప్రశస్తం భోజ్యేపురాణశ్చ యవస్సశాలిః.

వ్యా. పిప్పలిచూర్ణముతోకూడిన ఉలవకట్టును, త్రికటుకములతోను యవక్షారముతోను కూడినపెసలకట్టును పైజెప్పినవ్యాధులయందు హితకరములు. మరియు కోడిమున్నగు విష్కిరపక్షులయొక్కయు, జాంగలజంతువులయొక్కయు, తాబేలు, ఉడుము, నెమలి, ముండ్లపంది అనుజంతువులయొక్కయు మాంసరసంబులును, శోఫరోగికి హితకరములు. మరియు ప్రొద్దుతిరుగుడుచెట్టుఆకు, ఉల్లిగడ్డలు, చేదుపొట్లాకు, కాచియాకు, ముల్లంగి, వెదురుమోపు, వేము ఇవియన్నియు శాకములగోరువారికి శాకములకై యుపయోగింపదగును. భుజించుటకు ప్రాతవియగు యవలయన్నంబును, రాజనములయన్నంబును శోఫరోగికి హితకరములు.

### శోఫములకు అభ్యంజనాదిబాహ్యచికిత్సావిధానములు.

మూ. అభ్యన్తరం భేషజముక్తమేతత్; బహిర్హితం యచ్ఛృణు తద్వ్య

థావత్, స్నేహాం ప్రదేహాం పరిషేచనాని స్వేదాంశ్చ వాత
ప్రబలస్య కుర్యాత్.　　64

వ్యా. ఇంతదనుక పానాదిరూపముగ శరీరాంతర్భాగమున నుపయోగింపదగు నౌషధాదిరూపమగు చికిత్స జెప్పబడినది. ఇంక శరీరమున పైకినుపయోగింపదగు నభ్యంగనాదివిధు లీక్రింద వివరింపబడును. (చికిత్స అంతఃపరిమార్జన మనియు బహిఃపరిమార్జన మనియు రెండువిధములు. అందు ఔషధములను ఆహారాదులను తత్తదనుగుణముగ నుపయోగించి శరీరము లోభాగము(కోష్ఠము)నందలి దోషములను శుభ్రపరచుట అంతఃపరిమార్జనము. అభ్యంగన స్వేదన ప్రలేపాదులచే శరీరమున బాహ్యామునందలి (చర్మగత ములగు) దోషముల శమింపజేయుట బహిఃపరిమార్జనము. అందు అంతఃపరిమార్జనరూపమైన చికిత్సావిధానము ఇంతవరకును చెప్పబడినది. ఇంక బహిఃపరిమార్జనరూపమైన అభ్యంజనాదివిధి చెప్పబడునని భావము.)

వాతము ప్రబలముగనుండు శోఫములకు అభ్యంగనాదులకు స్నేహమును ప్రదేహములను, పరిషేకములను, స్వేదవిధులను ముఖ్యముగ జేయనగును.

### వాతికశోఫయందు అభ్యంగతైలము.

మూ. శైలేయకుష్ఠాగురుదారుకౌన్తీత్వక్పద్మకైలామ్బుపలాశముస్తైః,
ప్రియఙ్గుస్థౌణేయకహేమమాంసీతాలీసపత్రప్లవపత్రధాన్యైః.　　65
శ్రీవేష్టకధ్యామకపిప్పలీభిః స్పృక్కానఖైశ్చైవ యథోపలాభం,
వాతాఽన్వితేఽభ్యంగముశన్తి తైలం సిద్ధంసుపిష్టైరపి చ ప్రదేహమ్.

వ్యా. రాతిపువ్వు, చెంగల్వకోష్ఠు, అగరు, దేవదారుచెక్క, రేణుకలు (తక్కోలాలు), లవంగపట్ట, పద్మకము, ఏలకులు, కురువేరు, మోదుగ, తుంగగడ్డలు, ప్రేంకణము, స్థౌణేయకము (మాచిపత్రి, పచ్చాకు), ఏలకులు, జటామాంసి, తాలీసపత్రి, నాగముస్తలు, లవంగపత్రి, దనియాలు, మద్దిపాలు, కామంచిగడ్డి, పిప్పళ్లు, స్పృక్కయనెడిగంధద్రవ్యము, నఖముచిప్పలు, ఈద్రవ్యములలో దొరికినంతవరకు చేర్చి నీళ్లు పోసి నూరి కల్కముచేసి నువ్వుల నూనెను విధ్యుక్తప్రకారము పక్వముచేసి వాతికశోఫయందు అభ్యంగనము చేయదగును. (ఇచ్చట పైజెప్పినద్రవ్యములను యథాసంభవముగ గ్రహించి కల్కముచేసి తైలమునకు నాల్గవవంతుచేర్చి ద్రవమునకై తైలమునకు నాల్గింతలునీళ్లుచేర్చి పక్వముచేయనగును. మరియు పైజెప్పినద్రవ్యములను నీళ్లుపోసి నూరి పట్టు వేయుటకు నుపయోగింపనగును.)

### వాతికశోఫయందు స్నానజలము.

మూ. జలైశ్చ వాసార్కకరఞ్జశిగ్రు (జలై స్తథైరణ్డవృషార్కశిగ్రు)
కాశ్మర్యపత్త్రార్జకజైశ్చ సిద్ధైః, స్విన్నో మృద్వూష్ణైరవిత ప్తతో
య్యైః స్నాతశ్చ గన్ధైరను లేపనీయః. 67

వ్యా. అడ్డసరపాకు, జిల్లేడాకు, కానుగాకు, మునగాకు, పెద్దగుమ్మడియాకు, గన్నేర; ఈయాకుదినుసులను ముక్కముక్కగతొక్కి జలమునందువైచి యెండలో కాచి వాని యావిరిచే శరీరమున చెమటబుట్టించి యానీళ్లచే స్నానముచేయనగును. పిమ్మట అగరు మున్నగు గంధద్రవ్యములనూరి శరీరమున పూసికొనవలయును. (పైజెప్పినతైలము అభ్యంగనముచేసికొని శరీరమున చెమటబుట్టించి పైజెప్పినయాకులనుచేర్చి సిద్ధముచేయబడినజలముచే స్నానముచేయవలయునని భావము.)

### పైత్తికశోఫలకు ప్రదేహాబాహ్యోపచారములు.

మూ. సవేతసాః క్షీరవతాం ద్రుమాణాంత్వచఃసమాంజిష్ఠలతామృణాలాః,
సచన్దనాః పద్మకవాలకౌచపైత్తే ప్రదేహాస్తు; సతైలపాకః. 68
ఆక్తస్య తేనామ్బురవిప్రత ప్తం సచన్దనం సాభయపద్మకం చ,
స్నానే హితం క్షీరవతాం కషాయః క్షీరోదకం చన్దన లేపనం చ.

వ్యా. నీరుప్రబ్బలి, (అత్తి, మఱ్ఱి, జువ్వి, ఇప్ప, రావి, ఈయైదును క్షీరవృక్షములు). ఈయైదిటియొక్కపట్టలు, మంజిష్ఠి, తామరకాడలు, చందనము, పద్మకము, కురువేరు, వీనినన్నిటినిచేర్చి నూరి పిత్తమునజనించిన శోఫలకు పట్టువేయనగును.

మరియు పైజెప్పినద్రవ్యములనుచేర్చి విధ్యుక్తప్రకారము కషాయముచేసి తైలమునకు నాల్గింతలును, ఆద్రవ్యములనే కల్కముచేసి తైలమునకు నాల్గవపాలునుచేర్చి విధ్యుక్తప్రకారము తైలమును పక్వముచేయునది. ఆతైలము నభ్యంగనముచేసికొని చందనమును, పట్టివేరు, పద్మకము ఈమూటినిచేర్చి కాచబడినజలముచే నైనను, పైజెప్పిన క్షీరివృక్షములకట్టును జేర్చి కాచబడిన కషాయముచేనైనను, పాలతోకూడిన యుదకముచేనైనను స్నానముచేయుట చాల హితకరము. పిమ్మట చందనమును పూసికొనుటయు చాల మంచిది.

### కఫజశోఫయందు ప్రలేపాదులు.

మూ. కఫే తు కృష్ణాసికతాపురాణపిణ్యాకశిగ్రుత్వగుమాప్రలేపః,
కులత్థశుంఠీజలమూత్రసేకః చన్దాగురుభ్యామను లేపనఞ్చ. 70

వ్యా. పిప్పళ్లు, ఇసుక, ప్రాత తెలికపిండి, మునగపట్ట, అవిసెవిత్తులు వీనిని చేర్చి నూరి పట్టువేయుటయు; ఉలవలు, శుంఠి ఈరెంటిని చేర్చి కాచబడిన జలముచేనైనను; గోమూత్రముచేనైనను; స్నానముచేయుటయు; గన్నేరుచెక్కను, అగరుచెక్కను, గంధముతీసి పూసికొనుటయు; కఫముచేజనించిన శోఫమునందు చాల హితకరములు.

## శోఫలన్నిటియందును చేయదగిన లేపములు.

మూ. విభీతకానాం ఫలమధ్యలేపః సర్వేషు దాహార్తిహరః ప్రదిష్టః,
యష్ట్యాహ్వాముస్తైః సకపిత్థపత్రైః సచన్దనైః తత్పిడకాను లేపః. 71

వ్యా. అన్నిశోఫలయందును తానికాయవిత్తులలోని పప్పును నూరి పట్టు వేయుట చాల మంచిది. ఈలేపము మంటను నొప్పిని పోగొట్టును. మరియు అతిమధురము, తుంగగడ్డలు, వెలగాకు, చందనము వీనినన్నిటిని నూరి శోఫచేగల్గిన పిటికలకు లేపనము చేయదగును.

## శోఫలన్నిటియందును చేయదగినయుద్వర్తనము.

మూ. రాస్నావృషార్కత్రిఫలావిడఙ్గం శిగ్రుత్వచోమూషికపర్ణికా చ,
నిమ్బార్జకౌ వ్యాఘ్రనఖస్సదూర్వాసువర్చలా తిక్తకరోహిణీచ.
సకాకమాచీ బృహతీ సకుష్ఠా పునర్నవా చిత్రకనాగరే చ,
ఉద్వర్తనం శోఫిషు మూత్రపిష్టం శస్తస్తథా మూలకతోయసేకః.

వ్యా. సన్నరాష్ట్రము, అడ్డసరము, జిల్లేడుపట్ట, త్రిఫలముల బెరడు, వాయువిడంగములు, మునగపట్ట, ఎలుకచెవియాకు, వేపపట్ట, గగ్గెర, నఖమనెడి గంధద్రవ్యము, గరిక, ప్రొద్దుతిరుగుడుచెట్టుఆకు, కటుకరోహిణి, కాచియాకు, వాకుడాకు, చెంగల్వకోష్ఠు, గలిజేరు, చిత్రమూలము, శుంఠి వీనినన్నిటిని గోమూత్రమున నూరి శోఫసామాన్యముగ నలుగుపెట్టి తోముట చాల మంచిది. మరియు ముల్లంగియాకు చేర్చి కాచబడిన నీళ్లచే స్నానముచేయుట హితకరము. (ఈయోగములు శోఫసామాన్యముగ నుపయోగింప దగియుండును.)

## ఏకాంగాదిశోఫభేదములవివరణము.

మూ. శోఫాస్తు గాత్రావయవాశ్రితా యే తే స్థానదూష్యాకృతినామభేదాత్, అనేకసంఖ్యాః, కతిచిచ్ఛ తేషాం నిదర్శనార్థం గదతో నిబోధ. (శృణు చోచ్యమానాన్.) 74

వ్యా. శరీరమునందలి ఆయాఅవయవముల నాశ్రయించి జనించుశోఫలు కంఠము మున్నగుస్థానములను, రసాదిధాతువులను, ఆకారమును, కంఠశాలూకాది నామభేదములనుబట్టి పలుతెరంగులై యుండును. అందు కొన్నిటిని మాత్రము ఉదాహరణమునిమిత్తము ఈక్రింద సంగ్రహముగ చూపెద వినుము. (ఇచ్చట పైజెప్పినస్థానాదిభేదములచే గలుగుశోఫభేదములను, శల్యతంత్రమున విశేషముగ జెప్పియున్నది. అందు కొన్నిటినిమాత్రము ఇచ్చట సంగ్రహించి వానిలక్షణములను చికిత్సయు సంగ్రహముగ తెలుపబడునని భావము.)

### శిరశ్శోథ (ఉపశీర్షక) లక్షణము.

మూ. దోషాస్త్రయః స్వైః కుపితా నిదానైః కుర్వన్తి శోఫం శిరసః సుఘోరమ్,

వ్యా. వాతాదిదోషములు మూడును వానివానికి చెప్పియుండు కారణములచే ప్రకోపమునొంది శిరస్సునందు మిక్కిలి క్రూరమైన శోఫమును గలిగించును. దీనిని శిరశ్శోథమని యందురు. తంత్రాంతరమున దీనినే ఉపశీర్షకము అని చెప్పిరి.

### కంఠశాలూకలక్షణము.

మూ. అన్తర్గలే ఘుర్ఘురికాన్వితం చ శాలూకముచ్ఛ్వాసనిరోధకారి. 75

వ్యా. కుత్తుకలోభాగమున గుఱ్ఱుగుఱ్ఱుమని ధ్వనితోకూడి శ్వాసమును వెడలనీయక నిరోధించునట్టి వాపుకల్గును. దీనిని శాలూకమను శోఫవ్యాధియని చెప్పెదరు.

### బిడాలిక-వలయలక్షణములు.

మూ. గలస్య సన్థౌ చిబుకే గలే చ సదాహరాగః శ్వసనాసు చోగ్రః (శ్వసనోచ్ఛ్వాసోగ్రః), శోఫో భృశార్తిస్తు బిడాలికా స్యాద్దన్యాద్గలే చేద్వలయీకృతా సా. 76

వ్యా. కుత్తుకకును నోటికిని సంధియందును, గడ్డమునకు క్రిందిభాగమునందైనను, కంఠమునందైనను, మంటతోకూడి యెఱ్ఱనిరంగుకలిగి ఉచ్ఛ్వాసనిశ్వాసములను అడ్డగించునట్టి క్రూరమైనశోఫము గలుగును. ఇయ్యది శ్వాసమును వెడలించునాడుల నాశ్రయించి త్రిదోషప్రకోపమున గల్గును. మిక్కిలి బాధను కల్గించును. దీనిని బిడాలికయని యందురు. ఇయ్యది కంఠమున వలయాకారముగ (ఉండవలె) నున్నచో రోగిని చంపును. (దీనికి వారలక్షణము సుశ్రుతమునం దిట్లు చెప్పబడినది:—"తం సర్వథైవాప్రతివార్యవీర్యం వివర్జనీయం వలయం వదన్తి." (సు. ని. అ. ౧౬.) ఇయ్యది త్రిదోషప్రకోపముచే కల్గినను దీనియందు రక్తపిత్తములే యధికముగ నుండును.)

### తాలువిద్రధి-ఉపజిహ్వక-అధిజిహ్వకాలక్షణములు.

మూ. స్యాత్తాలువిద్రధ్యపిదాహరాగపాకాన్వితస్తాలుని సాత్రిదోషాత్,
జిహ్వోపరిష్టాదుపజిహ్వికా స్యాత్ కఫాదధస్తాదధిజిహ్వికా చ.

వ్యా. తాలువులయందు లోభాగమున మంటయు, ఎఱ్ఱనిరంగును, కల్గి కఫముతో కూడిన శోఫముకలిగి అయ్యది పక్వమై పుండగును. దీనిని త్రిదోషప్రకోపముచే జనించిన తాలువిద్రధియని యందురు. నాలుకకుపైభాగమున కఫప్రకోపముచే శోఫజనించును. ఇయ్యది యుపజిహ్వక యనబడును. అదేరీతిగ నాలుకకు క్రిందిభాగమున పుట్టినశోఫ అధిజిహ్వక మనబడును.

### ఉపకుశ-దంతవిద్రధిలక్షణములు.

మూ. యో దన్తమాంసేషు తు రక్తపిత్తాత్ పాకో భవేత్ సోపకుశః
ప్రదిష్టః; స్యాద్దన్తవిద్రధ్యపి దన్తమాంసే శోఫః కఫాచ్ఛోణిత
సంచయోత్థః. 78

వ్యా. దంతమునకు చేరిన మాంసమందు రక్తపిత్తములవలన శోఫకల్గి పుండగును. అయ్యది ఉపకుశ మనబడును. ఆదంతమాంసములయందే కఫప్రకోపమున శోఫజనించును. ఇయ్యది రక్తము సంచితమై కల్గును. దీనిని దంతవిద్రధి యని చెప్పబడును.

### గలగండ గండమాలాలక్షణములు.

మూ. గలస్య పార్శ్వే గలగణ్డ ఏకః స్యాద్గణ్డమాలా బహుభిస్తు గణ్డైః,
సాధ్యాః స్మృతాః; పీనసపార్శ్వశూలకాసజ్వరచ్ఛర్దియుతాస్త్వ
సాధ్యాః. 79

వ్యా. కంఠముయొక్క పార్శ్వభాగము గ్రంథిరూపముగ నొకశోఫ జనించును. ఇయ్యది గలగండ మనబడును. అట్టిమాంసగ్రంథులు అనేకములుగ పుట్టిన గండమాల యనబడును. ఈవ్యాధులు చికిత్సకు సాధ్యములై యుండును. మరియు పీనస, పార్శ్వశూల, కాసము, జ్వరము, వాంతి అను నీయుపద్రవములు కల్గియున్న యసాధ్యములగును. గలగండలక్షణము తంత్రాంతరమున నిట్లు చెప్పబడినవి:—"నిబద్ధశ్వయథుర్యస్య ముష్కవల్లమ్బతే గలే, మహాన్వాయది హ్రస్వో గలగణ్డం వా తమాదిశేత్." కంఠమునకు క్రిందిభాగమున వాపుకల్గి అండకోశమువలె వ్రేలుచున్నయెడ అయ్యది గలగండ మనబడును. ఇది చిన్నదిగనైనను పెద్దదిగనైనను నుండును అని యర్థము. మరియు దీనిని

వాతాదిదోషములచే వేరు వేరుగ తంత్రాంతరమున జెప్పబడినది గ్రంథవిస్తరభీతిచే నిచ్చట వివరింపబడదు. పై జెప్పబడిన సాధ్యాసాధ్యలక్షణముల విభాగము శిరశ్శోఫాదులన్నిటి యందును గమనించునది.

### పై జెప్పబడిన శోఫలకు సామాన్యచికిత్స.

మూ. తేషాం శిరాకాయశిరోవిరేకో ధూమః పురాణస్య ఘృతస్య పానం, స్యాల్లఙ్ఘనం వక్త్రభవేషు చాపి ప్రఘర్షణం స్యాత్కబలగ్రహాశ్చ. 80

వ్యా. పై జెప్పబడిన శోఫలన్నిటియందును సిరావ్యధనము, విరేచనము, శిరోవిరేచనము, ధూమపానము, ప్రాతదియగు ఘృతమును పానముజేయుట, లంకణము, ఇవి యన్నియు చికిత్సార్థము చేయదగును. అందును నోటిలోజనించు ఉపజిహ్వాక మున్నగు శోఫలయందు ఆయాదోషహరములగు చూర్ణాదులచే రుద్దుటయు, కబళగ్రహంబులును హితకరంబు లగును.

### గ్రంథిలక్షణము.

మూ. అఙ్గైకదేశేష్వనిలాదిభిః స్యాత్ స్వరూపధారీ స్ఫురణః శిరాభిః,
గ్రన్థిర్మహామాసభవస్త్వనర్తిః మేదోభవః స్నిగ్ధతమశ్చలశ్చ. 81

వ్యా. శరీరమునందలి అవయవములలో నెచ్చటనైన నొకచోట వాతాదిప్రకోపముచే నాయాదోషలక్షణములతో కూడి గ్రంథిరూపముగ జనించును. అయ్యది సిరలతో సంబంధించియుండిన నదరుచుండును. మాంసము నాశ్రయించి జనించినయెడ గొప్పదియై బాధలేకయుండును. మేదస్సుకు సంబంధించియుండిన మిక్కిలి స్నిగ్ధమై కదలుచుండును.

### గ్రంథిచికిత్స.

మూ. సంశోధితే స్వేదితమశ్మకాష్ఠైః సాఙ్గుష్ఠదణ్డైః విలయేదపక్వం,
విపాట్య చోద్ధృత్య భిషక్ సకోశం శస్త్రేణ, దగ్ధ్వా వ్రణవచ్చికిత్సేత్.
అదగ్ధ ఈషత్పరిశేషితశ్చ ప్రయాతి భూయోఽపి శనైర్వివృద్ధిం,
తస్మాదశేషః కుశలైః సమన్తాత్ చ్ఛేద్యో భవేద్వీక్ష్య శరీరదేశాన్.

వ్యా. పై జెప్పిన గ్రంథులయందు రోగికి విధ్యుక్తప్రకారము విరేచనరూపమైన శోధన చికిత్స జేయించి పిమ్మట స్వేదవిధిప్రకారము గ్రంథిస్థలమున చెమటబుట్టించి

గ్రంథి పక్వము కాకుండునపుడు రాళ్ల చేతను, కట్టెల చేతను, బొటనవ్రేలిచేతను, వేణుదండముచేతను నలిపి కరగునట్లు చేయవలయును. పిమ్మట శస్త్రముచే ఛేదించి దానినుండి దోషమును వెడలించి నిప్పుతో విధ్యుక్తప్రకారము కాల్చవలయును. పిమ్మట వ్రణములు నార్పచేయుచికిత్సలను చేయదగును. దానిని ఛేదించునపుడు నిశ్శేషముగ ఛేదించవలయును. అటుగాక నిశ్శేషముగ ఛేదించకున్నను దాహకర్మచే కాల్చకున్నను అయ్యది మెలమెల్లగ నానాట వృద్ధినొందును. కావున నేర్పరులగువైద్యులు శరీరపరిస్థితిని దేశకాలాదులను చక్కగ పరిశీలించి గ్రంథిని నిశ్శేషముగ ఛేదించి కాల్చవలయును.

### గ్రంథ్యుపద్రవము, చికిత్స.

మూ. శేషే కృతే పాకవశేన శీర్యాత్ తతః క్షతోత్థః ప్రసరేద్విసర్పః,
ఉపద్రవం తం ప్రవిచార్యతద్జ్ఞః తైర్భేషజైఃపూర్వతరైర్యథోక్తైః.
నివారయేదాదిత ఏవ యత్నాత్ విధానవిత్ స్వస్వవిధిం విధాయ,
తతః క్రమేణాస్య యథావిధానం వ్రణంవ్రణజ్ఞస్త్వరయాచికిత్సేత్.

వ్యా. పైజెప్పిన ప్రకారము ఛేదనముచేత చికిత్స జేయునపుడు గ్రంథిలో దోషము శేషించియున్నచో నయ్యది పక్వమై అందుండి ద్రవము స్రవించుచుండును. దానంజేసి విసర్పము వ్యాపించును. అట్టియుపద్రవము గల్గినపుడు ఆవిషయమును దెలిసిన వైద్యుడు చక్కగ గమనించి క్షతజవిసర్పమునకు జెప్పిన ఆయాచికిత్సలచే జాగ్రత్తతో చికిత్స జేయనగును. అట్టివిసర్పము వ్యాపింపకమునుపే దానిని రానీయక తగుయత్నముతో చికిత్స జేయవలయును. మరియు ఛేదనానంతరము విధ్యుక్తప్రకారము వ్రణచికిత్సా విధానము ననుసరించి వ్రణమును త్వరగా (విసర్పమురాకమునుపే) మాన్పవలయును.

### అసాధ్యగ్రంథిలక్షణములు.

మూ. వివర్జయేత్కుక్ష్యుదరాశ్రితం చ తథా గలే మర్మణి సంశ్రితం చ,
స్థూలః ఖరశ్చాపి భవేద్వివర్జ్యో యశ్చాపి బాలస్థవిరాబలానామ్.

వ్యా. పైజెప్పిన గ్రంథులు కుక్షి, ఉదరము, కంఠము, మర్మస్థానము, ఈస్థలములయం దెచ్చట జనించినను అసాధ్యముకావున చికిత్స జేయక వదలవలయును. మరియు మిక్కిలిస్థూలముగను, కఠినముగ్గను, ఉండునదియు అసాధ్యమగును. మరియు బాలులకును, ముసలివారికిని బలహీనులకును జనించిన గ్రంథియు నసాధ్యముకాన విడువందగును.

### అర్బుదచికిత్సితాతిదేశము.

మూ. గ్రన్థ్యర్బుదానాం చ యతోఽవిశేషః ప్రవేశహేత్వాకృతిదోష

దూష్యైః, తతశ్చికిత్సేద్భిషగర్బుదాని విధానవిద్గ్రన్థిచికిత్సితేన. 87

వ్యా. గ్రంథులకును,అర్బుదములకును, అవిజనించుస్థానము, కారణములు, ఆకృతి, దోషములు, దూష్యములనుబట్టి పరస్పరభేదము గనబడదు కావున అర్బుదములకన్నిటికి గ్రంథులకు చెప్పినచికిత్సావిధానము ననుసరించియే చికిత్స జేయనగును. (అర్బుదలక్షణ మును సుశ్రుతాచార్యు లిట్లు చెప్పిరి. "గాత్రప్రదేశే క్వచిదేవ దోషాః సంమూర్ఛితాః మాంసమభిప్రదూష్య, వృత్తం స్థిరం మన్దరుజం మహాన్తమనల్పమూలం చిరవృద్ధ్యపాకమ్, కుర్వన్తి మాంసోచ్ఛ్రయమత్యగాధం తదర్బుదమ్ శాస్త్రవిదో వదన్తి." (సు. ని. అ.౧౧.) అను నీలక్షణమునుబట్టి చూడ అర్బుదమునకు గ్రంథికిని ఈషద్భేదము గన్పట్టుచున్నను విశేషభేదము లేదని ఈతంత్రకారుని "అవిశేషః" అనుపదముచే సూచించెను.)

## అలజీ-అక్షత-విదారికాలక్షణములు, సామాన్యచికిత్స.

మూ. తామ్రా సశూలా పిటికా భవేద్యా సా చాఽలజీ నామ పరిస్రుతాగ్రా, శోఫోఽక్షతశ్చర్మనఖాన్తరే స్యాత్ మాంసాస్రదూషీ భృశశీఘ్రపాకః. 88

జ్వరాన్వితా వఙ్క్షణకక్షజా యా వర్తిః నిరర్తిః కఠినాయతా చ, విదారికా సా కఫమారుతాభ్యాం తేషాం యథాదోషముపక్రమ స్స్యాత్. 89

వ్యా. తామ్రవర్ణంబును శూలతో కూడినదియు నగుపిటక అలజి యనబడును. దానియగ్రమున ద్రవము స్రవించుచుండును. మరియు చర్మమునకును గోళ్లకును మధ్య భాగములయందు మాంసరక్తములను చెరచి శీఘ్రముగ పాకమునొందుస్వభావము కల శోఫము జనించును. ఇయ్యది అక్షతమని చెప్పబడును.

మరియు జ్వరముతోగూడి గజ్జలయందైనను చంకలయందైన మిక్కిలి కఠినమై బాధలేని శోఫము వర్తినిబోలె నిడుపుకల్గినది జనించును. ఇయ్యది విదారి (నేలగుమ్మడి గడ్డను) బోలె యుండుటవలన విదారిక.యనబడును. వాతకఫములచే నిది సంభవించును. ఇది మిక్కిలి కఠినమై నిడుపుగ నుండును. (మరియు "విదారీకందవత్ వృత్తా కఠినా చ విదారికా" అను తంత్రాంతరవచనముచేత నియ్యది నేలగుమ్మడిగడ్డబోలె గుండ్రనై కఠిన ముగ నుండునని తెలిసెడి.)

పైజెప్పబడిన అలజీ-అక్షత-విదారికలనుశోఫములకు వానివానికి కారణములైన దోషములనుబట్టి తత్తదనుగుణముగ చికిత్స జేయనగును.

### ఆలజి మున్నగుమూటికిని విశేషచికిత్స.

మూ. విస్రావణం పిణ్డికయోపనాహాః పక్వేషు చైవ వ్రణవచ్చికిత్సా,

వ్యా. మరియు పైజెప్పినశోఫముల మూటియందును నువ్వులపిండి ఆముదపుగింజల పిండి బియ్యపుపిండి మున్నగువాని నుడికించి కాపుడముబెట్టి కట్టుగట్టి పక్వమైనపిదప వ్రణములకు జేయుచికిత్సల జేయనగును.

### విస్ఫోటకాది పిటికాభేదములు, వానిలక్షణములు.

మూ. విస్ఫోటకాః సర్వశరీరగాస్తు స్ఫోటాః సదాహజ్వరకర్షయుక్తాః 90
యజ్ఞోపవీతప్రతిమాః ప్రభూతాః పిత్తానిలాభ్యాం జనితాస్తు
కక్షాః, యాశ్చాపరాస్స్యుః పిడకాః ప్రకీర్ణాః స్థూలాణుమధ్యా
అపి పిత్తజాస్తాః. 91
క్షుద్రప్రమాణాః పిడకాశ్శరీరే సర్వాఙ్గగాస్సజ్వరదాహతృష్ణాః,
కణ్డూయుతాస్సారుచిసప్రసేకాః రోమాన్తికాః పిత్తకఫా
త్ప్రదిష్టాః యాస్సర్వగాత్రేషు మసూరమాత్రాః మసూరికాః
పిత్తకఫాత్ప్రదిష్టాః. 92

వ్యా. మంటయు జ్వరంబును దప్పియు కల్గి సర్వశరీరంబునను వ్యాపించిన స్ఫోటములు (బొబ్బలు) కల్గినయెడ నయ్యవి విస్ఫోటము లనబడును. యజ్ఞోపవీతము శరీరముననుండు ప్రదేశమున దట్టముగ వ్యాపించియుండు బొబ్బలు కక్షము లనబడును. ఇయ్యవి వాతపిత్తములచే కల్గును.

మరియు శరీరమునం దెల్ల పలుదెరంగుల కొన్ని స్థూలములుగ కొన్ని సూక్ష్మరూపములుగ నుండుమధ్యప్రదేశము గలబొబ్బలు కొన్ని జనించును. ఇవి పిత్తముచే గల్గును.

మరియు జ్వరంబును, మంటయు, దప్పియు, దురదయు, అరుచియు కల్గి, శరీరమునం దెల్ల రోమకూపముల నాశ్రయించి జనించు సన్ననిబొబ్బలు రోమాంతికము లనబడును. ఇయ్యది పిత్తకఫములచే గల్గును. నీరు స్రవించుచుండును.

అట్టి లక్షణములుకల్గి శరీరమునం దెల్ల బటాణీలవంటి యాకారములుకల్గి జనించు బొబ్బలు మసూరిక లనబడును. ఇవియు పిత్తకఫములచే గల్గును.

### విస్ఫోటకాదిచికిత్స.

మూ. వీసర్పశాన్త్యై విహితా క్రియా యా తాం తేషు కుష్ఠే చ
హితాం విదధ్యాత్. 93

వ్యా. పైజెప్పిన విస్ఫోట-కక్ష-రోమాంతిక-మసూరికలకు విసర్పశమనమునకై జెప్పినచికిత్సయు, కుష్ఠమునకు జెప్పినచికిత్సయు క్రమముగ జేయందగును.

## బ్రధ్న భేదములు, వానిలక్షణములు.

మూ. బ్రధ్నో వృద్ధోఽనిలాద్యైర్వృషణే(స్వలిఙ్గైరన్త్రం నిరేతి ప్రవిశేచ్చ
హన్యాత్, మూత్రేణ పూర్ణం మృదుమేదసా చేత్ స్నిగ్ధం చ
విద్యాత్కఠినం చ శోథమ్ 94

వ్యా. వాతపిత్తకఫములు వానివానికారణములచే ప్రకోపమునొంది కోశమునం దుండు అంత్రము (నరము)నుచేరి వాపును కల్గించును. దానిచేత స్థూలమైన యాశోథము గ్రంథిరూపమై గజ్జలయందుచేరి యచ్చటనుండి వృషణములకు వ్యాపించును. ఇత్తెరంగును పలుమారు వృషణములయందు చేరుచుండును. అట్టిగ్రంథిరూపమయిన అంత్రము బ్రధ్న మనబడును. ఇయ్యది వాతాదులకు వేరువేరుగ జెప్పినలక్షణములు కల్గియుండును. (అందు వాతలక్షణములు కల్గినది వాతికమనియు, పిత్తలక్షణములుకల్గినది పైత్తికమనియు, కఫలక్షణములు కల్గినది శ్లైష్మికమనియు, బ్రధ్నము దోషభేదములచే మూడుతెరంగులగును.) మరియు ఆబ్రధ్నము (శోఫ) మూత్రము నిరోధించుటచే కల్గినయెడ పూర్ణమై మెత్తగనుండును. మేదస్సుచే జనించినయెడ ప్రస్నిగ్ధమై (నునుపుగలిగి) కఠినముగ నుండును. (ఇత్తెరంగున బ్రధ్నము వాత-పిత్త-కఫ-మూత్ర-మేదస్సులచే వేరువేరుగ వానివానిలక్షణముతో కూడి జనించుటంజేసి యైదువిధములుగను, సుశ్రుతాచార్యులు రక్తజబ్రధ్నమును ఆరవదానినిగ జెప్పెను. ఇచ్చట రక్తజబ్రధ్నము పైత్తికముననే నంతర్భావముగ నీతంత్రకారుడు చేర్చెను.)

మరియు బ్రధ్నలక్షణము తంత్రాంతరమున నిట్లు చెప్పబడినది:—"అత్యభిష్యన్దిగుర్వన్నసేవానాన్నిచయం గతః, కరోతి గ్రన్థివచ్ఛోథం దోషో వంక్షణసన్ధిషు, జ్వరశూలాఙ్గసాదాఢ్యం తం బ్రధ్నమితి నిర్దిశేత్" స్రోతస్సులయందు ద్రవమును పుట్టించు పదార్థములను, అజీర్ణకరములగు పదార్థములను విశేషముగ తినుటచేత దోషములు ప్రకోపమునొంది గజ్జలసంధులయందు, గ్రంథిబోలె వాపునుకల్గించును. ఇయ్యది బ్రధ్నమని చెప్పబడును. దీనియందు జ్వరము, నొప్పి, శరీరము కృశించుట ఈలక్షణములు కల్గును. యని యర్థము.

## బ్రధ్నచికిత్స.

మూ. విరేచనాభ్యఞ్జనిరూహలేపాః పక్వేషు చైవ వ్రణవచ్చికిత్సా,

స్యాన్మూత్రసేకః (స్యాద్మూత్రమేదః) కఫజం విపాట్య విశోధ్య సీవ్యేత్ వ్రణవచ్చ పక్వమ్. 95

వ్యా. పైబ్రధ్నము పక్వము కాకుండునపుడు విరేచనము, అభ్యంజనము, నిరూహ వస్తి, పట్టువేయుట, అను నీచికిత్సలను వరుసగ చేయనగును. అయ్యది పక్వమైనపుడు వ్రణములకు చేయువిధముగ చికిత్స చేయవలయును. మరియుమూత్రనిరోధము జనించిన బ్రధ్నమును, కఫముచే జనించిన బ్రధ్నమును, శల్యతంత్రోక్తవిధి ప్రకారము శస్త్రముచే భేదించి యందుండుదోషమును నిశ్శేషముగ వెడలించి శుభ్రపరచి యథాప్రకారముగ నుండునట్లు కుట్టి పిదప వ్రణముల మాన్పుచికిత్సలను జేయనగును.

## భగందరలక్షణము.

మూ. క్రిమ్యస్థిసూక్ష్మ(క్రిమేస్తృణాది)క్షణనవ్యవాయప్రవాహణాన్యుత్కటకాశ్వపృష్ఠైః, గుదస్య పార్శ్వే పిడకా భృశార్తిః పక్వప్రభిన్నా తు భగన్దరః స్యాత్. 96

వ్యా. గుదస్థానమున కీటాదులు కొరకుటచేనైనను అస్థులు ఎముకముక్కలు మున్నగువాని రాపిడిచేనైనను గాయమగుట, అధికముగ సంభోగముచేయుట, ముక్కుట, మిక్కిలి యున్నతములగు నాసనములపై గూర్చుండుట, గుఱ్ఱములవీపుపై నెక్కి సవారి చేయుట, ఈకారణములచేత గుదమునకు ప్రక్కన మిక్కిలి బాధతోగూడిన పిటిక జనించి మిగుల కష్టముచే పక్వమై పగులును. ఇయ్యది భగందర మనబడును.

ఇచ్చట "భగందారయతీతి భగందరః" అనువ్యుత్పత్తిచేత భగమును వస్తిని గుద స్థానమును పగులదీసి వాతమూత్రపురీషముల వ్రణమునుండి వెడలించు క్రూరవ్యాధి భగందరమని యన్వర్థముగ జెప్పబడినది. ఈవిషయమును వాగ్భటాచార్యు లిట్లు చెప్పెను:—"భగందరః స సర్వశ్చ దారయత్యక్రియావతః, భగవస్తిగుదాంతేషు దీర్యమాణేషు భూరిభిః, వాతమూత్రశకృచ్ఛుక్రం ఖైః సూక్ష్మైః వమతిక్రమాత్"(అష్టాంగ-ఉత్తర-అ. ౨౮. శ్లో. ౪.) మరియు "దోషైః పృథగ్యుతైస్సర్వైః ఆగన్తుస్సోష్టమ స్మృతః" అని ఏకదోషజ-ద్విదోషజ-సన్నిపాత-ఆగంతుభేదములచే నెనిమిదివిధములుగ జెప్పిరి. అందును అది పక్వము కాకుండునెడ పిటిక యనియు, పక్వమైనయెడ భగందర మనియు రెండుతెరంగులగునని "అపక్వం పిటికామాహుః పాకప్రాప్తం భగందరమ్" అను వాక్యముచే జెప్పిరి. మరియు వీనిభేదము లన్నిటికిని వేరువేరు లక్షణములను అచ్చటనే జూచునది. విస్తరభీతిచే నిట వివరింపబడవయ్యె.

## భగందరసామాన్యచికిత్స.

మూ. విరేచనం చైషణపాటనం చ విశుద్ధమార్గస్య చ తైలదాహః,
స్యాత్ క్షారసూత్రేణ సుపాచితేనచ్ఛిన్నస్య చాస్య వ్రణవచ్చికిత్సా.

వ్యా. పైజెప్పబడిన భగందరమునందు తొలుత విరేచనము శోధనముచేసి శలాకచే వ్రణముయొక్క వ్యాప్తిని శల్యతంత్రోక్తప్రకారము గమనించి పిమ్మట శస్త్రముచే పగులందీసి వ్రణముయొక్క మార్గమున పూయాదుల వెడలించి శుభ్రపరిచి తైలముచే కాల్చి, పిమ్మట శల్యతంత్రోక్తప్రకారము చక్కగ పక్వముచేయబడిన క్షారసూత్రముచేత (కారపువత్తిని ప్రయోగించుటచేత) వ్రణమునకు చెప్పిన చికిత్సాప్రకారము చికిత్సజేయ నగును. (ఇచ్చట వ్రణచికిత్సావిధానము శల్యతంత్రమున ప్రధానమైనది కావున, కాయచికిత్సా ప్రధానమైన యీతంత్రమున విస్తరముగ జెప్పబడదయ్యె).

## శ్లీపదలక్షణము, చికిత్స.

మూ. జఙ్ఘాసు పిణ్డీప్రపదోపరిష్టాత్ స్యాత్ శ్లీపదం మాంసకఫాస్రదోషాత్, సిరాకఫఘ్నశ్చ విధిస్సమగ్రః తత్రేష్యతే. సర్షపలేపనం చ.

వ్యా. మాంసంబును కఫంబును రక్తంబును దుష్టములై పిక్కలయందలి మాంసపిండమును చెరచి మీగాలి పైభాగమున శోథమును కల్గించును. ఇయ్యది శ్లీపదమని చెప్పబడును. ఈశోథమునందు సిరావ్యధనముచే రక్తమోక్షణంబును, కఫహరచికిత్సలన్నియు, ఆవాలను నూరి పట్టువేయుటయు ప్రశస్తము.

శ్లీపదస్వరూపము తంత్రాంతరమున నిట్లున్నది:—“యస్సర్వజో వఙ్క్షణజో భృశార్తిః శోథో నృణాం పాదగతః క్రమేణ,తచ్ఛ్లీపదం స్యాత్” త్రిదోషప్రకోపముచే గజ్జలయందు శోథకల్గి మిక్కిలి బాధతోగూడి క్రమక్రమముగ పాదములకు దిగజారును. ఇయ్యది శ్లీపదమని చెప్పబడును.

## జాలగర్దభలక్షణము.

మూ. మన్దాస్తు పిత్తప్రబలాః ప్రదుష్టాఃదోషాస్సుతీవ్రం తనురక్తపాకం,
కుర్వన్తి శోథం జ్వరతర్షయుక్తం విసర్పణం జాలకగర్ధభాఖ్యమ్. 99

వ్యా. ప్రబలమైన పిత్తము కలదోషములు మందముగ దుష్టములై కొంచెముగ రక్తము పాకముజెంది తీవ్రమైన శోథమును కల్గించును. ఈశోథము ఒకచోటినుండి

వేరొండుచోటికి వ్యాపించుస్వభావముకల్గి, జ్వరంబును దప్పియు కల్గించును. దీనిని జాల గర్దభమని చెప్పెదరు.

## జాలగర్దభచికిత్స.

మూ. విలఙ్ఘనం రక్తవిమోక్షణం చ విరూక్షణం కాయవిశోధనం చ,
ధాత్రీప్రయోగాన్ శిశిరాన్ ప్రదేహాన్ కుర్యాత్సదా జాలక
గర్దభస్య. 100

## అనుక్తశోఫపరీక్షాదిక్రమవిధి.

మూ. ఏవంవిధాంశ్చాప్యపరాన్ పరీక్ష్య శోథప్రకారాననిలాదిలిఙ్గైః,
శాన్తిం నయేద్దోషహరైర్యథాస్వం ఆలేపనచ్ఛేదనభేదదాహైః.

వ్యా. పైజెప్పబడిన శోఫములుగాక వీనికి సమానములైన యితరశోఫముల నన్నిటిని వాతాదులకు వేరువేరుగ చెప్పబడిన లక్షణములచే చక్కగ పరీక్షించి వాతాది దోషసంబంధమును నిర్ణయించి, ఆయాదోషములగు నాలేపనములచేతను ఛేదనభేదనాది శస్త్రకర్మలచేతను, అగ్నికర్మముచేతను తత్తదుచితముగ చికిత్సజేసి శాంతి నొందించనగును.

## అభిఘాతజ-విషజశోఫసంగ్రహము.

మూ. ప్రాయోఽభిఘాతాదనిలస్సరక్తః శోథం సరాగం ప్రకరోతి తత్ర,
వీసర్పనుత్ మారుతరక్తనుచ్చ, కార్యం విషఘ్నం విషజేచ కర్మ.

వ్యా. అభిఘాతమువలన వాతము దుష్టమై రక్తమునజేరి శోఫమును కల్గించును. ఆశోఫము ప్రాయికముగ నెరుపురంగుకల్గి యుండును. అట్టి యభిఘాతజశోఫమునందు విసర్పహరచికిత్సయు వాతహరచికిత్సయు చేయందగును. విషసంబంధముచే గల్గినశోఫమున విషహరచికిత్స చేయనగును.

## అధ్యాయవిషయసంగ్రహము.

తత్ర శ్లోకః—

మూ. త్రివిధస్య దోషభేదాత్ సర్వాఽర్ధావయవగాత్రభేదాచ్చ,
శ్వయథోః ద్వి(వి) విధస్య తథా లిఙ్గాని చికిత్సితం చోక్తమ్. 102

వ్యా. వానిదోష భేదములచేతను సర్వాంగ-అర్ధాంగ-అవయవభేదములచేతను

మూడేసివిధములైన శోఫములయొక్క నానావిధములైన లక్షణంబులును చికిత్సలును ఈశ్వయథుచికిత్సితమను నధ్యాయమున వివరింపబడినవి.

ఇత్యగ్నివేశకృతే తన్త్రే చరకప్రతిసంస్కృతే, చికిత్సాస్థానే
శ్వయథుచికిత్సితం నామ ద్వాదశోఽధ్యాయః.

ఇత్తెరంగున నగ్నివేశకృతంబును చరకప్రతిసంస్కృతంబును నగు చరకసంహిత యను నాయుర్వేదతంత్రమునందలి చికిత్సాస్థానమున శ్వయథుచికిత్సిత మనునది ద్వాదశాధ్యాయము సమాప్తము.

---

## త్రయోదశాధ్యాయము.

అవతరణిక:—ఉదరరోగము శోఫభేదములలో చేరినది. కావున శోఫచికిత్సితమును జెప్పినపిదప నుదరచికిత్సితము చెప్పబడును:—

మూ. అథాత ఉదరచికిత్సితం వ్యాఖ్యాస్యామః. 1

ఇతి హ స్మాహ భగవానాత్రేయః. 2

వ్యా. శోథచికిత్సితమును జెప్పినపిదప నుదరచికిత్సితము భగవానుడగు నాత్రేయు లుపదేశించినదానికన్న న్యూనాతిరేకము గాకుండునట్లు వివరింపబడును.

ఉదరరోగమునుద్దేశించి యగ్నివేశుల ప్రశ్నము.

మూ సిద్ధవిద్యాధరాకీర్ణే కైలాసే నన్దనోపమే,
తప్యమానం తపస్తీవ్రం సాక్షాద్ధర్మమివ స్థితమ్. 3
ఆయుర్వేదవిదాం శ్రేష్ఠం భిషగ్విద్యాప్రవర్తకం,
పునర్వసుం జితాత్మానం అగ్నివేశోఽబ్రవీద్వచః. 4
"భగవన్ ఉదరైర్దుఃఖైః దృశ్యన్తే హ్యర్దితా నరాః,
శుష్కవక్త్రాః కృశైర్గాత్రైరాధ్మాతోదరకుక్షయః 5
ప్రణష్టాఽగ్నిబలాహారాః సర్వచేష్టాస్వనీశ్వరాః,
దీనాః ప్రతిక్రియాఽభావాత్ జహతోఽసూననాథవత్. 6
తేషామాయతనం సంఖ్యాం ప్రాగ్రూపాకృతిభేషజం,
యథావచ్ఛ్రోతుమిచ్ఛామి గురుణా సమ్యగీరితమ్. 7

సర్వభూతహితాయర్షిః శిష్యైరేవం ప్రచోదితః,
సర్వభూతహితం వాక్యం వ్యాహర్తుముపచక్రమే. 8

వ్యా. సిద్ధవిద్యాధరగణవ్యాప్తమై నందనవనమునకు సమానమైన కైలాసమున తీవ్రమైనతపస్సు చేయుచున్నవాడును, ఆకారముతో కూడిన ధర్మముబోలె నున్నవాడును, వైద్యవిద్య నెరింగినవారిలో నగ్రగణ్యుడును, అట్టి యాయుర్వేదీయవైద్యవిద్యను లోకమున ప్రవర్తింపజేసినవాడును, ఇంద్రియముల నిగ్రహించి స్వాయత్తముగ నుంచుకొనినవాడును నగు పునర్వసువను నామాంతరముకల యాత్రేయులను అగ్నివేశు లిట్లు అడిగెను:—

"భగవత్స్వరూపుడగు నోగురువర్యా! లోకమున మిక్కిలి కష్టమును కల్గించు నుదరరోగములచే బీడింపబడిన మానవులు కృశించిన అవయవములును వాడబారి శుష్కించిన ముఖంబును, మిక్కిలి యుబ్బిన ఉదరంబును కుక్షియు కల్గినవారును, జాఠరాగ్నియు శరీరబలంబును ఆహారంబును నశించినవారును, సకలవ్యాపారములయందును చేయ సామర్థ్యముదక్కినవారును, దీనులునై కన్పట్టుచున్నారు. మరియు నీవ్యాధి పీడితులు కొందరు సమయమున దగినచికిత్స బడయమింజేసి యనదలై తుదకు ప్రాణముల గూడ గోల్పోవుచున్నారు.

అట్టి క్రూరములై ప్రాణాంతకరములగు నుదరరోగములకు సంబంధించిన కారణంబులును వానిసంఖ్యాభేదంబును, పూర్వరూపంబును, వానిలక్షణంబులును, చికిత్సయు వీనినన్నిటిని గురువర్యులగు మీరు చక్కగ జెప్పినచో వినగోరెదను." ఇత్తెరంగున శిష్యునిచే నడుగబడినవాడై ఋషివర్యుడగు నాత్రేయులు ప్రాణికోటికెల్ల హితమును కోరి యిత్తెరంగున జెప్పందొడంగెను. (ఇచ్చట శిష్యప్రశ్నమూలముగ నుదరవ్యాధికి ప్రధానముగనుండు కార్యాదిస్వరూపలక్షణములు కొన్ని సూచింపబడెను).

## ఉదరసంప్రాప్తి.

మూ. అగ్నిదోషాన్మనుష్యాణాం రోగసఙ్ఘాః పృథగ్విధాః,
మలవృద్ధ్యా ప్రవర్తన్తే విశేషేణోదరాణి తు. 9
మన్దేఽగ్నౌ మలినైర్భుక్తైః అపాకాద్దోషసఞ్చయః,
ప్రాణాఽగ్న్యపానాన్ సందూష్యమార్గాన్ బద్ధ్వాఽధరోత్తరాన్.
త్వఙ్మాంసాన్తరమాగమ్య కుక్షిమాధ్మాపయన్ భృశం,
జనయన్త్యుదరం, తస్య హేతుం శృణు సలక్షణమ్. 11

వ్యా. లోకమున మనుజులకు జాఠరాగ్ని మందగించుటవలన పలుతెరంగులైన రోగములు సంభవించును. మరియు వాతాదిదోషంబులును, పురీషాదిమలంబులును, అగ్ని మాంద్యమువలన మిక్కిలి వృద్ధినొందియు ననేకరోగముల గల్గించును. అందును ఉదర రోగములును ముఖ్యముగ గల్గించును.

జాఠరాగ్ని మందగించినప్పుడు మలినములైన యాహారములచేత (దోషముల గల్గించి విరుద్ధాద్యాహారములచేతను, ఆహారము చక్కగ జీర్ణము కాకుండుటచేతను, దోషంబులును మలంబులును మిక్కిలి వృద్ధినొంది ప్రాణవాతమును, జాఠరాగ్నిని, అపానవాతమును, బొత్తుగ చెరచి ఊర్ధ్వాధోమార్గముల రెంటిని అడ్డగించి శరీరమునందలి చర్మమునకును మాంసమునకు నడుమ వ్యాపించి కుక్షిని మిక్కిలి యుబ్బించి ఉదరవ్యాధిని కల్గించును. అట్టి యుదరవ్యాధియొక్క కారణములను, లక్షణములును చెప్పెద వినుము. వాగ్భటాచార్యులు "ఊర్ధ్వాధోధాతవో రుద్ధ్వా వాహినీరంబువాహినీ, ప్రాణాగ్న్యపానాన్ సందూష్య కుర్యుస్త్వఙ్మాంససన్ధిగాః ఆధ్మాప్య కుక్షిముదరం" అని యుదర సంప్రాప్తిని చెప్పిరి. వాతాదిదోషములు వానివానికారణములచే ప్రకోపమునొంది శరీరమునందలి జలమలములను ప్రవహింపజేయు స్రోతస్సులను క్రిందిభాగమునను పైభాగమునను నడ్డగించి ప్రాణవాతమును, తనంతట మందగించియుండు జఠరాగ్నిని, అపానవాతమును ఈమూటిని పూర్తిగ చెరిచి చర్మమాంసముల సంధిలోచేరి కుక్షిని యుబికించునని యర్థము. ఈవాక్యమువలన శరీరమునందలి ద్రవమును వహించునట్టినాడులమార్గములను కూడ దోషములు నడ్డగించునని తెలిసెడి.

### ఉదరములగల్గించు కారణములు.

మూ. అత్యుష్ణలవణక్షారవిదాహ్యమ్లగరాశనాత్,
మిథ్యాసంసర్జనాద్రూక్షవిరుద్ధాశుచిభోజనాత్. 12
ప్లీహార్శోగ్రహణీదోషకర్షణాత్కర్మవిభ్రమాత్,
క్లిష్టానామప్రతీకారాత్ రౌక్ష్యాద్వేగవిధారణాత్. 13
స్రోతసాం దూషణాదామాత్సంక్షోభాదతిపూరణాత్,
అర్శోవాలశకృద్రోధాదంత్రస్ఫుటనభేదనాత్. 14
అతిసంచితదోషాణాం పాపం కర్మ చ కుర్వతాం,
ఉదరాణ్యుపజాయంతే మందాగ్నీనాం విశేషతః. 15

వ్యా. మిక్కిలి యుష్ణవీర్యంబులును, లవణరసంబులును, విదాహకరంబులును, అమ్లరసభూయిష్ఠంబులును నగునాహారపదార్థముల సేవించుట; గరము అనునట్టివిషము

సంబంధముకల్గుట; వమనవిరేచనాదులచే శోధనముజేసినపిదప సంసర్జనవిధి (పథ్యక్రమము) విధ్యుక్తప్రకారముగాక వ్యతిరేకముగ జేయుట; రూక్షంబును, పరస్పరవిరుద్ధంబును, అపరిశుద్ధంబునైన యన్నాదుల భుజించుట; ప్లీహము, అర్శస్సు, గ్రహణీదోషము, అను నీవ్యాధులు కల్గినపుడు తగినచికిత్స లేమింజేసి శరీరము కృశించుట; వమనవిరేచనాది కర్మలను విధ్యుక్తముగకాక వ్యత్యస్తముగ జేసికొనుట; మిక్కిలి కష్టములకల్గించు క్రూరవ్యాధులకు తగినచికిత్స జేసికొనక యుపేక్షించుట; శరీరమున రౌక్ష్యగుణము నధికముగ సంబంధించియుండుట; మలమూత్రాదివేగముల నిరోధించుట; శరీరమునందలి స్రోతస్సులు చెడుట; ఆమదోషంబును బంధించియుండుట; శరీరమునకు మిక్కిలి సంచలనము కల్గుట, మితిమీరి పొట్టకు మిక్కుటముగ నాహారము నిండించుట; అర్శస్సులచేతను, వెండ్రుకలు మొదలగువానిచేతను, పురీషము నడ్డగింపబడుట, శరీరమునందలి ప్రేవులు పగులుట, ఈకారణములచేత మిక్కిలి దోషసంచయముగలవారికిని; క్రూరమైన పాపకర్మములచేయువారికిని ఉదరరోగములు సంభవించును. మరియు అగ్నిమందగించినవారికి విశేషముగ నీవ్యాధి కల్గును. (ఇచ్చట, ''పాపం కర్మ చ కుర్వతామ్'' అని చెప్పుటచేత జన్మాంతరకృతపాపకర్మము ఈవ్యాధికి కారణమగుటంజేసి ఇయ్యది మిక్కిలి క్రూరమై దుస్సాధ్యముగ నుండునని తెలిసెడి.

## ఉదరరోగపూర్వరూపములు.

మూ. క్షున్నాశః స్వాద్వతిస్నిగ్ధగుర్వన్నం పచ్యతే చిరాత్,
భుక్తం విదహ్యతే సర్వం జీర్ణాఽజీర్ణం న వేత్తి చ. 16
సహతే నాతిసౌహిత్యమీషచ్ఛోఫశ్చ పాదయోః,
శశ్వద్బలక్షయోఽల్పేఽపి వ్యాయామే శ్వాసమృచ్ఛతి. 17
వృద్ధిః పురీషనిచయో రూక్షోదావర్తహేతుకా,
వస్తిసన్ధౌ రుగాధ్మానం వర్ధతే పాట్యతేఽపి చ. 18
ఆతన్యతే చ జఠరమపి లఘ్వల్పభోజనాత్,
రాజీజన్మ వలీనాశ ఇతి లిఙ్గం భవిష్యతామ్. 19

వ్యా. ఉదరరోగముకల్గుటకు మునుమున్ను అగ్ని మందగించియుండుటచేత ఆకలి పుట్టదు. మధురంబును, మిక్కిలి స్నిగ్ధంబును, గురుత్వము కల్గినదియునగు నన్నము చిరకాలమునకు జీర్ణమగును. భుజింపబడిన యాహారమంతయు విదగ్ధమగును. (విదగ్ధాజీర్ణమగుననుట.) మరియు నాహారము జీర్ణమైనదియు కానిదియు తెలియకుండును.

తాను మామూలుగ భుజించుపరిమాణముకన్న కొంచెమధికమయినను ఓర్వజాలకుండును. మీగాళ్లయందు కొంచెముగ వాపుగల్గును. శరీరబలము నానాట క్షీణించును. స్వల్పముగ పనిచేసినను రోజుపుట్టును. మలము నానాట వృద్ధినొంది బయటవెడలక నిలచియుండును. ఉదావర్తముకల్గి శరీరము రూక్షమగును. వస్తికిని నితరావయవములకును సంధియందు నొప్పిపుట్టును. కడుపు నానాట యుబ్బరించును. పొట్ట పగులదీయునట్లుండును. విశాలమగును. మిక్కిలి లఘువుగను కొంచెముగను భుజించినను కడుపు విశాలమగును. పొట్టపై నరములు స్ఫుటముగ కానవచ్చుచు రేఖలవలె నగపడును. మామూలుగ నుండుపొట్ట ముడుతలు మరగును. ఇవియన్నియు ఉదరరోగము గల్గుటకుమున్ను గన్పించు పూర్వరూపములని యెరుంగునది.

## ఉదరసామాన్యసంప్రాప్తి.

మూ. రుద్ధ్వా స్వేదాంబువాహీని దోషాః స్రోతాంసి సంచితాః,
ప్రాణాగ్న్యపానాన్సందూష్య జనయన్త్యుదరం నృణామ్. 20

వ్యా. "అత్యష్ణలవణం" అని యుపక్రమించి చెప్పినకారణములచే ప్రకోపము నొందినదోషములు మిక్కిలి వృద్ధినొంది శరీరమునందలి చెమటను ఉదకమును వ్యాపింపజేయునట్టి స్రోతోమార్గములను అడ్డగించి ప్రాణవాతమున జఠరాగ్నిని నపానవాతమును జెరచి యుదరరోగములు కల్గించును. (ఇది యుదరరోగసంప్రాప్తి. ఈసంప్రాప్తియే "మన్దేఽగ్నౌ......భృశమ్" అనువాక్యముచే జెప్పబడియున్నను ఇచ్చట "స్వేదాంబువాహీని స్రోతాంసిరుద్ధ్వా" అను విశేషవిషయమును చెప్పుటకై మరల చెప్పబడినగాని పునరుక్తము కానేరదు. కొందరు ముందుజెప్పబడినది ఉదరములన్నిటికి జేరిన సంప్రాప్తియనియుం, ఇచ్చట చెప్పబడినది దోషజన్యములగునుదరములకు మాత్రము చేరిన సంప్రాప్తియనియు చెప్పెదరు.)

## ఉదరరోగలక్షణములు.

మూ. కుక్షేరాధ్మానమాటోపః శోఫః పాదకరస్య చ,
మందోఽగ్నిః శ్లక్ష్ణగణ్డత్వం కార్శ్యం చోదరలక్షణమ్. 21

వ్యా. కడుపుబ్బియుండుట, కడుపులో గడబిడయనుశబ్దము కల్గియుండుట, మీగాళ్లయందును, మీచేతులయందును వాపుగల్గుట, జఠరాగ్ని మందగించుట, చెక్కిళ్లు నునుపుకల్గియుండుట, శరీరము కృశించుట ఇవియన్నియు ఉదరరోగసామాన్యలక్షణములు.

## ఉదరరోగభేదము లెనిమిది.

మూ. పృథగ్దోషైః సమస్తైశ్చ ప్లీహాబద్ధక్షతోదకైః,
సంభవన్త్యుదరాణ్యష్టౌ తేషాం లిఙ్గం పృథక్ శృణు. 22

వ్యా. ఉదరవ్యాధి వాతపిత్తకఫములచే వేరువేరుగను, త్రిదోషసన్నిపాతము చేతను, ప్లీహవృద్ధి, బద్ధగుదము, క్షతము, ఉదకము అను నీనాల్గుకారణములచే వేరు వేరుగ జనించుటచేతను ఎనిమిదివిధములగును. ఈయెనిమిదింటికిని వేరువేరులక్షణము లీక్రింద జెప్పబడును.

## వాతోదరకారణములు; సంప్రాప్తియు.

మూ. రూక్షామ్లభోజనాయాసవేగోదావర్తకర్శనైః,
వాయుః ప్రకుపితః కుక్షిహృద్వస్తిగుదమార్గగః. 23
హత్వాగ్నిం కఫముద్ధూయ తేన రుద్ధగతిస్తతః,
ఆచినోత్యుదరం జన్తోః త్వఙ్మాంసాన్తరమాశ్రితః. 24

వ్యా. రూక్షగుణంబును అమ్లరసంబును కలపదార్థముల భుజించుట, శ్రమను కల్గించుపనులజేయుట, మలమూత్రాదివేగముల నిరోధించుట, ఉదావర్తము, శరీరమును కృశింపజేయులంకణము మున్నగునవి ఈకారణములచే వాతము ప్రకోపించి, కుక్షి యందును హృదయమునందును వస్తియందును గుదమార్గమునను జేరి, జాఠరాగ్నిని మందగింపజేసి, కఫమును వృద్ధినొందించి యాకఫముచే నడ్డగింపబడిన మార్గముకలదియై చర్మమునకును మాంసమునకు సంధిలోజేరి యుదరమును వృద్ధినొందించును. (ఇచ్చట "కఫముద్ధూయ" అనుటచేత వాతము ప్రధానమై కఫము అప్రధానముగ నుండునని తెలిసెడి).

## వాతికోదరలక్షణములు.

మూ. తస్య రూపాణిః—కుక్షి-పాణి-పాద-వృషణశ్వయథుః, ఉదర విపాటనం, అనియతౌ చ వృద్ధిహ్రాసౌ, కుక్షిపార్శ్వశూలోదావర్తాఙ్గమర్ద-పర్వభేద-శుష్కకాస-కార్శ్య-దౌర్బల్య - అరోచక-అవిపాకాః, అధోగురుత్వం, వాతవర్చోమూత్రసఙ్గః, శ్యావారుణత్వం చ నఖనయనవదనత్వఙ్మూత్రవర్చసామ్, అపి చ ఉదరం తన్వసితరాజీసిరాసన్తతమ్, ఆహతమాధ్మాతదృతిశబ్దవద్భవతి. ఏతద్వాతోదరమితి విద్యాత్. 25

వ్యా. వాతోదరమునందు కుక్షి, చేతులు, పాదములు, వృషణములు ఈస్థలముల యందు శోఫకల్గును. జఠరము వృద్ధినొందుటయు తగ్గుటయు కాలనియమము లేకుండును. ఉదరము పగులునట్లు బిఱ్ఱబిగిసియుండును. కుక్షియందును ఇరుప్రక్కలయందును శూల మున గ్రుమ్మినట్లు పోటుకల్గును, ఉదావర్తంబును, ఒడలినొప్పులును, ప్రేళ్లగణుపుల యందు నొప్పియు, పొడిదగ్గును, శరీరకృశత్వంబును, బలహీనంబును, అరోచకంబును కల్గును. ఆహారము చక్కగ జీర్ణముకాదు. శరీరమునం దధోభాగమున బరువుగనుండును. అపానవాతంబును మలమూత్రంబులును బంధింపబడును. గోళ్లు, కన్నులు, ముఖము, చర్మము, మూత్రపురీషములు, ఇవియన్నియు శ్యామవర్ణములుగనైనను అరుణవర్ణము లుగనైన నుండును. మరియు నుదరము సూక్ష్మములై నల్లనైనరేఖలతోడను సిరలతోడను వ్యాప్తమై, వ్రేలితో తట్టినచో నీళ్లతో నిండియుండు తోలుతిత్తివలె ఖంగుమనుశబ్దము కల్గి బిఱ్ఱబిగిసి యుబ్బియుండును. ఈలక్షణములు కల్గినది వాతజనితోదరమని యెరుం గునది.

## పైత్తికోదరకారణములు.

మూ. కట్వమ్లలవణాత్యుష్ణతీక్ష్ణాగ్న్యాతపసేవనైః,
విదాహ్యధ్యశనాఽజీర్ణైశ్చాశు పిత్తం సమాచితమ్. 26

ప్రాప్యాఽనిలకఫౌ రుద్ధ్వామార్గమున్మార్గమాసితం,
నిహన్త్యామాశయే వహ్నిం జనయత్యుదరం తతః. 27

వ్యా. కటు-అమ్ల-లవణరసములు కలపదార్థములను, మిక్కిలి యుష్ణవీర్యంబులును తీక్ష్ణగుణంబులునైన పదార్థములను భుజించుట; నిప్పుసెగనైనను ఎండలోనైన నుండుట, విదాహి(మంటబుట్టించు) ఆవాలు మున్నగువానిని విశేషముగ తినుట, అధ్యశనము (భుజించినతోడనె మరల భుజించుట), అజీర్ణముచేయుపదార్థముల భుజించుట, (లేక భుజింపబడిన యాహారము జీర్ణము గాకుండునపుడు మరల భుజించుట ఈకారణములచే పిత్తము ప్రకోపమునొంది వెంటనే వాతకఫముల జేరి స్రోతోమార్గముల నడ్డగించి మిక్కిలి యుత్కటమై (స్థలాంతరముల నుండుధాత్వగ్నులచెరచి, పిదప) ఆమాశయమున నుండు పాచకాగ్నిని నశింపజేసి యుదరరోగమును కల్గించును. (ఇచ్చట పిత్తము ప్రధానమై వాతకఫములు పిత్తమున కుపబలములుగ నుండును.)

## పైత్తికోదరలక్షణములు.

మూ. తస్య రూపాణిః—దాహ-జ్వర-తృష్ణా-మూర్ఛాఽతీసార-భ్రమాః,
కటుకాస్యత్వం, హారితహారిద్రత్వం చ నఖనయనవదనత్వఙ్మూత్ర

వర్చసాం; అపి చ ఉదరం నీలపీతహారిద్రహారితతామ్రరాజీసిరావనద్ధం, దహ్యతే, దూయతే, ధూప్యతే, ఊష్యతే, స్విద్యతే, క్లిద్యతే, మృదుస్పర్శం, క్షిప్రపాకం చ భవతి; ఏతత్పైత్తోదరమితి విద్యాత్. 28

వ్యా. పిత్తప్రకోపమున కల్గినయుదరరోగమున దాహంబును (మంటయు), జ్వరంబును, దప్పియు, మూర్ఛయు, అతిసారంబును, భ్రమంబును (ఒడలుతిరుగుట), కల్గును. నోరు చేదుగనుండును. గోళ్లు, కన్నులు, ముఖము, చర్మము, మూత్రపురీషములు, ఇవియన్నియు పచ్చనిరంగైనను పసుపురంగైనను కల్గియుండును. మరియు ఉదరము నీల-పీత-హారిద్ర-(పసుపురంగు) తామ్రవర్ణంబులు కలరేఖలును సిరలును వ్యాపించియుండును. తాపము కల్గియుండును. బాధకల్గియుండును. పొగ వెడలునట్లుండును. ఆవిరి వెడలునట్లుండును. చెమటబట్టును మెత్తగనుండును. తాకినచో మృదువుగనుండును. శీఘ్రముగ పక్వమగును. ఈలక్షణములు కల్గినది పైత్తోదరము.

## శ్లైష్మికోదర కారణములు.

మూ. అవ్యాయామదివాస్వప్నస్వాద్వతిస్నిగ్ధపిచ్ఛిలైః,
దధిదుగ్ధౌదకానూపమాంసైశ్చాఽప్యతిసేవితైః. 29
క్రుద్ధేన శ్లేష్మణా స్రోతస్స్వావృతేష్వావృతోఽనిలః,
తమేవ పీడయన్ కుర్యాదుదరం బహిరన్త్రగః (రన్తరమ్.) 30

వ్యా. వ్యాయామము చేయకుండుట, పగటియందు నిదురించుట, మధురంబులును మిక్కిలి స్నిగ్ధంబులు నగుపదార్థముల భుజించుట, పెరుగును పాలను జలజంతువులయొక్కయు ఆనూపజంతువులయొక్కయు మాంసములను మితిమీరి యుపయోగించుట, ఈకారణములచే కఫము ప్రకోపమునొంది స్రోతోమార్గముల నడ్డగించును. దానంజేసి వాతము వెడలతెరవుగానక అంత్రములకు బాహ్యముగ నుండుప్రదేశమునజేరి కఫముతో గూడి యుదరమును కల్గించును.

## శ్లైష్మికోదరలక్షణములు.

మూ. తస్య రూపాణిః—గౌరవాఽరోచకాఽవిపాకాఽఙ్గమర్దాః,సుప్తిః, పాణిపాదముష్కోరుశోఫః, ఉత్క్లేశనిద్రాకాసశ్వాసాః, శుక్లత్వం చ నఖనయనవదనత్వఙ్మూత్రవర్చసామ్; అపి చ ఉదరం శుక్ల

రాజీసిరానన్తతం గురు స్తిమితం స్థిరం కఠినం చ భవతి; ఏతత్ శ్లేష్మోదరమితి విద్యాత్. 31

వ్యా. కఫజనితోదరమున శరీరము బరువుగ నుండును. అరోచకము కల్గును. ఆహారము జీర్ణముకాదు. ఒడలంతయు నొప్పికల్గియుండును. స్పర్శము దెలియకుండును. హస్తపాదములయందును వృషణములయందును తొడలయందును శోఫ కల్గును-వాంతి యగును. నిద్ర అధికమగును. కాసశ్వాసములు కల్గును. గోళ్లును, కన్నులును, ముఖంబును, చర్మంబును, మూత్రపురీషంబులును తెల్లగ నుండును. ఉదరము తెల్లనిరేఖలచేతను సిరల చేతను ఆవరింపబడి బరువుకల్గి గొప్పదియై నిశ్చలమై కఠినముగ నుండును. ఈలక్షణ ములు కల్గినది శ్లేష్మోదరమని యెరుంగునది.

సాన్నిపాతికోదరకారణములు.

మూ. దుర్బలాగ్నే రపథ్యామవిరోధిగురుభోజనైః,
స్త్రీదత్తైశ్చ రజోరోమవిణ్మూత్రాస్థినఖాదిభిః. 32
విషైశ్చ మన్దైః వాతాద్యాః కుపితాస్సఞ్చయం త్రయః,
శనైః కోష్ఠే ప్రకుర్వన్తో జనయన్త్యుదరం నృణామ్. 33

వ్యా. జఠరాగ్ని మిక్కిలి మందగించియున్నపుడు అపథ్యములగు నాహారపదార్థము లను పరస్పరవిరుద్ధములగు క్షీరమత్స్యాదిపదార్థములను, గురుపదార్థములను, భుజించుట వలనను; స్త్రీలు వారిసౌభాగ్యమునకై రజస్సు, రోమములు, మలమూత్రములు, అస్థులు, గోళ్లు మున్నగువాని పెట్టుటవలనను; మందవీర్యములగువిషముల (దూషీవిషము) వలనను; వాత-పిత్త-కఫములు మూడును సమకాలమున సమముగ ప్రకోపమునొంది కోష్ఠమున మెలమెల్లగ వ్యాపించుసంప్రాప్తిలో చెప్పినరీతిగ నుదరమును కలిగించును.

ఇచ్చట లోకమున నాడవారు పురుషులను స్వాయత్తముగ జేసికొని వారివలని సుఖము ననుభవించుటకై ఆర్తవము, రోమములు, మలమూత్రములు మున్నగువానిమూల మున కృత్రిమౌషధమును సిద్ధముచేసి పురుషులకు బెట్టుటకలదు.అయ్యది త్రిదోషప్రకోప మునకు కారణమై యుదరమును కలిగించునని "స్త్రీదత్తైశ్చ" అనువాక్యముచే చెప్పబడి నది. అట్టియౌషధమును ప్రాయికముగ స్త్రీలే యుపయోగపరచెదరు కావున "స్త్రీదత్తైః" అని చెప్పబడినదికాని ఇతరులు యెవ్వరైనను అట్టియౌషధమును ప్రయోగించినచో నదియును నుదరరోగకారణమగును. మరియు "విషైశ్చ మన్దైః" యనుచోట విషము నకు స్వాభావికమైన గుణములు మందగించియున్న విషమని యర్థము. అయ్యది దూషీ విష మనబడును. మరియు దూషీవిషలక్షణము తంత్రాంతరమున నిట్లు చెప్పబడినది:—

"జీర్ణం విషఘ్నౌషధిభిర్హతం వా దావాగ్నివాతాతపశోషితం వా, స్వభావతో వా గుణవిప్రహీనం విషం హి దోషీవిషతాముపైతి." ఈవాక్యముచేత కారణాంతరములచేనైనను, స్వాభావికముగనైనను, వ్యవాయి మున్నగు తీవ్రగుణములు మందగించియుండునది దూషీవిషమనియర్థము. ఈదూషీవిషముచే నుదరరోగము కల్గునని "కుర్యాత్ప్రవృత్తిం జఠరస్య చాపి" అని తంత్రాంతరమున చెప్పబడినది. మరియు స్త్రీలు సౌభాగ్యార్థము ప్రయోగించు ఆర్తవాదులవలనను, జఠరము కల్గునని "సౌభాగ్యార్థం స్త్రియస్వేదం......జఠరం గ్రహణీ దోషా.........లిఙ్గాని దర్శయేత్" అని మాధవనిదానమున చెప్పబడినది.

## సాన్నిపాతికోదరలక్షణములు.

మూ. తస్య రూపాణి:—సర్వేషామేవ దోషాణాం సమస్తాని లిఙ్గాన్యుపలభ్యన్తే; వర్ణాశ్చ సర్వే నఖాదిషు, ఉదరమపి నానావర్ణరాజీసిరాసంతతం భవతి. ఏతత్సన్నిపాతోదరమితి విద్యాత్. 34

వ్యా. సన్నిపాతోదరరోగమునందు వాతాదిదోషములచేగల్గిన ఉదరరోగములకు పైనివివరింపబడిన వేరువేరులక్షణములు అన్నియు కలసియుండును. నఖాదులయందు వేరువేరుగ జెప్పబడిన శుక్ల పీతాదివర్ణములన్నియును కల్గియుండును. ఉదరంబును, శుక్ల పీతాది నానావర్ణములతోకూడిన సిరలచే వ్యాప్తమైయుండును. ఈలక్షణములన్నియు కలది సన్నిపాతముచే కల్గినయుదరమని యెఱుంగునది.

## ప్లీహవృద్ధికారణములు.

మూ. అశితస్యాతిసంక్షోభాత్ యానయానాతిచేష్టితైః,
అతివ్యవాయభారాధ్వవమనవ్యాధికర్శనైః. 35
వామపార్శ్వాశ్రితః ప్లీహా చ్యుతః స్థానాత్ప్రవర్తతే,
శోణితం వా రసాదిభ్యో వివృద్ధం తం వివర్ధయేత్. 36

వ్యా. ("గర్భస్యయకృత్ప్లీహానౌ శోణితజౌ." అను సుశ్రుతవాక్యమునుబట్టి మనుజులకు యకృత్తును, ప్లీహమును, రక్తధాతువువలన కలుగునని తెలిసెడి. అందు ప్లీహము శరీరమునందు ఎడమపార్శ్వముననుండు పరశుకాస్థులలో నెనిమిదవయస్థివరకు వ్యాపించి ఆరంగుళములనిడుపును, ఆరంగుళములవిస్తారమును, ఒకటిన్నరయంగుళములావును కల్గియుండును. ఇదియే ప్లీహముయొక్క స్వరూపము. యకృత్తు కుడిప్రక్క తొమ్మిదవయస్థివరకును వ్యాపించియుండును.)

మనుజుడు మిక్కుటముగ భుజించి గుఱ్ఱము మున్నగువాహనములపై నెక్కి సవారిచేయుట మొదలయిన యాదృచ్ఛికచేష్టలచే సంక్షోభమునొందినను, అధికముగ స్త్రీసంభోగమును జేయుట, త్రోవనడచుట, భారమును మోయుట, వమనము నధికముగ జేసికొనుట, జ్వరాదివ్యాధులచే శరీరము కృశించుట, ఇవి మున్నగుకారణములచేనైనను; శరీరమునందు వామభాగమున నాశ్రయించియుండు (పైవివరింపబడిన) ప్లీహము స్వస్థానమునుండి తొలగి నానాట వృద్ధినొందును. (పైజెప్పిన ప్రమాణముకన్న నధికము వృద్ధినొందును.) లేక రసాదిధాతువులచేతను, ఆహారవిహారాదులచేతను, రక్తము స్వప్రమాణమునకన్న నధికముగ వృద్ధినొంది పైజెప్పబడిన ప్లీహము స్వస్థానమునుండి తొలగకయున్నను నానాట వృద్ధినొందించును. ఇది ప్లీహాభివృద్ధిస్వరూపము.

ఇచ్చట నీవిషయము నెరుంగునది:—ప్లీహాభివృద్ధికారణములు రెండు. అందు పైజెప్పిన సంక్షోభాదికారణములచే స్వస్థానమునుండి ప్లీహము తొలగుట యొకకారణము. రెండవది రసాదిధాతువులచే నతిమాత్రముగ వృద్ధినొందిన రక్తము కారణము. అందు సంక్షోభాదికారణములచే స్థానచ్యుతమైన ప్లీహముయొక్క వృద్ధవాత-పిత్త-కఫసన్నిపాత భేదములచే నాలుగువిధము లుండును. రక్తవృద్ధిచే కల్గినప్లీహాభివృద్ధి నొకటియును జేరి ప్లీహవృద్ధిభేదములు ఐదువిధముల నుండును. ఈభేదములనే సూత్రస్థానమున "పఞ్చ ప్లీహదోషాః ఇతి గుల్మే వ్యాఖ్యాతా" (సూ. అ ౧౯.) అని చెప్పబడినది. ఈయైదు విధములైన ప్లీహవృద్ధియును ఉదరరోగకారణమని యెరుంగునది. ప్లీహవృద్ధికి వాతాదులచే గల్గులక్షణభేదములు వాగ్భటాచార్యునిచే నిట్లు చెప్పబడినది:—"ఉదావర్తరుగానాహైః, మోహతృట్దహనజ్వరైః; గౌరవారుచికాఠిన్యైః, విద్యాత్తత్ర మలాన్ క్రమాత్." వాతజప్లీహాభివృద్ధియందు ఉదావర్తము, నొప్పి, కడుపుబ్బరంబును; పిత్తజమున మోహము, డప్పి, మంటయు, జ్వరంబును; కఫజమున గురుత్వము, అరుచి, కాఠిన్యంబును కల్గునని యర్థము. ఈలక్షణములన్నియు కల్గినది సాన్నిపాతికము.

## ప్లీహోదరసంప్రాప్తి.

మూ. తస్య ప్లీహా కఠినోఽష్ఠీలేవాదౌ వర్ధమానః కచ్ఛపసంస్థాన ఉపలభ్యతే, స చోపేక్షితః క్రమేణ కుక్షిం జఠరమగ్న్యధిష్ఠానం చ పరిక్షిపన్ ఉదరమభినిర్వర్తయతి. 37

వ్యా. పైజెప్పినవిధముగ వృద్ధినొందు ప్లీహము తొలుత నినుపడాకలివలె మిక్కిలి కఠినమై కొంతకాలమునకు తాబేలువలె చేత తాకినపుడు కనబడుచుండును. అట్టి పరిస్థితియందు ప్లీహవృద్ధిని చికిత్సచేయక యుపేక్షించినయెడ కుక్షిలో నానాట వృద్ధినొంది

అగ్నిస్థానమును చెరిచి యుదరమును కల్గించును. (ఈయర్థమునే వాగ్భటాచార్యు లిట్లు చెప్పెను:—"సోఽష్ఠీలే వాతికఠినః ప్రాక్, తతః కూర్మపృష్ఠవత్, క్రమేణ వర్ధమానశ్చ కుక్షౌ, ఉదరమావహేత్." (అ. ని. అ. ౧౨. శ్లో. ౨౮.)

## ప్లీహోదరలక్షణములు.

మూ. తస్య రూపాణి—దౌర్బల్యాఽరోచకాఽవిపాకవర్చో మూత్రగ్రహాతమఃప్రవేశ పిపాసాఽఙ్గమర్ద ఛర్దిమూర్ఛాఽఙ్గసాద కాస శ్వాసమృదు జ్వరాఽఽనాహాఽగ్నినాశ కార్శ్యాఽఽస్యవైరస్య పర్వభేదకోష్ఠవాతశూలాని; అపి చ—ఉదరమరుణవర్ణం వివర్ణం వా, నీలహారితహారిద్ర రాజిమద్భవతి. ఏవమేవ యకృదపి దక్షిణ పార్శ్వస్థం కుర్యాత్, తుల్యహేతులిఙ్గౌషధత్వాత్ తస్య ప్లీహ జఠర ఏవాఽవరోధః ఇతి. ఏతత్ప్లీహోదరమితి విద్యాత్. 38

వ్యా. బలహీనము, అరోచకము, ఆహారము జీర్ణముకాకుండుట, మలమూత్రము వెడలక బద్ధగించుట, చీకటిలో నున్నవిధముగ నేమియు తెలియకుండుట, దప్పి, ఒడలి నొప్పులు, వాంతియగుట, మూర్ఛగ్రమ్ముట, శరీరము కృశించుట, నోటికి రుచి తెలియకుండుట, వ్రేలిగణుపులలో నొప్పిపుట్టుట, కోష్ఠమునందు వాతముచే శూలముకల్గుట, ఇవి యన్నియు ప్లీహోదరలక్షణములు, మరియు ప్లీహోదరమున నుదరము అరుణవర్ణముగనైనను వివర్ణముగనైన నుండును. నీల-హారిత(పచ్చనిరంగు)-హారిద్రవర్ణములైన రేఖలును సిరలును వ్యాపించియుండును.

మరియు శరీరమునందలి కుడిప్రక్కనుండు(పైవివరించిన) యకృత్తుకూడ ప్లీహము బోలె వృద్ధినొంది అదేతీరున నుదరమును కల్గించును. ఆయుదరము ప్లీహోదరమునకు సమానములైన కారణములును లక్షణములును చికిత్సయు కల్గియుండును; కావున ప్లీహోదరమునందే యంతర్భూతమగును. కావున యకృదుదరమును వేరుగ పరిగణనము చేయలేదు. పైజెప్పబడిన లక్షణములు కల్గినది ప్లీహోదరమని తెలియందగును.

యకృదుదరమును వాగ్భటాచార్యు లిట్లు చెప్పిరి:—"ప్లీహవద్దక్షిణాత్పార్శ్వాత్ కుర్యాద్యకృదపి చ్యుతమ్." అనువాక్యమువలన కుడిప్రక్కనుండు యకృత్తుగూడ ప్లీహమునకు చెప్పిన సంక్షోభాదికారణములచే స్వస్థానమునుండి జారి అదేరీతిగ వృద్ధినంది యుదరమును కల్గించుననియు, ఇయ్యది యకృత్తు వృద్ధినొంది కల్గుటంజేసి యకృదుదరమని చెప్పబడుననియు తెలిసెడి. దీనినే మాధవనిదానమున "సవ్యాన్యపార్శ్వే యకృతి ప్రవృద్ధే

జ్ఞేయం యకృద్దాల్యుదరం తదేవ.” అని యకృద్దాల్యుదరమను పేరున జెప్పిరి. ఈవృద్ధి యందు యకృత్తు భేదింపబడును. కావున యకృద్దాల్యుదరమని యన్వర్థముగ జెప్ప బడును.

### బద్ధగుదోదరకారణములు.

మూ. పక్ష్మవాలైః సహాన్నేన భుక్తైః బద్ధాయనే గుదే,
ఉదావర్తైస్తథార్శోభిః అన్త్రసమ్మూర్ఛనేన వా. 39
అపానో మార్గసంరోధాత్ హత్వాఽగ్నిం కుపితోఽనిలః,
వర్చః పిత్తకఫాం రుద్ధ్వా జనయత్యుదరం తతః. 40

వ్యా. రెప్ప వెండ్రుకలైనను ఇతరములగు వెండ్రుకలైనను, అన్నమును భుజించు నపుడు అన్నముతో గలిసి కుక్షిలో ప్రవేశించుటచేనైనను, ఉదావర్తము (వాతము ఊర్ధ్వముగ సంచరించుట)చేనైనను, అర్శస్సుల (గుదాంకురముల)చేనైనను మలమును ధరించు ప్రేగు మెలికబడుటచేనైనను, గుదమార్గము అడ్డగింపబడినపుడు అపానవాతము మార్గనిరోధముచే వెడల తెరువుగానక ప్రకోపమునొంది జాఠరాగ్నిని అణచి, పురీషమును పిత్తమును కఫమును నిరోధించి ఉదరమును కల్గించును.

ఇచ్చట పక్ష్మవాతాదులు గుదమార్గనిరోధకారణము లనేకములుగనున్నను అపానవాతప్రకోపమునకు మార్గనిరోధ మొక్కటియే కారణము కావున బద్ధగుదోదర మొక్కటియే యని యెరుంగునది.

### బద్ధగుదోదరలక్షణములు.

మూ. తస్య రూపాణి—తృష్ణా-దాహ-జ్వర-ముఖతాలు-శోషోరుసాదకాసశ్వాసదౌర్బల్యారోచకావిపాకవర్చో మూత్రసఙ్గాధ్మానచ్ఛర్దిక్షవథుశిరోహృన్నాభిగుదశూలాని;అపిచ—ఉదరం మూఢవాతం స్థిరమరుణం నీలరాజిసిరావనద్ధం అరాజికం వా, ప్రాయో నాభ్యుపరి గోపుచ్ఛవదభినిర్వర్తత ఇతి; ఏతద్బద్ధగుదోదరమితి విద్యాత్. 41

వ్యా. బద్ధగుదోదరమునందు దప్పియు, తాపమును, జ్వరమును కల్గును. ముఖంబును తాలువులును శుష్కించును. తొడలు కృశించును. కాసశ్వాసంబులును, బలహీనంబును, అరోచకంబును, అజీర్ణంబును కల్గును. మలమూత్రములు సరళముగ వెడలక బద్ధగించును. కడుపుబ్బును. వాంతి యగును. తుమ్ములు విశేషముగ వెడలును. శిరస్సునందును

హృదయమునందును నాభిస్థానంబునను గుదంబునను శూలల కల్గును. మరియు నుదరము వాతము సంచరించక నిశ్చలమై కఠినంబును అరుణవర్ణంబును, నల్లని సిరలచేతను రేఖల చేతను ఆవరింపబడి యుండును, లేక రేఖలు లేకుండును. నాభికి పైభాగమున ప్రాయికముగ ఆవుతోకవంటి యాకారము కల్గియుండును. దీనిని గుదద్వార మడ్డగించుటచే గల్గుటం జేసి బద్ధగుదోదరమని చెప్పెదరు.

### ఛిద్రోదరకారణములు, సంప్రాప్తియు.

మూ. శర్కరాతృణకాష్ఠాస్థికణ్టకై రన్నసంయుతైః,
భిద్యేతాన్త్రం యదా భుక్తైః జృమ్భయాత్యశనేన వా. 42
పాకం గచ్ఛేద్రసస్తేభ్యః ఛిద్రేభ్యః ప్రస్రవన్ బహిః,
పూరయన్ గుదమన్త్రం చ జనయత్యుదరం తతః. 43

వ్యా. చిన్నరాళ్లు, గడ్డిపోచలు, కొయ్యముక్కలు, ఎముకముక్కలు, ముండ్లు, ఇవిమున్నగునవి యన్నమున జేరియున్నపుడు దానిని గమనింపక, అట్టి శల్యములతో గూడిన యన్నమును భుజించినను, భుజించినతోడనే శరీరమును వెడమళ్లగచేసి నీల్గినను, పొట్టకు మిక్కుటముగ భుజించినను, ఆహారము కుక్షిలో ప్రవేశించుటకు మార్గమైన పెద్దప్రేగు పగులును. అయ్యది నానాట పుండగును. పిదప రంధ్రములుపడి వానినుండి యాహారరసము (పక్వముగాకయే) వెలుపలికి స్రవించి గుదమును అంత్రమును పూరించి యుదరమును కల్గించును.

ఈఛిద్రోదరసంప్రాప్తిని వాగ్భటాచార్యు లిట్లు చెప్పిరి:—"తచ్ఛిద్రైశ్చ స్రవన్ బహిః, ఆమమేవ గుదాదేతి తతోఽల్పాల్పం సవిద్రసః, తుల్యః కుణపగన్ధేన పిచ్ఛిలః పీత లోహితః, శేషశ్చాపూర్య జఠరం జఠరం ఘోరమావహేత్." పెద్దప్రేగురంధ్రములనుండి పక్వముగాని యాహారరసము గుదమార్గమునుండి కొంచెము కొంచెము బైటవెడలుననియు, అట్టిరసము దుర్గంధయుక్తముగ నుండుననియు, వెడలినరసముగాక జఠరమున నిలిచినరసము నానాట సంచితమై క్రూరమైనజఠరరోగమును కల్గించుననియు పైవాక్యముచే దెలిసెడి.

### ఛిద్రోదరలక్షణములు.

మూ. తస్య రూపాణి—తదధో నాభ్యాః ప్రాయోఽభివర్ధమానముదకోదరం భవతి యథాబలం చ దోషాణాం రూపాణి దర్శయతి. అపి చ—ఆతురః సలోహిత-నీల-లోహిత-పిచ్ఛిల-కుణపగన్ధ్యామవర్చః ఉపవేశతే, హిక్కా-శ్వాస-కాస - తృష్ణా -

ప్రమేహ-అరోచక-అవిపాక - దౌర్బల్యపరీతశ్చ భవతి. ఏతత్
చ్ఛిద్రోదరమితి విద్యాత్. 44

వ్యా. ఈయుదరము ప్రాయికముగ నాభికి క్రిందిభాగమున వృద్ధినొంది జలోదర మునుబోలె వానిలక్షణములు కల్గియుండును. మరియు వాతపిత్త-కఫములలో నేదోషము ప్రబలముగ నుండునో ఆదోషలక్షణములు అధికముగ నగపడును. ఈవ్యాధిచే పీడింపబడినరోగి ఎరుపు నలుపు పసుపురంగులలో నొకరంగు కల్గినదియు జిగురుకల్గినదియు పీనుగవంటి దుర్గంధముకల్గినదియు నగుపక్వముగాని మలమును పలుమారు గుదమునుండి వెడలించును. ఎక్కిళ్లు, శ్వాసకాసములు, దప్పి, ప్రమేహము, అరోచకము, ఆహారము జీర్ణము కాకుండుట, బలహీనము వీనితో కూడియుండును. ఈలక్షణములు కల్గినది చ్ఛిద్రోదరమని యెఱుంగునది. (పైజెప్పబడినరీతిగ రాళ్లు తృణములు మున్నగునవి గ్రుచ్చుకొనుటంజేసి పెద్దప్రేగున రంధ్రములుపడి దానివలన కల్గినది కావున ఛిద్రోదరమని యన్వర్థముగ జెప్పబడును. మరియు వాగ్భటాచార్యులు దీనిని—“ఛిద్రోదరమిదం ప్రాహుః పరిస్రావీతిచాపరే” అని పరిస్రావ్యుదరమనియు చెప్పిరి. మాధవనిదానమున—“ఏతత్పరిస్రావ్యుదరం ప్రదిష్టమ్” అని చెప్పబడినది.)

## జలోదరనిదానము, సంప్రాప్తి.

మూ. స్నేహపీతస్య మన్దాగ్నేః క్షీణస్యాఽతికృశస్య వా,
అత్యమ్బుపానాన్నష్టేఽగ్నౌ మారుతః క్లోమ్ని సంస్థితః. 45
స్రోతస్సు రుద్ధమార్గేషు కఫశ్చోదకమూర్ఛితః,
వర్ధయేతాం తదేవామ్బు స్వస్థానాదుదరాయతౌ. 46

వ్యా. స్నేహపానముచేసినవాడును, జఠరాగ్ని మందగించినవాడును, ధాతువులు క్షీణించినవాడును,ఇతరకారణములచే శరీరము కృశించినవాడును చల్లనినీళ్లను విశేషముగ త్రాగినచో జాఠరాగ్ని నశించును. దానంజేసి వాతము ప్రకోపించి (హృదయమునకు దక్షిణపార్శ్వముననున్న) క్లోమమును చేరి యచ్చటనుండి యుదకమును వహించు స్రోతోమార్గముల నడ్డగించును. అట్టి జలసంచయముచే కఫంబును వృద్ధినొందును. ప్రకుపితములగు వాతకఫములు రెండును ఆజలమునే జలమున కుత్పత్తిస్థానమైన క్లోమము నందే వృద్ధినందించును. దానంజేసి యుదరము (జలోదరము) సంభవించును.

ఇచ్చట క్లోమస్వరూపము సుశ్రుతమున నిట్లున్నది:—“శోణితకఫప్రసాదజం హృదయమ్,......దక్షిణతో యకృత్ క్లోమ చ.” ఈవాక్యముచేత హృదయమునకు దక్షిణభాగమున క్లోమ ముండునని తెలిసెడి. మరియు “స్రోతస్సు రుద్ధమార్గేషు” అను

చోట నుదకవహస్రోతోమార్గములని యర్థము. అట్టియుదకవహస్రోతస్సులకు క్లోమము మూలస్థానము. అట్టి జలమును వ్యాపింపజేయు స్రోతస్సుల నడ్డగించుసరికి జలము వెడల తెరవులేక స్వస్థానముననే వృద్ధిజెందును. అట్టి జలసంచయముచేత నుదరము వృద్ధినంది జలోదరముగ నేర్పడునని భావము. ఉదకవహస్రోతోమూల మిట్లు సుశ్రుతమున చెప్పబడినది:—"ఉదకవహే ద్వే, తయోర్మూలం తాలుక్లోమ చ"

మరియు జలోదరనిదానము తంత్రాంతరమున నిట్లు చెప్పబడినది:—"వాన్తో విరిక్తోఽప్యథవా నిరూఢః పిబేజ్జలం శీతలమాశు తస్య, స్రోతాంసి దూష్యన్తి హి తద్వహాని ......దకోదరం పూర్వవదభ్యుపైతి." ఈవాక్యముచేత వమనాదిపంచకర్మముల జేసికొని యవస్థపడి చల్లనినీళ్లను త్రాగుటవలన స్రోతోమార్గములు చెడి యుదరము కల్గునని తెలిసెడి.

## జలోదరలక్షణములు.

మూ. తస్య రూపాణి:—అనన్నకాంక్షా, పిపాసా, గుదస్రావ-శూల-శ్వాస-కాస-దౌర్బల్యాని; అపి చ:—ఉదరం నానావర్ణరాజిసిరాసన్తతం, ఉదకపూర్ణదృతిక్షోభసంస్పర్శం భవతి; ఏతత్ ఉదకోదరమితి విద్యాత్. 47

వ్యా. జలోదరమునందు అన్నమును భుజింప నభిలాష కలుగదు. దప్పి యధికమగును. గుదమునుండి ద్రవము స్రవించును. శ్వాసకాసంబులును బలహీనంబును కల్గును. మరియు నుదరము నానావర్ణములతోగూడిన రేఖలచేతను సిరలచేతను ఆవరింపబడి జలపూరితమైన తోలుతిత్తివలె నుండును జలము కొంచెము తగ్గియున్నపుడు కళబిళ యను శబ్దముతోకూడి కదలుచుండును. దీనిని జలోదరమని యెరుంగునది.

## ఉదరములన్నియు జలోదరముగ మారువిధము.

మూ. తత్ర అచిరోత్పన్నం అనుపద్రవమ్, అనుదకప్రాప్తముదరం త్వరమాణశ్చికిత్సేత్, ఉపేక్షితానాం హ్యేషాం దోషాః స్రోతాంసి చ ఉపక్లేదయన్తి, స్వేదశ్చ బాహ్యేషు స్రోతస్సు ప్రతిహతగతిః తిర్యగవతిష్ఠమానః తదేవోదకమాప్యాయయతి; తత్ర పిచ్ఛోత్పత్తౌ మణ్డలముదరం గురుస్తిమితమాకోటితం అశబ్దం మృదుస్పర్శమపగతరాజీకమాక్రాన్తం నాభ్యామేవోపసర్పతి. తతోఽనన్తరముదకప్రాదుర్భావః. తస్య రూపాణి:—కుక్షేరతి

మాత్రవృద్ధిః, సిరాన్తర్ధానగమనం, ఉదకపూర్ణదృతిసంక్షోభ సంస్పర్శత్వం చ. 48

వ్యా. పైజెప్పినయుదరములలో చిరకాలము గడవకుండునదియు, ఉపద్రవములు లేనిదియు, ఉదకములేనిదియు (జలోదరముకానిది), జలోదరరూపము నొందనిదియునగు నుదరరోగమును శీఘ్రమున చికిత్స జేయవలెను. (ఉపద్రవములు జనించక జలము చేరక మునుపే ప్రారంభముననే దినములు గడపక శీఘ్రముగ చికిత్స జేయవలెననుట.)

శీఘ్రముగ చికిత్స చేయక యుపేక్షించినయెడ దోషములు పరిపాకవిశేషమునం జేసి ద్రవముతోకూడి శరీరమునందలి స్రోతస్సులను ద్రవముకలవానినిగ జేయును. శరీరమున పైనున్న స్వేదరంధ్రములన్నియు మూసికొనియుండుటం జేసి చెమట మామూలుగ వెడల తెరవుగానక యడ్డగింపబడి వెనుకకు మరలి శరీరమునం దడ్డముగ వ్యాపించి కుక్షియందు మునుపే వాతాదిదోషములవలన వృద్ధినొందియున్న జలమును మరింత వృద్ధి నొందించును. మరియు నాయుదకమునందు పిచ్ఛ (అన్నము పక్వమగునపుడు పైభాగమున మిగడవలెనుండు స్నిగ్ధఘనపదార్థము, దానినిబోలిన ఘనపదార్థము పైజెప్పిన జలమున కల్గునని భావము.) కల్గినపుడు ఉదరము మండలాకారమై గొప్పదియై నిశ్చలమునై వ్రేలితో తట్టినను ధ్వనిలేక తాకినచో మెత్తగను రేఖలునులేక కుక్షియందెల్ల వ్యాపించి నాభిస్థానమున చేతితో నొత్తినయెడ జలము వేరొండుచోటికి బోవుచుండును. ఇత్తెరంగున జలము వ్యాపించి యుదరమున జలము పుట్టును.

ఈయుదరరోగమున కుక్షి మిక్కిలి వృద్ధినొందును. పొట్టపై వ్యాపించియుండు సిరలు కంటికి కగపడక మరగును. చేతతాకినయెడ జలపూరితమైన తోలుతిత్తివలె సంక్షోభము నొందును.

ఇచ్చట నీవిషయము నెరుంగునది:—జలోదరమున దాని నిదానమున చెప్పిన ప్రకారము తోలుత జలము వృద్ధినొంది దానం జేసి యుదరము సంప్రాప్తమగును. ఈయుదరము వాతాదిదోషజనితోదరముల చికిత్స జేయక యుపేక్షించినచో వాతాదిదోషము పరిపాకవిశేషమునం జేసి జలరూపమునొంది స్వేదనిరోధమునం జేసి యాజలము నానాట వృద్ధినొంది పైజెప్పిన ప్రకారము సంప్రాప్తమగును.—కావున ఈరెంటికిని నిదానసంప్రాప్తులలో భేదముకల్గును. (జలోదరము జలమునే ప్రధానముగ జేసి సంప్రాప్తమగును. ఈయుదరము వాతాద్యుదరముల చికిత్స జేయక యుపేక్షించినచో పైజెప్పినరీతిగ జలోదరరూపముగ మారినదని భావము.)

ఈయుదరమునే వాగ్భటాచార్యు లిట్లు చెప్పిరి:—"ఉపేక్షయా చ సర్వేషు దోషాః స్వస్థానతః చ్యుతాః, పాకాత్ ద్రవాః ద్రవీకుర్యుః.........సిరాన్తర్ధానము దకజఠరోక్తం చ లక్షణమ్." ఈవాక్యముచేత పైజెప్పిన లక్షణములే గాక జలోదరమున జెప్పినలక్షణములు కూడ కల్గియుండునని తెలిసెడి.

## జలోదరోపద్రవము.

మూ. తదా ఆతురముపద్రవాః స్పృశన్తిః—ఛర్ద్యతీసారతమకతృష్ణా
శ్వాసకాస హిక్కా దౌర్బల్య పార్శ్వశూలాఽరుచి స్వరభేద
మూత్రసఙ్గాదయః; తథావిధమచికిత్స్యం విద్యాత్ ఇతి. 49

వ్యా. పైజెప్పినరీతిగ వాతాద్యుదరములయందు పాకవిశేషమునంజేసి జలముపుట్టినపుడు వాంతి, అతిసారము, తమకశ్వాసము, దప్పి, శ్వాసకాసములు, ఎక్కిళ్లు, బలహీనము, పార్శ్వములయందు శూల, అరుచి, స్వరభేదము, మూత్రబంధము మున్నగు నుపద్రవములు కల్గును. ఈయుపద్రవములతో కూడినయుదరము అసాధ్యము కావున చికిత్సార్హము కాదు. (జాతోదకోదరమున పైయుపద్రవములు సంభవించినయెడ విషప్రయోగశస్త్రవిధానాదిదారుణచికిత్సలు చేయుట యుక్తముకాని కేవలము ఔషధప్రయోగమునకు సాధ్యముకాదని "అచికిత్స్య"మనువాక్యముచే జెప్పబడినది.)

## ఉదరములలో కృచ్ఛ్రసాధ్యతారతమ్యవిభాగము.

భవన్తి చాత్ర:—

మూ. వాతాత్ పిత్తాత్ కఫాత్ప్లీహ్నః సన్నిపాతాత్తథోదకాత్,
పరమ్పరం కృచ్ఛ్రతరముదరం భిషగాదిశేత్. 50

పక్షాద్బద్ధగుదం తూర్ధ్వం సర్వం జాతోదకం తథా,
ప్రాయో భవత్యభావాయ ఛిద్రాన్త్రం చోదరం నృణామ్. 51

వ్యా. వాతోదరము, పిత్తోదరము, కఫోదరము, ప్లీహోదరము, సన్నిపాతోదరము, జలోదరము, అను నీయారును క్రమముగ నొకదానికన్న నొకటి బలవత్తరమై కృచ్ఛ్రసాధ్యముగ నుండును. మరియు బద్ధగుదోదరము పదునైదుదినములు గడచినపిదప నసాధ్యమగును. తక్కిన వాతాద్యుదరములలో నేదియైనను పైజెప్పినరీతిగ జలముకలిగి జలోదరరూపముగ మారినయెడ నదియు ప్రాయికముగ నసాధ్యమగును. ఛిద్రాన్త్రోదరము పుట్టుకచేతనే యసాధ్యమగును.

ఇచ్చట "ప్రాయః" అనిచెప్పుటచేత బద్ధగుదోదరము పక్షముదినములు గడచినను నొకసమయమున కష్టముచే సాధింపదగియు నుండునని యర్థము. ఛిద్రోదరంబును, జాతోదకంబును, బద్ధగుదంబును నొకసమయమున విషశస్త్రాదిప్రయోగముచే మిక్కిలి పూనికతో చికిత్సచేసినయెడ నొకసమయమున సాధింపదగియుండునని భావము నెరుంగునది.

ఉదరమునం దసాధ్యలక్షణములు.

మూ. శూనాక్షం కుటిలోపస్థముపక్లిన్నతనుత్వచం,
బలశోణితమాంసాగ్నిపరిక్షీణం చ వర్జయేత్. 52

వ్యా. ఉదరరోగమునందు కన్నులుబ్బియున్నను, గుహ్యము వక్రముగనున్నను, చర్మము చెమటబట్టి పలుచనై యున్నను, శరీరమునందలి బలంబును, మాంసంబును, అగ్నియు క్షీణించియున్నను; అసాధ్యమగును. కావున చికిత్సజేయక విడువందగును. (ఉదరరోగసామాన్యముగ జఠరాగ్ని మందగించియుండుట సహజమైనను అయ్యది పూర్తిగ నశించినచో నసాధ్యలక్షణమగునని ఇచ్చట అగ్నిశబ్దము మరల చెప్పబడినది.)

ఉదరరోగోపద్రవములు, వానిచే నసాధ్యత్వము.

మూ. శ్వయథుః సర్వమర్మోత్థః శ్వాసో హిక్కారుచిః సతృట్,
మూర్ఛాచ్ఛర్దిరతీసారో నిహన్త్యుదరిణం నరమ్. 53

వ్యా. మర్మస్థానము లన్నిటియందును వాపుగల్గుట, శ్వాసములు, ఎక్కిళ్లు, అరుచి, దప్పి, మూర్ఛ, వాంతి, అతిసారము, (ఇవియన్నియు నుదరరోగమునందుగల్గు నుపద్రవములు) ఈయుపద్రవములు కల్గినయెడ నుదరరోగము మనుజుని చంపును.

ఉదరసామాన్యముగ కృచ్ఛ్రసాధ్యత్వము.

మూ. జన్మనైవోదరం సర్వం ప్రాయః కృచ్ఛ్రతమం మతం,
బలినస్తదజాతాంబుయత్నసాధ్యం నవోత్థితమ్. 54

వ్యా. పైజెప్పిన నుదరములన్నియు ప్రాయికముగ స్వభావముచేతనే కృచ్ఛ్రసాధ్యములగును. మరియు నవి బలిష్ఠులకు సంభవించినను, ఉదకము జనించుటకు ముందును, క్రొత్తగ సంభవించినదియు, ప్రయత్నపూర్వకముగ చికిత్సజేసినయెడ సాధింపదగియుండును.

అజాతోదకోదరలక్షణములు.

మూ. అజాతశోథమరుణం సశబ్దం నాతిభారికం,

సదా గుడగుడా యచ్చ శిరాజాలగవాక్షితమ్. 55
నాభిం విష్టభ్య పాయౌ తు వేగం కృత్వా ప్రణశ్యతి,
హృన్నాభివఙ్క్షణకటీగుదప్రత్యేకశూలినః. 56
కర్కశం సృజతో వాతం నాతిమన్దే చ పావకే,
లోలస్యావిరసే(లాలయావిరసే)చాస్యే మూత్రేఽల్పే సంహతే విషః.
అజాతోదకమిత్యేతైర్లిఙ్గైర్విజ్ఞాయ తత్వతః,
ఉపాక్రమేద్భిషగ్దోషబలకాలవిశేషవిత్. 58

వ్యా. వాపులేకుండుట, యెఱ్ఱనిరంగుకలిగియుండుట, చేత తట్టినయెడ ఖంగను శబ్దము కలిగియుండుట, మిక్కిలి భారములేకుండుట యెల్లప్పుడును కుక్షిలో గుడగుడ యనుశబ్దము కల్గియుండుట, పొట్టపై సిరలు స్ఫుటముగ గానవచ్చుట, నాభిస్థానమున స్తంభింపజేసి గుదమున అపానవేగము జూపి మించుట, హృదయము, నాభిస్థానము, గెజ్జలు, నడుము, గుదప్రదేశము, ఈస్థలములయందు నొప్పికల్గుట, అపానవాతము ద్రవములేక కర్కశముగ వెడలుట, జఠరాగ్ని బొత్తుగ నశింపక కొంచెముగ మందగించి యుండుట, నోట జొల్లుకారుచు అరోచకము లేకుండుట, మూత్రము స్వల్పముగ వెడలుట, మలము ద్రవములేక కొంచెముగ వెడలుట, ఈలక్షణములన్నియు నుదరరోగమున జలము పుట్టకుండునప్పుడు కానవచ్చును. కావున ఈలక్షణములబట్టి ఉదరరోగమున జలము కలగలేదని చక్కగ నెరింగి బలముయొక్కయు, కాలముయొక్కయు విశేషముల జక్కగ నెరింగి తత్తదనుగుణముగ వైద్యుడు చికిత్సజేయనగును.

## ఉదరచికిత్స, అందు వాతోదరచికిత్సాక్రమము.

మూ. వాతోదరం బలవతః పూర్వం స్నేహైరుపాచరేత్,
స్నిగ్ధాయ స్వేదితాఙ్గాయ దద్యాత్స్నేహవిరేచనమ్. 59
హృతే దోషే పరిమ్లానం వేష్టయేద్వాససోదరం,
తథాస్యానవకాశత్వాద్వాయుర్నాధ్మాపయేత్పునః. 60
దోషాతిమాత్రోపచయాత్ స్రోతసాం సన్నిరోధనాత్,
సమ్భవత్యుదరం తస్మాత్ నిత్యమేవ విరేచయేత్. 61

వ్యా. వాతోదరమునందు బలిష్ఠుడగురోగికి తొలుత స్నేహవిధ్యుక్తప్రకారము స్నేహద్రవ్యములచే నుపచరించవలయును. స్నిగ్ధుడైన వెనుక చెమటబుట్టించి పిదప స్నేహ

ద్రవ్యములచే విరేచనము చేయించవలయును. అట్టి విరేచనముచేత దోషము వెడలినపిదప శరీరము (జఠరము) కొంచెము వాడియున్నపుడు గుడ్డచేత నుదరమును చుట్టవలయును. గుడ్డచే గట్టుటవలన వాతము పొట్టను మరల నుబికించుటకు నవకాశము గల్గకుండును. (కావున బట్టచే నుదరమును బిగగట్టవలయును.) కుక్షియందు దోషములు మిక్కిలి సంచితములగుటవలనను, స్రోతోమార్గము లడ్డగింపబడుటవలనను, ఉదరరోగము సంభవించును; కావున అట్టిదోషములు వెడలి స్రోతోమార్గములు అడ్డులేకుండుటకై తొలుత నుదరరోగికి తప్పక విరేచనముచేయించుట ముఖ్యము.

## వాతోదరమున క్షీరపానవిధి.

మూ. శుద్ధం సంసృజ్య చ క్షీరం బలార్థం పాయయేత్తు తం,
ప్రాగుత్క్లేశాన్నివర్త్యం చ బలే లబ్ధే క్రమాత్పయః. 62

వ్యా. పైజెప్పినరీతిగ విరేచనముచే కోష్ఠము శుద్ధమయినవెనుక పేయాదిక్రమముచే నాహారవిధిజేసి రోగికి బలము కల్గుటకై పాలను త్రాగించవలయును. త్రాగించునపుడు శరీరమునకు బలము కలిగి యొకరింత వచ్చునంతలో పాలను త్రాగుట మానవలయును.

## ఉదరరోగికి ఆస్థాపనవస్తిప్రయోగము.

మూ. యూషైరమ్లైః సైంధవైర్వా మన్దామ్లలవణైః శ్రేధితానలం,
సోదావర్తం పునః స్నిగ్ధం స్విన్నమాస్థాపయేన్నరమ్. 63

వ్యా. పిమ్మట కొంచెముగ ఉప్పును, పులుపును చేర్చి పక్వముచేయబడిన యూషములను, మాంసరసములను ఉపయోగించి జాఠరాగ్ని వృద్ధినొంది వాతము ఊర్ధ్వముగ వెడలుచున్నపుడు మరల స్నేహస్వేదములచేసి పిమ్మట విధ్యుక్తప్రకారము ఆస్థాపనవస్తి ప్రయోగించవలయును.

## వాతోదరరోగికి అనువాసనవస్తివిధి.

మూ. స్ఫురణాక్షేపసన్ధ్యస్థిపార్శ్వపృష్ఠత్రికార్తిషు,
దీప్తాగ్నిం బద్ధవిడ్వాతం రూక్షమప్యనువాసయేత్. 64

వ్యా. అవయవములు అదరుచు వణకుచున్నను, సంధులయందును, అస్థులయందును, పార్శ్వములయందును, వీపునందును, త్రికప్రదేశమునందును బాధకల్గియున్నపుడు అగ్నిదీప్తి కల్గి వాతపురీషములు బద్ధగించి రూక్షముగనున్నను, అనువాసనవస్తిని ప్రయోగింపవలయును.

### అనువాసనవస్తి.

సూ. తీక్ష్ణాధోభాగయుక్తోస్య నిరూహో దాశమూలికః,
వాతఘ్నామ్లశృతైరణ్డతిలతైలానువాసనః (మ్). 65

వ్యా. రోగికి శరీరమునం దధోభాగమున తీక్ష్ణమైనబాధ కల్గినపుడు దశమూల షాయముచే నిరూహావస్తి చేయవలయును. పిమ్మట వాతహరములైన ద్రవ్యములచేతను, మ్లరసములచేతను, ఆముదముచేతను, నూనెచేతను అనువాసనవస్తిని చేయవలయును.

### వాతోదరమున శమనచికిత్స.

సూ. అవిరేచ్యస్తు యం విద్యాత్ దుర్బలం స్థవిరం శిశుం,
సుకుమారం ప్రకృత్యాల్పదోషం వాఽథోల్బణానిలమ్. 66
తం భిషక్ శమనైః సర్పిర్యూషమాంసరసౌదనైః,
వస్త్యభ్యంగానుపానైశ్చ క్షీరైశ్చోపాచరేద్బుధః. 67

వ్యా. విరేచనముల జేయనర్హుడుకాని బలహీనుడును, ముసలివాడును, శిశువును, కుమారుడును, నగు నుదరరోగిని, వ్యాధిస్వభావముచేతనే స్వల్పదోషముకలరోగిని తము ప్రకోపించియున్నపుడు దోషశామకములైన ఘృతములచేతను, యూషముల తను, మాంసరసములచేతను, అన్నములచేతను, వస్తి-అభ్యంగ-అనువాసనములచేతను, రములచేతను నుపచరించి రోగికి వాతశమనము చేయించవలయును.

### పిత్తోదరచికిత్సాక్రమము.

సూ. పిత్తోదరే తు బలినం పూర్వమేవ విరేచయేత్,
దుర్బలం త్వనువాస్యాదౌ శోధయేత్ క్షీరవస్తినా, 68
సంజాతబలకాయాగ్నిం పునః స్నిగ్ధం విరేచయేత్,
పయసా సత్రివృత్కల్కే- నోరుబూకశృతేన వా. 69
సాతలాత్రాయమాణాభ్యాం శృతేనారగ్వధేన వా,
సకఫే వా సమూత్రేణ సహితే తిక్తసర్పిషా. 70
పునః క్షీరప్రయోగం చ వస్తికర్మ విరేచనం,
క్రమేణ ధ్రువమాతిష్ఠన్యుక్తః పిత్తోదరం జయేత్. 71

వ్యా. పిత్తోదరమునందు మిక్కిలి బలశాలి యగురోగికి తొలుతనే విరేచనమున ప్పించవలయును. లేక రోగి బలహీనుడుగనున్నచో తొలుతనే అనువాసనవస్తి ప్రయో

గించి క్షీరవస్తి ప్రయోగముచే దోషముల శోధించవలయును. క్షీరవస్తి ప్రయోగము వలన శరీరబలంబును, కాయాగ్నిబలంబున కల్గినవెనుక మరల స్నేహవిధిజేసి తెగడకల్కముతో కూడినపాలచేనైనను ఆముదమువేళ్లతో కూడి కాచబడిన పాలచేనైనను, సంబరేణు, కానుగ ఈరెంటితోచేర్చి కాచబడిన పాలచేనైనను, రేలజిగురును కాచబడిన పాలచేనైనను విరేచనము చేయించవలయును.

పిత్తోదరమున కఫము పిత్తముతో చేరియున్నయెడ గోమూత్రము పాలతో కలిపి పక్వముచేసి యాపాలచే విరేచనము చేయించవలయును. పిత్తోదరమున వాతము కలిసియున్నచో తెగడ మున్నగువానిని తిక్తద్రవ్యములను చేర్చి కాచబడిన పాలచేత విరేచనము చేయించవలయును. ఇత్తెరంగున తొలుత క్షీరప్రయోగవస్తికర్మ, విరేచనము అను నీక్రమమున వరుసగ చికిత్స నాచరించినచో పిత్తోదరము శాంతినొందును.

## కఫోదరచికిత్సాక్రమము.

మూ. స్నిగ్ధం స్విన్నం విశుద్ధం తు కఫోదరిణమాతురం,
సంసర్జయేత్కటుక్షారయుక్తైరన్నైః కఫాపహైః. 72
గోమూత్రారిష్టపానైశ్చ చూర్ణాయస్కృతిభిస్తథా,
సక్షారైస్తైలపానైశ్చ శమయేత్తు కఫోదరమ్. 73

వ్యా. కఫోదరమున తొలుత రోగికి స్నేహపానమును, స్వేదవిధిని చేసి పిమ్మట వమనమునకు తక్కిన శోధనచికిత్సజేసి సంసర్జనవిధిప్రకారము కారముతోను నుప్పుతోను చేరి కఫహారములైన యన్నాద్యాహారములను చేయించవలయును. పిదప గోమూత్రమును, అరిష్టములను త్రాగించి; చూర్ణములు, అయస్కృతులు, క్షారములతోకూడిన తైలము వీనిని త్రాగించి కఫోదరమును శమింపచేయదగును.

## సన్నిపాతోదరచికిత్స.

మూ. సన్నిపాతోదరే సర్వా యథోక్తాః కారయేత్క్రియాః,
సోపద్రవన్తు నిర్వృత్తం ప్రత్యాఖ్యేయం విజానతా. 74

వ్యా. సన్నిపాతముచే జనించిన యుదరమునందు వాతాద్యుదరములకు వేరువేరుగ జెప్పబడిన చికిత్సల నన్నిటిని వరుసగ జేయవలయును. మరియు నీయుదరవ్యాధి యుపద్రవములతోకూడి పుట్టినయెడ తెలివిగలవైద్యుడు చికిత్స జేయక విడువనగును.

## ప్లీహోదరచికిత్స, ప్లీహోదరమున వాతాదిదోషలక్షణములు.

మూ. ఉదావర్తరుజానాహైః దాహమోహతృషాజ్వరైః,

గౌరవారుచికాఠిన్యైశ్చానిలాదీన్యథాక్రమమ్. 75
లిఙ్గైః ప్లీహ్నివ్యధికాన్దృష్ట్వా రక్తం చాపి స్వలక్షణైః,
(లిఙ్గైః ప్లీహ్నివ్యధికా తృష్ణా రక్తం చ పిత్తలక్షణైః,
విద్యాత్సమస్తైః సర్వైస్తు సన్నిపాతం తథా భిషక్.)
చికిత్సాం సంప్రకుర్వీత యథాదోషం యథాబలమ్. 76

వ్యా. ఉదావర్తము, నొప్పి, ఆనాహము, ఈమూటిచేత ప్లీహోదరమున వాత సంబంధము కల్గినదని యెరుంగునది. తాపము, మోహము, దప్పి, జ్వరము ఈలక్షణములు కల్గియున్న ప్లీహోదరమున పిత్తసంబంధము కల్గినదని యెరుంగునది. భారము, అరుచి, కాఠిన్యము ఈలక్షణములు కల్గినప్లీహోదరము కఫ మధికముగ నున్నదని యెరుంగునది. మరియు విధిశోణితీయాధ్యాయమున రక్తమునకు చెప్పిన విదాహము, దప్పి, వైరస్యము, శరీరగౌరవము, మూర్ఛ మున్నగురక్తలక్షణములు గన్పించిన ప్లీహోదరము రక్తాధిక్యముచే కల్గినదని యెరుంగునది. ఇత్తెరంగున ప్లీహోదరమున వాతాదులకుచెప్పిన ఆయా లక్షణములనుబట్టి వాత-పిత్త-కఫ-సన్నిపాత-రక్తసంబంధమును చక్కఁగ నెరింగి ఆయా దోషానుగుణముగ వైద్యుఁడు చికిత్స చేయవలయును. (ఇచ్చట అధికపాఠమునచెప్పిన "విద్యాత్సమస్తైః సర్వైస్తు సన్నిపాతం తథా భిషక్" అనువాక్యముచే వాతాదిదోషము లన్నియు కలిసినయెడ సాన్నిపాతికప్లీహోదరమనియు నెరుంగునది. మరియు రక్తలక్షణ ముల తంత్రాంతరమున నిట్లుచెప్పబడినది:—"విదాహం తృష్ణాం వైరస్యం గాత్రగౌరవం మూర్ఛాం").

## ప్లీహోదరచికిత్సాక్రమము.

మూ. స్నేహం స్వేదం విరేకం చ నిరూహమనువాసనమ్,
సమీక్ష్య కారయేద్బాహౌ వామే వా వ్యధయేత్సిరామ్. 77
షట్పలం పాయయేత్సర్పిః పిప్పలీర్వా ప్రయోజయేత్,
సగుడామభయాం వాపి క్షారారిష్టగణాంస్తథా. 78
ఏష క్రియాక్రమః ప్రోక్తో యోగాన్సంశమనాన్ శృణు,

వ్యా. స్నేహము, స్వేదము, విరేచనము, నిరూహవస్తి, అనువాసనవస్తి, అను నీ చికిత్సలను ఆయాదోషానుసారముగ ప్లీహోదరమున చేయనగును. మరియు రక్తాధిక ప్లీహోదరమునందు ఎడమప్రక్క బాహువునందు సిరావ్యధనముచేసి రక్తమోక్షణము చేయనగును. షట్పలఘృతమును పానము చేయనగును. రసాయనప్రకరణమున జెప్పిన

వర్ధమానపిప్పలీయోగము ననుసరించి పిప్పళ్లను ప్రయోగింపనగును. బెల్లముతో కూడిన కరక్కాయచూర్ణమునైనను, క్రిందజెప్పబడు క్షారములను ఆరిష్టములనైనను, యథా యోగ్యముగ నుపయోగింపదగును. ఇత్తెరంగున ప్లీహోదరమున చేయదగిన చికిత్సాక్రమము చెప్పబడినది. పిమ్మట నాశమన యోగములు నీక్రింద జెప్పబడును.

ఇచ్చట 'క్షారారిష్టగణాం స్తథా' అనుచోట గ్రహణ్యర్శోరోగచికిత్సితముల జెప్పబడు క్షారారిష్టగణంబులును, ఈ క్రింద 'విడఙ్గం చిత్రకం' అని యుపక్రమించి చెప్పబడు క్షారయోగములును, 'రోహీతక' యని చెప్పబడునరిష్టంబులు గ్రహింపబడును.

## ప్లీహోదరమున పిప్పల్యాదిచూర్ణము.

మూ. పిప్పలీ నాగరం దన్తీ చిత్రకం ద్విగుణాఽభయమ్. 79
విడఙ్గాంశయుతం చూర్ణం ఏతదుష్ణామ్బునా పిబేత్,

వ్యా. పిప్పళ్లు, శుంఠి, దంతివేళ్లు, చిత్రమూలము ఇవి ప్రత్యేక మొక్కొక భాగము, కరకకాయలు రెండుభాగములు, వాయువిడంగములు ఒకభాగము, వీనినన్నిటిని చూర్ణముజేసి వేడినీళ్ల ననుపానముగజేసి ప్లీహోదరమున త్రాగవలెను.

## ప్లీహోదరహరక్షారపానము.

మూ. విడఙ్గం చిత్రకం శుణ్ఠీం సఘృతాం సైన్ధవం వచామ్. 80
దగ్ధ్వా కపాలే పయసా గుల్మప్లీహాపహం పిబేత్,

వ్యా. వాయువిడంగములు, చిత్రమూలము, శుంఠి, నెయ్యి, సైంధవలవణము, వస, వీనినన్నిటిని కుండపెంకులో నునిచి కాల్చి క్షారముచేసి పాలతో కలిపి త్రాగినచో గుల్మంబులును ప్లీహవృద్ధియు నశించును.

## ప్లీహోదరములకు రోహితకారిష్టము.

మూ. రోహీతకలతానాం తు కాణ్డకానభయాజలే. 81
మూత్రే వా సునుయాత్తచ్చ సప్తరాత్రస్థితం పిబేత్,
కామలాగుల్మమేహార్శః ప్లీహసర్వోదరక్రిమీన్. 82
స హన్యాత్ జాఙ్గలరసైః జీర్ణే స్యాచ్చాత్ర భోజనమ్,

వ్యా. ములు మోదుగతీగెలను చిన్నచిన్నముక్కలుగ నరికి కరకకాయల కషాయముననైనను గోమూత్రముననైనను ఏడురాత్రులవరకు నానబెట్టి యారసమును త్రాగినచో కామలారోగము, గుల్మము, ప్రమేహము, అర్శస్సు, ప్లీహవృద్ధి, అన్నియుదర

ములు, క్రిములు, వీనినన్నిటిని హరించును. ఔషధము జీర్ణమైనపిదప జాంగలజంతు మాంసరసములతో నన్నమును భుజింపవలెను. (ఈయరిష్టసంధానము పరిభాషానుసారముగ జేయునది.)

## ప్లీహోదరమునకు రోహితకఘృతము.

మూ. రోహీతకత్వచః కృత్వా పలానాం పఞ్చవింశతిమ్. 83
కోలద్విప్రస్థసంయుక్తం కషాయముపకల్పయేత్,
పలికైః పఞ్చకోలైస్తు తైస్సర్వైశ్చాపి తుల్యయా. 84
రోహీతకత్వచా పిష్టైః ఘృతప్రస్థం విపాచయేత్,
ప్లీహాఽతివృద్ధిం శమయత్యేతదాశు ప్రయోజితమ్. 85
తథా గుల్మోదరశ్వాసక్రిమిపాణ్డుత్వకామలాః,

వ్యా. ములుమోదుగపట్ట యిరువదియైదుపలములు, రేగుపండ్లు రెండుప్రస్థములు (ముప్పదిరెండుపలములు), ఈరెంటిని ఎనిమిదింతలనీళ్లలో జేర్చి నాల్గవపాలు మిగుల కషాయముకాచి వడగట్టి, అందు పంచకోలములు ప్రత్యేక మొక్కొకపలమును ఈయైదిటికి సమభాగము(ఐదుపలములు)ములు మోదుగపట్టను నూరి కల్కముచేసి కలిపి; ఒక ప్రస్థము (పదునారుపలములు) ఘృతమును చేర్చి (అన్నింటి నొకటిగగూర్చి) ఘృతపాక విధిప్రకారము పక్వముచేసి యాఘృతము నుపయోగించినయెడ నధికమైన ప్లీహావృద్ధిని శీఘ్రముగ హరించును.

మరియు పైనచెప్పబడిన ఘృతమువలన గుల్మము, ఉదరములు, శ్వాసము, క్రిమి రోగము, పాండురోగము, కామల, ఇవియన్నియు శమించును.

(ఇచ్చట క్వాథ్యద్రవ్యము ములుమోదుగ రేగును చేరి ఏబదియేడుపలములు. అందు అష్టగుణపరిభాష ననుసరించి నాల్గువందలు ఏబదియారుపలముల నీళ్లుబోసి క్వాథముచేయునది. చతుర్థావశిష్టకషాయము నూటపదునాల్గుపలములగును. అందు పంచ కోలరోహితకకల్కమును పదిపలములును, ఒకప్రస్థము ఆవునేతిని కలిపి ఘృతపాకము చేయునది. ఈవివరణము చక్రపాణిదత్తవ్యాఖ్యలో నున్నది.)

## ప్లీహోదరమునం దగ్నికర్మాదివిధి.

మూ. అగ్నికర్మ చ కుర్వీత భిషగ్వాతకఫోల్బణే. 86
పైత్తికే జీవనీయాని సర్పింషి క్షీరవస్తయః,

రక్తావసేకః సంశుద్ధిః క్షీరపానం చ శస్యతే. 87
యూషైర్మాంసరసైశ్చాపి దీపనీయసమాయుతైః,

వ్యా. ప్లీహోదరమున వాత-కఫములు అధికములుగ నున్నయెడ విధ్యుక్తప్రకారము అగ్నికర్మ చేయనగును. పిత్త మధికముగనున్నచో జీవనీయగణద్రవ్యముల జేర్చి సిద్ధములు చేయబడినఘృతంబులును, క్షారముతోగూడిన వస్తువుల ప్రయోగించుటయు, రక్తమోక్షణముచేయుటయు, శోధనంబును, క్షీరపానంబును మిగుల ప్రశస్తము. మరియు అగ్నిని దీపింపజేయుద్రవ్యముల జేర్చి పక్వము చేయబడిన యూషములను మాంసరసములను జేర్చి హితముగ నాహారమును చేయనగును.

యకృదుదరచికిత్సాఽతిదేశము.

మూ. యకృతి ప్లీహవత్సర్వం తుల్యత్వాద్భేషజం మతమ్. 88
లఘూన్యన్నాని సంసృజ్య దద్యాత్ ప్లీహోదరే భిషక్,

వ్యా. యకృదుదరము ప్లీహోదరమునకు సమానముగ నుండునుకావున ప్లీహోదరమునకు చెప్పినచికిత్సాదులన్నియు యకృదుదరమున హితకరములు.

మరియు మిక్కిలి తేలికగ జీర్ణములగు నన్నపానములను విధ్యుక్తప్రకారము సిద్ధముచేసి ప్లీహోదరరోగికి యథోచితముగ నుపయోగింపవలెను.

బద్ధగుదోదరచికిత్సాక్రమము.

మూ. స్విన్నాయ బద్ధోదరిణే మూత్రతీక్ష్ణౌషధాన్వితమ్. 89
సతైలలవణం దద్యాత్ నిరూహం సానువాసనమ్,
పరిస్రంసీని చాన్నాని తీక్ష్ణం చైవ విరేచనమ్. 90
ఉదావర్తహరం కర్మ కార్యం వాతఘ్నమేవ చ,

వ్యా. బద్ధగుదోదరరోగముగలవానికి తొలుత విధ్యుక్తప్రకారము స్వేదనవిధిచేసి (శరీరమున చెమటబుట్టించి,) మూత్రములను, తీక్ష్ణౌషధములను, తైలలవణములను, కూర్చినయౌషధముచే నిరూహానువాసనవస్తులను విధ్యుక్తప్రకారము చేయనగును. మరియు వాతము ననులోమముగ జేయునాహారములను, తీక్ష్ణములైన విరేచనౌషధములను నుపయోగించవలయును. మరియు ఉదావర్తహరంబును, వాతహరంబును నగుచికిత్సను చేయించవలయును.

ఇచ్చట నిరూహవస్త్యౌషధమునందు తైలలవణములు చేర్చుట నియతమైనను మరల నిచ్చట "సతైలలవణం దద్యాత్" అని చెప్పుటవలన తైలలవణములను నధికము

జేర్చవలయునని యెరుంగునది. మరియు "అనాస్థాప్యా........బద్ధఛిద్రోదరీ" అని (అ. సూ. అ. 19. శ్లో. 5.) బద్ధచ్ఛిద్రోదరములయందు నిరూహవస్తి నిషేధింపబడినది. ఐనను కేవలము నిరూహసాధ్యావస్థయందున్నపుడు ఈవ్యాధులయందును నిరూహావస్తి చేయక తప్పదు. కావున నిచ్చట విధింపబడినది.

ఛిద్రోదరచికిత్సాక్రమము.

మూ. ఛిద్రోదరమృతే స్వేదాత్ శ్లేష్మోదరవదాచరేత్. 91
జాతం జాతం జలం స్రావ్యం ఏవం తద్యాపయేద్భిషక్,

వ్యా. ఛిద్రోదరమునందు స్వేదవిధి నొక్కదానినివిడచి తక్కిన శ్లేష్మోదరచికిత్సల నన్నిటిని చేయనగును. మరియు ఉదరమున అప్పుడప్పుడు మాటిమాటికి పుట్టుచున్నజలమును స్రవింపజేయుచు కాలము గడుపవలయును.

అసాధ్యఛిద్రోదరలక్షణములు.

మూ. తృష్ణాకాసజ్వరార్తం తు క్షీణమాంసాగ్నిభోజనమ్. 92
వర్జయేత్ శ్వాసినం తద్వచ్ఛూలినం దుర్బలేన్ద్రియం,

వ్యా. ఛిద్రోదరమునందు దప్పి, కాసము, జ్వరము, మాంసక్షయము, అగ్నినాశము, అన్నము హితములేకపోవుట, శ్వాసము, శూల, ఇంద్రియపాటవముచెడుట ఈలక్షణములు కల్గియున్నయెడ అట్టిరోగిని చికిత్సజేయక విడువందగును.

జలోదరచికిత్స.

మూ. అపాందోషహరాణ్యాదౌ ప్రదద్యాదుదకోదరే. 93
మూత్రయుక్తాని తీక్ష్ణాని వివిధక్షారవన్తి చ,
దీపనీయైః కఫఘ్నైశ్చ తమాహారైరుపాచరేత్. 94
ద్రవేభ్యశ్చోదకాదిభ్యో నియచ్ఛేదనుపూర్వశః,

వ్యా. జలోదరమునందు తొలుత జలదోషము హరించునట్టి మూత్రములతో కూడిన తీక్ష్ణౌషధములను, పలుతెరంగులైన క్షారములతోకూడిన యౌషధములను నుపయోగింపదగును. అట్టిరోగి అగ్నిదీపనము కల్గించునవియు, కఫహరంబులును, నగుద్రవ్యముల చేర్చి సంస్కరించబడిన యాహారములచే నుపచరించవలయును. మరియు ఉదకము మున్నగు ద్రవపదార్థములను నుపయోగింపనీయక అయలవాటునుండి నానాట మరలించవలయును.

### ఉదరములన్నిటికి సామాన్యచికిత్స.

మూ. సర్వమేవోదరం ప్రాయో దోషసఙ్ఘాతజం మతమ్. 95
తస్మాత్ త్రిదోషశమనీం క్రియాం సర్వత్ర కారయేత్,
దోషైః కుక్షౌ హి సమ్పూర్ణే వహ్ని ర్మన్దత్వమృచ్ఛతి. 96
తస్మాద్భోజ్యాని భోజ్యాని దీపనాని లఘూని చ,

వ్యా. ఉదరములన్నియు ప్రాయికముగ త్రిదోషసంఘాతముచేతనే సంభవించును; కావున నుదరము లన్నిటియందును త్రిదోషముల శమింపజేయు క్రియావిధానమునే చేయవలెను. మరియు త్రిదోషములు ప్రకోపమునొంది కుక్షిని నిండించుటవలన జాఠరాగ్ని మందగించును. కావున మందాగ్నిచేగల్గిన యుదరములయందును అగ్నిని దీపింపజేయునవియు తేలికగ జీర్ణమగునవియు నగునౌషధములను భోజనపదార్థములను ఉపయోగింపందగును.

### ఉదరసామాన్యమున నాహారాదినియమము.

మూ. రక్తశాలీన్ యవాన్ముద్గాన్ జాఙ్గలాంశ్చ మృగద్విజాన్. 97
పయోమూత్రాసవారిష్టాన్ మధు శీధుం తథా సురాం,
యవాగూమోదనం వాపి యూషైరద్యాద్రసైరపి. 98
మన్దామ్లస్నేహకటుభిః పఞ్చమూలోపసాధితైః,

వ్యా. ఎఱ్ఱవరిధాన్యము, యవలు, పెసలు, జాంగలదేశమునందలి మృగములయొక్కయు పక్షులయొక్కయు మాంసములు, పాలు, గోమూత్రము, ఆసవములు, అరిష్టములు, మధుమద్యము, శీధుమద్యము, సురామద్యము, ఇవియన్నియు నుదరములన్నిటియందును నుపయోగింపనగును. మరియు కొంచెముగ పులుపును, ఉప్పును జేర్చి స్నేహద్రవ్యమును, కారమును కొంచెముగ జేర్చి పంచమూలద్రవ్యముల జేర్చి సిద్ధముచేయబడిన యూషముల తోడను మాంసరసములతోడను, యవాగువునైనను, అన్నమునైనను, కలిపి భుజించనగును.

### ఉదరసామాన్యమున వర్జింపవలసినవి.

మూ. ఔదకానూపజం మాంసం శాకం పిష్టకృతం తిలాన్. 99
వ్యాయామాధ్వదివాస్వప్నం యానయానఞ్చ వర్జయేత్,
తథోష్ణలవణామ్లాని విదాహీని గురూణి చ. 100
నాద్యాదన్నాని జఠరీ తోయపానం చ వర్జయేత్,

౦దును, ఆనూపదేశమునందును, పుట్టిన జంతువులమాంసంబును, రలు), పిండితో చేయబడిన భక్ష్యాదులును, నువ్వులు, వ్యాయా ట, పగటినిద్ర గుఱ్ఱము మొదలగు వాహనములపై నెక్కి సవారి ఉదరరోగి విసర్జించవలయును. మరియు ఉష్ణవీర్యంబును, లవణ- ఎపుట్టించునవియు, గురుత్వము గల్గినదియు, నగు నాహారములను యును. జలమును విశేషముగ త్రాగగూడదు.

వరరోగమున దోషానుగుణముగ తక్రపానవిధి.

౦ హితం పానే స్వాదుతక్రమపేలవమ్. 101
సైరలవణై ర్యుక్తం తు నిచయోదరీ,
పిబే త్తక్రం పిప్పలీలవణాన్వితమ్. 102
ధుకోపేతం స్వాదుపిత్తోదరీ పిబేత్,
సైన్ధవాజాజీ వ్యోషయుక్తం కఫోదరీ. 103

చిలికి వెన్నయెత్తి మధురమై మిక్కిలి చిక్కన లేక ద్రవముగ ిగమున పానమునకు హితముగ నుండును. మరియు సన్నిపాతో ములను, కారమును, ఉప్పును, జేర్చిన మజ్జిగను పానముచేయుట కలవారు పిప్పళ్లను, లవణమును చేర్చిన మజ్జిగను త్రాగవలయును. చక్కెరను, అతిమధుర-చూర్ణమును చేర్చి తియ్యగనుండు మజ్జి కఫోదరము కలవారు ఓమము, సైంధవలవణము, జీలకర, త్రికటు ంస్కరింపబడిన మజ్జిగను త్రాగవలయును.

ప్లీహోదరమున తక్రపానము.

యుతం తక్రం వ్యక్తామ్లం నాతిపేశలం,
వచాశుంఠీశతాహ్వాకుష్ఠసైన్ధవైః. 104
్హోదరీ

) పులుపును, కొంచెము జిడ్డును కల్గియుండు మజ్జిగయందు తేనెను, , సదాపను, చెంగల్వకోష్టు, సైంధవలవణము వీనిని జేర్చి సంస్క ిలవాడు త్రాగవలయును.

ఉదక-బద్ధ-ఛిద్రోదరములయందు తక్రపానము.

జాతం సవ్యోషం తూదకోదరీ,

బద్ధోదరీ తు హాపుషాయమాన్యజాజిసైన్ధవైః 105
పిబేచ్ఛిద్రోదరీ తక్రం పిప్పలీక్షౌద్రసంయుతం,

వ్యా. జలోదరము కలవాడు చక్కగ చిలికి త్రికటుకచూర్ణముతో కూడినమజ్జిగను త్రాగవలయును. బోడతరము, ఓమము, జీలకర, సైంధవలవణము, వీనిచూర్ణమును జేర్చి సంస్కరించబడిన మజ్జిగను బద్ధగుదోదరము కలవాడు త్రాగవలయును. పిప్పలిచూర్ణమును, తేనెను, ఈరెంటిని చేర్చిన మజ్జిగను, ఛిద్రోదరరోగము కలవాడు త్రాగవలయును.

తక్రప్రాశస్త్యము.

మూ. గౌరవారోచకార్తానాం సమన్దాగ్న్యతిసారిణామ్. 106
తక్రం వాతకఫార్తానాం అమృతత్వాయ కల్పతే,

వ్యా. శరీరము బరువుగనుండుట, అరోచకము, అగ్నిమాంద్యము, అతిసారము, వాతకఫరోగములు, ఇవి కలవారికి మజ్జిగ అమృతమును బోలె మిక్కిలి హితకరమైయుండును.

ఉదరరోగమునందు అవస్థాభేదముచే నుపయోగింపదగిన క్షీరములు.

మూ శోఫానాహార్తితృణ్మూర్ఛాపీడితే కారభం పయః. 107
శుద్ధానాం క్షామదేహానాం గవ్యం ఛాగం సమాహిషం,

వ్యా. శోఫము (వాపు), ఆనాహము (కడుపుబ్బరము), దప్పి, మూర్ఛ, ఈయుపద్రవములుగలవారికి ఒంటెపాల నియ్యవలయును.

శోధనములజేసికొనినవారికిని, కృశించినశరీరముకలవారికిని, ఆవుపాలను, మేకపాలను, బఱ్ఱెపాలను ఇయ్యవలయును.

ఉదరరోగమున లేపనము.

మూ. దేవదారుపలాశార్కహస్తిపిప్పలిశిగ్రుకైః. 108
సాశ్వగన్ధైః సగోమూత్రైః ప్రదిహ్యాదుదరం సమైః,

వ్యా. దేవదారు, మోదుగ, జిల్లేడు, గజపిప్పళ్లు, మునగపట్ట, పెన్నేరుగడ్డ, వీని నన్నిటిని సమభాగములుగ జేర్చి గోమూత్రమున నూరి ఉదరరోగముకలవారికి పొట్టమీద పట్టువేయవలయును.

## ఉదరరోగమున సేచనము.

మూ. వృశ్చికాలీం వచాం కుష్ఠం పఞ్చమూలీం పునర్నవామ్. 109
భూతీకం నాగరం ధాన్యం జలే పక్త్వావసేచయేత్,
పలాశం కత్తృణం రాస్నాం తద్వత్పక్త్వావసేచయేత్. 110
మూత్రాణ్యష్టావుదరిణాం సేకే పానే చ యోజయేత్,

వ్యా. తేలుమణిచెట్టు, వస, చెంగల్వకోష్టు, పంచమూలములు, గలిజేరు, కామంచి గడ్డి, శుంఠి, దనియాలు, వీని నన్నిటిని సమభాగములుగ జేర్చి నలియగొట్టి నీళ్లలో వేసి కాచి యానీళ్లచే పొట్టను తడుపవలయును. లేక స్నానముచేయవలయును. మరియు మోదుగ, ఆవురుగడ్డి, సన్నరాష్టము, వీనిని చేర్చి కాచబడిన జలముచే స్నానముచేయవలయును. మరియు నెనిమిదివిధములయిన మూత్రములును ఉదరరోగముకలవారి ఉదరముపై తడుపుటకును, స్నానముచేయుటకును పానమునకును, విశేషముగ నుపయోగింపనగును.

ఇచ్చట అష్టమూత్రములని:—"అవిమూత్రమజామూత్రం గోమూత్రం మాహిషఞ్చయత్, హస్తిమూత్రమథోష్ట్రస్య హయస్యచ ఖరస్య చ.ఇతి ప్రోక్తాని మూత్రాణి యథాసామర్థ్యయోగతః." గొఱ్ఱె-మేక, ఆవు, బఱ్ఱె, ఏనుగ, ఒంటె, గుఱ్ఱము, గాడిద ఈయెనిమిదిజంతువులమూత్రమును చేరి అష్టమూత్రము లనబడును.

## ఉదరహరిఘృతయోగములు.

మూ. రూక్షాణాం బహువాతానాం తథా సంశోధనార్థినామ్. 111
దీపనీయాని సర్పింషి జఠరఘ్నాని చక్ష్మహే,

వ్యా. మిక్కిలిరూక్షగుణంబును, అధికమైనవాతంబును, సంశోధనమునకు అర్హులును నగునుదరరోగుల కుపయోగింపతగిన అగ్నిదీపనంబులును, ఉదరహరంబులును అగు ఘృతయోగము లీక్రింద జెప్పబడును.

## పంచకోలఘృతము.

మూ. పిప్పలీపిప్పలీమూలచవ్యచిత్రకనాగరైః. 112
సక్షారైరర్ధపలికైః ద్విప్రస్థం సర్పిషః పచేత్,
కల్కైర్ద్విపంచమూలస్య తులార్ధస్వరసేన చ. 113
దధిమంథాఢకోపేతం తత్సర్పిర్జఠరాపహం,
శ్వయథుం వాతవిష్టమ్భం గుల్మార్శాంసి చ నాశయేత్. 114

వ్యా. పిప్పళ్లు, మోడి, చవ్యము, చిత్రమూలము, శుంఠి, యవక్షారము, ఇవి ప్రత్యేకము (ఒక్కొక్కటి) అర్ధపలమువంతున కల్కముచేసి యాకల్కమును రెండు ప్రస్థముల నేతిలో చేర్చి ఘృతపాకమును చేయవలయును. ఎట్లులన:—దశమూలములను స్వరసముచేసి యాస్వరసమును యేబదిపలములు, పెరుగుమీది తేట ఒక ఆఢకము, ఒక ప్రస్థము ఆవు నేతిని పైజెప్పిన పంచకోలకల్కమున మూడుపలములు వీనినన్నిటి నొకటిగ జేర్చి ఘృతపాకవిధిప్రకారము పక్వముచేయనగును. ఈఘృతమును అగ్నిబలానుసారముగ సేవించినయెడ జఠరంబులును, వాపు, వాతముచే కల్గినమలబద్ధకము, గుల్మములు, అర్శోరోగము ఇవియన్నియు నశించును.

ఇచ్చట "సక్షారై రర్ధపలికైః ద్విః ప్రస్థసర్పిషః పచేత్" అని పాఠాంతరమున్నది. ఈపాఠము "ద్విః" అనుపదము "అర్ధపలికైః" అనుపదముతో చేర్చి పైజెప్పిన యారుద్రవ్యములును ద్విగుణితమైన యర్ధపలమువంతున (అనగా నొక్కొక్కపలము వంతున) జేర్చిన కల్కము ఆరుపలముల పరిమితమగును. ద్విశబ్దమును ప్రస్థశబ్దముతో కలిపిన రెండుప్రస్థములఘృతమని యర్థమగును. రెండుప్రస్థములఘృతము ఆరుపలములు పరిమితికల పంచకోలాదికల్క సముదాయమును చేర్చి పైజెప్పినరీతిగ దశమూలక్వాథమును దధిమండమును కూడ చేర్చి ఘృతమును పక్వముచేయవలయునని సముదితార్థమేర్పడును. ఈపక్షము నవలంబించి కాశ్మీరదేశమున "పలికైః పిప్పలీక్షారైః ద్విప్రస్థం సర్పిషః పచేత్" అనియే పఠించెదరు. జతూకర్ణతంత్రమునందును ఇట్లున్నది:—"దశమూలతులార్ధరసే సక్షారైః పఞ్చకోలకైస్సార్ధం ఘృతార్ధప్రస్థ సదధివస్త్వాఢకఉదరఘ్నమ్" వీరిపక్షమున ఘృతము అర్ధప్రస్థమని చెప్పబడినది. ఈకల్పనావిధానమున కల్గు భేదములు, వ్యాధ్యాదులు బలాబలమును చూచి నిర్ణయింపనగునని మాయభిమతము.

—నాగరాదిఘృతము.—

మూ. నాగరత్రిఫలాప్రస్థం ఘృతతైలా (నాగరం త్రిపలం ప్రస్థం ఘృతతైలాత్) త్తథాఢకం, మస్తునః, సాధయిత్వైతత్ పిబేత్సర్వోదరాపహమ్. 115
కఫమారుత●ద్భూతే గుల్మే చైతత్ ప్రశస్యతే,

వ్యా. శుంఠి మూడుపలములు, (ఇది కల్కద్రవ్యము), ఘృతమును తైలమును కలిసి యొకప్రస్థము, పెరుగుమీద తేట యొకఆఢకము, వీనినన్నిటి నొకటిగ జేర్చి ఘృతపాకవిధిప్రకారము పక్వముచేసి పానముచేసినచో నుదరముల నన్నిటిని హరించును. మరియు నీఘృతము కఫవాతములచే కల్గినగుల్మమునందు నుపయోగించుటయు చాల ప్రశస్తము.

ఇచ్చట 'నాగరత్రిఫలాప్రస్థం' అని పాఠమున్నది. వాగ్భటాచార్యులు "నాగరం త్రిపలం, ప్రస్థం ఘృతతైలాత్, తథాఢకమ్, మస్తునః సాధయిత్వైతత్" అని చెప్పియున్నారు. దీనివ్యాఖ్యానమున సర్వాంగసుందరమున—"శుంఠ్యాః పలత్రయం, ప్రస్థం ఘృతతైలాత్, మస్తునః ఆఢకమ్, ఏతత్సాధయిత్వా" అని చెప్పిరి. ఈపాఠమునే యనుసరించి ప్రకృతమూలమునకు వ్యాఖ్య వ్రాయబడినది.

### చిత్రకఘృతము.

మూ. చతుర్గుణే జలే మూత్రే ద్విగుణే చిత్రకాత్పలే. 116
కల్కే సిద్ధం ఘృతప్రస్థం సక్షారం జఠరీ పిబేత్,

వ్యా. నాల్గుప్రస్థములు జలము, గోమూత్రము రెండుప్రస్థములు, చిత్రమూలము ఒకపలము, యవక్షార మొకపలము ఈరెండును కల్కము, ఆవునెయ్యి యొకప్రస్థము వీనినన్నిటి నొకటిగ జేర్చి ఘృతపాకవిధిప్రకారము పక్వముచేసి యుదరరోగముకలవారు పానము చేయదగును.

### యవకోలాదిఘృతము.

మూ. యవకోలకులుత్థానాం పఞ్చమూలరసేన చ. 117
సురాసౌవీరకాభ్యాం చ సిద్ధం వాపి పిబేత్ ఘృతమ్,

వ్యా. యవలు, రేగుపండు, ఉలవలు, పంచమూలములు, వీనికషాయము; సురా మద్యము, సౌవీరకమును కాంజికము వీనిని చేర్చి పక్వముచేయబడిన ఘృతమును ఉదర రోగి పానముచేయవలెను.

(ఈఘృతయోగమున కల్కమును చెప్పియుండలేదు. కావున—"కల్కహీనస్తు యః స్నేహః తత్ర తోయం చతుర్గుణం." అనుపరిభాషాప్రకారము పైజెప్పినద్రవములు మూడును చేరి ఘృతమునకు నాల్గింతలుండునట్లు కల్పింపనగును.)

### ఉదరరోగికి విరేచనవిధి.

మూ. ఏభిః స్నిగ్ధాయ సంజాతే బలే, శాన్తే చ మారుతే. 118
స్రస్తే దోషాశయే దద్యాత్ కల్పదిష్టం విరేచనం,

వ్యా. పైజెప్పినఘృతముల నుపయోగించుటచే కోష్ఠము స్నిగ్ధమై రోగికి బలము కల్గి వాతము శమించి పక్వాశయము బద్ధకములేక సడలియున్నపుడు కల్పస్థానమున చెప్పిన విధిప్రకారము విరేచనౌషధమును ఇప్పించవలెను.

### ఉదరముల కన్నిటికిని పటోలాదిచూర్ణము.

మూ. పటోలమూలం రజనీం విడఙ్గం త్రిఫలాత్వచమ్. 119
కమ్పిల్లకం నీలినీం చ త్రివృతాం చేతి చూర్ణయేత్,
షడాద్యాః కార్షికానన్యాః త్రీంశ్చ ద్విత్రిచతుర్గుణాః 120
కృత్వా చూర్ణమతో ముష్టిం గవాం మూత్రేణ నా పిబేత్,
విరక్తో మృదు భుఞ్జీత భోజనం జాఙ్గలై రసైః. 121
మణ్డం పేయాం చ పీత్వా వా సవ్యోషం షడహం పయః,
శృతం పిబేత్, తతః చూర్ణం పిబేదేవం పునః పునః. 122
హన్తి సర్వోదరాణ్యేతత్ చూర్ణం జాతోదకాన్యపి,
కామలాం పాణ్డురోగం చ శ్వయథుం చాఽపకర్షతి. 123
పటోలాద్యమిదం చూర్ణం ఉదరేషు ప్రపూజితం,

వ్యా. చేదుపొట్లవేరు, పసుపు, వాయువిడంగములు, త్రిఫలముల (కరక-తాని-ఉసిరికకాయల) బెరడు, ఈయారును ప్రత్యేక మొక్కొకకర్షము; కంపిల్లకము రెండు కర్షములు, నీలివేరు మూడుకర్షములు, తెగడ నాల్గుకర్షములు, ఈభాగముల ప్రకారము పైద్రవ్యముల నన్నిటిని చేర్చి చూర్ణముచేసి అందొకపలపరిమితమును గోమూత్రానుపానముతో త్రాగవలెను. చక్కగ విరేచనమైనపిదప మండము పేయ విలేపి అనుయవాగువులలో దేనినైన నొకదానిని త్రాగి యది జీర్ణమైనపిదప జాంగలమాంసరసమును జేర్చి సంబాపుబియ్యపుటన్నము మున్నగుదానిని లఘువుగ భుజించవలెను. పిమ్మట నారుదినములు త్రికటుకచూర్ణముచేర్చి కాచబడినపాలను మాత్రము త్రాగవలెను. ఇత్తెరంగున నారుదినములు గడపి మరుసటిదినమున మరల పైజెప్పినరీతిగ పటోలాదిచూర్ణమును ఆవుపంచితముతో జేర్చి త్రాగి నాటిదినమున మునుపటివలెనే మండపేయాదిపానముచేసి మాంసరసముతో నన్నమును భుజించి మరుసటిదినమునుండి యారుదినములు మునుపటివలెనే త్రికటుకచూర్ణముతో గూడినపాలను త్రాగవలెను. ఇత్తెరంగున పలుమారు త్రిప్పుచు పైచూర్ణమును సేవించినచో ఉదరరోగములు జలము పుట్టినవియైనను వానినన్నిటిని శమింపజేయును. మరియు కామల, పాండురోగము, శోఫము, ఈవ్యాధులను కూడ హరించును. ఈపటోలాదిచూర్ణము ఉదరరోగములన్నిటియందును చాల ప్రశస్తము.

### గవాక్ష్యాదిచూర్ణము.

మూ. గవాక్షీం శఙ్ఖినీం దన్తీం తిల్వకస్య త్వచం వచామ్. 124

పిబేత్ ద్రాక్షాంబుగోమూత్రకోలకర్కన్ధుశీధుభిః,

వ్యా. పెద్దపాపర, కడిల, దంతి, తెల్లలొద్దుగుపట్ట, వస, వీనినన్నిటిని సమభాగము లుగగూర్చి చూర్ణముచేసి ద్రాక్షారసముతోనైనను, గోమూత్రముతోనైనను, రేగుపండ్లు, పెద్దరేగు వీనిరసముతోనైనను, శీధుమద్యముతోనైనను గూర్చి త్రాగినచో నుదరము లన్నియు నివర్తించును.

సర్వరోగములకు నారాయణచూర్ణము.

మూ. యవానీ హపుషా ధాన్యం త్రిఫలా చోపకుఞ్చికాః 125
కారవీ పిప్పలీమూలం అజగన్ధా శటీ వచా,
శతాహ్వా జీరకం వ్యోషం స్వర్ణక్షీరీ సచిత్రకాః 126
ద్వౌ క్షారౌ పౌష్కరం మూలం కుష్ఠం లవణపఞ్చకం,
విడఙ్గం చ సమాంశాని దన్త్యాః భాగత్రయం తథా. 127
త్రివృద్విశాలే ద్విగుణే సాతలా స్యాచ్చతుర్గుణా,
ఏతన్నారాయణం నామ చూర్ణం రోగగణాపహమ్. 128
నైతత్ప్రాప్యాతివర్తన్తే రోగాః విష్ణుమివాஉసురాః,
(ఇతి నారాయణచూర్ణః.)

వ్యా. ఓమము, బోడతరము, దనియాలు, త్రిఫలములు, పెద్దజీలకర్ర, నల్లజీల కర్ర, మోడి, వాయింట, కచోరములు, వస, సదాప, సన్నజీలకర్ర, త్రికటుకములు, స్వర్ణక్షీరి, చిత్రమూలము, యవక్షారము, సర్జక్షారము, పుష్కరమూలము, చెంగల్వకోష్టు, పంచలవణములు, వాయువిడంగములు, వీనినన్నిటిని సమభాగములుగను; దంతివేళ్లు, మూడుభాగములుగను; తెల్లతెగడ, పెద్దపాపర, ఈరెంటిని ప్రత్యేకము రెండేసిభాగ ములవంతునను, సంబరేణి నాలుగుభాగములుగను; వీనినన్నిటిని కలిపి చూర్ణముచేయు నది. ఈచూర్ణమును ఆయారోగానుసారముగ ననుపానములచే నుపయోగించినయెడ రోగముల నన్నిటిని హరించును. ఇయ్యది విష్ణుదేవునిచెంత చేరినరాక్షసులబోలె రోగ ములనన్నిటిని హరించునది కావున నారాయణచూర్ణ మనబడును.

నారాయణచూర్ణమునకు వ్యాధ్యనుసారముగ ననుపానములు.

మూ. తక్రేణోదరిభిః పేయం గుల్మిభిర్బదరాంబునా. 129
ఆనద్ధవాతే సురయా వాతరోగే ప్రసన్నయా,
దధిమణ్డేన విట్సంగే దాడిమాంబుభిరర్శసైః. 130

పరికర్తే సవృతాఽమ్లముష్ణాంబుభిరజీర్ణకే,
భగందరే పాండురోగే శ్వాసే కాసే గలగ్రహే.
హృద్రోగే గ్రహణీదోషే కుష్ఠే మన్దేఽనలే జ్వరే,
దంష్ట్రావిషే మూలవిషే సగరే కృత్రిమే విషే.
యథార్హం స్నిగ్ధకోష్ఠేన పేయమేతద్విరేచనం,

వ్యా. మరియు పైజెప్పినచూర్ణమును ఉదరరోగమునందు మజ్జిగను, గుల్మ
మున రేగుపండ్లరసమును, ఆనాహవాతమున (కడుపుబ్బరమున) సురాయనుమద్యముతో
వాతరోగమున ప్రసన్నయనుమద్యమును, మలబద్ధమున పెరుగుమీదితేటను, అరో
మున దానిమ్మపండ్లరసమును, పరికర్తరోగమున చింతపండును, అనుపానముగజేసి
నగును. మరియు అజీర్ణరోగము, భగందరము, పాండురోగము, శ్వాసకాసములు
గ్రహము, హృద్రోగము, గ్రహణీరోగము, కుష్ఠము; అగ్నిమాంద్యము, జ్వరము, స
మున్నగువాని (జంగమ) విషము, మూలవిషము వేళ్లు మున్నగు స్థావరద్రవ్యములచే
విషము,) గరము (దూషీవిషము), కృత్రిమ (పెట్టుడుమందు మున్నగువాని) వి
ఈవ్యాధు లన్నిటియందును వేడినీళ్లలో కలిపి సేవించునది. మరియు దీనినిసేవిం
ముందు స్నేహపానముచే కోష్ఠమును స్నిగ్ధముగజేసికొని పైజెప్పినచూర్ణమును విరేచ
నకై సేవించినచో పైజెప్పినరోగముల నన్నిటిని విష్ణువు రాక్షసుల చెండాడుభంగి
లముచేయును.

### హపుషాదిచూర్ణము.

మూ. హపుషాం కాఞ్చనక్షీరీం త్రిఫలాం కటురోహిణీమ్.
నీలినీం త్రాయమాణాం చ సాతలాం త్రివృతాం వచాం,
సైన్ధవం కాలలవణం పిప్పలీం చేతి చూర్ణయేత్.
దాడిమత్రిఫలామాంసరసమూత్రసుఖోదకైః,
పేయోఽయం సర్వగుల్మేషు ప్లీహ్ని సర్వోదరేషు చ.
శ్విత్రే కుష్ఠే సరుజకే సవాతే విషమాగ్నిషు,
శోథార్శః పాండురోగేషు కామిలాయాం హలీమకే.
వాతం పిత్తం కఫం చాశు విరేకాత్సంప్రసాదయేత్,
(ఇతి హపుషాదిచూర్ణ

వ్యా. బోడతరము, కాంచనక్షీరి (చిరుపాల లేక కంకుష్ఠము) త్రిఫలములు, క
రోహిణి, నీలివిత్తులు, కానుగ, సంబరేణు, తెల్లతెగడ, వస, సైంధవలవణము, బిడ

ణము, (నల్లనిఉప్పు), పిప్పళ్లు, వీనినన్నిటిని సమభాగములుగ జేర్చి చూర్ణముచేసి; దానిమ్మరసము, త్రిఫలాకషాయము, మాంసరసము, గోమూత్రము, సుఖోష్ణమైనవేడి నీళ్లు, వీనియనుపానములచే త్రాగినయెడ సర్వగుల్మములును, ప్లీహవృద్ధి, అన్నియుదరములు, శ్విత్రకుష్ఠము, సామాన్య బాధతో కూడినకుష్ఠము, వాతముతో కూడిన విషమాగ్ని, శోఫము, అర్శోరోగము, పాండురోగము, కామల, హలీమకము, ఈవ్యాధులన్నిటియందును సేవించినయెడ ఇవియన్నియు శమించును. మరియు ఈచూర్ణమువలన విరేచనమునై వాతపిత్తకఫములు మూడు శీఘ్రముగ శమించును.

### నీలిన్యాదిచూర్ణము.

మూ. నీలినీం నిచులం వ్యోషం ద్వౌ క్షారౌ లవణాని చ. 137
చిత్రకం చ పిబేచ్చూర్ణం సర్పిషోదరగుల్మనుత్,
(ఇతి నీలిన్యాదిచూర్ణం.)

వ్యా. నీలిగింజలు, నీరుప్రబ్బలి, త్రికటుకములు, సర్జక్షారము, యవక్షారము, పంచలవణములు, చిత్రమూలము, వీనినన్నిటిని సమభాగములుగ గూర్చి చూర్ణముచేసి నేతిలో కలిపి త్రాగినయెడ ఉదరములన్నియు గుల్మములును నివర్తించును.

### స్నుహీక్షీరఘృతము.

మూ. క్షీరద్రోణం సుధాక్షీరప్రస్థార్ధసహితం దధి, 138
జాతం విమథ్య తద్యుక్త్వా త్రివృత్సిద్ధం పిబేద్ఘృతం,
తథా సిద్ధం ఘృతప్రస్థం పయస్యష్టగుణే పిబేత్. 139
స్నుక్క్షీరపలకల్కేన త్రివృతా షట్పలేన చ,
గుల్మానాం గరదోషాణాం ఉదరాణాం చ శాన్తయే. 140
(ఇతి స్నుహీక్షీరఘృతమ్.)

వ్యా. ఒకద్రోణపరిమితమైన ఆవుపాలలో జెముడుపాలను అర్ధప్రస్థము (ఎనిమిది పలములు) చేర్చి కాచి తోడుబెట్టి అది పేరినపిదప నాపెరుగును కవ్వముతో చిలికి వెన్నతీసి యావెన్నను కాచిన నేతియందు తెల్లతెగడను ఘృతమునకు నాల్గవవంతు కల్కముచేసి చేర్చి ఘృతపాకవిధిప్రకారము పక్వముచేసి యాఘృతమును పానము చేయవలయును. (ఈఘృతయోగమున ద్రవద్రవ్యము చెప్పలేదు కావున "ద్రవేఽప్యనుక్తే జలమేవ దేయం" అను సామాన్యపరిభాషచే ఘృతమునకు నాల్గింతలు జలమును జేర్చి

పక్వము చేయునది. లేక పైజెప్పినరీతిగ వెన్నను తీసినపిదప మిగిలియుండు మజ్జిగనైనను, ద్రవమునకు చేర్చుకొననగును.)

లేక పైజెప్పినరీతిగ వెన్నతీసి కాచబడినఘృతమునందు యెనిమిదింతలుపాలుచేర్చి, అందు జెముడుపాలు ఒకపలమును, తెల్లతెగడకల్కము ఆరుపలములును, చేర్చి క్షీరపాక విధిగ పక్వముచేయబడిన ఘృతమును పానముచేయునది. ఇచ్చట పైజెప్పబడినప్రకారము జెముడుపాలుజేర్చి కాచబడినపాలనుండి యేర్పడినఘృతమును ఒకప్రస్థమును ఎనిమిదిప్రస్థములు ఆవుపాలను ఒకపలము జెముడుపాలను తెగడకల్కమును ఆరుపలములను చేర్చి ఘృతమును సిద్ధముచేయునది.

ఈఘృతపానమువలన గుల్మంబులును గర (పెట్టుడుమందు) దోషంబులును, ఉదరంబులును శమించును.

### దధిమండఘృతము.

మూ. దధిమండాఢకే సిద్ధాత్ స్నుక్క్షీరపలకల్కితాత్,
ఘృతప్రస్థం పిబేన్మాత్రాం తద్వజ్జఠరశాన్తయే. 141

వ్యా. ప్రస్థపరిమితమైన ఘృతమునందు పెరుగు తేటనీటిని ఆఢకపరిమితమును, జెముడుపాలు ఒకపలమును, కల్కముగ జేర్చుకొని ఘృతపాకవిధిగ పక్వముచేసి మితముగ త్రాగినచో నుదరరోగము శమించును. ఇచ్చట స్నుహీక్షీరము కల్కముగ జెప్పబడినది.

### ఘృతపానానంతరము పేయాదిపానము.

మూ. ఏషాం చానుపిబేత్పేయాం పయో వా స్వాదు వా రసం,
ఘృతే జీర్ణే విరిక్తస్తు కోష్ణం నాగరకైః శృతమ్. 142
పిబేదంబు తతః పేయాం యూషం కౌలత్థకం తతః,

వ్యా. పైజెప్పిన ఘృతములను ఉదరరోగి త్రాగినవెంటనే పేయమను గంజినైనను, పాలనైనను, మధురముగ నుండుమాంసరసమునైనను, అనుపానముగ త్రాగవలయును. పిదప ఘృతము జీర్ణమై విరేచనముచేత దోషము వెడలినవెనుక శుంఠిని జేర్చి కాచబడి గోరువెచ్చగనుండు నీళ్లను త్రాగవలయును. పిమ్మట పేయమనుగంజినైనను, ఉలవలను చేర్చి సిద్ధముచేయబడినయూషము (కట్టు) నైనను, త్రాగవలయును. (ఇచ్చట ఘృతపానము చేసినవెంటనే కఫమునందు పేయమును, పిత్తమునందు పాలను, వాతమునందు మాంసరసమును ఆహారమున కనుపానముగ ప్రకృతిని యగ్నిని యనుసరించి త్రాగవలయునని కొందరియభిప్రాయము.)

## ఘృతపానక్రమము.

మూ. పిబేద్రూక్షః త్ర్యహం త్వేవం పయోను ప్రతిభోజితః. 143
(భూయో వా ప్రతిభోజితః)
పునః పునః పిబేత్సర్పిః ఆనుపూర్వ్యా తథైవ చ,
కృతాన్యేతాని సిద్ధాని విదధ్యాత్ కుశలో భిషక్. 144
గుల్మానాం గరదోషాణాం ఉదరాణాం చ శాన్తయే,

వ్యా. స్నిగ్ధముగాక మిక్కిలి రూక్షమైన శరీరముగలవాడు పైజెప్పినరీతిగ పైవివరింపబడిన ఘృతయోగములను ఉపయోగించుచు పైజెప్పిన ఆనుపూర్వి ననుసరించి మాంసరసాదులను మాత్రము పానముచేయించవలయును. (అనగా మూడుదినములు ఘృతపానముచేసి పిదప మూడుదినములవరకు మాంసరసాదులను త్రాగవలయును. మరల ఘృతపానమును రసపానమునుచేసినచో ఉదరరోగములు శాంతినొందును.)

ఇత్తెరంగున పైజెప్పిన ఘృతయోగములను గుల్మమునకును, దూషీవిషములకును, ఉదరరోగములకును, శాంతికొరకు పలుమారుపయోగించునది. ఇచ్చట "రూక్షః" అని చెప్పుటచేత కేవలము రూక్షకోష్ఠులకే ఈఘృతయోగము నుపయోగింపదగునుగాని స్నిగ్ధకోష్ఠులకు అర్హముకాదని తెలిసెడి.

## ఆనాహహారఘృతము.

మూ. పీలుకల్కోపసిద్ధం వా ఘృతమానాహభేదనమ్. 145
గుల్మఘ్నం నీలినీసర్పిః స్నేహం వా మిశ్రకం పిబేత్,

వ్యా. మరియు గోగువిత్తులను కల్కముచేసి సిద్ధముచేయబడిన ఘృతము నుపయోగించినను కడుపుబ్బరమును హరించును. (ఈయోగమున ద్రవమును చెప్పియుండలేదు, కావున ఘృతమునకు నాల్గింతలు జలమును, పీలుకల్కము నాల్గవపాలును గూర్చి ఘృతమును సిద్ధముచేయునది.)

మరియు గుల్మచికిత్సితమున చెప్పబడిన గుల్మహార నీలినీఘృతంబునైనను, మిశ్రకస్నేహమునైనను సేవించినచో ఉదరరోగికి కడుపుబ్బరము శాంతినొందును.

## దోషశేషమున నుపయోగింపదగిన యోగములు.

మూ. క్రమాన్నిర్హృతదోషాణాం జాఙ్గలప్రతిభోజినామ్. 146
దోషశేషనివృత్త్యర్థం యోగాన్వక్ష్యామ్యతః పరం,

వ్యా. పైజెప్పబడిన ఘృతాదిప్రయోగములచే క్రమముగ దోషములు బైట వెడలి జాంగలమాంసాదులు భుజించి కొంచెముగ శరీరమునకును, అగ్నికిని, బలముకలవారికి విరేచనములచే దోషము పూర్తిగ వెడలక, కొంచెము నిలిచియున్నయెడ అట్టిదోషశేషము నివర్తించుటకై తగినయోగములు ఈ క్రింద వివరింపబడును.

## ఉదరరోగహరచిత్రకాదికల్కములు.

మూ. చిత్రకామరదారుభ్యాం కల్కం క్షీరేణ నా పిబేత్. 147
మాసంయుక్తస్తథా హస్తిపిప్పలీవిశ్వభేషజం,
విడంగం చిత్రకం దన్తీ చవ్యం వ్యోషం చ తైః పయః. 148
కల్కైః కోలసమైః పీత్వా ప్రవృద్ధముదరం జయేత్,

వ్యా. చిత్రమూలము, దేవదారుచెక్క, ఈరెంటిని కల్కముచేసి యావుపాలలో కలిపి యొకమాసము త్రాగవలయును. మరియు గజపిప్పళ్లు, శుంఠి ఈరెంటిని కల్కము జేసి పాలతో త్రాగవలెను. వాయువిడంగములు, చిత్రమూలము, దంతి, చవ్యము, త్రికటుకములు, వీనిని ప్రత్యేక మొక్కొక్కదానిని కోలము (అర్ధకర్షము) పరిమాణము వంతున చేర్చి కల్కముచేసి ఆకల్కమును, నాలుగుపలములపాలలోచేర్చి, నాల్గింతలు నీళ్లుపోసి క్షీరపాకవిధిగ పక్వముచేసి త్రాగినచో మిక్కిలి వృద్ధినొందిన యుదరము లన్నియు శమించును.

## ఉదరహరత్రిఫలాదికషాయము.

మూ. పిబేత్కషాయం త్రిఫలాదన్తీరోహితకైశ్శృతమ్. 149
వ్యోషక్షారయుతం జీర్ణే రసైరద్యాత్తు జాఙ్గలైః,

వ్యా. త్రిఫలములు, దంతివేళ్లు, ములుమోదుగ, వీనిని సమభాగములుగ జేర్చి విధ్యుక్తప్రకారముగ కషాయముకాచి, అందు త్రికటుకచూర్ణమును యవక్షారమును చేర్చి త్రాగి, జీర్ణమైనపిదప జాంగలమాంసరసముమ జేర్చి యాహారమును భుజింపవలెను.

## ఉదరహరములగు కొన్నియుపాయములు.

మూ. మాంసం వా భోజనం భోజ్యం సుధాక్షీరఘృతాన్వితమ్. 150
క్షీరానుపానం గోమూత్రేణాఽభయాం వా ప్రయోజయేత్,

వ్యా. జెముడుపాలను జేర్చి పైజెప్పినవిధముగ క్షీరమును పక్వముచేసి యందుండి సిద్ధముచేయఁబడిన ఘృతమును మాంసమునందును అన్నాద్యాహారమునందును జేర్చి ప్రతి

దినంబును భుజించునది. లేక కరకకాయలచూర్ణమును గోమూత్రమున కలిపి త్రాగి ఆవు పాలను వెంటనే త్రాగవలెను.

మూ. సప్తాహం మాహిషం మూత్రం క్షీరం చాऽనన్నభుక్పిబేత్. 151
మాసమౌష్ట్రం, పయశ్ఛాగం, త్రీన్ మాసాన్ వ్యోషసంయుతం,

వ్యా. ఏడుదినములు అన్నమును వర్జించి గేదెమూత్రమును గేదెపాలను త్రాగవలెను. లేక నెలదినములు అన్నమును వర్జించి యొంటెపాలను త్రాగుచు అదే ఆహారముతో నుండవలెను. లేక మేకపాలలో త్రికటుకచూర్ణమును కలిపి త్రాగుచు అన్నమును వదలి మూడుమాసములవరకు నుండవలెను.

ఉదరమున సహస్రహరీతక్యాద్యుపయోగము.

మూ. హారీతకీసహస్రం వా, క్షీరాశీ వా శిలాజతు. 152
శిలాజతువిధానేన గుగ్గులుం వా ప్రయోజయేత్,
శృఙ్గిబేరార్ద్రికరసః పానే క్షీరసమో హితః. 153
తైలం రసేన తేనైవ సిద్ధం దశగుణేన వా,
దన్తీద్రవన్తీఫలజం తైలం దూష్యోదరే హితమ్. 154
శూలానాహవిబన్ధేషు మస్తుయూషరసాదిభిః,

వ్యా. వేయికరకకాయలను (గోమూత్రమున భావనజేసి ఆవుపాలను అనుపానముగజేసికొని యుదరరోగి సేవించవలయును. లేక శుద్ధిచేయబడిన శిలాజితువును సేవించుచు పాలను త్రాగుచుండవలయును. శుద్ధిచేయబడిన గుగ్గిలము శిలాజితు విధానము ననుసరించి క్షీరపానము జేయుచు నుపయోగింపవలయును. అల్లముయొక్కయు శుంఠియొక్క స్వరసమును క్షీరమునకు సమభాగముగజేర్చి త్రాగినను నుదరరోగమున హితకరము. లేక తైలమునందు అల్లపురసమును పదింతలుచేర్చి పక్వముచేసియైనను, దూష్యోదరమున నుపయోగించవగును. మరియు నేపాళపుగింజలను, యెలుకచెవియాకును చేర్చి తైలమును సిద్ధముచేసి దూష్యోదరమున నుపయోగించుట యుక్తముగనుండును. (ఇచ్చట హరీతకీయోగమున వాగ్భటాచార్యులు "హరీతకీసహస్రం వా గోమూత్రేణ పయోనుపః" అని చెప్పియుండుటచేత కరకకాయలను గోమూత్రమున భావనచేసి యుపయోగించవలయునని భావము.) ఇచ్చట దూష్యోదరము అని సన్నిపాతోదరమని యర్థము. మరియు పైజెప్పిన తైలము శూలము, ఆనాహము, మలబద్ధకము, నీరోగనులయందు పెరుగుమీది తేట, యూషము, మాంసరసము మున్నగువానితో గూర్చి నుపయోగించునది.

### అభ్యంగనాది తైలములు.

మూ. సరలామధుశిగ్రూణాం బీజేభ్యో మూలకస్య చ. 155
తైలాన్యభ్యఙ్గపానార్థం శూలఘ్నాన్యనిలోదరే,

వ్యా. సరళదేవదారుయొక్కయు,యెఱ్ఱమునగయొక్కయు, ముల్లంగియొక్కయు, విత్తులనుండి తీయబడిన తైలములను వాతోదరమునందు అభ్యంగనమునకును, పానమునకును నుపయోగించినచో వాతహరముగ నుండును.

### ఉదరములయందవస్థావిశేషమున ఆసవాద్యుపయోగము.

మూ. స్తైమిత్యారుచిహృల్లాసే మన్దేఽగ్నౌ మద్యపాయ చ. 156
అరిష్టాన్దాపయేత్ క్షారాన్ కఫస్త్యానస్థిరోదరే,
(శ్లేష్మణో విలయార్థం తు దోషం వీక్ష్య భిషగ్వరః). 157

వ్యా. ఉదరము చలింపకుండుట, అరుచి, హృల్లాసము, అగ్నిమాంద్యము ఇవి కలవారును; మద్యపానము చేయు నలవాటుకలవారును; అరిష్టములను నుపయోగించుకొనవలయును. మరియు కఫము ఘనీభవించి యుదరము కఠినముగ నున్నపుడు ఆట్టికఫము కరగి పలుచనగుటకు రోగియొక్కబలమును గమనించి క్షారముల నుపయోగించనగును.

### ఉదరరోగమునకు పిప్పల్యాదిక్షారము.

మూ. పిప్పలీం తిల్వకం హిఙ్గు నాగరం హస్తిపిప్పలీం,
భల్లాతకం శిగ్రుఫలం త్రిఫలాకటురోహిణీమ్. 158
దేవదారు హరిద్రే ద్వే సరలాతివిషే వచామ్ (స్థిరామ్),
కుష్ఠం ముస్తం తథా పఞ్చ లవణాని ప్రకల్ప్య చ. 159
దధిసర్పిర్వసామజ్జతైలయుక్తాని దాహయేత్,
అన్నాదూర్ధ్వమతః క్షారాత్ బిడాలపదకం పిబేత్. 160
మదిరాదధిమణ్డోష్ణజలారిష్టసురాసవైః,
హృద్రోగం శ్వయథుం గుల్మం ప్లీహార్శోజఠరాణి చ. 161
విషూచికాముదావర్తం వాతాష్ఠీలాఞ్చ నాశయేత్,

వ్యా. పిప్పళ్లు, లొద్దుగుపట్ట, ఇంగువ, శుంఠి, గజపిప్పళ్లు, జీడిగింజలు, మునగవిత్తులు, త్రిఫలములు, కటుకరోహిణి, దేవదారుచెక్క, పసుపు, మ్రానిపసుపు, సరళదేవదారుపట్ట, అతివస, వస,చెంగల్వకోష్టు, తుంగగడ్డలు, పంచలవణములు వీనినన్నిటిని సమ

భాగములుగ కూర్చి అందు పెరుగు, నెయ్యి, వస, మజ్జ, నువ్వులనూనె వీనినన్నిటిని పై జెప్పినయౌషధముల కల్కము ముద్ద యగునంతపరిమాణమున చేర్చి యొకకుండలో బోసి పైన మూతమూసి బిగించి ప్రొయ్యిమీద నునిచి కారమగునట్లు మంటవేయునది. పక్వమైన యాక్షారమును అన్నమును భుజించినపిదప కర్షప్రమాణము ఈక్రిందచెప్పిన యనుపానములతో సేవించునది. మద్యము, పెరుగుమీదితేట, వేడినీళ్లు, అరిష్టములు, ఆసవములు వీనిలో నొకదానితో పైక్షారమును కూర్చి అగ్నిబలాద్యనుసారముగ త్రాగునది. దీనివలన హృద్రోగము, శోఫ, గుల్మము, ప్లీహము, అర్శోరోగము, ఉదరరోగము, విషూచి, ఉదావర్తము, వాతాష్ఠీల అను నీరోగముల నన్నిటిని హరించును.

### జలోదరమునకు క్షారవటకములు.

మూ. క్షారం చాజకరీషాణాం స్రుతం మూత్రైర్విపాచయేత్. 162
కార్షికం పిప్పలీమూలం పఞ్చైవ లవణాని చ,
పిప్పలీం చిత్రకం శుంఠీం త్రిఫలాం త్రివృతాం వచామ్. 163
ద్వౌ క్షారౌ సాతలాం దన్తీం స్వర్ణక్షీరీం విషాణికాం,
కోలప్రమాణాం వటికాం పిబేత్సౌవీరసంయుతామ్. 164
శ్వయథావవిపాకే చ ప్రవృద్ధే చ దకోదరే,

వ్యా. మేకపింటికలను కాల్చి క్షారముచేసి యాక్షారమును, గోమూత్రమున కలిపి తేటద్రవమును తీసికొని ఈద్రవమునందు మోడి, పంచలవణములు, పిప్పళ్లు, చిత్రమూలము, శుంఠి, త్రిఫలములు, తెగడ, వస, సర్జక్షారము, యవక్షారము, సంబరేణి, సేపాళపువిత్తులు, స్వర్ణక్షీరి (కంకుష్ఠము) ఒద్ది వీనినన్నిటిని ప్రత్యేకము ఒక్కొక్కకర్షమువంతున చేర్చి చూర్ణముచేసి ఈచూర్ణమును పైచెప్పిన గోమూత్రక్షారమున కలిపి ముద్దయగునట్లు పక్వముచేయునది. ఆయౌషధమును రేగుపండంత మాత్రలనుచేసి సౌవీరకమును అనుపానముగజేసి పూటకొకటివంతున సేవించినయెడ శోఫము, అజీర్ణము హరించి మిక్కిలి వృద్ధిజెందినజలోదరము శాంతినొందును.

### ఉదరములయందు యవాగ్వాదిఆహారము.

మూ. భావితానాం గవాం మూత్రే షష్టికానాం తు తండులైః. 165
యవాగూం పయసా సిద్ధాం ప్రకామం భోజయేన్నరం,
పిబేదిక్షురసం చాను జఠరాణాం నివృత్తయే. 166
స్వం స్వం స్థానం వ్రజన్త్యేవం తథా పిత్తకఫానిలాః,

వ్యా. అరువదినాళ్లసంబావుబియ్యమును గోమూత్రమున భావనచేసి యెండ సెండించి ఆయాబియ్యమును పాలతోచేర్చి యవాగువును పక్వముచేసి తృప్తిగ త్రాగి వలసినచో చెరకురసమును అనుపానముగ త్రాగినయెడ ఉదరవ్యాధులు నివర్తించి ప్రకోపము నొందియున్న వాతకఫపిత్తము వానివానిస్థానములయందు జేరును.

### ఉదరములయం దుపయోగింపదగిన శాకాదులు.

మూ. శఙ్ఖినీ స్నుక్ త్రివృద్దన్తీచిరిబిల్వాదిపల్లవైః 167
శాకం గాఢపురీషాయ ప్రాగ్భుక్తం దాపయేద్భిషక్,
(త్రివృతాశంకినీదన్తీసుధాపూతీకపల్లవైః,
శాకం పక్త్వా ప్రయుంజీత ప్రాగ్భుక్తం గాఢవర్చసే.)
తతోఽస్మై శిథిలీభూతవర్చోదోషాయ శాస్త్రవిత్. 168
దద్యాన్మూత్రయుతం క్షీరం (క్షారం) దోషశేషహరం శివం,

వ్యా. కడిల, జెముడు, తెగడ, దంతి, కానుగ వీనియొక్క లేతచిగుళ్లను శాకముగ పక్వముచేసి ఉదరరోగికి పురీషము పిష్టముకట్టియుండినయెడ ఆహారమును భుజించుటకుమునుపు తినిపించవలయును. అది జీర్ణమై మలము సడలినపిదప మూత్రముతోకూడిన పాలనైనను, పైజెప్పబడిన క్షారమునైనను, త్రాగించినచో ఉదరరోగమునందలి దోషశేషము పూర్తిగ హరించును.

### బిల్వక్షారతైలము.

మూ. పార్శ్వశూలముపస్తంభం హృద్గ్రహం చాపి మారుతం,
జనయేద్యస్య తం తైలం బిల్వక్షారేణ పాయయేత్. 169

వ్యా. ఉదరరోగికి వాతము ప్రకోపించి ప్రక్కనొప్పిని, స్తబ్ధత్వము, హృదయము పట్టుకొనినట్లుండుట, ఈయుపద్రవములు కల్గించినయెడ బిల్వకాయలను కాల్చి క్షారముచేసి యాక్షారోదకమున తైలమునకు నాల్గింతలు చేర్చి పక్వముచేసి యాతైలమును త్రాగించవలయును.

### ఉదరహరక్షారతైలములు.

మూ. తథాగ్నిమన్థశ్యోనాకపలాశతిలనాలజైః. 170
బలాకదల్యపామార్గక్షారైః ప్రత్యేకశః స్రుతైః,
తైలం పక్త్వా భిషగ్దద్యాత్ ఉదరాణాం ప్రశాన్తయే. 171
నివర్తతే చోదరిణాం హృద్గ్రహశ్చానిలోద్భవః,

వ్యా. కూరనెల్లి, దుండిగము, మోదుగ, నువ్వుచెట్టుకాడలు, చిట్టాముట్టి, అరటి, ఉత్తరేణి వీనిని వేరువేరుగ క్షారముచేసి యాక్షారోదకమును జేర్చి తైలమును పక్వము చేసి యాక్షారతైలమును, ఉదరములు శమించుటకై త్రాగవలయును. ఈతైలపానము వాతముచే కల్గిన రొమ్ముపట్టువదలి యుదరము శాంతమగును.

ఇచ్చట క్షారపాకవిధి యిట్లెరుంగునది:—క్షారముచేయవలసి ఉత్తరేణి మున్నగు వానిని నిప్పున కాల్చి బూడిదచేసి యాభస్మమునకు నాల్గింతలు నీళ్లుపోసి నూరి యొక పాత్రమున వైచి యొకరాత్రియంత మూసియునిచి మరునాడుదయమున పైతేటనీటిని గ్రహించునది. ఇదియే క్షారకల్పనము. ప్రకృతమున క్షారముచేయతలచిన కూరనెల్లి మొదలగువానిని పైజెప్పినవిధముగ క్షారోదకమును సిద్ధముచేసికొని తైలమునకు నాల్గింతలు చేర్చి విధ్యుక్తప్రకారము చేయునది.

### ఉదరములకు ఏరండతైలము.

మూ. కఫే వాతేన పిత్తేన తాభ్యాం వాఽప్యావృతేఽనిలే. 172
బలినః స్వౌషధయుతం తైలమైరణ్డజం హితం,

వ్యా. ఉదరరోగికి కఫము వాతముచేనైనను, పిత్తముచేనైనను, ఆవరింపబడి యున్నను లేక పిత్త-కఫములచే వాతము అడ్డగింపబడినను బలశాలియగునట్టిరోగి ఆయా దోషములను హరించునౌషధములతో కూడినయాముదము నుపయోగించుట చాల హితము.

### ఉదరరోగము వస్తిప్రయోగము.

మూ. సువిరిక్తో నరో యస్తు పునరాధ్మాపితో భవేత్. 173
సుస్నిగ్ధైరమ్లలవణైః నిరూహైస్తముపాచరేత్,
సోపస్తమ్భోఽపి వా వాయురాధ్మాపయతి యం నరమ్. 174
తీక్ష్ణైః సక్షారగోమూత్రైర్వస్తిభిస్తముపాచరేత్,

వ్యా. ఉదరరోగి విరేచనమునకై యౌషధము నుపయోగించినపుడు చక్కగ విరేచనమైనను, మరల కడుపు మునుపటివలె యుబ్బరించియున్నయెడ స్నేహద్రవ్యములతోడను, అమ్లలవణములతోడను కూడిన నిరూహవస్తులచే వాని నుపచరించవలయును.

మరియు కఫముచే నిరోధింపబడినవాతము ఉదరమును మరల నుబికించినచో క్షారముతోడను గోమూత్రముతోడను కూడిన తీక్ష్ణమైన వస్తులచే రోగి నుపచరించ వలయును.

## ఉదరరోగమున విషప్రయోగము.

మూ. క్రియాంతివృత్తే జఠరే త్రిదోషే చాప్రశామ్యతి. 175
జ్ఞాతీన్ ససుహృద్దారాన్ బ్రాహ్మణాన్ నృపతీన్ గురూన్,
అనుజ్ఞాప్య భిషక్కర్మ విదధ్యాత్సంశయం బ్రువన్. 176
అక్రియాయాం ధ్రువోమృత్యుః క్రియాయాంసంశయోభవేత్,
ఏవమాఖ్యాయ తస్యేదమనుజ్ఞాతః సుహృద్గణైః. 177
పానభోజనసంయుక్తం విషమస్మై ప్రయోజయేత్,

వ్యా. ఉదరవ్యాధి కుక్షియందు జలము పుట్టుటవలన సామాన్యౌషధములకు అసాధ్యముగనున్నను, సన్నిపాతోదరము అసాధ్యస్థితి నున్నపుడును, వైద్యుడు రోగికి సంబంధించినజ్ఞాతులను, బంధువులను, స్నేహితులును, భార్య మున్నగువారిని, బ్రాహ్మణులను, ప్రభువులను, గురువులను వీరి నందరినిచేర్చి వారితో రోగి సంశయావస్థను నిట్లు చెప్పవలయును:—''ఈరోగికి ఇట్టి యవస్థయందు క్రూరమైనచికిత్స చేయకున్నచో చావు తప్పదు. విషప్రయోగము మున్నగు క్రూరచికిత్సను నాచరించినచో నొకవేళ బ్రతుకవచ్చును. కావున మరణము సంశయమౌను అని'' వారికందరకును నచ్చచెప్పి వారియనుమతి వడసి రోగికి అన్నపానముల సంతృప్తిగ జేసి ఈక్రింద జెప్పబడినవిధముగ విషమును ప్రయోగింపవలయును. (ఇచ్చట జ్ఞాతులు మున్నగువారి నడిగి యనుమతివడయుటచే నొకవేళ రోగి మృతిజెందినను వైద్యునకు నపయశస్సు తప్పిపోవును. రాజానుమతి వడయుటవలన రాజదండనయు తప్పిపోవునని తెలియునది.)

## ఉదరములయందు విషోపయోగమున గల్గుఫలము.

మూ. యస్మిన్వా కుపితస్సర్పో విసృజేద్ధి ఫలే విషమ్. 178
భోజయేత్తదుదరిణం ప్రవిచార్య భిషగ్వరః,
తేనాస్య దోషసంఘాతః స్థిరో లీనో విమార్గగః. 179
విషేణాశు ప్రమాథిత్వాత్ ఆశు భిన్నః ప్రవర్తతే,

వ్యా. సర్పము మిక్కిలి కోపముకల్గి దేనినైనను నొకపండును కొరికి దానియందు విషమును విడచినచో వైద్యుడు దానిని గమనించి చక్కగ విచారించి ఆపండును గోసి రోగికి తినిపించవలయును. ఆవిషముచేత రోగికి ఉదరమునందు స్థిరముగ పాదుకొని లీనమై విషమమార్గములచేరి యుండుదోషసంచయము విషము మిక్కిలి ప్రమాథిగుణము కల్గినదికావున అట్టివిషముచే ఛేదింపబడి వెడలును. (ఇచ్చట ''సర్పః ప్రకుపితః'' అని

చెప్పుటవలన సర్పమునకు కోపముగలిగినప్పుడే విషము తీవ్రముగ నుండుననని తెలియదగినది. మరియు ఇట్టి క్రూరవ్యాధులయందు సర్పము మున్నగువానికోరలకు సంబంధించిన దంష్ట్రావిషమునె యుపయోగింపదగియుండును. ఈవిషబలము తంత్రాంతరమున నిట్లు చెప్పబడియున్నది:—"దూష్యోదరే బద్ధగుదే క్షతాన్త్రేచ జలోదరే,అపి దంష్ట్రావిషస్యైవ ప్రయోగోవై విశోధనే.")

### ఉదరమున విషప్రయోగానంతరనియమము.

మూ. విషేణ హృతదోషస్తం శీతామ్బు పరిషేచితమ్. 180
పాయయేత భిషగ్దుగ్ధం యవాగూం వా యథాబలం,
త్రివృన్మణ్డూకపర్ణ్యోశ్చ శాకం సయవవాస్తుకమ్. 181
భక్షయేత్కాలశాకం వా స్వ(సు)రసోదకసాదితం,
నిరమ్లలవణస్నేహం స్విన్నాస్విన్న మనన్నభుక్. 182

వ్యా. పైజెప్పినరీతిగ విషయోగముచేత రోగికి దోషము హరించినపిదప రోగికి చల్లనినీళ్లచే శరీరమునంతయు తడియునట్లు స్నానముచేయించి పాలనైనను, యవాగువునైనను, రోగియొక్క యగ్నిబలానుసారముగ త్రాగించవలయును. పిమ్మట తెగడ, వల్లారియాకు, యవశాకము, చక్రవర్తికూర, కరివేపాకు, అను నీశాకములను వానిస్వరసమును, జలమును కూడ చేర్చి వండి పులుపు, ఉప్పు, చమురు, వీనిని చేర్పక పక్వముచేసి ఒక్కనెలవరకు అన్నమును వదలి ఈయాకుకూరను తినవలయును.

### ఉష్ట్రక్షీరోపయోగము.

మూ. మాసమేకం తతశ్చైవ తృషితః స్వరసం పిబేత్,
ఏవం వినిర్హృతే దోషే శాకైర్మాసాత్పరం తతః. 183
దుర్బలాయ ప్రయుంజీత ప్రాణభృత్కారభం పయః.

వ్యా. పైజెప్పినరీతిగ నొకమాసము శాకాహారము జేయుచు దప్పియైనపుడెల్ల పైజెప్పిన శాకముల స్వరసమునే త్రాగుచు కాలము గడుపవలయును. అట్టి యాహారము వలన దోషము హరించినపిదప రోగి బలహీనుడై యున్నయెడ బలకరమైన యొంటె పాలను నుపయోగింపవలయును.

### బద్ధ-ఛిద్రోదరములయందు శస్త్రచికిత్స.

మూ. ఇదస్తు శల్యహర్తౄణాం కర్మ స్యాద్దృష్టకర్మణామ్. 184

వామం కుక్షిం మాపయిత్వా నాభ్యధశ్చతురఙ్గులం,
మాత్రాయుక్తేన శస్త్రేణ పాటయేన్మతిమాన్భిషక్. 185
విపాట్యాన్త్రం తతః పశ్చాద్వీక్ష్య బద్ధక్షతాన్త్రయోః,
సర్పిషాఽభ్యజ్య కేశాదీనవమృజ్య విమోక్షయేత్. 186
మూర్ఛనాద్యచ్చ సంమూఢమన్త్రం తచ్చ విమోక్షయేత్,
ఛిద్రాణ్యన్త్రస్య తు స్థూలైః దంశయిత్వా పిపీలికైః 187
బహుశః సంగృహీతాని జ్ఞాత్వా ఛిత్వా పిపీలికాః,
ప్రతియోగైః ప్రవేశ్యాన్త్రం ప్రేయైః సీవ్యేద్వ్రణం తతః. 188

వ్యా. శస్త్రచికిత్సలయందు ఆరితేరి చక్కనియనుభవముగల శల్యతంత్రజ్ఞులు ఈక్రింద జెప్పబడు చికిత్సను చేయ నర్హులు. అట్టి కుశలులగువైద్యులు బద్ధగుదోదరము నందును, ఛిద్రోదరమునందును, రోగియొక్క నాభికి క్రిందిభాగమున నాలుగంగుళముల చోటు వదలి అంతకు క్రిందకుక్షియందు నెడమప్రక్క మిక్కిలి వాడిగల శస్త్రముచేత చీల్చవలయును.చీల్చినపిదప అంత్రములను చక్కగ గమనించి బద్ధముగను (శల్యములచే నడ్డుపరుపబడినది), క్షతముగను (శల్యాదులచే రంధ్రములు పడియుండునది), నుండు ప్రేవును గమనించి నేతితో తడిపి వెంట్రుకలు మున్నగువానినందుండి మెలమెల్లగ విడ దీయవలయును. ప్రేవులనుసవరించి క్రిందుమీదుగలేక యథాస్థితముగ నుండునట్లు పదిల ముగ నుంచవలయును. మరియు రంధ్రములు పడియున్న ప్రేగులను గమనించి యారంధ్ర ములసమీపమున గండుచీమలను విడచి యారంధ్రములుగలచోట కరిపించవలయును. పిదప చీమలు రంధ్రములను మూసికొనునట్లు గట్టిగ కరచికొనినపిదప చీమతలలను మాత్రము త్రుంచి ప్రేగును మునుపటివలె నుండున ట్లునిచి సన్ననిసూదులచే తాను ఛేదించినగాయమును ఎప్పటివలె నుండునట్లు కుట్టవలయును.

### జాతోదకోదరములయందు శస్త్రప్రయోగము.

మూ. యథా జాతోదకం సర్వం ఉదరం వ్యథయేద్భిషక్,
వామపార్శ్వే త్వధో నాభేః నాడీం దత్వా చ గాలయేత్. 189
విస్రావ్య చ విమృజ్యైతత్ వేష్టయేద్వాససోదరమ్,
తథా వస్తివిరేకాద్యైః మ్లానం సర్వం చ వేష్టయేత్. 190

వ్యా. మరియు వాతాద్యుదరములయందును ఉపేక్షించుటచే నుదకము జనించి నపుడును పైజెప్పినరీతిగ నాభికి నాల్గంగుళములకు క్రిందిభాగమున కుక్షియందు వామ

భాగమున చీల్చి యాద్వారమునుండి నాడీయంత్రమును కుక్షిలోనికి ప్రవేశింపజేసి కుక్షిలో చేరియుండుజలమును స్రవింపజేసి, శుభ్రముగ తుడిచి యుదరమును సన్నని గుడ్డచే జుట్టవలెను. మరియు నేయుదరమందైనను వస్తిప్రయోగము విరేచనము మున్నగు చికిత్సల జేసినప్పుడును ఉదరము వాడితగ్గి యున్నపుడును ఇదేతీరున గుడ్డచే నుదరమును జుట్టవలెను. (అట్లుచేసినచో మరల నుదరము పైకి నుబ్బకుండునని భావము).

## జలోదరమున శస్త్రచికిత్సానంతరము ఆహారనియమము.

మూ. నిస్సృతే లఙ్ఘితః పేయామస్నేహాలవణాం పిబేత్,
అతః పరన్తు షణ్మాసాన్ క్షీరవృత్తిర్భవేన్నరః. 191
త్రీన్మాసాన్ పయసా పేయాం పిబేత్, త్రీంశ్చాపి భోజయేత్,
శ్యామాకం కోరదూషం వా క్షీరేణాఽలవణం లఘు. 192
నరస్సంవత్సరేణైవం జయేత్ ప్రాప్తం జలోదరం,

వ్యా. పైజెప్పినరీతిగ శస్త్రప్రయోగమువలన జలోదరమునందలి జలమంతయు నిశ్శేషముగ బైలువెడలిన పిదప రోగికి లంకణముచేయించి, స్నేహలవణముల కొంచెముగ జేర్చి పక్వముజేయబడిన పేయను త్రాగించవలెను. పిమ్మట నారుమాసములవరకును అన్నమును వర్జించి కేవలము ఆవుపాలను మాత్రము నాహారము చేయుచుండవలెను. పిమ్మట మూడుమాసములు ఆవుపాలను చేర్చి కాచబడిన పేయ యనుగంజిని త్రాగుచుండవలెను. అటుపిమ్మట మూడుమాసములు (ప్రాతవియగు) చామలనైనను కొఱ్ఱలనైనను కొంచెముగ నుప్పును స్నేహమును చేర్చి సిద్ధముచేయబడిన యన్నమును ఆవుపాలతో జేర్చి లఘువుగ భుజించవలెను. ఇత్తెరంగున నొకసంవత్సరకాలము పైజెప్పినరీతిగ పథ్యాహారము జేయుచున్నయెడ జలోదరము నివర్తించును.

## ఉదరములయందు క్షీరోపయోగప్రాశస్త్యము.

మూ. ప్రయోగాణాం చ సర్వేషాం అనుక్షీరం ప్రయోజయేత్. 193
దోషానుబన్ధరక్షార్థం బలస్థైర్యార్థమేవ చ.
ప్రయోగాఽపచితాఙ్గానాం హితం హ్యుదరిణాం పయః. 194
సర్వధాతుక్షయార్తానాం దేవానామమృతం యథా,

వ్యా. ఏవిధములైన చికిత్సల జేసినను అన్ని ప్రయోగములయందును చికిత్సజేసిన వెంటనే ఆవుపాలను రోగి కుపయోగింపనగును. క్షీరోపయోగమువలన శమించిన దోష

ములు మరల ననువ ర్తింపకుండును. శరీరమునందలి బలము స్థిరముగ నేర్పడును. ఆయాచికిత్సాప్రయోగములచే శరీరమునందలి రక్తమాంసములు శుష్కించి ధాతువు లన్నియు బలముడిగి క్షీణించియున్నపుడు రోగులకు పాలు దేవతల కమృతమునుబోలె బలకరమై యుండును. కావున ముఖ్యముగ నుదరరోగముచే బాధితులకు క్షీరోప యోగము చాల ప్రశస్తమని భావము.

అధ్యాయవిషయసంగ్రహము.

తత్రశ్లోకాః:—

మూ. హేతుం ప్రాగ్రూపమష్టానాం లిఙ్గం వ్యాససమాసతః,
ఉపద్రవాన్ గరీయస్త్వం సాధ్యాఽసాధ్యత్వమేవ చ. 195
జాతాఽజాతామ్బులిఙ్గాని చికిత్సాం చోక్తవానృషిః,
సమాసవ్యాసనిర్దేశైః ఉదరాణాం చికిత్సితే. 196

వ్యా. ఎనిమిదివిధములైన యుదరములకారణములును, పూర్వరూపములును సంగ్రహవిస్తరరూపముగను, వాని ఉపద్రవములు, వానిబలత్వతారతమ్యము, సాధ్యాఽసాధ్యః భాగము, జాతోదక-అజాతోదక లక్షణములు, వానిచికిత్స ఇవి యన్నియు సంగ్రహ-విస్తరనిర్దేశరూపముగ నీయుదరచికిత్సాధ్యాయమున ఋషివర్యులగు నగ్నివేశు లచే వివరింపబడినది.

ఇత్యగ్నివేశకృతే తన్త్రే చరకప్రతిసంస్కృతే, చికిత్సాస్థానే
ఉదరచికిత్సితం నామ త్రయోదశోఽధ్యాయః

ఇత్తెరంగున నగ్నివేశకృతంబును చరకప్రతిసంస్కృతంబును నగుచరకసంహితయను నాయుర్వేదతంత్రమునందలి చికిత్సాస్థానమున నుదరచికిత్సితమనునది త్రయోదశాధ్యాయము సమాప్తము.

---

## చతుర్దశాధ్యాయము.

అవతరణిక:—అర్శోరోగము ఉదరరోగమునుబోలె త్రిదోషజన్యము. మరియు బద్ధగుదోదరనిదానమున "ఉదావర్తైస్తథాఽర్శోభిః......జనయన్త్యుదరం తతః." (అధ్యాయము. ౧౩. శ్లో. ౩౯.) అని అర్శస్సు బద్ధగుదోదరమునకు నిదానముగ జెప్ప బడినది. కావున అట్టిసంబంధమునుబట్టి యుదరరోగచికిత్సానంతరము అర్శశ్చికిత్సితము చెప్పబడును:—(ఈయధ్యాయము చరకప్రతిసంస్కృతము.)

మూ. అథాఽతోఽర్శశ్చికిత్సితం వ్యాఖ్యాస్యామః. 1
ఇతి హ స్మాహ భగవానాత్రేయః. 2

వ్యా. ఉదరరోగచికిత్సితమును భగవానుడగు నాత్రేయు డుపదేశించినదానికన్న న్యూనాతిరేకము గాకుండ వివరించి చెప్పెదనని యర్థము.

అర్శోరోగము నుద్దేశించి యగ్నివేశుని ప్రశ్నము.

మూ. ఆసీనం మునిమవ్యగ్రం కృతజాప్యం కృతక్షణం,
పృష్టవానర్శసాం యుక్తం (ముక్తిం) అగ్నివేశః పునర్వసుః. 3

వ్యా. ఇతరకార్యాసక్తిలేక జపతపంబుల దీర్చికొని యుక్తమైన సమయమున సుఖముగ గూర్చొనియున్న మునివర్యుడైన యాత్రేయులను పునర్వసువను నామాంతరముకల యగ్నివేశులు అర్శోరోగములకు సంబంధించిన ప్రకోపకారణము మున్నగువిషయముల నరయుటకై వివరించి చెప్పుమని యడిగెను.

అర్శోరోగవిషయవిభాగము.

మూ. ప్రకోపహేతుం సంఖ్యానం స్థానం లిఙ్గం చికిత్సితం,
సాధ్యాఽసాధ్యవిభాగం చ తస్మై తన్మునిరబ్రవీత్. 4

వ్యా. అర్శస్సులయొక్క యుత్పత్తికారణములు, సంఖ్య, స్వరూపము, లక్షణములు, చికిత్స, సాధ్య-అసాధ్యవిభాగము అను నీవిషయములను అగ్నివేశునకు ఆత్రేయ మహర్షి యిట్లు చెప్పెను.

అర్శోరోగభేదవివరణము.

మూ. ఇహ ఖల్వగ్నివేశ! ద్వివిధాన్యర్శాంసి—కానిచిత్ సహజాని, కానిచిజ్జాతస్యోత్తరకాలజాని. తత్ర బీజం గుదవలీబీజోపతప్త మాయతనమర్శసామ్ సహజానామ్. తత్ర ద్వివిధో బీజోపతప్తౌ హేతుః—మాతాపిత్రోరపచారః, పూర్వకృతం చ కర్మ; తథాఽన్యేషామపి సహజానాం వికారాణామ్. తత్ర సహజాని సహజాతాని శరీరేణ, అర్శాంసీత్యధిమాంసవికారాః. 5

వ్యా. ఓయగ్నివేశా! అర్శస్సులు కొన్ని సహజములును (పుట్టుకతో కూడ జనించినవి), కొన్ని మనుజుడు పుట్టినవెనుక కొంతకాలమునకు మిథ్యాహారవిహారాదులవలన ప్రకోపమునొందిన వాతాదిదోషములచే కల్గినవియునై రెండుతెరంగుల నుండును. (అర్శ

స్సులు సహజములనియు, దోషజములనియుఁ రెండువిధములని యర్థము.) అందు శరీరోత్పత్తికి కారణమైన (తల్లిదండ్రుల) శుక్రార్తవరూపమైన బీజమునందలి గుదవలీప్రారంభక బీజభాగము తల్లిదండ్రుల మిథ్యాహారవిహారాదులచే ప్రకుపితములైన వాతాదిదోషములచే దుష్టమైయుండినయెడ అట్టిబీజభాగముతోఁ గూడిన శుక్రార్తవరూపమైన బీజములు సహజార్శస్సులకు కారణమగును. అట్టి గుదవలీబీజభాగము దుష్టమగుటకు తలిదండ్రులు మిథ్యాహారవిహారరూపమైన యపచారముచేయుటయు, జన్మము నెత్తునట్టి పురుషుడు ముందటిజన్మమున జేసిన (సహజార్శోనిర్వర్తకమైన) కర్మవిశేషంబును కారణమగును.) అందు జన్మాంతరకృతకర్మవిశేషము అల్పబలముగ నున్నచో తలిదండ్రులయపచారము నపేక్షించి అట్టియపచారమువలన బలిష్ఠమై, వళులను గల్గించు బీజభాగమును చెరచుటకు సమర్థమగును. అటుగాక జన్మాంతరకర్మము మిక్కిలి బలిష్ఠముగ నుండునెడ తలిదండ్రులయపచారము నపేక్షింపకయే స్వతంత్రముగ కారణమగును.)

మరియు పైజెప్పిన బీజభాగదుష్టికారణములైన తల్లిదండ్రులయపచారంబును జన్మాంతరకృతకర్మవిశేషంబును కేవలము అర్శస్సులకే కాక యితర సహజరోగములకును కారణములగును. అట్టిరోగము లెవ్వియైనను పైజెప్పినరీతిగ బీజదోషమునంజేసి జన్మకాలముననే శరీరమున సంక్రమించి శరీరముతోఁ గూడ పుట్టుటంజేసి సహజములని చెప్పబడును. అందు అధిమాంసరూపమై గుదవళులయందు మామూలుగ నుండవలసిన దానికన్న నధికముగ మాంసము పెరిగియుండునది అర్శస్సు లనబడును. (మాంసాంకురములనుట.)

ఇచ్చట నీవివరణము నెరుంగునది:—లోకమున గర్భోత్పత్తికి తలిదండ్రులశుక్రార్తవము ప్రధాన (ఉపాదాన)కారణమగును. అట్టి శుక్రశోణితములు భుజింపబడు మధురాదిషడ్రసభూయిష్ఠమైన యాహారముచే రసరక్తాదిధాతుక్రమముగ సంభవించును. ఈ విషయమునే వాగ్భటాచార్యు లిట్లుపదేశించిరి:—"సారస్తు సప్తభిర్భూయో యథాస్వం పచ్యతేఽగ్నిభిః, రసాద్రక్తం తతో మాంసం మాంసాన్మేదస్తతోఽస్థి చ, అస్థ్నో మజ్జా తతశ్శుక్రం శుక్రాద్గర్భః ప్రజాయతే." (అ. హృ. శా. అ. 3.) అట్టి గర్భోత్పాదకబీజమగు శుక్రశోణితసముదాయమునందు శరీరమునందలి యంగప్రత్యంగములలో నాయాయవయవవిశేషములగల్గించు సుసూక్ష్మాంశములు చేరియుండును. అట్టి బీజములో నేయవయవమును గల్గించు సూక్ష్మభాగము తల్లిదండ్రుల మిథ్యాహారవిహారములంజేసి ప్రకుపితములైన వాతాదిదోషములచే దుష్టమగునో అట్టి సూక్ష్మభాగముతోఁ గూడిన బీజముచే గల్గినశిశువుకు ఆయంగమునకు సంబంధించినరోగము పుట్టుకతోడనే

తప్పక సంభవించును. ఈవిషయము శారీరమున నిట్లు చెప్పబడినది:—"యస్య యస్య హ్యావయవస్య బీజే బీజభాగే వా దోషాః ప్రకోపమాపద్యన్తే తం తమవయవం వికృతి రావిశతి." (చరక. శా. అ. ౪. సూ. ౪౫.) మరియు జనించు ప్రాణిపూర్వజన్మమున నేవ్యాధిజనించుటకు కారణభూతమగుకర్మమును జేసియుండునో అట్టి కర్మపరిపాకవశ మునంజేసియు మనుజులకు పుట్టుకతోడనే ఆయారోగములు సంభవించును.

పైజెప్పినరీతిగ బీజదోషంబును పూర్వజన్మకృతకర్మంబును సహజదోషముల కన్నిం టికిని కారణములగును. ప్రకృతమున గుదవళ్యారంభకబీజభాగము వాతాదిదోషదుష్ట మగుటచేతను కర్మపరిపాకవశమునంజేసియు పుట్టుకతో గూడ నర్శోరోగము జనించి నచో నయ్యది సహజార్శోరోగమని పేర్కొనంబడును. అర్శోరోగహేతువగు కర్మ విశేష మిట్లు తంత్రాంతరమున జెప్పబడినది:—"దత్వాతు వేతనం యోఽధ్యేత్యాదా యాపిచ వేతనమ్, అధ్యాపయేచ్ఛ జుహుయాత్ జపేద్వార్శోయుతో భవేత్." జీత మిచ్చి వేదాధ్యయనముచేసినను, అధ్యయనము పాఠముచెప్పినను, కూలికి హోమముచేసి నను అర్శోరోగము సంభవించునని భావము. ఇత్తెరంగున సహజార్శోరోగమునకు తలిదండ్రుల బీజదోషంబును జన్మాంతరకృతకర్మవిశేషంబును కారణములని నిరూపింప బడినది.

## అర్శోరోగము జనించుస్థానములు, దూష్యములును.

మూ. సర్వేషాం చ అర్శసాం క్షేత్రం—గుదస్యార్ధపఞ్చమాఙ్గుళావ కాశే త్రిభాగాన్తరాస్తిస్రో గుదవళయః (క్షేత్రమితి దేశః), కేచిత్తు భూయాంసమేవ దేశముపదిశన్త్యర్శసామ్— శిశ్న మపత్యపథం గళతాలుముఖనాసికాకర్ణాఽక్షివర్త్మాని త్వక్చ. తద స్త్వధిమాంసదేశతయా, గుదవళీజానాం (ని) త్వర్శాంసీతి సంజ్ఞా తన్త్రేఽస్మిన్. సర్వేషాం చ అర్శసాం అధిష్ఠానం— మేదో మాంసం త్వక్చ. 6

వ్యా. నాల్గున్నర అంగుళము పరిమాణముకల గుదస్థానమునందలి యట్టి గుదపరి మాణములో మూడవవంతు (ఒకటిన్నరఅంగుళము) పరిమాణము మధ్యభాగము (ఒక్కొ-క దానికి) కలవళులు (ముడతలు) మూడును, పైజెప్పిన (నిజ-ఆగంతు) అర్శస్సులు జనించు టకు స్థానముగ నుండును. కొందరాచార్యులు శిశ్నంబును, ప్రసూతిమార్గంబును, కుత్తు కయు, తాలువులును, నోరును, నాసికయు, చెవులును, కనురెప్పలును, శరీరమునందలి

త్వక్కును అర్శస్సులు జనించుటకు స్థానములగునని య నేకస్థానముల జెప్పెదరు. అపత్య మార్గాదిస్థానముల బుట్టినవి కేవలము అధిమాంసములు (మాంసపు మొలకలు) అనియు, గుదస్థానమునందలి వళులమూటిలో బుట్టినమాంసాంకురములకు అర్శస్సులనియు నీతంత్ర మున సంజ్ఞ. అట్టి యర్శస్సుల కన్నిటికిని మేదస్సును మాంసంబును చర్మంబును అధిష్ఠా నము (దూష్యములు) అగును.

## సహజార్శస్సులస్వరూప-వర్ణ భేదములు.

మూ. తత్ర సహజాన్యర్శాంసి కానిచిదణూని, కానిచిన్మహాన్తి, కాని చిద్దీర్ఘాణి, కానిచిద్ధ్రస్వాని, కానిచిద్వృత్తాని, కానిచిద్విషమవిసృ తాని, కానిచిదన్తఃకుటిలాని, కానిచిద్బహిఃకుటిలాని, కానిచి జ్జటిలాని, కానిచిదన్తర్ముఖాని; (తాని) యథాస్వం దోషాను బన్ధవర్ణాని. 7

వ్యా. ఆయర్శస్సులలో సహజార్శస్సులు కొన్ని చిన్నవిగను, కొన్ని పెద్దవిగను, కొన్ని నిడుదలుగను, మరికొన్ని పొట్టివిగను, కొన్ని గుండ్రముగను, కొన్ని వంకరటింక రగ వ్యాపించినవిగను, కొన్ని లోపలికి వంకరగ వంగినవియు, కొన్ని వెలుపలికి వంకరగ వంగినవియు, కొన్ని గరికవలె ననేకములుగ వేళ్లుబారి వ్యాపించినవియు, కొన్ని లోప లికి వ్యాపించినముఖములు (కొసలు) కల్గినవియు నైయుండును. మరియు నయ్యవి వాతాదిదోషములలో నేయేదోషమున కల్గియుండునో ఆయాదోషమునకు స్వభావసిద్ధ మైన నీలపీతాదివర్ణములు కల్గియుండును.

## సహజార్శోలక్షణములు.

మూ. తైరుపహతః జన్మప్రభృతి భవత్యతికృశః వివర్ణః క్షామో, దీనః, ప్రచురవిబద్ధవాతమూత్రపురీషః, శర్కరాశ్మరీమాన్; తథాఽనియ తవిబద్ధముక్తపక్వామశుష్కభిన్నవర్చాః, అన్తరాన్తరా శ్వేతపాణ్డు హారితపీతరక్తాఽరుణతనుసాన్ద్రపిచ్ఛిలకుణపగన్ధ్యామ పురీషోపవేశీ, నాభివస్తివంక్షణోద్దేశే ప్రచురపరికర్తికాన్వితః, సగుదశూల ప్రవాహికాపరిహర్ష ప్రమేహప్రసక్తవిష్టమ్భాన్త్రకూజోదావర్త హృదయేన్ద్రియోపలేపః, ప్రచురవిబద్ధతిక్తామ్లోద్గారః, సుదు ర్బలః, సుదుర్బలాగ్నిః, అల్పశుక్రః, క్రోధనో, దుఃఖోపచారశీలః, కాసశ్వాసతమక తృష్ణాహృల్లాసచ్ఛర్ద్యరోచకాఽవిపాకపీనస

క్షవథుపరీతః, తైమిరికః, శిరశ్శూలీ, క్షామభిన్నసన్నసక్తజర్జరస్వరః, కర్ణరోగీ, శూనపాణిపాదవదనాఽక్షికూటః, సజ్వరః, సాఙ్గమర్దః, సర్వపర్వాస్థిశూలీ చ, అన్తరాఽన్తరా పార్శ్వకుక్షివస్తిహృదయపృష్ఠత్రికగ్రహోపతప్తః, ప్రధ్యానపరః, పరమాలసశ్చేతి.

జన్మప్రభృత్యస్య గుదజైరావృతః మార్గోపరోధాత్ (గుదమార్గోపరోధాత్) వాయురపానః ప్రత్యారోహన్ సమానవ్యానప్రాణోదానాన్ పిత్తశ్లేష్మాణౌ చ ప్రకోపయతి. ఏతే సర్వ ఏవ ప్రకుపితాః పఞ్చ వాయవః పిత్తశ్లేష్మాణౌ చ అర్శసమభిద్రవన్తః ఏతాన్వికారానుపజనయన్తి. ఇత్యుక్తాని సహజాన్యర్శాంసి. ౪

వ్యా. పైజెప్పిన సహజార్శస్సులచే పీడింపబడిన మనుజుడు పుట్టిననాటంగోలె శరీరము మిక్కిలి కృశించి వర్ణము మారి మిక్కిలి బడలికజెంది మనస్సు దీనమై యుండును. అపానవాతంబును మూత్రపురీషంబులును మిక్కిలి వృద్ధినొంది బద్ధగింపబడి యుండును. మూత్రమున శర్కరయు అశ్మరియు కల్గియుండును. మలము ఒకవిధమైన నియమములేక యొకప్పుడు బద్ధగించియు, ఒకప్పుడు వెడలుచు నుండును. ఒకప్పుడు పక్వముగను వేరొకప్పుడు పక్వముకాకయు, ఒకప్పుడు ఎండియు మరియొకప్పుడు భిన్నముగను వెడలును. మరియు తెలుపు, పాండువర్ణము, ఆకుపచ్చనిరంగు, పసుపురంగు, రక్తవర్ణము, అరుణవర్ణము, అను నీవర్ణములు అప్పుడప్పుడును నియమములేక మారుచు, ఒకప్పుడు పలుచనయ్యును, ఒకప్పుడు చిక్కనయ్యును, ఒకప్పుడు జిగటగను, శవగంధము కల్గియు, పక్వముకాని మలము అప్పుడప్పుడును వెడలును. నాభియందును వస్తియందును గొజ్జలయందును కత్తెరతో కత్తిరించువిధముగ బాధ యధికముగ కల్గును. గుదస్థానమున శూలంబును, ప్రవాహికయును, రోగంబును, గగురుపాటును, ప్రమేహంబును, మలమూత్రబంధమును, ప్రేవులలోకూతలును, ఉదావర్తంబును, హృదయస్థానంబునను ఇంద్రియస్థానములయందును ఉపలేపంబును కల్గియుండును. మరియు చేదును పులుపును కలత్రేనుపులు విశేషముగ వెడలును. శరీరబలంబును అగ్నిబలంబును నశించును. శుక్రము క్షీణించును. క్రోధ మధికమగును. కష్టమును కల్గించు నుపచారములకు కారణ మగును. కాసము, శ్వాసము, తమకశ్వాసము, దప్పి, ఓకళింతలు, వాంతి, అరోచకము, అజీర్ణము, పడిసెము, తుమ్ములు అను నీవ్యాధులు యథాసంభవముగ గల్గును. చీకటిలో నున్నట్లు కన్నులు కానరాకుండును. తలనొప్పి కల్గును. కంఠస్వరము హీనంబును పగిలిన

కంచు మ్రోగినవిధంబును, అడ్డుతగిలినదియు, మిగులసూక్ష్మంబును నై డగ్గుత్తికతో వెడలును. చెవిలో కర్ణనాదము మొదలగు కర్ణరోగములు కల్గును. హస్తపాదములయందును మొగమునందును కన్గొనలయందును వాపుకల్గును. జ్వరంబును సర్వావయవములయందు నొప్పియు, సంధిబంధము లన్నిటియందును, అస్థులయందును పోటును పుట్టును. ఇరుప్రక్కలయందును, కుక్షియందును, వస్తియందును, హృదయమునందును, వీపునందును, త్రిక (వెన్నెముకకును పృష్ఠభాగమునకును సంధిప్రదేశ)మునందును, బిగదీసినట్టు లప్పుడప్పుడును నొప్పికల్గును. మనస్సున నేదో చింతింపుచు సామాన్యవిషయములయందు వ్యాపించకయుండును. పనులయందు మిక్కిలి మందుడై యుండును. (ఈలక్షణములన్నియు సహజార్శోరోగమున గల్గును).

మరియు:—ఈరోగికి పుట్టుక మొదలుజేసి గుదస్థానము మాంసాంకురములచే నావరింపబడియుండును; అట్లు గుదమార్గము అడ్డగింపబడుటవలన నపానవాతము బైట వెడలక వెనుకకు మరలి తక్కిన సమాన-వ్యాన-ప్రాణ-ఉదానవాతముల నాల్గిటిని, పిత్త-కఫములరెంటిని ప్రకోపము నందించును. ఇత్తెరంగున ప్రాణాదిభేదములచే నైదుతెరంగులైన వాతంబును పిత్తకఫంబులును ప్రకుపితములై పైజెప్పబడిన యుపద్రవముల గల్గించును. ఈరీతిగ సహజార్శోరోగలక్షణములు విస్తరముగ వివరింపబడినవి. (పైజెప్పిన రీతిగ ప్రాణాదిపంచవాతంబులును ప్రకోపించుటంజేసి వాతరోగంబులును, పిత్త-కఫ ప్రకోపమువలన పిత్తకఫరోగంబులును సమకాలమున వ్యాపించి అర్శోరోగము కలవానిని బాధించునని పైవివరణముచే నేర్పడును.)

## దోషజార్శోనిదానము, సంప్రాప్తియు.

మూ. అత ఊర్ధ్వం జాతస్యోత్తరకాలజాని వ్యాఖ్యాస్యామః.—గురు మధురశీతాఽభిష్యన్ది విదాహి విరుద్ధాఽజీర్ణ ప్రమితాఽశనాఽసాత్మ్యభోజనాత్, గవ్యమాత్స్యవారాహమాహిషాఽజాఽవిక పిశితభక్షణాత్, కృశశుష్కపూతిమాంసపైష్టికపరమాన్నక్షీర (మోదక) దధిమణ్డతిలగుడవికృతిసేవనాత్, మాషయూషేక్షురసపిణ్యాక పిణ్డాలుకశుష్కశాకశుక్తలశున కిలాటతక్రపిణ్డకబిస మృణాళశాలూకక్రౌఞ్చాదనకశేరుకశృఙ్గాటక తరూటవిరూఢ నవశూకశిమ్బీధాన్యామమూలకోపయోగాత్, గురుఫలశాకరాగహరితకమర్దకవసాశిరస్పద పర్యుషితపూతిశీతసఙ్కీర్ణాఽన్నాఽ

భ్యవహారాత్, మన్దకాతిక్రాన్తమద్యపానాత్, వ్యాపన్నగురుసలిలపానాత్, అతిస్నేహపానాత్, అసంశోధనాత్, వస్తికర్మవిభ్రమాత్, అవ్యాయామాత్, అవ్యవాయాత్, దివాస్వప్నాత్, సుఖశయనాసనస్థోపసేవనాచ్చ ఉపహతాగ్నేః మలోపచయో భవత్యతిమాత్రమ్;

తథోత్కటుకవిషమకఠినాసనసేవనాత్, ఉద్భ్రాన్తయానోష్ట్రయానాత్, అతివ్యవాయాత్, వస్తినేత్రాఽసమ్యక్ప్రణిధానాత్, గుదక్షణనాత్, అభీక్ష్ణం శీతామ్బుసంస్పర్శాత్, చేలలోష్టతృణాదిఘర్షణాత్, ప్రతతాఽతినిర్వాహణాత్, వాతమూత్రపురీషవేగోదీరణాత్, సముదీర్ణవేగవినిగ్రహాత్, స్త్రీణాం చామగర్భభ్రంశాత్, గర్భోత్పీడనాత్, విషమప్రసూతిభిశ్చ ప్రకుపితో వాయురపానః, తం మలముపచితం అధోగమమాసాద్య గుదవలిష్వాధత్తే; తతస్తాస్వర్శాంసి ప్రాదుర్భవన్తి. 9

వ్యా॰ మనుజుడు జనించినపిదప దోషప్రకోపముచే గల్గునర్శోరోగము లీక్రింద వివరింపబడును:—గురుత్వము గల్గించునవియు మధురరసంబును, శీతవీర్యంబును: గల్గినవియు; అభిష్యందియు (రసవహంబులగు స్రోతస్సుల నడ్డగించి శరీరమున గురుత్వము గల్గించునది.) విదాహియు (మంటబుట్టించు ఆవాలు మున్నగునవి) నగునాహారపదార్థముల భుజించుట; పరస్పరసంయోగాదివిరుద్ధములగు క్షీరమత్స్యాదుల నొకటిగ జేర్చి భుజించుట, జీర్ణము కాకుండునపుడు భుజించుట, తనకు కావలసిన పరిమితికన్న కొంచెముగ భుజించుట, తన కలవాటులేని పదార్థముల భుజించుట; గోవులు, మత్స్యములు, పందులు, ఎనుబోతులు, గొఱ్ఱెలు, పొట్టేళ్లు, అనునీజంతువులమాంసములను తినుట; కృశించిన జంతువులమాంసమునైనను ఎండినమాంసమునైనను, దుర్గంధముకలమాంసమునైనను తినుట; పిండితోచేయబడినభక్ష్యములను, పాయసమును, పాలను మోదకముల (కుడుముల)ను, పెరుగుమీగడను, నువ్వులనైనను, బెల్లమునైనను, జేర్చి చేయబడిన భక్ష్యాదులను సేవించుట; ఉద్దిపప్పుయూషము (కట్టు)ను, చెరకురసమును, తెలికపిండిని, పెండలపుగడ్డను, ఎండిన యాకుకూరలను, శుక్తమును (పులిగంజిని), ఉల్లిపాయలను, కిలాటమును (పాలలో పెరుగునుకలిపి పక్వము జేసిన నందేర్పడు ఘనభాగము కిలాటమనంబరగు), తక్రపిండమును (పైజెప్పినవిధముగ పాలలో మజ్జిగను కలిపి పక్వము జేసినచో నేర్పడు ఘనభాగము)ను;

తామరకాడలను, తామరమొదలగు వాని దుంపలను, క్రౌంచాదనమును, (స్వనామప్రసిద్ధము), కశేరుకమును (నమ్మదుంప=నిమ్మటాయి), శృంగాటకమును (సింగాణిదుంపలు), తరూటమును (స్వనామప్రసిద్ధము), మొలకలెత్తిన ధాన్యమును, క్రొత్తధాన్యమును, శూకధాన్యమును, పెసలు, సెనగలు, మొదలగుకాయధాన్యములను; పచ్చిముల్లంగిని, వీనినెల్ల విశేషముగ సేవించుట; గురుగుణము కలపండ్లను, శాకములను, వ్యంజనములను, రాగములను (చక్కెర మున్నగు మధురద్రవ్యముల జేర్చి సంస్కరింపబడి ద్రవరూపమైన ద్రాక్షదానిమ్మరసముల గూర్చినద్రవరూపమైన పానకవిశేషము రాగమనబడును.) ఆకుకూరను, మర్దకమను శాకవిశేషమును, వస(మాంసస్నేహము)ను, జంతువులశిరస్సు, పాదముల యందలి మాంసమును, పర్యుషితాన్నమును (చలిదియన్నమును), దుర్గంధముతో గూడిన యన్నమును చల్లనియన్నమును, సంకీర్ణాన్నమును (విరుద్ధమాంసాదులతో గూడినయన్నము సంకీర్ణము), వీనిని విశేషముగ భుజించుట; మందీభూతములగు గుణాదుల గల్గి ప్రాతదియగుమద్యమును, చెడినదియు, గురుగుణము కల్గినదియు, నగు జలమును త్రాగుట; స్నేహద్రవ్యములను అధికముగ పానముచేయుట, వమన విరేచనాదిశోధనముల నవసరమైనపుడు ఆచరించక యుండుట, వస్తికర్మమును శాస్త్రవిధికి వ్యత్యస్తముగ జేసికొనుట, విధిప్రకారము శరీరవ్యాయామమును జేయకుండుట, యుక్తకాలమున స్త్రీసంభోగము జేయకుండుట, పగలు నిదురించుట, శరీరమునకు ఏవిధమైనవ్యాపారమును లేక శయ్యపై పరుండియైనను ఆసనములపై కూర్చొనియుండియైనను సుఖముగ నుండుట; ఈకారణములచే జఠరాగ్ని మందగించి మలము విశేషముగ వృద్ధినొందును. (పైజెప్పినకారణములచే మలము వృద్ధినంది నానాటిమలముబైట పూర్తిగ వెడలక ప్రాతమలము సంచితమగునని భావము.)

మరియు:—మిక్కిలి యున్నతంబును, నిమ్నోన్నతంబును, కఠినంబును నైన పీట మున్నగునాసనములపై గూర్చొని యుండుట; సవారిచేయునపుడు పైకి నెగరవేయు గుఱ్ఱము మొదలగువానిపై నెక్కియైనను వెనుకకుముందుకు పలువిధముల కదలించు స్వభావముకల యొంటెలపై నెక్కియైనను సవారిచేయుట, అధికముగ స్త్రీసంభోగముచేయుట, వస్తికర్మమును జేసికొనునపుడు వస్తియంత్రపుగొట్టమును విధ్యుక్తప్రకారము గాక వ్యత్యస్తముగ గుదమున ప్రవేశింపజేయుట, గుదస్థానమున నొరపిడి కల్గుట, గుదస్థానమున చల్లనినీళ్లతో స్పర్శమధికముగ కల్గుట, బట్టలు, మట్టిపెళ్లలు, గడ్డిపోచలు మున్నగువానిచే గుదస్థానమున రాపిడి కల్గుట; మలమును విసర్జించునపుడు అధికముగను, మిక్కిలి దీర్ఘకాలముగను, బలాత్కారముగ ముక్కుట, అపానవాత-మూత్ర-పురీషములు వెడలనున్నపుడు వానిని వెడలనియ్యక వేగమును నిరోధించుట,

అయ్యవి వెడలుటకు వేగము జూపకున్నపుడు బలవంతముగ వాతమూత్రపురీషముల వెడలింపజూచుట, స్త్రీలకు గర్భము నవమాసములు పూర్తికాకుండునపుడే గర్భము జారి పడిపోవుట, గర్భమునకు సంఘర్షణము కల్గుట, ప్రసవకాలమున గర్భము క్రమముగ వెడలక క్రమము దప్పి విషమముగ ప్రసవమగుట, అనునీకారణములచేత నపానవాతము ప్రకోపము జెంది పైజెప్పినరీతిగ సంచితమైన మలమును అథోమార్గమున మరలించి గుద స్థానమునందలి వళులలో ముడతలతో జేర్చును. పిమ్మట దానంజేసి యాగుదవళులయందు అర్శస్సులు (గుదాంకురములు) కల్గును.

ఇచ్చట "స్త్రీణాం చామగర్భ......ప్రసూతిభిశ్చ" అని చెప్పిన కారణములు స్త్రీలకు మాత్రము సంబంధించినవనియు, తక్కిన ఉత్కటుకాసనాది కారణము లన్నియు స్త్రీపురుషసామాన్యముగ జెప్పబడినవనియు నెరుంగునది. మరియు "రాగహరితక" అను చోట రాగలక్షణము తంత్రాంతరమునందలి యీవాక్యముచే దెలిసెడి:— "సితామధ్వాది మధురో ద్రాక్షాదాడిమజో రసః, విరళశ్చేత్కృతో రాగః; సాన్ద్రశ్చేత్ షాడబస్స్మృతః." ద్రాక్షపండ్లరసమునందును, దానిమ్మపండ్లరసమునందును, చక్కెర తేనె మున్నగువానిని జేర్చి ద్రవరూపముగ జేయబడిన పానకము రాగమనియు, దానినే ముద్దయగునట్లు పక్వము చేసిన నయ్యది లేహరూపమై షాడబ మనబడుననియు నర్థము. రాగషాడబ పదముల ప్రసక్తి కల్గిన స్థలములయందెల్ల నీలక్షణము నెరుంగునది.

## అర్శస్సామాన్యలక్షణములు.

మూ. సర్షపమసూరమాషముద్గమకుష్ఠకయవక లాయపిణ్డిటిణ్టికేరకేబుక
తిన్దుకకర్కన్ధుకాకణన్తికా బిమ్బీబదరకరీరోదుమ్బర ఖర్జూర
జామ్బవగోస్తనాఙ్గుష్ఠకశేరు శృఙ్గాటక శృఙ్గీదక్షశిఖిశుకతుణ్డ
జిహ్వాపద్మముకుళకర్ణికాసంస్థానాని, సామాన్యాద్వాత-పిత్త-కఫ
ప్రబలాని. 10

వ్యా. వాత-పిత్త-కఫములు ప్రబలములుగ నుండి సంభవించిన గుదాంకురములు ఆవాలు, చిరుసెనగలు, ఉద్దులు, పెసలు, ఆడవిగోధుమలు, యవలు, ఋటానులు, బటానులజాతిలో జేరిన పిండియనుధాన్యపుగింజలు, టెంటికేర-వెణుతురుకాయలు, కెబుకము, తుమికికాయలు, రేగుకాయలు, గురిగింజలు, దొండపండు, పెద్దరేగుకాయలు, వెదురు మోవులు, మేడిపండ్లు, ఖర్జూరపుకాయలు, నేరేడుపండ్లు, ద్రాక్షపండ్లు, బొటనవ్రేలు, నమ్మదుంప (నిమ్మటాయి), నాగేటిచాలుండుప, వీనిని బోలినయాకారము కల్గియైనను; దుప్పియొక్కయు కోడియొక్కయు నెమలియొక్కయు చిలుకయొక్కయు ముఖము

లను నాలుకలను బోలియైన నుండును. ఇయ్యవి వాత-పిత్త-కఫములు ప్రబలములుగ నుండి జనించిన యర్శస్సులకు సామాన్యములుగ నుండు ఆకృతిభేదములు.

## అర్శోవిశేషలక్షణములు; అందు వాతికార్శోలక్షణములు.

మూ. తేషామయం విశేషః:—శుష్కమ్లానకఠినపరుషరూక్షశ్యావాని, తీక్ష్ణాగ్రాణి, స్ఫుటితముఖాని, విషమవిసృతాని, శూలాక్షేప తోదస్ఫురణచిమిచిమా సంహర్ష పరీతాని, స్నిగ్ధోష్ణోపశయాని, ప్రవాహికాధ్మాన శిశ్నవృషణవస్తి వఙ్క్షణహృద్గ్రహాఽఙ్గమర్ద హృదయద్రవప్రబలాని, ప్రతతవిబద్ధవాతమూత్రవర్చాంసి, ఊరుకటీపృష్ఠత్రికపార్శ్వకుక్షివస్తిశూల శిరోఽభితాపక్షవథూ ద్గార ప్రతిశ్యాయ కాసోదావర్తాయామశోష శోథమూర్ఛాఽ రోచకముఖవైరస్యతైమిర్యకణ్డూనాసాకర్ణశఙ్ఖ శూలస్వరోప ఘాతకరాణి, శ్యావారుణపరుషనఖనయనవదన త్వఙ్మూత్రపురీషస్య వాతోల్బణాన్యర్శాంసీతి విద్యాత్. 11

వ్యా. పైసూత్రముచేత అర్శస్సులకు త్రిదోషసామాన్యముగ నుండు లక్షణములు చెప్పబడినవి. ఇక వానికి సంబంధించి వాతాదులచే వేరువేరుగ గల్గు లక్షణనిదానము లీక్రింద ప్రత్యేకముగ వివరింపబడును:—అందు వాతాధిక్యముచే గల్గిన యర్శస్సులు ఎండినవిగను వాడినవిగను కఠినములుగను కర్కశములుగను రూక్షములుగను శ్యామవర్ణములుగను వాడిగలకొనలు గల్గినవియు వంకరటింకరగను చిట్లినముఖములు కల్గినవిగను వ్యత్యస్తముగ వ్యాపించినవిగను నుండును. మరియు నవి పోటును కంపమును సూదుల గ్రుచ్చినరీతిగ బాధయు కల్గి అదరుచు చిమచిమలాడుచు అదరుపాటు గల్గియుండును. స్నిగ్ధంబులును ఉష్ణంబులును నగు ద్రవ్యముల యుపయోగముచే కొంచెము సుఖముగ నుండును. ప్రవాహికయనురోగము (బంకవిరేచనములను), కడుపుబ్బరమును, మేఢ్రమునందును వృషణములయందును వస్తి (మూత్రకోశము) యందును గెజ్జల యందును హృదయమునందును పట్టినట్టులు బాధను, ఒడలి నొప్పులను, హృదయమున ద్రవమును, వీని నన్నింటెని ప్రబలముగ గల్గించును. అపానవాతమును మూత్రపురీషములను మిక్కిలి బద్ధగించును. తొడలు నడుము వీపు త్రికము (వెన్నెముకకును నడుముకును సంధిభాగము) ఇరుప్రక్కలు కుక్షిమూత్రాశయము పొత్తికడుపు ఈస్థలముల యందు శూలమును కల్గించును. శిరస్సున సంతాపము, తుమ్ములు, త్రేనుపులు, పడిశము,

నగ్గు, ఉదావర్తము, ఆయామ (ఈడుపు) వాతము, ధాతుక్షయము, వాపు, మూర్ఛ, అరోచకము, నోటికి రుచి మారియుండుట, తిమిరమను నేత్రరోగము, దురద, ముక్కునందును చెవులయందును రెజ్జలయందును శూలము, స్వరభంగము, అను నీబాధల గల్గించును.

మరియు నీవాతార్శోరోగము కలవానికి గోళ్లు, కన్నులు, ముఖము (నోరు), చర్మము, మూత్రము, పురీషము, ఇవియన్నియు శ్యావారుణవర్ణంబులును కర్కశంబులు నైయుండును. పైజెప్పిన లక్షణముల నన్నిటిసిబట్టి వాతము ప్రబలముగ ప్రకోపము నొందుటచే గల్గిన యర్శస్సులని యెరుంగునది.

## వాతార్శోనిదానము.

భవతశ్చాత్ర:—

మూ. కషాయకటుతిక్తాని రూక్షశీతలఘూని చ,
ప్రమితాల్పాశనం తీక్ష్ణమద్యమైథునసేవనమ్. 12
లఙ్ఘనం దేశకాలౌ చ శీతౌ వ్యాయామకర్మ చ,
శోకో వాతాతపస్పర్శః హేతుర్వాతార్శసాం మతః. 13

వ్యా. కషాయ-కటు-తిక్తరసములు కలపదార్థములను రూక్షంబులును శీతవీర్యంబులు నగుపదార్థములను భుజించుట, లఘుగుణము కల పదార్థముల దినుట, మిక్కిలి స్వల్పముగ భుజించుట, మిక్కిలి తీక్ష్ణమైన మద్యమును త్రాగుట, స్త్రీసంభోగము నధికముగ జేయుట, లంకణముండుట, ఈకారణములచేతను, స్వభావముచేతనే మిక్కిలి శీతముకల దేశకాలములయందును, దేహపరిశ్రమమును అధికముగ చేయుట, దుఃఖము గాలియు ఎండయు నధికముగ శరీరమునకు సోకుట, ఈకారణములచేతను వాతము ప్రకోపము నొంది యర్శోరోగమును కల్గించును.

ఇచ్చట ఆతపము (ఎండ) "ఆతపః కటుకో రూక్షః" అనువాక్యముచే రూక్ష గుణము కల్గియుండునని తెలియుచున్నది. కావున అట్టిరూక్షగుణముచే వాతమును ప్రకోపింపజేసి యర్శస్సులకు హేతువగునని యెరుంగునది.

## పైత్తికార్శోలక్షణములు.

మూ. తత్ర యాని మృదుశిథిలసుకుమారాణి, అస్పర్శసహాని, రక్త-
పీత-నీలకృష్ణాని, స్వేదోపక్లేదబహులాని, విస్రగన్ధీని తనుపీతరక్త
స్రావీణి, రుధిరవహాని, దాహ - కణ్డూ - శూల-నిస్తోద - పాకవన్తి,

శీతోపశయాని సంభిన్న పీతహారితవర్చాంసి, పీత-విస్రగన్ధి ప్రచుర విణ్మూత్రాణి, పిపాసా-జ్వర-తమక-సమ్మోహ-భోజనద్వేషకరాణి, పీతనఖ నయన త్వఙ్మూత్ర పురీషస్య పిత్తోల్బణాన్యర్శాంసీతి విద్యాత్. 14

వ్యా. పిత్తం బధికముగ ప్రకోపించి జనించిన యర్శస్సులు మెత్తనై శిథిలములై కోమలములుగ నుండును. స్పర్శము నోరువజాలకుండును. రక్తవర్ణంబైనను పచ్చని రంగైనను నీలవర్ణంబైనను నల్లనిరంగైనను కల్గియుండును. చెమటయు ద్రవంబును అధిక ముగ నుండును. ఆమగంధము కల్గియుండును. మిగుల సూక్ష్మాకారములై పచ్చనిరంగుతో నైనను ఎరుపుతోనైనను కూడిన ద్రవమును స్రవించును. లేక ఒకప్పుడు రక్తమును స్రవించుచుండును. మంటయు దురదయు పోటును శూలనొప్పియు కల్గి పక్వములై పుండగును. శీతస్పర్శముచే కొంచెము శమించుస్వభావము కల్గియుండును. ద్రవీభూతమై పచ్చనిరంగైనను ఆకుపచ్చని రంగైనను కల మలమును వెడలించును. మలమూత్రములు పీతవర్ణంబుతోకూడిన ఆమగంధంబును విశేషముగ కల్గియుండును. అట్టి యర్శస్సులచే పీడింపబడిన మనుజునకు దప్పియు జ్వరంబును కల్గును. చీకటిలోనున్నవిధముగ కన్నులు బూచులు గ్రమ్మును. మూర్ఛయు ఆహారముపై ద్వేషంబును కల్గును. వానిగోళ్లును కన్ను లును చర్మంబును మూత్రపురీషంబులును పచ్చగ నుండును. ఈలక్షణములతో గూడినవి పిత్తాధిక్యముచే సంభవించిన యర్శస్సులని యెరుంగునది. (ఇచ్చట 'తనుపీతరక్త స్రావీణి' అనుచోట రక్తశబ్దమునకు ఎరుపురంగుకల ద్రవము అని యర్థము. 'రుధిరవహాని' అను చోట కేవల రక్తమే స్రవించునవి యని యర్థము.)

## పైత్తికార్శోనిదానము.

భవతశ్చాత్ర:—

మూ. కట్వమ్లలవణక్షారవ్యాయామాగ్న్యాతపప్రభాః,
దేశకాలావశిశిరౌ క్రోధో మద్యమసూయనమ్. 15
విదాహి తీక్ష్ణముష్ణం చ సర్వం పానాన్నభేషజం,
పిత్తోల్బణానాం విజ్ఞేయః ప్రకోపే హేతురర్శసామ్. 16

వ్యా. చేదు పులుపు లవణము కారము అను నీరసముల సేవించుట, దేహపరి శ్రమముచేయుట, నిప్పును ఎండను మిక్కిలి తీవ్రమైనకాంతిని సేవించుట, దేశంబును కాలంబును మిక్కిలి యుష్ణముగ నుండుట, కోపపడుట, మద్యపానముచేయుట, అసూయ

పడుట, విదాహాకరంబును తీక్ష్ణంబులును ఉష్ణవీర్యంబులునైన అన్నపాన ఔషధంబుల సేవించుట ఇవియన్నియు పిత్తాధిక్యమునగల్గు అర్శస్సులకు కారణములగును.

### శ్లైష్మికార్శోలక్షణములు.

మూ. తత్ర యాని ప్రమాణవన్త్యుపచితాని, శ్లక్ష్ణాని, స్పర్శసహాని (స్పర్శసుఖాని), స్నిగ్ధశ్వేతపాణ్డుపిచ్ఛిలాని, స్తబ్ధాని గురూణి, స్తిమితాని, సుప్తసుప్తాని, స్థిరశ్వయథూని, కణ్డూబహులాని, బహుప్రతతపిఞ్జర శ్వేతరక్తపిచ్ఛాస్రావీణి, గురుపిచ్ఛిలశ్వేత మూత్రపురీషాణి, రూక్షోష్ణోపశయాని, ప్రవాహికాతిమాత్రోత్థానవఙ్క్షణానాహవన్తి, పరికర్తికాహృల్లాసనిష్ఠీవికాకాసారోచక ప్రతిశ్యాయగౌరవచ్ఛర్దిమూత్రకృచ్ఛ్రశోషశోథపాణ్డురోగ శీతజ్వరాశ్మరీశర్కరాహృదయేన్ద్రియోపలేపాస్యమాధుర్యప్రమేహ కరాణి, దీర్ఘకాలానుబన్ధీని (దీర్ఘకాలానుశయాని), అతిమాత్రమగ్నిమార్దవక్లైబ్యకరాణి, ఆమవికారప్రబలాని, శుక్లనఖనయన వదనత్వఙ్మూత్ర పురీషస్య శ్లేష్మోల్బణాన్యర్శాంసీతి విద్యాత్. 17

వ్యా. కఫం బధికముగ ప్రకోపించి కల్గినయర్శస్సులు మిక్కిలి యధికప్రమాణముకల్గి వృద్ధినొంది నునుపుకల్గి స్పర్శమునుగోరుచు స్పర్శముచే సుఖకరములై స్నిగ్ధంబులును శ్వేతపాండువర్ణంబులును పిచ్ఛిలంబులునై యుండును. మరియు నవి స్తంభించి స్థూలములై తడిబట్ట గప్పినవిధముగ జలములై శీతోష్ణాదిస్పర్శము నెరుంగక మొద్దుబారి కఠినమైనవాపును ప్రబలమైన దురదయుకల్గి, పింజర (తామ్రహరిత) వర్ణంబును శ్వేత రక్తవర్ణంబునై జిగటకల్గినద్రవమును అధికముగ నెడలేక స్రవించుచుండును. ఈవ్యాధి కలవానిమూత్రపురీషములు భారముకల్గి పిచ్ఛిలమై (జిగటతోగూడి గంజివలె నుండు ద్రవము శ్వేతవర్ణముతోగూడి వెడలును. రూక్షంబులును ఉష్ణస్పర్శంబులునైన యుపచారాదులచే నవి ప్రకోపముదక్కి కొంచెము శాంతినొందును. మలప్రవృత్తియగునపుడు మిక్కిలి బలవంతముగ ముక్కుటచే గజ్జలయందు ఉబ్బియుండును. మరియు నీవ్యాధి యందు గుదము మున్నగుస్థానములయందు కత్తెరచే కత్తిరించినవిధముగ బాధ, హృల్లాసము (ఓకరింతలు), నోటద్రవము స్రవించుట, దగ్గు, అరోచకము, పడిసెము, శరీరము బరువుగనుండుట, వాంతి, మూత్రకృచ్ఛ్రము, ధాతుక్షయము, వాపు, పాండురోగము, చలిజ్వరము, అశ్మరి యనుమూత్రవ్యాధి, శర్కర (మూత్రమునందు కల్లుకల్లు), హృద

యమునందును ఇంద్రియములయందును జిగటకల్గియుండుట, నోట తీపి, ప్రమేహము అను నీయుపద్రవములు పైజెప్పినయర్శస్సులచే గల్గును. మరియు నవి చిరకాలమువర కును అనుసరించియుండి జాఠరాగ్నిని నానాట మందగింపజేసి పుంస్త్వమును చెడ గొట్టును. అజీర్ణరోగములను ప్రబలముగ జేయును. ఈరోగముకలవానికి గోళ్లను కన్నులు ముఖంబును చర్మంబును మూత్రపురీషంబులును తెల్లగనుండును. ఈలక్షణముల బట్టి కఫప్రకోపమున జనించినయర్శస్సులని యెరుంగునది.

### శ్లైష్మికార్శోనిదానము.

భవతశ్చాత్ర:—

మూ. మధురస్నిగ్ధశీతాని లవణామ్లగురూణి చ,
అవ్యాయామో దివాస్వప్నః శయ్యాసనసుఖే రతిః. 18
ప్రాగ్వాతసేవా శీతౌ చ దేశకాలావచిన్తనం,
శ్లైష్మికాణాం సముద్దిష్టం ఏతత్కారణమర్శసామ్. 19

వ్యా. మధురరసంబును స్నిగ్ధగుణంబును శీతవీర్యంబును కలపదార్థములను భుజించుట, లవణ-అమ్లరసంబులును గురుగుణంబును కలపదార్థములభుజించుట, దేహపరిశ్రమమును బొత్తుగ జేయకుండుట, పగలు నిదురించుట, పరుండుటయందును కూర్చొనియుండుటయందును సుఖము మరిగియుండుట, తూర్పుగాలిని సేవించుట, స్వభావముచేతనే దేశకాలములు శీతలముగ నుండుట, మనస్సు చింతనావ్యాపారము బొత్తుగ లేకుండుట ఇవియన్నియు కఫప్రకోపమునగల్గు అర్శస్సులకు కారణములగును.

### ద్వంద్వజ-సాన్నిపాతికార్శోనిదానలక్షణములు.

మూ. హేతులక్షణసంసర్గాత్ విద్యాత్ ద్వన్ద్వోల్బణాని చ,
సర్వో హేతుస్త్రిదోషాణాం సహజైర్లక్షణైస్సమమ్. 20

వ్యా. వాతాదిదోషములలో రెండేసిదోషములు మిక్కుటముగ ప్రకోపించి జనించిన ద్విదోషజ (వాతపిత్త-వాతకఫ-పిత్తకఫజ) అర్శోరోగములయందు ఆయా రెండేసిదోషములకు వేరువేరజెప్పిన కారణములసంసర్గమును, ఆరెండిటికి వేరువేరుగజెప్పిన లక్షణముల సంసర్గమును గమనించి ద్వంద్వజార్శస్సుల నిర్ణయించునది. మరియు సమముగ ప్రకుపితములగు త్రిదోషములచే గల్గినయర్శోరోగమున వాతాద్యర్శోరోగ ప్రకోపమునకు వేరువేరజెప్పిన కారణములన్నియు కలిసి హేతువులై యుండును. అట్టి సన్నిపాతార్శోరోగమునందు సహజార్శోరోగమునకు జెప్పినలక్షణములు కల్గియుండును.

ఇచ్చట "ద్వన్ద్వోల్బణాని చ" అని చెప్పుటచేత ద్విదోషజములయందు రెండేసి దోషములు మిక్కుటముగ ప్రకోపముజెందుననియు, తక్కినదోషము వానికన్న కొంచెము తగ్గియున్నను వ్యాధికి నదియు కారణమగుననియు తెలియదగియున్నది.

### అర్శోరోగపూర్వరూపములు.

మూ. విష్టమ్భోఽన్నస్య దౌర్బల్యం కుక్షేరాటోప ఏవ చ,
కార్శ్యముద్గారబాహుల్యం సక్థిసాదోఽల్పవిట్కతా. 21
గ్రహణీదోషపాణ్డ్వర్తేః ఆశఙ్కా చోదరస్య చ,
పూర్వరూపాణి నిర్దిష్టాన్యర్శసామభివృద్ధయే 22

వ్యా. భుజింపబడిన యాహారము ఆమాశయమున జేరి కదలకుండుట, బలహీనము, కుక్షిలో గుడగుడయనుశబ్దముకల్గుట, శరీరము కృశించుట, అధికముగ త్రేనుపులు వెడలుట, తొడలయందు నొప్పికల్గి కృశించుట, మలము కొంచెముగ వెడలుట, గ్రహణీరోగము, పాండురోగంబును ఉదరరోగంబును కల్గునేమో యని సందేహించుట కవకాశముకల్గుట ఇవియన్నియు నర్శోరోగముకల్గి వృద్ధినొందుటకు పూర్వరూపములు.

### అర్శోరోగమునకు త్రిదోషజత్వనిర్ణయము.

మూ. అర్శాంసి ఖలు జాయన్తే నాఽసన్నిపతితైస్త్రిభిః,
దోషైః; దోషవిశేషాత్తు విశేషః కల్ప్యతేఽర్శసామ్. 23

వ్యా. పైజెప్పిన వాతికాద్యర్శోరోగములన్నియు వాతాదిత్రిదోషముల సన్నిపాతములేక యెక్కడైనను జనించుటలేదు. అయినను ఆదోషత్రయములో నేదోషము ప్రబలతరమైయుండునో ఆదోషవిశేషమునుబట్టి ఇయ్యది వాతికము, పైత్తికము, శ్లైష్మికము నని వ్యవహరింపబడును. (అర్శస్సు లన్నిటియందును త్రిదోషసంబంధము కల్గియే యుండును. అందేదోషలక్షణము లుత్కటముగ గాన్పించునో అయ్యది యాదోషముచే జనించినదని యూహింపవలెనని భావము. మరియు ద్వంద్వజములయందు రెండేసిదోషములు ప్రబలముగ నుండుననియు, సాన్నిపాతికమున మూడుదోషములును సమములుగ ప్రకోపించుననియు నెరుంగునది.)

### అర్శోరోగము బలిష్ఠమనుటకు కారణము.

మూ. పశ్చాత్తా మారుతః పిత్తం కఫో గుదవళిత్రయం,
సర్వ ఏవ ప్రకుప్యన్తి గుదజానాం సముద్భవే. 24

తస్మాదర్శాంసి దుఃఖాని బహువ్యాధికరాణి చ,
సర్వదేహోపతాపీని ప్రాయః కృచ్ఛ్రతమాని చ. 25

వ్యా. ప్రాణాదిభేదములచే నైదువిధములైన వాతంబును, ఆలోచకాదిభేదములచే నైదువిధములైన పిత్తంబును, అవలంబకాదిభేదములచే నైదుతెరంగులైన కఫంబును మిథ్యాహారవిహారాదులచే సమకాలమున ప్రకోపమునొంది వానివానికి నియమితములైన స్థానముల విడచి గుదస్థానమునందలి వళిత్రయమును (మూడుముడతలను) జేరి గుదస్థానమున పైజెప్పినలక్షణములతోగూడిన యంకురముల గల్గించును. అవియే యర్శస్సులని చెప్పబడును. అత్తెరంగున త్రిదోషములచే సంభవించుటంజేసి అర్శస్సులు శరీరమునందలి సర్వాంగములయందును పైజెప్పినరీతిగ పలుతెరంగులైన వ్యాధులగల్గించి సర్వశరీరమును బాధించుచు మిక్కిలి కష్టమును కల్గించును. కావుననే యియ్యవి ప్రాయికముగ మిక్కిలి కృచ్ఛ్రసాధ్యములై యుండును.

ఇచ్చట నీవివరణము నెరుంగునది:—వాతము ప్రాణ-అపాన-సమాన-ఉదాన-వ్యానభేదములచే నైదుతెరంగులు. పిత్తము ఆలోచక-రంజక-సాధక-పాచక-భ్రాజకభేదములచే నైదువిధములు. కఫంబును అవలంబక-క్లేదక-బోధక-తర్పక-శ్లేష్మకభేదములచే నైదుతెరంగులు. ఇట్టి త్రిదోషభేదములు వానివానిస్థానములును వానివానికృత్యములును మున్నగువిషయములను వాగ్భటాచార్యులు దోషభేదీయమగు పదిరెండవయధ్యాయమున విపులముగ జెప్పబడినవి. ఇత్తెరంగున నైదేసిభేదములుకల వాతపిత్తకఫములు మూడును ఆయాదోషమును ప్రకోపింపజేయు మిథ్యాహారవిహారాదులచే నొక్కపెట్ట ప్రకోపము నంది వానివానిస్థానములవదలి గుదస్థానమునందలి మూడువళులలో వ్యాపించి యర్శోరోగముల గల్గించును. కావున నీరోగము శరీరమునందెల్ల నానావిధములగు వేదనల గల్గించి మిక్కిలి కష్టసాధ్యస్థితి నుండును. మరియు నీదోషములు ఏకదేశమైన గుదస్థానమున జేరి యీరోగమును కల్గించినను సర్వశరీరవ్యాప్తములగు నైదేసిభేదములుకల త్రిదోషములచే నారంభింపబడినది కావున శరీరమునందెల్ల నానావిధబాధల గల్గింప సమర్థమైయుండును. కావుననే నీవ్యాధిస్వభావముచేతనే కృచ్ఛ్రతమమని చెప్పబడినది. కావుననే వాగ్భటాచార్యులును ఇయ్యది శత్రువుబోలె ప్రాణముల హింసించునని అర్శశ్శబ్దమునకు అన్వర్థసంజ్ఞను ఇట్లు చెప్పెను:—"అరివత్ప్రాణినో మాంసకీలకాః విశసన్తి యత్, అర్శాంసి తస్మా దుచ్యన్తే గుదమార్గనిరోధతః"

మరియు వాతపిత్తకఫములబోలె రక్తముకూడ నర్శోరోగమునకు కారణమగునని వాగ్భటాచార్యులు రక్తజార్శోలక్షణము నీరీతి చెప్పెను:—"రక్తోల్బణాః గుదే కీలాః

పిత్తాకృతిసమన్వితాః. వటప్రరోహసదృశాః గుఞ్జావిద్రుమసన్నిభాః, తేఽత్యర్థం దుష్టముష్ణం చ గాఢవిట్ప్రతిపీడితాః, స్రవన్తి సహసారక్తం తస్య చాతి ప్రవృత్తితః, భేకాభః పీడ్యతే దుఃఖైః శోణితక్షయసంభవైః, హీనవర్ణబలోత్సాహః హతౌజాః కలుషేన్ద్రియః." (అ. హృ. ని. అ. ౭. శ్లో. ౪౩. ౪౫.)

"దోషయన్తి ధాతూ నితి దోషాః" అనువ్యుత్పత్తిచేత వాతాదిదోషములబోలె రక్తంబును తక్కినదూష్యమును చెరచునుగాన రక్తమునకును దోషసంజ్ఞ యోగసిద్ధము; కావున నదియు రోగముల నన్నిటికిని కారణమగును. అయినను రక్తము పిత్తమునకు సమానగుణమగుటంజేసి ఆయావ్యాధులయందు పిత్తలక్షణములతోనే చరితార్థమగునని ఆయారోగనిదానములయందు రక్తజలక్షణము ప్రత్యేకముగ జెప్పుటలేదు. వాగ్భటాచార్యులు మాత్రము రక్తజార్శస్సున కొంచెము లక్షణభేదము ననుసరించి ప్రత్యేకముగ లక్షణమును చెప్పెను. సుశ్రుతులుమాత్రము రక్తమును వాతాదిత్రిదోషములతో సమానముగ లెక్కజేసి ద్వంద్వజములయందును వాతరక్త-పిత్తరక్త-కఫరక్తభేదముల మూటిని జేర్చి ద్వంద్వజార్శస్సులు ఆరువిధములగునని యిట్లు చెప్పెను:—"అర్శస్సు దృశ్యతే రూపం యదా వై దోషయోర్ద్వయోః, సంసర్గం తం విజానీయాత్ సంసర్గష్షడ్విధ స్స్మృతః" చరకమున మాత్రము పిత్తజలక్షణములతోనే రక్తజము కూడ సమానమని తలంచి రక్తజార్శోలక్షణమును ప్రత్యేకముగ నుపదేశింపక 'రుధిరవహాని' అని సామాన్యముగ జెప్పి వాత-కఫానుబంధముకల రక్తార్శోలక్షణములను "తత్రానుబన్ధో ద్వివిధః శ్లేష్మణో మారుతస్య చ" (చి. ౧౭౦. శ్లో.) అని యుపక్రమించి లక్షణములను చికిత్సను వేరువేరుగ జెప్పెను. వాగ్భటులు మాత్రము—"రక్తోల్బణాః......పిత్తాకృతిసమన్వితాః" అని ప్రత్యేకలక్షణమును కూడ చెప్పెను.

### అసాధ్యాఽర్శోభేదములు.

మూ. హస్తే పాదే ముఖే నాభ్యాం గుదే వృషణయోస్తథా,
　　శోథో, హృత్పార్శ్వశూలం చ యస్యాఽసాధ్యోఽర్శసోహి సః 26

వ్యా. అర్శోరోగము కలవానికి హస్తములయందును పాదములయందును ముఖమునందును నాభిస్థానమునందును వృషణములయందును వాపు కల్గి, హృదయమునందును ఇరుప్రక్కలయందును శూలనొప్పి కల్గినయెడ నారోగము అసాధ్యమగును.

మూ. హృత్పార్శ్వశూలం సమ్మోహః ఛర్దిరఙ్గస్య రుక్ జ్వరః,
　　తృష్ణా గుదస్య పాకశ్చ నిహన్యుర్గుదజాతురమ్. 27

వ్యా. మరియు హృదయమునందును ఇరుప్రక్కలను శూలనొప్పియు, వాంతియు, సర్వాంగమునందు నొప్పియు, జ్వరంబును, దప్పియు కల్గి గుదస్థానమున పుండైనచో నాయరోర్శోరోగిని తప్పక చంపును. (అసాధ్యమనుట.)

మూ. సహజాని త్రిదోషాణి యాని చాభ్యన్తరాం వలిం,
జాయన్తేఽర్శాంసి సంశ్రిత్య తాన్యసాధ్యాని నిర్దిశేత్. 28

వ్యా. పైజెప్పిన యర్శోభేదములలో సహజార్శస్సులును, త్రిదోషసన్నిపాతమున గల్గినవియు, గుదమునందు లోభాగమున నుండువళి నాశ్రయించి పుట్టినయర్శస్సులును, అసాధ్యములగును.

### అసాధ్యములలో యాప్య-ప్రత్యాఖ్యేయవిభాగము.

మూ. శేషత్వాదాయుషస్తాని చతుష్పాదసమన్వితే,
యాప్యన్తే దీప్తకాయాగ్నేః ప్రత్యాఖ్యేయాన్యతోఽన్యథా.

వ్యా. పైజెప్పబడిన యసాధ్యార్శస్సులలో రోగికి జఠరాగ్ని మందగించక దీప్తమై వైద్యుడు, ఔషధద్రవ్యములు, పరిచారకులు, రోగి అనునాల్గుపాదములకును జెప్పియున్న సంపత్తు చక్కగా నుండి, రోగికి ఆయుశ్శేష మున్నచో నయ్యవి యాప్యములు (ఆయుశ్శేష మున్నంతవరకును తగునుపచారములచే కాలము గడుపగల్గినవి) యగును. అటుగాక జాఠరాగ్ని మందగించి పాదచతుష్టయసంపత్తి లేనియెడ నవి ప్రత్యాఖ్యేయము లగును. (చికిత్స జేయజనదనుట).

### కృచ్ఛ్రసాధ్యార్శస్సులు.

మూ. ద్వన్ద్వజాని ద్వితీయాయాం వలౌ యాన్యాశ్రితాని చ,
కృచ్ఛ్రసాధ్యాని తాన్యాహుః పరిసంవత్సరాణి చ. 30

వ్యా. దోషద్వయసంసర్గమున జనించినయర్శస్సులును, గుదమునందలి రెండవవళియందు పుట్టినయర్శస్సులును, కృచ్ఛ్రసాధ్యములు. మరియు సాధ్యలక్షణములు కల్గియున్నను సంవత్సరకాలము అతిక్రమించి యనుసరించియుండు అర్శస్సులును కృచ్ఛ్రసాధ్యములగును.

### సుఖసాధ్యార్శోలక్షణములు.

మూ. బాహ్యాయాన్తు వలౌ జాతాన్యేకదోషోల్బణాని చ,
అర్శాంసి సుఖసాధ్యాని నచిరోత్పతితాని చ. 31

వ్యా. గుదమునందలి బైటనుండు మూడవవళియందు పుట్టినయర్శస్సులును, ఒక దోషముమాత్రము అధికముగ ప్రకోపించిన యర్శస్సులును, శీఘ్రకాలముననే జనించిన యర్శస్సులును సుఖసాధ్యములుగ నుండును.

### అర్శోరోగములకు శీఘ్రచికిత్సావశ్యకత.

మూ. తేషాం ప్రశమనే యత్నం ఆశు కుర్యాద్విచక్షణః,
తాన్యాశు హి గుదం బద్ధ్వా కుర్యుర్బద్ధగుదోదరమ్. 32

వ్యా. పైజెప్పిన యర్శోరోగములకు దగినచికిత్స జేయక యుపేక్షించినచో నానాట వృద్ధినొంది గుదమును అడ్డగించును. దానంజేసి బద్ధగుదోదరము సంభవించును; కావున నర్శోరోగములు సాధ్యావస్థ నున్నపుడే యుపేక్షింపక శీఘ్రముగ తగుచికిత్స చేయవలెను.

### అర్శోరోగచికిత్సాక్రమము, అందు శస్త్ర-క్షార-అగ్నికర్మలు.

మూ. తత్రాహురేకే శస్త్రేణ కర్తనం హితమర్శసాం,
దాహం క్షారేణ చాప్యేకే, దాహమేకే తథాగ్నినా. 33
అస్త్యే(స్త్వే)తత్ భూరితన్త్రేణ ధీమతా దృష్టకర్మణా,
క్రియతే త్రివిధం కర్మ, భ్రంశ స్తత్ర సుదారుణః. 34

వ్యా. పైజెప్పబడిన యర్శస్సులను (శల్యతంత్రోక్తవిధిప్రకారము) శస్త్రముచే ఛేదించుట మిక్కిలి హితకరమని కొందరాచార్యులు చెప్పెదరు. మరికొందరు (క్షార విధ్యుక్తప్రకారము) క్షారప్రయోగముచే కాల్చుట యుచితమనియు, ఇంక కొందరు (విధ్యుక్తముగ) అగ్నిచే కాల్చుట యుక్తమనియు శాసించిరి. అట్టి శస్త్రవిధానంబును, క్షారకర్మయు, అగ్నికర్మయు ననేకచికిత్సాతంత్రముల జక్కగనేర్చి, అట్టిచికిత్సలయందారితేరి ప్రత్యక్షముగ ఫలమును గాంచి మిక్కిలి కుశలమతియగువానిచే చేయదగి యుండును. ఈత్రివిధకర్మములయందును కొంచెమైన పొరబాటు కల్గినచో మిక్కిలి ప్రమాదము సంభవించును. (కావున శాస్త్రపరిజ్ఞానంబును క్రియాకౌశలంబును అనుభవంబును కల్గినవైద్యవరుడు అట్టి చికిత్సను జేసినచో నుపయుక్తముగ నుండునని భావము).

### శస్త్ర-క్షార-అగ్నికర్మలవ్యత్యాసమున గల్గునుపద్రవములు.

మూ. పుంస్త్వోపఘాతః, శ్వయథుః గుదే, వేగవినిగ్రహః,
ఆధ్మానం, దారుణం శూలం, వ్యథా, రక్తాతివర్తనమ్. 35

పునర్విరోహో రూఢానాం, క్లేదో భ్రంశో గుదస్య చ,
మరణం వా భవేచ్ఛీఘ్రం శస్త్రక్షారాగ్నివిభ్రమాత్. 36

వ్యా. పైజెప్పిన శస్త్రక్షారాగ్నికర్మల జేయుటలో పొరబాటుపడి వ్యతిరేకముగ జేసినచో దానంజేసి పుంస్త్వము (శుక్రపాటవము) చెడును. గుదస్థానమున వాపు కల్గును. వాతమూత్రపురీషములు వెడలక యడ్డుపడును. కడు పుబ్బరించును. కడుపులో క్రూరమైనశూల కల్గును. బాధ యధికమగును. రక్తము అధికముగ వెడలును. అర్శస్సులు శమించినను మరల మొలకలెత్తి వ్యాపించును. అవి జనించుస్థలమున కుళ్లును. గుదము స్వస్థానమునుండియు సడలిపోవును. ఒకసమయమున మరణము కూడ సంభవించును. (కావున మిగుల జాగరూకుడై శస్త్రక్షారాగ్నికర్మల చేయవలెనని భావము.)

## అర్శస్సులకు సులభోపాయచికిత్స.

మూ. యత్తు కర్మ సుఖోపాయం అల్పభ్రంశమదారుణం,
తదర్శసాం ప్రవక్ష్యామి సమూలానాం నివృత్తయే. 37

వ్యా. అర్శస్సులకు సంబంధించినసులభోపాయముచే జేయదగినదియు భ్రంశమును కల్గింపనదియు, క్రూరముకాక సౌమ్యమైనదియు నగుచికిత్సను అయ్యవి మొదలంట నశించి మరల పొడసూపకుండుటకై తగినదిగ చెప్పెదనని భావము. (పైజెప్పిన శస్త్రక్షారాగ్నికర్మచే చికిత్సావిధానము కేవలము క్రూరమై శల్యతంత్రవైద్యము నై యుండును. ఈతంత్రము కేవలము కాయచికిత్సాప్రధానము కావున శస్త్రాదిచికిత్సావిధానమును విడచి సులభోపాయముగ నిర్వహింపదగిన చికిత్సాప్రణాళిక నీక్రింద వివరించెదనని తంత్రకారుని ప్రతిజ్ఞ.)

## అర్శస్సులలో శుష్క-ఆర్ద్రభేదములు.

మూ. వాతశ్లేష్మోల్బణాన్యాహుః, శుష్కాణ్యర్శాంసి తద్విదః,
ప్రస్రావీణి తథార్ద్రాణి రక్తపిత్తోల్బణాని చ. 38

వ్యా. వాత-కఫము లుత్కటములై జనించినయర్శస్సులు తడిలేక యెండియుండును. రక్తంబును పిత్తంబును అధికములుగనుండి సంభవించిన యర్శస్సులు తడికల్గి రక్తాదుల స్రవించుచుండును. (కఫజార్శస్సులును పిచ్ఛిలమైన ద్రవమును స్రవించునని చెప్పబడినది. అయినను పిత్తార్శస్సులు కేవల రక్తభూయిష్ఠమై రక్తమునే విశేషముగ స్రవించును. కావున ఆర్ద్రమని చెప్పబడినది. కఫజములు రక్తస్రావములేమింజేసి శుష్కములని చెప్పబడినది).

## శుష్కార్శస్సులకు అభ్యంగ-స్వేదనచికిత్సలు.

మూ. తత్ర శుష్కార్శసాం పూర్వం ప్రవక్ష్యామి చికిత్సితం,
స్తబ్ధాని స్వేదయేత్పూర్వం శోఫశూలాన్వితాని చ. 39
చిత్రకక్షారబిల్వానాం తైలేనాభ్యజ్య బుద్ధిమాన్,
యవమాషకులుత్థానాం పులాకానాం చ పోటలైః. 40
గోఖరాఽశ్వశకృత్పిండైః తిలకల్కై స్తుషై స్తథా,
వచాశతాహ్వాపిండైర్వా సుఖోష్ణైః స్నేహసంయుతైః. 41
సక్తూనాం పిండికాభిర్వా స్నిగ్ధానాం తైలసర్పిషా,
శుష్కమూలకపిండైర్వా పిండైర్వా కార్ష్ణగన్ధికైః. 42
రాస్నాపిండైః సుఖోష్ణైర్వా సస్నేహైర్హాపుషైరపి,
ఇష్టకస్య ఖరాహ్వాయాః శాకైః గృఞ్జనకస్య వా. 43
అభ్యజ్య కుష్ఠతైలేన స్వేదయేత్పోటలీకృతైః,

వ్యా. పైజెప్పినరీతిగ ఆర్ద్ర-శుష్కభేదములలో శుష్కార్శస్సులకు తొలుత నీక్రింద చికిత్సాక్రమము చెప్పబడును.—

స్తంభించి వాపును పోటును కల్గియుండు అర్శస్సులకు చిత్రమూలము, యవక్షారము, మారేడు, ఈమూడిటి చేర్చి విధ్యుక్తప్రకారము సిద్ధము చేయబడిన తైలమును తొలుత బూసి యీక్రింద జెప్పబడువిధముగ స్వేదనము (ఆవిరిబట్టుట)ను చేయవలెను. ఎట్లులనః—యవలయొక్కయు ఉద్దులయొక్కయు ఉలవలయొక్కయు పొట్టునైనను, ఆవులయొక్కయు గాడిదెయొక్కయు గుఱ్ఱముయొక్కయు పేడనైనను, తెలికపిండినైనను, వరిగోధుమలపొట్టునైనను, వసను సదాపవిత్తులను పిండిజేసిన పిష్టమునైనను, వాతహర స్నేహద్రవ్యమును జేర్చి నిప్పుసెగను వెచ్చజేసి సుఖోష్ణముగ నున్నపుడు పట్టలో పొట్లముగ మూటగట్టి దానిచే గుదాంకురములపై కాపడము పెట్టి స్వేదనము చేయవలెను. లేక సత్తుపిండిని తైలము (నూనె)చేనైనను నేతిచేనైనను స్నిగ్ధముగ (జిడ్డుగలదానిగ) జేసియైనను వెచ్చజేసి పొట్లముకట్టి సుఖోష్ణముగ కాపడము పెట్టవలెను. లేక ఎండిన ముల్లంగిని నూరి ముద్దజేసియైనను, మునగపట్టను నూరి ముద్దజేసియైనను, సన్నరాష్ట్రమును నూరి ముద్దజేసి యైనను, బోడతరమును నూరి ముద్దజేసియైనను; తైలము మున్నగువానిచే

స్నిగ్ధముగ జేసి వెచ్చజేసి సుఖోష్ణముగ నున్నపుడు కాపడము పెట్టవలెను. లేక ఆవురు గడ్డినైనను, ఓమపు ఆకునైనను, ఉల్లిపాయల ఆకునైనను నూరి యుడికించి ముద్దజేసి సుఖోష్ణముగ నుండునపుడు చెంగల్వకోష్టును జేర్చి కాచబడిన తైలమును అర్శస్సులపై బూసి పైజెప్పిన పిష్టమును పొట్లముకట్టి కాపడము పెట్టవలెను.

### అర్శస్సులకు అభ్యంగ-అవగాహములు.

మూ. వృషార్కైరణ్డబిల్వానాం పత్రోత్క్వాథైశ్చ సేచయేత్. 44
మూలకత్రిఫలార్కాణాం వేణూనాం వరుణస్య చ,
అగ్నిమన్థస్య శిగ్రోశ్చ పత్రాణ్యశ్మన్తకస్య చ. 45
జలేనోత్క్వాథ్య శూలార్తం స్వభ్యక్తమవగాహయేత్,
కోలోత్క్వాథేఽథవా కోష్ణే సౌవీరకతుషోదకే. 46
బిల్వక్వాథేఽథవా తక్రే దధిమణ్డామ్లకాఞ్జికే,
గోమూత్రే వా సుఖోష్ణే తం స్వభ్యక్తమవగాహయేత్. 47
(శూలార్తముపవేశయేత్)

వ్యా. అడ్డసరపాకునైనను, జిల్లేడాకునైనను, ఆముదపాకునైనను, మారేడాకునైనను చేర్చి కషాయము కాచి యాకషాయముచేత అర్శస్సులను తడుపుచుండవలెను. మరియు ముల్లంగియాకును, త్రిఫలముల కరక-తాని-ఉసిరికలయాకులను, వెదురాకును, ఉలిమిరియాకును, కూరనెల్లియాకును, మునగాకును, ఆరెచెట్టుఆకు, ఈయాకులను యథాసంభవముగ నీళ్లలోజేర్చి కాచి యానీళ్లచే నభ్యంగస్నానమును జేయనగును. దీనిచేత నర్శస్సువలన కల్గినశూల(పోటు)నిమ్మళించును. లేక రేగాకును చేర్చి కాచబడిన గోరువెచ్చని కషాయమునందైనను, సౌవీరకము, తుషోదకము అనుకాంజికములయందైనను, బిల్వ(మారేడాకు)కషాయమునందైనను, మజ్జిగయందైనను, పెరుగుమీది తేటనీటియందైనను పులిగంజి నీళ్లయందైనను, గోమూత్రమునందైనను శూలపీడితుడగు నర్శోరోగికి నభ్యంజనముచేసి అవగాహనమును జేయనగును. (ఇచ్చట శూలనొప్పితో కూడిన యర్శోరోగికి గుదాంకురములకును గుదస్థానమునను పొత్తికడుపునందును తైలాదులనభ్యంగనమును (తైలముపూసి మర్దనమును)చేసి, పైజెప్పబడిన కషాయాదిద్రవములను ఒకతొట్టిలో బోసి యాద్రవము సుఖోష్ణముగ నుండునపుడు రోగిని నడుముపరకును మునిగియుండునటుల పైజెప్పిన కషాయాదిద్రవముచే నిండియున్న తొట్టిలో నుంచవలెను. ఇదియే అవగాహనమగును. దీనినే కటిస్నానమనియు చెప్పుదురు. ఈయర్థమును వాగ్భటాచార్యులు ''స్వభ్యక్తపాయుజఘనమవగాహే నిధాపయేత్'' అనువాక్య

ముచే స్ఫుటముగ జెప్పిరి. ఈమూలమునను "స్వభ్యక్తమవగాహయేత్" అనువాక్యమునకు పైజెప్పినదియే సమంజసమైన యర్థము. "శూలార్త ముపవేశయేత్" అనుపాఠమున పైజెప్పినయర్థము స్ఫుటముగనే యేర్పడును.)

### అర్శస్సులకు ధూపనయోగములు.

మూ. కృష్ణసర్పవరాహోష్ట్రజతుకాపృషదంశజాం,
వసామభ్యఞ్జనే దద్యాత్; ధూపనం చార్శసాం హితమ్. 48
నృకేశాః సర్పనిర్మోకో పృషదంశస్య చర్మ చ,
అర్కమూలం శమీపత్రం అర్శోభ్యో ధూపనం హితమ్. 49
తుమ్బురూణి విడఙ్గాని దేవదార్వక్షతాః ఘృతం,
బృహతీ చాశ్వగన్ధా చ పిప్పల్యః సురసా ఘృతమ్. 50
వరాహవృషవిట్ చైవ ధూపనం సక్తవో ఘృతం;
కుంజరస్య పురీషం తు ఘృతం సర్జరసస్తథా. 51

వ్యా. నాగుపాము, పంది, ఒంటె, చీకురాయిపిట్ట, పిల్లి ఈజంతువులవసను (మాంసమునందలి చమురును) అర్శస్సులకు అభ్యంజనమునకై యుపయోగించుట మంచిది ఈవసనే ధూపము వేయుటకును (పొగబట్టుటకును) ఉపయోగించుట చాల మంచిది. మరియు మనుజుని తలవెండ్రుకలు, నాగుపాము కుబుసము, పిల్లిచర్మము, జిల్లేడువేరు, జమ్మియాకు వీని నొకటిగ జేర్చి ధూపము వేయుట మంచిది. తుంబురులు, వాయువిడంగములు, దేవదారుచెక్క, యవాక్షతలు, వీనిని చూర్ణముజేసి నేతితో కలిపి ధూపము వేయుట ప్రశస్తము. వాకుడువిత్తులు, పెన్నేరుగడ్డ, పిప్పళ్లు, తులసి, వీనిని మెత్తగనూరి నేతితో కలిపి ధూపము వేయవలెను. పందిమలము, ఎద్దుపేడ, సత్తుపిండి వీనిని నేతితో గూర్చి నూరి ధూపము వేయవలెను. ఏనుగుపురీషమును, మద్దిచెట్టుజిగురును నేతితో కలిపి ధూపము వేయవలెను.

### అర్శస్సులకు ప్రలేపములు.

మూ. హరిద్రాచూర్ణసంయుక్తం సుధాక్షీరం ప్రలేపనం,
గోపిత్తపిష్టాః పిప్పల్యః సహరిద్రాః ప్రలేపనమ్. 52
శిరీషబీజం కుష్ఠం చ పిప్పల్యః సైన్ధవం గుడః,
అర్కక్షీరం సుధాక్షీరం త్రిఫలా చ ప్రలేపనమ్. 53

పిప్పల్యః చిత్రకశ్శ్యామా కిణ్వం మదనతణ్డులాః,
ప్రలేపః కుక్కుటశకృత్ హరిద్రాగుడసంయుతః. 54
దన్తీ శ్యామాఽమృతాసఙ్గః పారావతశకృద్గుడః,
ప్రలేపస్స్యాత్; గజాస్థీని నిమ్బా భల్లాతకాని చ 55
ప్రలేపస్స్యాత్; అలం కోష్ణం వాసస్తకవసాయుతం,
శూలశ్వయథుహృత్ యుక్తం చులూకీవసయాథవా. 56
అర్కం పయ(పత్రం)స్సుధాకాణ్డం కటుకాఽలాబుపల్లవాః,
కరఙ్గో బస్తమూత్రం చ లేపనం శ్రేష్ఠమర్శసామ్. 57

వ్యా. పసుపుపొడిని జెముడుపాలలో కలిపియైనను, గోరోచనమును పిప్పళ్లను పసుపును ఒకటిగ జేర్చి నూరి జెముడుపాలలో కలిపియైనను అర్శస్సులకు పట్టువేయవలెను. లేక దిరిసనపువిత్తనములు, చెంగల్వకోష్టు, పిప్పళ్లు, సైంధపలవణము, బెల్లము, జిల్లేడు పాలు, జెముడుపాలు, త్రిఫలములు (కరక-తాని-ఉసిరికకాయలు), వీని నన్నింటి నొక టిగ జేర్చి నూరి యర్శస్సులకు పూసి పట్టువేయవలెను. పిప్పళ్లు, చిత్రమూలము, నల్ల తెగడ, సురాబీజము, మ్రంగకాయలలోనిగింజలు, కోడిమలము, పసుపు, బెల్లము, వీని నన్నింటి నొకటిగజేర్చి నూరి యర్శస్సులకు పూసి పట్టువేయవలెను. మరియు, దన్తి (నేర్వాళపుగింజలు), నల్లతెగడ, తిప్పతీగె, పావురములమలము, బెల్లము, వీని నొకటిగ గూర్చి నూరి పట్టువేయవలెను. ఏనుగు అస్థులు, వేపగింజలు, జీడిగింజలు, వీని నొకటిగ గూర్చి నూరి పట్టువేయవలెను. హారిదళేమును ఒంటెమాంసపు చమురుతోనైనను, చులూకి యనెడుమత్స్యముయొక్క చమురుతోనైనను కూర్చి వెచ్చజేసి సుఖోష్ణముగ నున్నపుడు పూసి పట్టువేసినచో నర్శస్సులలో గల్గినశోథంబును పోటును హరించును. మరియు జిల్లేడుపాలు, జెముడుకాడలు, చేదుసొరచిగుళ్లు, కానుగపట్ట, గొరియల మూత్రము వీనినన్నింటిని ఒకటిగ నూరి పూసి యర్శస్సులకు పట్టువేయుట చాల శ్రేష్ఠము.

## అభ్యంగాదిచికిత్సలచే గల్గుప్రయోజనము.

మూ. అభ్యఙ్గాద్యాః ప్రదేహాన్తాః య ఏతే పరికీర్తితాః,
స్తమ్భశ్వయథుకణ్డ్వర్తి శమనాస్తేఽర్శసాం మతాః. 58
ప్రదేహాస్తైరుపక్రాన్తాన్యర్శాంసి ప్రస్రవన్తి హి,
సఞ్చితం దుష్టరుధిరం, తతస్సమ్పద్యతే సుఖీ. 59

వ్యా. పైజెప్పబడిన అభ్యంగము మొదలుజేసి ప్రదేహమువరకుంగల చికిత్సావిధానములు స్తంభించి వాపుతోడను జిలతోడను బాధతోడను గూడిన యర్శస్సులను శమింపజేయును. (అర్శస్సులకుం గల స్తంభనమును వాపును దురదను పోటును శమింపజేయునని భావము). మరియు నట్టి యభ్యంగాదిచికిత్సల జేయుటచేత అర్శస్సులలో నానాట సంచితముగ జేరియున్న దుష్టరక్తమును స్రవించును. దానంజేసి రోగికిసుఖము కల్గును.

## అర్శస్సులయందు రక్తమోక్షణోపాయము.

మూ. శీతోష్ణస్నిగ్ధరూక్షైర్హి న వ్యాధిరుపశామ్యతి,
రక్తే దుష్టే, భిషక్ తస్మాత్ రక్తమేవాఽవసేచయేత్. 60
జలౌకోభిః తథా శస్త్రైః సూచీభిర్వా పునః పునః,
అవర్తమానం రుధిరం రక్తార్శోభ్యః ప్రవాహయేత్. 61

వ్యా. అర్శోరోగమునందు గుదాంకురములలో రక్తము సంచితముగ జేరియుండు నపుడు శీతంబులును, ఉష్ణంబులును, రూక్షంబులును నగుచికిత్సలచే వ్యాధి శమింపనేరదు. కావున రక్తము చెడియున్నపుడు జలగల కరిపించియైనను, శస్త్రప్రయోగముచే నైనను, సూదుల గ్రుచ్చియైనను రక్తపూరితములైన యర్శస్సులనుండి రక్తమును పలుమారు వెడలింపజేయవలెను. (పైజెప్పబడిన యభ్యంగాదిచికిత్సావిధానముచే నర్శస్సులనుండి దుష్టరక్తము వెడలకుండునెడ జలగలను, శస్త్రకర్మను, సూదులను ప్రయోగించి దానిమూలమున రక్తమును మాటిమాటికి వెడలింపవలెనని భావము).

## అర్శోహరత్ర్యూషణాదిచూర్ణము.

మూ. గుదశ్వయథుశూలార్తం మన్దాగ్నిం పాయయేత్తు తం,
త్ర్యూషణం పిప్పలీమూలం పాఠాం హిఙ్గు సచిత్రకమ్. 62
సౌవర్చలం పుష్కరాఖ్యం అజాజీం బిల్వపేషి (శి) కాం,
బిడం యవానీం హపుషాం విడఙ్గం సైన్ధవం వచామ్. 63
తిన్త్రిడీకం చ మద్యేన మద్యేనోష్ణోదకేన వా,
తథార్శోగ్రహణీదోష శూలానాహాద్విముచ్యతే 64

వ్యా. అర్శోరోగమునందు గుదస్థానమున వాపును, పోటును కల్గి అగ్ని మందగించియున్నచో నీక్రిందచెప్పబడు త్ర్యూషణాదిచూర్ణమును త్రాగించవలెను:—త్రికటుకములు, పిప్పలీమూలము (మోడి), చిరుబొద్దివేరు, ఇంగువ, చిత్రమూలము, సౌవర్చల

లవణము, పుష్కరమూలము (మెట్టదామర), జీలకర, మారేడుకాయపైబెరడు, బిడాలవణము, ఓమము, బోడతరము, వాయువిడంగములు, సైంధవలవణము, వస, చింతపండు వీనినన్నిటిని సమభాగములుగ గూర్చి చూర్ణము చేసి యాచూర్ణమును పెరుగుమీదితేటనీటితోనైనను, మద్యముతోనైనను, వేడినీళ్లతోనైనను కలిపి త్రాగినచో అర్శస్సులును, గ్రహణీరోగంబును, శూలయు, కడుపుబ్బరంబును నివర్తించును.

## అర్శోరోగమున పాచనౌషధములు.

మూ. పాచనం పాయయేద్వా తత్ యదుక్తం హ్యతిసారికే,
(యద్వక్ష్యామ్యతిసారిణే)

వ్యా. మరియు పైజెప్పినరీతిగ నర్శోరోగమున జఠరాగ్ని మందగించియున్నపుడు అతిసారచికిత్సాధ్యాయమున జెప్పబడు పాచనౌషధములను త్రాగించవలెను. (ఇచ్చట పందొమ్మిదవయధ్యాయమున నతిసారచికిత్సావిధానమున "పిప్పలీ నాగరం ధాన్యం" అని యుపక్రమించి "వాతశ్లేష్మహరో హ్యేషః గణో దీపనపాచనః."(చి. అ. ౧౯) అని చెప్పబడు దీపనపాచనయోగముల నెరుంగునది) ఇచ్చట "యద్వక్ష్యామ్యతిసారిణే" అనుపాఠమే సమంజసము.

## అర్శోహరహరీతకీ-త్రివృద్యోగములు.

మూ. సగుడామభయాం వాపి పాయయేత్పౌర్వభక్తికీమ్. 65
పాయయేద్వా త్రివృచ్చూర్ణం త్రిఫలారససంయుతమ్,
హృతే గుదాశ్రయే దోషే గచ్ఛన్త్యర్శాంసి (గుదజా
యాన్తి) సంక్షయమ్. 66

వ్యా. లేక కరకకాయలచూర్ణము బెల్లముతో గూర్చి ఉష్ణోదకము మున్నగుద్రవముల యనుపానముతో అన్నమును భుజించుటకుముందు (పరగడుపున) త్రాగించవలెను. లేక తెగడచూర్ణమును త్రిఫలములకషాయమున కలిపి త్రాగించవలెను. ఈపానముచేత గుదము నాశ్రయించియుండు (మలసంచయరూప)దోషము బైటవెడలి యర్శస్సులు నశించును.

## అర్శోహరములగు కొన్నిప్రయోగములు.

మూ. గోమూత్రాధ్యుషితాం దద్యాత్ సగుడాం వా హరీతకీం,
హరీతకీం తక్రయుతాం, త్రిఫలాం వా ప్రయోజయేత్. 67

సనాగరం చిత్రకం వాశీధుయుక్తం ప్రయోజయేత్,
దాపయేచ్చవ్యయుక్తం వా శీధుం సాఽజాజిచిత్రకమ్. 68
సురాం సహపుషా పాఠాం దద్యాత్ సౌవర్చలాన్వితాం;
దధిత్థబిల్వసంయుక్తం, యుక్తం వా చవ్యచిత్రకైః. 69
భల్లాతకయుతం వాపి ప్రదద్యాత్తక్రతర్పణం,
బిల్వనాగరయుక్తం వా, యవాన్యా చిత్రకేణ చ. 70
చిత్రకం హపుషాం హిఙ్గుం దద్యాద్వా తక్రసంయుతం,
పఞ్చకోలయుతం వాపి తక్రమస్మై ప్రదాపయేత్. 71

వ్యా. కరకకాయలను గోమూత్రమున నొకరాత్రి యంతయు నూరబెట్టి మరునాడుతీసి బెల్లముతో గూర్చి నూరి సేవింపనగును. మరియు కరకకాయలచూర్ణము నైనను, త్రిఫలములచూర్ణము నైనను మజ్జిగతో గూర్చి త్రాగవలెను. శుంఠిని చిత్రమూలమును చూర్ణము జేసి శీధుమద్యమున జేర్చి త్రాగవలెను. చవ్యము, జీలకర, చిత్రమూలము, ఈ మూడిటిని చూర్ణము జేసి శీధుమద్యమున కలిపి పానము జేయనగును. బోడతరము, చిరుబొద్ది, సౌవర్చలలవణము, ఈమూడిటిని చూర్ణము చేసి సుర యనుమద్యమున జేర్చి పానము జేయదగును. వెలగపండుగిజరును, బిల్వపండుగిజరును కూర్చియైనను, చవ్యమును చిత్రమూలమును చూర్ణము చేసి కూర్చియైనను, జీడిగింజల చూర్ణము గూర్చియైనను మజ్జిగను తర్పణమునకై త్రాగించవలెను. మరియు బిల్వకాయ గిజరును శుంఠిని చూర్ణము జేసియైనను, ఓమమును చిత్రమూలమును చూర్ణము చేసియైనను, మజ్జిగలో కలిపి త్రాగించవలెను. చిత్రమూలము, బోడతరము, ఇంగువ, ఈమూటిని చూర్ణము జేసి మజ్జిగలో కలిపి త్రాగించవలెను. లేక పంచకోలములచూర్ణమును మజ్జిగలో కలిపి త్రాగించవలెను.

ఇచ్చట 'పంచకోలయుతం' అనుచోట పిప్పళ్లు, మోడి, చవ్యము, చిత్రమూలము, శుంఠి, అను నీయైదును పంచకోలశబ్దముచే గ్రహింపనగును. "పిప్పలీపిప్పలీమూలం చవ్యం చిత్రకనాగరమ్, పఞ్చకోలమిదం ప్రాహుః" అని పరిభాష.

## అర్శోహరతక్రారిష్టయోగము.

మూ. హపుషాం కుఞ్చికాం ధాన్యం అజాజీం కారవీం శటీమ్,
పిప్పలీం పిప్పలీమూలం చిత్రకం హస్తిపిప్పలీమ్. 72
యవానీం చాఽజమోదాం చ చూర్ణితం తక్రసంయుతమ్,

మన్దామ్లకటుకం విద్వాన్ స్థాపయేద్ఘృతభాజనే. 73
వ్యక్తామ్లకటుకం జాతం తక్రారిష్టం ముఖప్రియం,
ప్రపిబేన్మాత్రయా కాలేష్వన్నస్య తృషితస్త్రిషు. 74
దీపనం రోచనం వర్ణ్యం కఫవాతాఽనులోమనం,
గుదశ్వయథుకణ్డ్వార్తినాశనం బలవర్ధనమ్. 75

(ఇతి తక్రారిష్టః.)

వ్యా. బోడతరము, నల్లజీలకర, దనియాలు, జీలకర, సదాప, కచోరములు, పిప్పళ్లు, మోడి, చిత్రమూలము, ఏనుగుపిప్పళ్లు, ఓమము, కురాసానియోమము, వీని నన్నిటిని సమభాగములుగ గూర్చి చూర్ణముచేసి యాచూర్ణమును ఛేటమజ్జిగలో కలిపిన నయ్యది కొంచెముప్పును కారమును కల్గియుండును. పిమ్మట దానిని నేతితో మాగిన కుండలో బోసి మూతమూసి చీలమన్ను జేసి, అయ్యది బాగుగ పులుపెక్కి కారముగ నుండునందాక పదిలముగ నుంచునది. ఇయ్యది తక్రారిష్టమని చెప్పనగును. ఈతక్రారిష్ట మును అన్నమును భుజించుసమయమున మూడుకాలములయందు (భోజనమునకు మును ముందును, భోజనమధ్యకాలమునను, భోజనాంతమునను జేరి మూడుకాలములయందును) దప్పికల్గినపుడు మితమైన పరిమాణముతో త్రాగినచో నోటికి రుచిగనుండును. అగ్నిని దీపింపజేసి యాకలికల్గించును. అరోచకమును పోగొట్టును. శరీరమునకు మంచివర్ణమును కల్గించును. కఫమును వాతమును అనులోమముగ వ్యాపింపజేయును. అర్శోరోగమున గల్గినగుదస్థానమునందలి వాపును దురదను నొప్పి మున్నగుబాధలను హరించును. శరీరబల మును వృద్ధినందించును.

ఇచ్చట నీప్రక్రియావిధానము నెరుంగునది:— ఈయోగమున ఆవాప్యద్రవ్యము లగు బోడతరము మున్నగువానిచూర్ణమునకును ద్రవరూపమైన మజ్జిగకును పరిమాణము చెప్పబడలేదు. అయినను దీనికి క్రిందియధ్యాయమున గ్రహణీచికిత్సలో తక్రారిష్టయోగ మున జెప్పినరీతిగ వానిపరిమాణమును కల్పింపనగును. ఎట్టులనః—"యవాన్యామలకే పథ్యా మరిచం త్రిపలాంశికమ్. లవణాని పలాంశాని పంచ చైకత్ర చూర్ణయేత్, తక్రకంసాసుతం జాతం తక్రారిష్టం పిబేన్నరః." (చి. అ. ౧౫. శ్లో. ౧-౨౦) ఇచ్చట తక్రము ఆఢక (అరువదినాల్గుపలముల) పరిమాణంబును, ఆవాప్యద్రవ్యములు పదునేడు పలములపరిమాణంబును చెప్పబడినది. ఈప్రమాణము ననుసరించి ప్రకృతతక్రారిష్టమున బోడతరము మున్నగు పండ్రెండుద్రవ్యములును సమభాగములుగ జేరి పదునేడుపల ములుగ గల్పించి, తక్రమును అరువదినాల్గుపలముల గల్పింపవలెను. ఈనిర్ణయము చక్రపాణిదత్త వ్యాఖ్యలో జెప్పబడినది.

మరియు వాగ్భటాచార్యులును అర్శశ్చికిత్సితాధ్యాయమున "ధాన్యోపకుంచితౌ......తక్రారిష్టం పిబేజ్జాతం వ్యక్తామ్లకటుకా మతః" (అ. హృ. చి. అ. ౮. శ్లో. ౪౫. ౪౬.) అని తక్రారిష్టయోగమును జెప్పిరి. ఈమూలమునందును తక్రమునకును ఆవాప్యమునకును పరిమాణమును జెప్పియుండలేదు; కాని సర్వాఙ్గసుందరమున దీనివివరించుతరి "అత్ర చ తక్రే పలశతమాత్రే ధాన్యకాదీని పాలికాని దేయానీతి వృద్ధవైద్యవ్యవహారః" అని స్పష్టముగ జెప్పిరి. దీనినిబట్టి నూరుపలములు తక్రమును, ఆవాప్యద్రవ్యములు పండ్రెండును ప్రత్యేకము పలమువంతున జేరినసముదాయము పండ్రెండు పలములు ఆవాప్యచూర్ణంబును నుండవలెనని తెలియునది. ఈపరిమాణకల్పనమే సమంజసమని తోచెడి. విజ్ఞులు గమనించెదరుగాక.

## వేగాకతక్రయోగము.

మూ. త్వచం చిత్రకమూలస్య పిష్ట్వా కుమ్భం ప్రలేపయేత్,
తక్రం వా దధి వా తత్ర జాతమర్శోహరం పిబేత్. 76

వ్యా. చిత్రమూలమువేళ్ల పైబెరడును మెత్తగ నూరి కుండ లోభాగమున బూసి యెండనిచ్చి యందు మజ్జిగనైనను పెరుగునైనను బోసి మూతమూసి యుంచునది. అయ్యది చక్కగ పులిసినపిదప దానిని అగ్నిబలానుసారముగ త్రాగినచో నర్శస్సులను హరించును.

## వాత-కఫార్శస్సులయందు తక్రప్రయోగప్రాశస్త్యము.

మూ. వాతశ్లేష్మార్శసాం తక్రాత్ పరం నాస్తీహ భేషజం,
తత్ప్రయోజ్యం యథాదోషం సస్నేహం రూక్షమేవ వా. 77
సప్తాహం వా దశాహం వా పక్షం మాసమథాపి వా,
బలకాలవిశేషజ్ఞః భిషక్ తక్రం ప్రయోజయేత్. 78

వ్యా. వాతమువలన కల్గినయర్శస్సులకును, శ్లేష్మమున కల్గిన యర్శస్సులకును తక్రమునకన్న మించినయౌషధము వేరొండులేదు. కావున అట్టి తక్రమును దోషానుసారముగ స్నేహముతోకూడిన (జిడ్డుకల)మజ్జిగనైనను, రూక్షమైన (జిడ్డులేని) మజ్జిగనైనను రోగికి నుపయోగించవలెను. (వాతార్శస్సులయందు వెన్నతోగూడి జిడ్డుకలమజ్జిగను, కఫార్శస్సులయందు (వెన్నను వేరుపరిచి జిడ్డులేనిమజ్జిగను ఉపయోగించవలెనని "యథాదోషం" అనుటచే నెరుంగునది).

మరియు రోగియొక్క శరీరబలమును అగ్నిబలమును కాలవిశేషమును చక్కగ నెరింగినవైద్యుడు తత్తదనుగుణముగ నేడుదినముల కాలమైనను, పదిదినములైనను, పదునైదుదినములైనను, ఒకమాసమైనను పైజెప్పినదోషానుగుణమైన స్నిగ్ధ-రూక్షతక్రము నుపయోగింపవలెను.

## అర్శస్సులయందు తక్రోపయోగక్రమము.

మూ. అత్యర్థమృదుకాయాగ్నేః తక్రమేవావచారయేత్,
సాయం వా లాజసక్తూనాం దద్యాత్తక్రావలేహికామ్. 79
జీర్ణే తక్రే ప్రదద్యాద్వా తక్రపేయాం ససైన్ధవామ్,
తక్రానుపానం సస్నేహం తక్రౌదనమతః పరమ్. 80
యూషైర్మాంసరసైర్వాపి భోజయేత్తక్రసంయుతైః,
(యూషైః రసేన వాఽప్యూర్ధ్వం తక్రసిద్ధేన భోజయేత్). 81
కాలక్రమజ్ఞస్సహసా న చ తక్రం నివర్తయేత్,
తక్రప్రయోగో మాసాన్తః క్రమేణోపరమో హితః 82
అపకర్షో యథోత్కర్షః న త్వన్నాదపకృష్యతే,
శక్త్యాగమనరక్షార్థం దార్ఢ్యార్థమనలస్య చ 83
బలోపచయవర్ణార్థం ఏష నిర్దిశ్యతే క్రమః,

వ్యా. వాత-కఫములచే గల్గినయర్శస్సులయందు వరుసగ స్నిగ్ధ(వెన్నతోగూడిన), రూక్ష(వెన్న నెత్తి జిడ్డులేకుండు) తక్రము నుపయోగింపవలెనని పైని నిర్దేశింపబడినది; అట్టియెడ అర్శోరోగికి జఠరాగ్ని మిక్కిలి మందగించియుండునపుడు (పూర్వాహ్ణమునందును, సాయంకాలమునందును ఆహారమునకు బదులుగ) మజ్జిగనే యుపయోగింపవలెను. అట్టి యుపయోగమువలన కొంచెముగ నగ్నిదీప్తి కల్గినయెడ ఉదయకాలమున మజ్జిగను మాత్రము ఆహారమునకు బదులుగ నుపయోగించి, సాయంకాలమున బొరుగుల పిండిని మజ్జిగలో కలిపి యగ్నిబలానుసారముగ తినిపించవలెను. ఇంకను కొంచెము కాయాగ్నిబలముకల్గినప్పుడు ప్రాతఃకాలమున మజ్జిగను మాత్ర ముపయోగించి, సాయంకాలమున మజ్జిగతో సిద్ధముచేయబడిన (విరళద్రవముగ కాచబడిన) పేయ యను గంజిని సైంధవలవణమును చేర్చి త్రాగించవలెను. ఇట్టి యుపయోగముచే నగ్ని వృద్ధినందినయెడ మజ్జిగను జేర్చి పక్వము జేయబడినయన్నమును (అగ్నిబలానుసారముగ) బెట్టి, మజ్జిగను పానము జేయించవలెను. పిమ్మట మజ్జిగను జేర్చి పక్వము జేయబడిన యన్నమును

పెసలకట్టు మాంసరసము మున్నగు ద్రవములయందు మజ్జిగను కలిపి అట్టి ద్రవములతో గూడ భుజింపవలెను. (అగ్నిబలము ననుసరించి యెంత ఆహారము నియ్యదగియుండునో అట్టిపరిమితిలో కొంత తక్రసిద్ధమైన యన్నమును, తక్కినభాగమునకు మజ్జిగతో కూడిన యూషములనైనను మాంసరసములనైనను ఉపయోగింపవలెనని భావము.)

మరియు పైజెప్పినరీతిగ నుపయోగించునపుడు ఆహారకాలక్రమమును వైద్యుడు చక్కగ గమనించి నానాట అన్నమును కొంచెకొంచెముగ వృద్ధిచేయుచు మజ్జిగను నానాట తగ్గించవలెనుకాని తటాలున మజ్జిగను పదలి యన్నమును మాత్ర ముపయోగింపంజనదు. ఇత్తెరంగున క్రమక్రమముగ నానాట మజ్జిగను వృద్ధినందించుచు మరల నానాట తగ్గించుచు నొకమాసమునకు మజ్జిగను పూర్తిగ వదలి యన్నము నుపయోగించవలెను. మరియు ఆహారసమయమున మజ్జిగను ఏవిధముగ నెచ్చించుచుండెనో ఆక్రమముగనే మజ్జిగను తగ్గించవలెనుకాని తటాలున తగ్గింపరాదు. అట్టియెడ మజ్జిగను తగ్గించునపుడు ఆహారపరిమితిలో నెంతపరిమాణమును మజ్జిగను తగ్గించునో ఆపరిమాణమునకు బదులుగ నన్నపరిమాణమును వృద్ధిజేయుచు నుండవలెను, కాని ఆహారసముదాయపరిమితిని తగ్గింపకూడదు. ఇట్టి తక్రోపయోగక్రమము అగ్నికి బలముకల్గుటకును అట్టిశక్తిని కాపాడుటకును, అగ్ని మరల తగ్గక దృఢముగ నుండుటకును; శరీరమునకు బలముకల్గి నానాట వృద్ధినంది వర్ణోత్కర్షము కల్గుటకును నిర్ణయింపబడినది.

ఇచ్చట నీసంగ్రహము నెరుంగునది:—అర్శోరోగపీడితునకు జాఠరాగ్ని మిక్కిలి హీనబలముగ నుండునెడ ఉదయకాలమునను సాయంకాలమునను అన్నమునకు బదులుగ మజ్జిగనే త్రాగించవలెను. ఈవిషయము "అత్యర్థమృదుకాయాగ్నేః తక్రమేవావచారయేత్" అని యుపదేశింపబడినది. అట్టి యుపయోగమువలన కొంచెము అగ్నిదీప్తి కల్గినపుడు ప్రాతఃకాలమున మజ్జిగను మాత్రము ఆహారముగ త్రాగించి సాయంకాలమునందది జీర్ణించినపిదప మజ్జిగలో బొరుగులుపిండికలిపి లేహముగజేసి యాహారముగ నియ్యవలెను. దీనివలన నింకను కొంచెము అగ్నిదీప్తి వృద్ధినొందినపుడు ప్రాతఃకాలమున మజ్జిగను మాత్రము త్రాగించి సాయంకాలము అది జీర్ణమైనపిదప మజ్జిగనుజేర్చి మెతుకులు కొంచెముగ నుండునట్లు పక్వముచేయబడిన పేయ యనుగంజిలో సైంధవలవణముజేర్చి యాహారముగ నియ్యవలెను. ఇత్తెరంగున నానాట అగ్నిదీప్తి వృద్ధినందుకొలది తక్రమును జేర్చి పక్వముజేయబడిన యన్నమున నేతిని కలిపి మజ్జిగనే యనుపానముగజేసి సాయంకాలమున నాహార మియ్యవలెను. పిమ్మట మజ్జిగతో కూడిన యూషమును జేర్చిన తక్రసిద్ధాన్నమును, అటుపిమ్మట మజ్జిగతో కూడిన మాంసరసమును జేర్చినయన్నమును, వరుసగ నగ్నివృద్ధియగుకొలది సాయంకాలమున భోజనమునకు బెట్టవలెను. అప్పుడు ప్రాతఃకాలమున

మాత్రము మజ్జిగనే త్రాగింపవలెను. ఇత్తెరంగున నానాట నుపయోగించుచు అగ్నివృద్ధి యగుకొలది పేయ-యూష-మాంసరసములను మజ్జిగతో గూర్చి యనుపానముగ నుపయోగించుచు మజ్జిగలో పక్వమైనయన్నమును ఆహారమునకు నుపయోగింపవలెను. కాని తటాలున మజ్జిగను నిలిపి యన్నమును మాత్ర ముపయోగింపజనదు. ఇట్టి తక్రోపయోగక్రమము నొకమాసమువరకును చేసి పిమ్మట మామూలుగ నాహారమును జేయవలెను. ఇట్టి క్రమాభ్యాసమున నానాట జాఠరాగ్ని వృద్ధినంది దృఢశక్తికల్గి శరీరబలంబును వర్ణోత్కర్షంబును కల్గునని భావము.

త్రివిధతక్రభేదములు, వానియుపయోగము.

మూ. రూక్షమర్ధోద్ధృతస్నేహం యతశ్చానుద్ధృతం ఘృతమ్. 84
తక్రం దోషాగ్నిబలవిత్ త్రివిధం తత్ప్రయోజయేత్,

వ్యా. పెరుగును కవ్వముచేత చక్కగ చిలికి యందుండువెన్నను పూర్తిగ తీసిన యెడ అట్టిమజ్జిగ రూక్షము (జిడ్డులేనిది) అనబడును. పెరుగును చిలికి యందలి వెన్నను సగపాలు వెలికిందీసిన నయ్యది అర్ధోద్ధృత మనబడును. పెరుగులో నీళ్లను కలపక చిలికి వెన్నను మాత్రము వెలిపరచకుండు చిక్కనిమజ్జిగ స్నిగ్ధ మనబడును. ఈమూడువిధములైన మజ్జిగలమూడిటిని వాతాదిదోషములను అగ్నిబలమును శరీరబలమును గమనించి తత్తదనుసారముగ నుపయోగించవలెను. (అందు కఫప్రకోపమునందును అగ్ని చాల మందగించియున్నపుడు బలము మిక్కిలి హీనముగ నుండునపుడును రూక్షమగుమజ్జిగ నుపయోగించవలెను. పిత్తమునందును అగ్ని మధ్యమముగ నున్నపుడును మధ్యమబలమునందును అర్ధోద్ధృతమగు మజ్జిగ నుపయోగింపనగును. వాతమునందును అగ్ని బలవత్తరముగ నుండునపుడు పూర్ణమగుబలము కల్గియున్నపుడు స్నిగ్ధమైన మజ్జిగ నుపయోగింపవలెనని భావము).

అర్శోరోగమున తక్రపానముచే గల్గుగుణము.

మూ. హతాని న విరోహన్తి తక్రేణ గుదజాని తు. 85
భూమావపి నిషిక్తం తత్ దహేత్తక్రం తృణోలుపం,
కిం పునర్దీప్తకాయాగ్నేః శుష్కాణ్యర్శాంసి దేహినః. 86

వ్యా. మజ్జిగను భూమిపై పోసినయెడ నచ్చోటనుండు గడ్డిపోచలు పచ్చికమున్నగునవియు మాడి మరల మొలవదు; కావున మజ్జిగ నుపయోగించినచో అర్శోఽఙ్కురములును మాడి మరల మొలవకుండును. అందును అగ్నిదీప్తమై అర్శస్సులు శుష్కించియుండునపుడు అర్శస్సులు పూర్తిగ నశించుటకు సందియమే యుండదు.

### తక్రపానముచే గల్గుగుణవిశేషములు.

మూ. స్రోతస్సు తక్రశుద్ధేషు రసస్సమ్యగుపైతి యః,
తేన పుష్టిః బలం వర్ణః ప్రహర్ష శ్చోపజాయతే. 87
వాతశ్లేష్మవికారాణాం శతం చాపి నివర్తతే,
నాస్తి తక్రాత్పరం కిఞ్చిత్ ఔషధం కఫవాతజే. 88

వ్యా. మరియు మజ్జిగను త్రాగుటవలన వాతశ్లేష్మములచే నడ్డగింపబడిన రసాదిసంచారస్రోతోమార్గములు శుద్ధములై యడ్డుచేయకుండును. దానంజేసి యాహారరససారము స్రోతోమార్గముల మూలమున శరీరమునందెల్ల చక్కగ వ్యాపించును. దానివలన శరీరమునకు పుష్టియు, బలంబును, వర్ణంబును, మనస్సుకు సంతసంబును కల్గును. కావున మజ్జిగను త్రాగుటవలన ఎనుబదివాతరోగంబులును, ఇరువదికఫరోగంబులును పూర్తిగ నశించును. కావున కఫవాతజార్శోరోగములయందును, ఇతరరోగములయందును మజ్జిగకుమీరిన ఔషధము వేరొండులేదు.

### అర్శోహరపేయాప్రయోగము.

మూ. పిప్పలీం పిప్పలీమూలం చిత్రకం హస్తిపిప్పలీం,
శృంగబేరమజాజీం చ కారవీం ధాన్యతుమ్బురుమ్. 89
బిల్వం కర్కటకం పాఠాం పిష్ట్వా పేయాం విపాచయేత్,
ఫలామ్లాం యమకైర్భృష్టాం తాం దద్యాత్ గుదజాపహామ్.90

వ్యా. పిప్పళ్లు, మోడి, చిత్రమూలము, ఏనుగుపిప్పళ్లు, శుంఠి, జీలకర, నల్లజీలకర, దనియాలు, తుంబురులు (కొతిమిరియాకు), లేతమారెడుపిందెలు, కర్కాటకశృంగి, చిరుబొద్ది, వీనినన్నిటిని మెత్తగ నూరి కల్కముచేసి యాకల్కమును బియ్యమును జేర్చి విధ్యుక్తప్రకారము పేయ యగుగంజిని కాచి, అందు దానిమ్మపండు మున్నగువానిరసమును పులుపుకు జేర్చి, యమకస్నేహముచే (నూనె నెయ్యియు కలిసి యమకము) తిరుగబోత మొదలగుసంస్కారమునుచేసి పానముచేసినచో గుదాంకురములు నశించును.

(ఇచ్చట "పేయా సిక్థసమన్వితా." అనుపరిభాషానుసారముగ కొద్దిగ మెతుకులుండునట్లు కాచబడినగంజి పేయ యని యెరుంగునది.)

### అర్శోహరఖడయూషాదులు.

మూ. ఏతైశ్చైవ ఖడాన్ కుర్యాత్ ఏతైశ్చ విపచేజ్జలం,
ఏతైశ్చైవ ఘృతం సాధ్యం అర్శసాం వినివృత్తయే. 91

వ్యా. మరియు పైజెప్పబడిన పిప్పళ్లు మున్నగు ద్రవ్యములను కల్కము జేసి చేర్చి ఖడయూషములనైనను, వానిని చేర్చి కాచబడిన జలమునైనను, ఈకల్కమును జేర్చి విధ్యుక్త ప్రకారము పక్వము జేయబడిన ఘృతమునైనను అర్శోరోగి నుపయోగించినచో నవి నివర్తించును.

(పిప్పళ్లు మున్నగు ద్రవ్యములను కల్కముగ జేసి మజ్జిగలోకలిపి దానిమ్మ మున్నగు పండ్లరసమును పులుపుగ జేర్చి సిద్ధము చేసినది ఖడయూషము.)

## అర్శోహరయవాగూపయోగము.

మూ. శటీపలాశసిద్ధం వా పిప్పల్ల్యా నాగరేణ వా,
దద్యాద్యవాగూం తక్రామ్లాం మరిచైరవచూర్ణితామ్. 92

వ్యా. కచోరములను మోదుగను చేర్చియైనను, పిప్పళ్లను శొంఠిని చేర్చియైనను, చేర్చి యవాగువును సిద్ధమును అందు పులుపుకై పులిమజ్జిగను జేర్చి, మిరియాలపొడిని కలిపి యుపయోగించినచో నర్శస్సులు హరించును. (మెతుకులు అధికముగ నుండునట్లు కాచబడినగంజి యవాగువు. "యవాగూర్బహు సిక్థాస్యాత్" అని పరిభాష.)

## అర్శోహరయూషములు.

మూ. శుష్కమూలకయూషం వా యూషం కౌలుత్థమేవ వా,
దధిత్థబిల్వయూషం వా సకులుత్థమకుష్ఠకమ్. 93
ఛాగలం వా రసం (ఘృతం) దద్యాత్ యూషైరేతైర్విమిశ్రితం,
లావాదీనాం ఫలామ్లం వా సతక్రం గ్రాహిభిర్యుతమ్. 94

వ్యా. మరియు ఎండినముల్లంగిని చేర్చి పక్వము చేయబడిన యూషము (కట్టు) నైనను, ఉలవకట్టునైనను, వెలగపండును బిల్వకాయను చేర్చి పక్వము చేయబడిన కట్టునైనను, ఉలవలను అడవిపెసలను చేర్చి కాచబడిన కట్టునైనను ఉపయోగింపనగును. మరియు పైజెప్పినయూషములలో మేకపోతు మాంసరసమునైనను (నేతినైనను) కలిపి సేవింపనగును. మరియు లావుకపిట్ట మున్నగుపక్షులమాంసరసమున దానిమ్మ మొదలగుపండ్ల పులుసును, పుల్లనిమజ్జిగను, మలమును నిరోధించుగుణముకల ద్రవ్యములను చేర్చి యుపయోగింపనగును.

## అర్శోరోగమున నుపయోగింపందగిన ధాన్యములు.

మూ. రక్తశాలిః మహాశాలిః కలమో లాఙ్గలస్సితః,
శారదః షష్టికశ్చైవ స్యాదన్నవిధిరర్శసామ్. 95

ఇత్యుక్తో భిన్నశకృతాం అర్శసాం చ క్రియాక్రమః,

వ్యా. ఎఱ్ఱవరి, పెద్దసంబావులు, సంబావులు, లాంగలములు (నాగలివలె వంకరగ నుండుగింజలు కలసంబావులు, దీనినే వంకసంబావులని లోకమున జెప్పెదరు.) తెల్లని రాజనములు, శారదము (శరత్కాలమున ఫలించు వరిధాన్యవిశేషము), అరువదినాళ్ల సంబావులు, ఈధాన్యములబియ్యమును అర్శోరోగముకలవారికి అన్నాదులకై యుపయోగింపదగును. పైవివరించిన క్రియాక్రమమంతయు మలము ద్రవీభూతమై ధారాళముగ వెడలుచుండు నర్శోరోగి నుద్దేశించి చెప్పబడినది.

మలబంధముకల యర్శోరోగికి వాతానులోమనచికిత్స.

మూ. యేఽత్యర్థం గాఢశకృతః తేషాం వక్ష్యామి భేషజమ్. 96

సస్నేహైః సక్తుభిర్యుక్తాం ప్రసన్నాం లవణీకృతామ్,

దద్యాత్ మత్స్యణ్డికాం పూర్వం భక్షయిత్వా సనాగరామ్. 97

వ్యా. అర్శోరోగమున మలము మిక్కిలి గట్టిపడి వెడలక బద్ధగించియుండు నపుడు వాతము అనులోమగతికల్గి మలమును సరళముగ వెడలుటకు దగినచికిత్స లీక్రింద వివరింపబడును:—

అట్టివానికి తొలుత మత్స్యణ్డిక (చక్కెరపాకవిశేషము)లో శుంఠిచూర్ణమును కలిపి తొలుత తినిపించి పిమ్మట నెయ్యి మొదలగుస్నేహములను చేర్చి పక్వముచేయబడిన సత్తుపిండిని మితముగ లవణమును చేర్చబడిన ప్రసన్నయను (వారుణి) మద్యమును త్రాగించవలెను. (వాగ్భటాచార్యులు "స్నేహాడ్యైస్సక్తుభిర్యుక్తాం లవణాం వారుణీం పిబేత్." (అ. హృ. చి. అ. ౮.) అని చెప్పెను. కావున ప్రసన్నయనుపదమునకు తేటగనుండు వారుణీమద్యమని యర్థము.)

మలబంధమునకు నాగరాదిపానకము.

మూ. గుడం సనాగరం పాఠాం ఫలామ్లం పాయయేచ్ఛృతం,

గుడం ఘృతయవక్షారయుక్తం వాపి ప్రయోజయేత్. 98

వ్యా. మరియు మలబంధముకల యర్శోరోగికి బెల్లమును పానకముచేసి యందు శుంఠిని చిరుబొద్దిని చూర్ణముచేసి కలిపి దానిమ్మపండ్లు మున్నగువానిరసమును పులుపుకై చేర్చి త్రాగించవలెను. లేక బెల్లమున నేతిని యవక్షారమును కలిపి యుపయోగించవలెను.

### యవాన్యాదియుక్తతక్రపానకము.

మూ. యవానీం నాగరం పాఠాం దాడిమస్య రసం గుడం,
సతక్రలవణం దద్యాత్ వాతవర్చోఽనులోమనమ్. 99

వ్యా. దనియాలు, శుంఠి, చిరుబొద్ది ఈమూడిటిని చూర్ణముచేసి బెల్లములో కలిపి యందు దానిమ్మరసమును కూడ చేర్చి మజ్జిగను బోసి మితముగ లవణమును జేర్చి పానకముచేసి త్రాగినచో వాతమును పురీషమును అనులోమముగ వెడలించును.

### అర్శోహరపాఠాయోగము.

మూ. దుస్పర్శకేన బిల్వేన యవాన్యా నాగరేణ వా,
ఏకైకేనాపి సంయుక్తా పాఠా హన్త్యర్శసాం రుజమ్. 100

వ్యా. చిరు(విష)బొద్దిని దురదగొండితోనైనను, మారేడుకాయ గుజ్జుతోనైనను, ఓమముతోనైనను, శుంఠితోనైనను జేర్చి (ప్రతిదినము) సేవించినచో నర్శోరోగము నివర్తించును.

### అర్శోరోగమున కరంజపల్లవోపయోగము.

మూ. ప్రాగ్భక్తం (ప్రాగ్భక్తాః) యమకే భృష్టాః సక్తుభిశ్చావచూర్ణితాః, కరఞ్జపల్లవాః దద్యాత్ వాతవర్చోఽనులోమనాః. 101

వ్యా. కానుగుచిగుళ్లను యమకస్నేహమును జేర్చి వాఢ్చి సత్తుపిండిని కలిపి అన్నమును భుజించుటకు మునుముందు తిన్నచో అపానవాతమును అనులోమముగ జేసి మలమును వెడలించును.

### అర్శోరోగమున మదిరాదిపానము.

మూ. మదిరాం వా సలవణాం, శీధుం సౌవీరకం తథా,
గుడ (ఘృతం) నాగరసంయుక్తం పిబేద్వా పౌర్వభక్తికమ్. 102

వ్యా. లవణముతోగూడిన మదిర యనుమద్యమునైనను, శుంఠిని బెల్లమును జేర్చబడిన శీధుమద్యమునైనను సౌవీరకమద్యమునైనను భుజించుటకుముందు త్రాగినచో వాతమనులోమమై మలప్రవృత్తియగును.

### అర్శోరోగమున పిప్పల్యాదిఘృతము.

మూ. పిప్పలీనాగరక్షారకారవీధాన్యజీరకైః,

ఫాణితేన చ సంయోజ్య ఫలామ్లం దాపయేద్ఘృతమ్. 103

వ్యా. పిప్పళ్లు, శుంఠి, యవక్షారము, నల్లజీలకర, దనియాలు, జీలకర వీనికల్క ములను ఘృతమున ఆవునేతిలో జేర్చి, అందు చక్కెరపాకమును, దానిమ్మ మొదలగుపండ్ల రసమును జేర్చి ఘృతపాకవిధిగ పక్వముచేసి సేవించినచో మలబంధకము నివర్తించును.

ఈయోగమును వాగ్భటాచార్యులు—"పిప్పలి......దధ్నా చ సాధితం వాత కృన్మూత్రవిదన్ధకృత్" (అ. హృ. చి. అ. ౮.) అని చెప్పెను. దీనిననుసరించి ప్రకృత మున పిప్పలి మున్నగువానిని కల్కముగజేసి పెరుగును పండ్లరసమును పరిభాషానుసార ముగ జేర్చి చక్కెరపాకమున ఘృతము సిద్ధముచేయుట మంచిది. చక్రపాణిదత్త వ్యాఖ్యానమున—"పిప్పలీ నాగరేత్యాదౌ అపక్వమేవ కేచిత్ ఘృతమిచ్ఛన్తి" అని చెప్పిరి. ఈపక్షమున పిప్పల్యాదిచూర్ణమును ఘృతమున కలిపి సేవించవలెనని యెఱుంగునది.

## అర్శోహరపిప్పల్యాదిఘృతము.

మూ. పిప్పలీపిప్పలీమూలం చిత్రకో హస్తిపిప్పలీ,
శృఙ్గిబేరయవక్షారౌ తైస్సిద్ధం వా పిబేత్ ఘృతమ్. 104

వ్యా. పిప్పళ్లు, మోడి, చిత్రమూలము, ఏనుగుపిప్పళ్లు, శుంఠి, యవక్షారము, వీనిని కల్కముజేసి ఘృతపాకవిధిప్రకారము పక్వముచేయబడిన ఘృతమును పానము చేయునది. (ఇచ్చట పిప్పలి మున్నగుద్రవ్యములను కల్కముచేసి పెరుగును ద్రవమునకై చేర్చి పరిభాషానుసారముగ ఘృతమును పక్వము చేయనగును. క్రిందచెప్పబడు యోగము లలో దధిని చెప్పియున్నది కావున తత్సన్నియోగశిష్టమగుటచే నీయోగమున పెరుగును చేర్చుట సమంజసము.)

## కొన్నిఘృతయోగములు.

మూ. చవ్యచిత్రకసిద్ధం వా గుడక్షారసమన్వితం,
పిప్పలీమూలసిద్ధం వా సగుడక్షారనాగరమ్.
(గుడక్షారసమన్వితమ్.) 105
పిప్పలీ పిప్పలీమూల దధిదాడిమధాన్యకైః,
(దధినాగరధాన్యకైః,)
సిద్ధం సర్పిర్విధాతవ్యం వాతవర్చోవిబన్ధనుత్. 106

వ్యా. చవ్యము, చిత్రమూలము ఈరెంటిని కల్కముగచేర్చి పెరుగును ద్రవము నకుజేర్చి సిద్ధముచేయబడిన ఘృతమున బెల్లమును యవక్షారమును (ప్రక్షేపన్యాయముగ

సారముగ) సిద్ధఘృతమున జేర్చి సేవించునది. మరియు మోడినిమాత్రము కల్కముగ జేర్చి పెరుగును కలిపి సిద్ధముచేయబడిన ఘృతమునందు బెల్లమును యవక్షారమును శుంఠి చూర్ణమును (ప్రక్షేప్యముగ) కలిపియైనను సేవించదగును. లేక పిప్పళ్లు, మోడి శుంఠి ఈమూటిని కల్కముగగూర్చి పెరుగును దానిమ్మపండ్లరసమును ద్రవమునకు జేర్చి (విధ్యుక్త ప్రకారము) సిద్ధముచేయబడిన ఘృతము నుపయోగించునది. ఈఘృతముల నుపయోగించుటచేత వాతమును పురీషమును బద్ధకమును మాని సరళముగ వెడలును.

### అర్శోరోగమున వాతానులోమనచవ్యాదిఘృతము.

మూ. చవ్యం త్రికటుకం పాఠాం క్షారం కుస్తుమ్బురూణి చ,
యవానీం పిప్పలీమూలం ఉభే చ బిడసైన్ధవే. 107
చిత్రకం బిల్వమభయాం పిష్ట్వా సర్పిర్విపాచయేత్,
శకృద్వాతానులోమ్యార్థం జాతే దధ్ని చతుర్గుణే. 108
ప్రవాహికాం గుదభ్రంశం మూత్రకృచ్ఛ్రం పరిస్రవం,
గుదవంక్షణశూలం చ ఘృతమేతద్వ్యపోహతి. 109

వ్యా. చవ్యము, త్రికటుకములు, విషబొద్ది, యవక్షారము, దనియాలు, ఓమము, మోడి, బిడాలవణము, సైంధవలవణము, చిత్రమూలము, బిల్వకాయ, కరకకాయలు, వీనినన్నింటిని నూరి కల్కముగగూర్చి, చక్కగ పేరి పుల్లగనుండు పెరుగును ఘృతమునకు నాల్గింతలు జేర్చి (ఘృతపాకవిధిగ) పక్వముచేయునది. ఈఘృతమును ప్రయోగించిన యెడ పురీషమును అపానవాతమును అనులోమముగ వెడలింపజేయును. ప్రహితమను బంకవిరేచనమును, గుదభ్రంశమును, మూత్రకృచ్ఛ్రమును, రక్తస్రావమును, గుదస్థానము నందును గజ్జలయందును కల్గునొప్పిని హరించును. (ఇచ్చట ద్రవమును మాత్రము 'దధ్ని చతుర్గుణే' అని నిర్దేశించియున్నది. కల్కమును సామాన్యపరిభాషచే ఘృతమునకు నాల్గవవంతు జేర్చవలెనని యెరుంగునది.)

### అర్శోరోగాదులకు చాంగేరీఘృతము.

మూ. నాగరం పిప్పలీమూలం చిత్రకో హస్తిపిప్పలీ,
శ్వదంష్ట్రా పిప్పలీ ధాన్యం బిల్వం పాఠా యవానికా. 110
చాఙ్గేరీస్వరసే సర్పిః కల్కైరేతైర్విపాచయేత్,
చతుర్గుణేన దధ్నా చ తత్ ఘృతం కఫవాతనుత్. 111

అర్శాంసి గ్రహణీదోషం మూత్రకృచ్ఛ్రం ప్రవాహికాం,
గుదభ్రంశార్తిమానాహం ఘృతమేతత్ వ్యపోహతి. 112

వ్యా. శుంఠి, పిప్పలీమూలము (మోడి), చిత్రమూలము, ఏనుగుపిప్పళ్లు, పల్లేరు, పిప్పళ్లు, దనియాలు, బిల్వఫలము, విషబొద్ది, ఓమము, వీనినన్నిటిని సమభాగములుగ జేర్చి కల్కము జేసి యాకల్కమునకు నాల్గింతలఘృతమును జేర్చి ఘృతమునకు నాల్గింతలు పులిచింతాకురసమును, నాల్గింతలు పెరుగును జేర్చి ఘృతపాకవిధిప్రకారము పక్వము జేయునది. ఈఘృతము కఫమును వాతమును హరించును. మరియు నీఘృతమును సేవించినచో అర్శస్సులను, గ్రహణీదోషమును, మూత్రకృచ్ఛ్రమును, ప్రవాహికను (బంకవిరేచనములను), గుదభ్రంశమును, గుదస్థానమునందలిబాధను, కడుపుబ్బరమును పోనడచును. (ఇచ్చట "చతుర్గుణేన దధ్నా చ" అను చకారమువలన చాంగేరీస్వరసంబును దధియు ప్రత్యేకము ఘృతమునకు నాల్గింత లుండవలెనని తెలిసెడి).

### అర్శోరోగాదులకు వేరొకపిప్పల్యాదిఘృతము.

మూ. పిప్పలీం నాగరం పాఠాం శ్వదంష్ట్రాం చ పృథక్ పృథక్,
భాగాన్ త్రిపలికాన్ కృత్వా కషాయముపకల్పయేత్. 113
గణ్డీరం పిప్పలీమూలం వ్యోషం చవ్యం చ చిత్రకమ్,
పిష్ట్వా కషాయేవినయేత్ పూతే ద్విపలికం(పూతేఽర్ధపలికం)భిషక్.
పలాని సర్పిషస్తస్మిన్ చత్వారింశత్ ప్రదాపయేత్,
చాంగేరీస్వరసం తుల్యం సర్పిషా దధి షడ్గుణమ్. 115
మృద్వగ్నినా తతస్సాధ్యం సిద్ధం సర్పిర్నిధాపయేత్,
తదాహారే విధాతవ్యం పానే ప్రాయోగికే విధౌ. 116
గ్రహణ్యర్శోవికారఘ్నం గుల్మహృద్రోగనాశనం,
శోథప్లీహోదరానాహమూత్రకృచ్ఛ్రజ్వరాపహమ్. 117
కాసహిక్కాఽరుచిశ్వాసనసూదనం పార్శ్వశూలనుత్,
బలపుష్టికరం వర్ణ్యం అగ్నిసన్దీపనం పరమ్. 118

వ్యా. పిప్పళ్లు, శుంఠి, విషబొద్ది, పల్లేరువేళ్లు ఈనాల్గిటిని ఒక్కొకదానిని మూడేసిపలములవంతున (కషాయచూర్ణమును)గూర్చి నలియకొట్టి అందు (నాల్గుప్రస్థములు (అరువదినాల్గుపలములు) నీళ్లుబోసి (నలుబదిపలములు మిగులునట్లు) కషాయమును సిద్ధముచేయునది. పిమ్మట ఏరుపంగ, మోడి, త్రికటుకములు, చవ్యము, చిత్రమూలము,

వీనిని ప్రత్యేకము రెండేసిపలములవంతున గూర్చి పైజెప్పినకషాయమును వడగట్టుకొని యాకషాయమునజేర్చి నూరి కల్కముచేయునది. అందు నలువదిపలములు ఆవునెయ్యి చేర్చి, నేతికి సమభాగముగ (నలువదిపలములు) పులిచింతాకు స్వరసంబును, నేతికి ఆరింతలు (ఇన్నూటయిరువదిపలములు) పెరుగును గూర్చి యన్నిటి నొకటిగ కలియ గూర్చి మృద్వగ్నిచే (ఘృతపాకవిధి ప్రకారము) పక్వముచేసి యుంచుకొనునది.

ఈఘృతమును ఆహారములయందును, త్రాగుటకును, ఆయాచికిత్సాప్రయోగముల యందును (కాలబలాద్యనుసారముగ) నుపయోగింపవలెను. ఈఘృతము గ్రహణిదోషము, అర్శస్సులు, గుల్మములు, హృద్రోగము, శోఫము, ప్లీహాభివృద్ధి, ఉదరము, కడుపుబ్బరము, మూత్రకృచ్ఛ్రము, జ్వరము, కాసము, ఎక్కిళ్లు, అరుచి, శ్వాసము, పార్శ్వశూలము ఈరోగముల నన్నింటిని హరించును. శరీరమున బలమును పుష్టిని కల్గించును. శరీరకాంతిని కల్గించును. జఠరాగ్నిని చక్కగ దీపింపజేయును.

ఇచ్చట క్వాథచూర్ణమునకు మాత్రము పరిమితి చెప్పి కషాయపరిమాణము చెప్పి యుండలేదు. అయినను ఈఘృతము బహుద్రవ్యసాధ్యముగ నుండుటంబట్టి ఘృతమునకు సమానముగ నుండునట్లు కషాయమును కల్పింపవలెను. కావున పిప్పళ్లు మొదలగు క్వాథ్య ద్రవ్యములు నాల్గును ప్రత్యేకముగ మూడేసిపలములవంతున పండ్రెండుపలములనుగూర్చి, అందు మూడుప్రస్థములు జలమునుబోసి ఘృతమునకు సమభాగముగ నలువదిపలములు మిగులునట్లు కల్పింపవలెను. ఆకషాయమున గండీరాదికల్కద్రవ్యములను రెండేసిపలముల వంతున నూరి కల్కముజేసి కలిపి నలువదిపలములు ఘృతమును, ఘృతసమముగ చాంగేరీ స్వరసమును, ఘృతమున కారింతలు పెరుగును కల్పి యన్నింటి నొకటిగగూర్చి ఘృత పక్వముచేయునది.

## వాతానులోమనమునకు హరీతకీప్రయోగము.

మూ. సగుడాం పిప్పలీయుక్తాం ఘృతభృష్టాం హరీతకీం,
త్రివృద్దన్తీయుతాం వాపి భక్షయేదానులోమికామ్. 119
విడ్వాతకఫపిత్తానాం అనులోమ్యేఽథ నిర్వృతే,
గుదేఽర్శాంసి ప్రశామ్యన్తి పావకశ్చాభివర్ధతే. 120

వ్యా. కరకకాయలను నేతిలో వేయించి, అందు పిప్పళ్లను చూర్ణముచేసి కలిపి బెల్లముతోగూర్చి తినవలెను. లేక అట్టి కరకకాయలను తెగడను నేపాళమును కలిపి చూర్ణముజేసి బెల్లముతోగూర్చియైనను సేవింపనగును. దీనియుపయోగమువలన పురీషము,

వాత-పిత్తకఫములును అనులోమగతినొంది మలములు వెడలును. దానివలన గుదస్థానము నందలి యర్శస్సులు శాంతినొందును. జాఠరాగ్ని దీపించి వృద్ధినొందును.

## పురీషవాతములు బద్ధగించిన యర్శోరోగమున మాంసరసోపయోగము.

మూ. బర్హితిత్తిరిలావానాం రసానమ్లాన్ సుసంస్కృతాన్,
దక్షాణాం వర్తకానాం చ దద్యాద్విడ్వాతసంగ్రహే. 121

వ్యా. నెమలి, తీతువుపిట్ట, లావుకపిట్ట, కోడి, వెలిచెపిట్ట, ఈపక్షులమాంసరసములను దానిమ్మపులుసు మున్నగువానిగూర్చి విధిప్రకారము సంస్కరించి అర్శోరోగముల యందు మలంబును వాతంబును బద్ధగించియున్నపు డుపయోగించునది.

## మలబద్ధకమున శాకోపయోగము.

మూ. త్రివృద్దన్తీపలాశానాం చాఙ్గేర్యాశ్చిత్రకస్య చ,
యమకే భర్జితం (సుభృష్టంయమకే)దద్యాత్ శాకం దధిసమన్వితమ్.

వ్యా. తెగడ ఆకు, నేపాళపుఆకు, పులిచింతాకు, చిత్రమూలపుఆకు, ఈయాకు కూరలను పెరుగునుగూర్చి నేతియందును నూనెయందును చక్కగ వాడిచి పక్వముజేసి యర్శోరోగికి మలము బద్ధగించియున్నపుడు ఉపయోగింపనగును.

## అర్శోరోగికిశాకము.

మూ. ఉపోదికాం తణ్డులీయం వీరాం వాస్తుకపల్లవాన్,
సువర్చలాం సలోణీకాం యవశాకమవల్గుజమ్. 123
కాకమాచీం రుహాపత్రం మహాపత్రీం తథామ్లికాం,
జీవన్తీం శటిశాకం చ శాకం గృఞ్జనకస్య చ. 124
దధిదాడిమసిద్ధాని యమకే భర్జితాని చ,
ధాన్యనాగరయుక్తాని శాకాన్యేతాని దాపయేత్. 125

వ్యా. బచ్చలియాకు, చిట్టీయాకు, ఏరుమద్దియాకు, చక్రవర్తికూర, ప్రొద్దుతిరుగుడుచెట్టుఆకు, పులిచింతాకు (లేక పావిలాకు) యవశాకము, బావంచియాకు, కాచియాకు, గరిక, ముయ్యాకుపొన్న, చుక్కకూర, పాలకూర, కచోరపుఆకు, నీరుల్లియాకు, ఈయాకులలో దేనినైన నొకటిని పెరుగును దానిమ్మపులుపును కలిపి యుడికించి, యమకస్నేహమును (నెయ్యి నూనె) గూర్చి వాడిచి, దనియాలను శుంఠిని చూర్ణము చేసి తిరగబోతబెట్టి కలిపి యీకూరలను అర్శోరోగమున భోజనముతో సేవింపనగును.

వాతార్శస్సులయందు మాంసరసోపయోగము.

మూ. గోధాలోపాకమార్జారశ్వావి దుష్ట్రగవామపి,
కూర్మశల్లకయోశ్చైవ సాధయేచ్ఛాకవద్రసాన్. 126
రక్తశాల్యోదనం దద్యాత్ రసైస్తైర్వాతశాన్తయే,

వ్యా. మరియు ఉడుము, లోపాకమను జంతువిశేషము, పిల్లి, ముండ్లపంది, ఒంటె, ఎద్దు, తాబేలు, అడవిపంది, ఈజంతువులమాంసరసమును పైజెప్పినశాకములవలెనే పక్వముజేసి సంస్కరించి ఎఱ్ఱవరిబియ్యపుఅన్నమున పైజెప్పినశాకములను ఈమాంసరసములను భుజించినచో నర్శోరోగమున వాతము శమించును.

వాతార్శస్సునందు వాతానులోమనానుపానములు.

మూ. జ్ఞాత్వా వాతోల్బణం రూక్షం మన్దాగ్నిం గుదజాతురమ్. 127
మదిరాం శార్కరం జాతం శీధుం తక్రం తుషోదకం,
అరిష్టం దధిమణ్డం వా, శృతం వా శిశిరం జలమ్. 128
కణ్టకార్యా శృతం వాపి, శృతం నాగరధాన్యకైః,
అనుపానం భిషగ్దద్యాత్ వాతవర్చోఽనులోమనమ్. 129

వ్యా. అర్శోరోగపీడితునకు వాతము మిక్కిలి ప్రకోపించి కోష్ఠము రూక్షమై యగ్ని మందగించియుండునపుడు అట్టి లక్షణములను చక్కగ గమనించి మదిర యను మద్యమునైనను, చక్కెరతో సిద్ధముచేయబడిన శీధుమద్యమునైనను, మజ్జిగ (సిద్ధమైన) నైనను, తుషోదకమునైనను, క్రిందవివరింపబడు అరిష్టమునైనను, పెరుగుమీది తేట నీటినైనను, కాగి చల్లారినజలమునైనను, వాకుడువేరును చేర్చి కాచబడినజలమునైనను, శుంఠిని దనియాలనుచేర్చి కాచబడిన జలమునైనను, ఆహారాదిసమయములయందు అనుపానముగ త్రాగింపవలెను. ఈయనుపానములచేత వాతమును పురీషమును అనులోమముగ జేసి వెడలించును.

అర్శస్సునందు ఉదావర్తాదుల కనువాసనవస్తి.

మూ ఉదావర్తపరీతా యే యే చాత్యర్థం విరూక్షితాః,
విలోమవాతాః శూలార్తాః తేష్విష్టమనువాసనమ్ 130

వ్యా. అర్శోరోగమున వాతము ప్రతిలోమముగ పైకి సంచరించుచున్నను, కోష్ఠము శరీరమును మిక్కిలి రూక్షముగనున్నను, వాతము విలోమగతినొంది శూల

శూలచే పీడింపబడియున్నను అట్టి పరిస్థితియందు అనువాసనవస్తిని ఈక్రింద చెప్పబడు నౌషధముచే ననువాసనవస్తిని చేయుట చాల మంచిది.

### అనువాసనవస్తివిధానము.

మూ. పిప్పలీం మదనం బిల్వం శతాహ్వాం మధుకం వచాం,
కుష్ఠం శటీం పుష్కరాఖ్యం చిత్రకం దేవదారుచ. 131
పిష్ట్వాతైలంవిపక్తవ్యంపయసాద్విగుణేనచ (ద్విగుణక్షీరసంయుతం.)
అర్శసాం మూఢవాతానాం తచ్ఛ్రేష్ఠమనువాసనమ్. 132
గుదనిస్సరణం శూలం మూత్రకృచ్ఛ్రం ప్రవాహికాం,
కట్యూరుపృష్ఠదౌర్బల్యం ఆనాహం వంక్షణాశ్రయమ్ 133
పిచ్ఛాస్రావం గుదే శోఫం వాతవర్చోవినిగ్రహం,
ఉత్థానం బహుశో యచ్చ జయేత్తచ్చానువాసనమ్. 134

వ్యా. పిప్పళ్లు, మ్రంగకాయ, మారేడుకాయగుంజు, సదాపవిత్తులు, అతిమధురము, వస, చెంగల్వకోష్టు, కచోరములు, పుష్కరమూలము (మెట్టదామర), చిత్రమూలము, దేవదారుచెక్క వీనినన్నిటిని సమభాగముగ కూర్చినసముదాయము తైలమునకు నాల్గవపాలుండునట్లు కల్కమునకుగాను సిద్ధముచేసి, తైలమునకు రెండింతలు పాలలో నూరి కలిపి తైలమునజేర్చి (తైలపాకవిధిప్రకారము) పక్వముజేసి, యాతైలముచేత వాతాధిక్యమునగల్గిన యర్శోరోగముకలవానికి (విధ్యుక్తప్రకారము) అనువాసనవస్తిని చేయుట మిగుల శ్రేష్ఠము.

మరియు నీవస్తిప్రయోగమువలన గుదభ్రంశంబును, శూలంబును, మూత్రకృచ్ఛ్రంబును, ప్రవాహికయు (బంకవిరేచనములు), కటిప్రదేశమునను తొడలయందును వీపునందును కల్గుబలహీనమును, గజ్జలలోకల్గు ఆనాహమును, గుదస్థానమున గంజివలెగల్గు స్రావంబును, గుదస్థానమునందలి శోఫమును, వాతపురీషములబంధమును, పలుమారు మొలచుచుండు అర్శోంకురములను వీనినన్నింటిని హరించును.

ఇచ్చట:—"యః స్నేహైర్దీయతే సస్యాదనువాసననామతః" అనువచనప్రకారము స్నేహద్రవ్యముచేజేయబడు వస్తికర్మము అనువాసనవస్తి యని యెరుంగునది. అనువాసనవస్తి ప్రయోగవిధానమును వాగ్భటాచార్యులు వస్తివిధ్యధ్యాయమున "ఆస్థాప్యం స్నేహితం స్విన్నం......సకృదేవ ప్రయోజయేత్" (అ. హృ. అ. ౧౯. శ్లో. ౨౦-౨౫) అనుగ్రంథముచే వివరించి చెప్పిరి. ఆవిధానము నిచ్చట నతిదేశించుకొనునది.

మరియు వాగ్భటులును ఈయోగమును ఇవే యానుపూర్వి ననువదించిరి. సర్వాంగసుందరవ్యాఖ్యానమున "స్నేహసక్షీరమాంగల్యైః పాకో యత్రేరితః క్వచిత్, జలం చతుర్గుణం తత్ర బీజాదానార్థమావపేత్" అనుప్రమాణము ననుసరించి పాలతో గూడ స్నేహమునకు నాల్గింతలజలము చేర్చి పక్వముచేయవలెనని చెప్పిరి.

## అర్శస్సులు స్తంభించినపుడు స్రావణమునకు లేపము.

మూ. అనువాసనికైః పిష్టైః సుఖోష్ణైః స్నేహసంయుతైః,
దార్వ్యన్తైః స్తబ్ధశూలాని గుదజాని ప్రలేపయేత్. 135
దిగ్ధాస్తైః ప్రస్రవన్త్యాశు శ్లేష్మపిచ్ఛాం సశోణితాం,
కణ్డూః స్తమ్భః సరుక్ శోఫః స్రుతానాం వినివర్తతే. 136

వ్యా. మరియు పైని అనువాసనవస్తియోగమున జెప్పబడిన పిప్పలిమొదలు దేవదారువరకు ద్రవ్యములను పైజెప్పినరీతిగ పాలతోజేర్చి నూరి మెత్తగనుండు యాపిష్టమును అర్శోఙ్కురములనుండి ద్రవము బైటవెడల స్తంభించి పోటుకల్గియుండునపుడు వానిపై బూసినయెడ కఫముతోకూడిన జిగురువలె నుండుద్రవమును రక్తమును స్రవింపజేయును. అట్టిద్రవము స్రవించినపిదప దురదయు, స్తబ్ధత్వంబును, నొప్పియు, శోఫంబును నివర్తించును.

ఇచ్చట షడ్విరేచనశతాశ్రితీయాధ్యాయమున "రాస్నాసురదారు......అనువాసనోపగాని భవన్తి" (సూ. అ. ౪. సూత్రము. ౪౯) అని నిర్దేశింపబడిన అనువాసనక్వాథద్రవ్యగణమును గ్రహింపక ఇచ్చట "పిప్పలీం...దేవదారు చ" అని పైనినిర్దేశింపబడిన పిప్పల్యాదిద్రవ్యముల గ్రహింపవలెనని సూచించుటకై "దార్వ్యన్తైః" అని చెప్పబడినది. కావున పైజెప్పినద్రవ్యములనే గ్రహించునది.

మూ. నిరూహం వా ప్రయుఞ్జీత సక్షీరం దాశమూలికం,
సమూత్రస్నేహలవణం కల్కైర్యుక్తం ఫలాదిభిః. 137

వ్యా. దశమూలముల జేర్చి కషాయము కాచి యాకషాయమును పాలలో కలిపి అందు గోమూత్రమును, స్నేహద్రవ్యమును మ్రంగకాయ మున్నగు (ఆస్థాపనయోగికములగు) వానికల్కమును సైంధవలవణమును విధ్యుక్తప్రకారము జేర్చి నిరూహవస్తిని ప్రయోగింపనగును.

ఇచ్చట "కషాయక్షీరతైలైర్యో నిరూహస్స నిగద్యతే" అనువచనప్రకారము కషాయమును పాలను తైలములను ఒకటిగ గూర్చి చేయబడినది నిరూహవస్తియని

మెరుంగునది. మరియు నిరూహవస్తికల్పనమును వాగ్భటాచార్యు లిట్లు చెప్పెను:— "క్వాథయేత్ వింశతిపలం ద్రవ్యస్యాష్టౌ పలానిచ, తతః క్వాథాచ్చతుర్థాంశం స్నేహం వాతే ప్రకల్పయేత్". (అ. హృ. సూ. అ. ౧౯. శ్లో. ౩౮) నిరూహవస్తికై చెప్పఁడిన క్వాథ్యద్రవ్యసముదాయము ఇరువదిపలములను మ్రంగకాయల నెనిమిదిచేర్చి ఈద్రవ్యమునకు పదునారుభాగములు నీళ్లు బోసి నాల్గవపాలు మిగులునట్లు కషాయము కాచవలెను. ఆకషాయమున నాల్గవవంతు స్నేహద్రవ్యమును జేర్చి వస్తిప్రయోగము చేయవలెను. ఈప్రమాణమునుబట్టి ప్రకృతయోగమున దశమూలములు పదియు చేరిన సముదాయద్రవ్యము ఇరువదిపలములను, మ్రంగకాయల నెనిమిదిటిని గూర్చి అందు ద్రవ్యసముదాయమునకు నారువంతులు నీళ్లుబోసి నాల్గవపాలు మిగులునట్లు కషాయము కాచి అందును క్షీరమును గోమూత్రమును సైంధవలవణమును యథోచితముగను, కషాయమునకు నాల్గవవంతు స్నేహమును చేర్చి నిరూహవస్తిని విధ్యుక్తప్రకారము ప్రయోగింపవలెనని భావము.

## అర్శోనాశకాభయారిష్టము.

మూ. హరీతకీనాం ప్రస్థార్ధం ప్రస్థమామలకస్య చ,
స్యాత్కపిత్థాద్దశపలం తతోఽర్ధా చేన్ద్రవారుణీ. 138
విడఙ్గం పిప్పలీ లోధ్రం మరిచం సైలవాలుకం,
ద్విపలాంశం, జలస్యైతత్ చతుర్ద్రోణే విపాచయేత్. 139
ద్రోణశేషే రసే తస్మిన్ పూతే శీతే సమావపేత్,
గుడస్య ద్విశతం తిష్ఠేత్ తత్పక్షం ఘృతభాజనే. 140
పక్షాదూర్ధ్వం భవేత్పేయా తతో మాత్రా యథాబలం,
అస్యాఽభ్యాసాదరిష్టస్య గుదజా యాన్తి సంక్షయమ్. 141
గ్రహణీపాణ్డుహృద్రోగప్లీహగుల్మోదరాపహాః,
కుష్ఠశోఫాఽరుచిహరః బలవర్ణాఽగ్నివర్ధనః. 142
సిద్ధోఽయమభయారిష్టః కామలాశ్విత్రనాశనః,
కృమిగ్రన్థ్యర్బుదవ్యఙ్గరాజయక్ష్మజ్వరాన్తకృత్. 143

(ఇత్యభయారిష్టః.)

వ్యా. కరకకాయలబెరడు అర్ధప్రస్థము (ఎనిమిదిపలములు), ఉసిరికకాయల బెరడు ఒకప్రస్థము, (పదునారుపలములు), వెలగకాయగుజ్జు పదిపలములు, పెద్దపాపర

ఐదుపలములు, వాయువిడంగములు, పిప్పళ్లు, లొద్దుగుపట్ట, మిరియాలు, కూతురుబుడమ (నూగుదోస) ఇవి ప్రత్యేకము రెండేసిపలములు; వీనినన్నింటిని పైనిచెప్పిన భాగప్రకారము కూర్చి నలియగొట్టి, నాల్గుద్రోణముల (పదునారుఆఢకముల-౧౦౨౪ పలముల) జలములో చేర్చి, ఒకద్రోణము (నాల్గవవంతు) మిగులునట్లులు చుండ కషాయముకాచి, చల్లారినసిదప వడగట్టి, అందు రెండువందలపలములు ప్రాతబెల్లమును జేర్చి, నేతితోమాగిన కుండలోబోసి (వాసెనగట్టి చీలమన్ను లేపనముజేసి) పదునైదుదినము లుంచునది. ఇది యభయారిష్టమని చెప్పబడును.

దీనిని పదునైదుదినములు కడచినపిమ్మట అగ్నిబలానుసారముగ తగుపరిమాణముచే సేవించుచున్నయెడ అర్శోంకురములు నశించును. మరియు గ్రహణీదోషము, పాండురోగము, హృదయరోగము, ప్లీహవృద్ధి, గుల్మములు, మహోదరము, కుష్ఠములు, శోఫములు, అరోచకము, ఈరోగములు హరించును. శరీరబలమును వర్ణమును జాఠరాగ్నిని నానాట వృద్ధినందించును. కామలారోగమును శ్విత్రమును నశింపజేయును. క్రిమిరోగమును గ్రంథులను అర్బుదమును వ్యంగము (మంగు)ను, రాజయక్ష్మమును, జ్వరమును హరించును. ఇదియే యభయారిష్టమని చెప్పబడును. (ఇచ్చట కరకకాయలను ఉసిరికకాయలను లోపలిగింజలనువిడదీసి బెరడునుమాత్రము అర్ధప్రస్థాదినియతప్రమాణముగ జేర్పనగును). వాగ్భటాచార్యులు ఈయభయారిష్టయోగమును చెప్పునపుడును "పాదశేషే గుడాత్తులే, దత్వా ప్రస్థం చ ధాతక్యాః స్థాపయేద్ఘృతభాజనే"(అ. హృ. చి. అ. ౮; శ్లో. ౬౬) అని చెప్పెను. ఇందు "ప్రస్థంతు ధాతక్యాః" అని యధికముగ జెప్పబడినది. తక్కిన ప్రక్రియయంతయు ప్రకృతగ్రంథమునకన్న భేదము కానరాదు. దీనినిబట్టి బెల్లమును జేర్చునపుడు పదునారుపలములు ఆరెపువ్వును కూడ చేర్చవలెనని తెలిసెడి.

## అర్శోహరదన్త్యరిష్టము.

మూ. దన్తీచిత్రకమూలానాం ఉభయోః పఞ్చమూలయోః,
భాగాన్ పలాంశానాపోథ్య జలద్రోణే విపాచయేత్. 144
త్రిపలం త్రిఫలాయాశ్చ దలానాం తత్ర దాపయేత్,
రసే చతుర్థశేషే తు పూతే శీతే సమావపేత్. 145
తులాం గుడస్య; తత్తిష్ఠేత్ మాసార్ధం ఘృతభాజనే,
తన్మాత్రయా పిబేన్నిత్యం అర్శోభ్యో విప్రముచ్యతే. 146

గ్రహణీపాణ్డురోగఘ్నం వాతవర్చోఽనులోమనం,
దీపనం చారుచిఘ్నం చ దన్త్యరిష్టమిదం విదుః. 147

(ఇతి దన్త్యరిష్టః.)

వ్యా. దంతివేళ్లు, చిత్రమూలము, దశమూలములు, (కోలపొన్న, నక్కతోక పొన్న, వాకుడు, ములకపల్లేరు, మారేడు, కూరసెల్లి, దుండిగము, పాదర, గుమ్మడి, ఈ రెండుపంచమూలములును చేరి దశమూలములు) ఈద్రవ్యములను ప్రత్యేక మొక్కొక పలమువంతున జేర్చి నలియగొట్టి యొకద్రోణపరిమితమైన (ఇన్నూటయేబదియారుపల ముల) జలమున జేర్చి, అందు త్రిఫలముల (కరక-తాని-ఉసిరికకాయల) బెరడును మూడును చేరి మూడుపలములనుకూడ జేర్చి, నాల్గవపాలు (ఒక ఆఢకము-౬౪ పలములు) మిగులు నట్లు చుండ కషాయముకాచి, చల్లారినపిదప వడగట్టి నేతితోమాగిన కుండలో బోసి, అందు నూరుపలములు పాతబెల్లమును కలిపి మూసి వాసెనగట్టి యొకపక్షమువరకును పదిలముగ నునిచి, పిదప నీయరిష్టమును అగ్నిబలానుసారముగ మాత్రగల్పించి ప్రతిదినం బును (అభయారిష్టమునువలె) సేవించుచున్నయెడ నర్శస్సులు నివర్తించును. మరియు గ్రహణీదోషమును పాండురోగమును హరించును. వాతమును పురీషమును అనులోమ ముగ వెడలించును. అగ్నిని దీపింపజేసి యరుచిని పోగొట్టును. ఇది దంత్యరిష్ట మన బడును.

ఇచ్చట దశమూలముల పదిటిని, త్రిఫలముల మూటిని యొక్కొకదానిని యొక్కొక పలమువంతున గూర్పనగును. కావున "త్రిఫలాయా దశానాం చ ప్రక్షిప్య త్రిపలం" అనుచోట త్రిఫలములు మూడును జేరిన సముదాయము మూడుపలములని యర్థము. ఈయభిప్రాయముచేతనే వాగ్భటాచార్యులు—"జలద్రోణే పచేద్దన్తీ దశమూలవరాఽగ్నికాన్, పాలికాన్" (అ. హృ; చి. అ. ౮. శ్లో. ౬౮.) అని నిర్దేశించిరి. మాన ప్రధానముగ నిర్దేశింపబడినది కావున త్రిఫలపరిమాణమును ప్రత్యేకముగ నొక్కొక పలము వంతున జేరినసముదాయము మూడుపలములగును.

## అర్శోహరఫలారిష్టము.

మూ. హరీతకీఫలం ప్రస్థం ప్రస్థమామలకస్య చ,
విశాలాయా దధిత్థస్య పాఠాచిత్రకమూలయోః. 148
ద్వే ద్వే పలే సమాపోథ్య ద్విద్రోణే సాధయేదపాం,
పాదావశేషే పూతే చ రసే తస్మిన్ ప్రదాపయేత్. 149
గుడస్యైకాం తులాం వైద్యః తత్ స్థాప్యం ఘృతభాజనే,

పక్వ స్థితం పిబేదేనం గ్రహణ్యర్శోవికారనుత్. 150
హృత్పాణ్డురోగం ప్లీహానం కామలాం విషమజ్వరం,
వర్చోమూత్రానిలకృతాన్ విబన్ధానగ్ని మార్దవమ్. 151
కాసం గుల్మముదావర్తం ఫలారిష్టో వ్యపోహతి,
అగ్నిసన్దీపనో హ్యేషః కృష్ణాత్రేయేణ భాషితః. 152

(ఇతి ఫలారిష్టః.)

వ్యా. చక్కగ మగిరి పండిన కరకకాయలబెరడు ఒక ప్రస్థము (పదునారుపలములు), ఉసిరికకాయలబెరడు ఒకప్రస్థము, పెద్దపాపర, వెలగపండుగుజ్జు, విషబొద్దివేరు, చిత్రమూలమువేరు, ఇవి ప్రత్యేకము రెండేసిపలములు, వీనినన్నింటిని నలియగొట్టి రెండుద్రోణముల (ఎనిమిదియాఢకముల) నీటిలో జేర్చి, నాల్గవవంతు మిగులునట్లు కషాయము కాచి చల్లారినపిదప వడగట్టి యందు నూరుపలములు ప్రాతబెల్లమును కలిపి నేతితో మాగినకుండలో బోసి, పదునైదుదినములవరకును వాసెనగట్టి పదిలముగ నునిచి పిమ్మట అగ్నిబలాద్యనుసారముగ ప్రతిదినమును సేవించినయెడ గ్రహణిరోగంబులును అర్శస్సులును నివర్తించును. మరియు హృద్రోగంబును, పాండురోగంబును, ప్లీహవృద్ధియు, కామలారోగంబును, విషమజ్వరంబును, వాత-మూత్ర-పురీషబంధంబును, అగ్నిమాంద్యంబును, కాసంబును, గుల్మంబులును, ఉదావర్తంబును, ఈయరిష్టమును సేవించుటవలన నివర్తించును. మందగించిన జాఠరాగ్నిని దీపింపజేయును. ఇయ్యది ఫలారిష్టమని చెప్పంబడును. కృష్ణాత్రేయునిచే జెప్పబడినది.

ఇచ్చట వ్యాఖ్యానమున "హరీతకీత్యాదౌ ఫలశబ్దేన నిరస్థి హరీతకీం గ్రాహయతి' తేన నిరస్థి హరీతకీప్రస్థార్థం" అని చక్రపాణిదత్తుడు నివరించెను. దీనిప్రకారము కరకకాయలబెరడు అర్థప్రస్థమని తేలినది; కాని మూలమున వాచనికమగు పరిమాణమును గ్రహించుటకు తగినప్రమాణము కనుబడలేదు. మరియు జతూకర్ణతంత్రమున "హరీతకీఫలప్రస్థః, ద్విగుణాహ్యామలక-కపిత్థ-పాఠా-ఇంద్రాః సచిత్రకాః గుడస్యచ శతద్వయమ్." అని యున్నది. దీనిప్రకారము కరకకాయబెరడు మాత్రము ఒకప్రస్థమనియు, తక్కిన ఉసిరిక మున్నగుద్రవ్యములు ద్విగుణముగ రెండేసిప్రస్థములనియు, గుడము రెండువందల పలములనియు పరిమాణము ఏర్పడుచున్నది. ఈతంత్రము ననుసరించి ప్రస్థపరిమితమైన హరీతకీఫలములకు తక్కినద్రవ్యములకు ద్విగుణంబును, గుడశతద్విగుణితంబును కల్పించవలసియున్నది. ప్రకృతమూలమున ఆమలకాదిద్రవ్యములకు జతూకర్ణతంత్రమున జెప్పిన పరిమాణమునకన్న అర్థభాగము వాచనికముగ నున్నది. అపద్ధతిననుసరించి హరీతకి యర్థ

స్థమని చెప్పు యుక్తియుక్తముగ నున్నదిగాని "హరీతకీఫలప్రస్థం" అను వాచనికమును ంచుట సమంజసముగ కనబడును. విజ్ఞులు గమనించెదరుగాక!

—— అథో హరశార్కరా (దురాలభా) రిష్టము. ——

మూ. దురాలభాయాః ప్రస్థస్స్యాత్ చిత్రకస్య వృషస్య చ,
పథ్యాఽఽమలకయోశ్చైవ పాఠాయా నాగరస్య చ. 153
దన్త్యాశ్చ ద్విపలాన్ భాగాన్ జలద్రోణే విపాచయేత్,
పాదావశేషే పూతే చ సుశీతే శర్కరాశతమ్. 154
ప్రక్షిప్య స్థాపయేత్కుమ్భే మాసార్ధం ఘృతభావితే,
ప్రలిప్తే పిప్పలీ చవ్యప్రియఙ్గుక్షౌద్రసర్పిషా. 155
తస్య మాత్రాం పిబేత్కాలే శార్కరస్య యథాబలం,
అర్శాంసి గ్రహణీదోషం ఉదావర్తమరోచకమ్. 156
శకృన్మూత్రానిలోద్గారవిబన్ధానగ్నిమార్దవం,
హృద్రోగం పాణ్డురోగం చ సర్వమేతేన సాధయేత్. 157
(ఇతి శార్కర (దురాలభ) అరిష్టః.)

వ్యా. దూలగొండి ఒకప్రస్థము, చిత్రమూలము, అడ్డసరము, కరకకాయలబెరడు ఉసిరికబెరడు, విషబొద్ది, శుంఠి, దంతివేళ్లు, ఇవి ప్రత్యేకము రెండేసిపలములు, వీనినన్ని కొని నలియగొట్టి యొకద్రోణపరిమితమగు జలమున జేర్చి నాల్గవపాలు మిగులునట్లు కషాయముకాచి వడగట్టి యుంచునది. పిదప పిప్పళ్లు, చవ్యము, ప్రేంకణము, వీనిని తేనె కలిపి నూరి నేతినికూడ కలిపి యీపిష్టమును నేతిలోమాగిన కుండకు లోభాగమున బూసి యెండించి పైజెప్పినకషాయము చల్లారినపిదప నీకుండలోబోసి అందు నూరుపలములు చక్కెరకలిపి వానెనగట్టి మూసి పదునైదుదినములు పదిలముగ నుంచునది. పిదప శర్కరచే సిద్ధమైన యరిష్టమును అగ్నిబలానుసారముగ ప్రతిదినమునుసేవించినచో అర్శస్సులు, గ్రహణిరోగము, ఉదావర్తము, అరోచకము, మలమూత్రవాతములయొక్కయు త్రేనుపులయొక్కయు బంధము, అగ్నిమాంద్యము, హృద్రోగము, పాండురోగము, అను నీరోగముల నన్నింటిని హరించును. ఇది శార్కరారిష్టమనియు, దురాలభారిష్టమనియు చెప్పబడును.

—— అథో రోగాదులకు కనకారిష్టము. ——

మూ. నవస్యామలకస్యైకాం కుర్యాజ్జర్జరితాం తులాం,

కుడవాంశ్చ పిప్పల్యో విడఙ్గం మరిచం తథా. 158
పాఠాం చ (యవాసః) పిప్పలీమూలం క్రముకం చవ్యచిత్రకౌ,
మఞ్జిష్ఠైల్వాలుకం లోధ్రం పలికానుపకల్పయేత్. 159
కుష్ఠం దారుహరిద్రాం చ సురాహ్వాం సారిబాద్వయం;
ఇన్ద్రాహ్వాం భద్రముస్తం చ కుర్యాదర్ధపలోన్మితమ్. 160
చత్వారి నాగపుష్పస్య పలాన్యభినవస్య చ,
ద్రోణాభ్యామమ్భసో ద్వాభ్యాం సాధయిత్వాఽవతారయేత్. 161
పాదావశేషే పూతే చ శీతే తస్మిన్ ప్రదాపయేత్,
మృద్వీకాద్వ్యాఢకరసం శీతం నిర్యూహసమ్మితమ్. 162
శర్కరాయాశ్చ భిన్నాయాః దద్యాద్ద్విగుణితాం తులాం,
కుసుమస్య రసస్యైకం అర్ధప్రస్థం నవస్య చ. 163
త్వగేలాప్లవపత్రామ్బుసేవ్యక్రముకకేసరాన్,
చూర్ణయిత్వా తు మతిమాన్ కార్షికానత్ర దాపయేత్. 164
తత్సర్వం స్థాపయేత్పక్షం సుచౌక్షే ఘృతభాజనే,
ప్రలిప్తే సర్పిషా కించిత్ శర్కరాగురుధూపితే. 165
పక్షాదూర్ధ్వమరిష్టోఽయం కనకో నామ విశ్రుతః,
పేయస్స్వాదురసో హృద్యః ప్రయోగాద్భక్తరోచనః. 166
అర్శాంసి గ్రహణీదోషం ఆనాహముదరం జ్వరం,
హృద్రోగం పాణ్డుతాం శోథం గుల్మం వర్చోవినిగ్రహమ్. 167
కాసం శ్లేష్మామయాంశ్చోగ్రాన్ సర్వానేవాఽపకర్షతి,
వలీపలితఖాలిత్యం దోషజం చ వ్యపోహతి. 168

(ఇతి కనకారిష్టః.)

వ్యా. చక్కగపండి క్రొత్తవియగు నుసిరికకాయలను దంచి విత్తనములను తీసిన యామునక్కలు నూరుపలములు; పిప్పళ్లు, వాయువిడంగములు, మిరియాలు, (ఇవి ప్రత్యేక మొక్కొకకుడవము నాలుగేసిపలములు); విషబొద్ది, (లేక దురదగొండి), పిప్పలీమూలము (మోడి), పోకచెక్కలు, (పచ్చివి), చవ్యము, చిత్రమూలము,

మంజిష్టి, నూగుదోస, లొద్దుగు, ఇవి ప్రత్యేక మొక్కొకపలము; చెంగల్వకోష్టు, మ్రాని సుపు, దేవదారుచెక్క, సుగంధపాల, గూడపాల, పెద్దపాపర, భద్రముస్తలు ఇవి ప్రత్యేకము అర్ధపలము; క్రొత్తవిలవంగములు నాలుగుపలములు; ఈభాగముల ప్రకారము వీనినన్నింటి నొకటిగ జేర్చి దంచి కుండలోబోసి అందు రెండుద్రోణములు (ఎనిమిదిఆఢకములు) నీళ్లుబోసి, నాల్గవవంతు (రెండు ఆఢకములు) మిగులునట్లు కషాయము కాచి దించి చల్లారినపిదప వడగట్టి యుంచునది.

పిదప రెండుఆఢకముల పరిమితమైన ద్రాక్షపండ్లను రెండుద్రోణముల జలమును పోసి నాల్గవపాలు (రెండుఆఢకములు) మిగులునట్లు కషాయముకాచి, పైజెప్పినకషాయమునకు సమానభాగమైన యీద్రాక్షాకషాయమును పైకషాయముతోకూడ కలిపి, అందు రెండువందలపలములు చక్కెరను, అర్ధప్రస్థము (ఎనిమిదిపలములు) క్రొత్తతేనెను కలిపి; లవంగపుపట్ట, ఏలకులు, నాగముస్తలు, లవంగపత్రి, కురువేరు, వట్టివేరు, పోకచెక్కలు, నాగకేసరములు, వీనిని ప్రత్యేకము కర్షము (కాలుపలము) వంతున చేర్చి చూర్ణముచేసి పైజెప్పినయౌషధమున కలిపి; నేతితో పూసినకుండను శుభ్రముగ కడిగి కొంచెముగ చక్కెరను నేతిని కలిపి కుండలోభాగమున పూసి అగరుధూపమువేసి పైచెప్పిన యౌషధసముదాయమును ఈకుండలోచేర్చి వాసెనగట్టి మూసి పదిలముగ పదునైదుదినము లుంచునది.

ఒకపక్షము గడిచినపిదప నీయది కనకారిష్టమని చెప్పబడును. ఇయ్యది మధుర రసముకల్గి మనోహరంబును హృదయమునకు బలకరంబు నగును. దీనిని ప్రతిదినంబును సేవించినయెడ అన్నమునందు అభిరుచి చక్కగ కల్గును. దీనివలన అర్శస్సులు, గ్రహణీ దోషము, కడుపుబ్బరము, ఉదరము, జ్వరము, హృద్రోగము, పాండురోగము, ధాతుక్షయముచేగల్గిన శరీరము కృశత్వము, గుల్మము, మలబద్ధకము, కాసము, కఫముచేగల్గిన క్రూరవ్యాధులు, వీనినన్నింటిని హరించును. మరియు వయోభేదముచే గల్గినశరీరమునందలి ముడతలను, వెండ్రుకలు నెరియుటను, వెండ్రుకలూడి తల బట్టకట్టుటను కూడ మాన్పును.

ఇచ్చట "మృద్వీకా ద్వ్యాఢకరసం శీతం నిర్యూహసమ్మితం" అనుచోట ద్రాక్షాకషాయము సిద్ధమైనది రెండాఢకములపరిమితమై పైజెప్పబడిన ఆమలకాది కషాయసమానభాగముగ నుండవలెనని యర్థము. ఆమలకాదికషాయంబును ఆఢకద్వయ పరిమితము కావున ద్రాక్షాకషాయము సిద్ధమైనదియు రెండాఢకములుగ నుండవలెను. ఈద్రాక్షాకషాయకల్పనమునకు క్వాథ్య-ద్రవములపరిమాణముల నిర్దేశించక సిద్ధక్వాథము

మాత్రము రెండాఢకములని చెప్పబడినది. కావున సామాన్యపరిభాషానుసారముగ క్వాథ్య ద్రవ్యమైన ద్రాక్షపండ్లు రెండుఆఢకములును, దానికి నాల్గుభాగములు (ఎనిమిదిఆఢక ములు) జలంబును కూర్చి, నాల్గవవంతు మిగుల కషాయము సిద్ధముచేసినచో సిద్ధమైన కషాయము రెండుఆఢకములై పైజెప్పిన ఆమలకాదికషాయమునకు సమభాగముగ చేర్పదును.

## అర్శస్సులయందు శౌచవిధి.

మూ. పత్త్రభఙ్గోదకైశ్శౌచం కుర్యాదుష్ణేన వామ్భసా,

వ్యా. మరియు వాతాదులచే సంభవించిన యర్శోరోగములయందు ఆయా దోషములహరించు గుణాదులుకల ఆకులనుజేర్చి కాచబడిన నీళ్లచేనైనను, కేవలము వేడి నీళ్లచేనైనను శౌచవిధి (గుదప్రక్షాళనమును) చేయనగును.

## రక్తార్శశ్చికిత్సితము.

మూ. ఇతి శుష్కార్శసాం సిద్ధముక్తమేతచ్చికిత్సితమ్. 169
చికిత్సితమిదం సిద్ధం స్రావిణాం శృణ్వతః పరం,

వ్యా. ఇత్తెరంగున "తత్ర శుష్కార్శసాం పూర్వం ప్రవక్ష్యామి చికిత్సితమ్." అని యుపక్రమించి శుష్కార్శస్సులకు తగినచికిత్సావిధానము చెప్పబడినది. పిమ్మట నిక్రింద అర్ధ్రభేదముచే జెప్పబడిన రక్తోల్బణములగు నర్శస్సులకు దగినచికిత్స వివరింప బడును. (ఇచ్చట పిత్తకార్శస్సులవలెనే రక్తజార్శస్సులును దుష్టమైనరక్తమును స్రవించు చుండును, కావున రక్తజార్శస్సులు 'స్రావిణాం' అనుపదముచే గ్రహింపబడునని యెరుంగునది.)

## రక్తార్శోభేదములు.

మూ. తత్రాఽనుబన్ధో ద్వివిధః శ్లేష్మణో మారుతస్య చ. 170

వ్యా. అట్టి రక్తార్శస్సులయందు శ్లేష్మంబైనను వాతంబైనను అనుబంధముగ నుండును. (అట్టి యనుబంధముచే రక్తార్శస్సులు రెండుభేదములు కల్గియుండునని భావము.)

## వాతానుబంధరక్తార్శోలక్షణములు.

మూ. విట్ శ్యావం కఠినం రూక్షం చాధో వాయుర్న వర్తతే,
తను చారుణవర్ణం చ ఫేనిలం చాసృగర్శసామ్. 171

కట్యూర్వరుగుదశూలం చ దౌర్బల్యం యది చాధికం,
తత్రాఽనుబన్ధో వాతస్య హేతుర్యది చ రూక్షణమ్ 172

వ్యా. వాతమనుబంధముగఁగల రక్తార్శస్సులయందు మలము శ్యామవర్ణంబును కఠినంబును రూక్షంబునై యుండును. అపానవాతము వెడలదు. పలుచనై యరుణవర్ణంబును నురుగుతోఁగూడినదియు నగురక్తము అర్శస్సులనుండి వెడలును. నడుమునందును గుదస్థానంబునను శూలము కల్గును. అధికముగ బలహీనము కల్గును. అర్శస్సులు సంభవించినపుడు రూక్షతనుకల్గించు నాహారవిహారాదికారణములు తటస్థించినయెడ వాతము అనుబంధమై పైజెప్పినలక్షణముల గల్గించును.

## కఫానుబన్ధరక్తార్శోలక్షణములు.

మూ. శిథిలం శ్వేతపీతం చ విట్ స్నిగ్ధం గురు శీతలం,
యద్యర్శసాం ఘనం చాసృక్ తన్తుమత్ పాణ్డు పిచ్ఛిలమ్. 173
గుదం సపిచ్ఛం స్తిమితం గురు స్నిగ్ధం చ కారణం,
శ్లేష్మానుబన్ధో విజ్ఞేయః తత్ర రక్తాఽర్శసాం బుధైః. 174

వ్యా. రక్తార్శస్సులయందు శ్లేష్మ మనుబంధముగ నున్నపుడు మలము శిథిలమై తెల్లనిరంగైనను పచ్చనిరంగైనను కల్గి స్నిగ్ధమై భారముకల్గి చల్లగనుండును. రక్తము ఘనీభవించి చిక్కనై తీఁగెలుసాగుచు పాండువర్ణంబై జిగటకల్గియుండును. గుదము పిచ్ఛిలమై జిడ్డుకల్గి స్తిమితమై (తడిగుడ్డగట్టినవిధముగ మొద్దుబారి) యుండును. అట్టి శ్లేష్మానుబంధమునకు గురుపదార్థంబులును స్నిగ్ధపదార్థంబులును కారణములగును.(పై జెప్పిన లక్షణములబట్టి రక్తార్శస్సులయందు కఫము అనుబంధముగ నున్నదని యెరుంగునది).

## వాత-కఫానుబంధరక్తార్శోవ్యాధిచికిత్స.

మూ. స్నిగ్ధశీతం హితం వాతే రూక్షశీతం కఫానుగే,
చికిత్సితమిదం తస్మాత్ సమ్ప్రధార్య ప్రయోజయేత్. 175

వ్యా. అందు వాతము అనుబంధముగ నున్నరక్తార్శస్సునందు స్నిగ్ధంబును శీతవీర్యంబును నగుచికిత్స హితముగ నుండును. కఫము అనుబంధముగ నుండురక్తార్శస్సునకు రూక్షగుణంబును శీతవీర్యంబు నైనచికిత్స యుక్తముగ నుండును. కావున అనుబంధమును చక్కగ గమనించి తత్తదుచితమైన చికిత్సను నిర్ణయించి యథోచితముగ చికిత్స జేయ నగును.

## పిత్తకఫాధికరక్తార్శస్సులచికిత్స.

మూ. పిత్తశ్లేష్మాధికం మత్వా శోధనేనోపపాదయేత్,
స్రవణం చాప్యుపేక్షేత, లఙ్ఘనైర్వా సమాచరేత్. 176

వ్యా. రక్తార్శస్సులయందు పిత్తశ్లేష్మము లధికములుగ నున్నచో వాని గమనించి శోధనములచే చికిత్స జేయనగును. రక్తము స్రవించుచున్నచో దాని నాపుచేయక యుపేక్షించి తనంతట వెడలనీయవలెను. లేక లంఘనచికిత్సలనైన చేయవలెను.

## దుష్టరక్తమును నిరోధించుటచే గల్గునుపద్రవములు.

మూ. ప్రవృత్తమాదావర్శోభ్యో యో నిగృహ్ణాత్యబుద్ధిమాన్,
శోణితం దోషమనిలం తద్రోగాన్ జనయేద్బహూన్. 177
రక్తపిత్తం జ్వరం తృష్ణాం అగ్నిసాదమరోచకం,
కామలాం శ్వయథుం శూలం గుదవంక్షణసంశ్రయమ్ 178
కణ్డ్వరుః కోఠపిడకాః కుష్ఠం పాణ్డ్వాహ్వయం గదం,
వాతమూత్రపురీషాణాం విబన్ధం శిరసో రుజమ్. 179
స్తైమిత్యం గురుగాత్రత్వం తథాన్యాన్ రక్తజాన్ గదాన్,
తస్మాత్ స్రుతే దుష్టరక్తే రక్తసంగ్రహణం హితమ్. 180

వ్యా. (రక్తార్శస్సులయందు వాతాదిదోషములచే దుష్టమైనరక్తము స్రవించు చున్నచో వానిని ఆపుచేయక ధారాళముగ వెడలనియ్యవలెను.) అట్లు వెడలనీయక తొలుతనే యడ్డగించినచో ఆయాదోషమునకు సంబంధించిన యీక్రింద వివరింపబడు ననేకరోగములు సంభవించును. రక్తపిత్తము, జ్వరము, దప్పి, అగ్నిమాంద్యము, అరోచకము, కామల, వాపు, గుదమునను గెజ్జలయందును శూలము, దురద, వ్రణము, దద్దులు, బొబ్బలు, కుష్ఠము, పాండురోగము, వాత-మూత్ర-పురీషములబంధము, తలనొప్పి, స్తబ్ధత్వము, ఒడలిభారము ఈవ్యాధులను, ఇవిగాక రక్తప్రకోపమునగల్గు నితరవ్యాధులను, అనేకము గల్గించును. కావున దుష్టమైనరక్తము పూర్తిగ నర్శస్సులనుండి తనంతట వెడలినపిదప అట్టిరక్తస్రావమును బంధించుచికిత్స చేయవలెను.

## దుష్టరక్తస్రావము నుపేక్షించుటకు కాలనియమము.

మూ. హేతులక్షణకాలజ్ఞో బలశోణితవర్ణవిత్,
కాలం తావదుపేక్షేత యావన్నాత్యయమాప్నుయాత్. 181

వ్యా. మరియు హేతువులను, లక్షణములను, వర్షాది కాలవిశేషమును, దోష-రోగి-అగ్న్యాదిబలమును, రక్తముయొక్క వర్ణవిశేషమును, వీనినన్నింటిని చక్కగ నెరింగినవైద్యుండు వానినన్నిటిని బాగుగ గమనించి, రోగికి అర్శస్సులనుండి శుద్ధరక్తము వెడలునంతదనుక దుష్టరక్తస్రావము నుపేక్షించవలెను. (అట్టిదుష్టరక్తముచే పైజెప్పిన రోగములు గల్గనీయక దోషము పూర్తిగ నివర్తించునందాక రక్తమును ఆపక ఉపేక్షించవలెననుట).

## రక్తస్రావమున పాచనాదిచికిత్స.

మూ. అగ్నిసన్దీపనార్థం చ రక్తసంగ్రహణాయ చ,
దోషాణాం పాచనార్థం చ పరం తిక్తైరుపాచరేత్. 182

వ్యా. దుష్టరక్తమంతయు పూర్తిగ వెడలినపిదప జఠరాగ్ని దీపించుటకును, రక్తస్రావము నిలుచుటకును, దోషములు పరిపక్వములగుటకును, తిక్తరసముకల ద్రవ్యములచే నుపచరించవలెను.

## వాత-పిత్తదుష్టరక్తస్రావచికిత్స.

మూ. యత్తు ప్రక్షీణదోషస్య రక్తం వాతోల్బణస్య చ,
వర్తతే స్నేహసాధ్యం తత్ పానాఽభ్యఙ్గాఽనువాసనైః. 183
యత్తు పిత్తోల్బణం రక్తం ఘర్మకాలే ప్రవర్తతే,
స్తమ్భనీయం తదేకాన్తాత్ న చేద్వాతకఫానుగమ్. 184

వ్యా. ఆమదోషము పూర్తిగ హరించినవానికైనను, వాతాధిక్యము కలవానికైనను అర్శస్సులనుండి రక్తము స్రవించుచున్నచో నయ్యది స్నేహరూపమైన చికిత్సచే సాధింపదగియుండును; కావున ఘృతము మున్నగుస్నేహములను పానమునకును, అభ్యంగనమునకును, అనువాసనవస్తికిని యుపయోగించి చికిత్సచేయనగును. మరియు పిత్తాధికమైనరక్తము వాతకఫానుబంధము లేక గ్రీష్మకాలమున స్రవించినచో (దానిను పేక్షించినచో నపాయముకల్గును కావున) దానిని స్తంభనచికిత్సలచే నవశ్యము నిరోధించవలెను. (వాతకఫసంబంధము కల్గియున్నచో గ్రీష్మకాలమునందును లంఘనాదిచికిత్సల జేయనగును గాని స్తంభనము జేయదగదని భావము).

## స్నిగ్ధరక్తస్రావమున కుటజత్వగాదికషాయములు.

మూ. కుటజత్వఙ్నిర్యూహః సనాగరః, స్నిగ్ధరక్తసఙ్గ్రహణః,
త్వక్ దాడిమస్య తద్వత్; సనాగరశ్చన్దనరసశ్చ. 185

వ్యా. కొడిసెపాలపట్టను శుంఠిని సమభాగముగ జేర్చి కషాయముకాచి వడగట్టి త్రాగినచో స్నిగ్ధముగ స్రవించురక్తమును బంధించును. మరియు దానిమ్మబెరడును చందనమును సమముగ జేర్చి కషాయముబెట్టి త్రాగినచో స్నిగ్ధమైన రక్తస్రావమును నిలుపును. లేక చందనమును శుంఠినిచేర్చి కషాయముబెట్టి త్రాగినను స్నిగ్ధరక్తస్రావము నివర్తించును.

ఇచ్చట—"పానీయం షోడశగుడం క్షుణ్ణే ద్రవ్యపలే క్షిపేత్, మృత్పాత్రే క్వాథయేత్, గ్రాహ్యమష్టమాంశావశేషితమ్." అను సామాన్యపరిభాషచేత కొడిసెపాలపట్ట మున్నగువాని నొకపలమును నలియగొట్టి పదునారింతలు నీళ్లుబోసి యెనిమిదవపాలు (రెండుపలములు) మిగులునట్లు కషాయముకాచి యగ్నిబలానుసారముగ పరిమాణము గల్పించి త్రాగవలెను. కల్కద్రవాది పరిమాణమున నిర్దేశించని క్వాథకల్పనములయందెల్ల నీసామాన్యపరిభాషచేతనే కల్పించునది. (కొడిసెపాలపట్ట, దానిమ్మబెరడు, చందనము, ఈమూడిటి వేరువేరుగ చందనమును సమభాగముగ కల్పి మూడు కషాయయోగములుగ జేయునది.)

మూ. చన్దనకిరాతతిక్తకధన్వయవాసాః సనాగరాః క్వథితాః,
రక్తార్శసాం ప్రశమనాః దార్వీత్వగుశీరనిమ్బాశ్చ. 186

వ్యా. రక్తచందనము, నేలవేము, దూలగొండి, శుంఠి వీనిని సమభాగములుగ చేర్చి కాచబడిన కషాయమునైనను; మ్రానిపసుపుపట్ట, వట్టివేరు, వేపపట్ట, వీనిని సమములుగ జేర్చి కాచబడినకషాయమునైనను త్రాగినచో రక్తార్శస్సు నివర్తించును.

కఫరక్తస్రావమునకుటజాదికల్కము.

మూ. సాతివిషా కుటజత్వక్ ఫలం చ సరసాఞ్జనం మధుయుతాని,
రక్తాపహాని దద్యాత్, పిపాసవే తణ్డులజలేన. 187

వ్యా. అతివస, కొడిసెపాలపట్ట, కొడిసెపాలవిత్తులు, రసాంజనము, వీనిని సమభాగములుగ నూరి తేనెతోకలిపి సేవించిన రక్తార్శస్సు నివర్తించును. మరియు రక్తార్శస్సులయందు దప్పి యధికముగ నున్నయెడ పైజెప్పినవానిని బియ్యపుకడుగునీటిలో నూరి కల్కముజేసి త్రాగిన దప్పిమానును.

రక్తార్శస్సులకు కుటజాదిరసక్రియ.

మూ. కుటజత్వచోవిపాచ్యం పలశతమార్ద్రం మహేన్ద్రసలిలేన,
యావత్స్యాద్గతరసం తత్ ద్రవ్యం పూతో రసస్తతో గ్రాహ్యః.
మోచరసస్సమఙ్గః ఫలినీ చ సమాంశకైః(పలాంశికై)స్త్రిభిస్తైశ్చ,
వత్సకబీజం తుల్యం చూర్ణితమత్ర ప్రదాతవ్యమ్. 189

పూతోత్కథితః సాన్ద్రః స రసో దార్వీప్రలేపనో గ్రాహ్యః,
మాత్రాకాలోపహితా రసక్రియైషా జయత్యసృక్స్రావమ్. 190
ఛాగలిపయసా పీతా పేయా మణ్డేన వా యథాగ్నిబలం,
జీర్ణౌషధశ్చ శాలీన్ పయసా ఛాగేన భుంజీత. 191
రక్తార్శాంస్యతిసారం రక్తం, సాసృక్ రుజో నిహన్త్యాశు,
బలవచ్చ రక్తపిత్తం రసక్రియైషా జయత్యుభయభాగమ్. 192

(ఇతి కుటజాదిరసక్రియా)

వ్యా. పచ్చిగనుండు కొడిసెపాలపట్టను నూరుపలములు నలియగొట్టి (యొక ద్రోణపరిమితమైన) వర్షధారాజలమున జేర్చి (ఎనిమిదవపాలు మిగులునట్లు) ఆద్రవ్యము పండి సారము పూర్తిగ కషాయమున చేరునంతదనుక కాచి యాకషాయమును వడగట్టి గ్రహించునది. పిదప బూరుగుబంక, మంజిష్ఠి, ప్రేంకణము, ఈమూటిని సమభాగములుగ ఒక్కొకపలమువంతున)ను, ఈమూడిటికిని సమభాగముగ (మూడుపలములు) కొడిసె పాలవిత్తులను మెత్తగ పొడిచేసి పైజెప్పిన కషాయమున జేర్చి, అయ్యది గరిటె కంటుకొని ఎక్కనగునందాక పాకముచేసి యుంచునది.

ఈరసక్రియను (లేహపక్వమైన యౌషధమును) కాల-అగ్ని-బలాద్యనుసారముగ తగుపరిమాణము గల్పించి మేకపాలనైనను పెరుగుమీదితేటనైనను అనుపానముగ సేవించినచో రక్తార్శస్సులయందలి రక్తస్రావమును శమింపజేయును. ఈయౌషధము జీర్ణమైన పిదప రాజనపుబియ్యపుటన్నమును మేకపాలతో భుజింపవలెను. మరియు నీయౌషధమును సేవించుటవలన రక్తార్శస్సులును, రక్తాతిసారంబును, రక్తముతోకూడిన యితర వ్యాధులును, బలిష్ఠమైన యూర్ధ్వగతరక్తపిత్తంబును, అధోగతరక్తంబును నివర్తించును.

ఇచ్చట కుటజకషాయమున జలపరిమాణము చెప్పకున్నను "ద్రోణేఽమ్భసః పలశతం కుటజత్వచోఽష్టభాగశేషమ్" అనుతంత్రాంతరప్రమాణము ననుసరించి నూరుపలములు కొడిసెపాలపట్టను ద్రోణపరిమితజలమున జేర్చి యష్టమాంశము మిగుల కాచవలెనని తెలిసెడి. 'సమాంశితైః' అనుచోట 'పలాంశితైః' అనుపాఠము వాగ్భటసమ్మతము. 'ముష్యంశకాన్" అని వాగ్భటులు స్పష్టముగ జెప్పెను.

### రక్తార్శస్సులకు నీలోత్పలాదిచూర్ణము.

మూ. నీలోత్పలం సమఙ్గా మోచరసశ్చన్దనం తిలా లోధ్రమ్,
పీత్వా ఛగలీపయసా భోజ్యం పయసైవ శాల్యన్నమ్. 193

ఛాగలిపయః ప్రయుక్తం నిహన్తి రక్తం సవాస్తుకరసం చ,
ధన్వవిహఙ్గమృగాణాం రసో నిరమ్లః కదమ్లో వాః. 194

వ్యా. నల్లకలువలు, మంజిష్ఠి, బూరుగబంక, చందనము, నువ్వులు, లొద్దుగు, వీనినన్నిటిని సమభాగములుగ గూర్చి చూర్ణముచేసి మేకపాలతో కలిపి త్రాగి, మేకపాలతో సంబావుబియ్యపు అన్నమును భుజించినయెడ రక్తార్శస్సులు నివర్తించును. మరియు చక్రవర్తికూరరసమున మేకపాలు కలిపి త్రాగినను, మరుభూమి నివసించు పక్షులయొక్కయు మృగములయొక్కయు మాంసరసమున కొంచెము పులుపుచేర్చినదైనను, పులుపు చేర్పకయైనను త్రాగినచో రక్తస్రావము నివర్తించును.

## అర్శోహరపాఠాదిచూర్ణము.

మూ. పాఠా వత్సకబీజం రసాఞ్జనం నాగరం యవాన్యశ్చ,
బిల్వమితి చార్శసైశ్చూర్ణితాని పేయాని శూలేషు. 195

వ్యా. విషబొద్ది, కొడిసెపాలవిత్తులు, రసాంజనము, శుంఠి, ఓమము, మారేడుపండు, వీనినన్నింటిని సమభాగములుగ చేర్చి చూర్ణముచేసి జలమున కలిపి త్రాగినచో నర్శోరోగములు నివర్తించును.

## రక్తార్శస్సులకు దార్వ్యాదిఘృతము.

మూ. దార్వీం కిరాతతిక్తం ముస్తం దుస్పర్శకశ్చ రుధిరఘ్నం,
రక్తేఽతివర్తమానే శూలే చ ఘృతం విధాతవ్యమ్. 196

వ్యా. మ్రానిపసుపు, నేలవేము, తుంగగడ్డలు, దురదగొండి వీనిని కల్కముగ జేర్చి పక్వముచేయబడిన ఘృతమును, రక్తార్శోరోగమున రక్తం బధికముగ వెడలునప్పుడును, పోటుకల్గినప్పుడు నుపయోగించినచో నవి నివర్తించును.

## కుటజాదిఘృతము.

మూ. కుటజఫలవల్కకేసరనీలోత్పలలోధ్రధాతకీకల్కైః,
సిద్ధం ఘృతం విధేయం శూలే రక్తార్శసాం భిషజా. 197

వ్యా. కొడిసెపాలవిత్తులు, కొడిసెపాలపట్ట, నాగకేసరములు, నల్లకలువలు, లొద్దుగుపట్ట, ఆరెపువ్వు, వీనిని సమభాగములుగ జేర్చి కల్కముచేసి పక్వము చేయబడిన ఘృతమును శూలముతోగూడిన రక్తార్శస్సులయం దుపయోగించునది.

ఇచ్చట నీఘృతయోగముల రెంటియందును కల్కముమాత్రము నిర్దేశింపబడినది కాని ద్రవమును జెప్పియుండలేదు. కావున "స్నేహసిద్ధౌ ద్రవేఽనుక్తే సర్వత్రామ్బు

శ్చతుర్గుణమ్" అనుసామాన్యపరిభాషచేత కల్కమునకు నాల్గింతలు ఘృతమును, ఘృతమునకు నాల్గింతలు జలమునుచేర్చి ఘృతపాకవిధిప్రకారము సిద్ధము చేయనగును.

### రక్తార్శోహరయావశూకాదియోగములు.

మూ. సర్పిస్సదాడిమరసం సయావశూకం శృతం జయత్యాశు,
రక్తం సశూల మథవా నిదిగ్ధికా దుగ్ధికాసిద్ధమ్. 198

వ్యా. ఆవునేతిలో యవక్షారమును ఘృతమునకు నాల్గవపాలును, దానిమ్మపండ్ల రసమును ఘృతమునకు నాలుగింతలును కలిపి పక్వముచేయబడిన ఘృతమునైనను; లేక వాకుడును పిన్నపాలను కల్కముచేసి ఘృతమున కలిపి నాలుగింతలు నీళ్లుచేర్చి పక్వము చేయబడిన ఘృతమునైనను ఉపయోగించినయెడ శూలతోకూడిన రక్తార్శస్సులు నివర్తించును.

### రక్తార్శోహరపేయావిధానము.

మూ. లాజాపేయాం పీతా సచుక్రికా, కేసరోత్పలైస్సిద్ధా,
హన్త్యాశ్వస్రస్రావం; తథా బలాపృశ్నిపర్ణీభ్యామ్. 199
హ్రీబేరబిల్వనాగరనిర్యూహే సాధితాం సనవనీతాం,
వృక్షామ్లదాడిమామ్లామమ్లీకామ్లాం సకోలామ్లామ్. 200

వ్యా. పులిచింతాకును నాగకేసరములను నల్లకలువలను వరిపేలాలను చేర్చి పేయావిధానక్రమముగ పక్వముచేయబడిన లాజపేయ యనుగంజిని త్రాగినచో రక్తార్శస్సులు నివర్తించును. మరియు చిట్టాముట్టిని కోలపొన్నను చేర్చి సిద్ధముచేయబడిన లాజపేయమునైనను, కురువేరు, బిల్వఫలము, శుంఠి, వీనికషాయమును కలిపి చింతపండునైనను, దానిమ్మరసమునైనను, పులిచింతాకునైనను, రేగుపండ్లనైనను పులుపుకుచేర్చి వెన్నను కలిపి సిద్ధముచేయబడిన లాజపేయమును త్రాగినను రక్తార్శస్సులు హరించును.

మూ. గృఞ్జనకసురాసిద్ధాం దద్యాద్యమకేన భర్జితాం పేయాం,
రక్తాతిసారశూలప్రవాహికాశోథనిగ్రహిణీమ్. 201

వ్యా. మరియు నీరుల్లిని సుర యనుమద్యమును చేర్చి సిద్ధముచేయబడిన పేయ యనుగంజిలో యమకస్నేహమునుచేర్చి తిరుగబోతపెట్టి యుపయోగించినచో రక్తాతిసారమును, శూలమును, ప్రవాహిక (బంకవిరేచనముల)ను, శోఫమును హరించును. (ఇచ్చట జెప్పబడిన పేయలన్నియు రక్తార్శోరోగమున కల్గిన రక్తస్రావ-శూలాదులను హరించునని భావము).

### రక్తార్శోహారఖడయూషములు.

మూ. కాశ్మర్యామలకానాం సకర్బుదారాః ఫలామ్లాంశ్చ,
గృఞ్జనకశాల్మలీనాం క్షీరిణ్యాశ్చుక్రికాయాశ్చ. 202
న్యగ్రోధశుఙ్గకానాం ఖడాంస్తథా కోవిదారపుష్పాణాం,
దధ్నస్సరేణ సిద్ధాః దద్యాద్రక్తే ప్రవృత్తేఽతి. 203

వ్యా. పెద్దగుమ్మడి, ఉసిరికకాయలు, దేవకాంచనము, దానిమ్మపండ్లు, వీనినిగూర్చియైనను; నీరుల్లిగడ్డలు, బూరుగుచిగుళ్లు, పాలకూర, పులిచింతాకు, వీనిని గూర్చియైనను; మఱ్ఱియూడలు, ఎఱ్ఱకాంచనపుపువ్వులు, వీనినికూర్చియైనను పెరుగుమీది తేటతో పక్వము చేయబడిన ఖడయూషములను, రక్తము అధికముగ వెడలునప్పుడు రక్తార్శస్సులయందుపయోగింపవలెను.

ఇచ్చట "ఖడాంశ్చ" అనుచోట ఖడయూషములు అని యర్థము. "ఖండాంశ్చ" అనునది యపపాఠము. ఖడయూషవిధానము పరిభాషయందిట్లు చెప్పబడినది:— "తక్రః కపిత్థచాఙ్గేరీ మరిచాజాజిచిత్రకైః, సుపక్వం ఖడయూషోఽయం" ఇచ్చట మజ్జిగకు బదులు పెరుగుమీది తేటను జేర్చి పైజెప్పిన కాశ్మరి మున్నగువాని నాయా యోగములను జేర్చి పక్వముజేసి జీలకర్ర మున్నగువానిని తిరుగబోతనిడి సిద్ధము చేయనగును.

### రక్తార్శోహారశాకములు.

మూ సిద్ధం పలాణ్డుశాకం తక్రేణోపోదికాం సబదరామ్లాం,
రుధిరస్రవే ప్రదద్యాత్ మసూరసూపం చ తక్రామ్లమ్. 204

వ్యా. నీరుల్లియాకుకూరను మజ్జిగలో పక్వముజేసియైనను, పచ్చలికూరను రేగుపండ్లరసమును జేర్చి పక్వముచేసియైనను, చిరుసెనగపప్పును మజ్జిగజేర్చి పక్వముచేయబడిన సూపమునైనను, రక్తార్శస్సులయందు రక్తము వెడలునప్పుడు ఆహారమున జేర్చియుపయోగింపనగును.

### రక్తార్శస్సులయందు యూషరస-అన్నాహారములు.

మూ. పయసా శృతేన యూషైః మసూర(సతీన)ముద్గాఢకీమకుష్ఠానాం,
భోజనమద్యాదమ్లైః శాలిశ్యామాకకోద్రవజమ్. 205

వ్యా. చిరుసెనగపప్పు, (లంకలు), పెసలపప్పు, కందిపప్పు, అడవిపెసలపప్పు, ఈపప్పులలో దేనినైనను పాలుచేర్చి, దానిమ్మ మున్నగుపండ్లపులుపు రసమును కలిపి

క్వముచేయబడిన యూషరసములను (పప్పుకట్టులను), రాజనపుబియ్యముచేనైనను గామలబియ్యముచేనైనను వరిగల బియ్యముచేనైనను సిద్ధముచేయబడిన యన్నమున జేర్చి భుజించినచో రక్తార్శస్సులు శమించును.

### ఆహారమున మాంసోపయోగము.

సూ. శశహారిణలావమాంసైః కపిఞ్జలైణేయకైః సుసిద్ధైశ్చ,
భోజనమద్యాదమ్లైః మధురైరీషత్సమరిచైర్వా 206

వ్యా. కుందేలు, జింక, లావుకపిట్ట, కపింజలము, నల్లనిజింక, అను నీజంతువుల మాంసములను విధ్యుక్తప్రకారము చక్కగ పక్వముజేసి, అందు పులుపురసమును తీపును, కొంచెము మిరియాలను యథోచితముగ జేర్చి యన్నముతోకూడ కలిపి భుజించునది.

### ఆహారమున మాంసరసోపయోగము.

సూ. దక్షశిఖితిత్తిరరసైః ద్వికకుదలోపాకజైశ్చ మధురామ్లైః,
అద్యాద్రసైరతివహేష్వర్శస్స్వనిలోల్బణశరీరః. 207

వ్యా. కోడి, నెమిలి, తీతువుపిట్ట, ద్వికదము (ఒంటె), తోడేలు, అను నీజంతువుల మాంసరసమును మధుర-అమ్లరసములను జేర్చి పక్వముజేసి, వాతాధిక్యముచే గల్గినయర్శస్సులయందు అధికముగ రక్తము స్రవించుచున్నయెడ పైజెప్పినమాంసరసమును జేర్చి యన్నమును భుజించునది. (మాంసరసమును 'సూపు' అని లోకమున వ్యవహరించెదరు.)

### రక్తాతిప్రవృత్తియందు పలాండు (నీరుల్లి) ప్రయోగము.

సూ. రసఖడయూష (శాక) యవాగూసంయోగతః కేవలోఽథవా
జయతి, రక్తమతివర్తమానం వాతం చ పలాణ్డురుపయుక్తః. 208

వ్యా. నీరుల్లిగడ్డలను పైజెప్పబడిన మాంసరసములయందును, ఖడయూషములయందును, (శాకములయందును), యవాగువులయందును చేర్చియైనను, లేక ప్రత్యేకముగనైనను ఉపయోగించినయెడ అధికముగ వెడలురక్తమును వాతమును హరించును.

### మల-రక్తస్రావములయందు పలాండు (నీరుల్లి) ప్రయోగక్రమము.

సూ. ఛాగాన్తరాధితరుణం సరుధిరముపసాధితం బహుపలాణ్డు,
వ్యత్యాసాన్మధురామ్లం విట్ శోణితసంక్షయే దేయమ్. 209

వ్యా. మేకపిల్లయొక్క శరీరమధ్యభాగముననుండు మాంసమును రక్తమును కలిపి అందు నీరుల్లిగడ్డలను అధికముగచేర్చి మధురరసమును కలిపి యొకభాగమును, అమ్లరస

మును జేర్చి యొకభాగమును రెండువిధములుగ పక్వముచేయునది. అందు మలము అధికముగ వెడలునెడ తొలుత మధురపక్వమును, పిమ్మట అమ్లపక్వమును భుజించునది. రక్తము అధికముగ స్రవించి క్షీణించుచున్నయెడ తొలుత నమ్లపక్వమును, పిదప మధురపక్వమును భుజింపనగును. (ఇత్తెరంగున వ్యత్యాసముగ నుపయోగించినచో శమించును.)

### రక్తార్శస్సులకు నవనీతాద్యభ్యాసయోగము.

మూ. నవనీతతిలాఽభ్యాసాత్, కేసరనవనీతశర్కరాభ్యాసాత్,
దధిసరమథితాఽభ్యాసాత్, అర్శాంస్యపయాన్తి రక్తాని. 210

వ్యా. వెన్నను నువ్వుల జేర్చియైనను; నాగకేసరములు, వెన్న, చక్కెర ఈ మూడిటిని కలిపియైనను, పెరుగుమీదిమీగడను నీళ్లను జేర్చక చిలికి యామజ్జిగనైనను పలుమారు నానాట నభ్యాసముగ నుపయోగించుచున్నచో రక్తజార్శస్సులు నివర్తించును.

### రక్తార్శోహరనవనీతాదిప్రయోగము.

మూ. నవనీతఘృతం ఛాగం మాంసం చ, సషష్టికః, శాలిః,
తరుణశ్చ సురామణ్డః, తరుణీ చ సురా, నిహన్త్యస్రమ్. 211

వా. అప్పుడు వెన్నకరగపెట్టిన క్రొత్తనెయ్యి, మేకపోతుమాంసము, అరువదినాళ్ల సంబావుబియ్యము, రాజనములబియ్యము, క్రొత్తదియగు సురామండము, క్రొత్తదియగు సురామద్యము, ఇవియన్నియు రక్తార్శస్సులను హరించును.

### రక్తార్శస్సులయందు వాతమునకాధిక్యము.

మూ. ప్రాయేణ వాతబహుళాన్యర్శాంసి భవన్త్యతిస్రుతే రక్తే,
దుష్టేఽపి చ కఫపిత్తే తస్మాదనిలోఽధికో జ్ఞేయః. 212

వ్యా. అర్శస్సులయందు రక్తము అధికముగ స్రవించినయెడ నవి ప్రాయికము వాతాధికము లగును. కఫపిత్తములు దుష్టములైనను వానికన్న వాత మధికముగనుండును. కావున రక్తార్శస్సులయందు వాత మధికమని యెరుంగునది.

### రక్త-పిత్తప్రబలార్శస్సులకు శీతక్రియావిధానము.

మూ. దృష్ట్వా తు రక్తపిత్తం ప్రబలం కఫవాతలిఙ్గమల్పం చ,
శీతాః క్రియాః ప్రయోజ్యా యథేరితా వక్ష్యతే చా(యా)న్యా.

వ్యా. అర్శోరోగమునందు రక్తపిత్తలక్షణములు మిక్కిలి బలిష్ఠములుగను, కఫవాతలక్షణములు స్వల్పముగను కనిపించినయెడ అట్టిపరిస్థితిని చక్కగ గమనించి పైజెప్పబడినవియు, నీక్రింద చెప్పబడునవియు నగుశీతప్రధానములగు పరిషేకాద్యుపచారక్రియల నుపయోగింపవలెను.

రక్తాతిప్రవృత్తియందు సేకవిధి.

మూ॥ మధుకం సపఞ్చవల్కం బదరీత్వగుదుమ్బరం ధనపటోలం,
పరిషేచనే విదధ్యాత్ వృషకకుభయవాసనిమ్బాంశ్చ. 214

వ్యా. అతిమధురము, పంచవల్కములు, (మారేడు, దుండిగము, గుమ్మడీ, కలిగొట్టు, తక్కిల అను నీపంచమూలములపట్టలు), రేగుచెట్టుపట్ట, అత్తిపట్ట, చేదుపొట్ల, అడ్డసరము, మద్దిపట్ట, దురదగొండి, వేపపట్ట, వీనిని యథాసంభవముగ గ్రహించి కషాయము కాచి సుఖోష్ణముగ నుండునపుడు అర్శస్సులను దడుపవలెను.

రక్తాధిక్యమున నవగాహనము.

మూ॥ రక్తేఽతివర్తమానే దాహే క్లేదేఽవగాహయేచ్చాపి,
మధుకమృణాళపద్మకచన్దనకుశకాశనిఃక్వాథే. 215

వ్యా. రక్త మధికముగ స్రవించు నర్శోవ్యాధియందును, మంట యధికముగ నున్నప్పుడును, గుదప్రదేశద్రవము కల్గియున్నను, అతిమధురము, తామరకాడలు, పద్మకము, చందనము, కుశదర్భవేళ్లు, రెల్లుదర్భవేళ్లు, వీనినన్నిటిని చేర్చి కాచబడిన కషాయమున నవగాహనము (కటిపర్యంతము నీటిలో నుండునట్లు స్నానము) చేయించవలెను.

ఇక్షురసాద్యవగాహనము.

మూ. ఇక్షురసమధుకవేతస నిర్వ్యాహే, శీతలే పయసి వా, తం,
అవగాహయేత్, ప్రదిగ్ధం పూర్వం శిశిరేణ తైలేన. 216

వ్యా. పైజెప్పిన యుపద్రవములయందు శీతవీర్యములనుజేర్చి సిద్ధముచేయబడిన తైలమును గుదస్థానముునను పొత్తికడుపుమీదను చక్కగ బూసి యిక్షురసము (చెరకురసము) నందైనను, అతిమధురమును నీరుప్రబ్బలిని చేర్చి కాచబడిన కషాయమునందైనను, కొంచెము చల్లనైయుండు నీళ్లయందైనను పైజెప్పినరీతిగ నవగాహనమును చేయించునది.

రక్తార్శోహరధారాజలసేచనము.

మూ. దత్వాఘృతం సశర్కరముపస్థదేశే గుదే త్రికదేశే చ,

శిశిరజలస్పర్శసుఖా ధారా ప్రస్తమ్భినీ యోజ్యా. 217

వ్యా. గుహ్యప్రదేశమునందును గుదస్థానమునను త్రిక (నడుముకు క్రిందిసంధి స్థానము) మునందును చక్కెరను కలిపిన నేతిని పూసి, చల్లని నీళ్లధారను సుఖస్పర్శముగ నుండునట్లు ప్రయోగించిన తీవ్రముగ వెడలుచుండు రక్తమును నిలుపును. (ఇచ్చట 'స్పర్శసుఖా' అనుటచేత నీటిధార యోరువకూడనంత చల్లదనములేక స్పర్శసుఖముగ నుండునంత చల్లగ నుండవలెనని యర్థము.)

రక్తస్రావమున కదళీదళాదిచ్ఛాదనము.

మూ. కదలీదళైరభినవైః పుష్కరపత్త్రైశ్చ శీతజలసిక్తైః,
ప్రచ్ఛాదనం ముహుర్ముహురిష్టం పద్మోత్పలదళైశ్చ. 218

వ్యా. మిక్కిలి లేతవియగు అరటియాకులనైనను, తామరాకులనైనను, తామర-కలువపువ్వుల రేకులనైనను చల్లని నీళ్లలో తడిపి పైజెప్పిన గుహ్య-గుద-త్రికస్థలములయందు పలుమారు కప్పియుంచినయెడ రక్తార్శస్సునందు రక్తస్రావంబును మంటయు నివర్తించును.

దూర్వాఘృతాదిప్రలేపము.

మూ. దూర్వాఘృతప్రదేహః శతధౌతసహస్రధౌతమపి సర్పిః,
వ్యజనపవనః సుశీతః రక్తస్రావం జయత్యాశు. 219

వ్యా. గరికనుచేర్చి కాచబడిన ఘృతమునైనను, శతధౌతఘృతమునైనను, సహస్రధౌతఘృతమునైనను, గుదాదిస్థానములయందు పూసినను; నీళ్లచే తడుపబడి చల్లగ నుండు వీవనచే విసరి చల్లనిగాలి తగులునట్లుచేసినను రక్తస్రావమును మంటలు మున్నగు బాధలును నివర్తించును. (నేతిని నీళ్లయందైనను శీతవీర్యములగు కషాయద్రవములయందైనను చేర్చి నూరుమార్లు చిలికిన నయ్యది శతధౌతఘృతమనియు, వేయిపర్యాయములు చిలికిన నయ్యది సహస్రధౌతఘృతమనియు నెరుంగునది.)

రక్తార్శస్సులయందు దాహాదిశామకలేపములు.

మూ. సమఙ్గామధుకాభ్యాం, తిలమధుకాభ్యాం, రసాఞ్జనఘృతాభ్యాం,
సర్జరసఘృతాభ్యాంవా, నిమ్బఘృతాభ్యాం, మధుఘృతాభ్యాం చ.
దార్వీత్వక్సర్పిర్భ్యాం, సచన్దనాభ్యాం అథోత్పలఘృతాభ్యాం,
దాహే క్లేదే చ గుదభ్రంశే గుదజాః ప్రతిసారణీయాస్స్యుః 221

వ్యా. మంజిష్టి, అతిమధురము, ఈరెంటిచేర్చి నూరిదైనను, నువ్వులను అతిమధురమునుచేర్చి నూరిదైనను అర్శస్సులను పూసినయెడ మంటయు, ద్రవంబును, గుదభ్రం

శంబును నివర్తించును. మరియు రసాంజనము, వేపపట్ట, తేనె, మ్రానిపసుపుపట్ట, వీనిలో జేనినైన నొకదానిని నేతిలో కలిపియైనను, చందనమును నల్లకలువలను నేతిలో కలిపి యైనను అర్శస్సుకు పూసి ప్రతిసారణముజేసినయెడ పైజెప్పినమంట మున్నగునుపద్రవములు మానును. (పైజెప్పినయౌషధములను పూసి రుద్దినయెడ నయ్యది ప్రతిసారణ మన బడును. "లవణైః కటుచూర్ణైశ్చ ఘృష్యతే యద్వ్రణం బుధైః, ప్రతిసారః తతః ప్రోక్తః" అని పరిభాష.)

## సంతర్పణ-అవపీడసేకములు.

మూ. ఆభిః క్రియాభిరథవా శీతాభిర్యస్య తిష్ఠతి నరక్తం,
తం కాలే స్నిగ్ధోష్ణైః మాంసరసై స్తర్పయేత్ మతిమాన్. 222
అవపీడకసర్పిర్భిః కోష్ణైః ఘృతతైలికైః తథాభ్యఙ్గైః,
క్షీరఘృతతైలసేకైః కోష్ణై స్తముపాచరేదాశు. 223

వ్యా. పైజెప్పబడిన ప్రతిసారణక్రియలచేతను, శీతోపచారములచేతను రక్తస్రావము నిలవనియెడ, వానికి స్నిగ్ధంబులును కొంచెముగ నుష్ణంబులునైన మాంసరసముల నిడి తృప్తినొందించవలెను. ఘృతముచేత నవపీడనము చేయనగును. (భుజించుటకు ముందును ఆహారము జీర్ణమగునప్పుడును ఘృతపానముచేసిన నయ్యది అవపీడకఘృత మన బడును.) మరియు కొంచెము వేడిగనుండు ఘృతములచేతను తైలములచేతను అర్శస్సులకు అభ్యంగనము చేయించనగును. కొంచెము వేడిగనుండు క్షీరముచేతను ఘృతముచేతను తైలముచేతను అర్శస్సులను తడుపుచుండవలెను. ఇట్టి యుపచారములచే రోగిని శీఘ్రముగ నుపచరించవలెను. (ఇచ్చట అవపీడనమన—"మాత్రజేషుచ పానేచ ప్రాగ్భక్తం శస్యతే ఘృతమ్, జీర్ణాన్తికం చోత్తమయా మాత్రయా యోజనాద్ద్వయమ్, అవపీడక మేతచ్చ సంజ్ఞితమ్" అని చెప్పబడిన లక్షణము నెరుంగునది.)

## వాతాధికరక్తార్శస్సులయందు అనువాసన-పిచ్ఛావస్తిప్రయోగము.

మూ. కోష్ణేన వాతప్రబలే ఘృతమణ్డేనాఽనువాసయేచ్ఛీఘ్రం,
పిచ్ఛావస్తిం దద్యాత్ వస్తిం కాలే తస్యాఽథవా సిద్ధమ్. 224

వ్యా. అర్శస్సులయందు వాతము బలిష్ఠముగ నున్నపుడు తోడనే కొంచెము వేడిగనుండు ఘృతముచేనైనను, పెరుగుమీది తేటనీటిచేనైనను అనువాసనవస్తి ప్రయోగమును (విధ్యుక్తప్రకారము) చేయవలెను. లేక యథోక్తకాలమున క్రిందచెప్ప బడురీతిగ సిద్ధముచేయబడిన పిచ్ఛావస్తిని ప్రయోగింపనగును.

### రక్తార్శోహరపిచ్ఛావస్తివిధానము.

మూ. యవాసకుశకాశానాం మూలం పుష్పం చ శాల్మలం,
న్యగ్రోధోదుమ్బరాశ్వత్థశుఙ్గాశ్చ ద్విపలోన్మితాః. 225
త్రిప్రస్థం సలిలస్యైతత్ క్షీరప్రస్థం చ సాధయేత్,
క్షీరశేషం కషాయం చ పూతం కల్కైర్విమిశ్రయేత్. 226
కల్కాః శాల్మలినిర్యాససమఙ్గాచన్దనోత్పలం,
వత్సకస్య చ బీజాని ప్రియఙ్గుః పద్మకేసరమ్. 227
పిచ్ఛావస్తిరయం సిద్ధః సఘృతక్షౌద్రశర్కరః,
ప్రవాహికాగుదభ్రంశరక్తస్రావజ్వరాపహః 228

వ్యా. దురదగొండివేళ్లు, దర్భగడ్డివేళ్లు, రెల్లుదర్భవేళ్లు, బూరుగపువ్వులు, మఱ్ఱియూడలు, అత్తియూడలు, రావియూడలు, ఇవి ప్రత్యేకము రెండేసిపలములవంతున గ్రహించి, అందు మూడుప్రస్థములు జలమును, ఒకప్రస్థము ఆవుపాలును బోసి, పాలుమాత్రము మిగులునట్లు కషాయముగాచి వడగట్టి, అందు బూరుగబంక, మంజిష్ఠి, శ్రీగంధము, నల్లకలువలు, కొడిసెపాలవిత్తులు, ప్రేంకణము, తామరపువ్వులోని కేసరములు వీనిని ప్రత్యేకము కర్షప్రమాణమువంతునచేర్చి కల్కముచేసి కలిపి, సిద్ధము చేయనగును. పిమ్మట నెయ్యి, తేనె, చక్కెర, వీనిని పైజెప్పినద్రవమునజేర్చి విధ్యుక్తప్రకారము వస్తిప్రయోగము చేయవలెను. ఇయ్యది పిచ్ఛావస్తి యని చెప్పబడును. ఈవస్తిప్రయోగము వలన ప్రవాహిక, గుదభ్రంశము, రక్తస్రావము, జ్వరము వీనినన్నిటిని హరించును. (ఇచ్చట నిరూహవస్తికి చెప్పిన ఔషధపరిమాణమునకన్న తక్కువపరిమాణముతో జేయబడినది పిచ్ఛావస్తి యనబడును. ఇది నిరూహవస్తిలో భేదము.)

### అనువాసనవస్తివిధానము.

ప్రపౌణ్డరీకం మధుకం పిచ్ఛా(పేష్యాః) వస్తౌ యథేరితాః,
పిష్ట్వానువాసనం స్నేహం క్షీరద్విగుణితం పచేత్. 229

వ్యా. ప్రపౌణ్డరీకము, (పుండరీకమను గంధద్రవ్యము), అతిమధురము, పిచ్ఛావస్తియందు చెప్పబడిన (బూరుగబంక, మంజిష్ఠి, చందనము, నల్లకలువలు, కొడిసెపాలవిత్తులు, ప్రేంకణము, పద్మకేసరములు, అను నీ)కల్కద్రవ్యములు. వీనిని సమభాగములుగ గ్రహించి కల్కముచేసి కల్కమునకు నాల్గింతలు తైలమును, తైలమునకు రెండింతలు

ఆవుపాలను కలిపి పక్వముచేసి యాతైలముచే రక్తార్శోరోగికి అనువాసనవస్తి చేయవలెను.

### అర్శోహరహ్రీబేరాదిఘృతము.

మూ. హ్రీబేరముత్పలం లోధ్రం సమఙ్గాచవ్యచన్దనం,
పాఠా సాఽతివిషా బిల్వం ధాతకీ దేవదారు చ. 230
దార్వీత్వక్ నాగరం మాంసీ ముస్తం క్షారో యవాగ్రజః,
చిత్రకశ్చేతి పేష్యాణి చాఙ్గేరీస్వరసే ఘృతమ్. 231
ఏకధ్యం సాధయేత్ సర్వం తత్సర్పిః పరమౌషధం,
అర్శోఽతిసారగ్రహణీపాణ్డురోగజ్వరేఽరుచౌ. 232
మూత్రకృచ్ఛ్రే గుదభ్రంశే వస్త్యానాహే ప్రవాహణే,
పిచ్ఛాస్రావేఽర్శసాం శూలే యోజ్యమేతత్ త్రిదోషనుత్. 233
(ఇతి హ్రీబేరాదిఘృతమ్.)

వ్యా. కురువేరు, నల్లకలువలు, లొద్దుగుపట్ట, మంజిష్ఠి, చవ్యము, చందనము, విషబొద్ది, అతివస, మారేడుపట్ట, ఆరెపువ్వు, దేవదారుచెక్క, మానిపసుపుపట్ట, శుంఠి, జటామాంసి, తుంగగడ్డలు, యవక్షారము, చిత్రమూలము, వీనినన్నిటిని సమభాగములుగ గ్రహించి కల్కముచేసి నూరి చాంగేరీస్వరసమున (పులిచింతాకురసమున) కలిపి స్వరసమునకు నాల్గవపాలు ఆవునేతిని చేర్చి, అన్నింటి నొకటిగగూర్చి ఘృతపాకవిధిప్రకారము పక్వముచేసియుంచునది. ఈఘృతమును అర్శోరోగము, అతిసారము, గ్రహణిరోగము, పాండురోగము, జ్వరము, అరుచి, మూత్రకృచ్ఛ్రము, గుదభ్రంశము, వస్తియందుకల్గిన ఉబ్బరము, ప్రవాహిక (బంకవిరేచనములు), పిచ్ఛాస్రావము (గంజివలె జిగురుగనుండు ద్రవము స్రవించుట), అర్శస్సులయందు కలిగినపోటు, అను నీరోగములన్నిటియందును సేవింపదగును. ఇయ్యది త్రిదోషహారమై యర్శస్సులకు శ్రేష్ఠమైన యౌషధము.

ఇచ్చట ఘృతకల్పనమునకు ద్రవాదులకు పరిమితి విశేషవిధిగ జెప్పియుండలేదు కావున—"జలస్నేహౌషధానాంచ ప్రమాణం యత్ర నేరితమ్, తత్ర స్యాదౌషధాత్ స్నేహః, స్నేహాత్తోయం చతుర్గుణమ్" అనుసామాన్యపరిభాషానుసారముగ ప్రపౌండరీకాదికల్కద్రవ్యములను సమభాగములుగ కల్కముజేసి, కల్కమునకు నాలుగింతలు ఘృతమును, ఘృతమునకు నాలుగింతలు పులిచింతాకుస్వరసమునుగూర్చి ఘృతమును పక్వముజేయునది.

## సునిషణ్ణక-చాంగేరీఘృతము.

మూ. అవాక్పుష్పీ బలా దార్వీ పృశ్నిపర్ణీ త్రికంటకః,
న్యగ్రోధోదుమ్బరాశ్వత్థశుఙ్గాశ్చ ద్విపలోన్మితాః. 234
కషాయ ఏషాం; పేష్యాస్తు జీవన్తీ కటురోహిణీ,
పిప్పలీ పిప్పలీమూలం నాగరం సురదారు చ. 235
కలిఙ్గాః శాల్మలం పుష్పం వీరాచన్దనముత్పలమ్ (చన్దనమఞ్జనం),
కట్ఫలం చిత్రకో ముస్తం ప్రియఙ్గ్వతివిషా స్థిరాః. 236
పద్మోత్పలానాం కిఞ్జల్కాః సమఙ్గా సనిదిగ్ధికా,
బిల్వం మోచరసః పాఠా భాగాః కర్షసమన్వితాః. 237
చతుఃప్రస్థే ఘృతప్రస్థం కషాయమవతారయేత్,
త్రింశత్పలాని ప్రస్థోఽత్ర విజ్ఞేయో ద్విపలాధికః. 238
సునిషణ్ణకచాఙ్గేర్యోః ప్రస్థౌ ద్వౌ స్వరసస్య చ,
సర్వైరేతై ర్యథోద్దిష్టైః ఘృతప్రస్థం విపాచయేత్. 239
ఏతదర్శస్స్వతీసారే రక్తస్రావే త్రిదోషజే,
ప్రవాహణే గుదభ్రంశే పిచ్ఛాసు వివిధాసు చ. 240
ఉత్థానే చాతిబహుశః శోథశూలే గుదాశ్రయే,
మూత్రగ్రహే మూఢవాతే మన్దేఽగ్నావరుచావపి. 241
ప్రయోజ్యం విధివత్సర్పిః బలవర్ణాఽగ్నివర్ధనమ్,
వివిధేష్వన్నపానేషు కేవలం వా నిరత్యయమ్. 242
(ఇతి సునిషణ్ణకచాఙ్గేరీఘృతమ్)

వ్యా. పెద్దసదాప, చిట్టాముట్టి, మ్రానిపసుపు, కోలపొన్న, పల్లేరు, మఱ్ఱిచిగుళ్లు, అత్తిచిగుళ్లు, రావిచిగుళ్లు, వీనిని ప్రత్యేకము రెండేసిపలములవంతున నాలుగుప్రస్థములు జలమునచేర్చి, నాల్గవపాలు మిగులునట్లు కషాయముకాచి యుంచునది; పాలకూర, కటుకరోహిణి, పిప్పళ్లు, మోడి, శుంఠి, దేవదారు, కొడిసెపాలవిత్తులు, బూరుగపువ్వులు, క్షీరకాకోళి, చందనము, కలువలు, కట్ఫలము (టేకుమ్రానిచెక్క), చిత్రమూలము, తుంగగడ్డలు, ప్రేంకణము, అతివస, ముయ్యాకుపొన్న, తామరపువ్వులయొక్కయు నల్లకలువలయొక్కయు కేసరములు, మంజిష్ఠ, వాకుడు, మారేడుపట్టు, బూరుగబంక, విష

కొద్ది వీనిని ప్రత్యేకము కర్షప్రమాణమువంతున జేర్చి నూరి కల్కముచేసి పైజెప్పబడిన ప్రస్థమితమైన అవాక్పుష్పి మున్నగుకాష్ఠద్రవ్యమున నాల్గుప్రస్థముల జలముజేర్చి నాల్గవపాలు (ఒకప్రస్థము మిగులునట్లు కాచబడిన) కషాయమునజేర్చి అందు ఒక ప్రస్థము ఆవునేతిని, చెంచలికూరయొక్కయు పులిచింతాకుయొక్కయు స్వరసమును రెండుప్రస్థములును చేర్చి (వీనినన్నిటి నొకటిగ కలిపి) ఘృతపాకవిధిప్రకారము ప్రస్థపరిమితమైన ఘృతమును పక్వముచేయనగును. (ఇచ్చట ప్రస్థమన ముప్పదిరెండుపలములని యెరుంగునది.)

ఈఘృతమును—అర్శోరోగము, అతిసారము, దోషత్రయముచే గల్గినరక్తస్రావము, ప్రవాహిక, గుదభ్రంశము, గంజినీళ్లవలె చిక్కనిద్రవము స్రవించునర్శస్సులు, పలుతెరంగులైన యర్శస్సులు, మాటిమాటికిని పలుతెరంగుల మొలచునట్టియర్శస్సులు, గుదస్థానమునకల్గిన వాపు, పోటు, మూత్రబంధము, వాతము నిశ్చలముగ బద్ధగించుట. అగ్నిమాంద్యము, అరోచకము, అను నీవ్యాధులయందెల్ల విధ్యుక్తప్రకారము సేవింపదగును. దీనివలన బలంబును జాఠరాగ్నియు శరీరవర్ణంబును వృద్ధినందును. మరియు పలుతెరంగులైన యన్నపానములయందు చేర్చియైనను, కేవలము ఘృతమునైనను నిరాతంకముగ నుపయోగింపందగును. (ఇయ్యది సునిషణ్ణకచాంగేరీఘృతమని చెప్పబడును.)

భవన్తి చాత్ర:—

మూ. వ్యత్యాసాన్మధురామ్లాని శీతోష్ణాని చ యోజయేత్,
నిత్యమగ్నిబలాపేక్షీ జయత్యర్శః కృతాన్ గదాన్. 243

వ్యా. జాఠరాగ్నిబలమునుకోరు అర్శోరోగికి మధుర-అమ్లద్రవ్యములను, శీత-ఉష్ణద్రవ్యములను వ్యత్యాసముగ మార్చిమార్చి ప్రతిదినంబు నుపయోగించినచో నానాట జాఠరదీప్తి కల్గి యర్శోరోగములు హరించును.

('వ్యత్యాసాత్' అన:—తొలుత మధురరసమును పిమ్మట నమ్లరసమును, తొలుత నమ్లరసమును పిమ్మట మధురరసమును; తొలుత శీతద్రవ్యములను పిమ్మట నుష్ణద్రవ్యములను, తొలుత నుష్ణద్రవ్యములను పిమ్మట శీతద్రవ్యములను; మార్చిమార్చి యుపయోగించవలెనని భావము.)

### అర్శస్సునం దగ్నిసంరక్షణావశ్యకత.

మూ. త్రయో వికారాః ప్రాయేణ యే పరస్పరహేతవః,
అర్శాంసి చాఽతిసారశ్చ గ్రహణీదోష ఏవ చ. 244

ఏషామగ్నిబలే హీనే వృద్ధిః వృద్ధే పరిక్షయః,
తస్మాదగ్నిబలం రక్ష్యం ఏషు త్రిషు విశేషతః. 2

వ్యా. అర్శోరోగము, అతిసారము, గ్రహణీదోషము అను నీమూడురోగ
లును ఒకదానికొకటి కారణములై యుండును. పరస్పరహేతుభూతములగు నీమూ
వ్యాధులును జాఠరాగ్నిబలహీనమైనపుడు వృద్ధినందును. జాఠరాగ్ని బలిష్ఠమ
నున్నచో నశించును. కావున నీమూడువ్యాధులయందును విశేషముగ (ముఖ్యమ
నగ్నిబలమును కాపాడవలెను. (ఇచ్చట 'ఏషుత్రిషు విశేషతః' అని చెప్పుటవలన తక్కి
వ్యాధు లన్నింటియందును అగ్నిబలమును కాపాడుటయు ముఖ్యమని తెలిసెడి.)

అర్శోరోగమున పథ్యోపయోగక్రమము.

మూ. భృష్టైశ్శాకైః యవాగూభిః యూషైర్మాంసరసైః ఖడైః,
క్షీరతక్రప్రయోగైశ్చ వివిధైర్గుదజాన్ జయేత్. 2
యద్వాయోరానులోమ్యాయ యదగ్నిబలవృద్ధయే,
అన్నపానౌషధద్రవ్యం తత్సేవ్యం నిత్యమర్శసైః. 2

వ్యా. ఈయధ్యాయమున నర్శస్సులకు హితముగ నుపదేశింపబడినరీతిగ పక్వ
చేయబడిన శాకములను, యవాగువులను, యూషములను, మాంసములను, మాంసరస
లను, ఖడయూషములను క్షీరములను, తక్రములను, పలువిధములుగ నుపయోగిం
యెడ నర్శస్సులను సులభముగ జయింపనగును. మరియు, వాతములను అనులోమమ
జేయునవియు, జఠరాగ్నిబలమును వృద్ధినందించునవియు నగు పైనిర్దేశింపబడిన య
పాన-ఔషధద్రవ్యములను అర్శోరోగముకలవారు నియతముగ నుపయోగింపవలెను

అర్శోరోగమున నుపయోగింపదగని యపథ్యములు.

మూ. యదతో విపరీతం స్యాత్ నిదానే యచ్చ దర్శితం,
గుదజాభిపరీతేన తత్సేవ్యం న కదాచన. 2

వ్యా. పైజెప్పినదానికి విరుద్ధముగ వాతమును ప్రతిలోమముగ జేయునవిం
అగ్నినాశకంబులును, అర్శోరోగనిదానమున అర్శోరోగోత్పత్తికి కారణములుగ
బడినవియు, నగు అన్న-పాన-ఔషధద్రవ్యములను ఒకప్పుడును అర్శోరోగికి నుప
గింపంజనదు.

## అధ్యాయవిషయసంగ్రహము.

తత్ర శ్లోకాః—

మూ. అర్శసాం ద్వివిధం జన్మ పృథగాయతనాని చ,
స్థానసంస్థానలిఙ్గాని, సాధ్యాసాధ్యవినిశ్చయః. 249
అభ్యఙ్గాః, స్వేదనం, ధూమాః, సావగాహాః ప్రలేపనాః,
శోణితస్యావసేకశ్చ యోగాః దీపనపాచనాః. 250
పానాన్నవిధిరగ్ర్యశ్చ వాతవర్చోఽనులోమనః,
యోగాః సంశమనీయాశ్చ సర్పింషి వివిధాని చ. 251
వస్తయః, తక్రయోగాశ్చ వరారిష్టాః, సశర్కరాః,
శుష్కాణామర్శసాం శస్తాః, (శుష్కార్శసాం ప్రశమనాం)
స్రావిణాం లక్షణాని చ. 252
ద్వివిధం సానుబన్ధానాం తేషాం చేష్టం యదౌషధం,
రక్తసంగ్రహణాః క్వాథాః, పేష్యాశ్చ(పేయాశ్చ)వివిధాత్మకాః
స్నేహాహారవిధిశ్చాగ్ర్యో యోగాశ్చ ప్రతిసారణాః,
ప్రక్షాలనావగాహాశ్చ ప్రదేహాః సేచనాని చ. 254
అతివృత్తస్య రక్తస్య విఘాతవ్యం యదౌషధం,
తత్సర్వమిహ నిర్దిష్టం గుదజానాం చికిత్సితే. 255

వ్యా. అర్శస్సులకు సంబంధించిన రెండువిధములయిన పుట్టుకలు, వాని వేరువేరు స్థానములు, వేరువేరుస్వరూపములు, లక్షణములు, సాధ్యాసాధ్యనిర్ణయము, అభ్యంగములు, స్వేదనము, ధూమములు, అవగాహములు, ప్రలేపములు, రక్తావసేకము, దీపనపాచనయోగములు, వాతమును మలమును అనులోమముగ జేయు అన్నపానవిధులు, శమనయోగములు, పలుతెరంగులైన ఘృతయోగములు, వస్తులు, తక్రయోగములు, శ్రేష్ఠములగు అరిష్టములు, శర్కరారిష్టము, శుష్కార్శస్సులకు శమనోపాయములు, రక్తార్శోలక్షణములు, వాతాద్యనుబంధములచే రెండువిధములయిన రక్తార్శస్సులు, వానికనుకూలములగు రక్తస్రావమును నిలుపుక్వాథములు, పలుతెరంగులైన పేయావిధానములు, స్నేహఅవగాహవిధులు, ప్రతిసారణములు, ప్రక్షాలనవిధి, అవగాహనము, ప్రదేహములు, సేచనములు, రక్త మధికముగ స్రవించునపుడు చేయదగిన యౌషధ

ములు, ఈవిషయములన్నియు అర్శశ్చికిత్సితమను నీయధ్యాయమున వివరించి చెప్పబడినవి.

ఇత్యగ్నివేశకృతే తన్త్రే చరకప్రతిసంస్కృతే, (దృఢబలసంపూరితే)
చికిత్సాస్థానే అర్శశ్చికిత్సితం నామ చతుర్దశోఽధ్యాయః.

వ్యా. ఇత్తెరంగున అగ్నివేశకృతంబును, చరకప్రతిసంస్కృతంబును నగు చరకసంహితయందలి చికిత్సాస్థానమున దృఢబలసంపూరితభాగమునందలి అర్శశ్చికిత్సితమనునది పదునాలుగవ అధ్యాయము సమాప్తము.

[ఈచికిత్సాస్థానమున పదుమూడధ్యాయములుమాత్రము చరకునిచే సంస్కరింపబడినవి. తక్కుంగల పదునేడధ్యాయములును, కల్ప, సిద్ధిస్థానములు పూర్తిగను దృఢబలునిచే సంస్కరింపబడినది. ఈవిషయమును చికిత్సాస్థానాంతమున దృఢబలు డిట్లు చెప్పెను:—"అస్మిన్ సప్తదశాధ్యాయాః, కల్పాః, సిద్ధయఏవచ, నాసాద్యన్తేఽగ్నివేశస్య తన్త్రే చరకసంస్కృతే, తానేతాన్ కాపిలబలిః శేషాన్ దృఢబలోఽకరోత్. తన్త్రస్యాస్య మహార్థస్య పూరణార్థం యథాతథమ్." (చి. అ. ౩౦ శ్లో. ౭౯౦) మరియు నీమూలవ్యాఖ్యానమున చక్రపాణిదత్తు డిట్లు వివరించెను:—"చికిత్సాస్థానే సప్తదశాధ్యాయాః, తే చ చరకసంస్కృతాన్ యక్ష్మచికిత్సితాన్తాన్ అష్టావధ్యాయాన్, తథా అర్శో-తీసార-విసర్ప-ద్వివ్రణీయ-మదాత్యయోక్తాన్ విహాయ జ్ఞేయాః." ఈవివరణమునుబట్టి చికిత్సాస్థానమున మొదటినుండి రాజయక్ష్మచికిత్సితాధ్యాయాంతము వరకుంగల యెనిమిదియధ్యాయంబులును, తక్కినభాగములో అర్శశ్చికిత్సితము (౧౪), అతిసారచికిత్సితము (౧౯), విసర్పచికిత్సితము (౨౧), ద్వివ్రణీయచికిత్సితము (౨౪), మదాత్యయచికిత్సితము (౨౫), అను నీయధ్యాయము లైదును జేరి పదుమూడధ్యాయములును చరకునిచే సంస్కరింపబడినవనియు; ఇవిదక్క తక్కిన పదునేడధ్యాయములును, కల్పసిద్ధిస్థానములు పూర్తిగను దృఢబలుఁడు సంస్కరించి, అగ్నివేశకృతమై చరకప్రతిసంస్కృతమైన తంత్రమునందలి లుప్తమైన (దొరకని) భాగమును శేషపూరణముజేసెననియు నేర్పడినది. దీనివివరణమంతయు స్థలాంతరమున విస్తరింపబడును. ఇదియే సిద్ధాంతము. ఈసిద్ధాంతమునుబట్టి యీయధ్యాయము చరకప్రతిసంస్కృతము.]

## పఞ్చదశాధ్యాయము.

అవతరణిక:—పైయధ్యాయాంతమున "త్రయో వికారాః ప్రాయేణయే పరస్పర హేతవః, అర్శాంసి చాతిసారశ్చ గ్రహణీదోష ఏవ చ." అనుశ్లోకముచేత అర్శస్సులు గ్రహణీదోషమునకు కారణములగునని చెప్పబడినదిగాన అర్శశ్చికిత్సను చెప్పినపిమ్మట గ్రహణీదోషమునకు సంబంధించిన చికిత్స చెప్పబడును.

మూ. అథాతో గ్రహణీదోషచికిత్సితం వ్యాఖ్యాస్యామః. 1
ఇతి హ స్మాహ భగవానాత్రేయః. 2

వ్యా. అర్శశ్చికిత్సితమును జెప్పినపిదప గ్రహణీదోషచికిత్సితమను నధ్యాయమును భగవానుడగు నాత్రేయు లుపదేశించినదానికన్న న్యూనాతిరేకము గాకుండునట్లు వివరించెదనని యర్థము.

(ఇచ్చట గ్రహణీశబ్దముచేత గ్రహణిని (పెద్దప్రేగును) ఆశ్రయించిన యగ్ని కూడ గ్రహింపబడును. గ్రహణి నాశ్రయించియుండు జాఠరాగ్నికి సంబంధించిన దోషమునకు దగినచికిత్సితమును చెప్పెదనని యర్థము. ఈయర్థము ఆశ్రయమైనగ్రహణికిని, దాని నాశ్రయించినయగ్నికిని అభేదప్రతిపత్తిచే సిద్ధించును.)

అగ్నిస్వరూపము, కాయాగ్నిచే గల్గునుపకారము.

మూ. ఆయుర్వర్ణో బలం స్వాస్థ్యం ఉత్సాహోపచయౌ ప్రభా,
ఓజస్తేజోఽగ్నయః ప్రాణాశ్చోక్తాః దేహాగ్నిహేతుకాః 3

వ్యా. మనుజులకు (చేతనాధాతువునకు నశరీరమునకు సంబంధరూపమైన) ఆయువునకును, గౌరాదిశరీరవర్ణవిశేషమునకును, ఆరోగ్యరూపమైన స్వస్థతకును, ఉత్సాహము (కష్టసాధ్యములగు కార్యములయందును కల్గినయభినివేశము)నకును, ఉపచయము (శరీరపుష్టి)నకు, శరీరకాంతికిని, సర్వధాతుసారరూపమై హృదయమున ప్రాణమునకు ముఖ్యాధారముగ నుండు ఓజస్సునకును, తేజోరూపమైన శుక్రమునకును, పృథివ్యాది పంచభూతములకు సంబంధించిన యైదుభూతాగ్నులకును, రసరక్తాదిసప్తధాతువులకు సంబంధించిన సప్తవిధభూతాగ్నులకును, ప్రాణవాతమునకును వీనికన్నిటికిని గ్రహణి నాశ్రయించియుండు కాయాగ్ని ముఖ్యకారణమై యుండును. (పైజెప్పిన యాయువు మున్నగునవియన్నియు కాయాగ్నిని కారణముగ జేసికొని నిలిచియుండునని భావము.)

ఇచ్చట—"దృష్టిస్తేజోమయీ ప్రోక్తా, శుక్రం తేజశ్చ కేవలమ్, తస్మాద్దృష్టిబలాపేక్షీ తేజోవృద్ధిం సమాచరేత్." అను శాలాక్యతంత్రవాక్యమునుబట్టి తేజశ్శబ్ద

మునకు శుక్రమని యర్థము. "అగ్నయః" అనుచోట పంచభూతాత్మకమైన శరీరము నందలి పంచభూతములకు సంబంధించిన యూష్మరూపమగు పంచభూతాగ్నులును, రసరక్తాదిధాతువులయందలి యూష్మరూపమైన సప్తధాత్వగ్నులును జేరి పండ్రెండు విధములైన యగ్నులును గ్రహింపబడును. "ప్రాణాః" అనునది నిత్యబహువచనము, లేక ప్రాణాపానాదిపంచవాయువులని యర్థము జెప్పినను సమంజసము.

మరియు నీయధ్యాయమున గ్రహణీదోషశబ్దవాచ్యమయిన కాయాగ్నిదోషము నకు సంబంధించిన చికిత్స జెప్పుటకై కాయాగ్నిదోషములు మాత్రము వివరింపవలసి యున్నను, వికృతిజెందని స్వరూపము దెలిసినగాని వికృతరూపమును దెలిసికొన వలను పడదు; కావున తొలుత అవికృతమైన యగ్నిస్వరూపము చెప్పబడినది.

### జాఠరాగ్ని నశించుటచే గల్గుహాని.

మూ. శాన్తేఽగ్నౌ మ్రియతే, యుక్తే చిరం జీవత్యనామయః,
రోగీ స్యాద్వికృతే, మూలమగ్నిస్తస్మాన్నిరుచ్యతే. 4

వ్యా. కాయాగ్నిదీప్తి లేక పూర్తిగ చల్లారినయెడ మనుజుడు (అక్షణముననే) మృతిజెందును. వికృతిజెందక సమస్థితి నున్నచో రోగములు లేక చాలకాలము జీవించి యుండును. అటుగాక వికృతిజెందిన(మంద - విషమ - తీక్ష్ణరూపములనొందిన)యెడ జ్వరాదిరోగములచే బాధింపబడును; కావున పైజెప్పిన యాయుష్యము మున్నగువాని కన్నిటికిని కాయాగ్ని మూలకారణమని చెప్పబడినది.

ఇచ్చట నీవిషయము నెరుంగునది:—జాఠరాగ్ని విషమము, తీక్ష్ణము, మందము, సమము నని నాల్గు తెరంగుల నుండును. అందు వాత మధికముగ నున్నపుడు అగ్ని విషమ మగును. (ఆహారమును సమస్థితిగ పక్వము జేయక న్యూనముగ నొకప్పుడును, అధికముగ నొకప్పుడు పచింపజేయును. ఇదియే విషమాగ్ని). పిత్త మధికముగ నున్నపుడు మిగుల తీక్ష్ణముగ నుండును. కఫ మధికముగ నుండునెడ మందగించును. వాతాదిదోషములు మూడును విషమములుగాక సమస్థితి నున్నపుడు అగ్నియు పైజెప్పిన వికృతిజెందక సమ స్థితినుండి యాహారమును విధ్యుక్తప్రకారము పచింపజేయును. ఇదియే సమాగ్ని యన బడును. అగ్ని విషమస్థితి నందుటకు దోషవైషమ్యమే కారణము. ఈవిషయమునే వాగ్భటాచార్యులు "తైర్భవేద్విషమస్తీక్ష్ణః మన్దశ్చాగ్నిః సమైస్సమః." (అ. హృ. సూ. అ. ౧) అని స్పష్టముగ జెప్పెను. ఈవివరణమునంతయు నీతంత్రకారుడు క్రింద వివరించి చెప్పెను.

### ధాత్వాదిపోషణమునకు జాఠరాగ్ని కారణమనుట.

మూ. యదన్నం దేహధాత్వోజో బలవర్ణాదిపోషకం,
తత్రాగ్నిర్హేతు, రాహారాత్ న హ్యపక్వాద్రసాదయః. 5

వ్యా. దేహమునందలి రసాదిధాతువులను, ప్రాణమున కాధారమై ధాతుసారాంశమైన యోజస్సును, శరీరబలము వర్ణము మున్నగువానిని నానాట వృద్ధినందించి పోషించునట్టి యేయాహారముకలదో అట్టి యాహారమునకు పైజెప్పినశక్తి కల్గుటకు జాఠరాగ్నియే కారణము. భుజింపబడినయన్నము మున్నగునాహారము జాఠరాగ్నిచే పక్వముగానియెడ అట్టి యాహారమువలన రసరక్తాదిధాతువులు పుట్టనేరవు; కావున జాఠరాగ్ని ధాతువులు మున్నగువాని పోషించుటకు కారణమగును. (ప్రతిదినమున భుజింపబడు నాహారరసమువలన శరీరమునందలి రసరక్తాదిధాతువులు పుష్టిజెందును. ఆయాహారము జాఠరాగ్నిచే పక్వముకానియెడ నాహారరసము జనించనేరదు. కావున జాఠరానలము ధాత్వాదిపోషకమని భావము.)

### పాచకాగ్నిచే నాహారపాకక్రమము.

మూ. అన్నమాదానకర్తా తు ప్రాణః కోష్ఠం ప్రకర్షతి,
తద్ద్రవైర్భిన్నసంఘాతం, స్నేహేన మృదుతాం గతమ్. 6
సమానేనాఽవధూతోఽగ్నిః ఉదర్యః పవనోద్వహః (ఉదీర్ణః పవనేన తు)
కాలే భుక్తం సమం సమ్యక్ పచత్యాయుర్వివృద్ధయే. 7
ఏవం రసమలాయాన్నం ఆశయస్థమధస్స్థితః,
పచత్యగ్నిః, యథా స్థాల్యాం ఓదనాయాంబుతణ్డులమ్. 8

వ్యా. ఆహారమును గ్రహించువ్యాపారముకల ప్రాణవాతము నోటనుంచుకొనబడిన యన్నము కోష్ఠమునకు నాకర్షించి కోష్ఠమున (ఆమాశయమున) జేర్చును. అట్టి భుజింపబడిన యన్నము జలము ద్రవరూపములగు వ్యంజనములు మున్నగు ద్రవపదార్థములచే (ఘనీభూతమైనయన్నము) విడివిడిగ నుండునట్లు చేయబడును. పిదప స్నేహపదార్థ (నెయ్యి మున్నగువాని) సంబంధమునంజేసి మెత్తపడును. ఆకలి జనించినకాలమున పరిమాణమును ప్రకృతి మున్నగువానిని గమనించి యుక్తముగ భుజింపబడి, పైజెప్పినరీతిగ ప్రాణవాతముచే కోష్ఠమున జేర్పబడి ద్రవసంబంధముచే శిథిలమై స్నేహసంబంధముచేత మృదువై యామాశయముననుండు అన్నమును, పాచకాగ్నికి సమీపముననుండు సమానవాతముచే జ్వలింపజేయబడిన జాఠర (పాచక) అగ్ని క్రిందనుండియే మనుజునియాయువు వృద్ధినందుటకు చక్కగ పక్వముచేయును.

ఇత్తెరంగున ఆహారసారరూపమైన రసంబును మలంబును ఏర్పడుటకై, లోకమున నొకపాత్రములో జలముతోకూడ జేర్చియుంచబడిన బియ్యమును ప్రాయిలోనుండు బాహ్యాగ్ని బాహ్యమగు గాలిసంబంధముచే నానాట రగిలి మండి (పైనుంచబడినదానిని) యన్నరూపమునొందునట్లు పచింపజేయువిధముగ, ఆమాశయమున జలాదిద్రవసంబంధము కల్గియుండు నాహారమును, దానికి క్రిందనుండు పాచకాగ్ని పచింపజేసి దాని సార మేర్పడునట్లు చేయునని సముదితార్థము. ఈవాక్యముచేత నాహారపరిణామము జెందించుటకు వాతంబును, ద్రవంబును, స్నేహంబును, కాలంబును, పాచకాగ్నికి సహాయ్యకరములై యుండునని తెలుపబడినది. ఈవిషయము నే శారీరస్థానమున— "ఆహారపరిణామకరాస్త్విమే భావాభవన్తి తద్యథా:—ఊష్మా,వాయుః, క్లేదః, స్నేహః, కాలః, సమయోగశ్చేతి." (శా. అ. ౬) అనువాక్యముచే నీతంత్రకారుడు స్ఫుటముగ జెప్పెను. (మరియు లోకమునం దగ్నికి పైకివ్యాపించుస్వభావము నైజము కావున ఆమాశయముననుండు ఆహారమును, దానిక్రిందనుండు పాచకాగ్ని పచించునని తెలియుటకై "ఆశయస్థమధస్థి న్తతః" అని చెప్పబడినది).

## జాఠరాగ్నిపాకముచేగల్గు ఆవస్థిక త్రివిధవిపాకము.

మూ. అన్నస్య భుక్తమాత్రస్య షడ్రసస్య ప్రపాకతః, మధురాద్యాత్ (మధురాత్ప్రాక్) కఫోభావాత్ ఫేనభూత (భావ) ఉదీర్యతే. 9
పరం తు పచ్యమానస్య విదగ్ధస్యాఽమ్లభావతః,
ఆశయాచ్చ్యవమానస్య పిత్తమచ్ఛముదీర్యతే. 10
పక్వాశయం తు ప్రాప్తస్య శోష్యమాణస్య వహ్నినా,
పరిపిణ్డితపక్వస్య వాయుస్స్యాత్ కటుభావతః. 11

వ్యా. మధుర-అమ్ల-లవణ-తిక్త-కటు-కషాయములను నారురసములతో గూడిన యాహారమును భుజించినవెంటనే అయ్యది ఆమాశయముననుండియే పాచకాగ్నిసంబంధమువలన పచింపబడి తొలుదొలుత మధురముగ పాకముజెందును. అట్టి యాహారము యొక్క తొల్లింటి మధుర విపాకమువలన నురుగువలె ఘనీభవించిన పదార్థము పుట్టును. అదియే కఫము. (ఆకఫము ఆమాశయమును ప్రధానస్థానముగ జేసికొని యుండును. ఇది ఆహారపాకమునకు ప్రారంభావస్థ. ఈప్రారంభపాకమువలననే ఫేనరూపమైన యాహార రసము ఘనమై కఫరూపముగపరిణమించి యామాశయమున నుండునని భావము).

ఇత్తెరంగున నామాశయమున తొల్లింటి పాకావస్థనొందిన యాహారము ఆమాశయమునుండి వాతప్రేరణముచేత (క్రిందికి) జారుచు విదగ్ధమై (జాఠరాగ్నిసంబంధముచే

పక్వ-అపక్వరూపమునంది)అమ్లరూపముగ నగును. అట్టి యమ్లభావమువలన ద్రవరూపమై తేటనైన పిత్తము జనించును. (తొలుత పాకప్రారంభదశనొందిన యాహారము వాత ప్రేరితమై యామాశయమునుండి క్రిందికి (పిత్తస్థానమునకు) జేర్పబడి, పాచకాగ్నిచే మరల పచింపబడి అమ్లభావము నొందును. అట్టి యమ్లత్వము ఆహారము పక్వము అయ్యీ కాకయుండు అవస్థయందు కల్గును. ఆయవస్థయందు ఆహారమునుండి యమ్లరసరూపమైన ద్రవము జనించును. అదియే పిత్తద్రవము. అయ్యది పిత్తాశయమును ప్రధానముగ జేసికొని యుండును. ఇదియే యాహారమునకు పచ్యమానావస్థ. ఇది యమ్లవిపాకస్వరూపము).

ఇత్తెరంగున పచ్యమానావస్థనొందిన యాహారము పిత్తాశయమునుండి (వాతముచేత) పక్వాశయమున జేర్పబడి పాచకాగ్నిచే మరల పచింపబడి ద్రవములేక శోషింపబడును. అట్టి పరిపాకమువలన ఆహారము చక్కగ పరిపక్వమై పిండాకారమై (సారమునంతయు వదలి) మలరూపమగును. అట్టి పక్వావస్థయందు అందుండి కటుస్వరూపమైన వాతము జనించును. (ఇదియే యాహారమునకు పక్వావస్థ. ఈయవస్థయందే ఆహారము కటువిపాకము జెందును. అట్టి కటువిపాకమున జనించినవాతము పక్వాశయమును ప్రధానముగ జేసికొని యుండును).

వివరణము:— పై జెప్పబడినది మూలమునకు సమంజసమైన యర్థము. ఆహారము పక్వాశయమున జేరినపుడు పాచకాగ్ని పక్వాశయమునకు పైభాగమున నుండుటంజేసి యధోభాగముననుండు నాహారమును ఎట్లు పచింపజేయును? అగ్నికి పైకివ్యాపించు శక్తియేకాని క్రిందికి వ్యాపించుస్వభావము లేదుకదా! అట్టియెడ "పక్వాశయం తు ప్రాప్తస్య శోష్యమాణస్య వహ్నినా" అని చెప్పినది యెట్లు సంగతము? అన్నచో— లోకమున పక్వముచేయబడినయన్నమున ద్రవము కొంచెముగ శేషించి చక్కగ పక్వము కాకుండునపుడు సిబ్బిరేకున నిప్పు నునిచి, యన్నముపాత్రపై నునిచినచో నాద్రవము నంతయు పీల్చి చక్కగ పక్వముచేయును. ఆత్తెరంగుననే పక్వమైన యాహారము పక్వాశయమున జేరినపుడు పైనున్న పాచకాగ్ని పక్వమైన యాహారమునందలి ద్రవమును పీల్చును. దానివలన నాహారము చక్కగ పక్వమై సారమునంతటిని వదలి నిస్సారమైన మలరూపము నొందును. ఈభావమునే 'శోష్యమాణస్య వహ్నినా, పరిపిణ్డితపక్వస్య' అని తంత్రకారు లుపదేశించిరి.

మరియు భుజింపబడు షడ్రసవిశిష్టమైన యాహారమునకు జాఠరాగ్నిసంబంధముచే పాకము నొందునపుడు పాకావస్థ, పచ్యమానావస్థ, పక్వావస్థ, యని మూడు అవస్థాభేదములు కల్గును. అందు ఆహారము ఆమాశయమున జేరినవెంటనే కల్గుపాక

ప్రారంభదశ తొల్లింటిది. ఈయవస్థయందు పైజెప్పినరీతిగ తొలుత మధురముగ నాహారము పక్వమగును. ఇదియే యాహారమునకు మధురవిపాకము. దీనివలన కఫము కల్గును. (అభివ్యక్తమగును) అట్టి యాహారము పిత్తస్థానమున జేరి పాచకాగ్నిచే పరిపక్వమగును. ఇదియే పచ్యమానావస్థ. ఈయవస్థయందు ఆహారము అమ్లరూపముగ పరిణమించి పిత్తమును కల్గించును. ఇదియే అమ్లవిపాకము. పిమ్మట పైజెప్పినరీతిగ పక్వమైన యాహారము పక్వాశయమున జేరి యగ్నియొక్క వేడిమిచే రసమునంతటిని పీలువబడి మలరూపమగును. ఇది పక్వావస్థ. ఈయవస్థయందు ఆహారమునుండి కటుపదార్థము వెడలి వాతమును వృద్ధినందించును. ఇదియే కటువిపాకము. ఈచెప్పబడిన మధుర-అమ్ల-కటువిపాకములు మూడును పైనివివరించినరీతిగ నాహారపాకావస్థనుబట్టి కల్గినవికావున ఆవస్థికవిపాకములని చెప్పబడు. అందు ఆహారపాకప్రారంభమున కల్గు మధురవిపాకముచే వాతంబును, మధ్యవిపాకమైన యమ్లవిపాకముచే పిత్తంబును, కడపటిదియగు కటువిపాకముచే వాతంబును క్రమముగ కల్గునని తంత్రకారులు చెప్పిరి. ఈవిషయముచే వాగ్భటాది తంత్రకారులందరును—"వయోహోరాత్రిభుక్తానాం తేఽన్త-మధ్య - ఆదిగాః క్రమాత్" ఇత్యాదివాక్యములచే నాహారముయొక్క పాకావస్థయందు అంతమున వాతంబును, మధ్యమున పిత్తంబును, ఆదియందు కఫంబును వృద్ధినొందునని చెప్పిరి. ఇది ఆవస్థికవిపాకవివరణము. ఈవివరణముచే మధురాదిషడ్రసవిశిష్టఆహారసముదాయముయొక్క పాక-పచ్యమాన-పక్వావస్థలయందు క్రమముగ మధురాదివిపాకము కల్గునని తేలినది.

మరియు మధురాదిషడ్రసములయొక్క పరిపాకాంతమున ఆహారసారము కిట్టముగను వేరువేరుగ నేర్పడుసమయమున విపాక మేర్పడునని చెప్పబడినది. అదియెట్లనః—"కటుతిక్తకషాయాణాం విపాకః ప్రాయశః కటుః, అమ్లోఽమ్లం పచ్యతే స్వాదుః మధురం లవణస్తథా" చ. సూ. అ. ౨౬ శ్లో. ౮౮ కటుతిక్తకషాయరసములు ప్రాయికముగ కటువిపాకము జెందుననియు అమ్లరసము అమ్లముగానే విపాకము నెందుననియు మధురలవణరసములు తరచుగ మధురముగనే విపాకము జెందుననియు యర్థము. దీనిచేత ఆయారసములనుబట్టి జీర్ణాంతరము మధురాదివిపాకములు విభజింపబడును. ఈవిపాకము రసముల నాశ్రయించి నియతముగ సంభవించు నిష్ఠావిపాకమని యెరుంగునది. ఈనిష్ఠావిపాకము పాకానంతరము రస-మల-విభాగ మేర్పడుసమయకాలమున సంభవించునది. ఆవస్థికవిపాకము పాకప్రారంభాద్యవస్థాకాలమున సంభవించునది. కావున ఈరెంటికిని కాలభేదమునుబట్టి భేదము నెరుంగదగియున్నది. ఇచ్చట ఈవిపాకభేదవిషయమున వక్తవ్యాంశము విశేషముగ నుండును. విస్తరభీతిచే నింతట వ్రాయ విరమించితిని.

ఆహారముచే శరీరమునందలి పంచభూతగుణములపోషణక్రమము.

మూ. అన్నమిష్టం హ్యుపహి(కృ)తం ఇష్టైర్గన్ధాదిభిః పృథక్,
దేహే ప్రీణాతి గన్ధాదీన్ ఘ్రాణాదీ(ప్రాణాదీ)నిన్ద్రియాణి చ.

వ్యా. మనసుకు ఇంపై హితకరంబును, ప్రియంబులును హితంబులును నగు గంధ-రస-రూప-స్పర్శ-శబ్దములతో కూడినదియు నగునన్నమును భుజించినచో పాంచభౌతిక శరీరమునందలి పృథివ్యాది పంచభూతాంశములైన గంధరస-రూప-స్పర్శశబ్దములను, వరుసగ వేరువేర పోషించును. మరియు ఘ్రాణము, రసనము, దర్శనము, స్పర్శనము, శ్రోత్రము, అను నింద్రియములను కూడ వరుసగ తృప్తినందించి పోషించును.

(పృథివి, జలము, తేజస్సు, వాయువు, ఆకాశము, అను పంచభూతాంశములచే శరీరము ఏర్పడినది. కావుననే పాంచభౌతిక మైనది. అట్టియెడ మనస్సుకు ఇంపై హిత మైనదియు, ఇంపై హితమైన గంధరసాదులతో కూడినదియు నగు నాహారమును భుజించినచో శరీరమునందలి ఆయాభూతమునకు సంబంధించిన గంధాదులను, వానినిసంబంధించిన ఘ్రాణాదీంద్రియములను, పోషించి తృప్తినందించునని భావము.)

పంచవిధభౌతికాగ్నులవ్యాపారము.

మూ. భౌమాఽఽప్యాఽఽగ్నేయవాయవ్యాః పఞ్చోష్మాణః సనాభసాః,
పఞ్చాహారగుణాన్ స్వాన్ స్వాన్ పార్థివాదీన్ పచన్తి హి. 13

వ్యా. (పృథివి, అప్పు (జలము), తేజస్సు, వాయువు, ఆకసము, అనునీపంచభూతములయొక్క ఆయాభాగములు సమష్టిగ జేరి శరీరమేర్పడునని పైనజెప్పబడినది. అట్టి పంచభూతములకు సంబంధించిన యగ్నిగుణము వేరువేరుగ ఆయాభూతాంశములకు జేరియుండును. వానిలో భూమికి సంబంధించినది భౌమమనియు, జలమునకు సంబంధించినది ఆప్యమనియు, అగ్నికి సంబంధించినది ఆగ్నేయమనియు, వాయువునకు సంబంధించినది వాయువీయము (వాయవ్యము) అనియు, ఆకసమునకు సంబంధించినది నాభసమనియు చెప్పబడును. పాంచభౌతికశరీరమునందు ఆయాభూతమునకు సంబంధించిన ఈపంచాగ్నులును శరీరమునందలి ఆయాభూతభాగముతో గూడ చేరియే యుండును. మనుజులచే భుజింపబడు నాహారపదార్థములును పంచభూతవికారములయి యుండును.)

అట్టి పాఞ్చభౌతికశరీరమునందలి భౌమ-ఆప్య-ఆగ్నేయ-వాయవ్య-నాభసములను పఞ్చభూతాగ్నులును మనుజులచే భుజింపబడిన పఞ్చభూతవికారమయిన యాహారమునందలి ఆయాభూతమునకు సంబంధించిన పఞ్చభూతగుణములను వరుసగ పచింపజేయును. (భుజింపబడిన యాహారమునందలి పృథివీసంబంధమయిన గుణమును పార్థివా

గ్నియు, అగ్నిసంబంధమయిన గుణమును ఆగ్నేయాగ్నియు, ఇత్తెరంగున ఆయాభూత గుణమును ఆయాభూతాగ్ని క్రమముగ పచింపజేయునని భావము. ఈభూతాగ్నులు జాఠరాగ్నిపాకానంతరము అట్టి యాహారమునే మరల దానియందలి భూతగుణములను పైజెప్పినక్రమముగ పచింపజేయును.)

## పాంచభౌతికగుణపోషణము.

మూ. యథా స్వం స్వం చ పుష్ణాతి దేహే ద్రవ్యగుణాః పృథక్,
పార్థివాః పార్థివానేవ శేషాః శేషాంశ్చ కృత్స్నశః. 14

వ్యా. పైజెప్పినరీతిగ తొలుత పాచకాగ్నిచే పచింపబడిన యాహారమునందలి పంచమహాభూతసంబంధమయిన గుణములను ఆయాభూతాగ్నులు యథాక్రమముగ పచింపజేసి ఆయాభూతమునకు చేరినగుణమును ఆయాభూతమునకుచేరిన భూతాగ్ని వృద్ధి నందించి పోషించుచుండును. ఎట్లనగ:—భుజింపబడినయాహారమునందలి పృథివికి సంబంధించిన గంధాదిగుణములను పృథివికి సంబంధించిన భూతాగ్ని పైజెప్పినరీతిగ పాకమునొందించి పోషించును. జలమునకు సంబంధించిన స్నేహగుణమును జలమునకు సంబంధించిన భూతాగ్నియు, అగ్నికి సంబంధించిన యుష్ణగుణమును ఆగ్నేయభూతాగ్నియు, ఇత్తెరంగుననే తక్కిన భూతాగ్నులును పోషించును.

## సప్తవిధధాత్వగ్నులవ్యాపారము.

మూ. సప్తభిర్దేహధాతారో ధాతవో ద్వివిధం పునః,
యథాస్వమగ్నిభిః పాకం యాన్తి కిట్టప్రసాదవత్ (తః). 15

వ్యా. పైజెప్పినరీతిగ జాఠరాగ్నిచేతను, పంచభూతాగ్నులచేతను, పచింపబడిన యాహారము, సారరూపముగను కిట్టరూపముగను ఏర్పడును. అట్టియాహారసారము శరీరమునందలి రసరక్తాదిసప్తధాతువులకు సంబంధించిన ధాత్వగ్నులచేత (ఆయాధాతుభాగముల) పచింపబడి ఆయాధాతువులకు సంబంధించినసారముగను, కిట్టముగను, వేరువేరుగ నేర్పడి శరీరమును ధరించుచు నుండును.

ఇచ్చట నీవివరము నెరుంగునది:—పైజెప్పినరీతిగ భుజింపబడిన యాహారము జాఠరాగ్నిచేతను, భూతాగ్నులచేతను, పచింపబడి; సారముగను, కిట్టముగను నేర్పడును. అట్టి యాహారసారము శరీరమునందలి రస-రక్త-మాంస-మేదః-అస్థి-మజ్జ-శుక్రము లను సప్తధాతువులకును జాఠరాగ్నిపాకక్రమముచే సంక్రమించిన ధాత్వగ్నులచే వేరువేరుగ పచింపబడుచు, ఆహారసారము రసధాతువునందలి యగ్నిచే పచింపబడి రసధాతువుగ

పరిణమించును. అట్టి రసధాతువునందలి రక్తధాతువునకు మూలమయిన సారము శరీరము నందలి రక్తధాతునిష్ఠమయిన యగ్నిచే పక్వమగును. ఇత్తెరంగున నాయాధాతునిష్ఠమయిన యగ్నిచే నాయాధాతువు పక్వమై రూపాంతరమునొంది మాంసాదిరూపముగ మారు చుండును. ఇదియే ధాత్వగ్నిపాకక్రమము.

## రసాదిధాతూత్పత్తిపోషణక్రమము.

మూ. రసాద్రక్తం తతో మాంసం మాంసాన్మేదః, తతోఽస్థి చ,
అస్థ్నో మజ్జా, తతశ్శుక్రం శుక్రాద్గర్భః ప్రసాదజః. 16

వ్యా. (పైజెప్పినరీతిగ నాహారము పాచకాగ్నిచేతను పంచమహాభూతాగ్నుల చేతను తొలుత పచింపబడినప్పుడు ఆహారసారంబును కిట్టంబును వేరువేరుగ నేర్పడును.) అట్టియాహారసారము శరీరమునందలి రసధాతువు నాశ్రయించినధాత్వగ్నిచే పచింపబడి రక్తములకు మూలకారణమైన రసధాతువుగ పరిణమించును. ఇట్టి పరిణామక్రమముగ రసధాతుప్రసాదమువలన రక్తంబుగను, రక్తధాతు ప్రసాదమువలన మాంసంబుగను, మాంసధాతుప్రసాదమువలన మేదస్సును, మేదఃప్రసాదమువలన నస్థియు, అస్థిధాతు ప్రసాదమువలన మజ్జయు, మజ్జధాతుప్రసాదమువలన శుక్రధాతువును వరుసగ జనించును.

వివరణము:—పాచకభూతాగ్నులచే పచింపబడినయాహారమువలన ద్రవరూప మైన యాహారసారంబును, నీరసరూపమైన కిట్టంబును నేర్పడును. ఈయాహారసారరూప మైనద్రవమే రసాదిధాతువుల కన్నిటికిని ఉత్పాదకమైన మూలకారణము. అట్టి యాహారసారము శరీరమునందలి రసధాతువున జేరి రసధాతువునందలి యూష్మరూపమైన ధాత్వగ్నిచే పచింపబడి రక్తధాతువున కుత్పత్తికారణమైన సారముగ పరిణమించి శరీ రమునందలి రసధాతువును పోషించును. ఇదియే రసధాతువు. అట్టి రక్తధాతుమూల కారణమైన రసధాతువు శరీరమునందలి రక్తము నాశ్రయించి యుండు ధాత్వగ్నిచే పచింపబడి మాంసధాతువునకు మూలకారణమైన రక్తధాతువుగ పరిణమించి రక్తముతో కూడ కలిసి దానిని పోషించుచుండును. ఇదియే రసధాతుసారపరిణామరూపమైన రక్త ధాతువు. అట్టి రక్తధాతువు మాంసధాతునిష్ఠమైన భూతాగ్నిచే పచింపబడి మేదోధాతు వునకు మూలకారణమైన సారముగ పరిణమించును. ఇది శరీరమునందలి మాంసముతో కూడ కలిసి దానిని పోషించుచుండును. ఇట్టి ధాతుపాకక్రమము ననుసరించి యేర్పడిన మేదస్సారమువలన నస్థులును, దానిసారమువలన మజ్జయు, దానిసారమువలన శుక్రంబును వరుసగ జనించి ఆయాధాతువుతో నేకీభవించి, ఆయాధాతువును పోషించి వృద్ధి

నందించుచుండును. అందుమజ్జధాతుసారరూపమైన శుక్రధాతువు శరీరమునందలి శుక్రధాతునిష్ఠమైన ధాత్వగ్నిచే పచింపబడి దానిసారరూపమైన గర్భరూపముగ పరిణమించును. గర్భోత్పత్తివివరణము స్థలాంతరమున జూచునది. ఇదియ సప్తధాతూత్పత్తిక్రమము.

పైజెప్పిన ధాతూత్పత్తివివరణమునే నగ్నిచిత్తను తంత్రకారు డిట్లు చెప్పెను:— "తత్రాహారాత్సారపూర్వం రసధాతుర్వివర్ధతే, రక్తం ధాతురసాచ్చైవ రక్తాఖ్యాన్మాంసమేవ చ, మేదోధాతుస్తతో మాంసాత్ అస్థ్యాఖ్యో మేదసస్తథా. మజ్జాధాతుస్తతో ఉస్థ్యాఖ్యాత్ మజ్జశ్శుక్రస్య సంభవః, శుక్రాత్పరం చ గర్భస్య సమ్భవః పరికీర్తితః." ఈవాక్యములవలన ఆహారసారరూపమైన రసము రసాదిధాతువుల కన్నిటికిని మూలకారణమగు రసధాతువుగ పరిణమించి శరీరమునందలి రసధాతువుతో జేరి దానివృద్ధి నందించు ననియు, ఇట్టి పరిణామక్రమమున రసరక్తాదిధాతువులు క్రమముగ ధాత్వంతరరూపముగ పరిణమించుచు శరీరమునందలి తనకు సజాతీయమైన ఆయాధాతువునం గలిసి దానిదానిని పోషించుచు వృద్ధినందించుననియు, కడపటి శుక్రధాతువువలన గర్భము కల్గుననియు నిష్కృష్టముగ నేర్పడినది.

మరియు పంచభూతాగ్నులచేతను పాచకాగ్నిచేతను పచింపబడిన యాహారమువలన ప్రసాదరూపమైన యాహారసారంబును నీరస(పిప్పి)రూపమైన కిట్టంబును (పురీషంబును) నేర్పడినట్లు, రసాదిధాతువులును ఆయాధాత్వగ్నులచే పైజెప్పినరీతిగ పచింపబడి సారముగను కిట్టముగను నేర్పడును. అట్టిసారమే ప్రసాదమనిచెప్పబడును.అట్టిప్రసాదము పైజెప్పినక్రమముగ ధాత్వంతరరూపముగ పరిణమించును. ఈయభిప్రాయమునే ప్రసాదజః" అని తంత్రమున జెప్పబడియె. ఆయాధాతువుల కిట్టరూపమైనభాగము మలరూపములగును. వీనివివరము "కిట్టమన్నస్య" అని యుపక్రమించి క్రింద వివరింపబడును. అందును శుక్రము నిర్మలమైన ధాతువుకాన ధాత్వగ్నిచే పచింపబడి ప్రసాదముగనే యేర్పడును గాని కిట్టభాగ మగుటలేదు. అట్టి శుక్రప్రసాదమువలననే గర్భము జనించును. ఈవిషయమే "శుక్రాద్గర్భః ప్రసాదజః" అని చెప్పబడినది. మరియు ధాత్వగ్నిపక్వమైనశుక్రముయొక్క కిట్టాంశమున శ్మశ్రువులు (మీసములు) జనించునని కొందరు చెప్పెదరు. ఈపక్షమున స్త్రీలకు గూడ శుక్రముండును కావున స్త్రీలకును శుక్రమలమువలన మీసము లుండవలసి వచ్చును. కావున నిది సమంజసము కానేరదు. స్త్రీలకును శుక్రముండును కాని అది పురుషులకు బోలె గర్భోత్పాదనసమర్థము కానోపదు. ఈ విషయము స్థలాంతరమున నిరూపితము.

మరియు శుక్రశోణితసంయోగమువలన గర్భమేర్పడునపుడు శుక్రశోణితములయందు రసరక్తాదిసప్తధాతువుల సుసూక్ష్మాంశువులు (వటబీజమునందు వృక్షభావంబును, పాలయందు ఘృతాదిభావంబులును లీనమైయుండునట్లు) చేరియుండును. అయ్యవి పైజెప్పిన రసరక్తాది పరిణామక్రమముచే నేర్పడుధాతువులవలన నానాట వృద్ధినొంది పోషింపబడును. కావున ఇచ్చట "ప్రసాదజః" అనుచోట పోషింపబడును అని అర్థముగాని అపూర్వోత్పత్తియనియర్థము కాదు. ఈవిషయమంతయు వివిధాశితపీతీయాధ్యాయమున "పుష్యన్తి హ్యాహారరసాత్ రసరుధిరమాంసమేదోస్థిమజ్జశుక్రౌజాంసి" (సూ. అ. 28. సూ. 5) అనుచోట వివరింపబడినది. ఇచ్చట వివరింపబడిన విషయము లన్నియు అష్టాఙ్గహృదయశారీరస్థానమునందలి 3 వ యధ్యాయమున "అన్నస్యపక్తా పిత్తన్తు పాచకాఖ్యం పురేరితమ్." (అ. హృ. శా 3 శ్లో 49.) మొదలుచేసి చెప్పబడిన గ్రంథమున వ్యాఖ్యానావసరమునందు నాచే వివరింపబడినది. కావున నిచ్చట విరమించడమైనది.

### ఉపధాతూత్పత్తిపోషణక్రమము.

మూ. రసాత్ స్తన్యం తతో (స్త్రియాః) రక్తం, అసృజః కణ్డరాః సిరాః,
మాంసాత్ వసా త్వచః షట్చ, మేదసః స్నాయుసమ్భవః. 17

వ్యా. పైజెప్పినరీతిగ ధాత్వగ్నిచే పచింపబడిన రసధాతుప్రసాదమునందలి యొకభాగమువలన స్త్రీలకు స్తన్యము (చనుబాలు) జనించును. జనించి రసధాతువుచేతనే పోషింపబడును. మఱియు నారసధాతుప్రసాదభాగమువలననే రజోరూపమయిన రక్తంబును జనించును. రక్తధాతువుప్రసాదభాగమువలన కండరములును, సిరలును జనించును; జనించి పోషింపబడిన మాంసధాతువువలన వసయు (మాంసస్నేహము), ఆరుత్వక్కులును జనించి పోషింపబడును. మేదోధాతువువలన స్నాయువులు (సన్నవినరములు.) జనించి పోషింపబడును. ఇది యుపధాతూత్పత్తిక్రమము.

ఇచ్చట నీవిషయము నెరుంగునది:—ధాతువులనియు, నుపధాతువులనియు, శరీరమునందలి ధాతువులు రెండువిధములు. అందు రసరక్తాదు లేడును ఒకదానినొకటి పైజెప్పిన రీతిగపోషించుచు, శరీరమును ధరించునుకావున ధాతుశబ్దముచే చెప్పబడును. ఇచ్చట జెప్పబడిన స్తన్యము మొదలగునవి నితరధాతువులను పోషించు వ్యాపారము లేకయే శరీరమును పోషించును కావున ఉపధాతుశబ్దముచే వ్యవహరింపబడును. ఈవిషయమునే భోజుం డీరీతిని చెప్పెను:—"సిరాస్నాయురజః స్తన్యత్వచోగతివివర్జితాః, ధాతుభ్యశ్చోపజాయన్తే తస్మాత్త ఉపధాతవః." వేరొండుధాతువును కల్గించి పోషించు స్వభావముగల రసరక్తాదులు ధాతువులనియు ఇతరధాతువులను పోషించువ్యాపారము

లేక కేవలము శరీరమును మాత్రము పోషించునవి ఉపధాతువనియు భోజవాక్యముచే నేర్పడినది. శుక్రము ఓజోరూపమయిన ధాతువును కల్గించుటంజేసి ధాతువులలో పరిగణనము చేయబడినది.

ఇచ్చట "తతో రక్తం" అనుచోట స్త్రీలకు ప్రతిమాసమున వెడలు ఋతుశోణితము రసధాతుప్రసాదమువలన గల్గునని యర్థము. అయ్యది మిగుల మాత్రరూప మగుటంజేసి ఒక్క మాసమున కేర్పడును. ఈవిషయమునే సుశ్రుతాచార్యులు "ఏవం మాసేన రసః శుక్రీభవతి స్త్రీణాం చార్తవమ్" (సు. సూ. అ. ౧౪) అని చెప్పిరి.

అన్న-ధాతుపాకమున నేర్పడు కిట్టములవివరణము.

మూ కిట్టమన్నస్య విణ్మూత్రం, రసస్య తు కఫోఽసృజః,
పిత్తం మాంసస్య ఖమలా మలః స్వేదస్తు మేదసః. 18
స్యాత్కిట్టం కేశలోమాస్థ్నో మజ్జ్ఞః స్నేహోఽక్షివిట్త్వచాం,
ప్రసాదకిట్టే ధాతూనాం పాకాదేవం విధర్చ్ఛతః. 19
పరస్పరోపసంస్తంభా ధాతుస్నేహపరమ్పరాః,
(పరస్పరోపసంస్తంభాత్ తత్తో దేహే పరస్పరమ్.)

వ్యా. పైజెప్పినరీతిగ పాంచభౌతికాహారము పాచాకాగ్నిభూతాగ్నులచే పచింపబడి దానిసారము రసధాతువుగను, నీరసమైనది కిట్టముగను, నేర్పడును. అందు కిట్టభాగము పురీషముగను, మూత్రముగను, నేర్పడును. మరియు ధాత్వగ్నిచే పచింపబడిన యాహారరసము రసధాతువుగను, కిట్టభాగము కఫముగను నేర్పడును. ఇత్తెరంగుననే రక్తధాతువు పచింపబడి కిట్టము పిత్తముగ నేర్పడును. మాంసధాతువునకు కన్నులు, చెవులు, నాసారంధ్రములు మున్నగు మలభాగములుగ నేర్పడును. మేదస్సువలన స్వేదము (చెమట), కిట్టముగ నేర్పడును. అస్థులవలన వెండ్రుకలును, రోమములును కిట్టభాగములుగ నేర్పడును. మజ్జధాతువునుండి యేర్పడుకిట్టము కన్నులయొక్కయు, పురీషముయొక్కయు, చర్మముయొక్క స్నేహముగ (జిడ్డుగ) నుండును. ఇత్తెరంగున ధాతువులయొక్క పాకమువలన ప్రసాదరూపమయినది ధాతురూపముగను, నీరసమైనభాగము మలరూపముగను రెండువిధములుగ నేర్పడును. (మరియు నీరెండును పాకవిశేషమున కల్గిన పరస్పరసంబంధమునంజేసి స్నేహముయొక్క పరంపర కల్గియుండును. రసధాతువు పక్వమయినపుడు దానిసారము (పాలయందు మీగడ కల్గువిధముగ) స్నేహరూపమయిన రక్తముకల్గును. రక్తము పక్వమై (మీగడనుండి వెన్న కల్గువిధముగ) అంతకన్న స్నిగ్ధమైనమాంసమగును. ఇత్తెరంగున ధాత్వగ్నిపాకమునంజేసి స్నేహపరంపర కల్గియుండు

నని భావము.) ఇత్తెరంగున నొకధాతువుకన్న నొకటి స్నేహ మధికమై సారాధికముగ నుండునని భావము.

ఇచ్చట "కేశలోమాస్థ్నః" అనుచోట అస్థులకు కేశలోమమువలెనే నఖములు గూడ మలమగునని యెరుంగునది. ఈవిషయమును సుశ్రుతమున "నఖలోమ చ" అను వాక్యముచే చెప్పబడినది. వివిధాశితపీతీయాధ్యాయమున నీతంత్రకారుడును "కిట్టాత్కేశనఖాదయః పుష్యన్తి" (సూ. అ. 28) అని చెప్పిరి. మరియు "అన్నస్య భుక్తమాత్రస్య......మధురాద్యాత్కఫోభావాత్ ఫేనభూత ఉదీర్యతే, పరన్తు-పచ్యమానస్య ......పిత్తమచ్ఛముదీర్యతే." అనువాక్యముచేత ఆహారమును విపాకప్రారంభావస్థయయిన మధురవిపాకమువలన ఫేనరూపమయిన కఫము జనించుననియు, పచ్యమానావస్థయందు గలుగు అమ్లవిపాకమున పిత్తము జనించుననియు చెప్పబడినది. ఇచ్చట రసధాతువిపాకమువలన కఫము జనించుననియు రక్తవిపాకమువలన రక్తమును కిట్టముగ పిత్తము జనించుననియు చెప్పబడినది. ఇది యెట్లు సంగతమన్నచో పైజెప్పిన భావస్తికవిపాకముచేతను, ధాతువిపాకముచేతను కూడ కఫపిత్తములు జనించునని భావముకాన పరస్పరవిరోధము లేదని యెరుంగునది.

### వృష్యాదిద్రవ్యపరిణామకాలనియమము.

**మూ.** వృష్యాదీనాం ప్రభావస్తు పుష్ణాతి బలమాశు హి, 20

వ్యా. వృష్యములగు పాలు, మాంసరసము మున్నగు పదార్థములు పైజెప్పబడిన ధాతుపాకపరిణామక్రమము నపేక్షింపకయే తమయందలి ప్రభావవిశేషమునం జేసి అతిశీఘ్రముగ శుక్రమును వృద్ధినందించును.

### ధాతుపరిణామకాలనియమము.

**మూ.** షడ్భిః కేచిదహోరాత్రైః ఇచ్ఛన్తి పరివర్తనం,
సన్తత్యాభోజ్యధాతూనాం పరివృత్తిస్తు చక్రవత్. 21

వ్యా. భుజింపబడినయాహారము పైజెప్పినరీతిగ తొలుత పాచకాగ్నిభూతాగ్నులచేత పచింపబడి పిదప ధాత్వగ్నులచే పచింపబడి సారకిట్టరూపములుగనై రసరక్తాదిరూపములుగ పరిణమించుచు, తుదకు శుక్రరూపముగ పరిణమించునని చెప్పబడినది. అట్టి పరిణామక్రమమున రసధాతువు ఒకయహోరాత్రమునకు రక్తధాతువుగ పరిణమించును. రక్తధాతువు ఇంకొకయహోరాత్రమునకు మాంసధాతువుగ పరిణమించును. ఇత్తెరంగుననే మాంసము మేదస్సుగను, మేదస్సు అస్థిధాతువుగను, అయ్యది మజ్జధాతువుగను, మజ్జధాతువు శుక్రధాతువుగను ఒక్కొకయహోరాత్రమున కొక్క

ధాతువువంతున పరిణామమునొందుచు, రక్తధాతుపరిణామాహోరాత్రమునకు నాఱవ యహోరాత్రమున శుక్రధాతువుగ రసధాతువు పరిణమించునని కొందరాచార్యులు చెప్పెదరు.

ధాత్వగ్నిపాకకాలమునందు భోజ్యరూపములైన ధాతువులు ధాత్వంతరరూపముగ పరిణమించువ్యాపారము అవిచ్ఛిన్నముగ చక్రభ్రమణముబోలె జరుగుచుండును గాని యెుకప్పుడును అట్టి పరిణామవ్యాపారమునకు విశ్రాంతి యుండదు. (కావున రసధాతువు రక్తముగను, అయ్యది మాంసముగను, ఇత్తెరంగున నెడలేక పరిణామము నొందుచునే యుండును కాని దీనికి కాలనియమము లేదని యీతంత్రకారుని సిద్ధాంతము.)

ఇచ్చట నీవిషయము నెరుంగునది:—పాచకాగ్ని భూతాగ్నులచే తొలుత పచింపబడిన యాహారమునుండి సారమేర్పడును. అయ్యది శరీరమునందలి రసధాత్వగ్నిచే పచింపబడి రసధాతురూపముగ పరిణమించును, రసధాతువు రక్తధాత్వగ్నిచే పచింపబడి రక్తధాతురూపమగును. ఇత్తెరంగుననే రూపాంతరముగ పరిణమించునప్పుడు పచ్యమాన ధాతువు ఇంకొకధాతువునకు భోజ్యముగ నుండును. అట్టి భోజ్యధాతువులు పరిణామ క్రమముగ శుక్రముగ మారుటకు కాలనియమమును కొందరాచార్యులు పలుదెరంగుల చెప్పిరి. అందు పరాశరు లిట్లు చెప్పిరి:—"ఆహారోఽద్యతనో యశ్చ శ్వో రసత్వం స గచ్ఛతి, శోణితత్వం తృతీయేఽహ్ని చతుర్థే మాంసతామపి, మేదస్త్వం పఞ్చమే షష్ఠే త్వస్థిత్వం సప్తమే వ్రజేత్, మజ్జత్వం శుక్రతామేతి దివసే త్వష్టమే నృణాం" వీరి మతమున ఆహారసారము ఏర్పడినదినము మొదలుజేసి ఒక్కొకదినమున కొక్కొకధాతువు వంతున పరిణమించుచు నెనిమిదవదినమునకు ఆహారరసము శుక్రముగ పరిణమించునని తేలినది. రక్తధాతుపరిణామదినము మొదలు పరిణామక్రమమును వివక్షించినచో 'షడ్భిః కేచిత్' అను పక్షమునకును ఈసిద్ధాంతమునకును భేదము కన్పట్టదు.

ఈపక్షముల కన్నిటికిని సమరసముగ నీతంత్రకారుడు "సన్తత్యా భోజ్యధాతూనాం పరివృత్తిస్తు చక్రవత్" అని కాలనియతిని జెప్పక పరివర్తనము మాత్రము అవిచ్ఛిన్నముగ జరుగుచునే యుండునని చెప్పిరి. అగ్న్యాదిసౌష్ఠవము బాగున్నప్పుడు ధాతుపరిణామక్రమము శీఘ్రముగ జరుగుచుండుననియు, అట్టి సౌష్ఠవము వ్యత్యస్తముగ మందప్రవృత్తమై యుండునపుడు కొంచెము మందప్రవృత్తిగ సాగుచుండుననియు, ఇత్తెరంగున కాలనియతి లేక విశ్రాంతినొందక ధాతుపరిణామము సాగుచునే యుండుననియు వీరిసిద్ధాంతము.

## ధాతుపరిణామమునుద్దేశించి కొన్ని ప్రశ్నములు.

మూ. ఇత్యుక్తవన్తమాచార్యం శిష్యస్త్విదమచోదయత్,
రసాద్రక్తం విసదృశాత్ కథం దేహేఽభిజాయతే? 22
రసస్య చ న రాగోఽస్తి స కథం యాతి రక్తతాం?
ద్రవాద్రక్తాత్ స్థిరం మాంసం కథం తజ్జాయతే నృణామ్?. 23
ద్రవధాతోః స్థిరాన్మాంసాత్ మేదసస్సమ్భవః కథం?
శ్లక్ష్ణాభ్యాం మాంసమేదోభ్యాం ఖరత్వం కథమస్థిషు? 24
ఖరేష్వస్థిషు మజ్జా చ కేన స్నిగ్ధో మృదుస్తథా?
మజ్జశ్చ పరిణామేన యది శుక్రం ప్రవర్తతే. 25
సర్వదేహగతం శుక్రం ప్రవదన్తి మనీషిణః,
తథాస్థిమధ్యమజ్జశ్చ శుక్రం భవతి దేహినామ్. 26
ఛిద్రం న దృశ్యతేఽస్థ్నాం చ తన్నిస్సరతి వా కథమ్?
ఏవముక్తస్తు శిష్యేణ గురుః ప్రాహేదముత్తరమ్. 27

వ్యా. ఇత్తెరంగున ధాతుపరిణామక్రమము నుపదేశించిన గురువును (ఆత్రేయుని) శిష్యుడైన యగ్నివేశు లిట్లు ప్రశ్నజేసెను.—

రసధాతువు తెల్లగ నుండును కదా, దానికి విరుద్ధమై యెఱ్ఱనిరంగుకల రక్తధాతు వెట్లు సంభవించును? 1. ద్రవరూపమై (చలనస్వభావముకల) రక్తమువలన ఘనరూపమై నిశ్చలముగ నుండు మాంస మెట్లు కల్గును? 2. ద్రవరూపమైన రక్తమునుండియు, ఘనీభవించినమాంసమునుండియు, మేదస్సు ఎట్లు జనించును? 3. మృదువుగ నుండు మాంస-మేదస్సులవలన కఠినమైన అస్థిధాతు వెట్లు పుట్టును? 4. కఠినములుగ నుండు అస్థులనుండి స్నిగ్ధంబును మృదువును నైన మజ్జ (మూలగ) యెట్లు కల్గును? 5. మజ్జధాతు శుక్రముగ పరిణమించునని చెప్పబడినది; అట్టి శుక్రము శరీరమునం దంతట వ్యాపించియుండునని యాచార్యు లందరును చెప్పెదరు; అస్థిమధ్యమున నుండు మజ్జచే సంభవించిన శుక్రము రంధ్రములులేని యస్థులనుండి యెట్లు బైలువెడలి శరీరమునందెల్ల వ్యాపించును ? 6. మరియు నాశుక్రము వస్తియం దెట్లుస్రవించి చేరును? 7. ఇత్తెరంగున నడిగినశిష్యునకు ఆత్రేయు లీక్రిందివిధముగ నుత్తరముల జెప్పెను.

(ఇచ్చట "ఇత్యుక్తవన్తం" అని యుపక్రమించి "స్థలాన్నిమ్నమివోదకమ్" అనునంతవరకును ప్రశ్నోత్తరరూపముగ జెప్పబడిన పదునాల్గుశ్లోకములకును చక్రపాణి

దత్తవ్యాఖ్యాన మించుకేనియు కానరాదు; కావున నీభాగము ప్రక్షిప్తముగ నసార్ష ముగ నుండునని తోచెడి.)

### 1. రసధాతువు రక్తవర్ణము కల్గి రక్తముగ మారుటకు కారణము.

మూ. తేజో రసానాం సర్వేషాం మనుజానాం యదుచ్యతే,
పిత్తోష్మణస్స రాగేణ రసో రక్తత్వమృచ్ఛతి 28

వ్యా. మనుజులచే భుజింపబడిన మధురాది షడ్రసవిశిష్టమైన యాహారమునందలి సారరూపమైన రసము పక్వమగునపుడు పిత్తము (రంజకపిత్తము)నందలి యూష్మసంబంధ మున కల్గిన రక్తవర్ణముచేత ఎఱ్ఱనిరంగు కల్గి రక్తవర్ణముగ మారును. (కావున రసధాతువు నకు రక్తత్వము సంభవించును.)

### 2. రక్తము ఘనీభవించి మాంసధాతువగువిధము.

మూ. (శోణితం స్వాగ్నినా పక్వం వాయునా చ ఘనీకృతం,
తదేవ మాంసం జానీయాత్ స్థిరం భవతి దేహినామ్.)
వాయ్వమ్బుతేజసా రక్తం ఊష్మణా చాపి సంయుతమ్,
స్థిరతాం ప్రాప్య మాంసం స్యాత్

వ్యా. రక్తము శరీరమునందలి రక్తధాతునిష్ఠమైన ధాత్వగ్నిచే పక్వమై వాయువు యొక్కయు జలముయొక్కయు తేజోభాగముతోడను పిత్తముయొక్క యూష్మము తోడను కూడి రక్తవర్ణమును స్థిరత్వమును (ఘనీభావము) నొందును. పిత్తముయొక్క యూష్మముచేతను వాయువుయొక్కయు జలముయొక్కయు తేజస్సుచేతను రక్తము నందలి ద్రవభాగము కొంత శుష్కించి ఘనమైనమాంసముగ నగునని భావము.)

### 3 మాంసమువలన మేదస్సు కల్గువిధము.

స్వోష్మణా పక్వమేవ తత్. 29
మూ. స్వతేజోఽమ్బుగుణస్నిగ్ధోద్రిక్తం మేదోఽభిజాయతే,

వ్యా. మాంసము శరీరమునందలి మాంసధాత్వగ్నిచే పక్వమై తనయందలి తేజస్సు కును జలభాగమునకును సంబంధించిన స్నిగ్ధగుణము అధికముగ కల్గి మేదస్సుగ పరిణ మించును.

### 4. మృదువైన మేదస్సువలన కఠినమైన యస్థిధాతువు కల్గువిధము.

మూ. పృథివ్యగ్న్యనిలాదీనాం సంఘాతః స్వోష్మణా (శ్లేష్మణా) కృతః. 30
ఖరత్వం ప్రకరోత్యస్య, జాయతేఽస్థి. తతో నృణామ్,

వ్యా. మేదస్సు శరీరమునందలి మేదోధాతుగతధాత్వగ్నిచే పక్వముచేయబడు నపుడు పృథివి-అగ్ని-వాతము మున్నగు భూతసూక్ష్మాంశము లొకటిగ జేరి సంక్రమించి తనయందలి యూష్మముచే ఖరత్వమును కల్గియుండును; అట్టి ఖరీభూతమగు మేదస్సు వలన కఠినరూపమైన అస్థులు కల్గును.

### 5. అస్థిమధ్యమున మజ్జకల్గువిధము.

మూ. కరోతి తత్ర సౌషిర్యం అస్థ్నాం మధ్యే సమీరణః. 31
మేదసః తాని పూర్యన్తే స్నేహో మజ్జా తతః స్మృతః,

వ్యా. అట్టి కఠినములగు ఎముకలమధ్యభాగమున వాతము రంధ్రమును కల్గించును. మేదస్సునందలి స్నేహభాగము ఆరంధ్రములయందు జేరి నిండియుండును. అదియే మజ్జ రూపముగ పరిణమించును. (అట్టిస్నేహభావమువలన మజ్జ మిక్కిలి స్నిగ్ధంబును మృదువునై యుండును.)

### 6. శుక్రధాతువు శరీరమున వ్యాపించువిధము.

మూ. తస్మాన్మజ్జ్ఞస్తు యః స్నేహః శుక్రం సంజాయతే, తతః. 32
వాయ్వాకాశాదిభిః భావైః సౌషిర్యం జాయతేఽస్థిషు,
తేన స్రవతి తచ్ఛుక్రం నవాత్ కుమ్భాదివోదకమ్. 33
స్రోతోభిః స్యన్దతే దేహాత్ సమన్తాత్ శుక్రవాహిభిః,

వ్యా. అట్టి మృదుస్నిగ్ధమైన మజ్జధాతువువలన (ధాత్వగ్నిపాకవిశేషమునంజేసి) శుక్రము కల్గును. మరియు అస్థులయందు వాయువు ఆకాశము మున్నగు భూతముల యొక్క గుణములచేత ఎముకలయందు మిగుల సూక్ష్మరూపములైన రంధ్రములు కల్గింపబడును. అస్థిమధ్యమున నుండు రంధ్రమున కల్గిన శుక్రము సూక్ష్మరంధ్రములనుండి (క్రొత్తకుండలోనిజలము చెమర్చువిధముగ) స్రవించును. అట్లు స్రవించిన శుక్రమును శుక్రవాహినులగు సిరలు శరీరమునందెల్ల వ్యాపింపజేయును.

### 7. శరీరమున వ్యాపించిన శుక్రము వస్తియందు చేరువిధము.

మూ. హర్షేణోదీరితం వేగాత్ సంకల్పాచ్చ మనోభవాత్. 34
విలీనం ఘృతవద్వ్యాయామోష్మణా స్థానవిచ్యుతం,
వస్తౌ సమ్భృత్య నిర్యాతి స్థలాన్నిమ్నమివోదకమ్. 35

వ్యా. పైజెప్పినరీతిగ శరీరమునందెల్ల వ్యాపించియుండు శుక్రము స్త్రీసంభోగ విషయమైన మానసికసంకల్పములవలనను, అనురాగముచే గల్గిన హర్షాతిశయమునను

ప్రేరితమై, సంభోగరూపవ్యాయామమువలన నైన యూష్మముచే కరిగి (మెట్టస్థలమున నుండినసీళ్లు పల్లమునకు జేరునట్లు) వస్తియందు జేరి యుండును. (సామాన్యముగ సర్వశరీరమున వ్యాపించియున్న శుక్రము సంభోగకాలమున పైజెప్పినరీతిగ సంకల్పాది ప్రేరితమై వస్తియందు జేరి గర్భోత్పత్తికి కారణమగునని భావము. ఇత్తెరంగున పైజెప్పిన యేడు ప్రశ్నములకును వరుసగ నుత్తరములు చెప్పబడినవి.)

### శరీరమునందేకదేశమున వ్యాధికల్గుటకు కారణము.

మూ. వ్యానేన రసధాతుర్హి విక్షేపోచితకర్మణా,
యుగపత్సర్వతోఽజస్రం దేహే విక్షిప్యతే సదా. 36
క్షిప్యమాణః స్వవైగుణ్యాత్ రసస్సజ్జతి యత్ర సః,
కరోతి వికృతిం తత్ర ఖే వర్షమివ తోయదః. 37
(తస్మిన్ వికారాన్ కురుతే వివర్షమివ తోయదః)
దోషాణామపి చైవం స్యాత్ ఏకదోషప్రకోపణమ్,
(తత్ర దేశే ప్రకోపణమ్.)

వ్యా. ఆహారసారప్రసాదరూపమైన రసధాతువు ప్రేరణమే యుచితమైన వ్యాపారముగగల వ్యానవాతముచే ప్రేరేపింపబడి రసవహస్రోతోమూలముగ శరీరమునందెల్ల నేకకాలమున యెడలేక సర్వకాలమునందును వ్యాపింపబడును. ఆవిధముగ వ్యాపించు సమయమున స్రోతస్సుయొక్క వైపరీత్యముచేత రసధాతువున కడ్డుకల్గి నిరోధింపబడినప్పుడు ఎచ్చోట నయ్యది (రసధాతువు) చేరునో అచ్చట వ్యాధి సంభవించును. ఎట్లులన—(ఆకసమునందెల్ల మేఘము బావరించి యున్నను అందెచ్చట గాలిచే మేఘమునకు సంచలనము కల్గునో అచ్చోటనే వర్షము కురియును కాని తక్కినస్థలమునందెచ్చటను వర్షము కురియుటలేదు. అత్తెరంగుననే రసధాతువు వాతప్రేరితమై శరీరమునందెల్ల యెడలేక వ్యాపించుచున్నను, స్రోతోమార్గనిరోధముచే నెచ్చోట నిలబడియుండునో ఆచోట మాత్రము వ్యాధి సంభవించును కాని శరీరమునందెల్ల వ్యాధి కల్గనేరదని భావము.)

మరియు వాతపిత్తకఫములును శరీరమునందెల్ల వ్యాపించునపుడు ఎచ్చోట దానికి వైగుణ్యము కల్గి ప్రకుపితము లగునో ఆచోటనే వ్యాధిని కల్గించును.

ఇచ్చట "రసతీతి రసః" అనువ్యుత్పత్తిచేత ద్రవరూపములగు శరీరమునందలి ధాతువు లన్నియు రసశబ్దముచే గ్రహింపబడును. కావున శరీరమునందలి రసరక్తాదిద్రవరూపధాతువుల కన్నిటికిని పైజెప్పిన న్యాయము నన్వయించునది.

## ఉక్తవిషయసంగ్రహము.

మూ. ఇతి భౌతిక-ధాత్వన్నపక్త్రూణాం కర్మ భాషితమ్. 38

వ్యా. ఇత్తెరంగున పృథివ్యాది పంచభూతములకు సంబంధించిన భూతాగ్నులైదిటికిని, రసాదిధాతువు లేడిటికిని సంబంధించిన యేడుభూతాగ్నులకును, ఆహారమును పచింపజేయు పాచకాగ్నికిని (మొత్తమున పదుమూడు తెరంగులైన యగ్నులకును) సంబంధించిన వ్యాపారములు వేరువేరుగ వివరింపబడినది.

## జాఠరాగ్నిప్రాధాన్యము.

మూ. అన్నస్య పక్తా సర్వేషాం పక్త్రూణామధిపో మతః,
తన్మూలాస్తే హి తద్వృద్ధిక్షయవృద్ధిక్షయాత్మకాః 39
తస్మాత్తం విధివద్యుక్తైః అన్నపానేన్ధనైర్హితైః,
పాలయేత్ ప్రయతస్తస్య స్థితౌ హ్యాయుర్బలస్థితిః. 40

వ్యా. పైవివరింపబడిన యగ్నులలోపల పాచకాగ్ని వృద్ధినొందినపుడును తక్కిన భౌతిక-ధాత్వగ్నులన్నియు వృద్ధినందియుండును. పాచకాగ్ని క్షీణించినయెడ తక్కిన యగ్నులన్నియు క్షీణించును. కావున తక్కిన యగ్నులన్నియు పాచకాగ్నిని ఆధారముగ జేసికొని యుండును. (ఒక వృక్షమునకు వేరు వృద్ధిక్షయములకు హేతువైనవిధముగ) పాచకాగ్ని తక్కిన యగ్నిభేదముల కన్నిటికిని మూలకారణమై యుండును. దానంజేసి అన్నియగ్నులకన్న పాచకాగ్ని ప్రధానమైనది. కావున ప్రధానమైన పాచకాగ్నిని అన్నపానవిధియందు చెప్పబడినరీతిగ హితకరములగు నన్నపానములనే సమిధలచేత మిక్కిలి జాగరూకుడై కాపాడవలెను. ఆజాఠరాగ్ని యుక్తమైన పరిస్థితియందున్నచో నాయువును శరీరబలంబును చక్కనిస్థితి నుండును. (కావున శరీరవర్ణాదులును దానినే యాధారముగ జేసికొని ప్రవర్తించును.)

## గ్రహణీదోషమునకు ముఖ్యకారణము.

మూ. యో హి భుఙ్క్తే విధిం త్యక్త్వా గ్రహణీదోషజాన్ గదాన్,
స లౌల్యాల్లభతే శీఘ్రం; వక్ష్యన్తేఽతః పరన్తు తే. 41

వ్యా. అన్నపానవిధియందు చెప్పబడినవిధి ననుసరింపక బుద్ధిచాపల్యముచే తనకిచ్చవచ్చినవిధముగ నెవడు భుజించునో, అట్టివాడు శీఘ్రకాలముననే గ్రహణీదోషముచే గల్గు రోగములను తప్పక నొందును. అట్టి గ్రహణీదోషమున గల్గురోగము లీక్రింద వివరింపబడును.

ఇచ్చట గ్రహణియను స్థూలాంత్రము నాశ్రయించిన దోషమున గల్గిన నాల్గు విధములైన రోగములు "గ్రహణీదోషజాః గదాః" అను వాక్యముచే గ్రహింపబడును. అగ్నిమాంద్యము, అజీర్ణము మున్నగురోగంబులును గ్రహణి నాశ్రయించియే సంభవించును. అయినను గ్రహణీరూపమైన నాడియొక్క వైపరీత్యముచే గల్గు క్రింద జెప్పబడు నాల్గువిధములైన రోగములు మాత్రము ముఖ్యముగ నిచ్చట గ్రహింపబడును. కావుననే గ్రహణికి సంబంధించిన స్వాభావికవ్యాపారంబును, దాని దుష్ట-అదుష్టస్వరూపంబును, దుష్టిచే గల్గు నాల్గువిధములైన రోగలక్షణంబులును ఈక్రింద చెప్పబడును.

జాఠరాగ్నిదుష్టికి కారణములు, గ్రహణీసంప్రాప్తి.

మూ. అభోజనాదజీర్ణాఽతిభోజనాద్విషమాశనాత్,
అసాత్మ్యగురుశీతాతిరూక్షసన్దుష్టభోజనాత్. 42
విరేకవమనస్నేహవిభ్రమాత్ వ్యాధికర్శనాత్,
దేశకాలర్తువైషమ్యాత్ వేగానాం చ విధారణాత్. 43
దుష్యత్యగ్నిః, స దుష్టోఽన్నం న తత్ పచతి లఘ్వపి,
అపచ్యమానం శుక్తత్వం యాత్యన్నం విషరూపతామ్. 44

వ్యా. ఆకలి కల్గినప్పుడు భుజింపకుండుట, భుజించినయాహారము జీర్ణము కాకుండునపుడు మరల భుజించుట, తనకు కావలసిన పరిమితికన్న నధికముగ భుజించుట, కాలనియమము లేక తన కిచ్ఛవచ్చినపుడు భుజించుట (ఇదియే విషమాశనము). తనకు సాత్మ్యముకాని యాహారమును భుజించుట, గురుగుణములు గల పదార్థముల నైనను కేవలము శీతవీర్యములగు పదార్థములనైనను రూక్ష (జిడ్డులేని) పదార్థములనైనను దుష్ట పదార్థములనైనను భుజించుట, విరేక-వమన-స్నేహకర్మములను విధ్యుక్తప్రకారము చేయకుండుట, జ్వరాదిరోగములచే శరీరము కృశించుట, దేశంబును కాలంబును ఋతువులును వానివాని ధర్మములకు వ్యత్యస్తముగ నుండుట, వాత-మూత్ర-పురీషాదివేగముల నిరోధించుట, ఈకారణములచేత జాఠరాగ్ని చెడును. అయ్యది దుష్టమై అతిశీఘ్రముగ జీర్ణించుస్వభావము కల యాహారపదార్థములను కూడ పచింపనేరదు. పచింపబడని యాహారము పులిసి విషమును బోలె పలుదెరంగులైన రోగముల గల్గించును. (ఇట్లు చెప్పుటచేత అజీర్ణభేదము లన్నియు అగ్నివైపరీత్యముననే గల్గునని చెప్పబడినది. అట్టి యజీర్ణభేదములు తంత్రాంతరమున నిట్లు పేర్కొనంబడినది:—"ఆమం విదగ్ధం విష్టంభం కఫ-పిత్తాఽ-నిలైః క్రమాత్, అజీర్ణం కేచిదిచ్ఛన్తి చతుర్థం రసశేషతః." కఫముచే

నామాజీర్ణంబును, పిత్తముచే విదగ్ధాజీర్ణంబును, వాతముచే విష్టంభాజీర్ణంబును, ఆమరసశేషముచే రసశేషాజీర్ణంబును సంభవించునని యర్థము. అట్టి యజీర్ణ భేదములును ఇచ్చట "యాత్యన్నం విషరూపతామ్" అను వాక్యముచే సంగృహీతము. అగ్ని దుష్టమై యన్నమును పచించనపుడు అపక్వమైన యాహారము విషమునుబోలె పైజెప్పబడిన అజీర్ణ భేదములగూడ గల్గించునని తాత్పర్యము.

## అజీర్ణసామాన్యలక్షణము.

మూ. తస్య లిఙ్గమజీర్ణస్య విష్టమ్భస్సదనం తథా,
శిరసో రుక్ చ మూర్ఛా చ భ్రమః పృష్ఠకటిగ్రహః. 45
జృమ్భాఽఙ్గమర్ద స్తృష్ణా చ జ్వరశ్ఛర్దిః ప్రవాహణమ్,
అరోచకోఽవిపాకశ్చ;

వ్యా. పైజెప్పిన రీతిగ నగ్నిదోషముచే భుజింపబడినయన్నము పక్వము కాని యెడ నయ్యది కోష్ఠముననే చేరి కదలక స్తంభించి యుండును. తలనొప్పియు, మూర్ఛయు, భ్రమంబును (ఒడలు చక్రముపై నున్నవానివలె దిరుగుట), వీపునందును నడుమునందును పట్టినట్లు నొప్పియు కల్గును. ఆవలింతలును ఒడలివిరుపులును కల్గును. ఒడలినొప్పులును, దప్పియు, జ్వరంబును కల్గును. ప్రవాహికయను వ్యాధియు కల్గును. అరోచకము కల్గును. విపాకము చక్కగ కానేరదు.

## పిత్తదుష్టాఽజీర్ణలక్షణము.

మూ. ఘోరమన్నవిషం చ తత్. 46
సంసృజ్యమానం పిత్తేన దాహం తృష్ణాం ముఖామయాన్,
(పిత్తేన సహ సంసృష్టం తృష్ణాదాహముఖామయాన్.)
జనయత్యమ్లపిత్తం చ పిత్తజాంశ్చాపరాన్ గదాన్. 47

వ్యా. పక్వము గాక మిగుల క్రూరమై విషతుల్యమైన యాహారము పిత్తముతో కలిసినయెడ హృదయము కంఠము మున్నగుస్థలముల మంట బుట్టించును. దప్పిని, ముఖరోగములను అమ్లపిత్తమును ఇతరములగు పిత్తరోగములను కల్గించును.

అమ్లపిత్తలక్షణము తంత్రాంతరమున నిట్లు చెప్పబడినది:— "అవిపాకక్లమోత్క్లేద తిక్తామ్లోద్గారగౌరవైః, హృత్కణ్ఠదాహారుచిభిశ్చామ్లపిత్తం వినిర్దిశేత్." విపాకము చక్కగ గాకుండుట, బడలిక, ఓకరింతలు, చేదుగను పుల్లగను త్రేనుపులు వెడలుట, శరీరము బరువుగ నుండుట, హృదయమునందును కంఠమునందును మంట బుట్టుట, అరుచి, ఈలక్షణములుకల్గినది యమ్లపిత్తమని భావము.

## కఫదుష్టాజీర్ణలక్షణము.

మూ. యక్ష్మపీనసమేహాదీన్ కఫజాన్ కఫసఙ్గతమ్,

వ్యా. పక్వముకానియన్నము కఫముతో గూడినయెడ రాజయక్ష్మము, పీనసము, ప్రమేహము మున్నగు కఫరోగముల గల్గించును.

## వాతదుష్టరసశేషాజీర్ణలక్షణము.

మూ. కరోతి వాతసంసృష్టం వాతజాంశ్చ గదాన్ బహూన్. 48
మూత్రరోగాంశ్చ మూత్రస్థం కుక్షిరోగాన్శకృద్గతమ్,
రసాదిభిశ్చ సంసృష్టం కుర్యాద్రోగాన్ రసాదిజాన్. 49

వ్యా. పైజెప్పబడిన పక్వముగానియన్నము వాతసంబంధము కల్గినయెడ వాతసంబంధమయిన యనేకరోగముల కల్గించును. మూత్రముతో కలసినయెడ మూత్రరోగములను, పురీషమున కలసినయెడ కుక్షిరోగమును కల్గించును. మరియు నాపక్వముకాని యన్నరసము రసరక్తాదిధాతువులతో కలిసినయెడ ఆయాధాతువునకు చెప్పిన రోగముల కల్గించును.

(ఇచ్చట "మూత్రరోగాంశ్చ" అని యుపక్రమించి చెప్పబడినది రసశేషాజీర్ణలక్షణమని యెరుగునది.)

## విషమ-తీక్ష్ణాగ్నిలక్షణములు.

మూ. విషమో ధాతువైషమ్యం కరోతి విషమం పచన్,
తీక్ష్ణో మన్దేన్ధనో ధాతూన్ విశోషయతి పావకః. 50

వ్యా. (ఇత్తెరంగున అజీర్ణలక్షణములు చెప్పి అగ్నిదోషలక్షణము క్రింద జెప్పబడును. అగ్నిభేదములు "తైర్భవేద్విషమస్తీక్ష్ణః మన్దశ్చాగ్నిసమస్సమైః" (అ. సూ. అ. ౧.) అని వాగ్భటాచార్యులు విషమ-తీక్ష్ణ-సమ-మంద భేదములచే నాల్గుతెరంగుల జెప్పెను.)

అందు విషమాగ్ని యాహారమును వ్యత్యస్తముగ పాకమునొందించుచు, ధాతువైషమ్యమును కల్గించును. (ఇది వాతముచే కల్గిన యగ్నిభేదము.) తీక్ష్ణమైన యగ్ని దానికి తగినట్టి యాహారము లేనిచో రసాదిధాతువులను శోషింపజేయును. (ఈయగ్ని పిత్తాధిక్యముచే గల్గును.) ఇచ్చట "మన్దేన్ధనః" అని చెప్పుటవలన తీక్ష్ణాగ్నికూడ తగిన యాహారమున్నయెడ ధాతువులను శోషింపక పోషించునని తెలిసెడిని.

## సమాగ్నికృత్యము.

మూ  యు క్తం భు క్తవతో యుక్తో ధాతుసామ్యం సమం పచన్,

వ్యా. సమాగ్ని భుజింపబడిన యాహారమును వైషమ్యము లేక సమముగ పచనముచేసి ధాతువులను విషమస్థితి నొందనీయక సమస్థితి నుంచును. (ఈయగ్ని వాత-పిత్త-కఫములు మూడును సమస్థితి నుండునపుడు గల్గును గాన సమాగ్ని యనబడును.)

## మందాగ్నికృత్యము గ్రహణీరోగసంప్రాప్తి.

మూ. దుర్బలో విదహత్యన్నం తద్యాత్యూర్ధ్వం అధోఽపి వా. 51
అధస్తు పక్వమామం వా ప్రవృత్తం గ్రహణీగదః,
ఉచ్యతే సర్వమేవాన్నం ప్రాయో హ్యస్య విదహ్యతే. 52
అతిసృష్టం విబద్ధం వా ద్రవం తదుపవేశ్యతే,

వ్యా. మందమయినయగ్ని చాల బలహీనమగుటవలన భుజింపబడిన యాహారమును కొంచెముగ పాకమునొందించును. ఇది కఫాధిక్యమున గల్గునగ్నిభేదము. అట్టి సగము పక్వముగను, సగము పక్వము గాకయు నుండునాహారము ఊర్ధ్వముగనైనను, అధోమార్గముగనైనను వెడలును. అందు పక్వాపక్వముగ నుండునది యధోమార్గమున వెడలినచో నయ్యది గ్రహణీరోగమని చెప్పబడును. పైజెప్పిన మందాగ్నిచేత భుజింపబడిన యాహారము ప్రాయికముగ విదగ్ధమగును. (పక్వాపక్వావస్థయందునని భావము.) మరియు నయ్యది స్వస్థానమునుండి బయలువెడలినను, యచ్చటనే బద్ధముగనుండినను, ద్రవరూపమై విదగ్ధావస్థనే యుండును. కావున నధోమార్గమున ద్రవరూపముగ వెడలునప్పుడును విదగ్ధముగనే యుండునని భావము. (గ్రహణీరోగమునం దన్నమంతయు ప్రాయికముగ విదగ్ధమై ద్రవరూపముగ వెడలునని ఫలితార్థము.)

## గ్రహణీరోగసామాన్యలక్షణము.

మూ. తృష్ణారోచకవైరస్యప్రసేకతమకాన్వితః. 53
శూనపాదకరః సాస్థిపర్వరుక్ ఛర్దనం జ్వరః,
లోహామగన్ధిస్తిక్తామ్ల ఉద్గారశ్చాస్య జాయతే. 54

వ్యా. గ్రహణీరోగమునందు దప్పి, అరోచకము, నోటికి రుచితెలియకుండుట, నోట నీరువెడలుట ఈలక్షణములు కల్గును. చీకటిలోనున్న ట్లేమియు తెలియకుండును. హస్తములయందును పాదములయందును వాపుకల్గును. అస్థులయందును కీళ్లయందును నొప్పి కల్గును. వాంతియు జ్వరంబును కల్గును. లోహముయొక్కయు ఆమరసముయొక్కయు గంధముతో కూడి చేదుగను పుల్లగను త్రేనుపులు వెడలును.

## గ్రహణీరోగపూర్వరూపము.

మూ. పూర్వరూపస్తు తస్యేదం తృష్ణాలస్యం బలక్షయః,
విదాహోఽన్నస్య పాకశ్చ చిరాత్ కాయస్య గౌరవమ్. 55

వ్యా. అట్టి గ్రహణీరోగము కల్గుటకుముందు దప్పి కల్గును. పనులయందు ప్రాలుమాలిక కల్గును. శరీరబలము క్షీణించును. ఆహారము చిరకాలమున విదగ్ధముగ పాకము జెందును. శరీరము బరువుగ నుండును (ఇవి యన్నియు గ్రహణీరోగము కల్గుటకు ముందు సంభవించు పూర్వరూపములు.)

## గ్రహణీస్వరూపము.

మూ. అగ్న్యధిష్ఠానమన్నస్య గ్రహణాద్గ్రహణీ మతా,
నాభేరుపరి సా హ్యగ్నిబలోపస్తమ్భబృంహితా. 56
అపక్వం ధారయత్యన్నం పక్వం సృజతి పార్శ్వతః,
దుర్బలాగ్నిబలా (త్) దుష్టా త్వామమేవ విముఞ్చతి. 57

వ్యా. జాఠరాగ్నికి ఆశ్రయమై భుజింపబడిన యాహారమును గ్రహించి ధరించు నాడి గ్రహణియనబడును. (ఆహారమును ధరించుటంజేసియే యిది గ్రహణి యని యన్వర్థముగ జెప్పబడునని భావము). అయ్యది నాభికి పైభాగమున నుండి యగ్నిబలము నాధారముగ జేసికొని బలము కల్గియుండును. అయ్యది పక్వముకాని యాహారమును ధరించును. పక్వమైన యాహారమును గుదముండువామపార్శ్వమునకు విసర్జించుచుండును. (ఇదియే గ్రహణికి స్వాభావికమైన వ్యాపారము). ఇయ్యది బలహీనమైన యగ్నిబలము కల్గినదై దుష్టమగును. (అగ్నిబలము తగ్గినపుడు గ్రహిణియు బలహీనమై చెడును. దీనిశక్తియు వ్యాపారంబును జాఠరాగ్నిపై నాధారపడియుండునని భావము.) దుష్టమైనపుడు పక్వముకానియాహారమునే విసర్జించును. (ఈగ్రహణి పూర్వరూపావస్థయందు పక్వాపక్వరూపముగ నుండు అన్నమును విసర్జించునని ముందు చెప్పబడినది. వ్యాధిరూపావస్థయందు అపక్వమునే విసర్జించునని యిచ్చట చెప్పబడినదని యెరుంగునది.)

## గ్రహణీరోగభేదములు.

మూ. వాతాత్పిత్తాత్కఫాచ్చ స్యాత్ తద్రోగస్త్రిభ్య ఏవ చ,
హేతుం లిఙ్గం చికిత్సాం చ శృణు తస్య పృథక్ పృథక్. 58

వ్యా. పైజెప్పబడిన గ్రహణీరోగము వాతమువలనను, పిత్తమువలనను కఫము వలనను, త్రిదోషసన్నిపాతమువలనను జనించును. అట్టి నాల్గుభేదములకు వేరువేరుగ వాతాదిప్రకోపకారణములను, లక్షణములను, ప్రత్యేకచికిత్సలను వేరువేర నిచ్చుట చెప్పెద వినుము.

## వాతికగ్రహణీరోగనిదానము.

మూ. కటుతిక్తకషాయాతిరూక్షశీతలభోజనైః,
ప్రమితాఽనశనాఽత్యధ్వవేగనిగ్రహమైథునైః. 59
కరోతి కుపితో మన్దమగ్నిం సంఛాద్య మారుతః,
(మారుతః కుపితో వహ్నిం సంఛాద్య కురుతే గదాన్)

వ్యా. కటు-తిక్త-కషాయరసములు కల యాహారమును భుజించుట, మిక్కిలి రూక్షంబును శీతలంబు నైన యన్నమును భుజించుట, అధికముగ భుజించుట, మిక్కిలి తక్కువగభుజించుట, లేక బొత్తుగ నాహారము తినకుండుట, అధికముగ త్రోవనడచుట, వాత-మూత్ర-పురీషాదివేగముల నిరోధించుట, అధికముగ స్త్రీసంభోగము చేయుట ఈకారణములచే వాతము ప్రకోపమునొంది జాఠరాగ్ని నావరించి కప్పి మందగింప జేయును.

## వాతికగ్రహణీరోగలక్షణములు.

మూ. తస్యాన్నం పచ్యతే దుఃఖం శుక్తపాకం, ఖరాఙ్గతా. 60
కణ్ఠాస్యశోషః, క్షుత్తృష్ణా తిమిరం కర్ణయోస్స్వనః,
పార్శ్వోరువఙ్క్షణగ్రీవారుజోఽభీక్ష్ణం విషూచికా. 61
హృత్పీడా, కార్శ్యదౌర్బల్యం, వైరస్యం, పరికర్తికా,
గృద్ధిః సర్వరసానాం చ మనసస్సదనం తథా. 62
జీర్ణే జీర్యతి చాధ్మానం భుక్తే స్వాస్థ్యముపైతి చ,
సవాతగుల్మహృద్రోగప్లీహాశఙ్కీ చ మానవః 63
చిరాద్దుఃఖం ద్రవం శుష్కం తన్వామం శబ్దఫేనవత్,
పునః పునస్సృజేద్వర్చః, కాసశ్వాసాఽర్దితోఽనిలాత్. 64

వ్యా. పైజెప్పినరీతిగ వాతప్రకోపమున జాఠరాగ్ని మందగించినవానికి భుజింపబడిన యన్నము మిగుల కష్టముచే పులుపుగ పాకమునొందును. శరీరము జిడ్డు లేక కర

కరలాడుచుండును. కంఠంబును నోరును ద్రవము లేక యెండును. ఆకలియు దప్పియు నధికమగును. కన్నులు చీకటి గ్రమ్మినట్లుంటును. చెవులలో ధ్వని పుట్టును. ఇరుప్రక్కల యందును తొడలయందును గజ్జలయందును కంఠంబున (మెడయందు)ను అధికముగ నొప్పిపుట్టును. శరీరముపై సూదులచే బొడిచినవిధముగ బాధకల్గును. హృదయమున పట్టి నట్లు బాధ కల్గును. శరీరము కృశించి బలహీనమగును. నోటికి మధురాదిరసములు తెలి యదు. రంపముతో కోసినవిధముగ కడుపులో నారాటముగ నుండును. మధురాదిరసము లన్నిటియందును ఆసబోడమును. మనస్సు శక్తిలేక విసుకుజెంది యుండును. భుజింపబడిన యాహారము జీర్ణమయినప్పుడును జీర్ణమగుసమయమునను కడుపుబ్బరించును. అట్టిసమయ మున భుజించినచో కడుపుబ్బరము తగ్గి స్వస్థముగ నుండును. అట్టియెడ వాతరోగం బును గుల్మంబును హృద్రోగంబును ప్లీహంబును కల్గునేమో యని సందేహము కల్గును. ద్రవముగనైనను శుష్కముగనైన నుండి శబ్దముతోడను నురుగుతోడను కూడి పక్వము కానిమలమును చిరకాలమునకు మిక్కిలి కష్టముతో కొంచెము కొంచెముగ మాటిమాటి కిని వెడలును. కాసశ్వాసములు వానిని బాధించుచుండును. ఈలక్షణములు కల్గినది వాతముచే గల్గిన గ్రహణీరోగమని యెరుంగునది.

### పైత్తికగ్రహణీరోగనిదానము.

మూ. కట్వజీర్ణవిదాహ్యమ్లక్షారాద్యైః పిత్తముల్బణం,
అగ్నిమాప్లావయద్ధన్తి జలం తప్తమివానలమ్. 65

వ్యా. కటురసద్రవ్యమును, అజీర్ణకరద్రవ్యములను, విదాహి (మంటబుట్టించు ఆవాలు మున్నగునవి) ద్రవ్యములను, ఆమ్లరసము కలద్రవ్యములను, క్షారములు మున్నగు ద్రవ్యములను విశేషముగ భుజించినచో పిత్తము ప్రకోపమునొంది జాఠరాగ్నిని (జ్వలించుచుండు బాహ్యాగ్నిని జలము చల్లార్చువిధముగ) తడిపి చల్లార్చును. (ఇచ్చట పిత్తము అగ్నికి సమానగుణమైనను తనయందలి ద్రవభాగముచే నగ్నిని తడిపి బలహీనముగ జేయునని యెరుంగునది.)

### పైత్తికగ్రహణీరోగలక్షణము.

మూ. సోఽజీర్ణం నీలపీతాభం పీతాభః సార్యతే ద్రవమ్,
పూత్యమ్లోద్గారహృత్కణ్ఠదాహారుచితృడర్దితః. 66

వ్యా. అట్టియగ్నివైగుణ్యమువలన జీర్ణముకానిదియు నీలవర్ణంబైనను పీతవర్ణం బైనను కల్గి ద్రవరూపమైన మలము వెడలును. అట్టియెడ దుర్గంధముతో కూడి పుల్లని

త్రేనుపులు వెడలును. హృదయమునందును కుత్తుకయందును మంట పుట్టును. అరుచియు, డప్పియు కల్గును.

## కఫజగ్రహణీరోగనిదానము.

మూ. గుర్వతిస్నిగ్ధశీతాదిభోజనాదతిభోజనాత్,
భుక్తమాత్రస్య చ స్వప్నాత్ హన్త్యగ్నిం కుపితః కఫః. 67

వ్యా. గురుపదార్థములు, మిక్కిలి స్నిగ్ధపదార్థములు శీతవీర్యము గలపదార్థములు మున్నగువానిని భుజించినను, పరిమితికన్న నధికముగ భుజించినను, భుజించినవెంటనే నిదురబోయినను కఫము కుపితంబై జాఠరాగ్నిని చల్లార్చును.

## కఫజగ్రహణీరోగలక్షణములు.

మూ. తస్యాఽన్నం పచ్యతే దుఃఖం హృల్లాసచ్ఛర్ద్యరోచకాః,
ఆస్యోపదేహమాధుర్యకాసష్ఠీవనపీనసాః 68
హృదయం మన్యతే స్త్యానం ఉదరం స్తిమితం గురు,
దుష్టో మధుర ఉద్గారః సదనం స్త్రీష్వహర్షణమ్. 69
భిన్నామశ్లేష్మసంసృష్టగురువర్చః ప్రవర్తనం,
అకృశస్యాపి దౌర్బల్యం ఆలస్యం చ కఫాత్మకే. 70

వ్యా. వానికి అన్నము మిక్కిలి కష్టముచే పచింపబడును. మరియు హృల్లాసము (ఓకరింతలు), వాంతియు అరోచకంబును కల్గును నోరు బంధనకల్గి తీపిగనుండును. కాసము కల్గును. నోట కఫము నుమియును. పడిసెముపట్టును. హృదయముపై తడిగుడ్డ గప్పినవిధముగ దోచును. ఉదరము నిశ్చలమై బరువుగ నుండును. దుష్టమై తీపికల్గిన త్రేనుపులు వెడలును. శరీరము కృశించును. స్త్రీసంభోగమునం దిచ్ఛబోడమదు. మలము ద్రవమై పక్వముగాక శ్లేష్మముతో గూడి భారము కల్గి వెడలును. శరీరము కృశించక యున్నను బలము చాల హీనముగ నుండును. పనులయందు ప్రాలుమాలిక కల్గును. (ఈ లక్షణములు కల్గినది కఫముచే జనించిన గ్రహణీరోగమని యెరుంగునది.)

మూ. యశ్చాగ్నిః పూర్వముద్దిష్టః రోగానీకే చతుర్విధః,
తం చాపి గ్రహణీదోషం సమవర్జం ప్రచక్ష్మహే. 71

వ్యా. నిమానస్థానమునందలి రోగానీకాధ్యాయమున జాఠరాగ్ని విషమ-తీక్ష్ణ-మంద-సమ భేదములచే నాల్గు తెరంగులని చెప్పబడినది; అట్టి యగ్ని భేదంబులలో సమాగ్ని యొకటి దక్క తక్కిన మూడువిధములగు నగ్నిభేదంబులును గ్రహణీదోషముగనే చెప్పబడును అని యర్థము.

విమానస్థానమునందలి రోగానీకాధ్యాయమున "అగ్నిషు తు శారీరేషు చతుర్విధో విశేషో బలభేదేన భవతి. తద్యథా:—తీక్ష్ణో మన్దః సమో విషమశ్చేతి." (చ. వి. అ. ౬. సూ. ౧౩.) అని యుపక్రమించి చతుర్విధాగ్ని భేదములు వివరింపబడినవి. అందు సమాగ్నిదక్క తక్కిన మూడు భేదములును గ్రహణీదోషాంతర్భూతములని యిచ్చటను అతిదేశింపబడినవి. గ్రహణిని ప్రధానముగ జేసి చెప్పునట్టి యీప్రకరణమున వాని యంతర్భావము సమంజసము కాదు కావున నీశ్లోకము అనార్షమని కొందరి యభిప్రాయము. వాగ్భటాచార్యులును ఈశ్లోకార్థమునే "విభాగేఽఙ్గస్య యే చోక్తాః విషమాద్యాః త్రయోఽగ్నయః, తేఽపి స్యుః గ్రహణీదోషాః సమస్తు స్వాస్థ్యకారణమ్." (అ. హృ. ని. అ. ౮. శ్లో. ౩౦.) అనుశ్లోకముచే నిరూపించిరి. కావున నిది యనార్షమని చెప్పుట యుక్తముగ దోపదు.

### సాన్నిపాతికగ్రహణీరోగలక్షణము.

మూ॥ పృథగ్వాతాదినిర్దిష్టహేతులిఙ్గసమాగమే,
త్రిదోషం నిర్దిశేత్తేషాం భేషజం శృణ్వతః పరమ్. 72

వ్యా. వాతాదిగ్రహణీరోగములకు వేరువేరుగ జెప్పబడిన హేతువులును లక్షణములును కలిసి యున్నయెడ నట్టి గ్రహణీరోగము సన్నిపాతమున గల్గినదనియెరుంగునది. పైజెప్పబడిన గ్రహణీదోషములకు వేరువేరుగ నీక్రింద చికిత్సితము జెప్పబడును.

### గ్రహణీరోగచికిత్సాక్రమము, అందు వమనవిధి.

మూ. గ్రహణీమాశ్రితం దోషం విదగ్ధాహారమూర్ఛితం,
సవిష్టమ్భప్రసేకార్తివిదాహాఽరుచిగౌరవైః. 73
ఆమలిఙ్గాన్వితం దృష్ట్వా సుఖోష్ణేనామ్బునోద్ధరేత్,
ఫలానాం వా కషాయేణ పిప్పలీసర్షపైస్తథా. 74

వ్యా॥ గ్రహణి నాశ్రయించినదోషము విదగ్ధముగ పాకముచెందిన యాహారముతోకూడి అట్టి యపక్వాహారము ఆమాశయముననే స్తంభించి దానివలన నోట ద్రవము వెడలుచు మంట పుట్టి అరుచి కల్గి గురుత్వముగ నున్నపుడు అట్టిదోషము ఆమలక్షణములతో కూడియున్నదని తెలిసికొని సుఖోష్ణజలముచేత ఆమాశయమునుండి వమనముచేయించి బయలువెడలించవలయును. లేక మంగకాయకషాయము చేసైనను, పిప్పళ్లను, ఆవాలను స్వరసముచేసి దానియుపయోగముచే నైనను వమనము చేయించి దోషమును వెడలించవలయును.

## గ్రహణీరోగమున విరేచన-పాచనలంఘన-పాచనప్రయోగము.

మూ. లీనం పక్వాశయస్థం వా హ్యామం స్రావ్యం సదీపనైః,
శరీరానుగతే సామే రసే లఙ్ఘనపాచనమ్. 75

వ్యా. అట్టి యామదోషము పక్వాశయసమీపమున చిక్కియున్నయెడ దానిని అగ్నినిదీపింపజేయు ఓమము మొదలగు ద్రవ్యములతో కూడిన విరేచన ఔషధములచే విరేచనరూపముగ వెడలించవలయును. మరియు నట్టి యామరసము శరీరమునందు వ్యాపించి యున్నచో నుపవాసరూపమైన లంఘనమును పాచనములను చేయించవలయును.

## శుద్ధకోష్ఠునకు పేయాద్యుపయోగము.

మూ. విశుద్ధామాశయాయాస్మై పఞ్చకోలాదిభిః శృతం,
దద్యాత్పేయాది లఘ్వన్నం పునర్యోగాంశ్చ దీపనాన్. 76

వ్యా. పైజెప్పిన క్రియావిధానములచే ఆమాశయము శుద్ధముగ నున్నప్పుడు అట్టిరోగికి పంచకోలాదులను చేర్చి పక్వముచేయబడిన పేయ మున్నగు ద్రవరూపమయిన యాహారమును బెట్టి మరల యగ్నిని దీపింపజేయు యోగములచే నుపచరించవలయును.

## వాతజగ్రహణీచికిత్స, అందు సర్పిష్పానము.

మూ. జ్ఞాత్వా తు పరిపక్వామం మారుతగ్రహణీగదం,
దీపనీయయుతం సర్పిః పాయయేతాల్పశో భిషక్. 77

వ్యా. పైజెప్పిన చికిత్సాక్రమముచేత వాతజగ్రహణీరోగమున ఆమదోషము పరిపక్వమైనదని లక్షణములచే గమనించి దీపనీయగణమున చెప్పబడిన యగ్నిసందీపనములగు పిప్పలి మున్నగుద్రవ్యచూర్ణముతో కూడిన నేతిని స్వల్పమాత్రచే త్రాగించవలయును. ఇచ్చట షడ్విరేచనశతాశ్రితీయమున చెప్పబడిన "పిప్పలీ పిప్పలీమూల చవ్య చిత్రకశృంగబేరామ్లవేతసమరిచాజమోదభల్లాతకాస్థిహిఙ్గునిర్యాసా ఇతి దశేమాని దీపనీయాని భవన్తి." అను దీపనీయగణద్రవ్యము నెరుంగునది.

## వాతికగ్రహణియందు నిరూహవస్తిప్రయోగము.

మూ. కిఞ్చిత్సంధుక్షితే త్వగ్నౌ సక్తవిణ్మూత్రమారుతం,
ద్వ్యహం త్ర్యహం వా సంస్నేహ్య స్విన్నాభ్యక్తం నిరూహయేత్.

వ్యా. పైజెప్పిన దీపనీయఘృతపానముచేత జాఠరాగ్ని కొంచెము దీపించియున్నపుడు మల-మూత్ర - వాతములు సరళముగ వెడలక నిలచియున్నయెడ వానికి స్నేహద్రవ్యములచే రెండుమూడుదినములు విధ్యుక్తప్రకారము స్నేహనముచేసి పిదప వస్తివిధానమును ముందు స్వేదాభ్యంజనముల చేయించి పిదప నిరూహావస్తిని ప్రయోగించి మలమును వెడలించవలయును.

వాతికగ్రహణియందు విరేచనవిధి.

మూ. తత ఏరణ్డతైలేన సర్పిషా తైల్వకేన వా,
సక్షారేణానిలే శాన్తే స్రస్తదోషం విరేచయేత్. 79

వ్యా. నిరూహావస్తిప్రయోగానంతరము వాతము కొంచెము శాంతినొందియుండగా ఆముదముచేనైనను, తైల్వకఘృతముచేనైనను, సర్జక్షారమునుచేర్చి యుపయోగించి విరేచనము చేయించవలయును.

వాతికగ్రహణియందు అనువాసనవస్తిప్రయోగము.

మూ. శుద్ధం రూక్షాశయం బద్ధవర్చసం చానువాసయేత్,
దీపనీయామ్లవాతఘ్నసిద్ధతైలేన మాత్రయా. 80

వ్యా. పైజెప్పినశోధనముచే కోష్ఠము శుద్ధమయి రూక్షముగ నుండుటవలన మరల మలబద్ధకము కల్గియున్నచో శుంఠి మొదలగు దీపనీయౌషధములును, అమ్లద్రవ్యములను, సన్నరాష్ట్రము మున్నగు వాతహరద్రవ్యములను సమభాగములుగ జేర్చి పక్వముజేయబడిన తైలముచేత అనువాసనవస్తిని ప్రయోగించవలయును.

వాతికగ్రహణియందు ఘృతాభ్యాసవిధి.

మూ. నిరూఢం చ విరిక్తం చ సమ్యక్చైవానువాసితమ్,
లఘ్వన్నప్రతిసంభుక్తం సర్పిరభ్యాసయేత్పునః. 81

వ్యా. పైజెప్పినరీతిగ నిరూహావస్తి నుపయోగించి పిదప విరేచనము చేయించి మరల ననువాసనవస్తిని ప్రయోగించి వానికి లఘ్వన్నంబాహారంబుగ నిడి పిదప నీక్రింద చెప్పబడుఘృతమును పానము చేయించవలయును.

వాతికగ్రహణికి దశమూలాదిఘృతము.

మూ. ద్వే పఞ్చమూలే సరలం దేవదారు సనాగరం,
పిప్పలీం పిప్పలీమూలం చిత్రకం హస్తిపిప్పలీం. 82

శణబీజం యవాన్కోలాన్కులత్థాన్నిషవీం (రభీం) తథా,
పాచయేదారనాలేన దధ్నా సౌవీరకేన వా. 83
చతుర్భాగావశేషేణ పచేత్తేన ఘృతాఢకం,
స్వర్జికాయావశూకాఖ్యౌ క్షారౌ దత్వా చ యుక్తితః. 84
సైన్ధవౌద్భిదసాముద్ర బిడానాం రోమకస్య చ,
ససౌవర్చలపాక్యానాం భాగాన్ద్విపలికాన్పృథక్. 85
వినీయ చూర్ణితాన్తస్మాత్ పాయయేత్ ప్రసృతం బుధః,
కరోత్యగ్నిం(గ్ని)బలం వర్ణం వాతఘ్నం భుక్తపాచనమ్. 86
(ఇతి దశమూలాద్యం ఘృతమ్.)

వ్యా. రెండుపంచమూలములు(దశమూలములు), సరళవృక్షముయొక్క వేరు, దేవదారుచెక్క, శుంఠి, పిప్పళ్లు, మోడి, చిత్రమూలము, యేనుగపిప్పళ్లు, జనుపవిత్తనములు, యవలు, రేగులు, ఉలవలు, నల్లజీలకఱ్ఱ వీనినన్నిటిని సమభాగములుగ చేర్చి నలియకొట్టి ఆరినాళమునందైనను, పెరుగునందైనను, సౌవీరకమునందైననుచేర్చి నాల్గవవంతు మిగులునట్లు కాచి యాద్రవమును ఒకఆఢకపరిమితమైన ఘృతమున కూర్చి అందు స్వర్జక్షారము, యవక్షారము ఈరెండుక్షారములను యథోచితముగ చేర్చునది. మరియు సైంధవలవణము, ఔద్భిదలవణము, సాముద్రలవణము, బిడాలవణము, సౌవర్చలవణము, పాక్యలవణము అను నీయేడులవణములను వేరువేరుగ రెండేసిపలములవంతున చూర్ణముచేసి పైచెప్పిన రీతిగ పక్వముచేయబడిన ఘృతమున కలిపి యాఘృతమును ప్రతిదినంబును పూటకు రెండేసిపలములవంతున పానముచేసినచో జాఠరాగ్నికి బలమును కల్గించును. శరీరంబునకు బలంబును, రంగును కల్గించును. వాతమును హరించును. భుజింపబడిన యాహారమును చక్కగ పచింపజేయును.

కల్పనాక్రమము.—ఇచ్చట ఘృతము ఆఢకము(అరువదినాలుగుపలములు) చెప్పబడినది. దీనికి ద్రవము సామాన్యపరిభాషచేత నాల్గింతలు చేర్చవలయునుగాని క్వాథ్యద్రవ్యములయిన దశమూలాదిద్రవ్యములు సమభాగముగ చేరి నాలుగాఢకములపరిమితమున రెండుద్రోణముల పరిమితమైన పైజెప్పబడిన ఆరనాళము మున్నగు ద్రవమున కలిపి నాలుగవవంతు (నాలుగాఢకములు) మిగులునట్లు కాచి ఆఢకపరిమితమైన ఘృతమున చేర్చి ఘృతపాకవిధి ననుసరించి పక్వముచేయునది. ఇత్తెరంగున సిద్ధమైనఘృతమును దించునపుడు పైజెప్పినలవణములను రెండేసిపలములవంతున చూర్ణముచేసి కలుపునది. క్షారములరెంటినిమాత్రము స్వల్పపరిమాణముగ చేర్చునది. ఈవిషయమును "క్షారౌ

దత్వాచ యుక్తితః” అని మూలముననే చెప్పబడినది. జతూకర్ణతంత్రమున ఈయోగ మును నిట్లు చెప్పియున్నది.—“దశమూలం పఞ్చకోలం కులుత్థం సురభిం యవం, దేవ దారుం చ సరళం శణబీజంచ సాధయేత్, దధ్నా సౌవీరకేణైవ తేన పక్వే ఘృతాఢకే, ద్వే క్షారౌ సప్తలవణాన్యావపేత్ ద్విపలానితు.” ఇచ్చట “పక్వే ఘృతాఢకే ద్వే క్షారౌ సప్తలవణాన్యావపేత్.” అని చెప్పుటవలన పక్వమయిన ఘృతమునందు క్షార లవణముల జేర్చవలయునని తెలిసెడి.

దశమూలములన—మారేడు, దుండిగము, గుమ్మడి, కలిగొట్టు, తక్కెల, ముయ్యాకుపొన్న, కోలపొన్న, వాకుడు, పెద్దములక, పల్లేరు అను నీపదియును చేర దశ మూలము లనబడును.

## వాతికత్ర్యూషణాదిఘృతము.

మూ. త్ర్యూషణత్రిఫలాకల్కే బిల్వమాత్రే గుడాత్పలే,
సర్పిషోఽష్టపలం పక్త్వా మాత్రాం మన్దానలః పిబేత్. 87
(ఇతి త్ర్యూషణాద్యం ఘృతమ్.)

వ్యా. త్ర్యూషణము, (శుంఠి-పిప్పలి-మిరియాలు), త్రిఫలములు (కరక-తాని-ఉసిరికకాయలు), వీనిని సమభాగములచేర్చి యొకపలమగునట్లు కల్కముచేసి అందు నొక పలము బెల్లమును, ఎనిమిదిపలములు ఆవునేతిని కలిపి పక్వముచేసి తగుమైనపరిమితితో సేవించినయెడ మందాగ్ని దీప్తి కలిగియుండును.

## వాతికగ్రహణికి పంచమూలాదిఘృతము.

మూ. పఞ్చమూలాఽభయావ్యోషపిప్పలీమూలసైన్ధవైః,
రాస్నాక్షారద్వయాఽజాజీవిడఙ్గశటిభిర్ఘృతమ్. 88
శుక్తేన మాతులుఙ్గస్య స్వరసేనార్ద్రకస్య చ,
శుష్కమూలకకోలామ్బుచుక్రికాదాడిమస్య చ. 89
తక్రమస్తుసురామణ్డసౌవీరకతుషోదకైః,
కాఞ్జికేన చ, తత్పక్వం అగ్నిదీప్తికరం పరమ్. 90
శూలగుల్మోదరశ్వాసకాసాఽనిలకఫాపహం,
సబీజపూరకరసం సిద్ధం వా పాయయేత్ ఘృతమ్. 91
(ఇతి పఞ్చమూలాద్యం ఘృతమ్.)

వ్యా. మహాపంచమూలము (మారేడువేరు, దుండిగపువేరు, గుమ్మడివేరు, కలిగొట్టువేరు, తక్కెలవేరు ఇవి మహాపంచమూలము), కరకకాయలు, త్రికటుకములు, మోడి, సైంధవలవణము, సన్నరాష్ట్రము,సర్జక్షారము, యవక్షారము, జీలకర, వాయువిడంగములు, కచోరములు వీనినన్నిటిని సమభాగములజేర్చి ఘృతమునకు నాల్గవవం తగునట్లు చూర్ణముచేసి ఘృతమున కల్కముగగూర్చి, అందు శుక్తము (పులిగంజి), మాదీఫలరసము, అల్లపురసము, ఎండినముల్లంగిస్వరసము, రేగుపండ్లస్వరసము, పులిచింతాకురసము, దానిమ్మపండ్లరసము, మజ్జిగ, పెరుగుమీదిమీగడ, సుర మనుమద్యముమీది తేట, సౌవీరకము (పులిసిన కడుగునీళ్లు), తుషోదకము (కడుగునీళ్లు), కాంజికము, అను నీపదుమూడుద్రవములను ఒక్కొకటి ఘృతమునకు సమభాగముగ నుండునట్లు చేర్చి, ఘృతపాకవిధి ప్రకారము పక్వము జేయునది. దీనిని సేవించినచో జాఠరాగ్నిని మిక్కిలి వృద్ధినందించును. శూలమును, గుల్మములను, ఉదరములను, శ్వాసకాసములను, వాతమును హరించును. లేక పై జెప్పినపంచమూలాదికల్కమును మాదీఫలరసమునుమాత్రము చేర్చి ఘృతమును పక్వము చేసియైన నుపయోగించనగును. లేక పై జెప్పిన సిద్ధఘృతమునే మాదీఫలస్వరసానుపానమున సేవింపవలెను. (ఇచ్చట శుక్తమన—ఒక మంటికుండలో తేనెను బెల్లమును కలిని ఒకటిగ జేర్చి వాసెనగట్టి మూడుదినములు ధాన్యపుటమున నుంచిన పులిగంజి.)

ఈఘృతయోగమున ద్రవద్రవ్యములు పదుమూడుగ నున్నవి గనుక "ద్రవాణి యత్ర స్నేహేషు పఞ్చాదీని భవన్తి హి,...తత్ర స్నేహసమాన్యాహుః" అను విశేషపరిభాషచేత ఘృతసమభాగములుగ నొక్కొకదానిని జేర్చి, సామాన్యపరిభాషానుసారము ఘృతమునకు నాల్గవవంతు కల్కమునుజేర్చి పక్వము చేయనగును. మాదీఫలరసమును మాత్రముచేర్చు రెండవయోగమున రసము ఘృతమునకు నాల్గింతలు చేర్పనగును.

### వాతికగ్రహణియందు అభ్యంజనమునకు పంచకోలాదితైలము.

మూ॥ సిద్ధమభ్యఞ్జనార్థం చ తైలమేతైః ప్రయోజయేత్,

వ్యా. మరియు పైజెప్పబడిన పంచమూలాదికల్కమును, శుక్తాదిద్రవములను జేర్చి తైలమును తైలపాకవిధిగ పక్వముచేసి యభ్యంజనమునకై వాతజగ్రహణియం దుపయోగించునది.

### వాతికగ్రహణికి పంచమూలాదిచూర్ణము.

మూ. ఏతేషామౌషధానాం వా పిబేచ్చూర్ణం సుఖామ్బునా. 92
వాతే శ్లేష్మావృతే, సామే కఫే వా వాయునోద్ధతే,
(దద్యాచ్చూర్ణం పాచనార్థం అగ్నిసన్దీపనం పరమ్).
(ఇతి పంచమూలాద్యం చూర్ణం.)

వ్యా. గ్రహణీరోగమున వాతము కఫముచే నావరింపబడినప్పుడును, గ్రహణీ రోగము ఆమముగనున్నను, గ్రహణీరోగమున కఫము వాతముతో కూడియున్నను, పై జెప్పబడిన మహాపంచమూలాదిద్రవ్యములను సమభాగములుగ గూర్చి చూర్ణముచేసి సుఖోష్ణముగనుండు వేడినీళ్లతో సేవించనగును. (ఈచూర్ణోపయోగమున అగ్నిదీప్తి కల్గి యాహారమును పచింపజేయును.)

ఆమభేదములను తంత్రాంతరమున నిట్లు వివరించిరి:—"ఆమమన్నరసం కేచిత్ కేచిత్తు మలసఞ్చయం, ప్రథమాం దోషదుష్టిం చ కేచిదామం ప్రచక్షతే." పక్వము కాని యన్నరసము ఆమమని కొందరును, ఆమాశయమునం దగ్నిదౌర్బల్యముచే పక్వము గానియెడ చేరినమలసంచయము ఆమమని మరికొందరును, దోషములచే తొలుతకల్గిన దుష్టి ఆమమని కొందరును చెప్పెదరని యర్థము. మరియు భోజు లిట్లు చెప్పిరి:—"ఆమాశయస్థః కాయాగ్నేః దౌర్బల్యాదవిపాచితః, ఆద్యఆహారధాతుర్యః స ఆమఇతిసంజ్ఞితః" జాఠరాగ్ని బలహీనతచేత చక్కగ పక్వముకాని యాహారరసము ఆమాశయమున జేరి యున్న నయ్యది యామమని యర్థము. ఈశ్వరసేను డిట్లుచెప్పెను—"ఏవమామాశయేఽత్యన్నం బహుసమ్యక్ నజీర్యతి, చీయమానం తదేవాన్నం కాలేనామత్వమాప్నుయాత్" ఆమాశయమున జేరినయన్నము అధికముగనున్నచో నయ్యది చక్కగ జీర్ణముకాక ఆమాశయమునందే సంచితమై యామత్వము నొందునని యర్థము. ఇచ్చట గ్రహణీరోగము నందు 'సామే' అనుచోట నీయామభేదములన్నియు సంగ్రహింపబడును.

### పక్వ-అపక్వపురీషలక్షణము.

మూ. మజ్జత్యామా గురుత్వాత్ విట్ పక్వా తూత్ప్లవతే జలే. 93
వినాఽతిద్రవసంఘాతశైత్యశ్లేష్మప్రదూషణాత్,
పరీక్ష్యైవం పురా సామం నిరామం చామదోషిణమ్. 94
విధినోపాచరేత్సమ్యక్ పాచనేనేతరేణ వా,

వ్యా. గ్రహణీరోగికి పురీషము ఆమముగ నున్నచో నీటిలోనుంచిన నయ్యది ఆమదోషమున సంక్రమించినభారము కల్గియుండుటచే నీట మునుగును. పక్వము నొంది నచో తేలికయై యుండుటంజేసి నీట తేలును. అట్టి పురీషము అతిద్రవంబును, అతి ఘనంబును, అతిశీతంబును, కఫదుష్టంబును కానియెడ నీట నుంచినపుడు ఆమమైనచో మునుగును, పక్వమైనచో తేలును. (పురీషము మిక్కిలి ద్రవముగ నున్నచో పక్వము కాకున్నను నీళ్లలో తేలును. మిక్కిలి ఘనీభవించియున్నచో పక్వమైనదియుకూడ జల మున మునుగును. శైత్యముచేతను శ్లేష్మముచేతను దూషితమైనమలము భారముచేత

పక్వమై యున్నను మునుగును; కావున మిక్కిలి ద్రవంబును ఘనంబునుకాని పురీషమును నీటిలో నునిచి పరీక్షించినయెడ పైజెప్పినరీతిగ పక్వాఽపక్వభేదములు తెలియునని భావము.)

ఇత్తెరంగున గ్రహణీదోషమున తొలుత పురీషమును పరీక్షించి ఆమనిరామభేదముల గనిపట్టి యామదోషమున్నచో విధ్యుక్తప్రకారము పాచనముచేసైనను, గ్రహణీదోషమునకు జెప్పబడిన యౌషధములచేసైనను చక్కగ చికిత్సజేయనగును.

### చిత్రకాదిగుటికలు.

మూ. చిత్రకం పిప్పలీమూలం ద్వౌ క్షారౌ లవణాని చ. 95
వ్యోషం హిఙ్గ్వజమోదాం చ చవ్యం చైకత్ర చూర్ణితం,
గుడికా మాతులుఙ్గస్య దాడిమస్య రసేన వా. 96
కృతా విపాచయత్యామం దీపయత్యాశు చానలం,
(ఇతి చిత్రకాద్యా గుటికా.)

వ్యా. చిత్రమూలము, మోడి, సర్జక్షారము, యవక్షారము, పంచలవణములు, త్రికటుకము (శుంఠి, పిప్పళ్లు, మిరియాలు), ఇంగువ, ఓమము, చవ్యము వీనినన్నిటిని సమభాగములుగ జేర్చి చూర్ణముచేసి మాదీఫలరసముచేసైనను పుల్లదానిమ్మరసముచేసైనను మెత్తగ మర్దనముచేసి గుటికలుగ చేసి యుపయోగించినచో నామమును పచింపజేయును. జాఠరాగ్నిని శీఘ్రముగ దీపింపజేయును.

(ఇచ్చట "లవణాని చ" అనుపదముచేత సౌవర్చలవణము, సైంధవలవణము, బిడాలవణము, ఔద్భిదలవణము, సాముద్రలవణము అను పంచలవణములను గ్రహించునది.)

### గ్రహణీరోగమునం దామపాచనకషాయాదులు.

మూ. నాగరాఽతివిషా ముస్తక్వాథః స్యాదామపాచనః. 97
ముస్తాన్తకల్కః పథ్యా వా నాగరం చోష్ణవారిణా,
దేవదారువచాముస్తనాగరాతివిషాఽభయాః. 98
వారుణ్యామాసుతాస్తోయే కోష్ణే వాఽలవణాః పిబేత్,
వర్చస్యామే సశూలే చ పిబేద్వా దాడిమామ్బునా. 99

వ్యా. శుంఠి, అతివస, తుంగగడ్డలు ఈమూడిటి చేర్చి కషాయము కాచి త్రాగినయెడ ఆమమలాదులను పచింపజేయును. లేక పైజెప్పినమూడిటి కల్కచూర్ణముసైనను,

కరకకాయలబెరడును శుంఠిని కల్కముజేసియైనను సుఖోష్ణమైనజలముతో ననుపాన ముగ పుచ్చుకొనినను ఆమమును పచింపజేయును.

మరియు దేవదారుచెక్క, వస, తుంగగడ్డలు, శుంఠి, అతివస, కరకకాయబెరడు వీనిచూర్ణమును వారుణీమద్యమును జేర్చి యూరబెట్టి ఉప్పు చేర్చక వేడినీళ్లలో కలిపి త్రాగినచో ఆమమలము పక్వమగును. శూల నివర్తించును. లేక పైజెప్పినచూర్ణమును దానిమ్మపండ్లరసమును కలిపి త్రాగనగును.

మూ. బిడేన లవణం పిష్టం బిల్వం చిత్రకనాగరం,
సామే వా సకఫే వాతే కోష్ఠశూలకరే పిబేత్. 100

వ్యా. గ్రహణీరోగికి పురీషము పక్వముగాకున్నను, వాతకఫములతోకూడి కోష్ఠమున శూలబాధ కల్గియున్నను, బిడాలవణమును, మారేడువేరును, చిత్రమూలమును, శొంఠిని వీనినన్నిటిని నూరి పైజెప్పినరీతిగ పుల్లదానిమ్మరసమును కలిపి త్రాగవలయును.

(ఇచ్చట "బిడేన లవణమ్" అనుచోట "బిడేన ఉపలక్షితం లవణం = బిడాలవణం" అని సర్వాంగసుందరవ్యాఖ్యానమున నున్నదికావున బిడాలవణమని యర్థము.)

### గ్రహణీరోగమున ఛర్ద్యాదిహరకలింగాదిచూర్ణము.

మూ. కలిఙ్గహిఙ్గ్వతివిషావచాసౌవర్చలాభయాః,
ఛర్ద్యర్శోగ్రన్థిశూలేషు పిబేదుష్ణేన వారిణా. 101
పథ్యాసౌవర్చలాజాజీచూర్ణం మరిచసంయుతం,

వ్యా. గ్రహణీరోగికి వాంతి, పురీషము, అర్శస్సులతోకూడి శూల కల్గియున్నపుడు కొడిశపాలవిత్తులు, ఇంగువ, అతివస, వస, సౌవర్చలవణము, కరక్కాయబెరడు వీనిని సమభాగముగ చేర్చి చూర్ణముచేసి వేడినీళ్లలో కలిపి మిరియాలచూర్ణము చేర్చి పానముచేయించనగును. మరియు కరక్కాయబెరడు, సౌవర్చలవణము, జీలకర వీనిని సమభాగములుగ చేర్చి చూర్ణముచేసి వేడినీళ్లలో కలిపి అందు కొంచెము మిరియాల చూర్ణము కలిపి త్రాగించవలయును.

### వాతికగ్రహణియందు అభయాదిక్వాథము.

మూ. అభయాం పిప్పలీమూలం వచాం కటుకరోహిణీమ్. 102
పాఠాం వత్సకబీజాని చిత్రకం విశ్వభేషజం,
పిబేన్నిష్క్వాథ్య చూర్ణం వా కృత్వా కోష్ణేన వారిణా. 103
పిత్తశ్లేష్మాభిభూతాయాం గ్రహణ్యాం శూలనుద్ధితం,

వ్యా. కరక్కాయబెరడు, మోడి, వస, కటుకరోహిణి, విషబొద్ది, కొడిశపాల విత్తులు, చిత్రమూలము. శుంఠి వీనినన్నిటిని సమభాగములుగ చేర్చి కషాయము కాచి గ్రహణీరోగమున పిత్తశ్లేష్మములు ప్రబలముగ నుండునప్పుడు త్రాగవలయును. లేక పై జెప్పిన ద్రవ్యములను చూర్ణముచేసి సుఖోష్ణమయిన నీళ్లలో కలిపి త్రాగించినచో గ్రహణియందు కల్గినశూల నివర్తించును.

వాతికగ్రహణియందు అతివిషాదిక్వాథము.

మూ. సామే సాతివిషం వ్యోషం లవణక్షారహిఙ్గు చ. 104
నిఃక్వాథ్య పాయయేచ్చూర్ణం కృత్వా వా కోష్ణవారిణా,

వ్యా. పురీషము ఆమముగ నున్నచో అతివస, త్రికటుకములు (శుంఠి, పిప్పలి, మిరియాలు), సైంధవలవణము, యవక్షారము, ఇంగువ వీనినన్నిటిని సమభాగములుగ కషాయముకాచి త్రాగించవలయును. లేక వీనినన్నిటిని చూర్ణముచేసి సుఖోష్ణముగనుండు జలమున కలిపి త్రాగించవలయును.

(ఇచ్చట లవణమును మాత్రసిద్ధకషాయమున చేర్చునది.)

గ్రహణియందు కోష్ఠవాతహరపిప్పల్యాదిచూర్ణము.

మూ. పిప్పలీం నాగరం పాఠాం సారిబాం బృహతీద్వయమ్. 105
చిత్రకం కౌటజం బీజం లవణాన్యథ పఞ్చ చ,
తచ్చూర్ణం సయవక్షారం దధ్యుష్ణాంబుసురాదిభిః. 106
పిబేదగ్నివివృద్ధ్యర్థం కోష్ఠవాతహరం నరః,

వ్యా. పిప్పళ్లు, శుంఠి, విషబొద్ది, సుగంధపాల, వాకుడు, ములక, చిత్రమూలము, కొడిసపాలవిత్తులు, పంచలవణములు వీనినన్నిటిని సమభాగములుగ చేర్చి చూర్ణముచేసి అందు యవక్షారమును కలిపి పెరుగు, వేడినీళ్లు, సుర యనుమద్యము, కాంజికము (పులిగంజి), మొదలగువానిలో దేనియందైనను కలిపి త్రాగినచో జాఠరాగ్నిని వృద్ధినొందించి కోష్ఠమునందలి వాతమును హరించును.

మరీచాదిచూర్ణము.

మూ. మరిచం కుఞ్చికామ్బష్ఠావృక్షామ్లాః కుడవాః పృథక్. 107
పలాని దశ చామ్లస్య వేతసస్య పలార్ధికం,
(దశామ్లవేతసపలానిమాంశ్చాపి పలాంశికాః)
సౌవర్చలం బిడం పాక్యం యవక్షారః ససైన్ధవః. 108

శటీపుష్కరమూలాని హిఙ్గుహిఙ్గుశివాటికా,
తత్సర్వమేకతః సూక్ష్మం చూర్ణం కృత్వా ప్రయోజయేత్. 109
హితం వాతాభిభూతాయాం గ్రహణ్యామరుచౌ తథా,

వ్యా. మిరియాలు, నల్లజీలకర, (జీలకర), విషబొద్ది, చింతపండు ఇవి ప్రత్యేకము ఒక్కొక్క కుడవము (నాలుగేసి పలములు); అమ్లవేతసము పదిపలములు; సౌవర్చలవణము, బిడాలవణము, పాక్యలవణము (అట్టుప్పు), యవక్షారము, సైంధవలవణము, కచోరములు, పుష్కరమూలము, ఇంగువ, హింగుపత్రి ఇవి ప్రత్యేకము అర్ధపలము పై జెప్పినభాగమువంతున వీనినన్నిటిని నొకటిగ జేర్చి మెత్తనిచూర్ణముగ చేసి యుపయోగించునది. ఈచూర్ణమును వాతికగ్రహణియందును, అరుచియందును ఉపయోగించినచో చాల హితకరముగ నుండును.

గ్రహణీరోగమునందు చతురమ్లాదిచూర్ణోపయోగము.

మూ. చతుర్ణాం ప్రస్థమమ్లానాం త్ర్యూషణాచ్చ పలత్రయం. 110
లవణానాం చ చత్వారి శర్కరాయాః పలాష్టకం,
సంచూర్ణ్య శాకసూపాన్నరాగాదిష్వవచారయేత్. 111
కాసాజీర్ణాఽరుచిశ్వాసహృత్పాణ్డ్వామయగుల్మనుత్,

వ్యా. చింతపండు, అమ్లవేతసము, దానిమ్మ, రేగు అను నీనాలుగు అమ్లద్రవ్యములు ఒక్కొక్కటి నాల్గేసి పలములవంతున చేరి సముదాయము ఒకప్రస్థము (పదునారుపలములు), త్రికటుకములు (శుంఠి, పిప్పలి, మిరియాలు) ప్రత్యేక మొక్కొక్క పలమువంతున చేరి మూడుపలములు, పంచలవణములును చేరి నాలుగుపలములు. (లేక సౌవర్చలవణము, సైంధవలవణము, బిడాలవణము, ఔద్భిదలవణము అనునాల్గులవణములును నొక్కొకపలమువంతున చేరి నాల్గుపలములు.) చక్కెర ఎనిమిదిపలములు వీనినన్నిటిని నొకటిగచేర్చి చూర్ణముచేసి ఈచూర్ణమును కూరలయందును, సూపములయందును, అన్నములయందును, యూషము, పానకము మొదలగుపానీయములయందు కలిపి యుపయోగించినచో దగ్గు, అజీర్ణము, అరుచి, శ్వాసము, హృద్రోగము, పాండురోగము, శూలరోగము ఇవియన్నియు శమించును.

ఇచ్చట "చతుర్ణాం ప్రస్థమమ్లానాం" అనుచోట "వృక్షామ్లమాతులుఙ్గామ్లబదరామ్లఅమ్లవేతసైః, చతురమ్లమిదం ప్రోక్తమ్" అని సాంకేతితమైన అమ్లచతుష్టయమును గ్రహించవలెనని కొందరు చెప్పెదరు. ఆపక్షమున దానిమ్మకు మాదీఫలములను చేర్పనగును. ఇంతియే భేదము.

## యవాగూపయోగము.

మూ. చవ్యం త్వక్పిప్పలీమూలధాతకీవ్యోషచిత్రకాః. 112
కపిత్థం బిల్వమమ్లస్థాం శాల్మలం హస్తిపిప్పలీం,
శిలోద్భేదం తథాజాజీం పిష్ట్వా బదరసమ్మితమ్ (భాగికమ్). 113
పరిభర్జ్య ఘృతే, దధ్నా యవాగూం సాధయేద్భిషక్,
రసైః కపిత్థచుక్రీకా వృక్షామ్లైర్దాడిమస్య చ. 114
సర్వాతిసారగ్రహణీగుల్మార్శః ప్లీహనాశనీ,

వ్యా. చవ్యము, లవంగపుపట్ట, పిప్పలీమూలము (మోడి), ఆరెపువ్వు, త్రికటుకములు, చిత్రమూలము, వెలగపండు, మారేడుపండు, విషబొద్ది, బూరుగబంక, ఏనుగపిప్పళ్లు, పాషాణభేది (రాతిపువ్వు), జీలకర ఇవి ప్రత్యేకముగ ఒక్కొక్కదానిని పరకపలమువంతున చేర్చి చూర్ణముచేసి నేతిలో వేయించి కల్కముచేసి యాకల్కమును పెరుగునుచేర్చి గంజికాచి ఆగంజియందు వెలగపండు, పులిచింతాకు, చింతపండు, దానిమ్మపండు వీనిరసములను కలిపి పక్వముచేసి సేవించినచో పలుతెరంగులైన అతిసారములును, గ్రహణీరోగములును, గుల్మంబులును, అర్శోరోగము, ప్లీహవృద్ధి వీనినన్నిటిని హరించును.

## గ్రహణియందు ఆహారమునకు పంచకోలాదియూషములు.

మూ. పఞ్చకోలకయూషశ్చ మూలకానాం చ సోషణః. 115
స్నిగ్ధో దాడిమతక్రామ్లో జాఙ్గలః సంస్కృతో రసః,
క్రవ్యాదస్వరసః శస్తో భోజనార్థే సదీపనః. 116

వ్యా. పంచకోలములచే సిద్ధమయినయూషమునందును, ముల్లంగిచే సిద్ధమయినయూషమునందును, మిరియాలచూర్ణమును కలిపి నేతినిచేర్చి దానిమ్మరసమును, మజ్జిగను, పులుపుకుబదులు చేర్చియైనను; జాంగలజంతువులమాంసరసమును సంస్కరించియైనను; మాంసమును తినునట్టి జంతువులమాంసరసమునునైనను; భోజనమునకై యుపయోగించినచో జాఠరాగ్నిని దీపింపజేయును. మజ్జిగనైనను, పుల్లనిగంజియైనను, మద్యమునైనను, అరిష్టములనైనను, పానమునకై యుపయోగింపదగును.

## తక్రగుణములు, గ్రహణ్యాదులయందు తక్రోపయోగప్రాశస్త్యము.

మూ. తక్రన్తు గ్రహణీదోషే దీపనగ్రాహిలాఘువాత్. 117

శ్లేష్మం మధురపాకిత్వాత్ న చ పిత్తం ప్రకోపయేత్,
కషాయోష్ణవికాసిత్వాత్ రౌక్ష్యాచ్చైవ కఫే హితమ్. 118
వాతే స్వాద్వమ్లసాన్ద్రత్వాత్ సద్యస్కమవిదాహి తత్,
తస్మాత్తక్రప్రయోగా యే జాఠరాణాం తథాఽర్శసామ్. 119
విహితా గ్రహణీదోషే సర్వశస్తాన్ ప్రయోజయేత్,

వ్యా. మజ్జిగ లఘుగుణము కల్గియుండుటవలన జాఠరాగ్నిని దీపింపజేసి మల ప్రవృత్తిని నిలుపును; కావున గ్రహణీరోగమున నుపయోగించుటకు మిగుల శ్రేష్ఠముగ నుండును. మరియు మజ్జిగ అమ్లరసముకల్గియును మధురవిపాకము నొందుటవలన పిత్తమును ప్రకోపింపజేయదు. (ప్రకోపించియున్నపుడు శమింపచేయనేరదు). వగరు రసంబును, ఉష్ణవీర్యంబును, వికాసి (శరీరమునంతట వ్యాపించు) గుణంబును, రూక్షగుణంబును కల్గియుండుటవలన కఫహరమై యుండును ; కావున కఫమున హితకరముగ నుండును. అప్పుడే చిలకబడినతక్రము కొంచెము తీపియు పులుపునుకల్గి చిక్కనై యుండుటవలన పచ్యమానావస్థయందు విదాహవిపాకము నొందదు; కావున వాతమునందును మిక్కిలి హితముగనుండును. ఇత్తెరంగున త్రిదోషహరంబును పాచనదీపనంబును నగుతక్రమునకు సంబంధించినప్రయోగములు ఉదరరోగములయందును అర్శోరోగములయందును విశేషముగ నేవి చెప్పబడినవియో ఆయోగముల నన్నిటిని గ్రహణీరోగములయందును విశేషముగ నుపయోగింపనగును. (అప్పుడు చిలకబడినమజ్జిగ స్వాదు-అమ్ల-సాంద్రగుణములు కల్గియుండుటంజేసి పచ్యమానావస్థయందు విదగ్ధముగ పాకమునొందదని "అవిదాహి తత్" అని నిర్దేశింపబడినది.)

## గ్రహణిదోషమునకు తక్రారిష్టము.

మూ. యవాన్యామలకే పథ్యా మరిచం త్రిపలాంశకమ్. 120
లవణాని పలాంశాని పఞ్చ చైకత్ర చూర్ణయేత్,
తక్రకంసాసుతం (తక్రే తదాసుతం) జాతం తక్రారిష్టం పిబేన్నరః.
దీపనం శోథగుల్మార్శః క్రిమిమేహోదరాపహం,

(ఇతి తక్రారిష్టః.)

వ్యా. ఓమము, ఉసిరికకాయలయొలుపు, కరకకాయలబెరడు, మిరియాలు, ఇవి ప్రత్యేక మొక్కొకపలము పంచలవణములును ప్రత్యేక మొక్కొకపలము వీనినన్నిటి నొకటిగగూర్చి చూర్ణముచేసి, ఒకకాస (ఆఢక)పరిమితమగుమజ్జిగలో జేర్చి యొకకుండలో

బోసి మూసి వానెనగట్టి పదిలముగ నుంచునది. అయ్యది చక్కగ పులిసినయెడ తక్రారిష్ట మనబడును. దీనిని త్రాగినచో జాఠరాగ్నిని దీపింపజేయును. శోథముల (నంజుల)ను, గుల్మములను, అర్శస్సులను, క్రిములను, ప్రమేహములను, ఉదరములను హరించును. (ఇంతదనుక వాతికగ్రహణీచికిత్స చెప్పబడినది.)

పైత్తికగ్రహణీచికిత్సాక్రమము, అందు వమన-విరేచనక్రమము.

మూ. స్వస్థానగతముత్క్లిష్టం అగ్నినిర్వాపకం భిషక్. 122
పిత్తం జ్ఞాత్వా విరేకేణ నిర్హరేత్ వమనేన వా,

వ్యా. పిత్తము స్వస్థానమున గ్రహణియందుండి యుద్రేకము జెంది, గ్రహణి నాశ్రయించియుండుజాఠరాగ్నిని (తనయందలి ద్రవభాగముచేత) చల్లార్చును. అట్టి యవస్థను వైద్యుడు గమనించి వమనవిరేచనములచే బైట వెడలించవలెను. (పచ్యమానావస్థయందు ఏర్పడు పిత్తద్రవము జాఠరాగ్నిని చల్లార్ప జూచును; కావున నయ్యది యూర్ధ్వభాగమున నున్నచో వమనముచేయించియు, అధోభాగమున నున్నచో విరేచనముచేయించియు దానిని బైటవెడలింపవలెనని భావము.)

పైత్తికగ్రహణియందు అగ్నిదీపనములైనయన్నపానములు.

మూ. అవిదాహిభిరన్నైశ్చ లఘుభిస్తిక్తసంయుతైః,
జాఙ్గలానాం రసైర్యూషైః ముద్గాదీనాం ఖడైరపి. 123
దాడిమామ్లైస్ససర్పిష్కైః దీపనగ్రాహిసంయుతైః,
తస్యాగ్నిం దీపయేచ్చూర్ణైః సర్పిర్భిశ్చాపి తిక్తకైః. 124

వ్యా. పైజెప్పినరీతిగ పిత్తమును వెడలించినపిదప విదాహావస్థ నొందించకయుండునవియు, తేలికగ జీర్ణమగుస్వభావము కల్గినవియు నగునన్నములతో తిక్తరసమును కలిపి వానిచేతను, దానిమ్మరసమును నేతిని జేర్చి పక్వముచేయబడిన జాంగలజంతుమాంసరసములచేతను, పెసలు మున్నగువానిచే సిద్ధముజేయబడిన ఖడయూషములను అగ్నిదీపనములనిరోధముచేయు ద్రవ్యములచే సంస్కరించి వానియుపయోగముచేతను, అగ్నిని దీపింపజేయవలెను. మరియు నగ్నిని దీపింపజేయు చూర్ణములను తిక్తకాదిసిద్ధఘృతములను ఉపయోగించి యగ్నిని దీపింపజేయవలెను.(ఇచ్చట "సర్పిర్భిశ్చాపి తిక్తకైః" అను చోట కుష్ఠచికిత్సలో చెప్పబడిన తిక్తకఘృతములు రెండును, తిక్తద్రవ్యముల చేర్చి యథోచితముగ సిద్ధముచేయబడిన యితరఘృతములును గ్రహింపబడును.)

## పైత్తికగ్రహణికి చందనాదిఘృతము.

మూ. చన్దనం పద్మకోశీరం పాఠాం మూర్వాం కుటంనటం,
షడ్గ్రన్థాశారివాస్ఫోతాసప్తపర్ణాటరూషకాన్. 125
పటోలోదుమ్బరాశ్వత్థవటప్లక్షకపీతనాన్,
కటుకాం రోహిణీం ముస్తం నిమ్బఞ్చ ద్విపలాంశికమ్ (కాన్).126
ద్రోణేఽపాం సాధయేత్; పాదశేషే ప్రస్థం ఘృతాత్పచేత్,
కిరాతతిక్తేన్ద్రయవవీరామాగధికోత్పలైః. 127
కల్కైరక్షసమైః పేయం తత్పిత్తగ్రహణీ గదే,
తిక్తకం యద్ఘృతం చోక్తం కౌష్ఠికే తచ్చ దాపయేత్. 128
(ఇతి చన్దనాద్యం ఘృతమ్.)

వ్యా. శ్రీగంధము, పద్మకము, వట్టివేరు, విషబొద్ది, చాగ, దుంఢిగపు (పెద్ద) మ్రానిచెక్క, వస, సుగందపాల, అడవిమల్లె, యేడాకులపొన్న, అడ్డసరపాకు, చేదుపొట్ల, అత్తిమ్రానిచెక్క, రావిచెక్క, మఱ్ఱిచెక్క, జువ్విచెక్క, కలజువ్విచెక్క, కటుకరోహిణి, తుంగగడ్డలు, వేపచెక్క ఇవి ఒక్కొక్కటి రెండేసిపలములు వీనినన్నిటిని నలియగొట్టి ద్రోణ (నాలుగు ఆఢకములు) పరిమితమైన జలమునచేర్చి నాల్గవపాలు (ఒకఆఢకము) మిగులునట్లు కషాయముకాచి యాకషాయమున ఒకప్రస్థము (పదునారు పలములు) ఘృతమునుచేర్చి అందు నేలవేము, కొడిశపాలవిత్తులు, కాకోళి, పిప్పళ్లు, నల్లకలువలు వీనిని ఒక్కొక్కదానిని ఒక్కొక్క కర్షప్రమాణమువంతునచేర్చి నూరి కల్కముగచేసి కల్పి ఘృతపాకవిధిప్రకారము పక్వముచేయునది. ఈఘృతమును అగ్నిబలానుసారము పిత్తగ్రహణియందు పానము చేయదగును. మరియు కుష్ఠచికిత్సితమున "నిమ్బపటోలం......కుష్ఠజ్వరగుల్మార్శోగ్రహణీపాణ్డ్వామయశ్వయథుహారీ" (చ. చి. అధ్యాయము. 7. శ్లో. 140) అని చెప్పబడిన తిక్తకఘృతమునైనను, పానముచేయతగును.

ఘృతకల్పనము:—ఇచ్చట చందనాదిక్వాథ్యద్రవ్యములను ఒక్కొక పలమువంతున చేర్చి ద్రోణ (నాలుగాఢకములు) పరిమితమైనజలమున చేర్చి నాల్గవవంతు మిగులునట్లు కషాయము కాచినచో కషాయము ఒకఆఢక మేర్పడును. దానిని పడకట్టి అందు ఒక ప్రస్థము (పదునారుపలములు ఘృతమును చేర్చినయెడ క్వాథమునకు నాలుగవవంతు ఘృత మేర్పడును. అందు నేలవేము మున్నగునవి ప్రత్యేక మొక్కొక్కకర్షము (కాలుపలము) వంతున కల్కమును చేర్చి ఘృతపాకవిధిప్రకారము పక్వముచేయనగును. ఇది పైమూలము ననుసరించియు పరిభాషానుసారముగను నేర్పడిన కల్పనావిధానము.

మరియు వాగ్భటాచార్యులు గ్రహణీచికిత్సితమున నీయోగమును ఈయూను పూర్వసే పఠించెను కాని "ప్రస్థఘృతాత్ పచేత్" అని ఇచ్చట చెప్పబడిన ఘృతమాన మును మాత్రము చెప్పియుండలేదు. సర్వాంగసుందరవ్యాఖ్యానమున "అత్ర సర్పిః ప్రమాణం క్వాథాపేక్షయా ద్వాత్రింశత్పలాని కల్ప్యాని" (అ. హృ. వ్యా. చి. అ. 10. శ్లో. 41) అని ఘృతపరిమాణము ముప్పదిరెండుపలములని చెప్పిరి. ఈపక్షమున పాదావశిష్టమయిన క్వాథము ఘృతమునకు ద్విగుణితమగును. ఈతంత్రప్రకారము ప్రస్థ పరిమితఘృతమునకు క్వాథము నాలుగింత లేర్పడును. ఇదియే భేదము.

## పైత్తికగ్రహణికి నాగరాదిచూర్ణము.

మూ. నాగరాదివిషే ముస్తం ధాతకీం చ రసాఞ్జనం,
వత్సకత్వక్ఫలం బిల్వం పాఠాం కటుకరోహిణీమ్. 129
పిబేత్సమాంశం తచ్చూర్ణం సక్షౌద్రం తణ్డులామ్బునా,
పైత్తికే గ్రహణీదోషే రక్తం యచ్చోపవేశ్యతే. 130
అర్శాంసి చ గుదే శూలం జయేచ్చైవ ప్రవాహికాం,
నాగరాద్యమిదం చూర్ణం కృష్ణాత్రేయేణ పూజితమ్. 131
(ఇతి నాగరాద్యం చూర్ణమ్.)

వ్యా. శుంఠి, అతివస, తుంగగడ్డలు, ఆరెపువ్వు, రసాంజనము, కొడిశపాలపట్ట, కొడిశపాలవిత్తులు, మారేడుపట్ట, విషబొద్ది, కటుకరోహిణి వీనినన్నిటిని సమభాగములుగ చేర్చి మెత్తనిచూర్ణముగ చేసి బియ్యపుకడుగునీటిలో కలిపి అందు తేనెను చేర్చి పిత్త ముచే కల్గిన గ్రహణీరోగమునందును, రక్తవిరేచనమునందును, అర్శోరోగమునందును, త్రాగవలయును. మరియు దీనివలన గుదస్థానమున కల్గినశూలంబును, ప్రవాహికయు, హరించును. ఈనాగరాదిచూర్ణము కృష్ణాత్రేయులచే సాఖ్యముగ కొనియాడబడినది. (ఇచ్చట కృష్ణాత్రేయులన అగ్నివేశునకు గురువగు నాత్రేయులనియే యర్థము.)

## పైత్తికగ్రహణికి భూనింబాదిచూర్ణము.

మూ. భూనిమ్బకటుకావ్యోషముస్తకేన్ద్రయవాన్సమాన్,
ద్వౌ చిత్రకాద్వత్సకత్వగ్భాగాన్ షోడశ చూర్ణయేత్. 132
గుడశీతామ్బునా పీతం గ్రహణీదోషగుల్మనుత్,
కామలాజ్వరపాణ్డుత్వమేహారుచ్యతిసారనుత్. 133
(ఇతి భూనిమ్బాదిచూర్ణం.)

వ్యా. నేలవేము, కటుకరోహిణి, శుంఠి, పిప్పలి, మిరియాలు, తుంగగడ్డలు, కొడిసెపాలవిత్తులు, ఇవియన్నియు నొక్కొకభాగమువంతున సమభాగములు. చిత్రమూలు రెండుభాగములు, కొడిసెపాలపట్ట పదునారుభాగములు ఈభాగములవంతున పైజెప్పినవాని నన్నిటిని నొకటిగ చేర్చి చక్కగ చూర్ణముచేసి చల్లనినీటిలోకలిపి అందు కొంచెము బెల్లమున కలిపి త్రాగినచో గ్రహణీదోషములను, గుల్మములను, కామలను, జ్వరమును, పాండురోగమును, ప్రమేహములను, అరుచిని, అతిసారమును హరించును. (ఇచ్చట బెల్లమును పానకమువలె మితమైన తీపుకల్గునంత పరిమాణము చేర్చునది.)

## పైత్తికగ్రహణికి వచాదిచూర్ణము.

మూ. వచామతివిషాం పాఠాం సప్తపర్ణం రసాఞ్జనం,
శ్యోనాకోదీచ్యకట్వఙ్గవత్సకత్వగ్దురాలభాః. 134
దార్వీం పర్పటకం పాఠాం (మూర్వాం) యవానీం మధుశిగ్రుకం,
పటోలపత్రం సిద్ధార్థాన్యూధికాం జాతిపల్లవాన్. 135
జమ్బ్వామ్రబిల్వమధ్యాని నిమ్బశాఖఫలాని చ,
తద్రోగశమమన్విచ్ఛన్ భూనిమ్బాద్యేన యోజయేత్. 136
(ఇతి వచాద్యం చూర్ణం.)

వ్యా. వస, అతివస, విషబొద్ది, ఏడాకులపొన్న, రసాంజనము, పెద్దగింజలుగల దుండిగము, కురువేరు, చిన్నగింజలుగల దుండిగము, కొడిశపాలపట్ట, దురదగొండి, మ్రానిపసుపు, పర్పాటకము, చాగపట్ట, ఓమము, యెఱ్ఱమునగపట్ట, చేదుపొట్లాకు, తెల్లావాలు, అడవిమల్లె, జాజిచిగుళ్లు, నేరేడుపప్పు, మామిడిపప్పు, మారేడుగుజ్జు, వేపచిగుళ్లు, వేపకాయలు, వీని నన్నిటిని సమభాగములుగ చేర్చి చూర్ణముగ చేసి పైని భూనింబాదిచూర్ణమునకు చెప్పినరీతిగ బియ్యపుకడుగునీళ్లలో చేర్చి బెల్లమును కలిపి త్రాగినయెడ భూనింబాదిచూర్ణమున చెప్పినరీతిగ గ్రహిణిగుల్మములు మొదలగురోగములన్నియు శమించును.

## పైత్తికగ్రహణియందు కిరాతతిక్తాదిచూర్ణము.

మూ. కిరాతతిక్తః షడ్గ్రన్థా త్రాయమాణా కటుత్రికం,
చన్దనం పద్మకోశీరం దార్వీత్వక్ కటురోహిణీ. 137
కుటజత్వక్ఫలం ముస్తం యవానీ దేవదారు చ,
పటోలనిమ్బపత్త్రైలాసౌరాష్ట్ర్యతివిషాత్వచః 138

మధుశిగ్రోశ్చ బీజాని మూర్వాపర్పటకస్తథా,
తచ్చూర్ణం మధునా లేహ్యం పేయం మద్యైర్జలేన వా. 139
హృత్పాణ్డుగ్రహణీరోగగుల్మశూలారుచిజ్వరాన్,
కామలాం సన్నిపాతం చ ముఖరోగాంశ్చ నాశయేత్. 140
(ఇతి కిరాతతిక్తాద్యం చూర్ణం.)

వ్యా. నేలవేము, వస, కలుక్రానుగ, త్రికటుకములు, చందనము, పద్మకము, వట్టివేళ్లు, మ్రానిపసుపుచెక్క, కటుకరోహిణి, కొడిశపాలపట్ట, కొడిశపాలవిత్తులు, తుంగగడ్డలు, ఓమము, దేవదారుచెక్క, చేదుపొట్ల, వేప, లవంగపత్రి, ఏలకులు, తువరిమన్ను, అతివస, లవంగపట్ట, ఎఱ్ఱమునగవిత్తులు, చాగపట్ట, పర్పాటకము; వీని నన్నిటిని సమభాగములుగ చేర్చి చూర్ణము చేసి తేనెలో కలిపి సేవించునది లేక మద్యములతోనైనను, నీళ్లతోనైనను కలిపి త్రాగునది. దీనివలన హృద్రోగము పాండురోగము, గ్రహణీరోగము, గుల్మములు, శూల, అరుచి, జ్వరము, కామల, త్రిదోషములసన్నిపాతము, ముఖరోగములు, ఇవియన్నియు హరించును. (ఇంతదనుక పైత్తికగ్రహణి చికిత్స చెప్పబడినది.)

కఫజగ్రహణీరోగచికిత్సాక్రమము, అందు శోధన-దీపనచికిత్స.

మూ. గ్రహణ్యాం శ్లేష్మదుష్టాయాం వమితస్య యథావిధి,
కట్వమ్లలవణక్షారైః తిక్తైశ్చాగ్నిం వివర్ధయేత్. 141

వ్యా. కఫముచే దుష్టమైన గ్రహణియందు విధ్యుక్తప్రకారము రోగికి తొలుత వమనముచేయించి, పిదప కారము, పులుపు, ఉప్పు, క్షారము, అనునీరసములు కలద్రవ్యముల నుపయోగించి క్రమముగ జాఠరాగ్నిని వృద్ధినందించవలెను.

కఫజగ్రహణియందు పానీయము.

మూ. పలాశం చిత్రకం చవ్యం మాతులుఙ్గం హరీతకీం,
పిప్పలీం పిప్పలీమూలం పాఠాం నాగరధాన్యకమ్. 142
కార్షికాణ్యుదకప్రస్థే పక్త్వా పాదావశేషితమ్,
పానీయార్థం ప్రయుఞ్జీత;

వ్యా. మోదుగ, చిత్రమూలము, చవ్యము, మాదీఫలములు, కరకకాయలబెరడు, పిప్పళ్లు, మోడి, చిరుబొద్ది, శుంఠి, దనియాలు, వీనిని ప్రత్యేక మొక్కొక కర్షము

వంతున జేర్చి నలియగొట్టి ఒక ప్రస్థపరిమితమైన జలమున చేర్చి నాల్గవవంతు మిగులు నట్లు కాచి యాకషాయమును త్రాగుటకు నీళ్లకు బదులుగ నుపయోగించవలెను.

కఫజగ్రహణీరోగమున యవాగ్వాది లఘ్వాహారములు.

మూ. యవాగూం తైశ్చ సాధయేత్. 143

శుష్కమూలకయూషేణ కౌలుత్థేనాథ వా పునః,
కట్వమ్లక్షారపటునా లఘూన్యన్నాని భోజయేత్. 144

వ్యా. పైజెప్పబడిన పలాశాదిద్రవ్యముల జేర్చి సిద్ధముచేయబడిన యవాగువును శ్లైష్మికగ్రహణిరోగి కాహారముగ నియ్యవలెను.

మరియు:—ఎండిన ముల్లంగిచే సిద్ధము చేయబడిన యూషమునైనను, ఉలవల జేర్చి సిద్ధముచేయబడిన యూషమునైనను, కటు-అమ్ల-క్షారముల జేర్చి సిద్ధమై యింద్రియోత్తేజకములును చులకనగ జీర్ణములగునవియు నైన యాహారములయందు చేర్చి భుజింపజేయనగును. (ఇచ్చట-"కట్వమ్లక్షారపటునా" అనుచోట కారము పులుపు ఉప్పును కలియుంటచేత ఇంద్రియముల తేటపరచుటకు సమర్థములగు నాహారములని యర్థము. "కట్వాదియోగాత్, పటునా ఇంద్రియోత్తేజకేన" అని చక్రపాణిదత్త వ్యాఖ్యానమున నున్నది.)

కఫజగ్రహణీరోగమున ఆహారానుపానములు.

మూ అమ్లం చాఽనుపిబేత్తక్రం తక్రారిష్టమథాపి వా,
మదిరాం మధ్వరిష్టం వా నిగదం శీధుమేవ వా. 145

వ్యా. పైజెప్పిన రీతిగ తేలికయైన యాహారమును చేసినపిదప చక్కగ పులిసిన మజ్జిగను పానముచేయవలెను. లేక తక్రారిష్టమునైనను, మదిర యనుమద్యమునైనను, మధ్వరిష్టమునైనను, నిర్దోషమైన శీధుమద్యమునైనను అనుపానముగ త్రాగవలెను.

మధూకాసవము.

మూ. ద్రోణం మధూకపుష్పాణాం, విడఙ్గానాం తతోఽర్ధతః,
చిత్రకస్య తతోఽర్ధం స్యాత్, తథా భల్లాతకాఢకమ్. 146
మఞ్జిష్ఠాఽష్టపలం చైవ, త్రిద్రోణేఽపాం విపాచయేత్,
ద్రోణశేషం తు తచ్ఛీతం మధ్వర్ధాఢకసంయుతమ్. 147
ఏలామృణాళాఽగురుభిః చన్దనేన చ రూషితే,

కుమ్భే మాసస్థితం జాతం ఆసవం తం ప్రయోజయేత్. 148
గ్రహణీం దీపయత్యేషః బృంహణః కఫపిత్తజిత్,
(బృంహణోఽనిలరోగజిత్.)
శోథం కుష్ఠం కిలాసం చ ప్రమేహాంశ్చ ప్రణాశయేత్. 149
(ఇతి మధూకాసవః.)

వ్యా. ఒకద్రోణము (నాలుగాఢకములు) ఇప్పపువ్వులు, అర్ధద్రోణము (రెండాఢకములు) వాయువిడంగములు, దానికి సగము (ఒక ఆఢకము) చిత్రమూలము, జీడిగింజలు ఒక ఆఢకము, మంజిష్ఠ యెనిమిదిపలములు, ఈభాగప్రకారము వీని నన్నింటిని చేర్చి నలియగొట్టి, మూడుద్రోణముల పరిమితమైన జలమున జేర్చి, ఒకద్రోణము మిగులునట్లు కషాయముకాచి, అదిచల్లారినపిదప నందు అర్ధాఢకము (రెండుప్రస్థములు-ముప్పదిరెండుపలములు) తేనె కలిపి యుంచునది. పిమ్మట ఏలకులు, తామరతూండ్లు, అగరు, శ్రీగంధపుచెక్క, వీనిని సమభాగములుగ జేర్చి నూరి యొక క్రొత్తకుండలోభాగమున పూసి నీడ నెండించి యాకుండలో పైసిద్ధముచేయబడిన కషాయము బోసి వాసెనగట్టి యొకమాసమువరకును పదిలముగ నుంచునది. అయ్యది పులుపెక్కినపిదప నాయాసవము నుపయోగింపవలెను. ఈయాసవము గ్రహణిని దీపింపజేయును. శరీరమును పుష్టిగజేయును. కఫపిత్తముల హరించును. శోథము, కుష్ఠము, కిలాసమను క్షుద్రకుష్ఠము, ప్రమేహములు, అను నీరోగముల నన్నింటిని నశింపజేయును. (ఇది మధూకాసవమనబడును.)

### ప్రకారాంతరముగ మధూకపుష్పాసవకల్పనము.

మూ. మధూకపుష్పస్వరసం శృతమర్ధక్షయీకృతం,
క్షౌద్రపాదయుతం శీతం పూర్వవత్సన్నిధాపయేత్. 150
తం పిబన్ గ్రహణీదోషాన్ జయేత్సర్వాన్ హితాశనః,
తద్వత్ ద్రాక్షేక్షుఖర్జూర(కాశ్మర్య)స్వరసాన్ ఆసుతాన్ పిబేత్.

వ్యా. ఇప్పపువ్వుల స్వరసమును కాచి సగము మిగిలియుండగ దించి చల్లారినపిదప దానికి నాల్గవవంతు తేనెను కలిపి, పైయోగమునజెప్పినరీతిగ ఏలకులు, చందనము, తామరకాడలు, అగరు, వీని సమభాగములుగ నూరి పూసి యెండింపబడిన క్రొత్తకుండలో బోసి యొకమాసమువరకును వాసెనగట్టి పదిలముగ నునిచి పులిసిన యాసవమును త్రాగి వాతాహారమును సేవించినచో గ్రహణీదోషముల నన్నిటిని జయించును.

మరియు ఈకల్పము ననుసరించి ద్రాక్షారసమును చెరకురసమును ఖర్జూరపుపండ్లస్వరసమును ఆసవసంధానము చేసి సేవించినయెడ గ్రహణీరోగము లన్నియు నివర్తించును.

కఫజగ్రహణికి దురాలభాఽరిష్టము.

మూ. ప్రస్థౌ దురాలభాయాః ద్వౌ, ప్రస్థమామలకస్య చ,
ముష్టిః చిత్రక-దన్త్యోర్ద్వే, ప్రత్యగ్రం చాఽభయాశతమ్. 152
చతుర్ద్రోణేఽమ్భసః పక్త్వా శీతం ద్రోణావశేషితం,
సగుడద్విశతం పూతం మధునః కుడవాయుతమ్. 153
తద్వత్ప్రియఙ్గోః పిప్పల్యాః విడఙ్గానాం చ చూర్ణితైః,
కుడవైః, ఘృతకుమ్భస్థం పక్షాజ్జాతం తతః పిబేత్. 154
గ్రహణీపాణ్డురోగార్శః కుష్ఠవీసర్పమేహనుత్,
స్వరవర్ణకరశ్చైషః రక్తపిత్తకఫాఽపహః. 155

(ఇతి దురాలభాసవః)

వ్యా. దురదగొండి రెండుప్రస్థములు (ముప్పదిరెండుపలములు), ఉసిరికకాయలబెరడు ఒకప్రస్థము, చిత్రమూలము దంతివేళ్లను (ఒక్కొకపలమువంతున చేరి) రెండుపలములు, నూరు క్రొత్తకరకకాయలబెరడు, ఈభాగముల ప్రకారము అన్నిటిని చేర్చి దంచి నాల్గుద్రోణముల నీళ్లలో చేర్చి, యొకద్రోణపరిమితకషాయము మిగులునట్లు చుండకాచి, వడగట్టి అందు రెండువందలపలములు బెల్లమును, ఒక కుడవము నాల్గుపలములు) తేనెను కలిపి, పైజెప్పిన రీతిగ ఏలకులు మున్నగువానిపిష్టమును బూని యెండించిన నేతితో మాగిన కుండలో బోసి, అందు ప్రేంకణము, పిప్పళ్లు, వాయువిడంగములు, వీనిని ప్రత్యేకము ఒక్కొకకుడవము (నాలుగేసిపలముల) వంతున చూర్ణము చేసి కలిపి, మూసి వాసెనగట్టి యొకపక్షమువరకును పదిలముగ నుంచునట్లునిచి, పులుపైన పిదప త్రాగవలెను.

దీనిని సేవించినయెడ గ్రహణీదోషంబులను, పాండురోగములను, అర్శోరోగమును, కుష్ఠములను, విసర్పములను, ప్రమేహములను హరించును. కంఠస్వరమును బాగుచేయును. మంచివర్ణమును కల్గించును. రక్తపిత్తమును కఫమును హరించును. ఇయ్యది దురాలభాసవమని చెప్పబడును.

### మూలాసవవిధానము.

మూ. హారిద్రా పఞ్చమూలే ద్వే వీరర్షభకజీవకమ్,
ఏషాం పఞ్చ(పృథక్)పలాన్ భాగాన్ చతుర్ద్రోణేఽమ్భసః పచేత్.
ద్రోణశేషే రసే పూతే గుడస్య ద్విశతం భిషక్,
చూర్ణితాన్ కుడవాఽర్ధాంశాన్ ప్రక్షిపేచ్చ సమాక్షికాన్. 157
ప్రియఙ్గుముస్తమఞ్జిష్ఠావిడఙ్గమధుకప్లవాన్,
లోధ్రం శాబరకం చైవ మాసార్ధస్థం పిబేత్తు తత్. 158
ఏష మూలాసవస్సిద్ధః దీపనో రక్తపిత్తజిత్,
ఆనాహకఫహృద్రోగపాణ్డురోగాఽఙ్గసాదనుత్. 159

(ఇతి మూలాసవః.)

వ్యా. పసుపు, రెండువిధములైన పంచమూలములు (దశమూలములు), క్షీరకాకోళి, ఋషభకము, జీవకము, వీనిని ప్రత్యేకము ఐదేసిపలములవంతున జేర్చి దంచి నాల్గుద్రోణముల పరిమితమగు నీళ్లలో జేర్చి ద్రోణపరిమితము కషాయము మిగులునట్లు కషాయముకాచి వడగట్టి, అందు రెండువందలపలములు బెల్లమును కలిపి; ప్రేంకణము, తుంగగడ్డలు, మంజిష్ఠి, వాయువిడంగములు, అతిమధురము, నాగముస్తలు, లొద్దుగుపట్ట, తెల్లలొద్దుగుపట్ట, వీని నన్నిటిని ప్రత్యేకము అర్ధకుడవము (రెండేసిపలముల)వంతున చూర్ణముచేసి కలిపి, రెండుపలములు తేనెను కూడ జేర్చి, పైజెప్పినరీతిగ ఏలకులు మున్నగువాని పిష్టమును బూసి యెండించిన నేతితోమాగిన కుండలో బోసి మూసి వాసెనగట్టి పదునైదుదినములకాలము పదిలముగ నునిచి, పిమ్మట సేవించునది. ఇయ్యది మూలాసవమని చెప్పబడును.

దీనిని త్రాగినయెడ నగ్నిని దీపింపజేయును, రక్తపిత్తమును హరించును. మరియు కడుపుబ్బరము, కఫము, హృద్రోగము, పాండురోగము, శరీరకార్శ్యము, అనునీవ్యాధులను హరించును.

### పిండాసవము.

మూ. ప్రస్థికం పిప్పలీం పిష్ట్వా గుడం మధ్యం విభీతకాత్,
ఉదకప్రస్థసంయుక్తం యవపల్లే నిధాపయేత్. 160
తస్మాత్ పలం సుజాతాత్తు సలిలాఞ్జలిసంయుతమ్,
పిబేత్ పిణ్డాసవో హ్యేషః రోగానీకవినాశనః. 161

స్వస్థోఽప్యేవం పిబేన్మాసం నరః స్నిగ్ధరసాశనః,
ఇచ్ఛంస్తేషామనుత్పత్తిం రోగాణాం యేఽత్ర కీర్తితాః 162
(ఇతి పిణ్డాసవః.)

వ్యా. ఒకప్రస్థపరిమితమైన పిప్పళ్లను తానికాయవిత్తులను చేర్చి నూరి చూర్ణము చేసి బెల్లమును కలిపి నేతితో మాగినకుండలో నునిచి ప్రస్థపరిమితము జలమును చేర్చి వాసెనకట్టి చీలమన్ను లేపనము జేసి ధాన్యపురాశిలో నునిచి, అయ్యది చక్కగ పులిసినపిదప నొకపలపరిమితమును అంజలి (నాల్గుపలముల) పరిమితజలమున జేర్చి ప్రతిదినంబును సేవించునది. ఇయ్యది పిండాసవమని చెప్పబడును. ఇది రోగముల నన్నిటిని హరించును. పైజెప్పబడిన రోగము లన్నియు నివర్తించుటయే గాక మరల పొడసూపకుండును. రోగములు లేక స్వస్థత నున్నప్పుడును ఈయాసవమును ప్రతిదినము సేవించుచున్నయెడ గ్రహణి మున్నగు రోగము లెన్నడును కల్గవు.

కఫజగ్రహణికి మధ్వరిష్టము.

మూ. నవే పిప్పలిమధ్వాక్తే కలశేఽగురుధూపితే,
మధ్వాఢకం జలసమం చూర్ణానీమాని దాపయేత్. 163
కుడవార్ధం విడఙ్గానాం పిప్పల్యాః కుడవం తథా,
చతుర్థికాంశాం త్వక్క్షీరీం కేసరం మరిచాని చ. 164
త్వగేలాపత్రకశటీక్రముకాఽతివిషాఘనమ్,
హరేణ్వేల్వాలు తేజోహ్వాపిప్పలీమూలచిత్రకాన్. 165
కార్షికాంస్తాన్ స్థితం మాసం అత ఊర్ధ్వం ప్రయోజయేత్,
మన్దం సన్దీపయత్యగ్నిం కరోతి విషమం సమమ్. 166
హృత్పాణ్డుగ్రహణీరోగకుష్ఠార్శః శ్వయథుజ్వరాన్,
వాతశ్లేష్మామయాంశ్చాన్యాన్ మధ్వరిష్టో వ్యపోహతి. 167
(ఇతి మధ్వరిష్టః)

వ్యా. పిప్పళ్లను తేనె బోసి నూరి యొక క్రొత్తకుండ లోపలిభాగమున దట్టముగ పూసి అగరుధూపముచే పొగబట్టి అందు అఢకపరిమితమగు తేనెను, దానికి సమభాగము జలమును పోయునది. మరియు వాయువిడంగములు అర్ధకుడవము (రెండుపలములు), పిప్పళ్లు ఒకకుడవము (నాల్గుపలములు), త్వక్‌క్షీరి (వెదురుప్పు), నాగకేసరములు, మిరియాలు, ఇవి ప్రత్యేకము చతుర్థిక (ఒక్కొకపలము); లవంగపుపట్ట, ఏలకులు, లవంగపుపత్రి, కచోరములు, పోకచెక్కలు, అతివస, తుంగగడ్డలు,

రేణకలు, నూగుదోసగింజలు, జ్యోతిష్మతి (మాల్కంగిని), మోడి, చిత్రమూలము, ఇవి ప్రత్యేకముగ నొక్కొకకర్షము (రెండుపలము); వీని నన్నిటిని పైజెప్పబడిన భాగప్రకారము చేర్చి చూర్ణముచేసి, పైజెప్పిన కుండలోని ద్రవముతో కలిపి మూసి వానెనగట్టి యొకమాసమువరకును ధాన్యరాశిలో నునిచి, పిమ్మట నుపయోగించవలెను. ఇది మధ్వరిష్ట మనబడును. దీని నుపయోగించినయెడ మందమైన జాఠరాగ్నిని దీపింపజేయును. విష మాగ్నిని సమస్థితికి దెచ్చును. మరియు హృద్రోగము, పాండురోగము, గ్రహణీ రోగము, కుష్ఠములు, అర్శస్సులు, వాపు, జ్వరము, ఇతరములగు పలువెరంగులైన వాత కఫరోగములు, వీనినన్నిటిని హరించును.

### శ్లైష్మికగ్రహణియందు అగ్నివర్ధక పిప్పల్యాదిచూర్ణము.

మూ. సమూలాం పిప్పలీం క్షారౌ ద్వౌ పఞ్చ లవణాని చ,
మాతులుఙ్గాఽభయారాస్నా శటీమరిచనాగరమ్. 168
కృత్వా సమాంశం, తచ్చూర్ణం పిబేత్ప్రాతస్సుఖాम्బునా,
శ్లైష్మికే గ్రహణీదోషే బలవర్ణాఽగ్నివర్ధనమ్. 169

వ్యా. మోడి, పిప్పళ్లు, సర్జక్షారము, యవక్షారము, పంచలవణములు (సౌవర్చల లవణము, సైంధవలవణము, బిడాలవణము, ఔద్భిదలవణము, సముద్రలవణము), మాదీపలము, కరకకాయలబెరడు, సన్నరాష్ట్రము, కచోరములు, మిరియాలు, శుంఠి, వీని నన్నిటిని సమభాగములుగ గూర్చి చూర్ణముజేసి, శ్లేష్మముచే కల్గిన గ్రహణీరోగ మున ప్రతిదినంబున నుదయకాలమున సుఖోష్ణమైన నీళ్లతో కలిపి సేవించినచో బలమును జాఠరాగ్నిని వృద్ధినందించును శరీరమునకు వర్ణోత్కర్షమును కల్గించును.

### పిప్పల్యాదిఘృతము.

మూ. ఏతైరేవౌషధైస్సిద్ధం సర్పిః పేయం సమారుతే,
గౌల్మికే షట్పలం ప్రోక్తం భల్లాతకఘృతం చ యత్. 170

వ్యా. పైజెప్పబడిన మోడి మున్నగు ద్రవ్యములను కల్కముగ జేసి (కల్కమునకు నాల్గింతల ఘృతమును, ఘృతమునకు నాల్గింతల జలమును చేర్చి) ఘృతపాకవిధిప్రకారము పక్వముచేయబడిన ఘృతమును సేవించినను పైజెప్పిన గుణములు కల్గియుండును. మరియు—గుల్మచికిత్సయందు చెప్పబడిన షట్పలఘృతమునైనను, భల్లాతకఘృతమునైనను సేవించినచో పైజెప్పిన బల-వర్ణ-అగ్నులు వృద్ధినందును.

ఇచ్చట గుల్మచికిత్సితమున చెప్పబడిన "షట్పలం హి పిబేత్సర్పిః......మారుత గుల్మినాం" "భల్లాతకానాం ద్విపలం......గ్రహణీరోగనాశనమ్." (చి. అ. 5.) అనియు చెప్పబడిన షట్పల-భల్లాతకఘృతయోగముల నెరుంగునది.

—అగ్నిదీప్తికరక్షారఘృతము.—

మూ. బిడం కాలోత్థలవణం సర్జికాయవశూకజమ్,
సప్తలాం కణ్టకారీం చ చిత్రకం చేతి దాహయేత్. 171
సప్తకృత్వః స్రుతస్యాఽస్య క్షారస్య ద్వ్యాఢకేన తు,
(క్షారస్యాఽర్ధాఢకేన చ.)
ఆఢకం సర్పిషః పక్త్వా పిబేదగ్నివివర్ధనమ్. 172
(ఇతి క్షారఘృతమ్)

వ్యా. బిడాలవణము, కాల (సౌవర్చల) లవణము (నల్లనియుప్పు), సర్జక్షారము, యవక్షారము, సంబరేణు, వాకుడు, చిత్రమూలము వీని నన్నిటి నొకటిగ జేర్చి నిప్పులో కాల్చి బూడిదచేసి యాబూడిదెను జలమున కలిపి యేడుపర్యాయములు వడగట్టి యా క్షారజలమును రెండాఢకములను, ఆవునెయ్యి నొకయాఢకమును ఒకటిగ గూర్చి ఘృత పాకవిధిప్రకారము పక్వముచేసి పానముచేసిన జాఠరాగ్ని వృద్ధినొందును. ఇది క్షార ఘృతము.

ఇచ్చట ఘృతము ఆఢకపరిమితముగను, ద్రవరూపమైన క్షారోదకము రెండు ఆఢకములుగను పరిమితి చెప్పబడినది. వాగ్భటాచార్యులు "క్షారస్యాఽర్ధాఢకే పచేత్" (అ. హృ. చి. అ. ౧౦.) అని క్షారజలము అర్ధాఢకమని నిర్దేశించిరి. సర్వాంగసుందర వ్యాఖ్యానమున "సప్తవారానస్య క్షారస్య స్రుతస్య చార్ధాఢకే సర్పిషః ఆఢకం పచేత్." అని వివరింపబడినది. క్షారము నధికముగ జేర్చినయెడ ఘృతమున గుణాధిక్యము కల్గి తీవ్ర ముగ పనిచేయునని యెరుంగునది.

—పిప్పల్యాదిక్షారము.—

మూ. సమూలాం పిప్పలీం పాఠాం చవ్యేన్ద్రయవనాగరమ్,
చిత్రకాఽతివిషే హిఙ్గు శ్వదంష్ట్రాం కటురోహిణీమ్. 173
వచాం చ కార్షికం పఞ్చ లవణానాం పలాని చ,
దధ్నః ప్రస్థద్వయే తైలసర్పిషోః కుడవద్వయే. 174
చూర్ణీకృతాని (ఖండీకృతాని) నిష్క్వాథ్య శనైరన్తర్గతే రసే,

అన్తర్ధూమం తతో దగ్ధ్వా చూర్ణం కృత్వా ఘృతాప్లుతం. 175
పిబేత్పాణితలం తస్మిన్ జీర్ణే స్యాన్మధురాశనః,
వాతశ్లేష్మామయాన్ సర్వాన్ హన్యాద్విషగరాంశ్చ సః 176

వ్యా. పిప్పళ్లు, మోడి, చిరుబొద్ది, చవ్యము, కొడిసెపాలవిత్తులు, శుంఠి, చిత్రమూలము, అతివస, ఇంగువ, పల్లేరు, కటుకరోహిణి, వస ఇవి ప్రత్యేకముగ నొక్కొక కర్షము (కాలుపలము); లవణము లైదును ఒక్కొకపలమువంతున చేరి యైదుపలములు, ఈభాగముల ప్రకారము పైజెప్పినవాని నన్నింటి నొకటిగ చేర్చి చూర్ణముగ జేసియుంచునది; ఆవుపెరుగు రెండు ప్రస్థములును, నూనె రెండుకుడవములు (నాల్గుపలములు)ను, ఆవునెయ్యి రెండుకుడవములును ఈద్రవముల నన్నిటి నొకటిగ గూర్చి, ఇందు పైజెప్పిన చూర్ణమును కలిపి చక్కగ కాచి యాద్రవమంతయు చూర్ణముననే యిముడునట్లు మృద్వగ్నిచే పక్వము చేయునది.

పిమ్మట నాచూర్ణమును వెలికిం దీసి యొకశరావమున (మూకుటిలో)నునిచి పొగ బైటవెడలకుండునట్లు పైన నొక మూకుడు మూసి చీలమన్ను లేపనముచేసి యెండించి నిప్పుమీద బెట్టి పొగ లోపలనే యిమిడి భస్మమగునట్లు పక్వముచేసి చల్లబడినపిదప నా భస్మమును వెలికిం దీసి చక్కగ చూర్ణమగునట్లు నూరి, యాభస్మమును పాణికల (కర్ష) మాత్రము ప్రతిదినంబును సేవించుచు, నయ్యది జీర్ణమైనపిదప మధురరసముతో గూడిన యాహారమును భుజించవలెను. ఇత్తెరంగున సేవించినచో వాతకఫరోగము లన్నియు, విషము లన్నియు గరవిషంబును మానును. (ఇచ్చట "చూర్ణీకృతాని" అనుచోట చక్రపాణిదత్తవ్యాఖ్యయందు "ఖండీకృతానీతి—ఖండం ఖండం కృతాని" అని యున్నది. కావున ఖండీకృతాని అనుపాఠము వ్యాఖ్యానుగృహీతము.)

### కఫజగ్రహణీహర భల్లాతకాదిక్షారము.

మూ. భల్లాతకం త్రికటుకం త్రిఫలాం లవణత్రయమ్,
అన్తర్ధూమం ద్విపలికం గోపురీషాగ్నినా దహేత్. 177
సక్షారః సర్పిషా పీతః భోజ్యే వాఽప్యవచూర్ణితః,
హృత్పాణ్డుగ్రహణీదోషగుల్మోదావర్తశూలనుత్. 178

వ్యా. జీడిగింజలు, త్రికటుకములు, త్రిఫలములు (కరక-తాని-ఉసిరికకాయల బెరడు), లవణత్రయము (సౌవర్చలవణము, సైంధవలవణము, బిడాలవణము), వీనిని ప్రత్యేకము రెండేసి పలములవంతున జేర్చి పైజెప్పినవిధముగ కాల్చి బూడిదచేసి యా

బూడిదెను బిళ్లచేసి యొకశరావమున నునిచి వేరొకశరావముచే మూసి చీలమన్ను లేపనము చేసి యావుపేడ పిడకల యగ్నితో పుటముబెట్టి క్షారముగ చేయునది. ఆక్షారమును నేతిలో కలిపి పానముచేయనగును. లేక భోజనపదార్థములలో జేర్చి యైన తినవలెను. దీనివలన హృదయరోగంబును, పాండురోగంబును, గ్రహణీదోషంబును, గుల్మంబులును, ఉదావర్తంబును, శూలరోగంబును శమించును.

## గ్రహణియందు దురాలభాదిక్షారయోగము.

మూ॰ దురాలభాం కరఞ్జౌ ద్వౌ సప్తపర్ణం సవత్సకమ్,
పడ్గ్రన్థాం మదనం మూర్వాం పాఠామారగ్వధం తథా. 179
గోమూత్రేణ సమాంశాని కృత్వా చూర్ణాని దాహయేత్,
దగ్ధ్వా చ తం పిబేత్ క్షారం గ్రహణీబలవర్ధనమ్. 180
(ఇతిక్షారః.)

వ్యా. దురదగొండి, కానుగ, కలుగ్రానుగ, ఏడాకులపొన్న, కొడిసెపాలవిత్తులు, వస, మ్రంగకాయ, చాగపట్ట, ఏరుబొద్ది, రేల వీని నన్నిటిని సమభాగములుగ గూర్చి, వీనికన్నిటికి సమభాగముగ గోమూత్రమును కలిపి నూరి నిప్పున కాల్చి క్షారముగ జేసి పైయోగమున జెప్పినవిధముగ నేతిలో కలిపి త్రాగినయెడ గ్రహణియందలి యగ్నికి బలమును వృద్ధినందించును.

## గ్రహణీరోగమున నగ్నివర్ధకభూనింబాదిక్షారము.

మూ. భూనిమ్బం రోహిణీం తిక్తాం పటోలం నిమ్బపర్పటమ్,
దహేన్మాహిషమూత్రేణ క్షార ఏషోఽగ్నివర్ధనః. 181
(ఇతి ద్వితీయః క్షారః.)

వ్యా. నేలవేము, కటుకరోహిణి, చేదుపొట్ల, వేపపట్ట, పర్పాటకము వీని నన్నిటిని నిప్పున కాల్చి బూడిదె చేసి యాబూడిదెను చూర్ణమునకు సమభాగమైన బఱ్ఱెల మూత్రమున కలిపి ద్రవమంతయు చుండి క్షారమగునట్లు (క్షారపాకవిధిప్రకారము) పక్వముచేసి యాక్షారమును నేతితో చేర్చి త్రాగనగును.

## అగ్నివర్ధకహరిద్రాదిక్షారము.

మూ. ద్వే హరిద్రే వచా కుష్ఠం చిత్రకః కటురోహిణీ,
ముస్తం చ బస్తమూత్రేణ దహేత్ క్షారోఽగ్నివర్ధనః. 182
(ఇతి తృతీయక్షారః.)

వ్యా. పసుపు, మ్రానిపసుపు, వస, చెంగల్వకోష్టు, చిత్రమూలము, కటుకరోహిణి, తుంగగడ్డలు వీని నన్నిటిని సమభాగములుగ గూర్చి నిప్పున కాల్చి యాబూడిదెను చూర్ణమునకు సమభాగముగ నుండు గోమూత్రమున కలిపి క్షారవిధిప్రకారము క్షారమును సిద్ధము చేసి నేతితో సేవించినయెడ నగ్ని వృద్ధినొందును. (ఈక్షారయోగముల రెండిటియందు మాత్రము దురాలభాదిక్షారమునందువలె చూర్ణమునకు సమభాగముగ జేర్చి పక్వముచేయనగును.)

## సుధాకాండాదిక్షారగుటికలు.

మూ. చతుష్పలం సుధాకాణ్డాత్, త్రిపలం లవణత్రయాత్,
వార్తాకీకుడవం, చాఽర్కాత్ అష్టౌ ద్వే చిత్రకాత్పలే. 183
దగ్ధాని, వార్తాకరసే గుళికా భోజనోత్తరాః,
భుక్తం భుక్తం పచన్త్యాశు కాసశ్వాసాఽర్శసాం హితాః. 184
విషూచికాప్రతిశ్యాయహృద్రోగశమనాశ్చ తాః,
ఇత్యేషా క్షారగుటికా కృష్ణాత్రేయేణ కీర్తితా. 185
(ఇతి క్షారగుటికా.)

వ్యా. బొంతజెముడుకాడలు నాల్గుపలములు, సౌవర్చల-సైంధవ-బిడాలవణములు మూడును చేరి మూడుపలములు, చక్కగ పండి యెండిన వంకాయలు ఒక కుడవము (నాల్గుపలములు), జిల్లేడుపట్ట యెనిమిదిపలములు, చిత్రమూలము రెండుపలములు, ఈ భాగముల ప్రకారము వీని నన్నిటిని కూర్చి చూర్ణము చేసి నిప్పున కాల్చి, యాక్షారమును వంకాయలరసముతో కలిపి మెత్తగ నూరి గుటికలు చేయునది. ఈగుటికలను భోజనమును చేసినపిదప సేవించినచో భుజింపబడిన యాహారమును అతిశీఘ్రముగ పచింపజేయును. ఈగుటికలు కాసశ్వాసములయందును అర్శోరోగమునందును చాల హితకరములు. మరియు నివి విషూచిని, పీనసమును, హృద్రోగమును శమింపజేయును. ఈక్షారగుటికాయోగము కృష్ణాత్రేయులచే చాల ప్రశస్తముగ జెప్పబడినది.

## వత్సకాదిక్షారము.

మూ. వత్సకాతివిషే పాఠాం దుస్స్పర్శాం హిఙ్గుచిత్రకమ్,
చూర్ణీకృత్య పలాశాగ్రక్షారే మూత్రస్రుతే పచేత్. 186
ఆయసే భాజనే సాన్ద్రాత్ తస్మాత్కోలం సుఖామ్బునా,
మద్యైర్వా గ్రహణీదోషశోథార్శఃపాణ్డుమాన్ పిబేత్. 187
(ఇతి చతుర్థక్షారః.)

వ్యా. కొడిసెపాలవిత్తులు, అతివస, చిరుబొద్ది, దూలగొండి, ఇంగువ, చిత్రమూలము వీని నన్నిటిని సమభాగములుగ చూర్ణముచేసి, మోదుగాకులను కాల్చి యాబూడిదెను గోమూత్రమున జేర్చి క్షారపాకవిధిప్రకారము సిద్ధముచేయబడిన యాక్షారోదకమున (పైజెప్పిన చూర్ణమును) కలిపి యొకయినుపపాత్రలో బోసి అయ్యది ఘనీభవించి చిక్కగ నగునందాక పక్వముచేసి, దానినుండి కోలమాత్రము (అర్ధకర్షపరిమితము) గ్రహించి చల్లనినీళ్లలో కలిపి సేవించనగును. లేక మద్యమునందైన కలిపి సేవింపనగును. దీనివలన గ్రహణీదోషంబును, శోఫంబును, అర్శస్సును, పాండురోగంబును శమించును.

## త్రిఫలాదిక్షారము.

మూ. త్రిఫలాం కటభీం చవ్యం బిల్వమధ్యమయోరజః,
రోహిణీం కటుకాం ముస్తం కుష్ఠం పాఠాం చ హిఙ్గు చ. 188
మధుకం ముష్కకయవక్షారౌ త్రికటుకం వచాం,
విడఙ్గం పిప్పలీమూలం స్వర్జికాం నిమ్బచిత్రకౌ. 189
మూర్వాఽజమోదేన్ద్రయవాన్ గుడూచీం దేవదారు చ,
కార్షికం, లవణానాఞ్చ పఞ్చానాం పలికాన్ పృథక్. 190
భాగాన్; దధ్ని త్రికుడవే ఘృతతైలేన మూర్ఛితం,
అన్తర్ధూమం శనైర్దగ్ధ్వా, తస్మాత్పాణితలం పిబేత్. 191
సర్పిషా; కఫవాతార్శోగ్రహణీపాణ్డురోగవాన్,
ప్లీహమూత్రగ్రహశ్వాసహిక్కాకాసక్రిమిజ్వరాన్. 192
శోషాఽతిసారౌ శ్వయథుం ప్రమేహానాహహృద్గ్రహాన్,
హన్యాత్ సర్వవిషం చైవ క్షారోఽగ్నిజననో వరః. 193
(హన్యాత్ సర్వవిషాణాం చ క్షారోఽయం శమనో వరః)
జీర్ణే రసైర్వా మధురైః అశ్నీయాత్ పయసాపి వా,

(ఇతి పఞ్చమః క్షారః.)

వ్యా. త్రిఫలములు (కరక-తాని-ఉసిరిక కాయల బెరడు), కటభి (మాల్కంగిని), చవ్యము, మారేడుకాయలలోనిగుజ్జు, ఇనుమురాపొడి, కటుకరోహిణి, తుంగగడ్డలు, చెంగల్వకోష్ఠు, చిరుబొద్ది, ఇంగువ, అతిమధురము, మొక్కపుచెట్టుపట్ట, యవక్షారము, త్రికటుకము (శుంఠి, పిప్పలి, మిరియాలు), వస, వాయువిడంగములు, మోడి, స్వర్జ

క్షారము, వేపపట్ట, చిత్రమూలము, చాగపట్ట, ఓమము, కొడిసెపాలవిత్తులు, తిప్పతీగె, దేవదారుచెక్క ఇవి యన్నియు వేరువేరుగ నొక్కొకకర్షము; పంచలవణములును వేరువేరుగ నొక్కొకపలము, ఈభాగములవంతున పైజెప్పినవాని నన్నిటిని చూర్ణముచేసి యుంచునది. పిదప మూడుకుడవముల (పండ్రెండుపలముల)పరిమితమగు పెరుగును, తైలమును, నెయ్యియు (ఈరెండును చేరి మూడుకుడవములు) ఈమూడుద్రవముల నొకటిగ గూర్చి, ఇందు పైజెప్పిన చూర్ణమును కలిపి ద్రవమంతయు చూర్ణమునం దిముడునట్లు భావనచేసి, (పాకముచేసి) పెరుగు మున్నగుద్రవమంతయు చూర్ణమున నిమిడినపిదప నాచూర్ణమును ఒకశరావమున నునిచి పైన వేరొకశరావమును మూసి చీలమంటెని బూసి యెండించి మందాగ్నిలో నిడి దానిపొగ వెలికి వ్యాపింపకుండునట్లు చక్కగ వండి క్షారముగ (పైజెప్పిన పిప్పల్యాదిక్షారమును వలె) చేయునది.

అట్టి క్షారమును మెత్తగ నూరి దానిని పూటకు పాణితల-కర్ష (కాలుపలము) ప్రమాణమువంతున నేతిలో కలిపి త్రాగినయెడ కఫ-వాతములచే గల్గిన యర్శస్సులును, గ్రహణిరోగంబును, పాండురోగంబును, ప్లీహవృద్ధియు, మూత్రబంధంబును, శ్వాసంబును, ఎక్కిళ్లను, కాసంబును, క్రిమిరోగంబును, జ్వరంబును, శోషంబును, అతిసారంబును, వాపును, ప్రమేహంబులును, కడుపుబ్బరంబును, గొమ్ముపట్టును ఇవియన్నియు నశించును. పలువెరంగులైనవిషముల రూపుమాపును. అగ్నిని వృద్ధినొందించుట కీక్షారము మిగుల శ్రేష్ఠమైనది. ఈయౌషధమును సేవించి అయ్యది జీర్ణమైనవెంటనే మధురరసమును జేర్చి పక్వము చేయబడిన మాంసరసములతోనైనను, పాలతోనైనను అన్నమును భుజింపవలెను. (ఇంతదనుక కఫజగ్రహణీచికిత్స పూర్తిగ చెప్పబడినది.)

## సాన్నిపాతికగ్రహణీదోషచికిత్సాక్రమము.

మూ. త్రిదోషే విధివిద్వైద్యః పఞ్చకర్మాణి కారయేత్. 194
ఘృతక్షారాసవారిష్టాన్ దద్యాచ్చాగ్నివివర్ధనాన్,
క్రియా యా చాఽనిలాదీనాం నిర్దిష్టా గ్రహణీం ప్రతి. 195
వ్యత్యాసాత్తాం సమస్తాం వా కుర్యాద్దోషవిశేషవిత్,

వ్యా. దోషత్రయప్రకోపమున గల్గిన(సాన్నిపాతిక)గ్రహణీదోషమునందు వమనము, విరేచనము, ఆస్థాపనము, అనువాసనము, నస్యవిధి (శిరోవిరేచనము), అను పంచకర్మములను రోగదేశకాలబలాదుల చక్కగ గమనించి, తత్తదనుగుణముగ విధ్యుక్తప్రకారము చేయనగును.

మరియు నగ్ని వర్ధకములగు పైజెప్పబడిన ఘృతములు, క్షారములు, ఆసవములు, అరిష్టములు మున్నగువానిని కాలాద్యనుగుణముగ నుపయోగింపవలెను.

మరియు వాతాదిజనిత గ్రహణీరోగముల నుద్దేశించి వేరువేరుగ జెప్పబడిన క్రియావిధానములను ఆయాదోషవిశేషముల జక్కగ గమనించి తత్తదనుగుణముగ మార్చి మార్చి చేయవలెను. లేక అట్టి క్రియాయోగములను (మూటికి వేరువేరుగ జెప్పినయోగములందలి ద్రవ్యాదులను) ఒకటిగ జేర్చి యైనను యుక్తియుక్తముగ నుపయోగింపనగును.

గ్రహణీరోగచికిత్సాసముచ్చయము.

మూ. స్నేహనం స్వేదనం శుద్ధిః లంఘనం దీపనం చ యత్. 196
చూర్ణాని లవణక్షారమధ్వరిష్టసురాసవాః,
వివిధాస్తక్రయోగాశ్చ దీపనానాం చ సర్పిషామ్. 197
గ్రహణీరోగిభిస్సేవ్యాః,

వ్యా. స్నేహనము, స్వేదనము (చెమటబట్టించువిధానము), వమనవిరేచనరూపమైన శోధనము, లంఘనము, అగ్నిదీపనము, చూర్ణములు, లవణములు, క్షారములు, మధ్వరిష్టములు, సురామద్యములు, ఆసవములు, పలుతెరంగులైన తక్రయోగములు, దీపనములగు ఘృతయోగములు అను వీనినన్నిటిని గ్రహణీరోగి సమయోచితముగ నుపయోగింపవలెను. (ఇది గ్రహణీరోగమున చికిత్సాసామాన్యసంగ్రహము.)

గ్రహణీరోగమునందవస్థావిశేషముచే దీపనచికిత్స.

మూ. క్రియాం చావస్థికీం శృణు,
ష్ఠీవనం శ్లైష్మికే రూక్షం దీపనం తిక్తసంయుతమ్. 198
సకృద్రూక్షం సకృత్ స్నిగ్ధం కృశే బహుకఫే హితం,
పరిక్షామం శరీరస్య దీపనం స్నేహసంయుతమ్. 199
దీపనం బహుపిత్తస్య తిక్తం మధురసంయుతం,
బహువాతస్య తు స్నేహలవణామ్లయుతం హితమ్. 200
సన్ధుక్షతి తథా వహ్నిః ఏషాం విధివదిన్ధనైః,

వ్యా. ఇత్తెరంగున వాత - పిత్త - కఫ - సన్నిపాతభేదములచే నాల్గుతెరంగులైన చికిత్సావిధానములు ఆయాదోషము నుద్దేశించి చెప్పబడినది. ఈగ్రహణీభేదము లన్నిటి

యందును మందాగ్ని ప్రధానముగ నుండును. కావున అన్నిటియందును అగ్నిని దీపింప జేయుట చికిత్స ముఖ్యకర్తవ్యము. అట్టి చికిత్స ప్రతిపురుషునకును ఆయాదోషములను అవస్థాభేదము ననుసరించి భిన్నభిన్నముగ నుండును. అట్టి యవస్థావిశేషానుసారముగ చేయదగిన చికిత్సావిధానము పైగ్రంథముచే వివరింపబడును:—

అగ్నిమాంద్యము కల గ్రహణీరోగికి శ్లేష్మప్రకోపమువలన నోట కఫము వెడలు చుండునెడ రూక్షగుణంబును తిక్తరసంబును కల్గి యగ్నిని దీపింపజేయునట్టి యౌషధము నుపయోగించి యగ్నిని వృద్ధినందించవలెను. (కాని మధుర-అమ్ల-లవణాదిరసములను ఘృతములను ఉపయోగింపం జనదు.) మరియు కఫము మిక్కిలి ప్రకోపించి శరీరము కృశించి యుండు గ్రహణీరోగికి నొకప్పుడు రూక్షంబును ఒకపుడు స్నిగ్ధంబును ఉపయోగింప నగును. (కఫ మధికమై శరీరము కృశించియుండు అవస్థయందు కఫమును తగ్గించుటకై రూక్షౌషధమునే యుపయోగించినయెడ శరీరము మరింత కృశించును. బృంహణమునకై స్నిగ్ధమునే యుపయోగించునెడ కఫము విజృంభించును; కావున కఫహరమగు రూక్షౌషధము నుపయోగించి పిదప బృంహణమగు స్నిగ్ధౌషధము నుపయోగించుచు అగ్నిని దీపింపజేయవలెనని భావము.)

మరియు నట్టి కఫాధికకృశావస్థనుండు గ్రహణీరోగికి ఆమదోషమును పరీక్షించి అగ్నిదీపనములగు పంచకోలాది యుక్తమగు ఘృతమును దీపనమునకై యుపయోగింప నగును.

మరియు పిత్త మధికమై యగ్ని మందగించి యుండు గ్రహణీరోగికి మధుర రసంబును తిక్తరసంబును కల దీపనీయౌషధములచే నగ్నిని దీపింపజేయవలెను.

మరియు గ్రహణీరోగమున వాతము మిక్కుటముగ ప్రకోపమునొంది యగ్ని మందగించి యున్నచో స్నేహ-అమ్ల-లవణయుక్తమగు దీపనౌషధమును సిద్ధముచేసి యుపయోగింపనగును. పైజెప్పినరీతిగ నాయాయవస్థాభేదములను గుర్తించి తత్తదనుగుణముగ నౌషధాహారాదుల నుపయోగించునెడ జాఠరాగ్ని (యుక్తములగుసమిధలచే మందీభూతమగు బాహ్యాగ్ని రాజి జ్వలించునట్లు) నానాట క్రమక్రమముగ దీపించి దృఢమగును.

### అగ్నిసందీపనములలో ఘృతమునకు ప్రాశస్త్యము.

మూ. స్నేహమేవ పరం విద్యాత్ దుర్బలాఽనలదీపనమ్. 201
నాఽలం స్నేహసమిద్ధస్య శమాయాన్నం సుగుర్వపి,

వ్యా. మిక్కిలి బలము క్షీణించియుండు జాఠరాగ్నిని దీపింపజేయుటకు స్నేహమే (ఘృతమే) మిగుల శ్రేష్ఠమైనది. అట్టి ఘృతముచేత జ్వలింపజేయబడిన జాఠరాగ్నిని చల్లార్చుటకు మిక్కిలి గురుత్వముకల యాహారంబును సమర్థము కానోపదు. కావున ఘృతము అగ్నిదీపనమునకు మిగుల శ్రేష్ఠమైనది. (లోకమున స్నేహద్రవ్యములచే దార్ఢ్యము నొందిన బాహ్యాగ్ని యెన్ని సమిధలనైనను దహింప సమర్థమగును. అత్తెరంగుననే జాఠరాగ్నియు ఘృతముచే బలము నొందినయెడ నెట్టి గురుపదార్థముల నైన పచింపనోపునని భావము). ఇచ్చట స్నేహశబ్దముచేత ఘృతము మాత్రము ప్రకరణవశముచే గ్రహింప బడును.

## అపక్వపురీషపాచనమునకు ఘృతపానవిధి.

మూ. మన్దాగ్నిరవిపక్వం తు పురీషం యోఽతిసార్యతే. 202
దీపనీయౌషధైర్యుక్తాం ఘృతమాత్రాం పిబేత్తు సః,
తయా సమానః పవనః ప్రసన్నో(ప్రశాన్తో) మార్గమాశ్రి(స్థి)తః
అగ్నేస్సమీపచారిత్వాత్ ఆశు ప్రకురుతే బలం,

వ్యా. గ్రహణీరోగికి అగ్ని మందగించి దానంజేసి చక్కగ పక్వముకాని పురీషము అధికముగ (పలుచనై విరేచనరూపమున) వెడలుచున్నయెడ దీపనీయగణమున చెప్పబడిన పిప్పలి మున్నగు అగ్నిసందీపనౌషధద్రవ్యములతో గూడిన ఘృతమును మితముగ త్రాగవలెను. అట్టి ఘృతపానముచేత అగ్నిసమీపమున నుండు సమానవాతము ప్రకోపముడిగి శాంతమై తనమార్గముననే యుండి జాఠరాగ్ని సమీపమున సంచరించు చుండుటవలన నగ్నికి బలమును శీఘ్రముగ గల్గించును.

ఇచ్చట 'అవిపక్వం' అనునది పురీషమునకు విశేషణము. అగ్ని బలహీనమగుటవలన పక్వముగాక ఆమముగ నుండుపురీషము విరేచనమగునెడ దీపనీయయుక్తమైన ఘృతపానము చేయవలెనని యర్థము. దీపనీయౌషధగుణములు స్నేహమున సంక్రమించుటం జేసి యగ్నిసందీపనంబును, స్నేహభాగముచే సమానవాతశమనంబును కల్గునని భావము. సమానవాతము శాంతమై స్వమార్గముననే సంచరించుచు అగ్నిసమీపమున నుండుటం జేసి తనకు స్వభావసిద్ధమైన యగ్నిసందీపనవ్యాపారమును చేయగల్గును. అగ్నిదీప్తమై పక్వముగాని (ఆమావస్థనుండు) పురీషమును పాకమునొందించును.

(ఇచ్చట దీపనీయశబ్దముచేత షడ్విరేచనశతాశ్రితీయమున 'పిప్పలీపిప్పలీమూల ......"దీపనీయాని భవన్తి" (చ. సూ. అ. ౪. సూ, ౨౯.) అని చెప్పబడిన దీపనీయౌషధముల గ్రహించునది.)

## మలబంధమునందు పంచలవణఘృతోపయోగవిధి.

మూ. కాఠిన్యాద్యః పురీషం తు కృచ్ఛ్రాన్ముఞ్చతి మానవః. 204
సఘృతం లవణైర్యుక్తం నరోఽన్నావగ్రహం పిబేత్,
రౌక్ష్యాన్మన్దే పిబేత్సర్పిః తైలం వా దీపనైర్యుతమ్. 205

వ్యా. మరియు గ్రహణీరోగికి మలము మిగుల కఠినముగ నుండుటవలన మిక్కిలి కష్టముచే వెడలుచున్నయెడ పంచలవణముల జేర్చి పక్వముచేయబడిన ఘృతమును అన్నము మున్నగునాహారమున కూడ చేర్చి భుజింపనగును. (లవణముల జేర్చి పక్వముచేయబడిన ఘృతమును భోజనసమయమున నన్నముతో కూడ చేర్చి భుజింపవలెనని యర్థము.)

మరియు రూక్షగుణసంబంధముచే నగ్ని మందగించి యున్నయెడ దీపనీయములగు పిప్పలి శుంఠి మున్నగు ద్రవ్యముల జేర్చి సిద్ధము చేయబడిన ఘృతమునైనను తైలము నైనను త్రాగించవలెను.

## స్నేహాధిక్యమున గల్గిన యగ్నిమాంద్యచికిత్స.

మూ. అతిస్నేహాత్తు మన్దేఽగ్నౌ చూర్ణారిష్టాసవా హితాః,

వ్యా. మిక్కిలి స్నేహముచే గల్గిన యగ్నిమాంద్యమున క్షారాదిచూర్ణములును అరిష్టములును ఆసవములును మిక్కిలి హితకరములగును.

## ఉదావర్తజమందాగ్నిచికిత్స.

మూ. భిన్నే గుదోపలేపాత్తు మలే తైలసురాసవాః. 206
ఉదావర్తాత్తు మన్దేఽగ్నౌ నిరూహాః స్నేహవస్తయః,

వ్యా. గుదస్థానమున (శౌచము చక్కగ చేయకుండుటవలన) మలము చిక్కసడలి వెడలుచున్నయెడ తైలంబులును సురామద్యంబును ఆసవంబులును హితకరములు. మరియు నుదావర్తముచే నగ్ని మందగించి యున్నయెడ నిరూహవస్తులును స్నేహవస్తులును హితకరములు.

## దోషవృద్ధిచే గల్గిన యగ్నిమాంద్యమునకు చికిత్స.

మూ. దోషవృద్ధ్యా తు మన్దేఽగ్నౌ శుద్ధో దోషవిధిం చరేత్. 207

వ్యా. వాతాదిదోషములు మిక్కిలి వృద్ధినందుటవలన కల్గిన మందాగ్నియందు ఆయాదోషానుసారముగ వమనవిరేచనాది శోధనములచే కోష్ఠమును శుద్ధముగ జేసి, పిదప నేదోషమువలన నగ్ని మందగించినదియో ఆదోషశామకముగ జెప్పబడిన చికిత్సా విధానము చేయవలెను.

వ్యాధివిశేషమున కల్గిన యగ్నిమాంద్యచికిత్స.

మూ. వ్యాధియుక్తస్య మన్దేఽగ్నౌ(తు) సర్పిరేవాగ్నిదీపనమ్,

వ్యా. ఇతరవ్యాధులచే పీడింపబడునప్పుడు అగ్ని మందగించి యున్నయెడ అగ్ని దీపనమునకు నేతినే యుపయోగించవలెను. (ఇచ్చట "వ్యాధియుక్తస్య" అనుదానికి బదులు "వ్యాధిముక్తస్య" అని వాగ్భటాచార్యులు చెప్పిరి. జ్వరాదిరోగవిముక్తునకు అగ్నిమాంద్యము కల్గినయెడ ఘృతపానమే యగ్నిదీపనమునకు హితముకాని వేరొండువిధమగు చికిత్స యుక్తము కాదని యర్థము.)

ఉపవాసముచే గల్గిన యగ్నిమాంద్యచికిత్స.

మూ. ఉపవాసాచ్చ మన్దేఽగ్నౌ యవాగూభిః పిబేత్ ఘృతమ్. 208
అన్నావపీడితం బల్యం దీపనం బృంహణం చ తత్,

వ్యా. ఉపవాస ముండుటచే జాఠరాగ్ని మందగించినయెడ నేతిని యవాగువులతో కలిపి భోజనమధ్యకాలమున త్రాగవలెను. అట్లు భోజనమధ్యమున ఘృతపానము చేసినచో నయ్యది బలకరంబును దీపనంబును బృంహణంబును నగును.

దీర్ఘకాలముగ ననుసరించిన యగ్నిమాంద్యచికిత్స.

మూ. దీర్ఘకాలప్రసఙ్గాత్తు క్షామక్షీణకృశాన్నరాన్. 209
ప్రసహానాం రసైః సామ్లైః భోజయేత్ పిశితాశినాం,
లఘుతీక్ష్ణోష్ణశోధిత్వాత్ దీపయన్త్యాశు తేఽనలమ్. 210
మాంసోపచితమాంసత్వాత్ తథాశుతరబృంహణం,

వ్యా. అగ్నిమాంద్యము చిరకాలమునుండి యనుసరించి యుండుటవలన (దానం జేసి యాహారరసము జీర్ణమై శరీరమునందు చక్కగ వ్యాపించక) బలహీనంబును కృశత్వంబును ధాతుక్షయంబును కలవారికి మాంసమును బలాత్కారముగ నాహారము చేయు జంతువుల మాంసరసములను (దానిమ్మపండ్లు మున్నగువానిరసముచే) పులుపు కల్గించి సంస్కరించి యామాంసరసముతో తేలికగ జీర్ణమగు నాహారమును భుజింపనగును. అట్టి ప్రసహజంతువుల మాంసరసము తీక్ష్ణ-ఉష్ణగుణములును శోధనస్వభావంబును కల్గి యుండుటం జేసి శీఘ్రముగ జాఠరాగ్నిని దీపింపజేయును. మాంసాహారముచే వృద్ధినొందిన మాంసముతో కూడి శరీరము కల్గియుండుటవలన, కృశించినశరీరమును అతిశీఘ్రముగ పుష్టినందించును; (కావున మాంసమును తినుస్వభావముకలజంతువుల మాంసరసమును ఆహారముతో చేర్చి భుజింపవలెనని భావము.)

### అభోజన-అతిభోజనములచే నగ్నిమాంద్యము కల్గువిధము.

మూ. నాఽభోజనేన కాయాగ్నిః దీప్యతే, నాఽతిభోజనాత్. 211
యథా నిరిన్ధనో వహ్నిః అల్పో వాఽతీన్ధనావృతః,

వ్యా. లోకమున బాహ్యాగ్ని ప్రబలముగ నున్నను దానిని జ్వలింపజేయుటకు కట్టెలు లేకున్నయెడ తనంతటనే చల్లారును. అగ్ని స్వల్పముగ నున్నయెడ దానిపై మితిమీరిన కట్టెల నుంచినయెడ ఆకట్టెలను దహింపజాలక బొత్తుగ చల్లారును. అత్తెరంగుననే జాఠరాగ్ని బలవత్తరముగ నున్నను దానికి ఆహారసంబంధము లేక భోజనమును మానినచో చల్లారును. లేక జాఠరాగ్ని అల్పబలముగ నున్నతరి ఆహారమును మిక్కుటముగ జేసినను అట్టి యాహారమును జీర్ణింపనేరక బొత్తుగ నశించును. (ఇత్తెరంగునన భోజనాఽతిభోజనములు అగ్నినాశమునకు హేతువులగును.)

ఇచ్చట అభోజశబ్దముచేత భోజనము లేకుంటయు స్వల్పభోజనంబును గ్రహింపబడును. కావున అల్పభోజనంబును అగ్నిమాంద్యమునకు కారణమని యెరుంగునది.

### అగ్నివృద్ధికి తగునట్లు ఆహారవిధి.

మూ. స్నేహాన్నవిధిభిశ్చిత్రైః (స్నేహాన్నపానైర్వివిధైః) చూర్ణాఽరిష్ట
సురాసవైః. సమ్యక్ప్రయుక్తైః భిషజా బలమగ్నేః ప్రవర్ధతే,
యథా హి సారదార్వగ్నిః స్థిరః సంతిష్ఠతే చిరమ్. 213
స్నేహాన్నవిధిభిస్తద్వత్ అన్తరగ్నిర్భవేత్ స్థిరః,
హితం జీర్ణే మితం చాశ్నన్ చిరమారోగ్యమశ్నుతే. 214
అవైషమ్యేణ ధాతూనాం అగ్నివృద్ధౌ యతేత నా,

వ్యా. స్నేహము (నెయ్యి)ను జేర్చి పలుతెరంగుల సంస్కరింపబడిన నానావిధాన్నపానములను చూర్ణములను ఆసవారిష్టములను బలాద్యనుసారముగను యుక్తియుక్తముగను వైద్యుడుపయోగించినచో జాఠరాగ్ని వ్యత్యయము లేక చక్కగ వృద్ధినందును. లోకమున మంచి చేవగల్గిన చింతకట్టెలు చంద్రకట్టెలు మున్నగుసారవంతములైనవాని నాశ్రయించి జ్వలించుచుండు అగ్ని బలిష్ఠమై కొంచెమున చల్లారక దృఢముగ చాలకాలమువరకు నిలచి కట్టెల నన్నిటిని దహించుచుండును కదా? ఆవిధముగనే నెయ్యిమున్నగు స్నేహద్రవ్యములతో కూడి విధ్యుక్తప్రకారము సంస్కరించి సిద్ధముచేయబడిన యన్నపానాదులును ఆచరించినయెడ కాయాగ్నియు దృఢమై చాలకాలమువరకును ఆహారపదార్థముల పాకమునొందించుచు స్థిరముగ నుండును.

కావున హితంబును యుక్తమైన పరిమితి కల్గినదియు నగునాహారమును భుజించిన యెడ చిరకాలమువరకును ధాతువైషమ్యము లేక (ఆహారసంబంధములగు రోగముల పాల్పడక) ఆరోగ్యము నొందగల్గును. కావున ధాతువైషమ్యము లేక జాఠరాగ్ని వృద్ధి నందించుటకై మనుజుడు ఎల్లపుడును పూనికతో యత్నపరుడుగ నుండవలెను. (హిత మితాహారసేవనమువలన, ఒకవేళ కాలవైపరీత్యాదిజన్యరోగములు సంభవించునేమో కాని, ఆహారసంబంధవ్యాధులు కల్గవని ముఖ్యభావము.)

జాఠరాగ్నిభేదములు, అందు సమలక్షణము.

మూ. సమైర్దోషైస్సమో మధ్యే దేహస్యోష్మాఽగ్నిసంజ్ఞితః 215
పచత్యన్నం తదారోగ్యపుష్ట్యాయుర్బలవృద్ధయే.

వ్యా. వాతపిత్తకఫములను మూడుదోషములును న్యూనాతిరేకములు లేక వాని వానికి నియతమైన పరిస్థితి నుండునపుడు జాఠరాగ్నియు సమస్థితి నుండును. ఇదియే సమాగ్ని. సమస్థితి నున్న యాదోషములచే శరీరమధ్యమున కల్గిన యూష్మము అగ్ని యని చెప్పబడును. అట్టి సమాగ్ని భుజింపబడిన యాహారమును శరీరారోగ్యమునకును పుష్టికిని ఆయువునకును బలమునకును వృద్ధి కల్గించుటకై పచించును. (సమాగ్నిచే నాహారము సమముగ పక్వమై యట్టియాహారసారము శరీరమున వ్యాపించుటవలన ధాతుసారరూపమైన యారోగ్యంబును, పుష్టి-ఆయుః-బలములకు నానాట వృద్ధియుం కల్గునని భావము.)

మంద-తీక్ష్ణ-విషమాగ్నిలక్షణములు.

మూ. దోషైర్మన్దోఽతివృద్ధో వా విషమైర్జనయేద్గదాన్. 216
వాచ్యం మన్దస్య తత్రోక్తం అతివృద్ధస్య వక్ష్యతే,

వ్యా. కఫపిత్త-వాతదోషములు విషమములైనయెడ వానిచే మంద-తీక్ష్ణ-విషమాగ్నులు వరుసగ నేర్పడును (కఫము విషమమై వృద్ధినందినచో మందాగ్నియు, పిత్త వృద్ధిచే తీక్ష్ణాగ్నియు, వాతవృద్ధిచే విషమాగ్నియు కల్గునని భావము.) పైజెప్పిన మూడు విధములైన యగ్నులలో మందాగ్ని నుద్దేశించి చెప్పవలసిన చికిత్సావిధానమంతయు చెప్పబడినది. ఇక నీక్రింద తీక్ష్ణాగ్ని నుద్దేశించి చికిత్సావిధానము చెప్పబడును.

అత్యగ్నియొక్క చికిత్సాక్రమము. అందు శమనోపాయములు.

మూ. నరే క్షీణకఫే పిత్తం కుపితం మారుతాఽనుగమ్. 217
స్వోష్మణా పావకస్థానే బలమగ్నేః ప్రయచ్ఛతి,

తదా లబ్ధబలో దేహే విరూక్షే సానిలోఽనలః. 218
పరిభూయ పచత్యన్నం తైక్ష్ణ్యాదాశు ముహుర్ముహుః,
పక్త్వాఽన్నం స తతో ధాతూన్ శోణితాదీన్ పచత్యపి. 219
తతో దౌర్బల్యమాతఙ్కాన్ మృత్యుం చోపనయేన్నరం,
భుక్తేఽన్నే లభతే శాన్తిం జీర్ణమాత్రే ప్రతామ్యతి. 220
తృట్ శ్వాసదాహమూర్ఛాద్యాః వ్యాధయోఽత్యగ్నిసమ్భవాః,

వ్యా. మనుజులకు కఫము క్షీణించి యున్నపుడు పిత్తము ప్రకోపమునొంది జాఠరాగ్ని సమీపవర్తియగును. వాతముతో కలిసి తనయందలి వేడిమిచేత జాఠరాగ్నికి స్థానమయిన ఆమాశయమునందలి అగ్నికి (పాచకాగ్నికి) అధికమైన బలమును కల్గించును. అట్టియెడ పిత్తముయొక్క యూష్ణముచేతను సమానవాతప్రేరణచేతను మిక్కిలి బలాధిక్యమునొందిన పాచకాగ్ని రూక్షమయినదేహమునందలి భుజింపబడిన యాహారము కొంచెమైనను లక్ష్యపెట్టక తనయందలి తీక్ష్ణగుణముచేత యెట్టియాహారమునైనను నతిశీఘ్రముగ మాటిమాటికి పచింపజేయుచుండును. అట్లు పచింపజేయుచు అంతట నిలువక అన్నము (ఆహారము) పచించిన వెంటనే రక్తాదిధాతువులను కూడ వరుసగ పచించును. అట్టి ధాతుపాకమువలన మనుజుడు చాల బలహీనతనొంది పలుతెరంగులైన (ధాతుక్షయమునకు సంబంధించిన) రోగములను పొంది తుదకు మృత్యువువాత బడును. అట్టి పరిస్థితియందు భుజించినవెంటనే మనుజుడు కొంచెము శాంతినొందును. అన్నము జీర్ణించిన వెంటనే మిక్కిలి బడలికనొందును. దానంజేసి దప్పి, శ్వాసము, తాపము, మూర్ఛ, మొదలగువ్యాధులు అట్టి యత్యగ్నివలన సంభవించును. (ఇదియే అత్యగ్ని, తీక్ష్ణాగ్ని, భస్మకాగ్ని యనియు చెప్పబడును.)

### అత్యగ్నిశామకాహారాద్యుపచారములు.

మూ. తమత్యగ్నిం గురుస్నిగ్ధశీతైర్మధురవిజ్జలైః. 221
అన్నపానైర్నయేచ్ఛాన్తిం దీప్తమగ్నిమివామ్బుభిః,

వ్యా. లోకమున మిక్కిలి తీవ్రముగ జ్వలించు అగ్నిని నీళ్లచేత శమింపజేయు నట్లు గురుస్నిగ్ధగుణములును, శీతవీర్యంబులును, మధురరసంబును కల్గి ద్రవరూపములయిన యన్నపానముల నుపయోగించి పైజెప్పినతీక్ష్ణాగ్నిని శాంతినొందించనగును.

మూ. ముహుర్ముహురజీర్ణేఽపి భోజ్యాన్యస్యోపహారయేత్. 222
నిరిన్ధనోఽన్తరం లబ్ధ్వా యథైనం న విపాదయేత్,

పాయసం కృసరాం స్నిగ్ధం పైష్టికం గుడవైకృతమ్. 223
అదాత్తథౌదకానూపపిశితాని ఘృతాని చ,
మత్స్యాన్విశేషతః శ్లక్ష్ణాన్ స్థిరతోయచరాం స్తథా. 224
ఆవికం చ ఘృతం మాంసమద్యాదత్యగ్నినాశనమ్ (రాబలం),

వ్యా. పైజెప్పిన తీక్ష్ణాగ్ని గలమనుజునకు జాఠరాగ్ని ఆహారములేక సమయమ వేచియుండి రక్తాదిధాతువులను పాకమునొందించక యుండునట్లు, వానికి భుజించిన యాహారము పూర్తిగ జీర్ణము కాకముందే మాటిమాటికి భోజ్యపదార్థములను తినిపించ వలయును. మరియు పాయసము, కృసరము (పెసరపప్పు, నెయ్యి చేర్చి పక్వముచేసి చేయబడిన యన్నము.) నేతిలో పక్వముచేయబడిన పిండివంటకము, బెల్లము చేర్చి చేయబడిన భక్ష్యాదులు, చక్కగ బలిసి యుదకమునందును జలప్రాంతమునందును సంచ రించుచుండు జంతువులమాంసములు, మత్స్యములు, నిల్కడగ నిలచియుండు సరస్సుల మున్నగువానియందు సంచరించుచు మిక్కిలి కోమలములయిన జలజంతువుమాంసము చక్కగ బలిసిన పొట్టేలుమాంసము వీని నన్నిటిని యథాసంభవముగ అత్యగ్నితీక్ష్ణ శమించుటకై భుజింపనగును. (అత్యగ్నికలవాడు శరీరమున బలమువచ్చునందాక పైజెప్పి యాహారాద్యుపచారములను చేసికొనవలయును.) ఇచ్చట నిల్కడగనుండు జలముననుండు జంతువులు నిర్వ్యాపారముగ నుండుటంజేసి మిక్కిలి గురుత్వము కల్గి యుండునని యుద్దేశించి "స్థిరతోయచరాన్" అని చెప్పబడినది.

అత్యగ్నియందు యవాగూమున్నగుపానీయములు.

మూ. యవాగూం సమధూచ్ఛిష్టాం ఘృతం వా క్షుధితః పిబేత్. 225
గోధూమచూర్ణమంథం వా వ్యధయిత్వా శిరాం పిబేత్,
పయో వా శర్కరా సర్పిర్జీవనీయౌషధైః శృతమ్. 226
ఫలానాం తైలయోనీనామ్ముత్క్రుంచాశ్చ సశర్కరాః,
మార్దవం జనయన్త్యగ్నేః స్నిగ్ధా మాంసరసా స్తథా. 227
పిబేచ్ఛీతాంబునా సర్పిః మధూచ్ఛిష్టేన సంయుతం,
గోధూమచూర్ణం పయసా ససర్పిష్కం పిబేన్నరః. 228

వ్యా. తీక్ష్ణాగ్నికలవానికి ఆకలి తీవ్రముగ నున్నపుడు యవాగువునందు తేనెమైన మును కలిపి త్రాగించవలెను. లేక నేతిని త్రాగించవలెను. మరియు వానికి సిరావ్యధనము చేసి గోధుమలను వేయిచి పిండిచేసి అందు నెయ్యి కలిపి నీళ్లనుచేర్చి కొంచెము పలుచగ

చేసిన మంథమును త్రాగింపనగును. పాలయందు చక్కెరను నేతిని జీవనీయౌషధములను చేర్చి కాచి త్రాగవలెను. మరియు చమురుకలనువ్వులు మినుములు మున్నగువానిని రాతిమీద మెత్తగ నూరి చక్కెరకూడచేర్చి ముద్దలుచేసి పక్వముచేసిన నయ్యది 'వృత్కుఙ్చ, ఉత్కుఙ్చ' అని చెప్పబడును. అట్టి భక్ష్యవిశేషముల నుపయోగించినయెడ జాఠరాగ్ని మార్దవమునొందును. లేక మాంసరసములయందు నేతిని కలిపి త్రాగినను అగ్ని మార్దవమును నొందును. లేక నేతిలో తేనెమైనమును కలిపి చల్లని నీళ్లతో కలిపి త్రాగవలెను. లేక గోధుమలపిండిని నేతిని పాలలో కలిపి త్రాగవలెను. (పైజెప్పిన యవాగ్వాదులను సాత్మ్యానుసారముగ నుపయోగించినచో అగ్నితీక్ష్ణత నుడిగి సమస్థితినందునని భావము.)

## తీక్ష్ణాగ్నిశామక త్రిస్నేహోపయోగము.

మూ. అనూపరససిద్ధాన్ వా త్రీన్ స్నేహాన్ తైలవర్జితాన్,
పయసా సమ్మితం చాపి ఘనం త్రిస్నేహసంయుతమ్. 229

వ్యా. ఘృతము, తైలము (నువ్వులనూనె), వస (మాంసస్నేహము), మజ్జ (ఎముకలలోనుండు క్రొవ్వు), ఈనాల్గును స్నేహచతుష్టయము, అందు నూనెను వదలి తక్కిన ఘృత-వసా-మజ్జలను మూడుస్నేహములను అనూపజంతువులమాంసరసమును జేర్చి పక్వముచేసి త్రాగినను తీక్ష్ణాగ్నివేగము తగ్గును. మరియు పైజెప్పిన స్నేహముల మూటిని పెరుగున జేర్చి అందు పాలనుకూడ కలిపి త్రాగినను తీక్ష్ణాగ్ని శమించును.

## తీక్ష్ణాగ్నిశామక స్తన్యోపయోగము.

మూ. నారీస్తన్యేన సంయుక్తాం పిబేదౌదుమ్బరీం త్వచం,
తాభ్యాం వా పాయసం సిద్ధం అద్యాదత్యగ్నిశాన్తయే. 230

వ్యా. అత్తిపట్టను చూర్ణము చేసి చనుబాలలో కలిపియైనను, చనుబాలను అత్తిపట్ట చూర్ణమును కలిపి సిద్ధముచేయబడిన పాయసమునైనను త్రాగినయెడ తీక్ష్ణాగ్ని శమించును. (ఇంతవరకు పైజెప్పినవిధానమంతయు తీక్ష్ణాగ్నికి శమనచికిత్స యని యెరుంగునది.)

## తీక్ష్ణాగ్నియందు పిత్తశామకవిరేచనవిధి.

మూ. శ్యామాత్రివృద్విపక్వం వా పయో దద్యాద్విరేచనం,
అసకృత్పిత్తశాన్త్యర్థం పాయసప్రతిభోజనమ్. 231
ప్రసమీక్ష్య భిషక్ ప్రాజ్ఞః తస్మై దద్యాత్ విధానవిత్,

వ్యా. నల్లతెగడను తెల్లతెగడను చేర్చి పక్వముచేయబడినపాలను విరేచనముసకై యిప్పించి పాయసమును ఆహారముగ నిడినచో తీక్ష్ణాగ్నియందు పిత్తము శమించును,

ఇట్టివిరేచనమును అప్పుడప్పుడును పరిస్థితిని చక్కగ గమనించి తీక్ష్ణాగ్నికలవానికి తత్త దనుగుణముగ యుక్తియుక్తముగ నుపయోగింపదగును.

### తీక్ష్ణాగ్నికి హితకరమైన విధానము.

మూ. యత్కించిన్మధురం మేధ్యం శ్లేష్మలం గురుభోజనమ్. 232
సర్వం తదత్యగ్నిహితం, భుక్త్వా ప్రస్వపనం దివా,

వ్యా. మధురరసంబును, మేదస్సును వృద్ధినందించునదియు, కఫమును వృద్ధినందించునదియు, గురుత్వము కల్గినదియు,నగు భోజనపదార్థ మెద్దియైనను అవియన్నియు తీక్ష్ణాగ్నికలవానికి మిక్కిలి హితకరము. మరియు భుజించినవెంటనే పగలు నిదురించుటయు చాల హితకరము.

మూ. మేధ్యాన్యన్నాని యోఽత్త్యగ్నౌ అప్రతాన్తః(శాన్తః)సమశ్నుతే.
న తన్నిమిత్తం వ్యసనం; లభతే పుష్టిమేవ చ,

వ్యా. తీక్ష్ణాగ్ని కలమనుజుడు తీవ్రమైన బడలిక కలుగకమునుపే మేదస్సుకు హితకరములగు నన్నములను భుజించినయెడ, అట్టివానికి అత్యగ్నికి సంబంధించిన కష్టమును (మరణమును) ఒకప్పుడు పొందజాలడు. మరియు నట్టి మేదోవృద్ధికరములగు నాహారములవలన మిక్కిలి పుష్టినే పొందగలడు. (తీక్ష్ణాగ్నియందు ఆహారమును పూర్తిగ జీర్ణింపజేసి అగ్ని తన దీప్తిప్రకర్షముచే బడలిక కల్గించకమునుపే మేదోవర్ధకములగు నాహారముల భుజించినయెడ, అట్టి తీక్ష్ణాగ్ని యపకారమును జేయకుండుటయే కాక మిక్కిలి పుష్టిని కల్గించి యుపకారకమే యగునని భావము.) ఇచ్చట "యోఽత్త్యగ్నౌ" అనుచోట "యః, అత్తి, అగ్నౌ" అని విభాగము. "యః, అగ్నౌ, అప్రతాన్తః, మేధ్యాని అన్నాని, అత్తి; (సః) తన్నిమిత్తం=తీక్ష్ణాగ్నినిమిత్తం, వ్యసనం, న అశ్నుతే; పుష్టిమేవ లభతే" అని సమన్వయము నెరుంగునది.

### సమాగ్నిగుణములు.

మూ. కఫే వృద్ధే జితే పిత్తే మారుతే చాఽనలస్సమః. 234
సమధాతోః పచత్యన్నం పుష్ట్యాయుర్బలవృద్ధయే,

వ్యా. పైజెప్పిన మేధ్యాద్యాహారమువలన క్షీణించినకఫము వృద్ధినందును, ప్రకుపితమైన పిత్తము తీవ్రతనుడుగును. పిత్తమునకు సహకారియగు వాతంబును సమస్థితినుండును. ఇత్తెరంగున వాతపిత్తకఫములు మూడును సమస్థితినొందినపుడు జాఠరానలంబును తీవ్రత నుడిగి సమస్థితి నందును. అట్టియెడ ధాతువులును సమత్వము నొందును.

అట్టి సమాగ్ని మనుజునకు పుష్టిని ఆయువును బలమును వృద్ధినొందించునిమిత్తము ఆహారమును చక్కగ పచింపజేయును.

## సమశన-విషమాశన-అధ్యశనములస్వరూపము.

భవన్తి చాత్ర:—

మూ॥ పథ్యాఽపథ్యమిహైకత్ర భుక్తం సమశనం మతమ్. 235
విషమం బహు వాల్పం వాఽప్యప్రాప్తాఽతీతకాలయోః,
భుక్తం పూర్వాన్న శేషే తు పునరధ్యశనం మతమ్. 236
త్రీణ్యప్యేతాని మృత్యుం వా ఘోరాన్ వ్యాధీన్ సృజన్తి వా,

వ్యా॥ పథ్యమైన యన్నమును పథ్యము కాని యన్నమును ఒకటిగ జేర్చి (యేక కాలమున) భుజించిన నయ్యది సమశన మనబడును. (ఎట్టిపరిబియ్యపుటన్నము పథ్యము, యవకాన్నము అపథ్యము, ఈరెండిటి నొకటిగ కలిపి భుజించిన నయ్యది సమశనము. ఇత్తెరంగుననే సమశనోదాహరణముల నెరుంగునది.)

మరియు తనకు వలసిన ప్రమాణమునకన్న నధికముగ నైనను తక్కువగనైనను భుజించినను, భోజనమునకు నియమితకాలమునకు ముందుగనైనను, కాలము నతిక్రమించియైనను (కాలనియతిలేక) భుజించిన నయ్యది విషమాశన మనబడును. ముందు భుజించినయన్నము పూర్తిగ జీర్ణము కాక శేషించి యున్నపుడు మరల భుజించిన నయ్యది అధ్యశన మనబడును. ఈమూడువిధములైన యశనములును మృత్యువు నొందించును, లేక క్రూరములగు నజీర్ణాదిరోగములనైన కల్గించును. (ఇచ్చట "ప్రసృష్టే విణ్మూత్రే...... కాలసహిమతః." (అ. హృ. సూ. అ. ౮) అని వాగ్భటులు చెప్పిన భోజనకాలము నెరుంగునది.)

మూ॥ ప్రాతరాశే త్వజీర్ణేఽపి సాయమాశో న దుష్యతి. 237
దివా ప్రబుధ్యతేఽర్కేణ హృదయం పుణ్డరీకవత్,
తస్మిన్ విబుద్ధే స్రోతాంసి స్ఫుటత్వం యాన్తి సర్వశః. 238
వ్యాయామాచ్చ విహారాచ్చ విక్షిప్తత్వాచ్చ చేతసః,
న క్లేదముపగచ్ఛన్తి దివా తేనాఽస్య ధాతవః. 239
అక్లిన్నేష్వన్నమాసిక్తం అన్యత్రైషు న దుష్యతి,
అవిదగ్ధ ఇవ క్షీరే క్షీరమన్యద్విమిశ్రితమ్. 240
నైష దూష్యతి తేనైవ సమం సమ్పద్యతే యథా,

రాత్రౌ తు హృదయే మ్లానే సంవృతేష్వయనేషు చ. 2
యాన్తి కోష్ఠే పరిక్లేదం సంవృతే దేహధాతవః,
క్లిన్నేష్వన్యదపక్వేషు తేష్వాసిక్తం ప్రదుష్యతి. 2
విదగ్ధేషు పయస్స్వన్యత్ పయస్తప్తమివార్పితం,
నైశేష్వాహారజాతేషు నావిపక్వేషు బుద్ధిమాన్. 2
తస్మాదన్యత్సమశ్నీయాత్ పాలయిష్యన్ బలాయుషీ,

వ్యా. ఉదయమున భుజింపబడిన యాహారము జీర్ణము గాకున్నను సాయంకాల భోజనము చేయుట దోషావహము కాదు. ఏలయన:—మనుజులహృదయకమల పగటియందు (తామరకమలము సూర్యరశ్మిచే వికసించి యుండువిధముగ) వికసి యుండును. హృదయము వికాసము నొందినపుడు దాని నాశ్రయించిన రసవహస్రో తస్సు లన్నియు వివృతములై మార్గమున కడ్డులేక శరీరమునందెల్ల ధారాళముగ రసమ వ్యాపింపజేయుచుండును. మరియు పగటియందు మనుజులు వారిపనుల నిర్వర్తిం వ్యాయామము కల్గియుండుటవలనను, అంగవిక్షేపణాదివ్యాపారములు కల్గియుండు వలనను, మనస్సు తన వృత్తివ్యాపారములయందు వ్యాపించి యుండుటవలనను ధా వులయందు ద్రవ మధికముగ లేక యుండును. అట్టియెడ (పాలు చక్కగ కాగకుం నపుడు వేరుపాలను దానిలో కలిపిన నయ్యది యాపాలతో నేకీభవించి చెడకయుం విధముగ) ధాతువులు వివృతములై యుండుతరి సాయంకాలమున (రాత్రియందు మ భుజించినను (అట్టి యాహారము ముందటియాహారశేషముతో గూడి జీర్ణము కాగల కావున) చెరుపు లేదు.

మరియు రాత్రియందు హృదయకమలము (తామరపువ్వుబోలె) ముకుళి యుండును. దానంజేసి స్రోతోమార్గములును మూసికొనియుండును. కోష్ఠంబును సంవ ముగనే యుండును. దానంజేసి రసాదిధాతుసంచారమార్గంబులును ముకుళిం యుండును. అట్టియపక్వాహారరసముతో కూడినధాతువులకు ఇతరాహారసంబంధ కల్గినయెడ, (కొంచెము వెచ్చబడి పూర్తిగ పక్వముకాని పాలయందు వేరుపాల చేర్చినయెడ నయ్యది చెడువిధముగ) జీర్ణము గాక దూషితమగును. కావున రా భుజింపబడిన యాహారము చక్కగ (పూర్తిగ) పక్వము గాకుండునపుడు మరల భుజిం దగదు. కావున అగ్నిబలము ఆయువును కాపాడుకొన దలచిన మానవులు ఈనియ మును గమనించి యాహారమును భుజింపవలెను. (భుజింపబడినయాహారము పక్వ గాకుండునపుడు మరల భుజించుట యధ్యశనమని "భుక్తం పూర్వాన్నశేషే తు పునర

శనం మతమ్” అనువాక్యముచే నధ్యశనస్వరూపము పైనసామాన్యముగ చెప్పబడినది. పగటియందు భుజింపబడిన యాహారము పూర్తిగ పక్వముగాక శేషించియున్నను రాత్రిభోజనము దోషావహము కాదనియు, రాత్రి భుజింపబడిన యాహారము శేషించి పూర్తిగ జీర్ణముకానియెడ మరల భుజించుట తప్పనియు “ప్రాతరాశేఽప్యజీర్ణే తు” అని యుపక్రమించి సదృష్టాంతముగ నియమింపబడినదని ఫలితార్థము నెరుంగునది.)

## అధ్యాయవిషయసంగ్రహము.

తత్ర శ్లోకాః —

మూ. అన్తరగ్నిగుణా దేహం యథా ధారయతే చ సః. 244
యథాన్నం పచ్యతే యాంశ్చ యథాహారః కరోత్యపి,
యేఽగ్నయో, యాంశ్చ పుష్యన్తి యావన్తో యే పచన్తి యా.
రసాదీనాం క్రమోత్పత్తిః మలానాం తేభ్య ఏవ చ,
వృష్యాణామాశుకృద్ధేతుః ధాతుకాలోద్భవక్రమః. 246
రోగైకదేశకృద్ధేతుః, అన్తరగ్నిర్యథాఽధికః,
ప్రదుష్యతి యథా, దుష్టః యాన్ రోగాన్ జనయత్యపి. 247
గ్రహణీయా, యథాయచ్చ (సమాసాచ్చ) గ్రహణీదోషలక్షణం,
పూర్వరూపం, పృథక్చైవ వ్యఞ్జనం సచికిత్సితమ్. 248
చతుర్విధస్య నిర్దిష్టం, యథా చావస్థికీ క్రియా,
జాయతే చ యథాఽత్యగ్నిః, యచ్చ తస్య చికిత్సితమ్. 249
ఉక్తవానిహ తత్సర్వం గ్రహణీదోషకే మునిః,

వ్యా. జాఠరాగ్నిగుణములును జాఠరాగ్ని దేహమును ధరించువిధమును, అయ్యది యాహారమును పచింపజేయువిధమును, ఆహారము వేనిని యెట్లు కల్గించునదియు, భూతాగ్నిభేదములును, భూతాద్యగ్నులు వేనిని పోషించునదియు, అట్టి యగ్నుల సంఖ్యయు, ఏయగ్నులు వేనిని పచించునదియు, రసాదిధాతువులయుత్పత్తిక్రమంబును, రసాదులవలనను మలములయుత్పత్తిక్రమమును, వృష్యాదిద్రవ్యములు శీఘ్రముగ ధాతుపరిణామమునకు హేతువును, ధాతుపరిణామక్రమకాలనియమమును శరీరమునం దేకదేశమున రోగము జనించుటకు కారణమును, అగ్నిభేదములలో జాఠరాగ్నిప్రాధాన్యమును, జాఠరాగ్నిదుష్టమగువిధంబును, జాఠరాగ్నిదుష్టిచే నేరోగములు జనించునదియు,

గ్రహణీస్వరూపమును, గ్రహణీదోషలక్షణమును, గ్రహణీదోషపూర్వరూపంబును, గ్రహణీదోషముల నాల్గుభేదములకును వేరువేరు లక్షణములును, వానికి వేరువేరు చికిత్సలును, గ్రహణీదోషమున అవస్థాభేదము ననుసరించి చికిత్సావిధానమును, అత్యగ్ని కల్గువిధమును, అత్యగ్నిచికిత్సాక్రమమును, ఈవిషయము లన్నియు గ్రహణీచికిత్సితమను నీయధ్యాయమున వివరించి చెప్పబడినవి.

ఇత్యగ్నివేశకృతే తన్త్రే చరకప్రతిసంస్కృతే, దృఢబలసంపూరితే
చికిత్సాస్థానే గ్రహణీచికిత్సితం నామ పంచదశోఽధ్యాయః

వ్యా. ఇత్తెరంగున నగ్నివేశకృతంబును, చరకప్రతిసంస్కృతంబును నగుచరకసంహితయను నాయుర్వేదతంత్రమునందలి చికిత్సాస్థానమున దృఢబలసంపూరితభాగమునందలి గ్రహణీదోషచికిత్సితమనునది పదునైదవ యధ్యాయము సమాప్తము.

---

## షోడశాధ్యాయము.

అవతరణిక— గ్రహణీదోషచికిత్సితాంతమున తీక్ష్ణాగ్నిస్వరూపమును జెప్పునపుడు పిత్తప్రాధాన్యము చెప్పబడినది. దానిం బోలె పాండురోగంబును పిత్తప్రధాన మగుటం జేసి గ్రహణీచికిత్సానంతరము పాండురోగచికిత్సితము చెప్పబడును.—

మూ. అథాతః పాణ్డురోగచికిత్సితం వ్యాఖ్యాస్యామః. 1

ఇతి హ స్మాహ భగవానాత్రేయః. 2

వ్యా. గ్రహణీదోషచికిత్సితమును జెప్పినపిదప పాండురోగచికిత్సితమును అధికరించిన యధ్యాయము భగవానుడగునాత్రేయు డుపదేశించినదానికన్న న్యూనాతిరేకముకాకుండునట్లు వివరింపబడును.

ఈవ్యాధియందు హరితాదివర్ణభేదము లున్నను పాండువర్ణము ప్రధానముగ నుండుటంజేసి పాండురోగ మనబడును. ఈవిషయము సుశ్రుతమున నిట్లుచెప్పబడినది:— "సర్వేషు చైతేషు హి పాణ్డుభావః యతోఽధికోఽతః ఖలు పాణ్డురోగః" (సు. ఉ. అ. ४४.) అట్టి పాండురోగచికిత్సితమును దెల్పునధ్యాయము పాండురోగచికిత్సితమని యధ్యాయసంజ్ఞ. ఈయధ్యాయమున కామల-హలీమకము మున్నగు రోగముల చికిత్సితంబును చెప్పబడును. అవియును పాండురోగభేదములోనే చేరినవి యగుటం జేసి పాండురోగశబ్దముచేత సంగృహీతములు. లేక "పాండురోగాదీనాం చికిత్సితం-పాణ్డురోగచికిత్సితం" అను విగ్రహముచే నవియును పాండురోగశబ్దముచేతనే గ్రహింప

నగును. కావున కామలాదిచికిత్సా ప్రతిపాదనముచే ప్రతిజ్ఞాలోపము లేదని యెరుంగునది.

## పాండురోగభేదములు.

మూ. పాణ్డురోగాః స్మృతాః పఞ్చ వాతపిత్తకఫైస్త్రయః,
చతుర్థస్సన్నిపాతేన పఞ్చమో భక్షణాన్మృదః. 3

వ్యా. పాండురోగము వాత-పిత్త-కఫ-సన్నిపాతములచే వేరువేరుగ జనించుటంజేసి నాల్గుభేదములును, మృత్తును భక్షించుటచే గల్గునదియు నొకటియు జేరి యైదు భేదముల గల్గియుండును.

సూత్రస్థానమునందలి యష్టోదరీయాధ్యాయమున "పఞ్చ పాణ్డురోగా ఇతి:—వాత-పిత్త-కఫ-సన్నిపాత-మృద్భక్షణజాః" (సూ. అ. ౧౯. సూ. ౫౩.) అనువాక్యముచేతనే పాండురోగభేదము లైదని చెప్పబడినది. అయినను సుశ్రుతమున "పాణ్డ్వామయోఽష్టార్థవిధః ప్రదిష్టః పృథక్ సమస్తైః యుగపచ్చ దోషైః" (సు. ఉ. అ. ౪౪) అని చెప్పబడిన చతుర్విధత్వమును నిరసించి పంచవిధత్వమును సూచించుటకై యిచ్చట మరల పాండురోగభేదములు పేర్కొనంబడినది. సుశ్రుతాచార్యులు మాత్రము మృద్భక్షణజమును సాన్నిపాతికమున కభిన్నతను దలచి వాతికాదిభేదముల నాల్గిటిమాత్రము చెప్పిరి. మరియు మాధవకరాది సంగ్రహగ్రంథకారులును ఈచరకమతానుసారముగనే వివరించిరి.

## పాండురోగసామాన్యసంప్రాప్తి.

మూ. దోషాః పిత్తప్రధానాస్తు యస్య కుప్యన్తి ధాతుషు,
శైథిల్యం తస్య ధాతూనాం గౌరవం చోపజాయతే. 4
తతో వర్ణబలస్నేహాః యే చాన్యేఽప్యోజసో గుణాః,
వ్రజన్తి క్షయమత్యర్థం దోషదూష్యప్రదూషణాత్. 5
సోఽల్పరక్తోఽల్పమేదస్కః నిస్సారశ్శిథిలేన్ద్రియః,
వైవర్ణ్యం భజతే

వ్యా. వాత-పిత్తకఫములు పిత్తమును ప్రధానముగ జేసికొని (వానివాని ప్రకోపమునకు జెప్పినకారణములచే) ప్రకోపమునొంది ఏమనుజునిశరీరమునందలి రసరక్తాదిధాతువులయందు వ్యాపించునో ఆమనుజునకు శరీరమునందలిధాతువులు శిథిలములై (సారము లేమింజేసి) తొలుత బరువుగ నుండును. పిమ్మట పైజెప్పినరీతిగ దోషములచే

రసాది దూష్యములు (ధాతువులు) మిక్కిలి దూషితములగుటంజేసి శరీరవర్ణంబును బలంబును స్నేహాంశంబును ఓజస్సుకు సంబంధించిన దశవిధగుణంబులును మిక్కిలి క్షీణించును. అట్టిమనుజుడు రక్తంబును మేదస్సును మిక్కిలి స్వల్పముగ కలవాడై, ధాతుసారము ఇంచుకేనియు లేనివాడై చక్షురాదీంద్రియములపాటవము దక్కి శరీరమున వైవర్ణ్యము నొందును.

ఇచ్చట 'పిత్తప్రధానాః' అనుచోట పిత్తమును ప్రధానముగ జేసికొనిన వాతకఫములని యర్థము. వ్యక్తిగత బహుత్వవివక్షచే బహువచనము సంగతము. మరియు సారమనునది మనుజసామాన్యముగ త్వక్కు, రక్తము, మాంసము, మేదస్సు, అస్థి, మజ్జ, శుక్రము, సత్వమునని యెనిమిదివిధముల నుండును. వీనివివరణమంతయు విమానస్థానమున సారాణ్యష్టౌ పురుషాణాం బలప్రమాణవిశేషజ్ఞానార్థం ఉపదిశ్యన్తే. తద్యథా:—త్వగ్రక్తమాంసమేదోఽస్థిమజ్జశుక్రసత్వానీతి" (వి. అ. ౮. సూ. ౧౦౫) అని యుపక్రమించి వివరింపబడినవి. 'నిస్సారః' అనుపదమునకు పైజెప్పబడిన యెనిమిదివిధములైన ధాతుసారములు బొత్తుగ నశించి యుండునని యర్థము. రక్తంబును పిత్తంబును సమానజాతీయము లగుటవలన రక్తమును వృద్ధినందించవలసియున్నను రక్తోత్పాదకంబును పోషకంబునగు రసధాతువున రక్తపోషకాంశము పిత్తముచే క్షీణింపబడుటవలన రక్తమును వృద్ధినందించక క్షీణింపజేయును. మరియు పిత్తము శరీరవర్ణోత్కర్షమును కల్గించవలసియున్నను అయ్యది వికృతిజెందుటంజేసి వైవర్ణ్యమును కల్గించునని యెరుంగునది.

### పాండురోగనిదానపూర్వకసంప్రాప్తి.

మూ. తస్య హేతుం శృణు సలక్షణమ్. 6
క్షారామ్లలవణాత్యుష్ణవిరుద్ధాఽసాత్మ్యభోజనాత్,
నిష్పావమాషపిణ్యాకతిలతైలనిషేవణాత్. 7
విదగ్ధేఽన్నే దివాస్వప్నాత్ వ్యాయామాత్ మైథునాత్తథా,
ప్రతికర్మర్తువైషమ్యాత్ వేగానాం చ విధారణాత్. 8
కామచిన్తాభయక్రోధశోకోపహతచేతసః,
సముదీర్ణం యదా పిత్తం హృదయే సమవస్థితమ్. 9
వాయునా బలినా క్షిప్తం సమ్ప్రాప్య ధమనీర్దశ,
ప్రపన్నం కేవలం దేహం త్వఙ్మాంసాన్తరమాశ్రితమ్. 10
ప్రదూష్య కఫవాతాసృక్ త్వఙ్మాంసాని కరోతి తత్,

పాణ్డుహారిద్రహరితాః దీర్ఘాః బహువిధాః త్వచి. 11
స పాణ్డురోగ ఇత్యుక్తః

వ్యా. పాండురోగమునకు హేతువులును లక్షణంబును నీక్రింద వివరింపబడును. క్షార-అమ్ల-లవణరసములు గల పదార్థములను మిక్కిలి వేడిగను ఉష్ణవీర్యములుగను ఉండు పదార్థములను భుజించుట, పరస్పరవిరుద్ధములుగ నుండు పదార్థముల భుజించుట, దేశకాలాదులకు సాత్మ్యములు కానిపదార్థముల భుజించుట, అనుములు ఉద్దులు తెలికపిండి నువ్వులు నూనె వీనిని విశేషముగ నుపయోగించుట, భుజింపబడిన యన్నము విదగ్ధముగ పాకమునొందినపుడు పగటిపూట నిదురించుట, అట్టిసమయమున వ్యాయామమునైనను స్త్రీసంభోగమునైనను చేయుట, వమనాది పంచకర్మములను వానివిధి ననుసరింపక వ్యత్యస్తముగ చేసికొనుట, ఋతుచర్యాధ్యాయమున చెప్పబడిన ఆయాఋతువుల నాచరింపవలసినవిధానములకు వ్యత్యాసముగ నడుచుకొనుట, (లేక ఆయాఋతువులకు నియతములైన ఋతుధర్మములు వ్యత్యాసముగ మారియుండుట) వాతమూత్రపురీషాది వేగముల నిరోధించుట, కామము చింత భయము క్రోధము శోకము అనునీమానసిక వ్యాపారములచేత మనస్సునకు అభిఘాతము కల్గుట, ఈకారణములచేత పిత్తము ప్రకోపము నొంది హృదయస్థానమున జేరి, బలిష్ఠమైన వాతముచే నాకర్షింపబడి హృదయస్థానము నందలి పదిధమనుల జేరి వానిమూలమున శరీరమునందెల్ల వ్యాపించి శరీరమునందలి త్వక్కునకును మాంసమునకు మధ్యమున జేరి, కఫమును వాతమును రక్తమును చర్మమును మాంసమును చెరిచి, చర్మమున పాండువర్ణమును పసుపురంగును ఆకుపచ్చనిరంగును మున్నగు ననేకవర్ణముల గల్గించును. ఇయ్యది పాండురోగమని చెప్పబడును.

ఇచ్చట పాండుహారిద్రాదివర్ణవిశేషములు ఈవ్యాధియందు కల్గినను పాండువర్ణము ప్రధానమై యధికముగ నుండుటంజేసి పాండురోగమని చెప్పబడును. ఈవిషయమునే వాగ్భటాచార్యులు "పాణ్డుత్వం తేషు చాధికమ్, యతోఽతః పాణ్డురిత్యుక్తః సరోగః" (అ. హృ. ని. అ. ౧3. శ్లో. 3) అని చెప్పిరి. మరియు పాండురోగమున మూడుదోషములును ప్రకోపముజెందియుండును కావున త్రిదోషజన్యము. అందు పిత్తము మాత్రము మిగుల బలిష్ఠమై తానే స్వాతంత్ర్యమును వహించి యితరదోషముల రెండిటిని కలిసికొని యీరోగమును కల్గించును. ఈవిషయమునే తంత్రకారులు "దోషాః పిత్తప్రధానాస్తు యస్య కుప్యన్తి ధాతుషు" అని యుపదేశించిరి. మరియు వాతము మిక్కిలి బలిష్ఠమై యాపిత్తమును హృదయాదిస్థానములయం దెల్ల వ్యాపింపజేయుట మున్నగు తనవ్యాపారముల మాత్రము పూర్తిగ సాగించుచు దోడ్పడునుగాని పిత్తమును బోలె పాండురోగ

మును గల్గింప పూర్ణమైనశక్తి కల్గియుండదు. కావుననే "వాయునా బలినా క్షిప్తం" అనునది సంగతమగును. ఇత్తెరంగున నీవ్యాధికి పిత్తము ముఖ్యకారణమైనను దోషహేతు విశేషములబట్టి వాతికాదిభేదములు కల్పింపబడినవి.

మరియు "హృదయేసమవస్థితమ్. వాయునాబలినాక్షిప్తం సమ్ప్రాప్య ధమనీర్దశ" అనుచోట శరీరమునందలి హృదయస్థానమున సర్వధాతుసారరూపమైన యోజస్సును వహించు పదిధమనుల జేరి దానిమూలమున సర్వశరీరమున వ్యాపించి రసాదిధాతువులను చెరచునని యర్థము. అట్టి ధమనులు అర్థేదశమహామూలీయాధ్యాయమున నీతంత్రకారులచే విస్తరముగ నిట్లు వివరింపబడినవి:—"తేన మూలేన మహతా మహామూలా మలా దశ, ఓజోవహాశ్శరీరేఽస్మిన్ విధమ్యన్తే సమన్తతః.........ధ్మానాద్ధమన్యః స్రవణాత్స్రోతాంసి సరణాత్సిరాః" (సూత్ర. అ. ౩౦. శ్లో. ౮-౧౨) ప్రకుపితమైన పిత్తము అట్టి సర్వధాతువులకు ప్రధానాశ్రయమై ప్రాణాధారమైన పదిధమనులయందును వ్యాపించి పాండురోగమును కల్గించునని ప్రకృతమూలమునకు ముఖ్యభావము.

## పాండురోగపూర్వరూపములు.

మూ. తస్య లిఙ్గం భవిష్యతః,

హృదయస్పన్దనం రౌక్ష్యం స్వేదాఽభావః శ్రమస్తథా. 12

వ్యా. పాండురోగము జనించుటకు ముందు రొమ్ము అదరును. చర్మము జిడ్డులేక రూక్షముగ నుండును. చెమటబట్టదు. శ్రమము కల్గును. ఇవి పాండురోగమునకు పూర్వరూపములు. (మరియు—"అరుచిః పీతమూత్రత్వం స్వేదాభావోఽల్పవహ్నితా, సాదశ్శ్రమః" (అ. హృ. ని. అ. ౧౩) అని వాగ్భటాచార్యులు చెప్పిరి కావున అరుచియు, మూత్రము పచ్చనగుటయు, అగ్నిమాంద్యంబును పాండురోగమునకు పూర్వరూపములని యెరుంగునది.)

## పాండురోగసామాన్యలక్షణములు.

మూ. సముద్భూతేఽస్మిన్ భవేత్సర్వః కర్ణక్ష్వేడీ హతానలః,
దుర్బలస్సదనోఽన్నద్విట్ శ్రమభ్రమనిపీడితః. 13
గాత్రశూలజ్వరశ్వాసగౌరవాఽరుచిమాన్నరః,
మృదితైరివ గాత్రైశ్చ పీడితోన్మథితైరివ. 14
శూనాక్షికూటో హరితః శీర్ణలోమా హతప్రభః,
కోపనశ్శిశిరద్వేషీ నిద్రాళుః ష్ఠీవనోఽల్పవాక్. 15

పిణ్డికోద్వేష్టకట్యూరుపాదరుక్సదనాని చ,
భపన్త్యారోహణాయాసః (భవన్త్యారోహణాయాసైః)
విశేషశ్చాత్ర వక్ష్యతే. 16

వ్యా. పైచెప్పబడిన సంప్రాప్తిప్రకారము సంభవించిన యీపాండురోగముకల వానికి చెవులలో ధ్వని కల్గును. జాఠరాగ్ని చల్లారును. బలహీనమై శరీరము కృశించును. అన్నము పేరుచెప్పినను సహింపక ద్వేషము పుట్టును. బడలిక కల్గును. చక్రముపై నున్న వానివలె నొడలు తిరుగును. శరీరమునందెల్ల శూలనొప్పి కల్గును. జ్వరము, శ్వాసము కల్గును. శరీరము బరువుగ నుండును. ఒకవేళ నన్నమునం దభిలాష కల్గినను నోటికి రుచింపదు. అవయవము లన్నియు విరుగకొట్టినట్లులును, గట్టిగ బిగపట్టబడినవిధముగను, మెలిబెట్టినరీతిగను బాధ కల్గియుండును. రెండుకన్నులకును సంధిస్థానమున వాపు కల్గును. పచ్చనిరంగు కల్గియుండును. వెండ్రుకలూడును. శరీరకాంతి చెడును. కారణము లేకయే కోపము కల్గును. చల్లనివస్తువులయందును శీతోపచారములయందును ద్వేషము పుట్టును. నిద్ర యధికమగును. నోట జొల్లుకారును. మాటలాడుటకు శక్తి తగ్గును. పిక్కలు మెలిపెట్టినవిధముగ నొచ్చును. నడుమునందును తొడలయందును పాదములయందును నొప్పి కల్గును. ఆయవయవములన్నియు కృశించును. కొంచెము ఎత్తుగనుండు ప్రదేశమున కెక్కవలెనన్న మిగుల నాయాసముగ నుండును. (ఈలక్షణములు పాండురోగము లన్నిటియందును సామాన్యముగ నుండును.) మరియు వాతాదిపాండువులవిశేషకారణములును లక్షణంబులును ఈక్రింద చెప్పబడును. మరియు పిత్తప్రధానమైన యీరోగమున శీతాభిలాష కల్గవలసియున్నను వ్యాధిప్రభావముచే శీతద్వేషము కల్గునని యెరుంగునది).

పాండురోగవిశేషలక్షణములు, అందు వాతికపాండురోగలక్షణము.

మూ. ఆహారైరుపచారైశ్చ వాతలైః కుపితోఽనిలః,
జనయేత్ కృష్ణపాణ్డుత్వం తథా రూక్షోఽరుణాఙ్గతామ్. 17
అఙ్గమర్దం రుజం తోదం కమ్పం పార్శ్వశిరోరుజం,
వర్చశ్శోషాఽఽస్యవైరస్య శోఫానాహబలక్షయాన్. 18

వ్యా. వాతమును వృద్ధినందించు నాహారములచేతను ఉపచారములచేతను వాతము ప్రకోపమునొంది పాండురోగమును కల్గించును. అందు శరీరము నలుపుతో కూడిన పాండువర్ణముకల్గి రూక్షంబై యరుణవర్ణము కల్గియుండును. ఒడలు కట్టలతో కొట్టినట్లు నొప్పియు పోటును కల్గియుండును. వణకును ఇరుప్రక్కలయందును శిరంబునను నొప్పి కల్గును. పురీషము ద్రవము లేక శుష్కించును. నోటికి మధురాదిరసములరుచి

తెలియకుండును. శోఫము(నంజు) కల్గును. కడు పుబ్బరించును. శరీరబలము బొత్తుగ క్షీణించును. (పాండురోగసామాన్యముగ జెప్పిన కర్ణక్ష్వేడాదిలక్షణములు గాక యీ లక్షణములు విశేషములుగ నున్నచో నయ్యది వాతప్రకోపమున జనించిన పాండురోగ మని యెరుంగునది).

## పైత్తికపాండురోగనిదాన-లక్షణములు.

మూ. పిత్తలస్యాచితం పిత్తం యథోక్తైః స్వైః ప్రకోపణైః,
దూషయిత్వా తు రక్తాదీన్ పాణ్డురోగాయ కల్పతే. 19
స పీతో హరితాభో వా జ్వరదాహసమన్వితః,
తృష్ణా(ఛర్ది)మూర్ఛాపిపాసార్తః పీతమూత్రశకృన్నరః. 10
స్వేదనః శీతకామశ్చ న చాన్నమభినన్దతి,
కటుకాస్యో న చాస్యోష్ణం ఉపశేతేఽమ్లమేవ చ. 21
ఉద్గారోఽమ్లో విదాహశ్చ విదగ్ధేఽన్నేఽస్య జాయతే,
దౌర్గన్ధ్యం భిన్నవర్చస్త్వం దౌర్బల్యం తమ ఏవ చ. 22

వ్యా. పిత్తప్రకృతికలవానికిని పిత్తవర్ధకము లైనకారణములచే పిత్తము మిక్కిలి ప్రకోపమునొంది రక్తాదిధాతువులను చెడగొట్టి పాండురోగమును కల్గించును. అట్టి పిత్తపాండువుచే పీడింపబడినమనుజుడు పసుపురంగైనను పచ్చనిరంగైనను కల్గి జ్వరముచే తాపమునొందును. వానికి దప్పి యధికమై మూర్ఛగ్రమ్మును. వాంతియు దప్పియు నధికమగును. వానిమూత్రంబును మలంబును పచ్చగనుండును. చెమట యధికముగ గ్రమ్మును. శీతోపచారములను శీతస్పర్శమును కోరుచుండును. ఆహారముపై నిచ్చబోడమదు. నోరు చేదుగనుండును. వీనికి ఉష్ణపదార్థంబులును పులుపుకల పదార్థంబులును సుఖమును కల్గింపదు. (ఉష్ణ-అమ్లములు పిత్తవర్ధకములు కావున వానిని సేవించినచో పిత్త ముత్కటమై వ్యాధినినుమడింపజేయునని భావము. ఇది యపశయము). ఆహారము జాఠరాగ్నిచే పక్వముగునపుడు విదగ్ధముగ పాకము (అమ్లపాకము) వొందును. అప్పుడు త్రేనుపులు పుల్లగ వెడలును. కడుపులో మంటపుట్టును. శరీరముపై దుర్గంధము కల్గును. మలము ద్రవముగ వెడలును, చాల బలహీనము కల్గును, కన్నులకు చీకటి గ్రమ్మిన ట్లుండును.

ఇచ్చట 'కటుకాస్యః' అనుచోట కటుశబ్దమునకు చేదు అని యర్థము. "యశ్చ నింబం పరశునా యశ్చైనం మధుసర్పిషా, యశ్చైనం గన్ధమాల్యాద్యైః సర్వత్ర కటురేవ సః" ఇది మున్నగు స్థలములయందు కటుశబ్దమునకు తిక్తరసవాచకముగ ప్రయో

గము కవిసమయసిద్ధముగ కనబడుచున్నది. కావున అప్రయుక్తము కానేరదు. ఇత్తెరంగుననే తంత్రకారులును కొన్నిస్థలములయందు తిక్తశబ్దమునకు బదులు కటుశబ్దమును ప్రయోగించియున్నారు.

మరియు:—పాండురోగము లన్నిటియందును ''పిత్తప్రధానాః'' అని చెప్పియుండుటచేత పిత్తమే కారణముగ నుండును. అయినను పిత్తము వాతాదిసాహాయ్యమును కోరక స్వవర్ధకములైన హేతువులచే మిక్కుటముగ ప్రకోపమునొంది పిత్తప్రకృతి కలవానికి పాండువును కల్గించును. అట్టియెడ పైజెప్పిన పిత్తలక్షణములు కానంబడునని విశేషము. కావుననే మూలమున 'పిత్తలస్యాచితం' అని చెప్పబడినదికాని, వాతకఫముల నుద్దేశించి ''వాతలస్య, శ్లేష్మలస్య'' అని ప్రత్యేకముగ జెప్పియుండలేదు. పిత్తపాండువునకు పిత్తప్రకృతియు కారణమగును. వాతకఫపాండువులకు వాతకఫప్రకృతులు కారణములు కానేరవని తంత్రకారుల యాశయము.

### కఫజపాండురోగనిదాన-లక్షణములు.

మూ. వివృద్ధః శ్లేష్మలైశ్శ్లేష్మా పాణ్డురోగం స పూర్వవత్,
కరోతి, గౌరవం తన్ద్రాం ఛర్దిం శ్వేతాఽవభాసతామ్. 23
ప్రసేకం లోమహర్షం చ సాదం మూర్ఛాం భ్రమం క్లమం,
శ్వాసం కాసం తథాఽఽలస్యం అరుచిం వాక్స్వరగ్రహమ్. 24
శుక్లమూత్రాక్షివర్చస్త్వకటురూక్షోష్ణకామతాం,
శ్వయథుం మధురా(లవణా)స్యత్వం ఇతి పాణ్డ్వామయం కఫాత్.

వ్యా. కఫమును వృద్ధినందించు నాహారోపచారాదులచేత శ్లేష్మము వృద్ధినొంది సంప్రాప్తిలో చెప్పినవిధముగ రక్తాది ధాతువులను చెరిచి పాండురోగమును కల్గించును. అందు శరీరము బరువుగ నుండును. కునికిపాటు కల్గును. వమనములగును. చర్మము శ్వేతవర్ణము కల్గియుండును. నోట కఫము వెడలుచుండును. రోమాంచము కల్గును. శరీరము కృశించును. మూర్ఛ గ్రమ్మును. ఒడలు తిరుగును. బడలికయుం శ్వాసకాసములునుకల్గును. పనులయం దుత్సాహము లేక ప్రాలుమాలికగ నుండును. అరుచి కల్గును, మాటలాడునపుడు నోరును కంఠస్వరంబును పట్టినట్లుండును. మలమూత్రంబులును కన్నులును తెల్లగ నుండును. కారంబును రూక్షగుణంబును ఉష్ణవీర్యంబును కల పదార్థముల కోరును. ఉష్ణస్పర్శమును కోరుచుండును. వాపు కల్గును. నోరు తీపి కల్గియుండును. (లేక ఉప్పగ నుండును. ఈలక్షణములు కల్గినది కఫమున జనించిన పాండురోగమని యెరుంగునది. (వాగ్భటులు ''తన్ద్రాలవణవక్త్రత్వం'' అని చెప్పిరి).

### సాన్నిపాతికపాండునిదాన-లక్షణములు.

మూ. సర్వాన్న సేవినస్సర్వే దుష్టాః దోషాః త్రిదోషజం,
త్రిదోషలిఙ్గం కుర్వన్తి పాణ్డురోగం సుదుస్సహమ్.

వ్యా. వాతాదులకు ప్రత్యేకముగ జెప్పిన అన్నవిహారాది ప్రకారణములను క
సేవించుటంజేసి వాత-పిత్త-కఫములు మూడు నొక్కుమ్మడి సమముగ ప్రకోపమునొ
త్రిదోషపాండురోగమును కల్గించును. దీనియందు వాతికాది పాండువుల మూ
వేరువేరుగ జెప్పిన లక్షణములన్నియు నేకకాలమున కల్గియుండును. ఇయ్యది మిక్కి
యోరువరాక దుస్సాధముగ నుండును.

### మృజ్జపాండురోగసంప్రాప్తి, లక్షణములు.

మూ. మృత్తికాదనశీలస్య కుప్యత్యన్యతమో మలః,
కషాయా మారుతం పిత్తమూషరా, మధురా కఫమ్.
కోపయేన్మృద్రసాదీంశ్చ రౌక్ష్యాద్భుక్తం విరూక్షయేత్,
(విరూక్ష్యచ), పూరయత్యవిపక్వైవ స్రోతాంసి నిరుణద్ధి చ.
ఇన్ద్రియాణాం బలం హత్వా తేజోవీర్యౌజసీ తథా,
పాణ్డురోగం కరోత్యాశు బలవర్ణాగ్నినాశనమ్.
శూనగణ్డాక్షికూటభ్రూః శూనపాన్నాభిమేహనః,
(శూనగండాక్షికూటభ్రూ నాభిపాదాగ్రమేహనః)
క్రిమికోష్ఠోఽతిసార్యేత మలం సాఽసృక్కఫాన్వితమ్.

వ్యా. మృత్తికను తినుస్వభావము కలవానికి వాతాదిదోషములలో న్యే
నొకటి ప్రకోపమునొందును; అందు కషాయ(వగరుకల)మృత్తిక వాతమును, కారమ
చౌటిమట్టి పిత్తమును, తీపికలమట్టి కఫమును ప్రకోపింపజేయును. ఆట్టి మృద్భక్షణ
చేత నాయాదోషములు ప్రకోపించి పాండువును కల్గించును. మట్టియందలి రౌ
గుణముచేత రసాదిధాతువులను భుజింపబడిన యాహారమును రూక్షములుగజేసి, భు
బడిన యామృత్తు పక్వముకాకయే ధాతువులు సంచరించుమార్గముల వ్యాపించి
మార్గమును నిరోధించును. మరియు చక్షురాదీంద్రియములబలమును తేజస్సును
మును ఓజస్సు వీనినన్నిటిని ధ్వంసము చేసి పాండురోగమును కల్గించును. ఈరోగ
బలంబును వర్ణంబును జాఠరాగ్నియు శీఘ్రముగ నశించును. మరియు నీవ్యాధియ
చెక్కిళ్లు, కన్నులసంధి, కనుబొమలు, బొడ్డు, మేహనము, ఈస్థలములయందు

కల్గును. కోష్ఠమున క్రిములు చేరి రక్తముతోడను కఫముతోడను కూడినమలము పలుమారు వెడలును. ఈలక్షణము కల్గినది మట్టిని తినుటచే గల్గిన పాండురోగమని యెఱుంగునది.

ఈపాండురోగమునందును మృత్తిక ఊషరాదిభేదములు కల్గినది. క్రమముగ వాత-పిత్త-కఫములను ప్రకోపింపజేయు కారణముగ నగును. అయినను అట్టి మృత్తికను బట్టియే లక్షణంబులును; చికిత్సయు విలక్షణముగ నేర్పడియుండుటంజేసి మృత్తికయె ఈపాండురోగమునకు ఉత్పాదకముకాని దోషములు కానేరవు. మరియు మృత్తిక ధాత్వాదులను రూక్షములుగ జేసి పక్వము కాకయే స్రోతోమార్గముల వ్యాపించి యడ్డగించి బలవర్ణాదుల నాశనముజేసి శోఫాదుల కల్గించునని చెప్పబడినది గాని వాతాదులు కారణములని చెప్పియుండలేదు. కావున మృజ్జపాండురోగమనుటకు విరోధము లేదు.

## పాండురోగాఽసాధ్యలక్షణములు.

మూ. పాణ్డురోగశ్చిరోత్పన్నః ఖరీభూతో న సిధ్యతి,
కాలప్రకర్షాచ్ఛూనానాం(చ్ఛూనాఙ్గః) యశ్చ పీతాని పశ్యతి. 31
బద్ధాఽల్పవిట్కం సకఫం హరితం యోఽతిసార్యతే,
దీనశ్శ్వేతాఽతదిగ్ధాఙ్గః ఛర్దిమూర్ఛాతృషాఽన్వితః　　　32
స నాస్త్యసృక్ క్షయాద్యశ్చ పాణ్డుశ్శ్వేతత్వమాప్నుయాత్,
ఇతి పఞ్చవిధస్యోక్తం పాణ్డురోగస్య లక్షణమ్.　　　33

వ్యా. పాండురోగము తగినచికిత్స లేమింజేసి చిరకాలమునుండి యనుసరించియుండునెడ నయ్యది మిగుల కఠినమై యసాధ్యమగును. మరియు చాలకాలము చికిత్స లేక యుండుటవలన ప్రబలమైన వాపుకల్గి కంటికి కగపడు వస్తుజాలమునెల్ల పచ్చనివిగ చూచుచున్నయెడ వానికి పాండురోగము అసాధ్యమగును. మరియు పాండురోగపీడితుడగు రోగికి కఫముతో గూడి పచ్చనైన మలము బద్ధగించి కొంచెముకొంచెముగ మాటిమాటికి వెడలుచు, మిక్కిలి బలహీనమై శరీరమంతయు మిక్కిలి తెల్లబడి, వాంతియు మూర్ఛయు దప్పియు కల్గినయెడ నారోగి బ్రతుకనేరడు. మరియు రక్తము బొత్తుగ క్షీణించుటవలన శరీరమంతయు తెల్లబడి, కన్నులును దంతమున కాధారముగ నుండు చిగుళ్లు (దంతమ్మాంసములు)ను గోళ్లును మలమూత్రములును కూడ మిక్కిలి తెల్లబడియుండునెడ, అట్టిరోగి బ్రతుకనేరడు. ఇత్తెరంగున వాతాదిభేదములచే నైదువిధములైన పాండురోగముయొక్క లక్షణములు వివరింపబడినది.

మరియు పాణ్డురోగాసాధ్యలక్షణము తంత్రాంతరమున నిట్లు చెప్పబడినది:— "పాణ్డు దన్తనఖో యస్తు పాణ్డునేత్రశ్చ యో భవేత్, పాణ్డుసంఘాతదర్శీ చ పాణ్డురోగీ వినశ్యతి" దీనియర్థము వ్యాఖ్యాతము.

## కామలానిదాన-సంప్రాప్తి-లక్షణములు.

మూ. పాణ్డురోగీ చ యోఽత్యర్థం పిత్తలాని నిషేవతే,
తస్య పిత్తమసృఙ్మాంసం దగ్ధ్వా రోగాయ కల్పతే. 34
హారిద్రనేత్రస్స భృశం హారిద్రత్వఙ్నఖాననః,
రక్తపీతశకృన్మూత్రః భేకవర్ణో హతేన్ద్రియః. 35
దాహాఽవిపాక దౌర్బల్యసదనాఽరుచికర్శితః,
కామలా బహుపిత్తైషా కోష్ఠశాఖాశ్రయా మతా. 36

వ్యా. పాండురోగము కలమనుజుడు మిక్కుటముగ పిత్తమును వృద్ధినొందించు పదార్థములను అధికముగ సేవించినచో వానికి పిత్తము మిక్కిలి ప్రకోపమునొంది రక్తమాంసములను శోషింపజేసి కామలారోగమును కల్గించును. ఈరోగముచే పీడింపబడిన వానికన్నులును పసుపువలె పచ్చనై చర్మంబును గోళ్లును ముఖంబును పచ్చగ నుండును. మలమూత్రములు రక్తమును బోలె నెఱ్ఱగనైనను పచ్చగనైన నుండును. శరీరమంతయు శుష్కించి కప్పవలె నుండును. చక్షురాదీంద్రియము లన్నియు పాటవముడిగి వానివాని వ్యాపారముల చేయ సమర్థములు కాకుండును. మరియు తాపంబును, అజీర్ణంబును, బలహీనంబును, ఒడలినొప్పులును, అరుచియు వానిని మిక్కిలి బాధించును. ఈకామలారోగము మిక్కుటమైన పిత్తము కోష్ఠమునందును శాఖల (రక్తాదిధాతువులు త్వక్కు శాఖలనబడును) ను ఆశ్రయించి యుండుటచే గల్గును. (ఈ కామలారోగము పాండురోగమున తగిన చికిత్సజేయక పిత్తవర్ధకములగు నపథ్యముల సేవించుటచే కల్గును.)

ఇచ్చట నీవివరణను నెరుంగునది:—కామలారోగము రెండువిధములు. అందొకటి పాండురోగమున తగినచికిత్సజేయక యుపేక్షించి పిత్తమును వృద్ధినొందించు పులుపు మున్నగువానిని విశేషముగ సేవించినయెడ పిత్తము ప్రకోపించి కోష్ఠమునందును రక్తాదిధాతువులయందును చేరి కల్గింపబడునది. రెండవది పాండురోగము లేకున్నను పిత్తము ప్రకోపించి శాఖల (ధాతువుల) మాత్ర మాశ్రయించి జనించునది. ఈవిభాగమునే వాగ్భటాచార్యులు "భవేత్పిత్తోల్బణస్యాఽసౌ పాణ్డురోగాదృతేఽపి చ." (అ. హృ. ని. అ. ౧౩.) అనువాక్యముచే జెప్పిరి. కొందరు వ్యాఖ్యాతలు "కామలా

బహుపిత్తైషా కోష్ఠశాఖాశ్రయా మతా.” అను పైవాక్యముచేతనే రెండువిధములగు కామలాభేదములును ఈతంత్రకారునిచే సూచింపబడినదని చెప్పెదరు.

హారీతసంహితయందు కామల-కుంభకామల-హలీమకములనుకూడ పాండురోగభేదములయందే అంతర్భావము చేసి యిట్లు చెప్పిరి:—“వాతేన పిత్తేన కఫేన చైవ త్రిదోష-మృద్భక్షణసంభవే చ, ద్వే కామలే చైవ హలీమకశ్చ స్మృతోఽష్టధైవం ఖలు పాణ్డురోగః.”

## కుంభకామలాలక్షణము.

మూ. కాలాన్తరాత్ఖరీభూతా కృచ్ఛ్రా స్యాత్కుమ్భకామలా,

వ్యా. పైజెప్పబడిన కామలారోగమునకు తగినచికిత్స జేయక యుపేక్షించినచో నయ్యది మిగుల క్రూరమై (రూక్షభావమునొంది) కుంభకామల యనబడును. ఇది మిక్కిలి కృచ్ఛ్రసాధ్యము. (కామలావ్యాధియే అవస్థావిశేషమునంజేసి కోష్ఠమున నే చేరిన నయ్యది కుంభకామల యనబడును. కుంభమన కోష్ఠము, అందు జనించినకామల కుంభకామల అని యన్వర్థసంజ్ఞచే నీయర్థము ఏర్పడును.)

మరియు సుశ్రుతమున “భేదస్తు తస్యాః ఖలు కుమ్భసాహ్వః శోథో మహాంస్తత్ర చ పర్వభేదః.” అని చెప్పియున్నది. దీనివలన కుంభకామలయందు విశేషముగ వాపు కల్గియుండునని తెలిసెడి.

## అసాధ్యకామలాలక్షణము.

మూ. కృష్ణపీతశకృన్మూత్రః (కృష్ణమూత్రశకృన్నేత్రః) భృశం
శూనశ్చ మానవః. 37
సరక్తాక్షిముఖచ్ఛర్దివిణ్మూత్రో యశ్చ తామ్యతి,
దాహాఽరుచితృషానాహతన్ద్రామోహసమన్వితః. 38
నష్టాగ్నిసంజ్ఞః క్షిప్రం హి కామలావాన్ విపద్యతే,

వ్యా. కామలారోగపీడితునకు మలమూత్రములును (కన్నులును) నల్లగనైనను పచ్చగనైన నుండి మిక్కిలి వాపు కల్గినను; కన్నులును ముఖంబును ఎఱ్ఱనై, వాంతియు మలమూత్రంబులును రక్తవర్ణము కల్గి వెడలుచు మూర్ఛ కల్గినను; తాపంబును, అరుచియు, దప్పియు, కడుపుబ్బరంబును, కునికిపాటును, మూర్ఛయు కల్గినను; కాయాగ్ని బొత్తుగ నశించి యొడలెరుంగకున్నను, అట్టి కామలారోగి శీఘ్రముగనే మృతినొందును. (హలీమకలక్షణ మీయధ్యాయముననే చికిత్సాంతమున జెప్పబడును.)

మరియు తంత్రాంతరమున కుంభకామలాఽసాధ్యలక్షణము వేరుగ నిట్లు నది:—"ఛర్ద్యరోచకహృల్లాసజ్వరక్లమనిపీడితః, నశ్యతి శ్వాసకాసార్తో కుమ్భకామలీ." కుంభకామలాపీడితునకు వాంతి, అరోచకము, ఓకలింతలు, బడలిక, శ్వాసకాసములు, విరేచనములు అను నీయుపద్రవములు కల్గినయెడ మని యర్థము.

పాండుకామలారోగసామాన్యచికిత్సాక్రమము, అందు శోధనము.

మూ॥ సాధ్యానామితరేషాన్తు ప్రవక్ష్యామి చికిత్సితమ్.
తత్ర పాణ్డ్వామయీ స్నిగ్ధః తీక్ష్ణైరూర్ధ్వానులోమికైః,
సంశోధ్యో మృదుభిః తిక్తైః కామలీ తు విరేచనైః.

వ్యా॥ పైనిర్దేశింపబడిన పాండురోగములలో సాధ్యములకు, కృచ్ఛ్రసా కును చికిత్సావిధాన మీక్రింద చెప్పబడును:—పాండురోగపీడితునకు తొలుత ప్రకారము స్నేహనముచేసి, కోష్ఠము స్నిగ్ధమై మృదువైనపిదప పాండురోగికి మునం దూర్ధ్వభాగమునందలి (ఆమాశయమునందలి) దోషముల హరించు లైన వమనౌషధములచే వమనములను, అనులోమకరములగు తీక్ష్ణములైన విరేచ ములచేత విరేచనములను చేయించవలెను. కామలారోగికిని స్నేహనముచేసి స్నిగ్ధమైనపిదప చేదురసముకల్గి మృదువైన విరేచనౌషధములచే విరేచనముల మా చేయించవలెను.

ఇచ్చట "ఊర్ధ్వానులోమికైః సంశోధ్యః" అనుచోట "ఊర్ధ్వగ హరైః-వమనైః", "అనులోమికైః-వాతానులోమకరైః విరేచనైః" అని యన్వ కావున పాండురోగికి వమనములచేతను విరేచనములచేతనుకూడ శోధనముచేయ యెరుంగునది. గనుకనే కఫపాండురోగికి "కఫపాండుస్తు గోమూత్రక్లిన్నయుక్తా తకీం" అని విరేచనముకూడ క్రింద చెప్పబడును.

పాండు-కామలారోగములయందు శోధనానంతరము ఆహారము.

మూ. తాభ్యాం సంశుద్ధకోష్ఠాభ్యాం (సంశుద్ధకోష్ఠాయ) పథ్యాన్యన్న దాపయేత్,
శాలీన్ సయవగోధూమాన్ పురాణాన్ యూషసంహితాన్
ముద్గాఢకీమసూరైశ్చ జాఙ్గలైశ్చ రసైర్హితైః,
యథాదోషం విశిష్టం చ తయోర్భైషజ్యమాచరేత్.

వ్యా. పైజెప్పినరీతిగ (వమనవిరేచనములచే) శుద్ధమైన కోష్ఠముకల పాండురోగికిని కామలారోగికిని (శోధనానంతరము) ఈక్రిందజెప్పబడు పథ్యములైన యన్నాదుల నాహారముగ నియ్యవలెను. ప్రాతవియగు ఎఱ్ఱవరివడ్లబియ్యము, యవలు, గోధుమలు, వీని యన్నమును సప్పుకట్టులు గూర్చియైనను, పెసలు, కందిపప్పు, చిరుసెనగపప్పు వీనిని గూర్చియైనను, జాంగలజంతువుల మాంసరసములతో గూర్చియైనను ఆహారముగ నియ్యవలెను. (ఇచ్చట "సంశుద్ధకోష్ఠాభ్యాం, తాభ్యాం-పాండు-కామలారోగిభ్యాం" అని యన్వయము. 'సంశుద్ధకోష్ఠాయ' అను పాఠమున 'తాభ్యాం' వమనవిరేచనముల చేత, శుద్ధకోష్ఠము కలవానికి అని యర్థము.) పిమ్మట ఆయాదోషము ననుసరించి క్రింద చెప్పబడురీతిగ విశేషచికిత్సను పాండురోగ-కామలారోగములకు చేయనగును. (రోగసామాన్యముగ జేయదగినవిధానము క్లుప్తముగ జెప్పబడినది. విశేషచికిత్సితము ఆయాదోషాను సారముగ క్రింద చెప్పబడును. దానిని సక్రమముగ జేయవలెనని భావము.)

### { కామలా-పాండువులయందు స్నేహనమునకు పంచగవ్యాదిఘృతోపయోగము. }

మూ. పఞ్చగవ్యం మహాతిక్తం కల్యాణకమథాపి వా,
స్నేహనార్థం ఘృతం దద్యాత్ కామలాపాణ్డురోగిణే. 43

వ్యా. మరియు కామలారోగికిని, పాండురోగికిని పంచగవ్యఘృతమునైనను, మహాతిక్తకఘృతమునైనను, కల్యాణకఘృతమునైనను స్నేహనమునకై తొలుత నుపయోగింపవలెను. (ఇచ్చట పాండురోగములయందు "పిత్తప్రధానాః" అని నిదానమున చెప్పినప్రకారము పిత్తము ప్రధానముగ నుండును. కావున అట్టి పిత్తమును శమింపజేయుటకై పంచగవ్యాదిఘృతములు తొలుత జెప్పబడినవి.)

### పాండ్వాదులకు దాడిమాదిఘృతము.

మూ. దాడిమాత్కుడవో, ధాన్యాత్కుడవార్ధం, పలం పలమ్,
చిత్రకాత్ శృఙ్గబేరాచ్చ పిప్పల్యష్టమికా తథా. 44
తైః కల్కైః వింశతిపలం ఘృతస్య సలిలాఢకే,
సిద్ధం హృత్పాణ్డుగుల్మార్శఃప్లీహవాతకఫార్తినుత్. 45
దీపనం శ్వాసకాసఘ్నం మూఢవాతే చ శస్యతే,
దుఃఖప్రసవినీనాం చ వన్ధ్యానాం చైష గర్భదమ్. 46
(ఇతి దాడిమాద్యం ఘృతమ్).

వ్యా. దానిమ్మపండ్లబెరడు ఒకకుడవము (నాల్గుపలములు), దనియాలు అర్ధకుడవము (రెండుపలములు), చిత్రమూలము ఒకఫలము, శుంఠి యొకపలము, పిప్పళ్లు అష్టమిక (అర్ధపలము), ఈభాగములవంతున వీనినన్నిటిని నూరి కల్కముచేసి ముప్పదిరెండు పలములు ఘృతమును, ఆఢకపరిమితము (నాల్గుప్రస్థములు) జలమును అన్నిటి నొకటిగ కూర్చి ఘృతపాకవిధిప్రకారము పక్వముచేసి యీఘృతము సేవించినచో హృద్రోగమును, పాండురోగమును, గుల్మములను, అర్శోరోగమును, ప్లీహరోగమును, వాతకఫరోగములను హరించును. అగ్నిని దీపింపజేయును. శ్వాసకాసముల హరించును. మూఢ (కోష్ఠమున నే బద్ధగించియుండు) వాతమును హరించును. కష్టముగ ప్రసవించువారికి మిక్కిలి హితకరము. వంధ్యాస్త్రీలకు గర్భమును కల్గించును. (ఇయ్యది దాడిమాదిఘృతమని చెప్పబడును.)

## కటుకాదిఘృతము.

మూ॥ కటుకా రోహిణీ ముస్తం హరిద్రే వత్సకాత్ఫలం,
పటోలం చన్దనం మూర్వా త్రాయమాణా దురాలభా. 47
కృష్ణా పర్పటకో నిమ్బః భూనిమ్బో దేవదారు చ,
తైః కార్షికైః ఘృతప్రస్థః సిద్ధః క్షీరచతుర్గుణః. 48
రక్తపిత్తం జ్వరం దాహం శ్వయథుం సభగన్దరం,
అర్శాంస్యసృగ్దరం చైవ హన్తి విస్ఫోటకాం స్తథా. 49
(ఇతి కటుకాద్యం ఘృతమ్).

వ్యా. కటుకరోహిణి, తుంగగడ్డలు, పసుపు, మ్రానిపసుపు, కోడిసెపాలవిత్తులు, చేదుపొట్ల, చందనము, చాగపట్ట, కలుకానుగ, దురదగొండి, పిప్పళ్లు, పర్పాటకము, వేపచెక్క, నేలవేము, దేవదారుచెక్క వీనిని ప్రత్యేకము ఒక్కొకకర్షమువంతున చేర్చి కల్కముచేసి యొకప్రస్థపరిమితమైన ఘృతమును నాల్గుప్రస్థములు ఆవుపాలను కలిపి అన్నిటి నొకటిగ జేర్చి ఘృతపాకవిధిప్రకారము పక్వముచేసి సేవించినయెడ రక్తపిత్తము, జ్వరము, తాపము, వాపు, భగందరము, అర్శస్సులు, రక్తప్రదరము, విస్ఫోటకములు ఇవి యన్నియు శమించును.

## పాండురోగులకు పథ్యాఘృతము.

మూ. పథ్యాశతరసే పథ్యావృన్తాఽర్ధశతకల్కవాన్,
ప్రస్థః సిద్ధో ఘృతా త్పేయః సపాణ్డ్వామయగుల్మనుత్. 50
(ఇతి పథ్యాఘృతమ్).

వ్యా. నూరుకరకకాయలబెరడును జలమునవైచి కషాయము కాచి యాకషాయ మున ఏబదికరకకాయలతొడిమలను కల్కముగ నూరి కలిపి, అందొక ప్రస్థము ఆవు నేతిని కలిపి, అన్నిటి నొకటిగ జేర్చి ఘృతపాకవిధిప్రకారము పక్వముచేసి యాఘృత మును తగినమాత్రతో ప్రతిదినంబును త్రాగినయెడ పాండురోగంబులును గుల్మంబులను నివర్తించును.

ఈఘృతయోగమున ఆవునెయ్యి ప్రస్థపరిమితమని చెప్పబడినది. సామాన్యపరి భాషచేత పథ్యాకషాయరూపమైన ద్రవము ఘృతమునకు నాల్గింత (నాల్గుప్రస్థము) లుండవలెను. కావున నూరు కరకకాయల బెరడున ఒకద్రోణపరిమితమైన జలమును బోసి నాల్గవవంతు మిగులునట్లు కషాయము కాచినయెడ నాల్గుప్రస్థములు పథ్యాక్వా థము ఘృతచతుర్గుణమగును. కావున ఒకప్రస్థము నెయ్యి, నాల్గుప్రస్థములు పథ్యా కల్కము, ఏబదికరకకాయలతొడిమలకల్కమును కల్పించి ఘృతపాకవిధిప్రకారము పక్వముచేయవలెనని యెరుంగునది.

పాండురోగమునకు దంతీఘృతము.

మూ. దన్త్యాశ్చతుష్పలరసే పిష్టైర్దన్తీశలాటుభిః,
తద్వత్ప్రస్థో ఘృతాత్సిద్ధః ప్లీహపాణ్డ్వర్తిశోఫజిత్. 51
(ఇతి దన్తీఘృతమ్.)

వ్యా. నాల్గుపలముల దంతివేళ్ల (నేపాళపువేళ్ల)యందు నాల్గుప్రస్థములు నీళ్లు పోసి నాల్గవవంతు (ఒకప్రస్థము) మిగుల కషాయము కాచి అందు ప్రస్థపరిమితఘృత మును, నేపాళపుకాయలకల్కమును ఘృతమునకు నాల్గవవంతు (నాల్గుపలములు) చేర్చి ఘృతపాకవిధిప్రకారము పక్వముజేసి యుపయోగించినచో ప్లీహవృద్ధియు పాండు రోగము, శోఫము వీనినన్నిటిని హరించును.

ఇచ్చట ''దన్త్యాశ్చతుష్పలరసే'' అనుచోట ''దన్త్యాః, చతుష్పలస్య, రసే-క్వాథే'' అని యన్వయము. నాల్గుపలముల పరిమితమైన దంతివేళ్లను చేర్చి సిద్ధముచేయ బడిన కషాయమని యర్థము. అట్టి క్వాథము ఘృతమునకు సమభాగముగ ప్రస్థపరిమిత ముగ నుండవలెను. ఘృతమునకు నాల్గవవంతు కల్కము (పరిభాషానుసారముగ) చేర్చుట సమంజసము. క్వాథపరిమాణము తంత్రాంతరమున నిట్లు చెప్పబడినది:—''న కుమ్భకుడవ క్వాథే ప్రస్థే, తత్కల్కసంయుతమ్, సర్పిః ప్రస్థం పచేత్, ప్లీహకామలాపాణ్డురోగ నుత్'' ఈవచనము ననుసరించియే పైమూలమునకు వ్యాఖ్య వివరింపబడినది. చక్రపాణి దత్తవ్యాఖ్యానమున ''దన్త్యాః క్వాథః ఘృతాచ్చతుర్గుణః స్థాప్యః'' అని క్వాథమునకు

చాతుర్గుణ్యమును చెప్పి పైని చెప్పబడిన తంత్రాంతరవచనప్రకారము ప్రస్థపరిమితము క్వాథమనియు పక్షాంతరముగ జెప్పిరి.

## ద్రాక్షాఘృతము.

మూ. పురాణసర్పిషః ప్రస్థో ద్రాక్షార్ధప్రస్థసాధితః,
కామలాగుల్మపాణ్డ్వర్తిజ్వరమేహోదరాపహః. 52
(ఇతి ద్రాక్షాఘృతమ్.)

వ్యా. ప్రస్థపరిమితమైన ప్రాతనేతిని ద్రాక్షపండ్లు అర్ధప్రస్థము (ఎనిమిదిపలములు) ఘృతమునకు నాలుగింతలు జలమును చేర్చి ఘృతపాకవిధిప్రకారము పక్వము చేసి త్రాగినచో కామల, పాండువు, జ్వరము, మేహము, ఉదరము వీని నన్నిటిని హరించును. (ఇచ్చట ద్రవమును చెప్పకుండుటచే 'ద్రవేఽప్యనుక్తే జలమేవ దేయం' అను సామాన్య పరిభాషచేతను ఘృతమునకు నాల్గింతలు జలమును జేర్పనగును.)

## కామలాహరహరిద్రాదిఘృతము.

మూ. హరిద్రాత్రిఫలానిమ్బబలామధుకసాధితం,
సక్షీరం మాహిషం సర్పిః కామలాహరముత్తమమ్. 53
(ఇతి హరిద్రాదిఘృతమ్.)

వ్యా. పసుపు, త్రిఫలములు, వేపపట్ట, చిట్టాముట్టి, అతిమధురము వీనిని సమ భాగములుగ జేర్చి కల్కముచేసి, కల్కమునకు నాల్గింతలు ఎనుపనేతిని (ఘృతమునకు నాల్గింతలు) ఆవుపాలను చేర్చి ఘృతపాకము చేసి యుపయోగించినచో నిది కామలను హరించుట కుత్తమముగ నుండును.

ఇచ్చట కల్కాదులకు పరిమితి చెప్పియుండలేదు కావున "జలస్నేహౌషధా నాం చ ప్రమాణం యత్ర నోదితం, తత్ర స్యాదౌషధాత్ స్నేహః స్నేహాత్తోయం చతుర్గుణమ్" అను సామాన్యపరిభాషచేత ఘృతమునకు నాల్గవవంతు కల్కమును జేర్ప నగును. మరియు ద్రవాంతరము లేక క్షీరమును మాత్రము నిర్దేశించి యుండుటవలన "స్నేహపాకవిధౌ యత్ర క్షీరమేకస్తు కథ్యతే, తోయాదీనామనిర్దేశే క్షీరమేవ చతుర్గుణమ్." అను విశేషపరిభాష ననుసరించి క్షీరమును ఘృతమునకు నాలుగింతలు జేర్ప నగును.

## పాండు-కామలాహరఘృతములు.

మూ. గోమూత్రే ద్విగుణే దార్వ్యాః కల్కేఽధ్యర్ధే చ సాధితః,

దార్వ్యాః పఞ్చపలక్వాథే కల్కే కాలీయకే పరః. 54
మాహిషాత్ సర్పిషః ప్రస్థః పూర్వః పూర్వే, పరే పరః,

వ్యా. ప్రస్థపరిమితమైన బఱ్ఱెనేతిలో నేతికి రెట్టింత (రెండుప్రస్థములు) గోమూత్రమును, రెండుకర్షములపరిమితమైన మ్రానిపసుపు కల్కమును చేర్చి ఘృతపాక విధిప్రకారము పక్వముచేసి పాండురోగమునం దుపయోగింపనగును.

మరియు ఐదుపలములపరిమితమైన మ్రానిపసుపును చేర్చి క్వాథముచేసి గూాక్వాథ మును (రెండు ప్రస్థములు), మ్రానిపసుపు కల్కమును (రెండుకర్షములు) ఒకప్రస్థము బఱ్ఱెనేతిని ఒకటిగ కలిపి ఘృతపక్వముచేసి కామలారోగమున నుపయోగించునది. (ఇది రెండు ఘృతయోగములు. మొదటిది పాండువునకు, రెండవది కామలకును ఉపయోగింప వలెను. రెండవయోగమున మొదటి యోగసాహచర్యమునుబట్టి దానిప్రకారము ఘృతము నకు ద్విగుణము క్వాథమును, కర్షద్వయ కల్కమును చేర్పనగును. పైజెప్పబడిన ఘృత యోగము లన్నియు పాండురోగములయందు స్నేహనమునకై తత్తదనుసారముగ నుప యోగింపనగును).

పాండురోగమున విరేచనవిధి.

మూ. స్నేహైరేభిరుపక్రమ్య స్నిగ్ధం మత్వా విరేచయేత్. 55
పయసా మూత్రయుక్తేన బహుశః కేవలేన వా,

వ్యా. పై జెప్పబడిన ఘృతయోగముల నుపయోగించి పాండురోగికి కోష్ఠము స్నిగ్ధమై యున్న యెడ గమనించి పిదప విరేచనము చేయింపవగును. అందు ఆవుపాలలో గోమూత్రమును కలిపి యైనను, లేక ఆవుపాలమాత్రముచే నైనను పలుమారు విరేచ నము చేయించవలెను.

పాండురోగమున దంతీఫలరసఫాంటము.

మూ. దన్తీఫలరసే కోష్ణే కాశ్మర్యాఞ్జలినా శృతమ్. 56
ద్రాక్షాఞ్జలిం మృదిత్వా వా దద్యాత్ పాణ్డ్వామయాపహమ్,

వ్యా. వేడిగనుండు నేపాళపుగింజలకషాయమున పెగ్గుమ్ముడుకాయ చూర్ణమును నాల్గుపలములు చేర్చియైనను, నలియకొట్టబడినద్రాక్షపండ్లు నాల్గుపలముల జేర్చియైనను వడగట్టి పాండురోగికి విరేచనమునకై త్రాగించవలెను (ఇచ్చట పైజెప్పిన చూర్ణమును కషాయమున జేర్చి ఫాంటవిధిప్రకారము చేయనగును).

మూ. ద్విశర్కరం త్రివృచ్చూర్ణం పలార్ధం పైత్తికః పిబేత్. 57

కఫపాణ్డుస్తుగోమూత్రక్లిన్నయుక్తం(యుక్తాం క్లిన్నాం)హరీ

వ్యా. అర్ధపలము త్రివృచ్చూర్ణమును రెట్టింతల చక్కెరతో కలిపి చల్లని
చేర్చి పిత్తపాండురోగి విరేచనమునకై త్రాగవలెను. కరకకాయలను గోమూత్ర
దుడకబెట్టి చూర్ణముచేసి గోమూత్రముతో కలిపి కఫజపాండురోగి విరేచన
త్రాగవలెను.

కామలారోగమునందు విరేచనమునకు ఆరగ్వధాదికల్కయోగము.

మూ. ఆరగ్వధం రసేనేక్షోః విదార్యామలకస్య చ.
సత్ర్యూషణం బిల్వపత్రం పిబేన్నా కామలాపహమ్,
దన్త్యర్ధపలకల్కం వా ద్విగుడం శీతవారిణా.
కామలీ త్రివృతాం వాపి త్రిఫలాయా రసైః పిబేత్,

వ్యా. రేలకాయలలోని జిగురు, త్రికటుకములు, మారేడాకు, వీనిని
కల్కముచేసి, చెరకురసముననైనను, ఉసిరికకాయలరసముననైనను కలిపి త్రాగి
కామలారోగమును హరించును. మరియు నేపాళపుగింజలను అర్ధపలము నూరి కల
చేసి చల్లని నీళ్లలో కలిపి చూర్ణమునకు రెండింతలు బెల్లమును కూడ చేర్చి త్రాగిన
కామల నివర్తించును. లేక తెగడను నూరి త్రిఫలాకషాయమున కలిపి త్రాగినను
లను హరించును.

పాండురోగాదులకు విశాలాదిఫాంటకషాయము.

మూ. విశాలా త్రిఫలాముస్తకుష్ఠదారుకలిఙ్గకాః.
కార్షికానర్ధకర్షాంశాం కుర్యాదతివిషాం తథా,
కర్షా మధురసాయాః ద్వౌ సర్వమేతత్సుఖామ్బునా.
మృదితం తం రసం పూతం పీత్వా లిహ్యాచ్చ మధ్వను,
కాసం శ్వాసం జ్వరం దాహం పాణ్డురోగమరోచకమ్.
గుల్మానాహామవాతాంశ్చ రక్తపిత్తం చ నాశయేత్,

వ్యా. చేదుపాపర, త్రిఫలములు, తుంగగడ్డలు, చెంగల్వకోష్టు, దేవదారు
కొడిసెపాలగింజలు, ఇవి ప్రత్యేకమొక్కొకకర్షప్రమాణము; అతివస అర్ధకర్షము,
పట్ట రెండుకర్షములు, ఈభాగముల ప్రకారము వీనినన్నిటిని ఒకటిగ గూర్చి చూ
జేసి సుఖోష్ణముగ నుండునీళ్లలో కలిపి మర్దనచేసి వడగట్టి యారసమును త్రాగి, పై
తేనెను నాకినయెడ కాసశ్వాసములు, జ్వరము, తాపము, పాండురోగము, అరోచ

గుల్మములు, కడుపుబ్బరము, వాతము, రక్తపిత్తము, అనునీరోగముల నన్నిటిని ధ్వంసము చేయును. (ఇచ్చట ఫాంటకల్పనము నీరీతి నెరుంగునది:—"క్షుణ్ణే ద్రవ్యపలే సమ్యక్ జలముష్ణం వినిక్షిపేత్, మృత్పాత్రే కుడవోన్మానం తతస్తు స్రావయేత్పటాత్, స స్యాచ్చూర్ణద్రవః ఫాణ్టః తన్మనం ద్విపలోన్మితమ్" ఒకపలప్రమాణము కల్కద్రవ్యమును చక్కగ దంచి చూర్ణముచేసి యొకకుండలో బోసి నాల్గుపలములు వేడినీళ్లను కూడ కలిపి చక్కగ మర్దనము చేసి వడగట్టినయెడ నాచూర్ణమునుండి స్రవించిన రసము ఫాంటమనబడును. దీనిని రెండుపలములు సేవింపదగునని యర్థము. ఈపరిభాష ననుసరించి ప్రకృతమున ఫాంటమును కల్పించునది).

### పాండురోగమునకు త్రిఫలాదిశీతకషాయములు.

మూ. త్రిఫలాయాః గుడూచ్యా వా దార్వ్యాః నిమ్బస్య వా రసమ్. 63
శీతం మధుయుతం ప్రాతః కామలార్తః పిబేన్నరః,

వ్యా. త్రిఫలములనైనను, తిప్పతీగెనైనను, మ్రానిపసుపునైనను, వేపపట్టనైనను (ఒకపలప్రమాణము) గ్రహించి మెత్తగ నలగగొట్టి యొకకుండపాత్రలో నునిచి అందు (ఆరుపలములు) చల్లనినీళ్లు పోసి యొకరాత్రి యంతయు నూరబెట్టి, మరునాటుదయమున దాని వడగట్టి యాశీతకషాయమున కొంచెముగ తేనెకలిపి త్రాగవలెను. ఇది పాండురోగమును హరించును.

(శీతకషాయకల్పనము తంత్రాంతరమున నిట్లుచెప్పబడినది:—"క్షుణ్ణం ద్రవ్యపలం సమ్యక్ షడ్భిర్నీరపలైః ప్లుతమ్, నిశోషితం హితం సస్యాత్ తథా శీతకషాయకః, తస్య మానం మతం పానే పలద్వయమితం బుధైః." ఈపరిభాషార్థము పైవ్యాఖ్యానమున జేర్పబడినది).

### పాండురోగమున క్షీరపానవిధి.

మూ. క్షీరమాత్రం పిబేత్పక్షుం గవ్యం మాహిషమేవ వా. 64
పాణ్డుర్గోమూత్రయుక్తం వా సప్తాహం త్రిఫలారసం,

వ్యా. ఆవుయొక్క పాలను మాత్రమునైనను, బఱ్ఱెయొక్క పాలను మాత్రమునైనను ప్రతిదినంబును పదునైదుదినములవరకును పాండురోగి త్రాగవలెను. లేక త్రిఫలాకషాయమును గోమూత్రమున కలిపి యేడుదినములవరకు ప్రతిదినంబును త్రాగవలెను.

### పాండుశోథహరమాతులుంగాంకురఫాంటము.

మూ. తరుజాన్ జ్వలితాన్ మూత్రే నిర్వాప్యామృద్య చాఙ్కురాన్. 65

మాతులుఙ్గస్య, తత్పూతం పాణ్డుశోథహరం పిబేత్,

వ్యా. మాదీఫలముచెట్టునందలి చిగుళ్లను నిప్పున కాల్చి గోమూత్రమున చల్లార్చి దానియందే చక్కగ పిసికి యారసమును వడగట్టి త్రాగినచో పాండురోగమును శోఫ (నంజు)ను హరించును.

### పాండురోగమున స్వర్ణక్షీర్యాదియోగము.

మూ. స్వర్ణక్షీరీ త్రివృచ్ఛ్యామే భద్రదారు సనాగరమ్. 66
గోమూత్రాఞ్జలినా పిష్టం మూత్రే వా క్వథితం పిబేత్,
క్షీరమేభిశ్శృతం వాపి పిబేద్దోషానులోమనమ్. 67

వ్యా. స్వర్ణక్షీరి(కంకుష్ఠము), తెల్లతెగడ, నల్లతెగడ, దేవదారు, శుంఠి వీనిని సమభాగములుగ జేర్చి, అంజలి (నాల్గుపలముల) పరిమితమైన గోమూత్రమును బోసి నూరి వడగట్టిత్రాగినను; లేక పైజెప్పిన స్వర్ణక్షీరి మున్నగు ద్రవ్యములను గోమూత్రము చేర్చి పక్వముచేసి త్రాగినను, లేక పైద్రవ్యములను చేర్చి కాచబడిన ఆవుపాలను త్రాగినను, వాతాదిదోషములను అనులోమముగ సంచరింపజేయును.

### పాండురోగమున హరీతకీప్రయోగము.

మూ. హరీతకీం ప్రయోగేణ గోమూత్రేణాఽథ వా పిబేత్,
జీర్ణే క్షీరేణ భుఞ్జీత రసేన మధురేణ వా 68

వ్యా. కరకకాయలను పైజెప్పిన రీతిగ గోమూత్రాదులలో కలిపి నూరియైనను త్రాగించవలెను. అట్టికషాయాదులను త్రాగి అది జీర్ణమైనవెంటనే పాలతోనైనను, మధుర రసద్రవ్యముల గూర్చి పక్వముచేయబడిన మాంసరసముతోనైనను అన్నమును భుజింపనగును.

### పాండురోగమున లోహచూర్ణయోగము.

మూ. సప్తరాత్రం గవాం మూత్రే భావితం వాఽప్యయోరజః,
పాణ్డురోగప్రశాన్త్యర్థం పయసా పాయయేద్భిషక్. 69

వ్యా. ఉక్కురాపొడిని గోమూత్రమునందు ఏడురాత్రులు భావనచేసిపాలతో కలిపి త్రాగించినచో పాండురోగములు శమించును. (భావనావిధి తంత్రాంతరమున నిట్లు చెప్పబడినది:—"దివా దివాతపే శుష్కం రాత్రౌ రాత్రౌ నివాసయేత్, శుష్కం చూర్ణీకృతం ద్రవ్యం సప్తాహం భావనావిధిః" భావనచేయవలసిన ద్రవ్యము రాత్రుల

యందు నియమిత ద్రవమునందు నానబెట్టి పగటిపూట ప్రతిదినంబును ఎండించవలెను. ఇట్లు ఏడుదినములు చేసిన నయ్యది భావన యనబడును. ఈపరిభాష ననుసరించి భావన చెప్పినస్థలములయందెల్ల నూహించునది).

### పాండ్వాదులకు నవాయసచూర్ణము.

మూ. త్ర్యూషణత్రిఫలాముస్తవిడఙ్గచిత్రకాస్సమాః,
నవాయోరజసో భాగాః తచ్చూర్ణం క్షౌద్రసర్పిషా. 70
భక్షయేత్, పాణ్డుహృద్రోగకుష్ఠార్శఃకామలాపహం,
నవాయసమిదం చూర్ణం కృష్ణాత్రేయేణ భాషితమ్. 71
(ఇతి నవాయసచూర్ణమ్.)

వ్యా. త్ర్యూషణములు, (శుంఠి, పిప్పళ్లు, మిరియాలు), త్రిఫలములు (కరక-తాని-ఉసిరికకాయలు), వాయువిడంగములు, చిత్రమూలము, ఈతొమ్మిది ద్రవ్యములను సమభాగములుగను, ఉక్కురాపొడిని (వీనికన్నిటికిని సమముగ) తొమ్మిదిభాగములుగను కూర్చి సూక్ష్మచూర్ణముగ జేసి, తేనెను నేతిని కలిపి ప్రతిదినంబును తినవలెను. దీనివలన పాండురోగము, హృద్రోగము, కుష్ఠములు, అర్శోరోగము, కామలారోగము, ఇవి యన్నియు శమించును. ఇయ్యది కృష్ణాత్రేయులచే చెప్పబడిన నవాయసచూర్ణము

### పాండురోగికి గుడనాగరాదిగుటికలు.

మూ. గుడనాగరమణ్డూరతిలాంశాన్ సమానతస్సమాన్,
పిప్పలీద్విగుణాం కుర్యాత్ గుటికాం పాణ్డురోగిణే. 72

వ్యా. బెల్లము, శుంఠి, మండూరము (ప్రాతయినుపచిట్టెము), నువ్వులు, వీనినన్నిటిని సమభాగములుగను, వీని కన్నిటికిని ద్విగుణితముగ పిప్పళ్లను చేర్చి మెత్తగ నూరి మాత్రలుచేసి పాండురోగికి నిప్పింపనగును.

### పాండ్వాదిరోగములకు మండూరవటకములు.

మూ. త్ర్యూషణం త్రిఫలాముస్తం విడఙ్గం చవ్యచిత్రకౌ,
దార్వీత్వఙ్మాక్షికో ధాతుః గ్రన్థికం దేవదారు చ. 73
ఏతాన్ ద్విపలికాన్ భాగాన్ చూర్ణం కుర్యాత్ పృథక్ పృథక్,
మణ్డూరం ద్విగుణం చూర్ణాత్ శుద్ధమఞ్జనసన్నిభమ్. 74
గోమూత్రేఽష్టగుణే పక్త్వా తస్మిం తత్ ప్రక్షిపేత్తతః,

ఉదుమ్బరసమాన్ కృత్వా వటకాంస్తాన్ యథాగ్నినా. 75
ఉపయుఞ్జీత, తక్రేణ సాత్మ్యం జీర్ణే చ భోజనం,
మణ్డూరవటకా హ్యేతే ప్రాణదాః పాణ్డురోగిణామ్. 76
కుష్ఠాన్యజీర్ణకం శోథం ఊరుస్తమ్భం కఫామయాన్,
అర్శాంసి కామలాం మేహం ప్లీహానం శమయన్తి చ. 77

వ్యా. త్రికటుకములు, త్రిఫలములు, తుంగగడ్డలు, వాయువిడంగములు, చవ్యము, చిత్రమూలము, మ్రానిపసుపుపట్ట, స్వర్ణమాక్షికము, మోడి, దేవదారుచెక్క, వీనిని ప్రత్యేకము రెండేసి పలములవంతున చేర్చి వేరువేరుగ మెత్తనిచూర్ణముగ జేసి యొకటిగకలిపి యుంచునది. పిమ్మట మండూరమును (ప్రాత యినుపచిట్టెమును) పైచూర్ణ సముదాయమునకు ద్విగుణము గ్రహించి (విధిప్రకారము శుద్ధిచేసి) కాటుకవలె మెత్తని చూర్ణము చేసి పైజెప్పబడిన చూర్ణసముదాయమున కంతటికిని యెనిమిదింత గోమూత్ర మున (మండూరచూర్ణమును మాత్రము) కలిపి చక్కగ వండి, (అయ్యది వటకములు చేయుటకు దగినట్టు పాకమగుసమయమున) అందు పైజెప్పబడిన త్రికటుకాదిద్రవ్య చూర్ణమును కలిపి పక్వముచేసి అత్తికాయలంతేసి మాత్రల చేయునది. ఇయ్యది మండూరవటకము లనబడును.

ఈవటకములను మనుజుడు జాఠరాగ్నిబలానుసారముగ ప్రతిదినంబును సేవించుచు తనకలవాటుగనుండు ఆహారమును ఆవుమజ్జిగతో భుజించవలెను. ఈవటకములు పాండు రోగులకు ప్రాణము నిచ్చునవి. మరియు కుష్ఠము, అజీర్ణము, శోఫ(నంజు), ఊరుస్తంభ వాతము, కఫరోగములు, అర్శస్సులు, కామల, ప్రమేహము, ప్లీహవృద్ధి అను నీవ్యా ధుల నన్నిటిని శమింపజేయును.

ఇచ్చట త్రికటుకములును త్రిఫలములును వేరువేరుగ నొక్కొక ద్రవ్యమును రెండేసి పలములవంతున భాగముల గల్పింపనగును. "మాక్షికో ధాతుః" అనుచోట సామాన్యవాచకమైనను "తాప్యం దార్వ్యాస్త్వచం" అని వాగ్భటాచార్యులు విశేష ముగ జెప్పియుండుటవలన స్వర్ణమాక్షికము గ్రహింపనగును. మరియు "గోమూత్రే ఉష్టగుణే పక్త్వా" అనుచోట త్రికటుకాదిచూర్ణమునకును మండూరచూర్ణమునకును చేరి అష్టగుణితము గోమూత్రమని యర్థము. త్రికటుకాది ద్రవ్యములు పదునాలుగును రెండేసి పలములపంతున ఇరువదియెనిమిదిపలము లగును. దీనికి ద్విగుణిత మండూరము ఏబదియారుపలము లగును. త్రికటుకాది చూర్ణమును మండూరచూర్ణమును కలిసి యెనుబదినాల్గుపలములు సముదితచూర్ణ మగును. దీనికి అష్టగుణితము గోమూత్రము ఈ

యర్థమును వాగ్భటాచార్యులు—"సర్వతోఽష్టగుణేఽథ తత్. పృథగ్ద్విపక్వే గోమూత్రే" (అ. హృ. చి. అ. ౧౬.) అని కంఠోక్తిగ చెప్పిరి. "యథాగ్ని నా" అనుచోట "యథాగ్ని" అనునది క్రియావిశేషణము. "నా" అనునది పృథక్పదము.

## పాండువులకు తాప్యాదిచూర్ణము.

మూ. తాప్యాద్రిజతురూప్యాఽయోమలాః పఞ్చపలాః పృథక్,
చిత్రకత్రిఫలావ్యోషవిడఙ్గైః పలికైస్సహ. 78
శర్కరాఽష్టపలోన్మిశ్రాః చూర్ణితా మధునాప్లుతాః,
అభ్యస్యాస్త్వక్షమాత్రా హి జీర్ణే నియమితాశినా. 79
కులుత్థకాకమాచ్యాదికపోతపరిహారిణా,

వ్యా. స్వర్ణమాక్షికము, శిలాజతువు, వెండికిట్టము (తారమాక్షికము), ఇనుపమలము (ఇనుపచిట్టెము), ఇవి ప్రత్యేకమొక్కొకటి యైదేసిపలములు; చిత్రమూలము, త్రిఫలములు, త్రికటుకములు, వాయువిడంగములు, ఇవి వేరువేరుగ నొక్కొకపలము, ఈభాగముల వంతున వీనినన్నిటి నొకటిగ చూర్ణముచేసి, అందు చక్కెర యెనిమిదిపలములు కలిపి కలియ మర్దించి పూటకు కర్షప్రమాణమువంతున తేనెతో కలిపి ప్రతిదినంబును అభ్యాసముగ సేవించునది. ఔషధము జీర్ణమైనపిదప హితమైన యాహారమును పత్థ్యనియమముగ భుజించినచో పైయోగమున జెప్పిన పాండువు మున్నగు రోగముల హరించును. మరియు ఉలవలు, కాచియాకు మున్నగు ఆకుకూరలు, పావురముల మాంసము వీనిని మానవలెను.

## పాండువులకు యోగరాజరసాయనము.

మూ. త్రిఫలాయాస్త్రయో భాగాః, త్రయస్త్రికటుకస్య చ. 80
భాగాశ్చిత్రకమూలస్య విడఙ్గానాం తథైవ చ,
పఞ్చాశ్మజతునో భాగాః తథా రూప్యమలస్య చ. 81
మాక్షికస్య చ శుద్ధస్య లౌహస్య రజసస్తథా,
అష్టౌ భాగాః సితాయాశ్చ, తత్సర్వం సూక్ష్మచూర్ణితమ్. 82
మాక్షికేణ ప్లుతం స్థాప్యం ఆయసే భాజనే శుభే,
ఉదుమ్బరసమాం మాత్రాం తతః ఖాదేద్యథాగ్ని నా. 83
దినే దినే ప్రయుఞ్జీత జీర్ణే భోజ్యం యథేప్సితం,

వర్జయిత్వా కులుత్థాని కాకమాచీం కపోతకమ్.
యోగరాజ ఇతి ఖ్యాతః యోగోఽయమమృతోపమః,
రసాయనమిదం శ్రేష్ఠం సర్వరోగహరం శివమ్.
పాణ్డురోగం విషం కాసం యక్ష్మాణం విషమజ్వరం,
కుష్ఠాన్యజీర్ణకం మేహం శోషం శ్వాసమరోచకమ్.
విశేషాద్ధన్త్యపస్మారం కామలాం గుదజాని చ,

(ఇతి యోగరాజ

వ్యా. త్రిఫలము ప్రత్యేకము మూడుభాగములు, త్రికటుకములు ప్రత్యేక మూడుభాగములు, చిత్రమూలము మూడుభాగములు, వాయువిడంగములు మూ భాగములు, గోమూత్ర శిలాజతువు, రూప్యమల రూపమైన శిలాజతువు, శుద్ధిచేయబ స్వర్ణమాక్షికము, ఉక్కురాపొడి, ఈనాల్గును ప్రత్యేకముగ నైదేసి భాగము చక్కెరయెనిమిదిభాగములు, ఈభాగముల ప్రకారము వీనినన్నిటి నొకటిగజేర్చి మె చూర్ణముగజేసి అందు చూర్ణమంతయు తడిసి ముద్దయగునంత లేనె కలిపి యొకయిన పాత్రలో పదిలముగ నునిచి, అందు మేడిపండంత మాత్రము పూటకు అగ్నిబలానుస ముగతినవలెను. ప్రతిదినంబు నుపయోగించుచు నయ్యదిజీర్ణమైన పిమ్మట నిచ్ఛాపథ్యము నాహారముచేయనగును. ఉలవలను, కాచికూరను, పావురములమాంసమును మాత్ర బొత్తుగమానవలెను. ఇయ్యది యమృతతుల్యమైన యోగరాజమను ఔషధము. ఇయ్య సర్వరోగహరంబును శ్రేష్ఠమైనరసాయనంబు నగును. దీనియుపయోగమున పాండువు విషము, కాసము, రాజయక్ష్మము, విషమజ్వరము, కుష్ఠములు, అజీర్ణము, ప్రమేహ శోషము (ధాతుక్షయము), శ్వాసము, అరోచకము, ఈరోగముల నన్నిటిని హరించు మరియు అపస్మారమును, కామలారోగమును, అర్శస్సులను విశేషముగహరించును.

ఇచ్చట:—"తథా రూప్యమలస్య చ" అనుచోట బంగరమున్నగు ధాతువుల వెండిధాతువువలన పర్వతశిలలనుండి సారరూపముగ వెడలుకిట్టము గ్రహింపబడును. శిలాజతుభేదములలో నొకటి. ఈభేదములు రసాయనచికిత్సితమున:—"హేమాదా సూర్యసన్తప్తాః స్రవన్తి గిరిధాతవః......రూప్యస్య కటుకశ్శ్వేతః శీతస్స్వాదు విపచ్య ...పశ్చిమస్తువిశిష్యతే" (చి. అ. ౧. పా. ౩) అనివిపులముగజెప్పబడినది. కా నచ్చట వ్యాఖ్యజూచునది.

## పాండ్వాదులకు శిలాజతువటకములు.

మూ. కౌటజత్రిఫలానిమ్బపటోలఘననాగరైః.

భావితాని దశాహాని రసైః ద్విత్రిగుణాని వా,
శిలాజతుపలాన్యష్టౌ తావతీ సితశర్కరా. 88

త్వక్క్షీరీ పిప్పలీ ధాత్రీ కర్కటాఖ్యాః పలోన్మితాః,
నిదిగ్ధ్యాః ఫలమూలాభ్యాం పలం యుక్త్వా త్రిగన్ధకమ్. 89

చూర్ణితం మధునః కుర్యాత్ త్రిపలేనాఽక్షికాన్ గుడాన్;
దాడిమామ్బుపయః పక్షిరసతోయసురాసవాన్. 90

తాన్ భక్షయిత్వాఽనుపిబేత్, నిరన్నో భుక్త ఏవ వా,
పాణ్డుకుష్ఠజ్వరప్లీహతమకాఽర్శోభగన్దరాన్. [రోదరాన్,
పూతిహృచ్ఛుక్ర (హృద్రోగశుక్ర) మూత్రాఽగ్నిదోషశోషగ
కాసాఽసృగ్దరపిత్తాఽసృక్ శోథగుల్మగలామయాన్. 92

తే చ సర్వవ్రణాన్ హన్యుః, సర్వరోగహరాశ్చ వాః,
((ఇతి శిలాజతువటకాః.)

వ్యా. కొడిసెపాలవిత్తులు, త్రిఫలములు, వేపపట్ట, చేదుపొట్ల, తుంగగడ్డలు, శుంఠి వీనిసమభాగములుగగూర్చి నలియగొట్టి నాలుగింతలునీళ్లుపోసి నాల్గవపాలుమిగుల కషాయముకాచి, అందు ఎనిమిదిపలములు శిలాజతువును పదిదినములవరకైనను, ఇరువది దినములవరకైనను, ముప్పదిదినములవరకైనను భావనచేయునది. భావనచే సంస్కరింప బడిన శిలాజతువునందు దానికి సమభాగములు (ఎనిమిదిపలములు) తెల్లచక్కెరను కలుపునది. మరియు తవక్షీరి (వెదురుప్పు), పిప్పళ్లు, ఉసిరికకాయలుబెరడు, కర్కాటక శృంగి వీనిని ఒక్కొకపలమువంతునను, వాకుడువేరును చెరియొకపలంబును చేర్చి మెత్తని చూర్ణముచేసి కలిపి, త్రిసుగంధమును (లవంగపుపట్ట, లవంగపత్రి, ఏలకులు) ఈమూటిని యుక్తియుక్తముగ (ఎంతపరిమితి చేర్చినచో పరిమళము కల్గునో అంతపరి మాణమును) చూర్ణముచేసి ఈచూర్ణసముదాయమును పైచెప్పిన శిలాజతువున చేర్చి యన్నింటి నొకటిగ మెత్తగ చూర్ణముచేసి, అందు మూడుపలములు మంచితేనె కలిపి కర్షప్రమాణమువంతున మాత్రలు చేయునది. ఈమాత్రలను పూట కొకటివంతున (అగ్నిబలానుసారముగ) భోజనమునకు ముందుగనైనను భుజించియైనను సేవించి వెంటనే పుల్లదానిమ్మరసమునైనను, ఆవుపాలనైనను, పక్షులమాంసరసమునైనను, మంచినీళ్లనైనను, సురామద్యమునైనను, ఆసవమునైనను త్రాగవలెను. ఇట్లు సేవించినచో హృద్రోగము,

శుక్రదోషము, మూత్రరోగములు, అగ్నిదోషము, ధాతుక్షయరోగము, విషములు, ఉదరరోగము, కాసము, రక్తప్రదరము, రక్తపిత్తము, శోఫము, గుల్మము, కంఠరోగము వీనినన్నిటిని హరించును. మరియు నీవటకములు పలుతెరంగులైన వ్రణములను హరించును. రోగముల నన్నిటిని హరించి సౌఖ్యమును కల్గించును.

శిలాజతుభావనావిధానము తంత్రాంతరమున నిట్లు చెప్పబడినది:—"తుల్యం గిరి జేన జలే చతుర్గుణే భావనౌషధం క్వాథ్యమ్, తత్క్వాథే పాదాంశే పూతోష్ణే ప్రక్షిపేత్ గిరిజమ్, తత్సమరసతాం యాతం సంశుష్కం ప్రక్షిపేద్రసే భూయః." భావనమునకుగా నిర్దేశింపబడిన కషాయమునకు జేర్పవలసిన క్వాథ్యద్రవ్యసముదాయమును శిలాజతువునకు సమభాగముగ గూర్చి క్వాథ్యమునకు నాల్గింతలజలమును చేర్చి నాల్గవవంతు మిగుల కషాయమును కాచవలెను. దానిని వడగట్టి వేడిగనుండునపుడు శిలాజతువును కషాయమున నుంచవలెను. రాత్రియంతయు శిలాజతువున క్వాథసారము ఇముడునట్లూరబెట్టి పగటియందు వెలికిందీసి చక్కగ నెండించవలెను. మరల కషాయమున వైచి రాత్రియం దూరబెట్టునది. ఇత్తెరంగున నియమితకాలమువరకును పలుమారు చేయనగును. ఇదియ భావనావిధి. ఈవిషయమునే యీతంత్రకారుడును ఇట్లు చెప్పెను:—"వీర్యోత్కర్షం పరంయాతి సర్వైర్వేకైకశోఽపివా, ప్రక్షిప్తోద్ధృతమప్యేతత్ పునస్తత్ప్రక్షిపేద్రసే కోష్ణే." (చి. అ. ౧ పా. 3 శ్లో. ౫౧).

ఈవిధానము ననుసరించి ప్రకృతయోగమున ఎనిమిదిపలముల శిలాజతువునకు సమానభాగముగ కొడిసెపాలవిత్తులు మున్నగు క్వాథ్యద్రవ్యములు సమభాగములుగ జేరిన సముదాయమును ఎనిమిదిపలములు జేర్చి అందు నాలుగింతలజలమును జేర్చి నాలవవంతు మిగుల క్వాథము జేసి అందు శిలాజతువున పైజెప్పినవిధముగ భావనజేయవలెనని యెరుంగునది. మరియు శిలాజతూత్పత్తిక్రమంబును వానిభేదములును గుణాదులును, ఆయాదోషానుసారముగ ప్రత్యేకోపయోగంబును ప్రథమాధ్యాయమున రసాయన తృతీయపాదమున జూచునది.

### పాండ్వాదులకు పునర్నవామండూరవటకములు.

మూ॥ పునర్నవా త్రివృద్వ్యోషవిడఙ్గం దారు చిత్రకమ్. 93
కుష్ఠం హరిద్రే త్రిఫలా దన్తీ చవ్యం కలిఙ్గకాః,
పిప్పలీ పిప్పలీమూలం ముస్తం చేతి పలోన్మితమ్. 94
మణ్డూరం ద్విగుణం చూర్ణాత్, గోమూత్రే ద్వ్యఢకే పచేత్,

కోలవత్ గుటికాః కృత్వా తక్రేణాలోడ్య నా పిబేత్. 95
తాః పాండురోగాన్ ప్లీహానమర్శాంసి విషమజ్వరం,
శ్వయథుం గ్రహణీదోషం హన్యుః కుష్ఠం క్రిమీం స్తథా. 96
(ఇతి పునర్నవామణ్డూరమ్.)

వ్యా. గలిజేరు, తెగడ, త్రికటుకములు, వాయువిడంగములు, దేవదారు చెక్క, చిత్రమూలము, చెంగల్వకోష్టు, పసుపు, మ్రానిపసుపు, త్రిఫలములు, నేపాళపు వేళ్లు, చవ్యము, కొడిసెపాలవిత్తులు, పిప్పళ్లు, మోడి, తుంగగడ్డలు, వీనిని ప్రత్యేక మొక్కొక పలమువంతున చేర్చి చూర్ణముచేసి, యాచూర్ణసముదాయమునకు ద్విగుణముగ మండూర (పాతయినుపచిట్టెము) చూర్ణమును కలిపి రెండు అఢకముల గోమూత్రమును చేర్చి (వటికలజేయుట కనుకూలమగునట్లు) పాకముచేసి రేగుకాయలంతేసి (అర్ధకర్షప్రమాణముగ) మాత్రలుచేసి యుంచునది. ఈమాత్రను మజ్జిగలో కలిపి ప్రతిదినంబును త్రాగునది. దీనివలన పాండురోగములు, ప్లీహవృద్ధి, అర్శస్సులు, విషమజ్వరము, వాపు, గ్రహణీదోషము, కుష్ఠము, క్రిములు, ఇవియన్నియు నశించును. (ఇచ్చట తొలుత మండూర చూర్ణమును గోమూత్రమున వండుచు పక్వమగునప్పుడు తక్కిన పునర్నవాది చూర్ణమును కూడ చేర్చి పక్వము చేయనగును).

## కామలా-పాండుహరచూర్ణములు.

మూ. దార్వీత్వక్ త్రిఫలా వ్యోషం విడఙ్గమయసో రజః,
మధుసర్పిర్యుతం లిహ్యాత్ కామలాపాండురోగవాన్. 97
తుల్యా అయోరజః పథ్యా హరిద్రాః క్షౌద్రసర్పిషా,
చూర్ణితాః కామలీ లిహ్యాత్; గుడక్షౌద్రేణ వాఽభయాః. 98

వ్యా. మ్రానిపసుపుపట్ట, త్రిఫలములు, త్రికటుకములు, వాయువిడంగములు, ఉక్కురాపొడి, వీనిని (సమభాగములుగ) గూర్చి చూర్ణముచేసి తేనెను నేతిని కలిపి సేవించినచో కామలారోగమును పాండువును హరించును. మరియు ఉక్కురాపొడిని కరకకాయలబెరడును పసుపును సమభాగములుగ గూర్చి చూర్ణముచేసి తేనెను నేతిని కలిపి సేవించినను, కరకకాయలచూర్ణమును బెల్లముతోడను నేతితోడను కలిపి సేవించినను కామలారోగమును హరించును.

మూ. త్రిఫలా ద్వే హరిద్రే చ కటురోహిణ్యయోరజః,
చూర్ణితం క్షౌద్రసర్పిర్భ్యాం స లేహః కామలాఽపహః. 99

వ్యా. త్రిఫలములు, పసుపు, మ్రానిపసుపు, కటుకరోహిణి, ఇనుపరాపొడి, వీని నన్నిటిని సమభాగములుగ గూర్చి; చూర్ణముచేసి తేనెను నేతిని కలిపి సేవించిన కామలా రోగమును హరించును.

## కామలాదిహర ధాత్ర్యవలేహము (ద్రాక్షాదిలేహము).

మూ. ద్విపలాంశాం తుగాక్షీరీం నాగరం మధుయష్టికామ్,
ప్రాస్థికీం పిప్పలీం ద్రాక్షాం, శర్కరార్ధతులాం శుభామ్. 100
ధాత్రీఫలరసద్రోణే చూర్ణితం లేహవత్పచేత్,
శీతం మధుప్రస్థయుతం లిహ్యాత్ పాణితలం తతః. 101
హన్త్యేష కామలాం పిత్తం పాండుం కాసం హలీమకం,
(ఇతి ధాత్ర్యవ(ద్రాక్షాది)లేహః)

వ్యా. వెదురుప్పు, శుంఠి, అతిమధురము, ఈమూడును ప్రత్యేకము రెండేసి పలములు, పిప్పళ్లు ఒకప్రస్థము, ద్రాక్షపండ్లు ఒకప్రస్థము, ఈభాగములవంతున వీనినన్నిటిని గూర్చి చూర్ణముచేసి, ద్రోణపరిమితమైన యుసిరికపండ్లరసమునం దేబదిపలముల చక్కెరను పాకముబట్టి, అందు పైజెప్పినచూర్ణమును కలిపి లేహపక్వము చేయునది. అయ్యది చల్లారినపిదప ప్రస్థపరిమితము తేనెను కలిపి అగ్నిబలానుసారముగ కర్షప్రమాణము వంతున సేవించినయెడ కామలారోగమును, పిత్తపాండువును, కాసమును, హలీమకమును హరించును.

ఇచ్చట 'ప్రాస్థికీం' అనుపదము 'పిప్పలీం, ద్రాక్షాం' అనుపదములతో ప్రత్యేకముగ నన్వయించుటవలన పిప్పళ్లను ద్రాక్షపండును ఒక్కొక్కప్రస్థమని యర్థము చేయదగును. ఈవిషయము వాగ్భటాచార్యులు 'ద్రాక్షాప్రస్థం కణాప్రస్థం' (అ. హృ. చి. అ. ౧౬. శ్లో. ౩౦) అని స్ఫుటముగ జెప్పిరి.

## పాండ్వాదులకు మండూరవటకము.

మూ. త్ర్యూషణం త్రిఫలా చవ్యం చిత్రకో దేవదారు చ. 102
విడఙ్గాన్యథ ముస్తం చ వత్సకం చేతి చూర్ణయేత్,
మణ్డూరతుల్యం తచ్చూర్ణం గోమూత్రేఽష్టగుణే పచేత్. 103
శనైః సిద్ధాస్తథా శీతాః కార్యాః కర్షసమా గుడాః,
యథాగ్ని భక్షణీయాస్తే ప్లీహపాణ్డ్వామయాఽపహాః. 104
గ్రహణ్యర్శోఽనుదశ్చైవ తక్రపాట్యాశినః స్మృతాః,
(ఇతి మణ్డూరవటకాః.)

వ్యా. త్రికటుకములు, త్రిఫలములు, చవ్యము, చిత్రమూలము, దేవదారుపట్ట, వాయువిడంగములు, తుంగగడ్డలు, కొండిసెపాలవిత్తులు, వీనిని సమభాగములుగ చూర్ణము చేయునది. ఈ ద్రవ్యసముదాయచూర్ణమునకు సమభాగముగ శుద్ధిచేయబడిన మండూరము చూర్ణముచేసి దీనికి ఎనిమిదింతలు గోమూత్రమును కలిపి మందాగ్నిలో (కాటుకవలె నుండునట్లు) పక్వముచేయుచు పైజెప్పిన త్రికటుకాదిచూర్ణమును కలిపి వటుకముల జేయుట కనువుగ పక్వముచేసి చల్లారినపిదప కర్షపరిమితముగ మాత్రల చేయునది. ఈ వటుకములను జాఠరాగ్నిబలానుసారముగ ప్రతిదినము భక్షించినయెడ ప్లీహమును, పాండురోగమును, గ్రహణీదోషమును, అర్శోరోగమును హరించును. దీనిని సేవించునపుడు వేయించిన బియ్యముచే సిద్ధమైన యన్నమును మజ్జిగతో భుజింపనగును.

### పాండువులకు గౌడాఽరిష్టము.

మూ. మఞ్జిష్ఠా రజనీ ద్రాక్షా బలామూలాన్యయోరజః. 105
లోధ్రం చైతేషు గౌడస్స్యాత్ అరిష్టః పాండురోగిణాం,
(ఇతి గౌడోఽరిష్టః.)

వ్యా. మంజిష్ఠి, పసుపు, ద్రాక్షపండ్లు, చిట్టాముట్టివేళ్లు, ఇనుపరాపొడి, లొద్దుగపట్ట, వీనినన్నిటిని చేర్చి కషాయముకాచి, అందు బెల్లమును చేర్చి విధ్యుక్తప్రకారము అరిష్టము సిద్ధముచేసిన నయ్యది గౌడారిష్టమని చెప్పబడును. ఈయరిష్టము పాండురోగులకు హితకరమై యుండును.

### గ్రహణీపాండ్వాదులకు బీజకారిష్టము.

మూ. బీజకాత్ షోడశపలం, త్రిఫలాయాశ్చ వింశతిః 106
ద్రాక్షాయాః పఞ్చ, లాక్షాయాస్సప్త, ద్రోణే జలస్య తత్,
సాధ్యం పాదావశేషే తు, పూతశేషే సమావపేత్. 107
శర్కరాయాస్తులాం, ప్రస్థం మాక్షికస్య చ, కార్షికం,
వ్యోషం వ్యాఘ్రనఖోశీరం క్రముకం సైలవాలుకమ్. 108
మధుకం కుష్ఠమిత్యేతత్ చూర్ణితం ఘృతభాజనే,
యవేషు దశరాత్రం తత్ గ్రీష్మే, ద్విః శిశిరే స్థితమ్. 109
పిబేత్తత్, గ్రహణీపాండురోగాఽర్శశ్శోథగుల్మనుత్,
మూత్రకృచ్ఛ్రాశ్మరీమేహ కామలాసన్నిపాతజిత్. 110

బీజకారిష్ట ఇత్యేషః ఆత్రేయేణ ప్రకీర్తితః,

(ఇతి బీజకారిష్టః.)

వ్యా. బీజకము పదునారుపలములు, త్రిఫలములు ఇరువదిపలములు, ద్రాక్షపండు ఐదుపలములు, లక్క యేదుపలములు, వీనినన్నిటిని ద్రోణపరిమితజలమున వైచి నాల్గవ పాలు మిగుల కషాయము కాచి వడగట్టి, నేతితోమాగినకుండలోబోసి అందు నూరుపల ములు చక్కెరను, ఒక ప్రస్థము (పదునారుపలములు) తేనెను కలుపునది. మరియు త్రికటుకములు, నఖము చిప్పలు, వట్టివేళ్లు, పోకచెక్కలు, నాగదోస, అతిమధురము, చెంగల్వకోష్టు, వీనిని ప్రత్యేకము ఒక్కొకకర్షమువంతున గూర్చి చూర్ణముచేసి పై జెప్పినద్రవమున కూడచేర్చి వాసెనగట్టి చీరమన్నుబూసి యవల ధాన్యరాశిలో గ్రీష్మ కాల మైనచో పదిదినములవరకును, శిశిరఋతువైనచో నిరువదిదినములవరకును (ధాన్య పుటమున) ఉనిచి పిదప నాయౌషధమును (అగ్నిబలాద్యనుసారముగ) తగిన పరిమాణ ముతో సేవించునది. దీనివలన గ్రహణీరోగంబును, పాండురోగంబును, అర్శస్సులును, గుల్మంబును మూత్రకృచ్ఛ్రంబును, అశ్మరియు, ప్రమేహంబులును, కామలారోగంబును, సన్నిపాతంబును శమించును. ఈబీజకారిష్టను ఆత్రేయమహర్షిచే చెప్పబడినది.

## కామలాదులకు ధాత్ర్యరిష్టము.

మూ. ధాత్రీఫలసహస్రే ద్వే పీడయిత్వా రసం తు తమ్. 111
క్షౌద్రాఽష్టాంశేన సంయుక్తం, కృష్ణాఽర్ధకుడవేన చ,
శర్కరాఽర్ధతులోన్మిశ్రం పక్షం స్నిగ్ధఘటే స్థితమ్. 112
ప్రపిబేన్మాత్రయా ప్రాతః జీర్ణే హితమితాఽశనః,
కామలాపాండుహృద్రోగవాతాఽసృగ్విషమజ్వరాన్. 113
కాసహిక్కాఽరుచిశ్వాసాంశ్చైషోఽరిష్టః ప్రణాశయేత్,

(ఇతి ధాత్ర్యరిష్టః.)

వ్యా. చక్కగ పండిన పచ్చియుసిరికపండ్లు రెండువేలను నలుగగొట్టి (విత్తన ముల దూరంబుచ్చి) గూతొక్కను చక్కగ పిండి స్వరసమును తీయునది. అందు స్వరసమునకు నెనిమిదవవంతు తేనెను, అర్ధకుడవము (రెండుపలములు) పిప్పలిచూర్ణమును, అర్ధతులము (ఏబదిపలములు) చక్కెరను కలిపి నేతిలో మాగిన కుండలో (పైని చెప్పిన యౌషధసముదాయమును) బోసి వాసెనగట్టి పైజెప్పినరీతిగ ధాన్యపుటమున పదునైదు దినములుంచి పిమ్మట అగ్నిబలాద్యనుగుణమాత్రతో నుదయకాలమున త్రాగవలెను. దోష

ధము జీర్ణమైనపిదప పథ్యమైన యాహారమును మితముగ భుజింపనగును. ఇది ధాత్ర్యరిష్టము. ఇయ్యది కామలారోగము, పాండువులు, హృద్రోగము, వాతరక్తము, విషమజ్వరము, కాసము, ఎక్కిళ్లు, అరుచి, శ్వాసము, అను నీరోగముల నన్నిటిని నాశనము చేయును.

### పాండు-కామలారోగములయందు ప్రశస్తపానీయము.

మూ. స్థిరాదిభిః శృతం తోయం పానాహారే ప్రశస్యతే. 114
పాణ్డూనాం, కామలార్తానాం మృద్వీకామలకీరసః,

వ్యా. ముయ్యాకుపొన్న, కోలపొన్న, వాకుడు, పెద్దములక, పల్లేరు, ఈయైదిటిని చేర్చి కాచబడిన జలమును పాండురోగులును; ద్రాక్షపండును, ఉసిరికకాయలను చేర్చి కాచబడిన జలమును కామలారోగులును పానమునకును ఆహారమునకు నుపయోగింపనగును. (లేక పానీయములయందును ఆహారద్రవ్యములయందును పైజెప్పిన రసముల జేర్చి యుపయోగింపవలెనని యర్థము)

ఇచ్చట "స్థిరాదిభిః" అనుపదముచేత "సాలపర్ణీ పృశ్నిపర్ణీ బృహతీద్వయగోక్షురమ్, కనీయః పఞ్చమూలం స్యాత్" అని చెప్పబడిన హ్రస్వపంచమూలములు గ్రహింపబడును. వాగ్భటాచార్యులు "కనీయః పఞ్చమూలామ్బు......మృద్వీకామలకాద్రసః" (అ. హృ. చి. అ. ౧౬) అని స్ఫుటముగ జెప్పిరి.

### పాండురోగమున దోషభేదముచే చికిత్సాకల్పనవిధానము.

మూ. పాండురోగప్రశాన్త్యర్థం ఇతి ప్రోక్తం మహర్షిణా. 115
వికల్పమేతద్భిషజా పృథగ్దోషబలం ప్రతి,
వాతికే స్నేహభూయిష్ఠం పైత్తికే తిక్తశీతలమ్. 116
శ్లైష్మికే కటుతిక్తోష్ణం (రూక్షోష్ణం) విమిశ్రం సాన్నిపాతికే,

వ్యా. ఇత్తెరంగున పాండురోగము శమించుటకు తగినచికిత్సావిధానము మహర్షియగునాత్రేయులచే నిర్దేశింపబడినది. శాస్త్రవేత్తయగు వైద్యుడు వాతపిత్తకఫముల బలాబలమును చక్కగ గమనించి ఆయాదోషానుసారము వేరువేరుగ చికిత్సితమును కల్పించి చికిత్సచేయనగును.

అందు వాతమున గల్గిన పాండురోగమున ఘృతమును విశేషముగను, పిత్తమున జనించినపాండురోగమునందు తిక్తరసప్రధానమై శీతగుణవీర్యములు కల యౌషధమును, కఫమున జనించిన పాండురోగమున కటుతిక్తరసంబులును (రూక్షగుణంబును) ఉష్ణవీర్యం

బును కలయౌషధమును ఉపయోగింపనగును. మరియు సన్నిపాతమున కల్గిన పాండు రోగమున వాతాదులకు వేరువేరుగ జెప్పిన యౌషధముల మిశ్రముగ జేసియు నుపయోగింపవలెను.

## మృజ్జపాండురోగమున శోధనచికిత్స.

మూ. నిపాతయేచ్ఛరీరాత్తు మృత్తికాం భక్షితాం భిషక్. 117
యుక్తిజ్ఞః శోధనై స్తీక్ష్ణైః ప్రసమీక్ష్య బలాఽబలం,
శుద్ధకాయస్య సర్పింషి బలాధానాని యోజయేత్. 118

వ్యా. మృత్తికాభక్షణముచే గల్గిన పాండురోగము కలవానికి తొలుత శరీరమున (కోష్ఠమున) జేరియుండు మట్టిని మిక్కిలి తీక్ష్ణములగు జెముడుపాలు మ్రంగకాయ మున్నగు వమనవిరేచనౌషధముల నుపయోగించి కోష్ఠమునుండి బైట వెడలించవలెను. అట్టి శోధనమును రోగి జాఠరాగ్నిమున్నగువాని బలాబలమును చక్కగ గమనించి యుక్తియుక్తముగ ప్రయోగింపవలెను. అట్టిశోధనముచే శుద్ధమైన కోష్ఠముకల రోగికి బలకరములగు ఘృతముల నిప్పింపనగును.

## మృజ్జపాండురోగహరవ్యోషాదిఘృతములు.

మూ. వ్యోషం బిల్వం హరిద్రే ద్వే త్రిఫలా ద్వే పునర్నవే,
ముస్తాన్యయోరజః పాఠా విడఙ్గం దేవదారు చ. 119
వృశ్చికాలీ చ భార్గీ చ సక్షీ(క్షా)రై స్తైః సమైర్ఘృతం,
సాధయిత్వా పిబేద్యుక్త్యా నరో మృద్దోషపీడితః. 120
తద్వత్కేసరయష్ట్యాహ్వాపిప్పలీక్షారశాద్వలైః,

వ్యా. త్రికటుకములు, మారేడువేరు, పసుపు, మ్రానిపసుపు, త్రిఫలములు, తెల్లగలిజేరు, ఎఱ్ఱగలిజేరు, తుంగగడ్డలు, ఇనుపరాపొడి, చిరుబొద్ది, వాయువిడంగములు, దేవదారుపట్ట, తేలుమణి, భారంగి, వీనినన్నిటిని సమభాగములుగ జేర్చి కల్కముచేసి, కల్కమునకు నాలుగింతలు ఘృతమును, ఘృతమునకు సమభాగము ఆవుపాలను (నాల్గింతలు జలమును) చేర్చి ఘృతపాకవిధిప్రకారము పక్వముచేసి, దోష-అగ్నిబలాద్యనుసారముగ నుపయోగించినచో మట్టిని తినుటచే గల్గిన పాండురోగము శమించును.

మరియు నాగకేసరములు, అతిమధురము, పిప్పళ్లు, యవక్షారము, గరికవేళ్లు, వీనిని సమభాగములుగ కల్కము చేసి పైజెప్పినవిధముగ పాలను జలమును కూడ జేర్చి ఘృతమును పక్వముచేసి మృత్తికాభక్షణముచే గల్గిన పాండురోగమున నుపయోగించునది.

ఇచ్చట:—"స్వరసక్షీరమాంసైర్యః పాకో యత్రేరితః క్వచిత్, జలం చతుర్గుణం తత్ర వీర్యాధానార్థ మావపేత్" అను పరిభాషచేత క్షీరమును మాత్రము ద్రవమును చెప్పియుండుటవలన నాలుగింతలు జలమును చేర్పవలెనని యెరుంగునది. ఈవిషయమునే సర్వాంగసుందరవ్యాఖ్యానమున—"వ్యోషాదిభిః ఘృతాచ్చతుర్థాంశైః శృతం సమేన క్షీరేణ తచ్చతుర్గుణజలేన ఘృతం" (అ. హృ. చి. అ. ౧౬. శ్లో. ౩౭. వ్యాఖ్య) అని వివరించిరి.

### మృద్భక్షణనివర్తనోపాయము.

మూ. మృద్భక్షణాదాతురస్య లౌల్యాదవినివర్తినః. 121
ద్వేష్యాఽర్థం భావితాం కామం దద్యాత్తద్దోషనాశనైః,
విడఙ్గైలాఽతివిషయా నిమ్బపత్రేణ పాఠయా. 122
వార్తాకైః కటురోహిణ్యా కౌటజైర్మూర్వయాఽపి వా,

వ్యా. పైజెప్పిన పాండురోగము కలమనుజుని మట్టిని తిననీయక నివర్తి చేయవలెను. దానియందలవాటువలన తినుటనుమానకున్నయెడ మట్టియందు ద్వేషము కల్గుటకై మట్టిదోషములను హరించు వాయువిడంగములు, ఏలకులు, అతివస, వేపాకు, చిరుబొద్ది, ములక, కటుకరోహిణి, కొడిసెపాలవిత్తులు, చాగపట్ట, అనునీద్రవ్యములచే దానిస్వాభావికగుణములు మారునట్లు భావనచేసి, అట్టి మృత్తికను వానికిచ్చి తినిపించియైన వానికి ద్వేషమును పుట్టించవలెను.

### మృజ్జపాండురోగవిశేషచికిత్స.

మూ. యథాదోషం ప్రకుర్వీత భైషజ్యం పాండురోగిణామ్. 123
క్రియావిశేష ఏషోఽస్య మతో హేతువిశేషతః,

వ్యా. పాండురోగము నుద్దేశించి వాతాదిదోషానుసారముగ వేరువేరుగ జెప్పబడిన ఆయాచికిత్సితములనే మృజ్జపాండురోగమునందును ఆయాదోషప్రకోపమును వానిలక్షణములబట్టి చక్కగ గమనించి తత్తదనుసారముగ జేయనగును. ఇదియే మృజ్జపాండురోగమునకు హేతువిశేషములబట్టి చికిత్సావిశేషమని యార్షసమ్మతము.

(మృత్తికాభక్షణజనితపాండురోగమున మొదట కోష్ఠమునందలి సంచితమైన మృత్తిక వెడలించుటకై శోధనచికిత్స "నిపాతయేచ్ఛరీరాత్తు...యోజయేత్" అని చెప్పబడినది. "వాతికే స్నేహభూయిష్ఠం...సాన్నిపాతికే" అని ఆయాదోషమునకు సామాన్యచికిత్స వేరువేరుగ నిర్దేశింపబడినది. అట్టి దోషములననుసరించి చేయువలసిన

విశేషచికిత్సితములను పాండురోగమునకు చెప్పినవానినే మృజ్జపాండువందును బలాద్యను సారముగ జేయనగునని యీ వాక్యముచే నతిదేశింపబడినదని సముదితార్థము).

### శాఖాశ్రయకఫాధిక కామలాలక్షణము, చికిత్సితము.

మూ. తిలపిష్టనిభం యస్తు వర్చస్సృజతి కామలీ. 124
శ్లేష్మణా రుద్ధమార్గం తత్ పిత్తం కఫహరైర్జయేత్,

వ్యా. కోష్ఠముననుండు కఫము ప్రకుపితమై శాఖల నాశ్రయించి వ్యాపించు పిత్తమును నిరోధించినపుడు పిత్తము ప్రకుపితమై కామలారోగమును కల్గించును. అందు తెలికపిండితో సమానమైనపురీషము వెడలును. అట్టి పిత్తమునకు కఫహరంబులగు నౌషధములచే చికిత్స జేయనగును.

### కఫవాతాధిక కామలారోగము.

మూ. రూక్షశీతగురుస్వాదువ్యాయామైః వేగనిగ్రహైః. 125
కఫసమ్మూర్ఛితో వాయుః స్థానాత్పిత్తం క్షిపేద్బలీ,
హారిద్రనేత్రమూత్రత్వక్ శ్వేతవర్చాస్తదా నరః. 126
భవేత్ సాటోపవిష్టమ్భో గురుణా హృదయేన చ,
దౌర్బల్యాఽల్పాగ్నిపార్శ్వార్తిహిక్కాశ్వాసారుచిజ్వరైః. 127
క్రమేణాఽల్పేఽనుసజ్యేత (బధ్యేత) పిత్తే శాఖాసమాశ్రితే,

వ్యా. రూక్షముగను, శీతవీర్యముగను, గురువుగను, మధురముగను నుండు నాహారముల భుజించుట, దేహపరిశ్రమము నధికముగ జేయుట, మలమూత్రాదివేగముల నిరోధించుట, ఇవి మున్నగుకారణములచేత వాతము ప్రకోపమునొంది కఫముతో గూడి బలిష్ఠమై కోష్ఠమునందలి (రంజక) పిత్తమును బైటికి వెడలించును. అట్టియెడ మనుజునకు కన్నులును మూత్రంబును చర్మంబును పచ్చనగును. మలము తెల్లగ వెడలును. కడుపులో గడబిడగ ప్రేవులు కూయును. మలము బద్ధగించును. హృదయమున బరువుగ నుండును. శరీరము బలహీనమగును. జఠరాగ్ని మందగించును. ఇరుప్రక్కల నొప్పియు, ఎక్కిళ్లును, అరుచియు, జ్వరంబునుకల్గును. ఈయుపద్రవములు పిత్తము శాఖాశ్రితమై స్వల్పముగ నున్నపుడు క్రమక్రమముగ సంభవించును (ఇచ్చట పిత్తము కోష్ఠమును వదలి శాఖల నాశ్రయించి యుండుటవలన మలమునకు వర్ణవిశేషము కల్గక తెల్లగనుండునని "శ్వేతవర్చాః" అను పదముచే తెలిసెడి).

### కఫవాతాధిక కామలాచికిత్స.

మూ. బర్హితిత్తిరిదక్షాణాం రూక్షామ్లైః కటుకైః రసైః. 128

శుష్కమూలకకౌలుత్థైః యూషైశ్చాన్నాని భోజయేత్,
మాతులుఙ్గరసం క్షౌద్రపిప్పలీమరిచాన్వితమ్. 129
సనాగరం పిబేత్పిత్తం తథాస్యైతి స్వమాశయం,

వ్యా. పైజెప్పిన రీతిగ కామలారోగపీడితునకు నెమలి, తీతువుపిట్ట, కోడి, అనునీపక్షులమాంసరసమును రూక్షగుణంబులును పులుపును కారమునుకల ద్రవ్యముల జేర్చి సంస్కరించి యామాంసరసములతో గూర్చి యైనను, ఎండిన ముల్లంగిని చేర్చి పక్వము చేయబడిన ఉలవపప్పుకట్టుతో గూర్చి యైనను అన్నమును పెట్టవలెను. మరియు మాదీఫలరసమున తేనెను, పిప్పళ్లు, మిరియాలు, శుంఠి, ఈమూడిటి చూర్ణమును కలిపిత్రాగించవలెను. ఇట్టి చికిత్సవలన వృద్ధినందిన వాతకఫములుతగ్గి స్వప్రమాణముననుండి, క్షీణించిన పిత్తము వృద్ధినంది శాఖాదుల వదలి మరల కోష్ఠమునందు చేరును.

ఇచ్చట స్వస్థానమును వదలి రక్తాదిధాతువుల నాశ్రయించియుండు పిత్తమును వృద్ధినందించుటవలన నయ్యది ధాతువుల వదలి స్వస్థానమైన కోష్ఠమున మరల చేరును. ఈవిషయము నీతంత్రకారులు సూత్రస్థానమున నిట్లుపదేశించిరి:—"వృద్ధ్యాఽభిష్యన్దనాత్ పాకాత్ స్రోతోముఖవిశోధనాత్, శాఖాం ముక్త్వా మలాః కోష్ఠం యాన్తి వాయోశ్చ నిగ్రహాత్." (సూ. అ. ౨౮. శ్లో. ౪౨).

## శాఖాశ్రయకామలాచికిత్సావిశేషము.

మూ. కటుతీక్ష్ణోష్ణలవణైః భృశామ్లైశ్చాప్యుపక్రమః. 130
ఆపిత్తరాగాచ్ఛకృతః వాయోశ్చాఽప్రశమాద్భవేత్,
స్వస్థానమాగతే పిత్తే పురీషే పిత్తరఞ్జితే. 131
నివృత్తోపద్రవస్యాఽస్య పూర్వః కామలికో విధిః,

వ్యా. మరియు అట్టి కామలారోగికి మలము పిత్తసంబంధమైన రంగుకల్గి వాతము శమించువరకును కటు-తీక్ష్ణ-ఉష్ణ-లవణములును మిక్కిలి పులుపునుకల యౌషధములచే చికిత్సచేయవలెను. అట్టి చికిత్సావిధానముచేత వాతము శమించి పిత్తము రక్తాదిధాతువుల వదలి స్వస్థానమైన కోష్ఠమున జేరి, పురీషము పిత్తసంబంధమునం జేసి స్వాభావికమైన రంగుకల్గియున్నపుడు వానికి పైజెప్పబడిన ప్రేవులరచుట, కడుపుబ్బరము, హృదయగౌరవము మున్నగు నుపద్రవములు నివర్తించును. వానికి కామలారోగమునకు జెప్పిన చికిత్సలను చేయనగును,

ఇచ్చట "తిలపిష్టనిభం" అని యుపక్రమించి 'వాయోశ్చాప్రశమాత్ భవేత్' అనునంతపరకును గల గ్రంథమున పిత్తము రసరక్తాదిధాతువుల (శాఖల) నాశ్రయించి జనించిన కామలారోగమునకు దగిన చికిత్సావిధానము చెప్పబడినది. అట్టి చికిత్సావిధానమున పిత్తము రక్తాదిధాతువుల వదలి మరల పిత్తము స్వస్థానమైన కోష్ఠమున జేరినపిదప కోష్ఠాశ్రితకామలారోగము నుద్దేశించి పైజెప్పినచికిత్సావిధానము చేయనగునని "స్వస్థానమాగతే పిత్తే...పూర్వః కామలికో విధిః" అనువాక్యముచే విధింపబడినదని యెరుంగునది.

## హలీమకలక్షణము.

మూ. యదా తు పాణ్డోర్వర్ణస్స్యాత్ హారితశ్శ్యావపీతకః. 132
బలోత్సాహక్షయః తన్ద్రా మన్దాగ్నిత్వం మృదుజ్వరః,
స్త్రీష్వహర్షోఽఙ్గమర్దశ్చ శ్వాసస్తృష్ణాఽరుచిర్భ్రమః. 133
హలీమకం తదా తస్య విద్యాదనిలపిత్తతః,

వ్యా. పాండురోగము కలవానికి శరీరము పచ్చనిరంగైనను శ్యామవర్ణంబైనను పసుపురంగైనను కల్గి, శరీరబలంబును పనులయం దుత్సాహంబును క్షీణించి, కునికిపాటు, అగ్నిమాంద్యము, స్వల్పమైన జ్వరంబును, స్త్రీసంభోగమునందు నిరుత్సాహంబును, ఒడలు నొప్పులును, శ్వాసంబును, దప్పియు, అరుచియు, భ్రమంబును కల్గినయెడ నయ్యది హలీమకమని చెప్పబడును. ఇయ్యది వాత-పిత్తప్రకోపమున కల్గును.

ఈవ్యాధిని లాఘువకము, అలసకము, అనునామాంతరములచే కొందరు తంత్రకారులు వ్యవహరించిరి:—సుశ్రుతమున "జ్వరాఙ్గమర్దభ్రమదాహతన్ద్రాక్షయాన్వితో లాఘవకోఽలసశ్చ, తం వాతపిత్తాత్ హరిపీతనీలం హలీమకంకేచిదుదాహరన్తి." (సు. ఉ. అ. ౪౪), మరియు వాగ్భటాచార్యులు దీనిలక్షణము నిట్లు చెప్పిరి:—"హరితశ్యావపీతత్వం...లోఢరం తం హలీమకమ్, అలసం చేతి శంసన్తి" (అ. హృ. ని. అ. ౧౩. శ్లో. ౧౮) ఈవాక్యమునుబట్టి హలీమకమునకు లోఢరమను నామాంతరమును మునివరులు చెప్పినట్లున్నది.

## హలీమకచికిత్స.

మూ. గుడూచీస్వరసక్షీరసాధితం మాహిషం ఘృతమ్ 134
స పిబేత్త్రివృతాం స్నిగ్ధో రసేనామలకస్య తు,
విరిక్తో మధురప్రాయం భజేత్పిత్తాఽనిలాపహమ్, 135

ద్రాక్షాలేహం చ పూర్వోక్తం సర్పింషి మధురాణి చ,
యాపనాన్ క్షీరవస్తీంశ్చ శీలయేత్సానువాసనాన్. 136
మార్ద్వీకాఽరిష్టయోగాంశ్చ పిబేద్యుక్త్యాఽగ్నివృద్ధయే,
కాసికం చాఽభయాలేహం పిప్పలీం మధుకం బలామ్,
పయసా చ ప్రయుఞ్జీత యథాదోషం యథాబలం. 137

వ్యా. హాలీమకరోగముచే బాధితుడు తిప్పతీగెస్వరసమును ఆవుపాలను జేర్చి పక్వముచేయబడిన యెనుపనేతిని స్నేహానమునకై (కోష్ఠము స్నిగ్ధమగుటకై) తొలుత త్రాగవలెను. (ఇచ్చట ఘృతమును ఆవుపాలును సమభాగములుగ గూర్చి గుడూచీస్వరసమును ఘృతమునకు నాల్గుభాగములు జేర్చి ఘృతపాకము చేయునది).

అట్టిఘృతపానముచే కోష్ఠము మృదువైనపిదప తెగడచూర్ణమును ఉసిరికపండ్లరసములో కలిపి విరేచనమునకై త్రాగవలెను. విరేచనముచే కోష్ఠము శుద్ధమైనవెంటనే మధురరసమును అధికముగ జేర్చి పిత్త-వాతముల హరించునాహారముల భుజింపనగును.

పిమ్మట పైని "ద్విపలాంశాం తుగాక్షరీం......పాండుం కాసం హాలీమకమ్" (శ్లో. ౧౦౦-౧౦౧) అని చెప్పబడిన ద్రాక్షాదిలేహమును, మధురద్రవ్యములతో పక్వముచేయబడిన ఘృతములను సేవింపనగును. మరియు క్షీరమును చేర్చి చేయబడిన యాపన (బలకరములైన) వస్తులను, అనువాసనవస్తులను పలుమారు అప్పుడప్పుడును విధ్యుక్తప్రకారము ప్రయోగించవలెను. జాఠరాగ్ని వృద్ధినొందుటకై ద్రాక్షామద్యమును అరిష్టయోగములను యుక్తియుక్తముగ త్రాగవలెను. కాసచికిత్సితమున జెప్పబడు హారీతకీ లేహమును సేవించుచు, పిప్పళ్లు, అతిమధురము, చిట్టాముట్టి, ఈమూడిటిచూర్ణమును ఆవుపాలలో గలిపి శరీరబలదోషాద్యనుసారముగ త్రాగవలెను.

ఇచ్చట 'కాసికం చాఽభయాలేహం' అనుచోట కాసచికిత్సితమున "దశమూలీ స్వయంగుప్తాం...అగస్త్యవిహితం శ్రేష్ఠం రసాయనమిదం శుభమ్"(అ.౧౮. శ్లో. ౫౭-౬౭) అని చెప్పబడు అగస్త్యహారీతకీరసాయనమునైనను, "హారీతకీయవక్వాథ... శ్వాసకాసనుత్" (అ. ౧౮. శ్లో. ౧౦౦) అని చెప్పబడు హారీతకీలేహమునైనను గ్రహింపనగును.

తత్ర శ్లోకాః—

మూ. పాణ్డోః పఞ్చవిధస్యోక్తం హేతులక్షణభేషజమ్,
కామలా ద్వివిధా తేషాం సాధ్యాఽసాధ్యత్వమేవ చ 138

తేషాం వికల్పో యశ్చాన్యః మహావ్యాధిర్హలీమకః,
తస్య చోక్తం సమాసేన వ్యఞ్జనం సచికిత్సితమ్.

వ్యా. ఐదువిధములైన పాండురోగముల హేతువులును, లక్షణంబులును, చికిత్సలును, కామల, కుంభకామల యను రెండుభేదములును, అట్టివ్యాధుల సాధ్యాసాధ్యలక్షణంబులును, వానియవస్థాభేదముచే చికిత్సాభేదకల్పనంబును, గొప్పదిగు హలీమకముయొక్క లక్షణంబులును, దానిచికిత్సితంబును, ఇవి యన్నియు నీపాండురోగచికిత్సితమను నధ్యాయమున సంగ్రహముగ జెప్పబడినవి.

ఇత్యగ్నివేశకృతే తన్త్రే, చరకప్రతిసంస్కృతే, దృఢబలసంపూరితే,
చికిత్సాస్థానే, పాండురోగచికిత్సితం నామ షోడశోఽధ్యాయః

వ్యా. ఇత్తెరంగున నగ్నివేశకృతంబును, చరకునిచే ప్రతిసంస్కృతంబును చరకసంహితయను నాయుర్వేదతంత్రమునందలి చికిత్సాస్థానమున దృఢబలసంపూరితభాగమునందు పాండురోగచికిత్సితమనునది పదునారవ యధ్యాయము.

---

## సప్తదశాధ్యాయము.

అవతరణిక:—హిక్కాశ్వాసనిదానమును చెప్పుతరి "పాణ్డురోగాత్ ... చైవ ప్రవర్తేతే గదావిమౌ" అనువాక్యముచేత పాండురోగము కూడ హిక్కాశ్వాసములకు హేతువుగ చెప్పబడినది; కావున అట్టిసంబంధమును బట్టి పాండురోగచికిత్సితమును చెప్పినపిదప హిక్కాశ్వాసచికిత్సితము చెప్పబడును.

మూ. అథాతో హిక్కాశ్వాసచికిత్సితం వ్యాఖ్యాస్యామః.
ఇతి హ స్మాహ భగవానాత్రేయః.

వ్యా. పాండురోగచికిత్సితమును చెప్పినపిదప (దాని కుపద్రవరూపమగు) హిక్కాశ్వాసములచికిత్సితము భగవానుడగు నాత్రేయమహర్షి యుపదేశించినదానిని న్యూనాతిరేకము గాకుండునట్లు వివరింపబడును.

ఇచ్చట హిక్కాశ్వాసములు రెండును సమానకారణములచే జనించి సమానచికిత్సితము లై యుండుటంజేసి రెండు చికిత్సలు నొకయధ్యాయముననే చెప్పబడినవని యెరుంగునది.

**అగ్నివేశులు రోగములదారుణత్వము నుద్దేశించి ప్రశ్న చేయుట.**

మూ. వేదలోకార్థతత్వజ్ఞం ఆత్రేయమృషిసత్తమం,
అపృచ్ఛత్సంశయం ధీమాన్ అగ్నివేశః కృతాఞ్జలిః.

యఏతే ద్వివిధాః ప్రోక్తాః త్రిదోషాః త్రిప్రకోపణాః,
రోగా నానాత్మకా స్తేషాం కస్కో భవతి దుర్జయః? 4

వ్యా. వేదములయొక్క నాస్తవ్యార్థమును లోకముయొక్క వస్తుతత్వమును చక్కగ నెరింగి ఋషులలో నుత్తముడగు నాత్రేయమునిపుంగవుని ప్రశస్తజ్ఞానవంతుడగు అగ్నివేశులు కేలుమోడ్చి యీక్రింద చెప్పబడువిధముగ ప్రశ్నజేసెను.—

మూడువిధములైన దోషప్రకోపణకారణములు కల్గినవియు, వాత-పిత్తకఫములను మూడుదోషములచే కల్గునవియు, మృదుక్రూరాదిభేదములచే రెండుతెరంగులునైన జ్వరాదిరోగములు పలుదెరంగులైయుండునని పైని చెప్పబడినది. అట్టిమృదుదారుణాదిభేదములు కల నానావిధ రోగములలో నేయేరోగము మిక్కిలి దారుణమై చికిత్సచే సాధింపనలవిగాక (ప్రాణాంతకరముగ) యుండును? (అని యగ్నివేశులు ఆత్రేయుల నడిగెనని యర్థము.)

వివరణము:—రోగములు సామాన్య-అసామాన్యభేదములచేతను, సాధ్య-అసాధ్యరూపప్రభావభేదములచేతను, మృదు-దారుణరూపమైన బలభేదములచేతను, మనస్సు శరీరమను నధిష్ఠానభేదములచేతను, నిజ-ఆగంతుభేదములచేతను, ఆమాశయ-పక్వాశయములను ఆశ్రయభేదములచేతను రెండువిధము లగునని రోగానీకాధ్యాయమున నిట్లు చెప్పబడినది.—"ద్వేరోగానీకే భవతః......పక్వాశయసముత్థం చ"(చి.అ.౬.సూ.3.) మరియు నట్టిరోగములకు వాతపిత్తకఫములు కారణములనియు, త్రిదోషప్రకోపమునకు అసాత్మ్యేంద్రియార్థసంయోగము, ప్రజ్ఞాపరాధము, పరిణామమునను మూడును హేతువులైయుండుననియు నచ్చటనే చెప్పబడినది. ఇత్తెరంగున త్రివిధకారణములచే ప్రకోపము నొందిన త్రిదోషములచే వేరువేరుగను, అన్నిటిచేతను కల్గినరోగములు మృదు-దారుణభేదములచే రెండుతెరంగులై జ్వరాదిరూపభేదములచే పలుదెరంగుల నుండునని చెప్పబడినది. అందు దారుణములని చెప్పబడిన శంఖకము అగ్నిరోహిణి మున్నగు క్రూరవ్యాధులలో నేయేరోగము మిక్కిలి దారుణమై యుండుననియగ్నివేశుల ప్రశ్నాభిప్రాయము.

**హిక్కా-శ్వాసములు మిక్కిలి దారుణములని నిరూపించియుత్తరముచెప్పుట.**

మూ. అగ్నివేశస్య తద్వాక్యం శ్రుత్వా మతిమతాం వరః,
ఉవాచ పరమప్రీతః పరమార్థవినిశ్చయమ్. 5
కామం ప్రాణహరా రోగాః బహవో న తు తే తథా,
యథా శ్వాసశ్చ హిక్కా చ ప్రాణానాశు నికృన్తతః. 6

అన్యైరప్యుపసృష్టస్య రోగైర్జన్తోః పృథగ్విధైః,
అన్తే సఞ్జాయతే హిక్కా శ్వాసో వా తీవ్రవేదనః.

వ్యా. పైజెప్పినరీతిగ నడిగిన యగ్నివేశులవాక్యమును విని జ్ఞానగరిష్ఠుడగు
యులు మిక్కిలి సంతుష్టచిత్తుడై వాస్తవ్యార్థమును నిర్ణయించునట్టి యుత్తరము
సెప్పెను:—రోగములలో ప్రాణములహింసించునవి జ్వరము శంఖకము రోహిణి వ
నవి యనేకములు కలవు; కాని అయ్యవి శ్వాసమును హిక్కను (ఎక్కిళ్లను) బో
శీఘ్రముగ ప్రాణముల హింసింపనేరవు. (రోగము లన్నిటికన్న హిక్కాశ్వా
శీఘ్రముగ హింసించుననుట), మరియు జ్వరము అతిసారము మున్నగునితరరోగ
బాధింపబడుచుండు మానవునకు ప్రాణాంతకాలమున హిక్కయు శ్వాసంబును వి
తీవ్రమైన వేదనతో గూడి యీరెంటిలో నొకటియైనను తప్పక యుపద్రవరూ
సంభవించును. (కావున నీరోగములు రెండును క్రూరమైనవ్యాధులు మిక్కిలి
తమములని భావము).

హిక్కాశ్వాసములదోషసంబంధము, వానిప్రభావవిశేషము.

మూ. కఫవాతాత్మకావేతౌ పిత్తస్థానసముద్భవౌ,
హృదయస్య రసాదీనాం ధాతూనాం చోపశోషణౌ.
తస్మాత్సాధారణావేతౌ మతౌ పరమదుర్జయౌ,
మిథ్యోపచరితౌ క్రుద్ధౌ హతః ఆశీవిషావివ.

వ్యా. హిక్కాశ్వాసములు రెండును కఫవాతముల ప్రకోపముచే పిత్తస్థా
(ఆమాశయమున) జనించును. హృదయమును రసరక్తాదిధాతువులను శోషింపజే
ఇత్తెరంగున నీరెంటికిని ఉత్పాదకదోషసంబంధంబును ఉత్పత్తిస్థానంబును వానిక
లును ఏకములుగ నుండుటవలన చికిత్సితంబును ప్రాయికముగ సమానమైయు
స్వభావముచేతనే మిక్కిలి కష్టసాధ్యములై యుండును. మరియు నివి యించు
అపథ్యములగు నుపచారముల జేసినయెడ క్రూరములగు సర్పములను బోలె
ప్రకోపమునొంది యతిశీఘ్రముగ చంపును. (జ్వరాదిరోగము లన్నియు మిథ్యో
ములచే మిక్కిలి యుత్కటములై హింసించునవియె, ఐనను హిక్కాశ్వాసములు
మాత్రము మిథ్యోపచారములచే ప్రకోపము నొందిన సర్పములు అతిశీఘ్రముగ
విధముగ మిథ్యోపచారముల సహింపక తక్కినరోగములకన్న శీఘ్రముననే చంప
నని భావము. మరియు పిత్తమునకు ఉత్పత్తిస్థానసంబంధము మాత్రమేగాని కఫ

బోలె నీవ్యాధులకు నుత్పాదకము కాదని యెరుంగునది. ఇచ్చట "హతః" అనుపదము "హన హింసాగత్యోః" అనుధాతువునకు లట్ ప్రథమపురుష ద్వివచనరూపము).

## హిక్కాశ్వాసముల భేదములు.

మూ॥ పృథక్ పఞ్చవిధావేతౌ నిర్దిష్టౌ రోగసఙ్గ్రహే,
తయోశ్శృణు సముత్థానం లిఙ్గం చ సభిషగ్జితమ్. 10

వ్యా॥ ఈహిక్కాశ్వాసములు రెండును ఒక్కొకటి యైదేసి విధములుగ నుండునని యష్టోదరీయాధ్యాయమునందలి రోగసంగ్రహమున నిర్దేశింపబడినవి. అట్టి రోగముల యుత్పత్తికారణంబులును లక్షణంబులును చికిత్సితంబును వేరువేరుగ నిక్రింద వివరింపబడును.

అష్టోదరీయాధ్యాయమున నిట్లుచెప్పబడినది:—"పఞ్చ శ్వాసా ఇతి:—మహోర్ధ్వచ్ఛిన్నతమకక్షుద్రాః, పఞ్చహిక్కా ఇతి:—మహతీ, గమ్భీరా, వ్యపేతా, క్షుద్రా చాఽన్నజా చ" (సూ. అ. ౧౯). మహాశ్వాసము, ఊర్ధ్వశ్వాసము, ఛిన్నశ్వాసము, తమకశ్వాసము, క్షుద్రశ్వాసము నని శ్వాసములు ఐదువిధములనియు; మహతి, గంభీర, వ్యపేత, క్షుద్ర, అన్నజభేదములచే హిక్క యైదువిధములనియు నర్థము.

## హిక్కాశ్వాసములనిదానము, అందు హిక్కాశ్వాసోత్పాదక వాతప్రకోపకారణములు.

మూ॥ రజసా ధూమవాతాభ్యాం శీతస్థానామ్బుసేవనాత్,
వ్యాయామాత్ గ్రామ్యధర్మాఽధ్వరూక్షాన్నవిషమాశనాత్. 11
ఆమప్రదోషాదానాహాత్ రౌక్ష్యాదత్యపతర్పణాత్,
దౌర్బల్యాన్మర్మణో ఘాతాత్ ద్వన్ద్వాచ్ఛుద్ధ్యతియోగతః. 12
అతీసారజ్వరచ్ఛర్దిప్రతిశ్యాయక్షతక్షయాత్,
రక్తపిత్తాదుదావర్తాద్విషూచ్యలసకాదపి. 13
పాణ్డురోగాద్విషాచ్చైవ ప్రవర్తేతే గదావిమౌ,

వ్యా॥ ధూళియు పొగయు నాసాదిరంధ్రములనుండి శరీరమున బ్రవేశించుట, శీతలప్రదేశమున నుండుట, చల్లనినీళ్లను విశేషముగ స్నానపానాదుల కుపయోగించుట, శరీరమునకు శ్రమమును కల్గించుపనుల విశేషముగ జేయుట, స్త్రీసంభోగమును విశేషముగ జేయుట, త్రోవనడచుట, రూక్షములగు నన్నముల భుజించుట, విషమాశనము (అకాలమున భుజించుట), ఆమదోషము, ఆనాహము కడుపుబ్బరము, శరీరము రూక్ష

ముగ (జిడ్డులేక)నుండుట, అపతర్పణమును (శరీరమును చుల్కనగచేయు లంకన
మున్నగువానిని) అధికముగ జేయుట బలహీనము, శరీరమునందలి మర్మప్రదేశములయ
దభిఘాతము కల్గుట, పరస్పరవిరుద్ధములగు వస్తువుల జేర్చి భుజించుట, వమనవిరేచనా
శోధనముల నధికముగ జేసికొనుట అను నీకారణములచేతను హిక్కా-శ్వాసములు సం
వించును. మరియు,—అతిసారము, జ్వరము, వాంతి, పీనసము, ఉరఃక్షతము, ధా
క్షయము, రక్తపిత్తము, ఉదావర్తము, విషూచి, అలసకము, పాండురోగము, విషవ
అనునీరోగములచేత గూడ హిక్కా-శ్వాసములు జనించును. (ఇచ్చట "రజసా ధూ
వాతాభ్యాం" అను గ్రంథముచేత ప్రాయికముగ హిక్కా-శ్వాసోత్పాదకమైనవాతము
ప్రకోపింపజేయు గణము నిర్దేశింపబడినది).

## హిక్కా-శ్వాసోత్పాదక కఫప్రకోపకారణములు.

మూ. నిష్పావమాషపిణ్యాకతిలతైలనిషేవణాత్. 1
పిష్టశాలూకవిష్టమ్భివిదాహిగురుభోజనాత్,
జలజాఽఽనూపపిశితదధ్యామక్షీరసేవనాత్. 1
అభిష్యన్ద్యుపచారాచ్చ శ్లేష్మలానాం చ సేవనాత్,
కణ్ఠోరసః ప్రతీఘాతాత్ విబన్ధైశ్చ పృథగ్విధైః. 1

వ్యా. అనుములు, ఉద్దులు, తెలికపిండి, నువ్వులు, నూనె, వీనిని విశేషము
సేవించినను; పిండితో జేయబడిన భక్ష్యాదులు, తామర మొదలగువానిదుంపలు, మ
మును బంధించు పదార్థములు, మంటబుట్టించు పదార్థములు, గురుత్వమును కల్గించ
పదార్థములు, నీటబుట్టిన మత్స్యాదులయొక్కయు, అనూపజంతువులయొక్కయు మాం
ములు, పెరుగు, పచ్చిపాలు, వీనిని విశేషముగ నుపయోగించినను; నాసారంధ్రము
మున్నగు స్రోతోమార్గముల ద్రవమును బుట్టించు నుపచారముల జేసికొనుటవలనన
కఫమును వృద్ధినొందించు పదార్థముల సేవించినను; కంఠమునందును ఉరస్సునందు
అభిఘాతము కల్గినను, మలమును బంధించు నితరకారణములచేతను హిక్కా-శ్వాసము
కల్గును. (ఇచ్చట "నిష్పావమాష" అని యుపక్రమించి హిక్కా-శ్వాసముల నుత్పాద
మైన కఫప్రకోపహేతువులు ప్రాయికముగ జెప్పబడినవి. పైగ్రంథముచే జెప్పబడి
కారణములవలన వాతంబును, నిష్పావనిషేవణాదికారణములచే కఫంబును స్వతంత్రములు
ప్రకోపమునొంది క్రిందచెప్పబడు సంప్రాప్తిప్రకారము హిక్కా-శ్వాసముల గల్గించును
ప్రకరణార్థము. ఈరెండుదోషములును పైజెప్పబడిన రీతిగ వానివాని కారణముల

ప్రకోపించి రెండునుంగలిసి స్వతంత్రములై హిక్కా-శ్వాసముల కల్గించును కాని యొక దాని కొకటి యనుబంధము కాదని భావము. ఈదోషముల రెంటికి నీవ్యాధిని కల్గించు టలో స్వాతంత్ర్యమును సూచించుటకైయే యీరెంటిని ప్రకోపింపజేయుకారణముల వేరువేరుగ విభజించి తంత్రకారులు చెప్పిరి).

## హిక్కా-శ్వాసముల సాధారణసంప్రాప్తి.

మూ. మారుతః ప్రాణవాహీని స్రోతాంస్యావిశ్య కుప్యతి,
ఉరస్థః కఫముద్ధూయ హిక్కా-శ్వాసాన్ కరోతి సః. 17
ఘోరాన్ ప్రాణోపరోధాయ ప్రాణినాం పఞ్చ పఞ్చ చ,

వ్యా. పైజెప్పిన రజోధూమాది కారణములచే ప్రకోపమునొందినవాతము ప్రాణ వహంబులగు స్రోతస్సులలో బ్రవేశించి ఉరస్థానమున జేరి, నిష్పావసేవనాదిస్వకారణ ములచే ప్రకుపితమైన కఫమును పైకి నెగురగొట్టి, మిక్కిలి క్రూరంబులును ప్రాణాంత కరంబులును నగు హిక్కల (ఎక్కిళ్లి) నైదిటిని శ్వాసముల నైదిటిని కల్గించును. (ఇది హిక్కా-శ్వాసముల రెంటికిని సాధారణమైన సంప్రాప్తి. వేరువేరుగ సంప్రాప్తిక్రమము "ప్రాణోదకాన్నవాహీని" ఇత్యాదిగ్రంథముచే జెప్పబడును).

## హిక్కా-శ్వాసముల పూర్వరూపములు.

మూ. ఉభయోః పూర్వరూపాణి శృణు వక్ష్యామ్యతః పరమ్. 18
కణ్ఠోరసోర్గురుత్వం చ వదనస్య కషాయతా,
హిక్కానాం పూర్వరూపాణి కుక్షేరాటోప ఏవ చ. 19
ఆనాహః పార్శ్వశూలం చ పీడనం హృదయస్య చ,
ప్రాణస్య చ విలోమత్వం శ్వాసానాం పూర్వలక్షణమ్. 20

వ్యా. హిక్కా-శ్వాసములు జనించుటకుముందు కల్గు పూర్వరూపములు (వేరు వేరుగ) ఈక్రింద వివరింపబడును:—అందు కంఠమునందును ఉరస్సునందును బరువుగ నుండుట, నోరు వగరు కల్గి యుండుట, కుక్షిలో గడబిడ యనుచు ప్రేవులలో కూతలు బుట్టుట ఇవి ఎక్కిళ్లకు పూర్వరూపములు,కడుపుబ్బరము, ఇరుప్రక్కల నొప్పి, హృదయ మున బాధ, ప్రాణవాతము విలోమముగ సంచరించుట, ఇవి శ్వాసములకు పూర్వరూప ములు.

## హిక్కాసంప్రాప్తి.

మూ. ప్రాణోదకాఽన్నవాహీని స్రోతాంసి సకఫోఽనిలః,
హిక్కాః కరోతి సంరుధ్య

వ్యా. పైజెప్పినరీతిగ ప్రకుపితవాతము ప్రకుపితంబైన కఫముతో గూడి ప్రాణవహంబులును, ఉదకవహంబులును, అన్నవహంబులును నగు రెండేసి సిరలను (వానిని శరీరమునందు ధారాళముగ వ్యాపింపనీయక) అడ్డగించి హిక్కలను కల్గించును. (ఇది హిక్కలకు ప్రత్యేకసంప్రాప్తి).

మహాహిక్కాలక్షణము.

మూ. తాసాం లిఙ్గం పృథక్ శ్రుణు. 21

క్షీణమాంసబలప్రాణతేజసః సకఫోఽనిలః,
గృహీత్వా సహసా కణ్ఠం ఉచ్చైర్ఘోషవతీం భృశమ్ 22
కరోతి సతతం హిక్కాం ఏక-ద్వి-త్రిగుణాంతథా,
ప్రాణః స్రోతాంసి మర్మాణి సంరుద్ధ్యోష్మాణమేవ చ 23
సంజ్ఞాం ముష్ణాతి గాత్రాణాం స్తమ్భం సఞ్జనయత్యపి,
మార్గం చైవాఽన్నపానానాం రుణద్ధ్యుపహతస్మృతేః. 24
సాఽశ్రువిప్లుతనేత్రస్య స్తబ్ధశఙ్ఖచ్యుతభ్రువః,
సక్తజల్పప్రలాపస్య నిర్వృత్తిం నాఽధిగచ్ఛతః. 25
మహామూలా మహావేగా మహాశబ్దా మహాబలా,
మహాహిక్కేతి సా నౄణాం సద్యః ప్రాణహరా మతా. 26

(ఇతి మహాహిక్కా.)

వ్యా. పైజెప్పినరీతిగ సంప్రాప్తమైన హిక్కలకు వేరువేరుగ నీక్రింద లక్షణములు చెప్పబడును:—కఫముతో కూడిన వాతము శరీరమునందలి మాంసంబును బలంబును ఉత్సాహంబును తేజంబును క్షీణించిన మానవునకు కంఠమున వ్యాపించి మిక్కిలి ఘోషముతో కూడి ఒకటి-రెండు-మూడువేగములు కల హిక్కను ఎడలేక కల్గించును. అట్టియెడ ప్రాణవాతము స్రోతస్సులను కణతలు మున్నగు మర్మములను శరీరమునందలి యూష్మమును నిరోధించి, ప్రజ్ఞ దప్పించును. అవయవముల స్తంభింపజేయును. అన్నపానములమార్గమును నిరోధించును. శరీరముపై ప్రజ్ఞదప్పిన జ్ఞాపకశక్తి నశించును. కన్నులయందు నీరు గ్రమ్మును. కణతలు స్తంభించును. కనుబొమలు స్వస్థానమునుండి జారినట్లుండును. నోరు పట్టినట్లుండును. వ్యర్థముగ మాట్లాడును. ఈబాధలపడువానికి కొంచెమైనను సుఖముగ నుండ నవకాశము కల్గక హిక్క బాధించుచుండును. ఈలక్షణములు కలహిక్క గొప్పప్రభావంబును అధికమైనవేగంబును, గొప్పశబ్దంబును, అధికమైన

బలంబును కల్గియుండుటంజేసి మహాహిక్క యని యన్వర్థముగ జెప్పబడును. ఇయ్యది కల్గినవెంటనే ప్రాణముల హరించును.

(హిక్క యనునది స్వభావముచేతనే ప్రాణముల హింసించునది. ఈయర్థమునే యితరతంత్రకారులు—"సఘోషవానాశు హినస్త్యసూన్యతః తతస్తు హిక్కేత్యభిధీయతే బుధైః." అని చెప్పిరి. "హిసి హింసాయాం" అనుధాతువువలన "హినస్తీతి హిక్కా" అనువ్యుత్పత్తిచేత నీయర్థము లభించునని వారియాశయము. అందును మహాహిక్క యనునది మిక్కిలి క్రూరమై యతివేగముగ హింసించునని "సద్యః ప్రాణహరా మతా" యని యీతంత్రకారులు చెప్పిరి.)

## గంభీరహిక్కాలక్షణము.

మూ. హిక్క్యతే యః ప్రవృద్ధస్తు కృశో దీనమనా నరః,
జర్జరేణోరసా కృచ్ఛ్రాం గమ్భీరమనునాదయన్. 27
సంజృమ్భన్ సంక్షిపంశ్చైవ తథాఙ్గాని ప్రసారయన్,
పార్శ్వే చోభే సమాయమ్య కూజన్ స్తమ్భరుగర్దితః. 28
నాభేః పక్వాశయాద్వాపి హిక్కా చాస్యోపజాయతే,
క్షోభయన్తీ భృశం దేహం నామయన్తీవ తామ్యతః 29
రుణద్ధ్యుచ్ఛ్వాసమార్గం తు ప్రణష్టబలచేతసః,
గమ్భీరా నామ సా తస్య హిక్కా ప్రాణాన్తికీ మతా. 30
(ఇతి గమ్భీరా హిక్కా.)

వ్యా. కృశించినశరీరంబును దీనమైన మనస్సును కలమనుజుడు ఎక్కిళ్లవేగముచే రొమ్మును పగులదీయుచున్నట్లు బాధకలవాడై నీల్గుచును అవయవములను ముడుంచుచును, ఒకసమయమున చాచుచును, ఇరుప్రక్కల నిటునటు వంచుచును, కూకలిడుచు, శరీరస్తంబనముచేతను నొప్పిచేతను బాధపడుచు, వెక్కును. పైజెప్పిన బాధల గల్గించుచు నాభిస్థానమునుండి యైనను, పక్వాశయమునుండి యైనను, మిక్కిలి గంభీరమైన ధ్వనితోగూడి, శరీరమును పలువిధముల వణకించుచును, వంచుచును తీవ్రముగ నీహిక్క వెడలును. మరియు నిది ఉచ్ఛ్వాసము వెడలు త్రోవ నడ్డగించును. అట్టికాలమున మనుజునకు ప్రజ్ఞదప్పియు మూర్ఛగ్రమ్మియు శరీరబలము క్షీణించి తుదకు ప్రాణాంతకరమగును. ఇయ్యది మిక్కిలి శరీరాంతర్భాగమగు పక్వాశయమునుండియు నాభిస్థానమునుండియు వెడలుటచేతను, గంభీరధ్వని గల్గియుండుటంజేసియు గంభీరహిక్క యని చెప్పబడును.

### వ్యపేతహిక్కాలక్షణము.

మూ. వ్యపేతా జాయతే హిక్కా యాఽన్నపానే చతుర్విధే,
ఆహారపరిణామాన్తే భూయశ్చ లభతే బలమ్.
ప్రలాపవమ్యతీసారతృష్ణార్తస్య విచేతసః,
జృమ్భిణో విప్లుతాక్షస్య శుష్కాస్యస్య వినామినః.
పర్యాధ్మాతస్య హిక్కా యా జత్రుమూలాదసన్తతా,
సా వ్యపేతేతి విజ్ఞేయా హిక్కా ప్రాణోపరోధినీ.
(ఇతి వ్యపేతా హిక్కా

వ్యా. భక్ష్య-భోజ్య-చోష్య-పానీయములను నాల్గువిధములైన యన్నపానము జాఠరాగ్నిసంబంధముచే జీర్ణదశకు ప్రారంభమగునపుడు (పైజెప్పినరీతిగ ప్రకోప నొందిన వాతకఫములచేత) హిక్క ఎక్కిళ్లు కల్గి, ఆహారము పూర్తిగ జీర్ణమగున మిక్కిలి బలమునొందును. ఈహిక్కయందు ప్రలాపము, వాంతి, అతిసారము, ద అనునీయుపద్రవములచే పీడితుడై రోగి ప్రజ్ఞదప్పి మైమరచియుండును. ఒడలివిరుపు కల్గును. కన్నుల నీరుగ్రమ్మును. నోట ద్రవము లేక యెండును. శరీరమును వెక్కిళ్లు వెడ నప్పుడు పలువిధములుగ వంచును. కడు పుబ్బరించును. ఈహిక్క జత్రుకమూలమును ప్రారంభించి మిగుల దీర్ఘము కాక వెడలును. ఇయ్యది యాహారము జీర్ణదశయం సంభవించుటంజేసి వ్యపేత యని చెప్పబడును. ఇదియును మిక్కిలి క్రూరమై ప్రాణమ హింసించును.

ఈహిక్కాలక్షణమును వాగ్భటు లిట్లు చెప్పిరి:—"చిరేణ యమళైర్వే ఆహారే యా ప్రవర్తతే, పరిణామోన్ముఖే, వృద్ధిం పరిణామే చ గచ్ఛతి....... యమళా వేగినీ హిధ్మా పరిణామవతీ చ సా" (అ. హృ. ని. అ. ౪. శ్లో. ౨౩-౨ ఈవాక్యమునుబట్టి యీహిక్క ఆహారము జీర్ణదశకు ప్రారంభించునపుడు పుట్టి, పూ జీర్ణమగుసరికి అప్పటప్పటికి వృద్ధినొంది బలిష్ఠమగుననియు, రెండేసి వెక్కిళ్లు జంట వెడలుననియు, దానంజేసి యమళహిక్క యని యన్వర్థముగ జెప్పబడుననియు తెలిసె

### క్షుద్రహిక్కాలక్షణము.

మూ. క్షుద్రవాతో యదా కోష్ఠాత్ వ్యాయామపరిఘట్టితః,
కణ్ఠే ప్రపద్యతే హిక్కాం తదా క్షుద్రాం కరోతి సః.
అతిదుఃఖా న సా చోరఃశిరోమర్మప్రబాధినీ,

వ్యాఖ్వాసాఽన్న పానానాం మార్గమావృత్య తిష్ఠతి. 35
ాయస్యతో యాతి భుక్తమాత్రే చ మార్దవం,
ప్రవర్తతే పూర్వం తత ఏవ నివర్తతే. 36
మం క్లోమ కణ్ఠం చ తాలుకం చ సమాశ్రితా,
సా క్షుద్రహిక్కేతి నృణాం సాధ్యా ప్రకీర్తితా. 37
(ఇతి క్షుద్రహిక్కా.)

రమున కాయాసమును కల్గించుపనులవలన స్వల్పమైన వాతము కోష్ఠమునుండి కంఠమున జేరి స్వల్పమైన వెక్కిళ్లను కల్గిం క (మహాహిక్కబోలె) మిక్కిలి కష్టమును కల్గించుచు శిర ములను బాధింపనేరదు. ఉచ్ఛ్వాసముయొక్కయు అన్నపానముల ర్గమును నిరోధింపదు. శరీరమునకు ఆయాసము కల్గినప్పుడు వృద్ధి చినవెంటనే కొంచెమునివర్తించును. ఇయ్యది వ్యాయామముచే జనించును. ంతరముచేతనే మరల శమించు. మరియు నియ్యది హృదయమును మును తాలువులను ఆశ్రయించి మిక్కిలి వేగమును జూపక కొంచెముగ . కావున క్షుద్రహిక్క యని చెప్పబడును. ఇది సాధ్యము. ఇచ్చట ఉదానవాతమని కొందరు చెప్పెదరు. వ్యాయామముచే విక్షిప్తమైన న జేరిహిక్కను కలుగజేయును. మరియొక వ్యాయామముచేత వాతము స్థానాంతరమున వ్యాపించి హిక్కను కల్గింపనోపదని "యతః ప్రవర్తతే " అని చెప్పబడినది.)

## అన్నజహిక్కాలక్షణము.

ాఽత్యభ్యవహృతైః పానాఽన్నైః పీడితోఽనిలః,
ం ప్రపద్యతే కోష్ఠాత్ మద్యైర్వాఽతిమదప్రదైః. 38
ాతిరోషభాష్యాధ్వహాస్యభారాఽతివర్తనైః,
ుః కోష్ఠగతో ధావన్ పానభోజ్యప్రపీడితః. 39
్రోతస్సమావిశ్య కుర్యాద్ధిక్కాం తతోఽన్నజాం,
శనైరసంబద్ధం క్షువంశ్చాపి స హిక్కతే. 40
్మ బాధాజననీ నేన్ద్రియాణాం ప్రబాధినీ,
క పీతే తథా భుక్తే శమం యాతి చ సాఽన్నజా. 41
(ఇత్యన్నజా హిక్కా.)

వ్యా. అన్నపానములను (విధి ననుసరింపక) మిక్కిలి తొందరతో సేవించినను, ప్రమాణమునకన్న మిక్కుటముగ భుజించినను, వాతము ప్రకుపితమై అట్టి యాహార సమ్మర్దముచే నభిహతమై కోష్ఠమునుండి యూర్ధ్వముగ వ్యాపించును. మరియు మిక్కిలి తీవ్రమైన మదమును కల్గించు మద్యమును త్రాగినను, అధికకోపము, అతి సంభాషణము, అధికముగ త్రోవనడచుట, అధికముగ నవ్వుట, అధికముగ భారమును మోచుట, పోర లాడుట, ఈకృత్యములను భుజించినవెంటనే చేసినను, పానాహారములచే వాతముపీడింప బడి కోష్ఠమునుండి పైకి వ్యాపించును. అట్టివాతము ఉరస్సునను స్రోతోమార్గమునను జేరి వెక్కిళ్లను కల్గించును. అట్టిమానవుడు మెలమెల్లగ తుమ్ముతో కూడి వెక్కుచుండును. ఇయ్యది చాలకాలము అనుబంధించదు. మర్మములకును చక్షురాదీంద్రియములకును బాధ కల్గింపనోపదు. అప్పుడు జలమును త్రాగినను మధురపదార్థముల భుజించినను శమించును. ఇయ్యది (యాహారముచేనైన సమ్మర్దముచే గల్గినది కావున అన్నజహిక్కయని చెప్ప బడును.

ఇచ్చట సహసాన్నపానాదికారణములచేత వాతము ప్రకుపితమై యీహిక్కను కల్గించును, అయినను అన్నపానవ్యత్యయము కారణముగ జెప్పబడినది కావున అన్నజ మని చెప్పబడును. మరియు తీక్ష్ణరూక్షాద్యాహారములచే గూడ నీహిక్క జనించును. ఈవిషయమునే వాగ్భటులు "మరుత్తత్ర త్వరయాఽయుక్తిసేవితైః, రూక్షతీక్ష్ణఖరాసాత్మ్యైః అన్నపానైః ప్రపీడితః, కరోతి హిధ్మామరుజాం" (అ. హృ. ని. అ. ౪.)

## హిక్కారోగసాధ్యాఽసాధ్యలక్షణములు, విభాగము.

మూ॥ అతిసఞ్చితదోషస్య భక్తచ్ఛేదకృశస్య చ,
వ్యాధిభిః క్షీణదేహస్య వృద్ధస్యాఽతివ్యవాయినః. 42
ఆసాం యా సా సముత్పన్నా హిక్కా హన్త్యాశు జీవితమ్,

వ్యా. దోషములు మిక్కిలి యధికముగ జేరియున్నవానికిని, అన్నద్వేషాదికారణ ముల నాహారము చేయకుండుటంజేసి కృశించినవానికిని, జ్వరాదిరోగములచే క్షీణించిన శరీరము కలవానికిని, ముసలివానికిని, అధికముగ స్త్రీసంభోగముచేసినవానికిని, పైజెప్ప బడిన యైదువిధములగుహిక్కలలో నేది సంభవించినను, అయ్యది శీఘ్రముగ జీవితమును చంపును.

మూ. యమికా చ ప్రలాపార్తితృష్ణామోహసమన్వితా. 43
అక్షీణశ్చాఽప్యదీనశ్చ స్థిరధాత్విన్ద్రియశ్చ యః,
తస్య సాధయితుం శక్యా యమికా హన్త్యతోఽన్యథా. 44

వ్యా. సాధ్యకోటిలో జేరిన క్షుద్ర-అన్నజహిక్కలు జంటజంటగ రెండేసి వేగములు కల్గి వెడలినయెడ నయ్యాది యమిక, అట్టి హిక్కలయందు ప్రలాపము, దప్పి, మూర్ఛయు కల్గినయెడ నట్టి క్షుద్ర-అన్నజహిక్కలును అసాధ్యము లగును. మరియు పైజెప్పిన రెండుహిక్కలును రెండేసి వేగములతో వెడలుచున్నను, శరీరము క్షీణించక దీనతనొందక ధాతువులును ఇంద్రియములును స్థిరములుగ (వైకల్యము లేక) నున్నచో నవిరెండును సాధ్యములగును. అటుగాక పైజెప్పినదానికి వ్యత్యయముగ శరీరకార్శ్యాదులు కల్గినయెడ మనుజుని తప్పక చంపును.

### శ్వాససంప్రాప్తి.

మూ. యదా స్రోతాంసి సంరుధ్య మారుతః కఫపూర్వకః,
విష్వగ్వ్రజతి సంరుద్ధః తదా శ్వాసాన్ కరోతి సః. 45

వ్యా. ("రజసా ధూమవాతాభ్యాం" అని యుపక్రమించి చెప్పబడిన స్వకారణములచే ప్రకోపమునొందిన) వాతము, (నిష్పావసేవనాదిస్వకారణములచే ప్రకుపితమైన) కఫముతో గూడి ప్రాణోదకవహంబులగు స్రోతస్సులను అడ్డగించి యెప్పుడు కఫముచే నడ్డగింపబడి శరీరమునందెల్ల పలుదెరంగుల వ్యాపించునో, అప్పుడు పైజెప్పబడిన యైదుతెరంగులైన శ్వాసరోగములను కల్గించును. (ఇది శ్వాసమునకు విశేషసంప్రాప్తి. "మారుతః ప్రాణవాహీని...హిక్కాః శ్వాసాన్ కరోతి చ" అని చెప్పబడిన సామాన్యసంప్రాప్తిని కూడ నిచ్చట నతిదేశించునది. 'మారుతః కఫపూర్వకః' అనుచోట కఫప్రధానమైన వాతమని యర్థము. 'సంరుద్ధః' అనుచోట కఫముచే నడ్డగింపబడి యని యర్థము. "కఫోపరుద్ధగమనః పవనో విష్వగాస్థితః" అని వాగ్భటులు పైవిషయమునే స్ఫుటముగ జెప్పిరి).

### మహాశ్వాసలక్షణము.

మూ. ఉద్ధూయమానవాతో యః శబ్దవద్దుఃఖితో నరః,
ఉచ్చైశ్శ్వసితి, సంరుద్ధః మత్తర్షభ ఇవాఽనిశమ్. 46
ప్రణష్టజ్ఞానవిజ్ఞానః తథా విభ్రాన్తలోచనః,
వికృతాఽక్ష్యాననో బద్ధమూత్రవర్చా విశీర్ణవాక్. 47
దీనః ప్రశ్వసితం చాస్య దూరాద్విజ్ఞాయతే భృశం,
మహాశ్వాసోపసృష్టస్స క్షిప్రమేవ విపద్యతే. 48

(ఇతి మహాశ్వాసః)

వ్యా. ప్రాణవాతము కఫముచే నడ్డగింపబడుటంజేసి పైకి నెగురగొట్టబడి మిక్కిలి కష్టమును కల్గించుచు శబ్దముతో కూడి మిగుల దీర్ఘమై శ్వాసము పైకి వెడలును. అట్టి శ్వాసము స్వేచ్ఛగ సంచరించు మదపుటేనుగును నిరోధించినయెడ నయ్యది బుసకొట్టువిధముగ బుస్సుబుస్సుమని శబ్దము కల్గి తీవ్రముగ వెడలును. ఈశ్వాసము జనించినపుడు రోగికి సామాన్యవస్తుజ్ఞానంబును శాస్త్రజన్యజ్ఞానంబును బొత్తిగ నశించును. కన్నులు వికృతములై పలువెరంగుల కదులుచుండును. కన్నులును ముఖంబును చూడ వికృతములై యుండును. మలమూత్రములు బద్ధగించును. మాటలు కొతుకు పుట్టును. అట్టి పరిస్థితి యందు రోగి దీనుడై యుండును. వానికి వెడలుశ్వాసము శబ్దముతో కూడి యుండుటం బట్టి దూరమునకు వినబడును. ఈలక్షణములు కల్గినది మహాశ్వాసము. ఈశ్వాసము కల్గిన రోగి వెంటనే మరణమునొందును.

### ఊర్ధ్వశ్వాసలక్షణము.

మూ. దీర్ఘం శ్వసితి యస్తూర్ధ్వం న చ ప్రత్యాహరత్యధః,
శ్లేష్మావృతముఖస్రోతః క్రుద్ధగన్ధవహార్దితః. 49
ఊర్ధ్వదృష్టిర్విపశ్యంశ్చ విభ్రాన్తాక్ష ఇత స్తతః,
ప్రముహ్యన్ వేదనా ర్తశ్చ శుష్కాస్యోఽరతిపీడితః. 50
ఊర్ధ్వశ్వాసే ప్రకుపితే హ్యధశ్శ్వాసో నిరుధ్యతే,
(ఊర్ధ్వశ్వాసే ప్రవృత్తే తు యశ్చాధశ్శ్వాసరోధభాక్,)
ముహ్యతస్తామ్యతశ్చోర్ధ్వం శ్వాస స్తస్యైవ హ న్త్యసూన్. 51
(ఇత్యూర్ధ్వశ్వాసః.)

వ్యా. మనుజుడు కఫముచే నడ్డగింపబడిన నాసారంధ్రములు మున్నగు స్రోతస్సులు కలవాడై మిక్కిలి ప్రకుపితమైన వాతముచే బీడింపబడి యుచ్ఛ్వాసమును (ఎగయూపిరిని) మిగుల కష్టముచే నతిదీర్ఘముగ బైట వెడలించి మరల నాశ్వాసమును మరలించి క్రిందికి త్రిప్పలేకుండును. ఇయ్యది యూర్ధ్వశ్వాస మనబడును. ఈయూర్ధ్వశ్వాసము వెడలునప్పుడు కన్నులు రెప్పవాలక నిలువుగ్రుడ్లు పడి పలువిధముల దిరుగుచుండును. వికృతరూపముగ నిటునటు కన్నుల ద్రిప్పుచు వికృతముగనే చూచుచుండును. ఓరువరాని వేదనచే బాధపడుచు నోరు తెల్లబడి సకలవిషయములయందు నిచ్ఛ లేక మెయిమరచి మూర్ఛనొందును. శ్వాసము ఊర్ధ్వముగ ప్రకుపితమై వెడలునప్పుడు దానిని మరల నధోముఖముగ మరలనీయక యడ్డగించును. (కావున శ్వాసము క్రిందికి రానేరదని భావము). కన్ను మిన్ను కానరాక మూర్ఛనొందును. ఈయూర్ధ్వశ్వాసము

రోగిని శీఘ్రముగ చంపును. (తక్కినశ్వాసములయందు ఉచ్ఛ్వాసము ఊర్ధ్వముగ వెడలి మరల క్రిందికి నిశ్వాసరూపముగ వెడలి కోశమున జేరుచుండును. ఈశ్వాసమున పైకి వెడలిన శ్వాసము మరలకయే మాటిమాటికి వెనువెంట నూర్ధ్వముగనే వెడలుచుండును. కావున నియ్యది యూర్ధ్వశ్వాసమని యన్వర్థముగ జెప్పబడును.)

## ఛిన్నశ్వాసలక్షణము.

మూ. యస్తు శ్వసితి విచ్ఛిన్నం సర్వప్రాణేన పీడితః,
న వా శ్వసితి దుఃఖార్తో మర్మచ్ఛేదరుగర్దితః. 52
ఆనాహస్వేదమూర్ఛార్తో దహ్యమానేన వస్తినా,
విప్లుతాక్షః పరిక్షీణః శ్వసన్ రక్తైకలోచనః. 53
విచేతాః పరిశుష్కాస్యో వివర్ణః ప్రలపన్నరః,
ఛిన్నశ్వాసేన విచ్ఛిన్నః స శీఘ్రం ప్రజహాత్యసూన్. 54
(ఇతి ఛిన్నశ్వాసః.)

వ్యా. ప్రాణము లన్నింటిచే మిక్కిలి పీడింపబడినవాడై విచ్ఛిన్నముగ (మరల వెడలుచుండు శ్వాసముతో సంబంధము లేక) శ్వాసమును విడుచుచుండును. లేక శ్వాసము వెడలక మర్మస్థానములయందు ఛేదింపబడినవిధముగ బాధకల్గి కడుపుబ్బరము చెమట వస్తియందు (మూత్రపుతిత్తియందు) నిప్పున కాల్చినవిధముగ మంట, కన్నుల నీరుగ్రమ్ముట, శరీరము కృశించుట, ఈయుపద్రవములతో కూడి మిక్కిలి కష్టముచే శ్వాసమును విడచును. అట్టియెడ ఒక్కకన్ను మాత్రము యెఱ్ఱనైయుండును. జ్ఞానము నశించును. నోట చెమ్మ లేక యుండును. శరీరవర్ణము మారును. సంబంధము లేని మాటల ప్రేలుచుండును. ఈలక్షణములుగలది ఛిన్నశ్వాసము. ఈఛిన్నశ్వాసముచేత సంధిబంధము లన్నియు శిథిలములై రోగి శీఘ్రము ప్రాణములు గోల్పోవును. (ఈశ్వాసము వెడలు నప్పుడు ఉచ్ఛ్వాసనిశ్వాసరూపముగ వెడలు శ్వాసములకు పరస్పరసంబంధము లేక యొకతూరి వెడలిన ఉచ్ఛ్వాసము క్రిందికి దిగునప్పుడు వెనువెంటనే శ్వాసము వెడలు చుండును. లేక రెండవతూరి శ్వాసము వెడలక బిగపట్టియుండును. దానంజేసి కడుపుబ్బరము మున్నగు నుపద్రవములు కల్గును.) పైజెప్పిన మూడువిధములైన శ్వాసములును స్వభావముచేతనే యసాధ్యములు.

## తమకశ్వాససంప్రాప్తి, లక్షణము.

మూ. ప్రతిలోమం యదా వాయుః స్రోతాంసి ప్రతిపద్యతే,
గ్రీవాం శిరశ్చ సంగృహ్య శ్లేష్మాణం సముదీర్య చ. 55

కరోతి పీనసం తేన రుద్ధో ఘుర్ఘురకం తథా,
అతీవ తీవ్రవేగం చ శ్వాసం ప్రాణప్రపీడకమ్. 56
ప్రతామ్యత్యతివేగాచ్చ కాసతే సన్నిరుధ్యతే,
ప్రమోహం కాసమానశ్చ స గచ్ఛతి ముహుర్ముహుః. 57
శ్లేష్మణ్యముచ్యమానే తు భృశం భవతి దుఃఖితః,
తస్యైవ చ విమోక్షాన్తే ముహూర్తం లభతే సుఖమ్. 58
అథాఽస్యోద్ధ్వసతే కణ్ఠః కృచ్ఛ్రాచ్ఛక్నోతి భాషితుం,
న చాపి నిద్రాం లభతే శయానః శ్వాసపీడితః. 59
పార్శ్వే తస్యావగృహ్ణాతి శయానస్య సమీరణః,
ఆసీనో లభతే సౌఖ్యముష్ణం చైవాభినన్దతి. 60
ఉచ్ఛ్రితాక్షో లలాటేన స్విద్యతా భృశమర్తిమాన్,
విశుష్కాస్యో ముహుః శ్వాసో ముహుశ్చైవావధమ్యతే. 61
మేఘామ్బుశీతప్రాగ్వాతైః శ్లేష్మలైశ్చాభివర్ధతే,
స యాప్యస్తమకశ్వాసః సాధ్యో వా స్యాన్నవోత్థితః. 62
(ఇతి తమకశ్వాసః.)

వ్యా. వాతము మిగుల ప్రకోపమునొంది వాతవహంబులగు స్రోతస్సులయందు (సిరలయందు) ప్రతిలోమముగ సంచరించుచు, శిరస్సునందును కంఠమునందును జేరి శ్లేష్మమును రేపెట్టును. ప్రకుపితమైన యాకఫమువలన గాఢమగు పడిసెముపట్టును. మరియు నట్టికఫముచే నాసారంధ్రములును, కంఠనాళంబును అడ్డగింపబడి వాతము నిరుద్ధమై గుఱ్ఱుగుఱ్ఱు మనుధ్వనికల్గి మిక్కిలి తీవ్రమైనశ్వాసమును వెడలించును. ఈశ్వాసము వెడలునప్పుడు ప్రాణవాతమునకు (యూపిరాడక) చాలబాధకల్గును. మూర్ఛనొందును. మిక్కిలివేగముతో దగ్గువెడలును. కఫముచే శ్వాసము వెడలుమార్గ మడ్డగింపబడును. మాటిమాటికి దగ్గుకల్గి యొడలెరుంగక కళదప్పును. దగ్గినప్పుడు శ్లేష్మము (కఫము) నోటినుండి బైటవెడలకున్నయెడ నూపిరాడక చాలకష్టము నొందును. అప్పుడు కఫము బైట వెడలినచో వెంటనే కొంతసేపు బాధతగ్గి సుఖముగనుండును. అట్టిశ్వాసవేగముచేత కుత్తుకలో నసపుట్టి రాపుకల్గి మిక్కిలికష్టముతో మాటలాడును. శయనముపై సుఖముగ పరుండినను, శ్వాసముచే పీడింపబడిన యామనుజుడు నిముసమాత్రమైనను నిదురబట్టక బాధపడును. మరియు పడకపై పరుండినసమయమున వాతవేగముచేత ఇరుప్రక్కలును

పైకియీాడువబడిన ట్లుండును. కూర్చొనియున్నపుడు కొంచెము సుఖముగనుండును. ఎప్పుడుచూచినను వేడిగనుండుపదార్థములను కోరుచుండును. కన్నులు పైకెత్తి ముఖముపై చెమటగ్రమ్ముచు మిక్కిలి బాధకల్గి శ్వాసవేగముచేత నోటద్రవములేక యెండి మాటిమాటికి శ్వాసమునుపూరించుచు బుస్సుబుస్సుమని శ్వాసమును వెడలించును. ఈవ్యాధి మేఘముఃావరించినపుడును, వర్షము కురియునప్పుడును, చలికాలమునందును, తూరుపుగాలి వీచునప్పుడును, కఫమువృద్ధినందించుపదార్థముల నుపయోగించినపుడును చాలవృద్ధినొంది తీవ్రరూపము దాల్చును. ఇట్టిలక్షణములు గలది తమకశ్వాస మనబడును. (దీనినే లోకమున ఉబ్బసముఅని వ్యవహరించెదరు.) ఇయ్యది యాప్యము. (పథ్యముగ నాహారాదుల సేవించుచునెడ శరీరధారణపర్యంతము కాలము గడుప తగియుండును.) ఒకవేళ నీవ్యాధిజనించినవెంటనే తగుచికిత్స చేసినచో సాధ్యముగూడ నగును.

## ప్రతమక-సంతమకశ్వాసలక్షణములు.

మూ॥ జ్వరమూర్ఛాపరీతస్య విద్యాత్ ప్రతమకం తు తత్,
ఉదావర్తరజోఽజీర్ణక్లిన్నకాయనిరోధజః. 63
తమసా వర్ధతేఽత్యర్థం శీతైశ్చాశు ప్రశామ్యతి,
మజ్జతస్తమసీ వాఽస్య విద్యాత్సంతమకం తు తత్. 64
(ఇతి ప్రతమకసంతమకశ్వాసౌ.)

వ్యా॥ పైజెప్పబడిన తమకశ్వాసమున జ్వరంబును మూర్ఛయు కల్గినయెడ నదియే ప్రతమకశ్వాస మనబడును. ఈవ్యాధి ఉదావర్తముచేతను ధూళిమున్నగునవి నాసాది రంధ్రముల ప్రవేశించుటచేతను, అజీర్ణముచేతను, శరీరము తడసియుండుటచేతను, మలమూత్రాదివేగముల నిరోధించుటచేతను సంభవించును.

మరియు ప్రతమకశ్వాసమే చీకటిచేత వృద్ధినొందుచు, శీతోపచారములచే శాంతినొందుచు, చీకటిలోమునిగియున్నట్లు కన్నులుకానరాకున్న సంతమకశ్వాస మని చెప్పబడును. (ఇచ్చట ప్రతమక-సంతమకశ్వాసభేదములు తమకశ్వాసములోనే అంతర్భూతమగుటజేసి "పంచశ్వాసాః" అను పరిగణనమునకు విరోధములేదని యెరుంగునది.)

## క్షుద్రశ్వాసలక్షణము.

మూ॥ రూక్షాయాసోద్భవః కోష్ఠే క్షుద్రో వాత ఉదీరయన్,
క్షుద్రశ్వాసో న సోఽత్యర్థం దుఃఖేనాఙ్గప్రబాధకః. 65
హినస్తి న స గాత్రాణి న చ దుఃఖో యథేతరే,
న చ భోజనపానానాం నిరుణద్ధ్యుచితాంగతిమ్. 66

నేన్ద్రియాణాం వ్యథాం నాపి కాఞ్చిదాపాదయేద్రుజం,
స సాధ్య ఉక్తో బలినః సర్వే చావ్యక్తలక్షణాః. 67

(ఇతి క్షుద్రశ్వాసః.)

వ్యా. జిడ్డులేక రూక్షములుగనుండు పదార్థములసేవించినను, శరీరమునకు శ్రమమునుకల్గించుపనుల జేసినను కోష్ఠమునందలి వాతము కొంచెముగ ప్రకోపమునొంది పైకి వ్యాపించి క్షుద్రశ్వాసమును కల్గించును. ఇయ్యది శరీరమునకు మిక్కిలికష్టమును కల్గించి బాధింపదు. అవయవముల కష్టపెట్టదు. తక్కినమహాశ్వాసాదిరోగముల వలెదుఃఖసాధ్యము కాదు. భోజనముయొక్కయు పానముయొక్కయు మార్గముల నిరోధించి వానివాటంకపరచి బాధింపదు. చక్షురాదీంద్రియములకు నెట్టిబాధను కల్గింపదు. ఇయ్యది స్వల్పకారణములచే జనించి శరీరమునకు మిగులకష్టమును కల్గింపక సులభప్రయత్నసాధ్య మగుటంజేసి క్షుద్రశ్వాసమని చెప్పబడును. ఇయ్యది సుఖసాధ్యము. తక్కిన (యసాధ్యములని చెప్పబడిన) మహాశ్వాస-ఊర్ధ్వశ్వాస-ఛిన్నశ్వాసములు మూడును, యాప్యమగు తమకశ్వాసంబును, మిక్కిలి బలశాలియగువానికి పూర్ణలక్షణములుగాక వానికి జెప్పనలక్షణములలో కొన్నిమాత్రముకల్గి జనించినయెడ నవియు సాధ్యములగును. (యసాధ్యములగు మహాశ్వాసాదులును పూర్వరూపదశయందే వానికి దగుచికిత్స జేసినయెడ సాధ్యములగునని భావము.)

## హిక్కా-శ్వాసముల చికిత్సావిధానము.

మూ. ఇతి శ్వాసాస్సముద్దిష్టా హిక్కాశ్చైవ స్వలక్షణైః,
ఏషాం ప్రాణహరావర్జ్యాః, ఘోరాస్తే హ్యాశుకారిణః. 68
భేషజైస్సాధ్యయాప్యాంస్తు క్షిప్రం భిషగుపాచరేత్,
ఉపేక్షితా దహేయుర్హి శుష్కం కక్షమివానలః. 69

వ్యా. ఇత్తెరంగున నైదేసిభేదములు కల హిక్కా-శ్వాసములు వానివానిలక్షణములలో వేరువేరుగ వివరింపబడినవి. ఇందు సంపూర్ణలక్షణములతోగూడి ప్రాణహారములగు మహాశ్వాస-ఊర్ధ్వ-ఛిన్నశ్వాసములు మూడును చికిత్సచేయక విడువందగును. అయ్యవి మిక్కిలిక్రూరములై యతిశీఘ్రముగ ప్రాణములహరించును. కావున ప్రత్యాఖ్యేయములు. తక్కిన సాధ్య-యాప్యములగు తమక-క్షుద్రశ్వాసములరంటిని చికిత్స సకాలమున జేయక యుపేక్షించినచో (స్వల్పమైనయగ్నిని చల్లార్పక యుపేక్షించినయెడ ఎండినపిడుగుల కాల్చువిధముగ) శరీరమును దహింపజూచును. కావున నారెండిటిను పేక్షింపక యతిశీఘ్రముగ చికిత్సచేయవలెను.

### హిక్కా-శ్వాసములకు చికిత్సైక్యము, దానికారణము.

మూ. కారణస్థానమూలైక్యాత్ ఏకమేవ చికిత్సితం,
ద్వయోరపి యథాదృష్టమృషిభిస్తన్నిబోధత. 70

వ్యా. హిక్కా-శ్వాసములరెంటికిని బాహ్యకారణములైన యాహారవిహారాదులును నాభి మున్నగుస్థానంబులును మూలకారణములగు దోషంబులును ఒకటిగనుండుటం జేసి యీరెంటికిని చికిత్సయు నొకటిగనేయుండునని ఋషులుకనిపెట్టి నిశ్చయించిరి. అట్టి రెంటికి నేకరూపమై చికిత్సావిధాన మీక్రింద జెప్పబడును.

### హిక్కా-శ్వాసములయందు స్వేదనవిధి.

మూ. హిక్కా-శ్వాసార్దితం స్నిగ్ధై రాదౌ స్వేదైరుపాచరేత్,
ఆక్తం లవణతైలేన నాడీప్రస్తరసఙ్కరైః. 71

వ్యా. హిక్కా-శ్వాసములలో నొకదానిచే పీడింపబడినవానికి తొలుత సైంధవ లవణముతోగూడిన తైలముచే నభ్యంజనము (సర్వాంగమునందును) చేయించి (స్నిగ్ధశరీరుడైన పిదప) స్నిగ్ధములైనద్రవ్యములచే నాడీస్వేదమునైనను ప్రస్తరస్వేదమునైనను సంకరస్వేదమునైనను చేసి చెమటబుట్టించవలెను. (ఇచ్చట "తత్ర వస్త్రాన్తరితైః...... నాడీస్వేదః" సూ. అ. ౧౪. సూత్ర. ౪౧-౪౨-౪౩) అనుగ్రంథముచే స్వేదాధ్యాయమున జెప్పబడిన సంకర-ప్రస్తర-నాడీస్వేదవిధానముల నెరుంగునది.)

### స్వేదనముచే గల్గుగుణములు.

మూ. తైరస్య గ్రథితశ్లేష్మా స్రోతస్స్వభివిలీయతే,
ఖాని మార్దవమాయాన్తి తతో వాతోఽనులోమతా. 72
యథాఽద్రికుఞ్జేష్వర్కాంశుతప్తం విష్యన్దతే హిమం,
శ్లేష్మా తప్తః స్థిరో దేహే స్వేదైర్విష్యన్దతే తథా. 73

వ్యా. స్రోతస్సులయందు గడ్డకట్టియుండు కఫము పైజెప్పిన స్వేదవిధిచేత (పర్వతమునందలి పొదలలో గడ్డకట్టియుండుమంచు సూర్యరశ్మిసోకినయెడ నావేడిచే కరగునట్లు) కరగును. దానంజేసి స్రోతోమార్గములైన నాసారంధ్రాదులు మార్దవము నొందును. పిమ్మట వాతము అనులోమముగ సంచరించును.

### స్వేదనానంతరము భోజనవిధి.

మూ. స్విన్నం జ్ఞాత్వా తతస్తూర్ణం భోజయేత్ స్నిగ్ధమోదనం,
మత్స్యానాం సూకరాణాం వా రసైర్దధ్యుత్తరేణ వా. 74

వ్యా. పైజెప్పిన స్వేదనవిధిచేత సమ్యగ్యోగలక్షణములబట్టి స్వేదసమ్యగ్యోగమును గమనించి వెంటనే నెయ్యిమున్నగువానిచే స్నిగ్ధమైనయాహారమును మత్స్యములయొక్కయు పందులయొక్కయు మాంసరసములతోనైనను, పెరుగు పైతేటతోనైనను భుజింపవలెను. (ఇచ్చట స్నిగ్ధభోజనము వమనానుగుణమైనకఫము వృద్ధినొందుటకై చెప్పబడినది. కఫము వృద్ధినొందినచో శీఘ్రముగ వమనోన్ముఖమగునని యభిప్రాయము.)

హిక్కాశ్వాసములయందు వమనవిధి.

మూ. తతశ్శ్లేష్మణి సంవృద్ధే వమనం పాయయేత్తు తం,
పిప్పలీసైన్ధవక్షౌద్రైర్యుక్తం వాతాఽవిరోధి యత్. 75

వ్యా. పైజెప్పిన స్నేహవిధిచేత కరగి పలుచబడి స్నిగ్ధభోజనముచే కఫము వృద్ధినొందియున్నపుడు పిప్పళ్లు, సైంధవలవణము, తేనె, అను నీమూటితోకూడి వాతమును విరోధముకాకుండు వమనౌషధమును త్రాగించి వమనమును చేయించవలెను. (ఇచ్చట "వాతాఽవిరోధి" అని చెప్పుటచేత రూక్షతీక్ష్ణములైన యౌషధంబును అన్నపానంబులును వాతవర్ధకములు కావున నవి నిషిద్ధములని యెరుంగునది).

వమనముచే గల్గుగుణములు.

మూ. నిర్హృతే, సుఖమాప్నోతి స కఫే దుష్టవిగ్రహే,
స్రోతస్సు చ విశుద్ధేషు చరత్యవిహతోఽనిలః. 76

వ్యా. మిక్కిలి కష్టమునుకల్గించుకఫము వమనముచేత బైటవెడలినయెడ హిక్కాశ్వాసరోగి కొంచెము సుఖమునొందును. దుష్టకఫసంబంధము లేమింజేసి నిర్మలములుగనుండు స్రోతోమార్గములయందు అడ్డులేక వాతము ధారాళముగ సంచరించును.

హిక్కాశ్వాసములయందు ధూమపానవిధి.

మూ. లీనశ్చేద్దోషశేషస్స్యాత్ ధూమైస్తం నిర్హరేద్బుధః,

వ్యా. పైచెప్పినవమనముచేత దోషము నిశ్శేషముగ వెడలక యుంచుక స్రోతోమార్గములయందు లీనమైయుండునెడ నీక్రింద జెప్పబడుధూమపానముచేత బైట వెడలింపనగును. (దోషము కడుస్వల్పముగనున్నయెడ వమనము చేయించకయే ధూమపానముచేత వెడలింపవలెను. దోషము అధికముగ నున్నపుడు వమనముచేయించవలెనని యెరుంగునది.)

హిక్కాశ్వాసములయందు హారిద్రాదిధూమపానము.

మూ. హారిద్రాం పత్రమేరణ్డమూలం లాక్షాం మనశ్శిలామ్. 77

సదేవదార్వలం మాంసీం పిష్ట్వా వర్తిం ప్రకల్పయేత్,
తాం ఘృతాక్తాం పిబేద్ధూమం, యవైర్వా ఘృతసంయుతైః. 78
మధూచ్ఛిష్టం సర్జరసం ఘృతం మల్లకసంపుటే,
కృత్వా ధూమం పిబేచ్ఛృఙ్గం వాలం వా స్నాయు వా గవామ్.
శ్యోనాకవర్ధమానానాం నాడీం కృత్వా కుశస్య వా,
పద్మకం గుగ్గులుం లోహం (లోధ్రం) శల్లకీం వాఘృతాప్లుతమ్.80

వ్యా. పసుపు, లవంగపత్రి, ఆముదపుచెట్టువేరు, లక్క, మనశ్శిల, దేవదారు
, హారిదళము, జటామాంసి వీనినన్నిటిని సమభాగములుగగూర్చి (నీళ్లుబోసి మెత్తగ
తెల్లనిగుడ్డపేలికకు బూసి యెండబెట్టి) వత్తివలె జుట్టి యావత్తిని నేతిలో తడిపి
రకంటించి యావత్తినుండి హిక్కాశ్వాసరోగి పొగ పీల్చవలెను. లేక యవలను
లో చేర్చి తడిపి నిప్పునవైచి యాపొగనైన పీల్చనగును. మరియు మైనమును,
సమును (తెల్లగుగ్గిలమును), నేతిని ఒకటిగకలిపి యొకమట్టిప్రమిదలో నునిచి పైన
దను మూసి రెంటెసందును బిగించి పైప్రమిదలో పొగపీల్చుటకు తగినట్లు రంధ్రము
యారంధ్రమున ఆవుకొమ్మునైనను, తోకనైనను, స్నాయువు (రంధ్రము కలప్రేవు)
, దుండిగపుమానికొయ్యతో చేయబడినగొట్టమునైనను, ఆముదపుకొయ్యగొట్టము
, రెల్లుదర్భకాడనైనను నాడిగ, (పొగపీల్చుటకు దగినగొట్టముగ) నిమిడించి యా
దలసంపుటమున నిప్పునునిచి యాగొట్టమునుండి పొగపీల్చవలెను. మరియు పద్మకము
, గుగ్గిలమునైనను, అగరుచెక్కపొడినైనచు (లొద్దుగుచెక్కపొడినైనను)అందుగు
పొడినైనను నేతిలోతడిపి పైజెప్పినరీతిగ ప్రమిదలసంపుటమున నునిచి గొట్టము
పొగ పీల్చవలెను.(ఇచ్చట ధూమపానవర్తివిధానము సూత్రస్థానమునందలి మాత్రా
ాధ్యాయమున ౨౨, ౨౩ శ్లోకముల జూచునది.)

ఇచ్చట మల్లకమన ప్రమిదయని యర్థము. అట్టిప్రమిదలను రెంటెని సంపుటము
రొండొంట బోరగిల (నొకదానిపై రెండవదానిని) మూసి పొగవెడలకుండునట్టు ల
టిసంధిని బిగించి పైప్రమిదలో పొగపీల్చుటకు గొట్టము నిముడ్చుట కనువుగ
ము చేసి యారంధ్రమునుండి నిప్పు నునిచి దానిపై మధూచ్ఛిష్టము మున్నగునౌష
నునిచి, రంధ్రమున నెద్దుకొమ్ము మొదలగు గొట్టమునునిచి యాగొట్టమునుండి
పీల్చవలెనని యెరుంగునది. గొట్టముయొక్క పరిమాణము పదియంగుళములైనను
దియంగుళములైన నుండవలెను. ఈవిషయము కాసచికిత్సితమున నిట్లు చెప్పబడి
''దశాఙ్గులాన్మితాం నాడీం అథవాష్టాఙ్గులాన్మితామ్, శరావసంపుటచ్ఛిద్రే కృతా ...

జిహ్వాం విచక్షణః” (చి. అ. ౧౮. శ్లో. ౬౬.) హిక్కా-శ్వాసములును కాసమునకు సమానములగుటంజేసి కాసమున జెప్పిన ధూమనాడీపరిమాణము గ్రహింపదగును.

స్వరక్షీణాదులచే గల్గిన హిక్కా-శ్వాసములచికిత్స.

మూ. స్వరక్షీణాఽతిసారాఽసృక్పిత్తదాహాఽనుబన్ధజాన్,
మధురస్నిగ్ధశీతాద్యైః హిక్కా-శ్వాసానుపాచరేత్. 81

వ్యా. స్వరక్షీణము, అతిసారము, రక్తపిత్తము, దాహము అనునీవ్యాధులచే వానికనుబంధముగ సంభవించిన హిక్కా-శ్వాసములకు మధురంబులును శీతవీర్యంబులును స్నిగ్ధంబులును పిచ్ఛిలాదిగుణంబులునైన యౌషధములచే చికిత్స చేయవలెను. (పైజెప్పిన స్వరక్షీణాదులు పిత్తప్రధానములు కావున అట్టిపిత్తమునకు శామకములగు మధురస్నిగ్ధాద్యౌషధాదులచే వానికనుబంధములుగ కల్గిన హిక్కా-శ్వాసములకు చికిత్స చేయవలెనని భావము.)

స్వేదానర్హులు, వారికి మృదుస్వేదవిధి.

మూ. న స్వేద్యాః పిత్తదాహార్తాః రక్తస్వేదాఽతివర్తినః,
క్షీణధాతుబలా రూక్షాః గర్భిణ్యశ్చాఽపి పిత్తలాః. 82
కోష్ణైః కామమురః కణ్ఠం స్నేహసేకైః సశర్కరైః,
ఉత్కారికోపనాహైశ్చ స్వేదయేన్మృదుభిః క్షణమ్. 83

వ్యా. పిత్తముచేతను దాహముచేతను పీడింపబడినవారును, రక్తంబును చెమటయు నధికముగ వెడలుచుండువారును, శరీరమునందలి రసరక్తాదిధాతువులైనను బలంబైనను క్షీణించినవారును, స్నిగ్ధముగాక రూక్షముగనుండు శరీరముకలవారును, గర్భిణీస్త్రీలును, పిత్తప్రకృతికలవారును స్వేదనమునకు అర్హులుకారు; అట్టివారికి హిక్కా-శ్వాసములు సంభవించినయెడ శర్కరతోగూడి సుఖోష్ణముగనుండు స్నేహములను సేచనముచేసియైనను, మృదువులైన ఉత్కారిక-ఉపనాహస్వేదములచేనైనను, రొమ్ముపైనను కంఠముపైనను క్షణకాలముకాచి చెమటబుట్టింపవలెను. (ఇచ్చట 'కామం' అనిచెప్పుటచేత స్వేదము అవసరమైనచో పైజెప్పిన స్వేదానర్హులకును స్నేహసేకాదివిధిప్రకారము ఉరః-కంఠస్థలములయందు మాత్రము క్షణకాలము స్వేదనమును చేయవలెనని తెలిసెడి.)

వాగ్భటాచార్యులు “అవశ్యం స్వేదనీయానాం అస్వేద్యానామపి క్షణమ్, స్వేదయేత్ ససితాక్షీరసుఖోష్ణస్నేహసేచనైః, ఉత్కారికోపనాహైశ్చ” (అ. హృ. చి. అ. ౪. శ్లో. ౧౪.) అని చెప్పిరి. ఈవాక్యముచేత స్వేదానర్హులకుకూడ హిక్కా-శ్వాసములయందు మృదువుగ స్నేహవిధి యావశ్యకమని తెలిసెడి.

### ఉత్కారికావిధి.

మూ. తిలోమామాషగోధూమచూర్ణైర్వాతహరైస్సహ,
స్నేహైశ్చోత్కారికా సామ్లైః సక్షీరైర్వా కృతా హితా. 84

వ్యా. నువ్వులు, అగసివిత్తులు, ఉద్దులు, గోధుమలు వీనిలో నొకదానిని చూర్ణము చేసి యందు వాతహరములగు ద్రవ్యములను చేర్చి స్నేహములు అమ్లములు క్షీరమును అనుద్రవములగలిపి ఉత్కారికోపనాహస్వేదము చేయనగును. (ఉత్కారిక యన అపూపవిశేషము. పైజెప్పిననువ్వులపిండి మున్నగుచూర్ణమున వాతహరద్రవ్యములను,నూనె మొదలగుస్నేహములను చేర్చి, పులిగంజి మున్నగుద్రవమునైనను పాలనైనను కలిపి యపూపమువలె జేసి సుఖోష్ణముగనుండునపుడు శరీరముపై నునిచి కట్టుగట్టిన నయ్యది యుత్కారికాస్వేదము. ఉపనాహస్వేదవిధి సూత్రస్థానమునందలి స్వేదాధ్యాయమున చూచునది.)

### రూక్షస్వేదవిషయము.

మూ. నవజ్వరాఽఽమదోషేషు రూక్షస్వేదం విలఙ్ఘనం,
సమీక్ష్యోల్లేఖనం వాపి కారయేల్లవణామ్బునా. 85

వ్యా. నూతనజ్వరము (జ్వరప్రారంభము)నందును, ఆమదోషములయందును, రూక్షస్వేదము చేయనగును. లేక లంఘనము చేయదగును. లేక దోషముల గమనించి ఉప్పు కలిపిననీళ్లను త్రాగించి వమనము చేయించవలెను.

### వమనాద్యతియోగమునందు వాతశమనోపాయము.

మూ. అతియోగోద్ధతం వాతం దృష్ట్వా వాతహరైర్భిషక్,
రసాద్యైర్నాతిశీతోష్ణైః అభ్యఙ్గైశ్చ శమం నయేత్. 86

వ్యా. వమనాదుల యతియోగమునంజేసి వాతము మిక్కిలి వృద్ధినొందినయెడ వాతహరములగు మాంసరసాదులచేతను సమశీతోష్ణములుగ నుండు అభ్యంగములచేతను వాతమును శమింపజేయవలెను.

### ఉదావర్తాదివాతశమనోపాయము.

మూ. ఉదావర్తే తథాధ్మానే మాతులుఙ్గాఽమ్లవేతసైః,
హిఙ్గుపీలుబిడైశ్చాన్నం యుక్తం స్యాదనులోమనమ్. 87

వ్యా. ఉదావర్తమునందును ఆధ్మానమునందును మాదీఫలరసము, అమ్లవేతసము, ఇంగువ, కొండగోగు, బిడాలవణము వీనితో కూడినయన్నమును భుజించినచో వాతము శమించి యనులోమముగ సంచరించును.

హిక్కా-శ్వాసములయందు నాల్గు అవస్థాభేదములు.

మూ. హిక్కా-శ్వాసామయీ హ్యేకః బలవాన్ దుర్బలోఽపరః,
కఫాధికస్తథైవైకః రూక్షో బహ్వానిలోఽపరః. 88

వ్యా. హిక్కా-శ్వాసములుకలరోగి అవస్థాభేదముచే నాల్గువిధముల నుండును:— అందు ఒకడు బలవంతుడు, వేరొకడు బలహీనుడు, ఒకడు కఫాధికుడు, మరియొకడు వాతాధికుడై రూక్షశరీరుడు. (బలవదవస్థ, దుర్బలావస్థ, రూక్షావస్థ, స్నిగ్ధావస్థయని హిక్కా-శ్వాసములయందు నాల్గువిధములైన యవస్థాభేదములు కలవు. అందు కఫమధికముగనుండునది స్నిగ్ధావస్థ. వాతంబధికముగనుండునది రూక్షావస్థ. ఈయవస్థాభేదములు నాల్గును చికిత్సాభేదమునకై చెప్పబడినది. అట్టిచికిత్సావిధాన మీక్రిందచెప్పబడును అని భావము.)

హిక్కా-శ్వాసములయందు అవస్థాభేదముచే చికిత్సాభేదము; అందు కఫాధిక-బలవదవస్థాచికిత్స.

మూ. కఫాధికే బలస్థే చ వమనం సవిరేచనం,
కుర్యాత్ పథ్యాశినే ధూమలేహాదిశమనం తతః. 89

వ్యా. హిక్కా-శ్వాసములయందు కఫమధికముగనున్నను, రోగి బలిష్ఠుడుగ నున్నను వమనవిరేచనములజేయించి పిమ్మట పథ్యములగు నాహారములనిడి పిదప ధూమపానము లేహములు మున్నగువానిని శమనమునకై యుపయోగింపవలెను.

రూక్ష-దుర్బలాఽవస్థలయందు చికిత్సావిధి.

మూ. వాతికాన్ దుర్బలాన్ బాలాన్ వృద్ధాంశ్చాఽనిలసూదనైః,
తర్పయేదేవ శమనైః స్నేహయూషరసాదిభిః. 90

వ్యా. వాతాధికావస్థయందును దుర్బలావస్థయందును బాలురకును వృద్ధులకును వాతహరములు శమనములునగు స్నేహములచేతను, యూషమును మాంసరసములు మున్నగువానిచేతను సంతర్పణమును చేయవలెను. (ఇచ్చట 'తర్పయేదేవ' అనిచెప్పుటచేత తర్పరూపమైనచికిత్స జేయనగుగాని సంశోధనాదిచికిత్స కూడదని భావము. మరియు బాలురధాతువులు సంపూర్ణములు కాకుండుటచేత, వృద్ధులుధాతువులు క్షీణించుచుండుట

చేతను బలహీనులు; కావున నిచ్చట బలహీనావస్థయందు చికిత్సకుదాహరణముగ జెప్ప బడినది. ఇది అవస్థావిశేషమున జేయదగిన చికిత్సాసూత్రము.)

శోధనానర్హులకు శోధనముచేసిన గల్గుదోషము.

మూ. అనుత్క్లిష్టకఫాఽస్విన్నదుర్బలానాం విశోధనాత్,
వాయుర్లబ్ధాస్పదో మర్మ సంశోష్యాశు హరేదసూన్. 91

వ్యా. వాతము ఉద్రేకముజెందకుండువారికిని, స్వేదవిధిచేత శరీరమున చెమట బుట్టించకుండువారికిని, బలహీనులకును వమనాదిశోధనము నాచరించినచో వాతము ప్రకోపమునొంది హృదయాదిమర్మస్థానములయందలి స్నేహాంశమును శుష్కింపజేసి శీఘ్రముగ ప్రాణముల హరించును; (కావున నట్టివారలకు శోధనము చేయంజనదు.)

బలిష్ఠునకు శోధనము, బలహీనులకు బృంహణము.

మూ. దృఢాన్ బహుకఫాన్ తస్మాత్ రసైరానూపవారిజైః,
తృప్తాన్ విశోధయేత్ స్విన్నాన్; బృంహయేదితరాన్ భిషక్. 92
బర్హితిత్తిరిదక్షాశ్చ జాఙ్గలాశ్చ మృగా ద్విజాః,
దశమూలీరసే సిద్ధాః కౌలుత్థే వా రసే హితాః. 93

వ్యా. పైజెప్పినరీతిగ బలహీనులు మున్నగువారికి శోధనము చేసినచో నపాయ కరముకావున అటుగాక బలిష్ఠులును కఫాధికులును నగువారికి తొలుత అనూపజంతువుల యొక్కయు జలచరజంతువులయొక్కయు మాంసములచే సిద్ధములైనరసములను (కఫము వమనోన్ముఖమగుటకై) తృప్తిగ భుజింపజేసి, స్వేదవిధిచే చెమట బుట్టించి పిమ్మట వమన ములచే శోధనము (దోషనిర్హరణము) చేయనగును. ఇతరులను (బలహీనులను వాతాధికు లను) బృంహణములచే వారికి బలమునుకల్గించవలెను. అట్టి బృంహణమునకు నెమలి, తీతువుపిట్ట, కోడి, జాంగలదేశమునబుట్టిన మృగములు, పక్షులు, వీనిమాంసములను దశ మూలముల కషాయమునందైనను ఉలవలయూషరసమునందైనను (మాంసరసవిధానముచే) పక్వముజేసి యుపయోగించుట చాలమంచిది.

హిక్కాశ్వాసహరయూషములు, అందు కులుత్థయూషవిధానము.

మూ. నిదిగ్ధికాం బిల్వమధ్యం కర్కటాఖ్యాం దురాలభాం,
త్రికణ్టకం గుడూచీం చ కులుత్థాంశ్చ సచిత్రకాన్. 94
జలే పక్త్వా రసః పూతః పిప్పలీఘృతభర్జితః,
ససాగరస్సలవణః స్యాద్యూషో భోజనే హితః. 95

వ్యా. వాకుడువేరు, మారేడుగుజ్జు, కర్కాటకశృంగి, దురదగొండివేరు, పల్లేరు, తిప్పతీగె, ఉలవపప్పు, చిత్రమూలము వీనినన్నిటిని జేర్చి యూషవిధానము ననుసరించి జలమున పక్వముజేసి, యారసమును వడగట్టి, పిప్పళ్లను చేర్చి పక్వముచేయ బడిన ఘృతముచే తిరుగబోత బెట్టి, అందు శుంఠిపొడిని ఉప్పును జేర్చి హిక్కా-శ్వాస రోగులకు భోజనమున కుపయోగించునది. ఈయూషము మిక్కిలి హితకరము. (ఇచ్చట ఉలవలు ఈయూషమున ప్రధానద్రవ్యము కావున యూషవిధానమునకు వలసినంత జేర్పనగును. తక్కినద్రవ్యములు యూషకల్పనమున జెప్పినపరిమాణముతో జేర్పనగును.)

## హిక్కా-శ్వాసములకు ముద్గయూషవిధానము.

మూ. రాస్నాం బలాం పఞ్చమూలం హ్రస్వం ముద్గాన్ సచిత్రకాన్,
పక్త్వామ్భసి రసే తస్మిన్ యూషస్సాధ్యశ్చ పూర్వవత్. 96

వ్యా. సన్నరాష్ట్రము, చిట్టాముట్టి, హ్రస్వపంచమూలములు (ముయ్యాకుపొన్న, కోలపొన్న, వాకుడు, ములక, పల్లేరు), పెసలపప్పు, చిత్రమూలము వీనినన్నిటిని నీళ్లు పోసి యుడకపెట్టి యారసమును యూషవిధానముగ పైజెప్పినట్లు పక్వముజేసి హిక్కా-శ్వాసములయం దుపయోగించునది. (ఇచ్చట రాస్నాదిద్రవ్యములను యూషమున కుచిత ప్రమాణముగ గ్రహించి కషాయము కాచి యారసమును వడగట్టి, అందు యూషమున కు కావలసినంత పెసలపప్పును జేర్చి పక్వముజేసి పైయోగమున జెప్పిన రీతిగ పిప్పలి చూర్ణము జేర్చి పక్వము చేయబడిననేతితో తిరుగబోతబెట్టవలెను. పక్వముచేయునపుడు శుంఠిపొడిని సైంధవలవణమును జేర్చవలెను.)

## క్షారయూషము.

మూ. పల్లవాన్ మాతులుఙ్గస్య నిమ్బస్య కులకస్య చ,
పక్త్వా ముద్గాంశ్చ సవ్యోషాన్ క్షారయూషం విపాచయేత్. 97
దత్త్వా సలవణం క్షారం శిగ్రూణి మరిచాని చ,
యుక్త్యా సంసాధితో యూషః హిక్కా-శ్వాసవికారనుత్. 98

వ్యా. మాదీఫలములచెట్లు చిగుళ్లను, వేపచిగుళ్లను, చేదుపొట్లచిగుళ్లను, పెస లును, త్రికటుకములును వీనినొకటిగచేర్చి పక్వముచేసి యారసమున క్షారయూషమున పక్వముచేయునది. అట్టిరసమున సైంధవలవణమును ఉత్తరేణి మున్నగుక్షారద్రవ్యములచే సిద్ధమైనక్షారమును మునగవిత్తులను మిరియాలను పొడిచేసి యథోచితముగజేర్చి యూష విధిప్రకారము సిద్ధముచేసి యాహారమున నుపయోగించినచో హిక్కా-శ్వాసములు ని ర్తించును. (ఇది క్షారముతోగూడినయూషము కావున క్షారయూషమని చెప్పబడును.

హిక్కా-శ్వాసముల హరించు కొన్నియూషములు.

మూ. కాసమర్దకపత్రాణాం యూషః శోభాఞ్జనస్య చ,
శుష్కమూలకయూషశ్చ హిక్కాశ్వాసనివారణః. 99
సదధివ్యోషసర్పిష్కో యూషో వార్తాకజో హితః,

వ్యా. కసివెందాకునైనను, మునగాకునైనను, ఎండుముల్లంగినైనను కూర్చి సిద్ధము చేయబడిన పెసలు మున్నగువానియూషములు (కట్టులు)ను హిక్కా-శ్వాసముల హరించును. మరియు పెరుగును త్రికటుకములను వంకాయలను చేర్చి సిద్ధముచేయబడిన యూషంబును హిక్కా-శ్వాసములయందు హితకరముగ నుండును.

హిక్కా-శ్వాసములయందు హితకరములగునన్నములు.

మూ. శాలిషష్టికగోధూమయవాన్నాన్యనవాని చ. 100

వ్యా. రాజనములు, అరువదినాళ్లసంబావులు, గోధుమలు, యవలు, ఇవి ప్రాతవిగనున్నచో వీనిబియ్యముచే సిద్ధమైనయన్నములు హిక్కా-శ్వాసరోగులకు మిగుల హితకరములు.

హిక్కా-శ్వాసహరయవాగువులు.

మూ. హిఙ్గుసౌవర్చలాఽజాజీబిడపౌష్కరచిత్రకైః,
సిద్ధా కర్కటశృఙ్గ్యా చ యవాగూః శ్వాసహిక్కినామ్. 101

వ్యా. ఇంగువ, సౌవర్చలలవణము, జీలకర, బిడాలవణము, పుష్కరమూలను, చిత్రమూలము, కర్కాటకశృంగి వీనిని చేర్చి సిద్ధముచేయబడినయవాగువు (గంజి) హిక్కా-శ్వాసరోగులకు చాల హితకరము.

దశమూలాదిక్వాథసిద్ధయవాగువు.

మూ. దశమూలీ శటీ రాస్నా పిప్పలీమూలపౌష్కరైః,
శృఙ్గీతామలకీభార్గీ గుడూచీనాగరామ్బుభిః. 102
యవాగూం విధినా సిద్ధాం కషాయం వా పిబేన్నరః,
కాసహృద్గ్రహపార్శ్వార్తిహిక్కాశ్వాసప్రశాన్తయే. 103

వ్యా. దశమూలములు, కచోరములు, సన్నరాష్ట్రము, పిప్పలిమూలము (మోడి), పుష్కరమూలము, కర్కాటకశృంగి, నేలయుసిరిక, భారంగి, తిప్పతీగె, శుంఠి వీనిని సమభాగములుగజేర్చి నీళ్లుబోసి సగము మిగులునట్లు జలపాకవిధిప్రకారము కాచి వడ

గట్టి యాజలమున విధిప్రకారము పక్వముచేయబడిన యవాగువునైనను, దశమూలాదుల జేర్చి కాచబడిన కషాయమునైనను త్రాగినచో కాసము, హృదయమును పట్టినట్లు బాధ, పార్శ్వశూలము, హిక్కాశ్వాసములు ఇవియన్నియు శమించును. ("కషాయం వా పిబేన్నరః" అనుచోట జలపానమునకు బదులుగ కషాయపానము విహితము. కావున దశమూలాదులను యథోచితముగ జలమున జేర్చి అర్ధభాగము శేషించునట్లు తేలిక కషాయముచేయు టుచితము.)

### హిక్కాశ్వాసరోగికి ఆహారోపయోగ్యములు.

మూ. పుష్కరాహ్వాశటీవ్యోషమాతులుఙ్గామ్లవేతసైః,
యోజయేదన్నపానాని ససర్పిర్గుడహిఙ్గుభిః. 104

వ్యా. పుష్కరమూలము, కచోరములు, త్రికటుకములు, మాదీఫలరసము, అమ్లవేతసము, నెయ్యి, బెల్లము, ఇంగువ ఈద్రవ్యములను అన్నపానములయందు జేర్చి హిక్కాశ్వాసరోగికి నుపయోగింపందగును.

### హిక్కాశ్వాసములయందు పానీయములు, అందు దశమూలక్వాథాదిపానీయములు.

మూ. దశమూలస్య వా క్వాథమథవా దేవదారుణః,
తృషితో మదిరాం వాపి హిక్కాశ్వాసీ పిబేన్నరః. 105

వ్యా. హిక్కాశ్వాసపీడితుడు దప్పికగ్లినపుడు దశమూలకషాయమునైనను, దేవదారుచెక్కకషాయమునైనను మదిరయను మద్యమునైనను త్రాగవలెను.

### హిక్కాశ్వాసశామకసురామండపానము.

మూ. పాఠాం మధురసాం రాస్నాం సరళం దేవదారు చ,
ప్రక్షాళ్య జర్జరీకృత్య సురామణ్డే నిధాపయేత్. 106
తం మస్తులవణం కృత్వా భిషక్ప్రసృతసమ్మితమ్,
పాయయేత్తు తతో హిక్కా శ్వాసశ్చైవోపశామ్యతి. 107

వ్యా. చిరుబొద్ది, చాగ, సన్నరాష్ట్రము, సరళవృక్షముయొక్క చెక్క, దేవదారు చెక్క వీనిని నీళ్లతో శుభ్రముగ కడిగి తునియలుగ జేసి సురయను మద్యముయొక్క పై తేటలో (నొకరాత్రి) ఊరబెట్టి దానియందు కొంచెముగ లవణమును చేర్చి అందు ప్రసృతపరిమితము (రెండుపలములు, లేక చేరెడు) త్రాగవలెను. దీనివలన హిక్కాశ్వాస

ములు శమించును. (వాగ్భటాచార్యులు "పాఠాం......నిశిస్థితం సురామణ్డేఽల్పలవణం పిబేత్ప్రసృతసమ్మితమ్" (అ. హృ. చి. అ. ४.) అనిచెప్పిరి. కావున పైద్రవ్యములను ఒక రాత్రి సురామండమున నునిచి మరునాడు త్రాగవలెనని యెరుంగునది.)

ఆరనాళ-ఉష్ణాంబుపానీయములు.

మూ. హిఙ్గు సౌవర్చలం కోలం సమఙ్గాం పిప్పలీం బలాం,
మాతులుఙ్గరసే పిష్టమారనాళేన వా పిబేత్. 108
సౌవర్చలం నాగరం చ భార్ఙ్గీఞ్శర్కరాయుతం,
ఉష్ణాම్బునా పిబేదేతత్ హిక్కాశ్వాసవికారనుత్. 109

వ్యా. ఇంగువ, సౌవర్చలలవణము, రేగుపండ్లు, మంజిష్ఠి, పిప్పలి, చిట్టాముట్టి, వీనిని సమభాగములుగ గూర్చి మాదీఫలములరసమును బోసి నూరి కాంజికములో కలిపి త్రాగవలెను. మరియు సౌవర్చలలవణము, శుంఠి, భారంగి, వీనిని సమభాగములుగగూర్చి, ఈసముదాయమునకు రెట్టింతలు చక్కెర కలిపి చూర్ణముజేసి వేడినీళ్లలో కలిపి త్రాగినచో హిక్కాశ్వాసములు నివర్తించును.

హిక్కాశ్వాసహరభార్ఙ్గ్యాదికల్కయుక్తపానీయములు.

మూ. భార్ఙ్గీనాగరయోః కల్కం మరిచక్షారయోస్తథా,
పీతద్రుచిత్రకాస్ఫోతామూర్వాణాం చాఽమ్బునా పిబేత్. 110

వ్యా. గంటుభారంగిని శుంఠిని కల్కముజేసియైనను, మిరియములను యవక్షారమును కల్కముచేసియైనను, సరళదేవదారు చిత్రమూలము అడవిమల్లె చాగ ఈనాల్గిటిని చేర్చి కల్కముచేసియైనను, సుఖోష్ణముగనుండు నీళ్లలో కలిపి త్రాగినను హిక్కాశ్వాసములు నివర్తించును.

పిత్తానుబంధశ్వాసచికిత్స.

మూ. మధూలికా తుగాక్షీరీ నాగరం పిప్పలీ తథా,
ఉత్కారికా ఘృతే సిద్ధా శ్వాసే పిత్తాఽనుబన్ధజే 111

వ్యా. పిత్తము అనుబంధముగనుండి సంభవించిన శ్వాసమునందు పిన్నగోధుమలు, వెదురుప్పు, శుంఠి, పిప్పళ్లు, ఈద్రవ్యముల జేర్చి నేతిలో కాల్చబడిన కుడుముల నుపయోగించునది.

వాతానుబంధ-వాతపిత్తానుబన్ధశ్వాసచికిత్స.

మూ. శ్వావిధం శశమాంసం చ శల్లకస్య చ శోణితం,
పిప్పలీఘృతసిద్ధాని శ్వాసే వాతాఽనుబన్ధజే. 112
సువర్చలారసో దుగ్ధం, ఘృతం త్రికటుకాన్వితం,
శాల్యోదనస్యాఽనుపానం వాతపిత్తాఽనుగే హితమ్. 113

వ్యా. ఏదుపందిమాంసము, కుందేటిమాంసము, ఈరెంటిని సమభాగములుగ గూర్చి, పిప్పలిచూర్ణమును యథోచితముగ కలిపి కుడుములుగ జేసి, ఏదుపందిరక్తమును ఆవునేతిని సమభాగములగూర్చి దీనితో కుడుములను పక్వముజేసి వాత మనుబంధముగకల శ్వాసరోగమున నుపయోగించనగును.

మరియు ప్రొద్దుతిరుగుడుచెట్టుఆకురసము, పాలు, ఆవునెయ్యి, ఈమూటినొకటిగ జేర్చి, అందు త్రికటుకములచూర్ణమును కలిపి పక్వముచేసి యాఘృతమును రాజనపు బియ్యముచే సిద్ధమైనయన్నమున కనుపానముగ నుపయోగించినయెడ వాతపిత్తానుబంధమైనశ్వాసము నివర్తించును.

కఫపిత్తానుగశ్వాసచికిత్స.

మూ. శిరీషపుష్పస్వరసః సప్తపర్ణస్య వా పునః,
పిప్పలీమధుసంయుక్తః కఫపిత్తాఽనుగే మతః. 114

వ్యా కఫపిత్తములలో గూడినశ్వాసమునందు దిరిసెనపు పువ్వులస్వరసమునైనను, ఏడాకులపొన్నస్వరసమునైనను, పిప్పలిచూర్ణము తేనెను కలిపి సేవించుట చాల హితకరము.

హిక్కా-శ్వాసహరౌషధము.

మూ. మధుకం పిప్పలీమూలం గుడో గోఽశ్వశకృద్రసః,
ఘృతంక్షౌద్రంకాసహిక్కాశ్వాసాఽభిష్యన్దినాంహితమ్(శుభమ్)

వ్యా. అతిమధురము, పిప్పలిమూలము (మోడి), బెల్లము, ఆవుపేడయొక్కయు గుఱ్ఱముపేడయొక్కయు రసము, నెయ్యి, తేనె, వీనినన్నిటి నొకటిగ కలిపి తినినయెడ కాసంబును, హిక్కాశ్వాసంబులును శమించును.

హిక్కా-శ్వాసహరములగు కొన్నియోగములు.

మూ. ఖరాశ్వోష్ట్రవరాహాణాం మేషస్య చ గజస్య చ,

శకృద్రసం బహుకఫే చైకైకం మధునా పిబేత్. 116
క్షారం చాఽప్యశ్వగన్ధాయాః లేహయేత్ క్షౌద్రసర్పిషా,

వ్యా. గాడిదె, గుఱ్ఱము, ఒంటె, పంది, పొట్టేలు, ఏనుగ, అనునీజంతువులలో నొకదానిపేడరసమున తేనె కలిపి కఫము మిక్కిలి యధికముగ శ్వాసమున త్రాగించవలెను. మరియు పెన్నేరుగడ్డచెట్టుక్షారమున తేనెను నేతిని కలిపి నాకవలెను.

హిక్కా-శ్వాసములయందు శోధనోపాయములు.

మూ. మయూరపాదనాలం వా శాకలం శల్లకస్య వా. 117
శ్వావిజ్ఝాణ్డకచాషాణాం (శ్వావిద్రోహక,శ్వావిజ్జాహకభాషణాం)
రోమాణి కురరస్య వా,
శృఙ్గైకద్విశఫానాం వా చర్మాస్థీని ఖురాంస్తథా. 118
సర్వాణ్యేకైకశో వాపి దగ్ధ్వా క్షౌద్రఘృతాన్వితం,
చూర్ణం లీఢ్వా జయేత్కాసం హిక్కాం శ్వాసం చ దారుణమ్.
ఏతే హి కఫసంరుద్ధగతిప్రాణప్రకోపజాః,
తస్మాత్తన్మార్గశుద్ధ్యర్థం దేయా లేహా న నిష్కఫే. 120

వ్యా. నెమలిపాదమునందలిగోళ్లు, దానిపింఛమునందలికాడలు, ఏదుపందిశరీరమునందలిముండ్లయొక్కతునియలు, ఏదుపందియొక్కయు, మరుభూమియందు సంచరించు జాండకమనెడు మృగముయొక్కయు, పాలపిట్టయొక్కయు రోమములు పెన్నెడపులుగుయొక్కయీకలు ఒకగిట్టకల (చీలికలేక ఒకటిగనుండు గిట్టలుకల) గాడిదె గుఱ్ఱము మున్నగు జంతువులయొక్కయు రెండుగచీలినగిట్టలుకలగోవులు మహిషములు మున్నగు జంతువులయొక్కయు కొమ్ములు, వానిచర్మము, వానిగిట్టలు, వానియస్థులు అనునీవస్తువులనన్నిటినైనను, కొన్నిటినైనను వానిలో నొక్కొకదానినైనను కాల్చి బూడిదె చేసి మెత్తగ చూర్ణముచేసి అందు తేనెను నేతిని కలిపి నాకినచో కాసమును హిక్కను క్రూరమైన శ్వాసమును హరించును.

మరియు హిక్కా-శ్వాస-కాసములు మూడును కఫము ప్రకోపించి ప్రాణవాతము సంచరించుమార్గమున జేరి యడ్డగించుటచే ప్రాణవాతము ప్రకోపించుటవలన కలుగును. కావున అట్టి కఫము హరించి ప్రాణవాతసంచారమార్గము శుద్ధమగుటకై పైజెప్పిన లేహముల నుపయోగింపవలెను; కాని కఫములేనినాడు వీనినుపయోగింపం జనదు.

### హిక్కా-శ్వాసకాసములయందు శోధనావశ్యకత.

మూ. కాసినే చ్ఛర్దనం దద్యాత్ స్వరభఙ్గే చ బుద్ధిమాన్,
వాతశ్లేష్మహరైర్యుక్తం, తమకే తు విరేచనమ్. 121
ఉదీర్యతే భృశతరం మార్గరోధాద్వహజ్జలం,
యథా తథాఽనిలస్తస్య మార్గం నిత్యం విశోధయేత్. 122

వ్యా. హిక్కా-శ్వాసములయందు దగ్గుకల్గినవానికిని స్వరభంగమునందును బుద్ధిమంతుడగు వైద్యుడు వాత-కఫహరములగు ద్రవ్యములతో గూడిన వమనౌషధము నుపయోగింపవలెను. తమకశ్వాసమునందు అట్టియౌషధములతో గూడిన విరేచనౌషధము నుపయోగింపవలెను. అతివేగముగ ప్రవహించునట్టి జలమార్గమునడ్డగించినయెడ జలము ఎదురుతిరిగి పలుదెరంగులమార్గాంతరముల జేసికొనియైన ప్రవహింపదొడంగును కదా; అత్తెఱంగుననే తనంత సంచరించుస్వభావము కలవాతముయొక్క సంచారమార్గమును కఫము అడ్డగించినచో వాతము ప్రకుపితమై ఎదురెక్కి పలుదెరంగుల సంచరించుచు హిక్కాదిరోగములతప్పక కల్గించును; కావున పైజెప్పినరీతిగ వమనవిరేచనములచే వాతసంచారమార్గమునందలి దోషముల వెడలించి శుభ్రపరచుట ముఖ్యకర్తవ్యము.

### హిక్కా-శ్వాసములకు శట్యాదిచూర్ణము.

మూ. శటీచోరకజీవన్తీత్వఙ్ముస్తం పుష్కరాహ్వయం,
సురసం తామలక్యేలా పిప్పల్యగురు నాగరమ్. 123
వాలకం చ సమం చూర్ణం కృత్వాఽష్టగుణశర్కరమ్,
సర్వథా తమకే శ్వాసే హిక్కాయాఞ్చ ప్రయోజయేత్. 124

వ్యా. కచూరములు, పెద్దకచూరములు, మనుబాల, లవంగపుపత్రి, తుంగగడ్డలు, పుష్కరమూలము, తులసి, నేలయుసిరిక, ఏలకులు, పిప్పళ్లు, అగరు, శుంఠి, కురువేరు, వీనినన్నిటిని సమభాగములుగ గూర్చి చూర్ణముచేసి అందొక భాగమునకు ఎనిమిదింతలు చక్కెర కలిపి ఈచూర్ణమును తమకశ్వాసమునందును యెక్కిళ్లయందును పాన-భోజనాదులలో చేర్చి యుపయోగించునది. (ఇచ్చట శటిమున్నగు ద్రవ్యములను సమభాగములుగను, అందొక ద్రవ్యమునకు అష్టగుణితముగ శర్కరను, చేర్చవలయునని చక్రపాణిదత్తవ్యాఖ్యానమున వివరింపబడినది. అష్టాంగహృదయమున "శర్కరాష్టగుణం చూర్ణం" అనుచోట వ్యానమువివరణము కనబడలేదు. కావున సముదాయమునకు అష్టగుణితము శర్కరయని వారి యభిమతముగ తోచుచున్నది).

## హిక్కా-శ్వాసములకు, ముక్తాదిచూర్ణము.

మూ. ముక్తాప్రవాలవైడూర్యశంఖస్ఫటికమంజనం,
ససారగన్ధకాచార్కసూక్ష్మైలాలవణద్వయమ్. 125
తామ్రాయోరజసీరూప్యం ససౌగన్ధికసీసకమ్ (కశేరుకం),
జాతీఫలం శణాద్బీజం అపామార్గస్య తణ్డులాః 126
ఏషాం పాణితలం చూర్ణం తుల్యానాం క్షౌద్రసర్పిషా,
హిక్కాం శ్వాసం చ కాసం చ లీఢమాశు నియచ్ఛతి. 127
అఞ్జనాత్తిమిరం కాచం నీలికాం పుష్పకం తమః,
పల్యం (పిల్లం) కణ్డూమభిష్యన్దిం అర్మ చైవ ప్రణాశయేత్. 128
(ఇతి ముక్తాద్యం చూర్ణం.)

వ్యా. మంచిముత్యములు, పవడము, వైడూర్యము, శంఖము, స్ఫటికము, రసాంజనము, సారగంధము (స్ఫటికభేదము), కాచమణి, జిల్లేడు, పిన్నయేలకులు, సౌవర్చలవణము, సైంధవలవణము, తామ్రము, ఇనుపరాపొడి, వెండి, సౌగంధ్యమను మాణిక్యభేదము, సౌవీరాంజనము, జాజికాయ, జనుపవిత్తులు, ఉత్తరేణివిత్తులు, వీనినన్నిటిసమభాగములుగ చేర్చి మెత్తనిచూర్ణముగ చేసి పూటకు కర్షప్రమాణమువంతున తేనెయందును, నేతియందును చేర్చి సేవించినచో దీనివలని హిక్కా-శ్వాసములు, కాసములు, శీఘ్రముగ నివర్తించును.

మరియు వీనిని మెత్తగ కాటుకవలె చేసి కన్నులకు అంజనముగ వేసిన కాచము, నీలిక, కంటిపువ్వులు, పిల్లము, కంటిదురద, అభిష్యందము, అర్మము, అను నేత్రరోగములన్నియు నివర్తించును. (ఇచ్చట ముత్యములు పవడములు మున్నగుద్రవ్యములు; వానివానికి చెప్పినశోధనాదులచే సంస్కరించి భస్మసిందూరాది రూపముగ వానివానివిధప్రకారము చేసి అట్టిభస్మసిందూరాదులను ఈయౌషధమున చేర్చుట మంచిది.)

## హిక్కాశ్వాసములకు శటీపుష్కరాదిచూర్ణము.

మూ. శటీపుష్కరమూలానాం చూర్ణమామలకస్య చ,
మధునా సంయుతం లేహ్యం చూర్ణం వా కాలలోహజమ్. 129

వ్యా. కచూరములు, పుష్కరమూలము, ఉసిరికకాయవొలుపు, వీనిని సమభాగములుగ చేర్చి చూర్ణముచేసి తేనెతో కలిపి సేవించినను, ఉక్కురాపొడిచూర్ణమున తేనెతో కలిపి సేవించినను హిక్కాశ్వాసములు నిమ్మళించును.

### హిక్కాహరప్రాశము.

మూ. సశర్కరాం తామలకీం ద్రాక్షాం గోఽశ్వశకృద్రసం,
తుల్యం గుడం నాగరం చ ప్రాశయేత్ నావయేత్తథా. 130

వ్యా. చక్కెర, నేలయుసిరిక, ద్రాక్షపండు, ఆవుపేడయొక్కయు, గుఱ్ఱపుపేడ యొక్కయురసము; వీనినన్నిటి నొకటిగ జేర్చి సేవించినను; శుంఠిచూర్ణమును, బెల్లమును సమభాగములుగ జేర్చి సేవించినను; లేక నస్యముగ చేసిన హిక్కాశ్వాసముల హరించును.

### హిక్కానివర్తకనస్యప్రయోగములు.

మూ. లశునస్య పలాణ్డోర్వా మూలం గృఞ్జనకస్య వా,
నావయేచ్చన్దనం వాపి నారీక్షీరేణ సంయుతమ్. 131
సుఖోష్ణం ఘృతమణ్డం వా సైన్ధవేనావచూర్ణితం,
నావయేన్మాక్షికీం విష్ఠామలక్తకరసేన వా. 132
నారీక్షీరేణ సిద్ధం వా సర్పిర్మధురకైరపి,
పీతం నస్తో నిషిక్తం వా సద్యో హిక్కాం నియచ్ఛతి 133

వ్యా. వెల్లుల్లిగడ్డలనైనను, నీరుల్లిగడ్డలనైనను, ఎఱ్ఱనీరుల్లిగడ్డలనైనను నూరి చనుపాలలో కలిపి నస్యముచేసినను; చందనమును చనుపాలలో కలిపి నస్యముచేసినను; సుఖోష్ణముగనుండు నేతితోనైనను మీగడయందైనను సైంధవలవణచూర్ణమును కలిపి, నస్యము చేసినను; పెద్దయీగెలమలమును లాక్షారసమున జేర్చి నస్యముచేసినను; హిక్కాశ్వాసముల నివర్తిచేయును. మరియు జీవనీయగణమున జెప్పబడిన జీవకము మున్నగు ద్రవ్యములను చనుబాలనుచేర్చి ఘృతపాకవిధిగ పక్వముచేయబడినఘృతమును త్రాగినను నస్యముగ నుపయోగించినను హిక్కారోగము అప్పుడే నివర్తించును.

### హిక్కాహరపయఃపానము, నస్యము.

మూ. సకృదుష్ణం సకృచ్ఛీతం వ్యత్యాసాత్ హిక్కినాం పయః,
పానే నస్తః క్రియాయాం వా శర్కరామధుసంయుతమ్. 134

వ్యా. ఆవుపాలయందు చక్కెరను తేనెను జేర్చి ఒకప్పుడు చల్లగను ఒకప్పుడు, వేడిగను మార్చి మార్చి త్రాగించినను, నస్యముచేసినను ఎక్కిళ్లు నివర్తించును.

### హిక్కాహరఘృతము.

మూ. అధోభాగైర్ఘృతం సిద్ధం సద్యో హిక్కాం నియచ్ఛతి,
పిప్పలీమధుయుక్తో వా రసో ధాత్రీకపిత్థయోః. 135

వ్యా. విరేచనకరములగు ద్రవ్యముల జేర్చి సిద్ధము చేయబడిన ఘృతము హిక్కా వ్యాధిని శీఘ్రముగ హరించును. ఉసిరికకాయలరసమునందైనను వెలగకాయలరసమునందైనను పిప్పలిచూర్ణమును తేనెను కలిపి సేవించినను హిక్కారోగము నివర్తించును.

ఎక్కిళ్లకు లాజాద్యవలేహము.

మూ. లాజాలాజామధుద్రాక్షాపిప్పల్యశ్శ్వాశకృద్రసాః,
లిహ్యాత్తోకలమధుద్రాక్షాపిప్పలీనాగరాణి వా. 136

వ్యా. పేలాలు, లక్క, తేనె, ద్రాక్షపండు, పిప్పళ్లు, గుఱ్ఱపు పేడరసము, వీనిని సమభాగములుగ కలిపి సేవించినను, రేగుపండ్లు, తేనె, ద్రాక్షపండ్లు, పిప్పలిచూర్ణము, శుంఠిచూర్ణము, వీనిని సమభాగములుగ కలిపియైనను సేవించినయెడ ఎక్కిళ్లు మానును.

హిక్కానివర్తనోపాయములు.

మూ. శీతామ్బుసేకః సహసా త్రాసః విస్మాపనం భయం,
క్రోధహర్షప్రియోద్వేగాః హిక్కాప్రచ్యావనా మతాః. 137

వ్యా. హిక్కారోగముకలవానిపై నేమరించి తటాలున నీళ్లుచల్లుట, ఏమరించి జడిపించుట, ఆశ్చర్యమును భయమును కల్గించుట, క్రోధమును సంతోషమును ప్రీతిని మనస్సు కుద్వేగమును కల్గించుట, ఇవియన్నియు హిక్కావ్యాధిని తొలగించునుపాయములు. (మరియుం వాగ్భటాచార్యులు:—'శీతామ్బుసేకః...హితం కీటైశ్చ దంశనమ్'' (అ. హృ. చి. అ. ౪) అని చెప్పిరి. చీమలు మున్నగుకీటములచే గరపించుటయు నుపాయమగును).

హిక్కాశ్వాసములయందు నిదానవిసర్జనరూపచికిత్స.

మూ. హిక్కాశ్వాసవికారాణాం నిదానం యత్ప్రకీర్తితం,
వర్జ్యమారోగ్యకామైస్తత్ హిక్కాశ్వాసవికారిభిః. 138

వ్యా. హిక్కాశ్వాసరోగములకు నిదానముగ జెప్పబడినవానినెల్ల హిక్కాశ్వాసరోగపీడితులు ఆరోగ్యమును కోరుచెడల విసర్జించి యుండవలెను.

హిక్కాశ్వాసరోగులకు ఘృతపానవిధి.

మూ. హిక్కాశ్వాసాఽనుబన్ధా యే శుష్కోరఃకణ్ఠతాలుకాః,
ప్రకృత్యా రూక్షదేహాశ్చ సర్పిర్భిస్తానుపాచరేత్. 139

వ్యా. హిక్కాశ్వాసపీడితులు రొమ్మును, తాలువులును, కంఠంబును శుష్కించి

యంన్నను, ప్రకృతిచేతనే రూక్షశరీరులును నైయున్నయెడ వారి కీక్రింద జెప్పంబడు ఘృతములను త్రాగింపవలెను.

—ఈ హిక్కాశ్వాసహరదశమూలాదిఘృతము. ఈ—

మూ. దశమూలరసే సర్పిః దధిమణ్డే చ సాధయేత్,
కృష్ణాసౌవర్చలక్షారవయస్థాహిఙ్గుచోరకైః. 140
కాయస్థయా చ, తత్పానాత్ హిక్కాశ్వాసౌ ప్రణాశయేత్,
(ఇతి దశమూలాద్యం ఘృతమ్)

వ్యా. దశమూలకషాయమును పెరుగుమీది మీగడను (ఈరెండును చేరి ఘృతమునకు నాల్గింతలుండునట్లు) ఘృతమున జేర్చి, అందు పిప్పళ్లు, సౌవర్చలలవణము, యవక్షారము, ఉసిరికపప్పు, ఇంగువ, కచోరములు, కరకకాయలబెరడు, వీని నన్నిటిని సమభాగముగ జేర్చి కల్కము జేసి (ఘృతమునకు నాల్గవపా లుండునట్లు) కలిపి, ఘృతపాకవిధిప్రకారము పక్వముచేసి (యగ్నిబలానుసారముగ) త్రాగినచో, హిక్కాశ్వాసముల హరించును. (ఇచ్చట:—"జలస్నేహౌషధానాం చ......చతుర్గుణమ్" అను సామాన్యపరిభాషచే కల్కద్రవాదిపరిమాణము నెరుంగునది).

—ఈ హిక్కాశ్వాసాదిహర తేజోవత్యాదిఘృతమ్. ఈ—

మూ. తేజోవత్యభయా కుష్ఠం పిప్పలీ కటురోహిణీ. 141
భూతికం పౌష్కరం మూలం పలాశశ్చిత్రకశ్శటీ,
సౌవర్చలం తామలకీ సైన్ధవం బిల్వపేశికా. 142
తాలీసపత్రం జీవన్తీ వచా తైరక్షసమ్మితైః,
హిఙ్గుపాదైర్ఘృతప్రస్థం పచేత్తోయే చతుర్గుణే. 143
ఏతద్యథాబలం పీత్వా హిక్కాశ్వాసౌ జయేన్నరః,
శోథానిలార్శోగ్రహణీహృత్పార్శ్వరుజ ఏవ చ. 144
(ఇతి తేజోవత్యాదిఘృతమ్.)

వ్యా. చవ్యము, కరకకాయలబెరడు, చెంగల్వకోష్టు, పిప్పళ్లు, కటుకరోహిణి, కామంచిపూరి, పుష్కరమూలము, మోదుగవిత్తులు, చిత్రమూలము, గంధకచోరములు, సౌవర్చలలవణము, నేలయుసిరిక, సైంధవలవణము, మారేడుకాయలోనిగుజ్జు, తాళిసపత్రి, మనుబాల, వస, ఇవియన్నియు నొక్కొకకర్ష ముపంతునను కర్షమున నాల్గవపంతు (శాణమాత్రము) ఇంగువను, చేర్చి కల్కముచేసి, యొకప్రస్థపరిమితమగు ఘృతమున

కలిపి ఘృతమునకు నాల్గింతలు జలమును జేర్చి ఘృతపాకవిధిప్రకారము పక్వముజేసి యాఘృతమును బలాద్యనుసారముగ ప్రతిదినంబును త్రాగినయెడ హిక్కా-శ్వాసముల హరించును. మరియుఁ దీనిని త్రాగుటవలన శోఫములును, వాతంబును,అర్శస్సులును, గ్రహణీరోగంబులును, హృద్రోగంబును, పార్శ్వపునొప్పులును నివర్తించును.

ఇచ్చట "హిఙ్గుపాదైః" అనుచోట ఇతరద్రవ్యములకు జెప్పిన కర్షప్రమాణములో నాల్గవవంతు (శాణము) పరిమితముకల ఇంగువతో గూడిన తేజోవత్యాదిద్రవ్య కల్కమును జేర్చి, అని యర్థము. ఈవివరణమునే హారీతమున నిట్లు చెప్పిరి:—"తేజోవతీ...కల్కైస్తైరక్షసమ్మితైః, హిఙ్గుశాణేన సంయుక్తైః ఘృతప్రస్థం విపాచయేత్" ఇచ్చట ఇంగువ శాణమాత్రమని స్ఫుటముగ జెప్పబడినది.

## శ్వాసహరమనశ్శిలాదిఘృతము.

మూ. మనశ్శిలాసర్జరసలాక్షారజనిపద్మకైః,
మఞ్జిష్ఠైలైశ్చ కర్షాంశైః ప్రస్థస్సిద్ధో ఘృతాద్ధితః. 145

(ఇతి మనశ్శిలాదిఘృతమ్.)

వ్యా. మణిశిల, సర్జరసము (తెల్లగుగ్గిలము), లక్కపసుపు, పద్మకము, మంజిష్ఠ, ఏలకులు, వీని ప్రత్యేకము కర్షప్రమాణమువంతున జేర్చి ఘృతమును ప్రస్థపరిమాణంబును (ఘృతమునకు నాల్గింతలనీళ్లను) కలిపి ఘృతపాకవిధిప్రకారము పక్వముచేసి హిక్కా-శ్వాసములయందుపయోగించిన చాల హితకరముగ నుండును.

## శ్వాసములకు జీవనీయాదిఘృతయోగములు.

మూ. జీవనీయోపసిద్ధం వా సక్షౌద్రం లేహయేత్ ఘృతం,
త్ర్యూషణం, దాధికం వాఽపి, పిబేద్వాసాఘృతం తథా. 146

వ్యా. జీవనీయగణమున జెప్పబడిన జీవకమున్నగుద్రవ్యముల జేర్చి సిద్ధముచేయబడిన ఘృతమునైనను, తేనెను కూడ జేర్చి సేవించవలెను; మరియు కాసచికిత్సితమున జెప్పబడుత్ర్యూషణఘృతమునైనను, దాధికఘృతమునైనను, గుల్మచికిత్సితమున జెప్పబడిన వాశాఘృతమునైనను త్రాగిన శ్వాసమును హరించును.

ఇచ్చట "జీవకర్షభకౌ...జీవన్తీ మధుకమితి దశేమాని జీవనీయాని భవన్తి" (సూ. అ. ౪. సూ. ౨౪) అని చెప్పబడిన పదిద్రవ్యములు జీవనీయశబ్దముచే గ్రహింపనగును. మరియుఁ—"త్ర్యూషణం త్రిఫలాం ద్రాక్షాం......త్ర్యూషణంనామ విఖ్యాతం ఏతద్ఘృతమనుత్తమమ్" (చి. అ. ౧౮. శ్లో. ౩౯-౪౨) అని కాసచికిత్సితమున జెప్ప

బడిన త్ర్యూషణఘృతంబును, "వృషం సమూలామాపోథ్య......ర క్తపి త్తజ్వరశ్వాసకాస హృద్రోగనాశనం" (చి. అ. ౫. శ్లో. ౧౨౭) అని గుల్మచికిత్సితమున జెప్పబడిన వాశాఘృతమును గ్రహించునది. మరియు వాగ్భటాచార్యులు "దాధికం, హపుషా దివా" (అ. హృ, చి. అ.౪.) అని చెప్పిరి కావున "హపుషా వ్యోష......యోన్యర్శోగ్రహణీ దోషశ్వాసకాసాఽరుచిజ్వరాన్, ......ఘృతమేతద్వ్యపోహతి" (చి. అ. ౫. శ్లో. ౭౧-౭౩) అని గుల్మచికిత్సితమున జెప్పబడిన హపుషాదిఘృతంబును శ్వాసములకు హిత మని యెరుంగునది.

## హిక్కా-శ్వాసములకు అనుక్తచికిత్సాసంగ్రహము.

మూ. యత్కిఞ్చిత్కఫవాతఘ్నముష్ణం వాతాఽనులోమనం,
భేషజం పానమన్నం వా తద్ధితం శ్వాసహిక్కినే. 147

వ్యా. కఫవాతముల హరించునదియు, వాతమును అనులోమముగ సంచరింపజేయు నదియు, ఉష్ణవీర్యంబునైన యౌషధమును అన్నపానములను సేవించుట హిక్కా-శ్వాస రోగపీడితునకు చాల హితకరము.

## హిక్కా-శ్వాసములయందు శమన-బృంహణచికిత్సానియమము.

మూ. వాతకృద్వా కఫహరం, కఫకృద్వాఽనిలాఽపహం,
కార్యం నైకాన్తికం తాభ్యాం ప్రాయశ్శ్రేయోఽనిలాపహమ్.
సర్వేషాం బృంహణే హ్యల్పః శక్యశ్చ ప్రాయశో భవేత్,
నాత్యర్థం (నాఽవశ్యం, అవశ్యం) శమనేఽపాయః, భృశోఽ
శక్యశ్చ కర్శనే. 149
తస్మాత్ శుద్ధానశుద్ధాంశ్చ శమనైర్బృంహణైరపి,
హిక్కా-శ్వాసాఽర్దితాన్ జన్తూన్ ప్రాయశస్సముపాచరేత్. 150

వ్యా. వాతమును వృద్ధినొందించుచు కఫమును హరించు చికిత్సనైనను, కఫమును వృద్ధినందించుచు వాతమును హరించు చికిత్సనైనను, (ఈరెండిటిలో నొకదానినే) నియతముగ జేయజనదు. (హిక్కా-శ్వాసములయందు కఫవాతములు రెండును సమాన బలములుగ నుండును కావున నీరెంటిలో నొకదానిని వృద్ధినందించి యింకొకదానిని శమించునట్టిచికిత్సను నియతముగ చేయకూడదు; కాని వానిని రెంటిని మార్చి మార్చి చేయవచ్చునని భావము.)

మరియు నత్తెరంగున నారెండువిధములైనచికిత్సలను మార్చిమార్చి చేయునప్పు

డును ప్రాయికముగ వాతహరమైనచికిత్సనే యధికముగ జేయుట చాల మంచిది. ఏల యన ;—

హిక్కాశ్వాసరోగపీడితులకు బృంహణ (వాతహర) చికిత్స జేయుటవలన (వేరొకదోషము వృద్ధినొందుటవలన) రోగము వృద్ధినొందినను వేరొకరోగము కల్గినను అయ్యది ప్రాయికముగ నల్ప బలమై సుఖసాధ్యముగ నుండును. అటులనే శమనచికిత్స జేసినయెడ దానంజేసి యొకప్పుడు రోగవృద్ధియైనను ఇతరరోగములైనను సంభవించిన యెడ అయ్యది కొంచెము కష్టముచే సాధింపదగియుండును గాని మిక్కిలి యపాయ కరము కానోపదు. కర్షణరూపమైన లంఘనచికిత్స జేసినయెడ దాన జనించినరోగవృద్ధి యైనను ఇతరవ్యాధులైనను మిక్కిలి కష్టముల కల్గించి యసాధ్యములగును; కావున వమనాదిశోధనచికిత్సచే శుద్ధకోష్ఠునకును, శోధనము చేయకుండువానికిని హిక్కాశ్వాస ములయందు శమనములును బృంహణములును నగుఔషధాన్నవిహారాదులచే నుపచరించ వలెనుగాని లంఘనము నొకప్పుడును జేయంజనదని భావము. (ఇచ్చట "శుద్ధాన్, అశు ద్ధాంశ్చ, శమనైః, బృంహణైరపి" క్రమముగ నన్వయించి శోధనముచేసినవారికి శమ నంబును, శోధనముచేయనివారికి బృంహణంబును జేయదగునని కొందరు సెప్పెదరు. "సర్వేషాం బృంహణే హ్యల్పః" అనిచెప్పుటచేత, హిక్కాశ్వాసములయందు మాత్రము కాక యితరములగు జ్వరాదిరోగములయందును ఈన్యాయముననుసరించి శమనబృంహణ ముల నాచరించదగునని తంత్రకారులయభిప్రాయము.)

## అధ్యాయవిషయసంగ్రహము.

మూ. దుర్జయత్వే సముత్పత్తౌ క్రియైకత్వే చ కారణం,
లిఙ్గం పథ్యం చ హిక్కానాం శ్వాసానాం చేహ దర్శితమ్. 151

వ్యా. హిక్కాశ్వాసములు కష్టసాధ్యములగుటకు కారణంబులును, అవిజనించు టకు హేతువులును, ఈరెంటికిని చికిత్సలు సమానములుగనుండుటకు కారణంబును, ఈరెంటిలక్షణంబులును, పథ్యములగునౌషధాదులును ఈహిక్కాశ్వాసచికిత్సితమను నధ్యాయమున చెప్పబడినవి.

ఇత్యగ్నివేశకృతే తన్త్రే చరకప్రతిసంస్కృతే, దృఢబలసంపూరితే,
చికిత్సాస్థానే, హిక్కాశ్వాసచికిత్సితం నామ సప్తదశోఽధ్యాయః.

వ్యా. ఇత్తెరంగున నగ్నివేశకృతంబును, చరకప్రతిసంస్కృతంబును నగుచరక సంహితయను నాయుర్వేదతంత్రమునందలి చికిత్సాస్థానమున దృఢబలసంపూరితభాగ మున సప్తదశాధ్యాయము సమాప్తము.

## అష్టాదశాధ్యాయము.

అవతరణిక:—హిక్కా-శ్వాసచికిత్సితమును జెప్పినపిదప నారెంటితో సమానమైనచికిత్స కల్గినదియగుటం జేసి కాసమునకు చికిత్సితము చెప్పబడును.

మూ. అథాతః కాసచికిత్సితం వ్యాఖ్యాస్యామః. 1

ఇతి హ స్మాహ భగవానాత్రేయః. 2

వ్యా. హిక్కా-శ్వాసముల చికిత్సితమును జెప్పినపిదప వానితో సమానమైన చికిత్స కల కాసరోగ చికిత్సితమును భగవానుడగు నాత్రేయు లుపదేశించినదానికి న్యూనాతిరేకముగాకుండునట్లు వివరించి చెప్పెదనని యర్థము.

మూ. తపసా యశసా ధృత్యా ధియా చ పరయాన్వితః,

ఆత్రేయః కాసశాన్త్యర్థం ప్రాహ సిద్ధం చికిత్సితమ్. 3

వ్యా. ఉత్కృష్టమైనతపముచేతను, కీర్తిచేతను, ధారణాశక్తిచేతను, బుద్ధిచేతను కూడుకొనినమహర్షిప్రవరుడగు నాత్రేయులు అగ్నివేశునుద్దేశించి కాసరోగశాంతికై తగిన చికిత్సితమును అనుభవసిద్ధముగ నిట్లుపదేశించెను. (ఇచ్చట శిష్యప్రశ్నవాక్యము లేకున్నను ఆత్రేయోత్తరమునుబట్టి ప్రశ్నము అనుమేయము.)

కాసభేదములు.

మూ. వాతాదిజాస్త్రయో యే చ క్షతజః క్షయజస్తథా,

పఞ్చైతే స్యుః నృణాం కాసాః వర్ధమానాః క్షయప్రదాః. 4

వ్యా. వాత-పిత్త-కఫములచే వేరువేరుగ జనించునవి మూడును, ఉరఃక్షతమున జనించునదియు, ధాతుక్షయముచే జనించునదియు జేరి కాసములు ఐదువిధములనుండును. ఈయైదువిధములైన కాసములును (ఉపేక్షించినచో) నానాట వృద్ధినొంది శరీరము నందలిరక్తాదిధాతువులు క్షీణించుటకును, తుదకు శరీరనాశమునకు కారణములగును.

ఇచ్చట క్షతజశబ్దముచేత ఉరఃక్షతపూర్వకరాజయక్ష్మమున కల్గుకాసంబును, క్షతక్షీణమునగల్గుకాసంబునుకూడ గ్రహింపబడును. మరియు క్షయజశబ్దముచేత రాజయక్ష్మసంబంధముచే ధాతువులు క్షీణించినపురుషులకు సంభవించుకాసంబును,జరాసంబంధముచే వృద్ధులకు సంభవించినధాతుక్షయమువలనగల్గిన కాసంబును గ్రహింపబడును. కావున కాసభేదములన్నియుఁ జేరి పైజెప్పినయైదువిధములలో నంతర్భూతములగునని యెరుంగునది. జ్వరసంతాపముచే గల్గినరక్తపిత్తము, మరల జ్వరమును కల్గించువిధముగ, ధాతుక్షయముచే గల్గినకాసముమరల ధాతుక్షయమునకు కారణమై మరింతధాతుక్షయమును కల్గిం

చును కావున "వర్ధమానాః క్షయప్రదాః" అనుపదము క్షయకాసమున కన్వయించినను ప్రత్యవాయము లేదని యెరుంగునది. ఈవిషయమును వాగ్భటాచార్యులు క్లుప్తముగ నిట్లు చెప్పిరి:—"పఞ్చ కాసాః స్మృతాః వాత-పిత్త-శ్లేష్మ-క్షత-క్షయైః, క్షయాయోపేక్షితాస్సర్వే, బలినశ్చోత్తరోత్తరమ్." (అ. హృ. ని. అ. 3. శ్లో. ౧౭.)

## కాసపూర్వరూపములు.

మూ. పూర్వరూపం భవేత్తేషాం శూకపూర్ణగలాస్యతా,
కణ్ఠే కణ్డూశ్చ భోజ్యానాం అవరోధశ్చ జాయతే. 5

వ్యా. పైజెప్పినపంచవిధకాసములు జనించుటకు మునుముందు కుత్తుక యెందును, నోటియందును ముండ్లునిండినట్లు నస కల్గును. కంఠమున జిలపుట్టును. భుజింపదగినపదార్థములయందు అరుచిపుట్టును, లేక తిన నిచ్చ కల్గదు. ఇవియన్నియు కాసములు పూర్వరూపములు.

## కాససంప్రాప్తి.

మూ. అధః ప్రతిహతో వాయుః ఊర్ధ్వస్రోతస్సమాశ్రితః,
ఉదానభావమాపన్నః కణ్ఠే సక్తః తథోరసి. 6
ఆవిశ్య శిరసః ఖాని సర్వాణి ప్రతిపూరయన్,
ఆభఞ్జన్నాక్షిపన్ దేహం హనుమన్యే తథాఽక్షిణీ. 7
నేత్రే పృష్ఠమురఃపార్శ్వే నిర్భుజ్య స్తమ్భయంస్తతః,
శుష్కో వా సకఫో వాపి కసనాత్కాస ఉచ్యతే. 8

వ్యా. వాతము స్వకారణములచే ప్రకోపమునొంది శరీరమునం దధోభాగమున ప్రతిహతమై మరలి వాతసంచారమార్గమునందుండి యూర్ధ్వశరీరమున వ్యాపించుచు (ఊర్ధ్వభాగమున వ్యాపించుస్వభావముకల) ఉదానవాతరూపము దాల్చి, కంఠమునందును రొమ్మునందును వ్యాపించుచు, శిరస్సునందలినోరు నాసారంధ్రములు మున్నగు రంధ్రముల జేరి, వానినన్నింటిని పూరించుచు, శరీరమును ముందుప్రక్కకువంచి కదలించుచు, తాలువులను, మెడకు వెనుకప్రక్కనరములను, కన్నులను, సంకోచింపజేసి, కన్నులను వీపును ఇరుప్రక్కలను స్తంభింపజేసి కదలించుచు, ద్రవములేక శుష్కముగనైనను, కఫముతో గూడియైనను, నోటినుండి బైటవెడలును. ఇయ్యది యూర్ధ్వముగ వ్యాపించి నోటినుండి బైటవెడలుటం జేసియు, ఉరఃకంఠాదుల బాధించుటం జేసియు కాసమని యన్వర్థముగ జెప్పబడును. ("కస గతిశాతనయోః" అనుధాతువునకు "కసతీతి కాసః"

అనువృత్తిచే కాసశబ్దమునకు పైయర్థము లభించును.) వాగ్భటులు "భిన్నకాంస్యోప మధ్వనిః" (అ. హృ. ని. అ. 3.) అనిచెప్పిరికావున పైజెప్పినరీతిగ బైట వెడలునప్పుడు పగిలినకంచుమ్రోగువిధముగ శబ్దముకల్గునని యెరుంగునది.

కాసభేదకారణము.

మూ. ప్రతిఘాతవిశేషేణ తస్య వాయోస్సరంహసః,
వేదనాశబ్దవైశిష్ట్యం కాసానాముపజాయతే. 9

వ్యా. పైజెప్పిన సంప్రాప్తి కాసములకన్నిటికి సమానముగ నున్నను, వాతమునకు ప్రతిఘాతమును కల్గించు కఫాదివిశేషముల చేతను, వేగమువిశేషమువలనను, దాన గల్గు బాధావిశేషమునందునను, అప్పుడు కంఠమున కల్గు శబ్దవిశేషమువలనను కాసములు వేరు వేరురూపములుగ జెప్పబడును.

వాతికకాసమునకు కారణములు.

మూ. రూక్షశీతకషాయాఽల్పప్రమితాఽనశనం స్త్రియః,
వేగధారణమాయాసో వాతకాసప్రవర్తకః. 10

వ్యా. రూక్షంబులును, గుణవీర్యంబులచే శీతంబులును, కషాయ (వగరు) రసంబులును నగుపదార్థముల భుజించినను, తనకు కావలసినపరిమితికన్న నత్యల్పముగనైనను నియమితకాలము నతిక్రమించియైనను భుజించినను, లేక బొత్తుగ నాహారమును మాని యుండినను, తనశక్తికన్న నెక్కుడుగ స్త్రీసంభోగము చేసినను, మలమూత్రాదివేగముల నిరోధించినను, శరీరమున కాయాసమును కల్గించుపనుల జేసినను, వాతమును ప్రకోపింప జేయును. దానంజేసి కాసము సంభవించును. (ఇచ్చట ప్రమితాశనమున అతీతకాలభోజన మని యర్థము.)

వాతికకాసలక్షణము.

మూ. హృత్పార్శ్వోరశ్శిరశ్శూలస్వరభేదకరో భృశం,
శుష్కోరఃకణ్ఠవక్త్రస్య హృష్టలోమ్నః ప్రతామ్యతః. 11
నిర్ఘోషదైన్యస్తననదౌర్బల్యక్షోభమోహకృత్,
శుష్కకాసః కఫం శుష్కం కృచ్ఛ్రాన్ముక్త్వాఽల్పతాం వ్రజేత్.
స్నిగ్ధామ్లలవణోష్ణైశ్చ భుక్తపీతైః ప్రశామ్యతి,
ఊర్ధ్వవాతస్య జీర్ణేఽన్నే వేగవాన్ మారుతో భవేత్. 13

వ్యా. కాసము వెడలునప్పుడు హృదయమునందును ఇరుప్రక్కలయందును రొమ్మునందును శిరస్సునందును శూలమును, మిక్కిలి కంఠస్వరభేదమును కల్గించుచు వేగముతో వెడలును. మరియు నారోగికి కాసము వెడలునపుడు రొమ్మును కుత్తుకయు నోరును ద్రవములేక యెండును. రోమములు గగుర్పాటు కల్గియుండును. చీకటిలోనున్నవాని వలె నేమియు తెలియకుండును. మిక్కిలి దైన్యము కల్గును. మేఘగర్జనమువలె శబ్దముతోగూడి బలహీనమును గల్గించుచు శరీరమునెల్ల కుదిలించుచు మూర్ఛనొందించుచు శుష్కకాసము (పొడిదగ్గు) వెడలును. అట్టియెడ ద్రవములేక యెండినకఫము మిగుల కష్టముచే బైట వెడలినయెడ దగ్గు కొంచెము తగ్గును. మరియు స్నిగ్ధంబులును అమ్లరసంబులును లవణంబును ఉష్ణవీర్యంబులును నగునన్నపానముల సేవించినపుడును, దగ్గు శమించును. (ఇది వాతికకాసమున కుపశయము.) ఈరోగముకలవానికి భుజించినయన్నము జీర్ణమైనయెడ వెంటనే వాతము మిక్కిలివేగముగ కల్గి దగ్గు అధికమగును. (ఇది అనుపశయము.)

## పైత్తికకాసనిదానము.

మూ. కటుకోష్ణవిదాహ్యామ్లక్షారాణామతిసేవనం,
పిత్తకాసకరం క్రోధః సన్తాపశ్చాగ్నిసూర్యజః. 14

వ్యా. కారముగలపదార్థములైనను, గుణవీర్యములచే నుష్ణములగుపదార్థములైనను, మంటపుట్టించుపదార్థములనైనను, అమ్లపదార్థములనైనను, యవక్షారము మున్నగు క్షారములనైనను విశేషము నుపయోగించుటచేతను, కోపముచేతను, నిప్పుయొక్కయు, సూర్యునియొక్కయు, సెగ సోకుటచేతను; పిత్తము ప్రకుపితమై కాసమును కల్గించును.

## పైత్తికకాసలక్షణము.

మూ. పీతనిష్ఠీవనాక్షిత్వం తిక్తాస్యత్వం స్వరామయః,
ఉరోధూమాయనం తృష్ణా దాహో మోహోఽరుచిర్భ్రమః. 15
ప్రతతం కాసమానశ్చ జ్యోతీంషీవ చ పశ్యతి,
శ్లేష్మాణం పిత్తసంసృష్టం నిష్ఠీవతి చ పైత్తికే. 16

వ్యా. పైత్తికకాసమునందు పచ్చనిరంగుగలకఫము దగ్గినపుడు నోటినుండి వెడలును. కన్నులు పచ్చగనుండును. నోరు చేదుగనుండును. కంఠస్వరము మారును. రొమ్మున పొగ వెడలునట్లుండును. దప్పియు తాపంబును, మూర్ఛయు అరుచియు, కల్గును. ఒడలు తిరుగునట్లుండును. అధికముగ దగ్గు వచ్చునపుడు కన్నులకు నక్షత్రములు కనబడి

నట్లు బూచులు క్రమ్మును. పిత్తపసరుతోఁ జేరిన కఫము నోటినుండి వెడలును. ఈలక్షణములుగలది పైత్తికకాసమనబడును.

ఇచ్చట నీకాసము కేవలము పిత్తముచే జనించినను ఉరస్సు, కంఠము మున్నగు కఫస్థానములయొక్క సంబంధమువలన పిత్తద్రవముతోఁ గూడినకఫము నోటినుండి వెడలునని యెఱుంగునది.

## కఫజకాసనిదానము.

మూ. గుర్వభిష్యన్దిమధురస్నిగ్ధస్వప్నాఽవిచేష్టనైః,
వృద్ధః శ్లేష్మానిలం రుద్ధ్వా కఫకాసం కరోతి హి. 17

వ్యా. చిరకాలమునకు జీర్ణించుస్వభావముగలపదార్థములనైనను, స్రోతోరంధ్రముల ద్రవమును పుట్టించుపదార్థములనైనను, మధురములనైనను, మిక్కిలి స్నిగ్ధములయిన పదార్థములనైనను భుజించుట; పగటియందు నిదురపోవుట, యేవిధమయినపనిని చేయక నిర్వ్యాపారముగనుండుట, ఈకారణములచేత కఫము మిక్కిలి వృద్ధినొంది ప్రకుపితమై వాతసంచారమార్గమును అడ్డగించి శ్లైష్మికకాసమును కల్గించును.

## కఫజకాసలక్షణము.

మూ. మన్దాగ్నిత్వారుచిచ్ఛర్దిపీనసోత్క్లేశగౌరవైః,
లోమహర్షాస్యమాధుర్యక్లేదసంసదనైర్యుతమ్. 18
బహులం మధురం స్నిగ్ధం నిష్ఠీవతి ఘనం కఫం,
కాసమానో హ్యరుగ్వక్షః సంపూర్ణమివ మన్యతే. 19

వ్యా. అగ్నిమందగించుట, అరోచకము, వాంతియగుట, పడిసెముపట్టుట, ఓకరింతలు వచ్చుట, శరీరము బరువుగనుండుట, గగుర్పాటు, నోరుతీపికల్గియుండుట, స్రోతోమార్గములయందు ద్రవముపుట్టుట, ఒడలునొప్పులు, దగ్గినపుడు తీపికల్గి స్నిగ్ధమై ఘనీభవించిన కఫము అధికముగ వెడలుట, ఱొమ్మున స్వల్పముగ నొప్పికల్గి కఫముచే నిండియున్నట్లు తోఁచుట, ఈలక్షణములు కలది కఫముచే జనించినకాసమని యెఱుంగునది. (ఇచ్చట "కఫాదురోల్పరుజ్మూర్ధ్ని" అని వాగ్భటులు చెప్పిరి కావున "అరుగ్వక్షః" అనుచోట ఱొమ్మున స్వల్పముగ బాధయుండునని యర్థము.)

## క్షతజకాసనిదానము.

మూ. అతివ్యవాయభారాధ్వయుద్ధాశ్వగజవిగ్రహైః,
రూక్షస్యోరఃక్షతం వాయుః గృహీత్వా కాసమావహేత్. 20

వ్యా. అధికముగ స్త్రీసంభోగముచేయుట, బరువుమోచుట, త్రోవనడచుట, బలాధికులతో యుద్ధముచేయుట, గుఱ్ఱములతోను యేనుగులతోను నెదిరించి పోట్లాడుట, ఈకృత్యములను శరీరమున జిడ్డులేక రూక్షముగ నుండువాడు అధికముగ చేసిన యెడ వానికి రొమ్మున గాయపడును. అట్టియభిఘాతమునొంది యురఃస్థలమున వాతము ప్రకుపితమై చేరి కాసమును కల్గించును. (వాగ్భటాచార్యులు నిట్లు చెప్పెను:— "యుద్ధాద్త్యైః సాహసైః తైస్తైః.........వాయుః పిత్తేనానుగతో చలీకుపితః కురుతే కాసం" (అ. హృ. ని. అ. 3. శ్లో. ౨౮) ఈవాక్యముచేత ప్రకుపితమైన వాతము పిత్తముతో కూడి యురఃక్షతకాసము కల్గించునని తెలిసెడి.) మరియు నియ్యది వాతపిత్తములచే గల్గినను, పైజెప్పినకారణములచే రొమ్మునందభిఘాతమున గాయము కల్గినదాని వలన జనించుటంజేసి క్షతజకాసమున వేరుగ చెప్పబడినది.

## క్షతజకాసలక్షణములు.

మూ. స పూర్వం కాసతే శుష్కం తతః ష్ఠీవేత్సశోణితం,
కణ్ఠేన రుజతాత్యర్థం విరుగ్ణేనైవ చోరసా. 21
సూచీభిరివ తీక్ష్ణాభిస్తుద్యమానేన శూలినా,
దుఃఖస్పర్శేన శూలేన భేదపీడాభితాపినా. 22
పర్వభేదజ్వరశ్వాసతృష్ణావైస్వర్యపీడితః,
పారావత ఇవాకూజన్ కాసవేగాత్ క్షతోద్భవాత్. 23

వ్యా. క్షతజకాసముచే పీడింపబడినమనుజునకు తొలుత ద్రవములేక యెండిన పొడిదగ్గు కల్గి పిమ్మట రక్తముతోకూడిన కఫము శుష్కించి నోట వెడలును. కుత్తుకయందు నోరువరాని మిక్కుటమైన నొప్పి కల్గును. రొమ్మున బ్రద్దలుగ పగులదీయునట్లు బాధ కల్గును. మిక్కిలి వాడిగల సూదులచే పొడిచినట్లు రొమ్మున పోటుపుట్టును. రొమ్మున చేత స్పృశించినను నోరువజాలని శూల నొప్పి గల్గి పగులగొట్టినవిధమున బాధ కల్గును. కీళ్లలో నొప్పియు, జ్వరంబును, శ్వాసంబును, దప్పియు కల్గును. కంఠస్వరము వికృతముగ మారి యుండును. ఇట్టి లక్షణముతో బాధపడుచుండురోగి బాధకోరువజాలక కాసవేగముచేత పావురమువలె గొంతులో గుఱ్ఱుగుఱ్ఱుమని కూయుచు బాధపడుచుండును. ఈలక్షణములుగలది క్షతజకాసమని యెరుంగునది. (ఈక్షతజకాసము సాహసజయక్ష్మరోగరూపమును జెప్పునప్పుడు "కణ్ఠోద్ధ్వంసం చ" అని నొనిమిదవ యధ్యాయమున చెప్పబడినది.)

## క్షయజకాసనిదానము.

మూ. విషమాసాత్మ్యభోజ్యాతివ్యవాయాద్వేగనిగ్రహాత్,
ఘృణినాం శోచతాం నృణాం వ్యాపన్నేఽగ్నౌ త్రయోమలాః.
కుపితాః క్షయజం కాసం కుర్యుర్దేహక్షయప్రదం,

వ్యా. విషమాశనము (తాను భుజించుపరిమితికన్న నెక్కువగనైనను, తక్కువగనైనను భుజించుట, లేక భోజనమునకు విహితమైనకాలమునకు వ్యత్యస్తముగ భుజించుట), తనకలవాటులేని శరీరతత్త్వమున కిమడకయుండు నాహారమును భుజించుట, తనశక్తికిమీరి స్త్రీసంభోగము చేయుట, మలమూత్రాదివేగము నిరోధించుట, మిక్కిలి జాలి కల్గియుండుటవలన నొరులకష్టముల చూచి దుఃఖించుట, ఇట్టికారణములచేత జఠరాగ్ని మందగించి వాతపిత్తకఫములు మూడును నేకకాలమున సమములుగ ప్రకోపము నొంది రసరక్తాదిధాతువులను వరుసగ క్షీణింపజేయును. దానంజేసి కాసము జనించును. ఇదియే క్షయజకాసము. దీనివలన దేహము నానాట క్షీణించి తుదకు శరీరపాతము కూడ నొక వేళ సంభవించును. ఇచ్చట వాగ్భటాచార్యులు "వాయుః ప్రధానాః కుపితాః ధాతవో రాజయక్ష్మిణః" అని చెప్పియుండుటచేత ఈక్షయజకాసము త్రిదోషములచే జనించినను వానిలో వాతము ప్రధానముగ నుండునని తెలియునది.

ఇచ్చట నీవిషయము నెరుంగునది:—రాజయక్ష్మకారణముల జెప్పునపుడు "అయథాబలమారంభం వేగసన్ధారణంక్షయం యక్ష్మణః,కారణం విద్యాత్ చతుర్థం విషమాశనమ్" (చికిత్స. 8 అధ్యాయం.శ్లో. 13) అనువాక్యముచేత, సాహసము, వేగసంధారణము, ధాతుక్షయము, విషమాశనమునను నాలుగుకారణములచే రాజయక్ష్మము జనించునని చెప్పబడినది. ఆనాల్గువిధములయిన రాజయక్ష్మములయందును వేర్వేరుగ రూపముల జెప్పునపుడు సాహసజరాజయక్ష్మలక్షణమున "కణ్ఠోద్ధ్వంసశ్చ కాసశ్చ స్వరభేదమరోచకమ్" అని కాసము లక్షణముగ నిర్దేశింపబడినది. వేగసంధారణజరాజయక్ష్మమును జెప్పునపుడును "ప్రతిశ్యాయం చ కాసం చ" అనియు, ధాతుక్షయజరాజయక్ష్మలక్షణమున "ప్రతిశ్యాయం జ్వరం కాసమ్" అనియు, విషమాశనజరాజయక్ష్మమున "ప్రతిశ్యాయం ప్రసేకశ్చ కాసం చ్ఛర్దిమరోచకమ్" అనియు, ఆయారాజయక్ష్మములయందును కాసము గూడ నొకలక్షణముగ రాజయక్ష్మమునకు నిర్దేశింపబడినది. అట్టి నాల్గువిధములయిన రాజయక్ష్మములలో కల్గునాల్గువిధములయిన కాసములలో సాహసజరాజయక్ష్మమునకల్గు కాసమునకు ఇచ్చట "అతివ్యవాయ" అని యుపక్రమించి చెప్పినది హేతులక్షణములగును. మరియు విషమాశనరాజయక్ష్మమున కల్గుకాసమునకు ఇచ్చట పైశ్లోకమున చెప్పబడినవిష

మాసాత్మ్యభోజనములు కారణమనియు, ధాతుక్షయజరాజయక్ష్మమున కల్గుకాసమునకు, అతిసంభోగము కారణమనియు, వేగసంధారణజరాజయక్ష్మమున కల్గుకాసమునకు వేగ నిగ్రహము కారణమనియు, అట్టికారణములు "విషమాసాత్మ్యభోజ్యాతివ్యవాయాద్వేగ నిగ్రహాత్" అని పైన జెప్పబడినదని యెరుంగునది. అట్టికాసముల నాల్గిటియందును ఇచ్చట చెప్పబడినలక్షణములే రాజయక్ష్మమున కల్గియుండునని యూహించునది.

క్షయజకాసలక్షణములు.

మూ. దుర్గన్ధం హారితం రక్తం ష్ఠీవేత్పూయోపమం కఫమ్. 25
స్థానాదుత్ కాసమానశ్చ హృదయం మన్యతే చ్యుతం,
(కాసమానశ్చ హృదయం స్థానభ్రష్టమ్ స మన్యతే.)
అకస్మాదుష్ణశీతార్తో బహ్వాశీ దుర్బలః కృశః. 26
స్నిగ్ధాస్యముఖవర్ణత్వ క్శ్రీమద్దర్శనలోచనః,
(ప్రసన్నస్నిగ్ధవదనః శ్రీమద్దర్శనలోచనః.)
పాణిపాదతలైః శ్లక్ష్ణైః సతతాసూయకో ఘృణీ. 27
జ్వరో మిశ్రాకృతిస్తస్య పార్శ్వరుక్పీనసోఽరుచిః,
భిన్నసంహాతవర్చస్త్వం స్వరభేదోఽనిమిత్తతః. 28

వ్యా. పైజెప్పిన క్షయజకాసమున దుర్గంధంబును, పచ్చనిరంగుతోకూడిన రక్త వర్ణంబును, లేక చీముతో సమానమయిన కఫము దగ్గినపుడు నోట వెడలును. తీవ్రముగ దగ్గువెడలునప్పుడు హృదయము స్వస్థానమునుండి జారిపడునట్లు తోచును. కారణము లేకయే యొకప్పుడు చలిచేతను, ఒకప్పు డుష్ణముచేతను బాధపడుచుండును. మితిమీరి యాహారమును భుజించును. అట్లు భుజించినను బలహీనుడై నానాటశరీరము కృశించును. ముఖంబును, శరీరవర్ణంబును, చర్మంబును, మిగుల స్నిగ్ధమై స్వచ్ఛముగ నుండును. కన్నులు మిక్కిలికాంతియుక్తమై తేటగ నుండును. (ఈలక్షణములు వ్యాధిస్వభావముచే గల్గును). త్రిదోషలక్షణములు మిశ్రితమైన జ్వరము కల్గును. ఇరుప్రక్కలయందును నొప్పికల్గును. జలుబు పడిసెము పట్టును. అరుచి పుట్టును. కారణములేకయే మలము ఒకప్పుడు పలుచనయ్యును మరియొకప్పుడ ఘనమయ్యును వెడలును. నిమిత్తములేకయే కంఠస్వరము మారును. ఈలక్షణములు గల్గినది ధాతుక్షయజకాసమని యెరుంగునది. (ఈకాసమే పైజెప్పినరీతిగ విషమాశన-ధాతుక్షయ-వేగసంధారణములచే గల్గురాజ యక్ష్మములమూటియందును కల్గునని యెరుంగునది.)

### కాసములసాధ్యాఽసాధ్యవిభాగము.

మూ. ఇత్యేష క్షయజః కాసః క్షీణానాం దేహనాశనః,
సాధ్యో బలవతాం వా స్యాత్, యాప్యస్త్వేవం క్షతోత్థితః 29
నవౌ కదాచిత్సిధ్యేతామేతౌ పాదగుణాన్వితౌ,
స్థవిరాణాం జరాకాసః సర్వో యాప్యః ప్రకీర్తితః. 30
త్రీన్ సాధ్యాన్ సాధయేత్పూర్వాన్ పథ్యైర్యాప్యాంస్తుయాపయేత్,

వ్యా. పైజెప్పబడిన క్షయజకాసము ధాతువులు మిక్కిలి క్షీణించినవారికి సంభవించినచో దేహమును ధ్వంసము చేయును. (అసాధ్యమగునని భావము.) అయ్యది శరీర బలము పుష్టిగనున్నవారికి సంభవించినయెడ నొకసమయమున సాధ్యముగ నుండును. ఉరః క్షతమున కల్గినకాసము యాప్యమగును. మరియు క్షయజ-క్షతజకాసములు రెండును వైద్యుడు, ఔషధము, పరిచారకుడు,రోగియునను పాదములనాల్గిటికిని చెప్పినగుణములు, కల్గి, నూతనముగ కల్గియుండునెడ నొకసమయమున సాధ్యములును కావచ్చును. మరియు ముసలివారికి ముసలితనముచే ధాతువులు క్షీణించుటవలన సంభవించినకాస మెట్టిదైనను యాప్యమగును. కానిసాధ్యముకానోపదు. ఇట్లు చెప్పుటచేత జరాకృతధాతు క్షయమున గాక వాతాదిదోషములచే ముదుసలులకు సంభవించినకాసములు మాత్రము సాధ్యములని యెరుంగునది). అందు వాత-పిత్త-కఫజకాసములు మూడును, సాధ్యములు; కావున వానికి దగినచికిత్సచే సాధింపదగును. యాప్యములగుకాసముల మూటియందును వ్యాధికిని శరీరప్రకృత్యాదులకును దగినపథ్యాహారవిహారోపచారములచే నుపచరించుచు జీవితకాలవుపరకును కాలము గడుపనగును.

### కాసచికిత్సాక్రమము, అందు వాతికకాససామాన్యచికిత్స.

మూ చికిత్సామత ఊర్ధ్వం తు శృణు కాసనిబర్హిణీమ్. 31
రూక్షస్యాఽనిలజం కాసం ఆదౌ స్నేహైరుపాచరేత్,
సర్పిర్భిర్వస్తిభిః పేయా యూషక్షీరరసాదిభిః. 32
వాతఘ్నసిద్ధైః స్నేహాద్యైః ధూమైర్లేహైశ్చ యుక్తితః,
అభ్యఙ్గైః పరిషేకైశ్చ స్నిగ్ధైః స్వేదైశ్చ బుద్ధిమాన్. 33
వస్తిభిర్బద్ధవిడ్వాతం శుష్కోర్ధ్వం చోర్ధ్వభక్తికైః,
ఘృతైస్సపిత్తం సకఫం జయేత్ స్నేహవిరేచనైః. 34

వ్యా. కాసహరచికిత్సితము ఈక్రింద వరుసగ జెప్పబడును. వినుము:—రూక్ష శరీరునకు (పిత్తకఫసంబంధము లేక) వాతముచేత కల్గినకాసమున, తొలుత ఘృతములచే తను వాతహరద్రవ్యములను స్నేహములను చేర్చి సిద్ధముచేయబడిన వస్తి, పేయ, యూషములు, క్షీరములు, మాంసరసములు మున్నగు వానిచేతను, వాతహరద్రవ్యముల జేర్చి సిద్ధముచేయబడి స్నేహములతో గూడినధూమపానములచేతను, లేహములచేతను యుక్తి యుక్తముగ చికిత్సచేయనగును. అభ్యంగనము పరిషేకము స్నిగ్ధద్రవ్యములచే చేయబడిన స్వేదము మున్నగునుపచారముల చేయనగును. మరియు అపానవాతంబును మలంబును బద్ధగించియుండునెడ స్నేహభూయిష్ఠములగు వస్తులచే చికిత్స చేయనగును. శరీరము నందలి యూర్ధ్వభాగము శుష్కించి శుష్కకాసను వెడలునప్పుడును, భోజనానంతర ముపయోగింపదగిన ఘృతములచే నుపచరించవలెను. వాతము పిత్తముతోకూడి శరీరోర్ధ్వ భాగము శుష్కించియుండునెడ భోజనానంతరము స్నేహస్నేహపానము చేయించ వలెను. వాతముతో కఫము చేరియున్న యెడ ఊర్ధ్వభాగము శుష్కమైనపుడు స్నేహ విరేచనములచే చికిత్సచేయనగును.

వాతకాసహరకంటకారీఘృతము.

మూ. కణ్టకారీగుడూచీభ్యాం పృథక్ త్రింశత్పలాద్రసే,
ప్రస్థస్సిద్ధో ఘృతాద్వాతకాసనుద్వహ్నిదీపనః. 35

(ఇతి కణ్టకారీఘృతమ్.)

వ్యా. వాకుడుకషాయము ముప్పదిపలములును, తిప్పతీగెకషాయము ముప్పదిపల ములును, ప్రస్థపరిమితమైన (పదునారుపలముల) యావునేతిలో కలిపి ఘృతపాకవిధి ప్రకారము పక్వముచేసి యుపయోగించినయెడ వాతకాసమును హరించును. జాఠరా గ్నిని దీపింపజేయును.

శ్వాస-కాసాదిహరపిప్పల్యాదిఘృతము.

మూ. పిప్పలీపిప్పలీమూలచవ్యచిత్రకనాగరైః,
ధాన్యపాఠావచారాస్నాయష్ట్యాహ్వాక్షారహిఙ్గుభిః. 36
కోలమాత్రైః ఘృతప్రస్థాత్ దశమూలీరసాఢకే,
సిద్ధాచ్చతుర్థికాం పీత్వా పేయామణ్డం పిబేదను. 37
తత్ శ్వాసకాసహృత్పార్శ్వగ్రహణీదోషగుల్మనుత్,
పిప్పల్యాద్యం ఘృతం చైతత్ ఆత్రేయేణ ప్రకీర్తితమ్. 38

(ఇతి పిప్పల్యాదిఘృతమ్.)

వ్యా॰ పిప్పళ్లు, మోడి, చవ్యము, చిత్రమూలము, శుంఠి, దనియాలు, చిరుబొద్ది, వస, సన్నరాష్ట్రము, అతిమధురము, యవక్షారము, ఇంగువ, వీనిని ప్రత్యేక మొక్కొక కోల (అర్ధకర్షము—పరకపలము) ప్రమాణమువంతున చేర్చి నూరి కల్కముగ జేసి, ప్రస్థ పరిమితమైనఘృతమున జేర్చి, అందు దశమూలములకషాయమును ఒకఆఢకము కలిపి, ఘృత పాకవిధిప్రకారము పక్వము జేసి యాఘృతమును పూటకొకచతుర్థిక (పలము) వంతున త్రాగి వెంటనే పేయయను గంజితేటను త్రాగినయెడ శ్వాసకాసములను, హృద్రోగ మును, ప్రక్కనొప్పులను, గ్రహణీదోషమును, గుల్మములను హరించును. ఈపిప్పల్యాది ఘృతము ఆత్రేయమహర్షిచే జెప్పబడినది. (కావున మిక్కిలి యుత్తమమని భావము).

## కాసహరత్ర్యూషణాదిఘృతము.

మూ. త్ర్యూషణం త్రిఫలాం ద్రాక్షాం కాశ్మర్యాణి పరూషకం,
ద్వే పాఠే దేవదార్వృద్ధిం స్వగుప్తాం చిత్రకం శటీమ్. 39
బ్రాహ్మీం (వ్యాఘ్రీం) తామలకీం మేదాం కాకనాసాం శతావరీం
త్రికణ్టకం విదారీం చ పిష్ట్వా కర్షసమం, ఘృతాత్. 40
ప్రస్థం, చతుర్గుణే క్షీరే సిద్ధం కాసహరం పిబేత్,
జ్వరగుల్మాఽరుచిప్లీహాశిరోహృత్పార్శ్వశూలనుత్. 41
కామలాఽర్శోఽనిలాఽష్ఠీలాక్షతశోషక్షయాపహం,
త్ర్యూషణం నామ విఖ్యాతం ఏతద్ఘృతమనుత్తమమ్. 42
(ఇతి త్ర్యూషణాద్యం ఘృతమ్.)

వ్యా॰ త్రికటుకములు, త్రిఫలములు, ద్రాక్షపండు, పెగ్గుమ్మడు, చిట్టీత, విషబొద్ది, చిన్నవిషబొద్ది, దేవదారుచెక్క, బుద్ధి, దూలగొండి, చిత్రమూలము, కచోరములు, సరస్వతి (వల్లారి)యాకు, (వాకుడు), నేలయుశిరిక, మేద, కాకిదొండ, పిల్లిపీచర, పల్లేరు, నేలగుమ్మడు, వీనినన్నిటిని ప్రత్యేక మొక్కొక కర్షమువంతున జేర్చి నూరి కల్కముజేసి యొకప్రస్థపరిమితమగు నేతిలో కలిపి నాల్గురెట్లు ఆవుపాలను జేర్చి ఘృత పాకవిధిప్రకారము పక్వముజేసి యగ్నిబలానుసారముగ ప్రతిదినంబును త్రాగినయెడ కాసమును హరించును. మరియు నీఘృతసేవనమువలన జ్వరము, గుల్మములు, అరుచి, ప్లీహము, తలనొప్పి, హృదయశూలము, పార్శ్వశూలము, కామల, అర్శస్సులు, వాతాష్ఠీల, ఉరఃక్షతము, శోషము, క్షయము, అనునీవ్యాధులన్నియు శమించును. ఇయ్యది మిక్కిలి యుత్తమము. ప్రశస్తమునైన త్ర్యూషణాది ఘృతము. (ఈఘృతమే హిక్కా శ్వాస చికిత్సితమునను (౨౮౬. శ్లో) అపకర్షింపబడినది).

## కాసహరరాస్నాదిఘృతము.

మూ. ద్రోణేఽపాం సాధయేద్రాస్నాం దశమూలీం శతావరీం,
పలికాం మానికాంశ్చాంస్తు కులుత్థాన్ బదరాన్ యవాన్. 43
తులార్ధం చాఽజమాంసస్య పాదశేషేణ తేన చ,
ఘృతాఢకం సమక్షీరం జీవనీయైః పలోన్మితైః. 44
సిద్ధం తద్దశభిః కల్కైః నస్యపానాఽనువాసనైః,
సమీక్ష్య వాతరోగేషు యథావస్థం ప్రయోజయేత్. 45
పఞ్చ కాసాన్ శిరఃకమ్పం శూలం వఙ్క్షణయోనిజం,
సర్వాఙ్గైకాఙ్గరోగాంశ్చ సప్లీహోర్ధ్వాఽనిలాఞ్జయేత్. 46

(ఇతి రాస్నాదిఘృతమ్.)

వ్యా. సన్నరాష్ట్రము, దశమూలములు, పిల్లిపీచర, ఇవి ప్రత్యేక మొక్కొకపలము; ఉలవలు, రేగుపండ్లు, యవలు, ఇవి ప్రత్యేక మొక్కొకమానిక (ఎనిమిదేసిపలములు); లేక మాంసము అర్ధతులము (ఏబదిపలములు); ఈభాగములవంతున వీనినన్నిటిని ద్రోణ మాత్రజలమున జేర్చి నాల్గవపాలు (ఆఢకపరిమితము) మిగులునట్లు కషాయము కాచి, ఆఢకమాత్రఘృతమున కలిపి, అందు ఘృతమునకు సమభాగముగ (ఒకఆఢము) ఆవు పాలను, జీవనీయగణమున జెప్పబడిన జీవకముమున్నగు పదిద్రవ్యములను ఒక్కొకపలము వంతు జేర్చి నూరి కల్కము జేసి యాకల్కమును కూడకలిపి, ఘృతపాకవిధిప్రకారము పక్వము చేయునది. ఈఘృతమును నస్యమునకును, పానమునకును, అనువాసనవస్తికిని వాతరోగములయందు, ఆయాయవస్థాభేదముల ననుసరించి యుపయోగింపనగును. దీని వలన ఐదుకాసములును, శిరఃకంపమును (తలవణకు), గజ్జలయందును యోనియందును కల్గుశూలంబును, సర్వాంగ-ఏకాంగవాతంబులును, ప్లీహవృద్ధియు, ఊర్ధ్వశ్వాసంబును శమించును.

ఇచ్చట—షడ్విరేచనశతాశ్రితీయాధ్యాయమున జెప్పబడిన జీవకము, ఋషభకము, మేద, మహామేద, కాకోళి, క్షీరకాకోళి, ముద్గపర్ణి (పిల్లపెసర), మాషపర్ణి (కారుమినుము), మనుబోల, అతిమధురము, అను పదిద్రవ్యములను కల్కముగ నీఘృతయోగమున జేర్పవలెనని "జీవనీయైః పలోన్మితైః సిద్ధం తద్దశభిః కల్కైః" అనువాక్యముచే జెప్పబడినది. జీవనీయగణము "జీవకర్షభకౌ......జీవన్తీ మధుకమితి దశేమాని భవన్తి" (సూ. అ. ౪. సూత్ర. ౨౪) అని నిర్దేశింపబడినది.

### కఫముతో గూడి వాతమున కల్గినకాసమునకు విడంగాదిచూర్ణము.

మూ. విడఙ్గం నాగరం రాస్నా పిప్పలీ హిఙ్గు సైన్ధవం,
భార్గీ క్షారశ్చ తచ్చూర్ణం పిబేద్వా ఘృతమాత్రయా. 47
సకఫేఽనిలజే కాసే శ్వాసహిక్కాహతాఽగ్నిషు,

వ్యా. వాయువిడంగము, శుంఠి, సన్నరాష్ట్రము, పిప్పళ్లు, ఇంగువ, సైంధవలవణము భారంగి, యవక్షారము, వీనినన్నిటిని సమభాగములుగ గూర్చి చూర్ణము చేసి ఆయారోగములకును అగ్నిబలాదులకు దగినపరిమాణము చూర్ణమును మితమైన (చూర్ణమును కలుపుటకు దగినంత) నేతిలో కలిపి సేవింపదగును. దీనిని కఫముతో గూడి వాతమున కల్గిన కాసమునందును, శ్వాస-హిక్కా-వ్యాధులయందును, అగ్ని మందగించియున్నపుడును ఉపయోగింపదగును.

### వాతకాసహరద్విక్షారాదిచూర్ణము.

మూ. ద్వౌ క్షారౌ పఞ్చకోలాని పఞ్చైవ లవణాని చ. 48
శటీనాగరకోదీచ్యకల్కం వా వస్త్రగాలితం,
పాయయేత ఘృతోన్మిశ్రం వాతకాసనిబర్హణమ్. 49

వ్యా. సర్జక్షారము, యవక్షారము, పంచకోలములు (పిప్పళ్లు, మోడి, చవ్యము, చిత్రమూలము, శుంఠి), పంచలవణములు (సౌవర్చలలవణము, సైంధవలవణము, బిడాలవణము, ఔద్భిదలవణము, సముద్రలవణము), కచోరములు, శుంఠి, కురువేరు, వీనినన్నిటిని సమభాగములుగ గూర్చి చూర్ణము చేసి వస్త్రగాలితముచేసి ఆవునేతిలో కలిపి త్రాగినయెడ వాతకాసమును హరించును.

### వాతకాసహరదురాలభాదిచూర్ణము.

మూ. దురాలభాం శటీం ద్రాక్షాం శృఙ్గబేరం సితోపలాం,
లిహ్యాత్కర్కటశృఙ్గీం చ కాసే తైలేన వాతజే. 50

వ్యా. దూలగొండి, కచోరములు, ద్రాక్షపండు, శుంఠి, శీనాకల్కండ, కర్కాటకశృంగి, వీనినన్నిటిని సమభాగములుగ గూర్చి చూర్ణము జేసి నువ్వులనూనెతో గలిపి వాతముచే జనించిన కాసమున నాకించవలెను.

### వాతకాసహరదుస్స్పర్శాది-చూర్ణము.

మూ. దుస్స్పర్శాం పిప్పలీం ముస్తం భార్గీం కర్కటకీం శటీం,
పురాణగుడతైలాభ్యాం చూర్ణితం చాపి లేహయేత్. 51

వ్యా. దూలగొండి, పిప్పళ్లు, తుంగగడ్డలు, భారంగి, కర్కాటకశృంగి, గంధకచోరములు, వీనినన్నింటిని సమభాగములుగ చూర్ణముచేసి పాతబెల్లమును నువ్వులనూనెను కలిపి వాతికకాసము కలవానికి నాకించవలెను.

### కాసాదిహరవిడంగాది-చూర్ణము రెండవది.

మూ. విడఙ్గం సైన్ధవం కుష్ఠం వ్యోషం హిఙ్గు మనశ్శిలాం,
మధుసర్పిర్యుతం కాస-హిక్కా-శ్వాసం జయేల్లిహన్. 52

వ్యా. వాయువిడంగములు, సైంధవలవణము, చెంగల్వకోష్ఠు, త్రికటుకములు (శుంఠి-పిప్పలి-మిరియాలు), ఇంగువ, మనశ్శిల, వీనిని సమభాగములుగగూర్చి చూర్ణము జేసి తేనెను నేతిని కలిపి నాకించినయెడ కాసంబును, హిక్కా-శ్వాసంబులునుశమించును.

### కాసాదిహరచిత్రకాద్యవలేహః.

మూ. చిత్రకం పిప్పలీమూలం వ్యోషం హిఙ్గు దురాలభాం,
శటీం పుష్కరమూలం చ శ్రేయసీం సురసాం వచామ్ 53
భార్గీం ఛిన్నరుహాం రాస్నాం శృఙ్గీం ద్రాక్షాం చ కార్షికాన్,
కల్కానర్ధతులాక్వాథే నిదిగ్ధ్యాః, పలవింశతిమ్. 54
(కల్కాన్ నిదిగ్ధ్యర్ధతులాం నిష్క్వాథ్య పలవింశతిం),
దత్వా మత్స్యణ్డికాయాశ్చ, ఘృతాచ్చ కుడవం పచేత్,
సిద్ధం శీతం పృథక్ క్షౌద్రపిప్పలీకుడవాన్వితమ్. 55
చతుష్పలం తుగాక్షీర్యాః చూర్ణితం తత్ర దాపయేత్,
లేహయేత్ కాసహృద్రోగ శ్వాసగుల్మనివారణమ్. 56
(ఇతి చిత్రకాదిలేహః.)

వ్యా. చిత్రమూలము, పిప్పళ్లమూలము (మోడి), త్రికటుకములు, ఇంగువ, దూలకోవిల, గంధకచోరములు, పుష్కరమూలము, చిరుబొద్ది, (లేక గజపిప్పలి) తులసి, వస, భారంగి, తిప్పతీగె, సన్నరాష్ట్రము, కర్కాటకశృంగి, ద్రాక్షపండు,

ఈద్రవ్యములను ప్రత్యేకమొక్కొక కర్షమువంతున మెత్తనిచూర్ణముగ జేసి వస్త్రగళితము చేయునది. (ఇది కల్కచూర్ణము), వాకుడును చేర్చి కాచబడిన యేబది పలములకషాయమును వడగట్టి అందు పైజెప్పినకల్కచూర్ణమును, ఇరువదిపలములు ఖండశర్కరను చేర్చి పక్వముచేసి, యది పక్వమగునపుడు ఒకకుడవము (నాల్గుపలములు) ఆవునేతిని కలిపి, లేహపాకవిధిప్రకారము పక్వముజేసి దింపి చల్లారినపిదప నొకకుడవము (నాల్గుపలములు) తేనెను, పిప్పలీచూర్ణము ఒకకుడవమును, తవక్షీరి (వెదురుప్పు) నాల్గుపలములను చూర్ణముచేసికలిపి యుంచునది. ఈలేహమును అగ్నిబలానుసారము ప్రతిదినంబును సేవించినచో కాసంబును, హృద్రోగంబును, గుల్మంబులును నివర్తించును. (ఇచ్చట వాకుడుకషాయము సిద్ధమైనది అర్ధతులము (ఏబదిపలములు) జేర్చవలెనని 'అర్ధతులాక్వాథే నిదిగ్ధ్యాః' అని నిర్దేశింపబడినది. ఆక్వాథమును ఏబదిపలములు వాకుడును, రెండాఢకములు జలమున జేర్చి చతుర్థాంశము మిగులునట్లు కాచి యేబదిపలములు గ్రహింపనగును. ఈయోగమునే వాగ్భటాచార్యులును—"పచేద్వ్యాఘ్రీతులాం......శ్వాసకాసజిత్" (అ. హృ. చి. అ. 3. శ్లో. ౬౨. ౬౫) అని చెప్పిరి. కాని ద్రవ్యపరిమాణములో కొంచెము భేదించుచున్నది. అయినను ఫలమున సమానము.)

### కాసాదిహరఅగస్త్యహరీతకీరసాయనము.

మూ. దశమూలీం స్వయంగుప్తాం శఙ్ఖపుష్పీం శటీం బలాం,
హస్తిపిప్పల్యపామార్గపిప్పలీమూలచిత్రకాః. 57
భార్గీం పుష్కరమూలం చ ద్విపలాంశం, యవాఢకం,
హరీతకీశతం చైకం జలే పఞ్చాఢకే పచేత్. 58
యవే స్విన్నే కషాయం తం పూతం తచ్చాఽభయాశతం,
పచేద్గుడతులాం దత్వా, కుడవం చ పృథక్ ఘృతాత్. 59
తైలాత్ సపిప్పలీచూర్ణాత్ సిద్ధశీతే చ మాక్షికాత్,
లిహ్యాత్ ద్వే చాఽభయే నిత్యం అతః ఖాదేత్ రసాయనాత్.
తద్వలీపలితం హన్తి వర్ణాయుర్బలవర్ధనం,
పఞ్చ కాసాన్ క్షయం శ్వాసం హిక్కాం చ విషమజ్వరమ్. 61
హన్యాత్తథాఽర్శోగ్రహణీహృద్రోగాఽరుచిపీనసాన్,
అగస్త్యవిహితం శ్రేష్ఠం రసాయనమిదం శుభమ్. 62
(ఇత్యగస్త్యహరీతకీరసాయనమ్.)

వ్యా. దశమూలములు, దూలగోవిల, శంఖపుష్పి, గంధకచోరములు, చిట్టాముట్టి, గజపిప్పలి, ఉత్తరేణి, మోడి, చిత్రమూలము, భారంగి, పుష్కరమూలము, వీనిని ప్రత్యేకము రెండేసిపలంబులును, ఒకఆఢక (అరువదినాల్గుపలముల) పరిమితము యవలను, నూరుకరకకాయలను ఐదుఆఢకములపరిమితమగుజలమున జేర్చి, అందు చేర్చినయవలు చక్కగ నుడుకునందాక పక్వముజేయవలెనుయవలు ఉడికినపిదప నాకషాయమును వడగట్టి యుంచుకుని, ఆకషాయమున పక్వమైన నూరుకరకకాయలను, నూరుపలములు, బెల్లమును చేరి మరల వండవలెను. అది పాకము వచ్చునపుడు అందు ఆవునేతిని నువ్వుల నూనెను, పిప్పలిచూర్ణమును, ప్రత్యేకమొక్కకుడవము (నాల్గేసి పలములవంతున) జేర్చి చక్కగ పక్వముచేసి దింపి చల్లారినపిదప నొకకుడవము తేనెకలిపి యుంచునది.

ఇట్లు సిద్ధమైనయూరసాయనమును తగుపరిమితిని తిని పూటకు రెండుకరకకాయల వంతున గ్రహించి ప్రతిదినంబును నమలి తినవలెను. దీనివలన ముదిమిచే గల్గిన శరీరము నందలిముడతలును వెండ్రుకలనెరపును నివర్తించి శరీరమునకు మంచి వర్ణముకల్గి శరీర బలంబును ఆయువును వృద్ధినందును. మరియు పంచకాసములను, క్షయమును, హిక్కాశ్వాసములను, విషమజ్వరమును, అర్శస్సులను, గ్రహణీదోషమును, హృద్రోగమును, అరుచిని, పీనసమును హరించును. ఇయ్యది యగస్త్యమహర్షిచే జెప్పబడిన మిగుల శ్రేష్ఠమైన రసాయనము.

ఇచ్చట నీవిధానము నెరుంగునది. దశమూలాదిద్రవ్యములను పైజెప్పినభాగ ప్రకారము చేర్చి నలుగ దంచి యాకల్కచూర్ణమును ఆఢకపరిమితయవలను చక్కగ పండిననూరుకరకకాయలను ఐదుఆఢకములజలమునవైచి కషాయము కాచవలెను. అందలి యవలు పక్వమగుసరికి కషాయనాల్గవపాలు మిగులును. అట్టిసమయమున చతుర్భాగావశిష్టమైన కషాయమును వడగట్టి, ఆకషాయమున పక్వమైన నూరుకరకకాయలను, వేరుగ నేర్పరిచి ప్రత్యేకముగ నొక్కకుడవపరిమితమైన నేతిని నూనెను కలిపి పక్వముగ వేచి యాకషాయముననే చేర్చి, అందు నూరుపలములు బెల్లమును కూడకలిపి మరలవండవలెను. అదిచక్కగ లేహపాకమగుసమయమున నాల్గుపలములు పిప్పలీచూర్ణమును కలిపి కొంచెము పక్వముచేసి పొయిమీదినుండి దింపి చల్లారినపిదప నాల్గుపలములు తేనెను కలుపవలెను. ఇట్లు సిద్ధమైన యూరసాయనమును అగ్నిబలానుసారముగ తిని అప్పుడే అందలికరకకాయల రెంటినికూడ నమలి తినవలెను. ఈవిషయము "లిహ్యాత్ ద్వే చాభయే నిత్యమతః ఖాదేత్ రసాయనాత్"అని స్ఫుటముగ జెప్పబడినది. ఇచ్చట కుడవమానమునకు ద్విగుణ పక్షమునవలంబించి తైల-ఘృత-మాక్షికములను ప్రత్యేకము ఎనిమిదేసిపలములు చేర్చవలెననికొందరు చెప్పెదరు. తంత్రాంతరమున "మధునశ్చ పలాష్టకమ్"అని తేనెకు మాత్రము

పలాష్టకపరిమాణము చెప్పబడినది. మరియు ఘృతంబును తేనెయు సమానభాగములుగ నున్నను ద్రవ్యాంతరసంయోగముండుటచే విషతుల్యము కానేరదు. ఈరెండును ద్రవ్యాంతరసంయోగము లేక సమభాగములుగ జేరినప్పుడే విషమగునని యార్షసమ్మతము. స్థలాంతరములయందు నీన్యాయమునే గమనించునది.

### వాతకాసహరసైంధవాదిచూర్ణయోగములు.

మూ. సైన్ధవం పిప్పలీం భార్గీం శృఙ్గబేరం దురాలభాం,
దాడిమాఽమ్లేన కోష్ణేన బార్గీనాగరమమ్బునా. 63
పిబేత్ ఖదిరసారం వా మదిరాదధిమస్తుభిః,
అథవా పిప్పలీకల్కం ఘృతభృష్టం ససైన్ధవమ్. 64

వ్యా. సైంధవలవణము, పిప్పళ్లు, భారంగి, శుంఠి, దూలగొండి, వీనిని సమభాగములుగ గూర్చి చూర్ణముచేసి పుల్లదానిమ్మరసముల కలిపి వాతికకాసమున త్రాగింపనగును. మరియు భారంగిని శుంఠిని సమములుగ చూర్ణముచేసి సుఖోష్ణముగ నుండు వేడినీళ్లలో కలిపి త్రాగినను, ఖదిరసారము(కైరసారము-చంద్రచేవ-కాచు)ను చూర్ణముచేసి మదిర యనుమద్యముతో నైనను, పెరుగుమీదిమీగడతో నైనను చేర్చి త్రాగినను; పిప్పళ్లను నేతిలో వేయించి చూర్ణముచేసి అందు కొంచెముగ ఉప్పునుచేర్చి మదిరతో కలిపి త్రాగినను వాతకాసము నిష్క్రమించును.

### కాసరోగమున ధూమపానముచేయవలసిన యవస్థాభేదములు.

మూ. శిరసః పీడనే స్రావే నాసాయాః హృది తామ్యతి,
కాసప్రతిశ్యాయవతాం ధూమం వైద్యః ప్రయోజయేత్. 65

వ్యా. తలబరువు తలనొప్పి మున్నగు శిరస్సంబంధములగు బాధలు కల్గినప్పుడును, పడిసెముబట్టి ముక్కున ద్రవము కారుచున్నను, హృదయమున బాధకల్గినను, కాస-పీనస రోగములుకలవారికి ధూమపానము జేయింపదగు. (కాసరోగమున తలనొప్పి మున్నగు బాధలు కల్గినయెడ ధూమపానము చేయదగునని భావము.)

### కాసమున ధూమపానవిధి, ధూమపాననాడీపరిమాణము.

మూ. దశాఙ్గులోన్మితాం నాడీం అథవాఽష్టాఙ్గులోన్మితాం,
శరావసమ్పుటచ్ఛిద్రే కృత్వా జిహ్మాం విచక్షణః. 66
వైరేచనం ముఖేనైవ కాసవాన్ ధూమమాపిబేత్,
తమురః కేవలం ప్రాప్తం ముఖేనైవోద్వమేత్పునః. 67

వ్యా. పదియంగుళములమాత్రమైనను ఎనిమిదియంగుళమాత్రమైన పొడవుగల యొకగొట్టమును మూకుడుయొక్క సంపుటములో రంధ్రముచేసి యారంధ్రమున (గొట్టము) వంకరగ నుండునట్లు నునిచి కాసరోగముకలవాడు శిరోవిరేచకద్రవ్యములచే సిద్ధము చేయబడిన యౌషధమూలముగ నోటిచేతనే పొగ పీల్చవలెను. (చంద్ర రేగుమున్నగు వానికట్టెలచేనైన పొగ లేక గనగనలాడుచుండు నిప్పుకణికల నొకమూకుడులో నిండుగ పోసి అందు స్నేహముతో కూడిన కాసహరచూర్ణాదుల నునిచి నడుమ ద్వారము కల వేరొకమూకుడును బోరగిల మూసి, యారెండిటిసంధిని పొగ వెడలకుండునట్లు బంధించి, యాశరావసంపుటమున పైభాగమున కలరంధ్రమున పది, లేక యెనిమిదియంగుళముల పొడవుగల గొట్టమును, వంగియుండునట్లు పదిలముగనునిచి, దానినుండి నోటితో పొగను పీల్చవలెనని భావము. ఈయర్థమునే వాగ్భటాచార్యులును క్లుప్తముగ నిట్లు చెప్పెను:— "శరావసమ్పుటచ్ఛిద్రే నాడీం న్యస్య దశాఙ్గుళామ్, అష్టాఙ్గుళాం వా వక్త్రేణ కాసవాన్ ధూమమాపిబేత్" (అ. హృ. సూ. అ. ౨౧.) మరియు 'ముఖేనైవ' అని చెప్పుటచేత నోటనుండియే పీలువనగునుగాని నాసారంధ్రములచే పీలువదగదని భావము.)

పైజెప్పినరీతిగ నోటిచేతనే పీలువబడినధూమము రొమ్మువరకును వ్యాపించినవెంటనే నోటినుండియే బైటవెడలింపనగును. (మరియు ధూమపానక్రమమును తస్యాశితీయాధ్యాయమున జూచునది.)

### కాసమున ధూమపానముచే గల్గుగుణములు.

మూ. స హ్యస్య తైక్ష్ణ్యాత్ విచ్ఛిద్య శ్లేష్మాణమురసి స్థితం,
నిష్కృష్య శమయేత్కాసం వాతశ్లేష్మసముద్భవమ్. 68

వ్యా. పైజెప్పిన విధముగ కాసరోగమున ధూమపానము జేసినచో దానియందలి తీక్ష్ణత్వముచేత రొమ్మున ఘనీభవించి గడ్డకట్టియుండుకఫమును పెకలించి వాతశ్లేష్మముచే గల్గినకాసమును శమింపజేయును. (కావున పీలువబడినధూమమును రొమ్మువరకును వ్యాపింపజేసి నోటినుండియే వెడలింపవలెనని భావము.)

### 1. కాసహరమనశ్శిలాదిధూమపానము.

మూ. మనశ్శిలాఽఽలమధుకమాంసీముస్తేఙ్గుదైః పిబేత్,
ధూమం తస్యాఽను చ క్షీరం సుఖోష్ణం సగుడం పిబేత్. 69
ఏష కాసాన్ పృథగ్దోషసన్నిపాతసముద్భవాన్,
ధూమో హన్యాదసంసిద్ధాన్ అన్యైర్యోగశతైరపి. 70

వ్యా. మణిశిల, హరిదళము, అతిమధురము, జటామాంసి, తుంగగడ్డలు, గారకాయ, వీనిని సమభాగములుగ చూర్ణము జేసి స్నేహమునుకూడ కలిపి పైజెప్పినవిధిప్రకారము ధూమపానము జేసి వెంటనే సుఖోష్ణముగనుండు పాలలో బెల్లమును మితముగకలిపి త్రాగవలెను. వాతాదిదోషములచే వేరువేరుగ జనించిన కాసములును, సాన్నిపాతికమైన (క్షయజ) కాసంబును, అనేకములైన యితరౌషధములచే శమించకున్నను, ఈధూమపానముచే తప్పక శమించును.

ఇచ్చట తీక్ష్ణమగునీధూమపానముచే నొకవేళ యోజస్సునకు హానికల్గునేమో యని క్షీరపానము విధింపబడినది. మరియు సాన్నిపాతికకాసమును వేరుగ జెప్పకున్నను క్షయజకాసమున మూడుదోషములు ప్రకోపమునొందును కావున దానినుద్దేశించి "సన్నిపాతసముద్భవాన్" అని నిర్దేశింపబడినది. క్షయజము సాన్నిపాతికమనియే "సన్నిపాతభవో హ్యేషః క్షయకాసస్సుదారుణః, సన్నిపాతహితం తస్మాత్ సదా కార్యం భిషగ్జితమ్" (శ్లో. ౧౭౭) అను శ్లోకముచే తంత్రకారులు ముక్తకంఠముగ నుడివిరి. నిదానమును చెప్పునపుడును—"వ్యాపన్నేఽగ్నౌ త్రయో మలాః, కుపితాః క్షయజం కాసం కుర్యుర్దేహక్షయప్రదమ్" (శ్లో. ౨౪) అని శాసించిరి.

### కాసహర ప్రపౌణ్డరీకాదిధూమపానము.

మూ. ప్రపౌణ్డరీకం మధుకం శార్ఙ్గేష్టాం సమనశ్శిలామ్,
మరీచం పిప్పలీం ద్రాక్షాం ఏలాం సురసమఞ్జరీమ్. 71
కృత్వా వర్తిం పిబేద్ధూమం క్షౌమచేలాఽనువర్తితాం,
ఘృతాక్తాం అను చ క్షీరం గుడోదకమథాపి వా. 72

వ్యా. ప్రపౌండరీకము (పుండరీకమను గ్రంధ్యవిశేషము), అతిమధురము, గురిగింజ, మణిశిల, మిరియాలు, పిప్పళ్లు, ద్రాక్షపండు, ఏలకులు, తులసిపువ్వులగుత్తులు, వీనిని సమభాగములుగ గ్రహించి నీళ్లుబోసి మెత్తగనూరి తెల్లనిపట్టుగుడ్డకుపూసి వత్తిచేసి యెండించి నేతిలోతడిపి ధూమపానవిధిప్రకారము ధూమమును పానము జేయనగును. వెంటనే పాలనైనను బెల్లపుపానకమునైనను త్రాగవలెను.

(ధూమవర్తివిధానము మాత్రాశితీయాధ్యాయమున 'పిష్ట్వాలిమ్పేచ్ఛరేషీకాం... ప్రాయోగికీం సుఖామ్" (సూ. అ. ౫, శ్లో. ౨౨-౨౩) అని చెప్పినదానిని చూచునది.)

### 2. కాసహరమనశ్శిలాదిధూమపానము.

మూ. మనశ్శిలైలామరిచత్వగ్రాజ్ఞానకుటన్నటైః,

వంశలేఖనసేవ్యాల(వంశలోచనశైవాల)క్షౌమలక్తకరోహిషైః.
పూర్వకల్పేన ధూమో౽యం సానుపానే విధీయతే,

వ్యా. మణిశిల, ఏలకులు, మిరియాలు, యవక్షారము, రసాంజనము, తుంగముస్తలు, వెదురుప్ప, వట్టివేళ్లు, హరిదళము, తెల్లనిపట్టుగుడ్డ, లక్క, కామంచిగడ్డి, వీనినన్నిటిని మెత్తగనూరి పైయోగమున జెప్పినవిధముగ (పట్టుగుడ్డకు పూసి వత్తిజేసి యెండించి నేతిలో తడిపి నిప్పునంటించి ధూమపానవిధిప్రకారము) పొగ పీల్చునది. వెంటనే యనుపానంబును పాలనైనను పానకమునైనను చేయునది.

3, 4. మనశ్శిలాదిధూమపానయోగములు రెండు.

మూ. మనశ్శిలాలే తద్వచ్చ పిప్పలీనాగరైస్సహ. 74
త్వగ్గెజ్గుదీబృహత్యౌ ద్వే తాలమూలీ మనశ్శిలా,
కార్పాసాస్థ్యశ్వగన్ధా చ ధూమః కాసవినాశనః. 75

వ్యా. మణిశిల, హరిదళము, పిప్పళ్లు, శుంఠి, ఈనాల్గిటినైనను, లవంగపట్ట, గారకాయ, వాకుడుకాయలు, ములకకాయలు, తాటివేళ్లు, మణిశిల, పత్తివిత్తులు, పెన్నేరుగడ్డ, ఈద్రవ్యములనైనను పైజెప్పినవిధముగ నూరి వత్తిజేసి విధిప్రకారము ధూమపానము చేసినచో కాసమును హరించును.

వాతికకాసరోగమున పథ్యాహారములు.

మూ. గ్రామ్యా౽౽నూపౌదకైః శాలియవగోధూమషష్టికాః,
రసైర్మాషాత్మగుప్తానాం యూషైర్వా భోజయేద్ధితాః. 76

వ్యా. సంబావులయొక్కయు యవలయొక్కయు గోధుమలయొక్కయు అరువదినాళ్ల సంబావులయొక్కయు బియ్యముచే సిద్ధమైనయన్నమును, గ్రామమునబుట్టిన జంతువులయొక్కయు జలప్రాంతమునందలి జంతువులయొక్కయు జలజంతువులయొక్కయు మాంసములచే సిద్ధములగుమాంసరసములతో నైనను, ఉద్దిపప్పుచేతను దూలగొండిగింజలచేతను సిద్ధముచేయబడిన యూషములతోనైనను చేర్చి కాసరోగి భుజించినచో హితకరముగ నుండును.

వాతజకాసమున యవాన్యాది సిద్ధపేయాపానము.

మూ. యవానీ పిప్పలీబిల్వమధ్యనాగరచిత్రకైః,
రాస్నా౽జాజీపృథక్పర్ణీపలాశశటిపౌష్కరైః. 77

స్నిగ్ధాఽమ్లలవణాం సిద్ధాం పేయాఽమనిలజే పిబేత్,
కటీహృత్పార్శ్వకోష్ఠార్తిశ్వాసహిక్కాప్రణాశినీమ్. 78

వ్యా. ఓమము, పిప్పళ్లు, మారేడుపండులోని గుంజు, శుంఠి, చిత్రమూలము, సన్నరాష్ట్రము, జీలకర, ముయ్యాకుపొన్న, మోదుగ, కచోరములు, పుష్కరమూలము, వీనినిజేర్చి పేయయనుగంజిని సిద్ధముచేసి అందు నేతిని, పులుపును, ఉప్పును జేర్చి వాతజకాసములయందు త్రాగునది. దీనివలననడుమునొప్పియు, హృదయశూలంబును, ప్రక్కనొప్పియు కడుపునొప్పియు హిక్కాశ్వాసములును నివర్తించును.

వాతకాసమున దశమూలసిద్ధపేయాపానము.

మూ. దశమూలరసే తద్వత్ పఞ్చకోలగుడాన్వితామ్,
సిద్ధాం సమతిలాం దద్యాత్ క్షీరే వాఽపి ససైన్ధవామ్. 79

వ్యా. దశమూలకషాయ పంచకోలములను బెల్లమును జేర్చి సిద్ధముచేయబడిన పేయ (గంజి) యైనను; పాలనుచేర్చి సిద్ధముచేయబడినగంజియందు నువ్వులను సైంధవలవణము జేర్చియైనను వాతజకాసమున త్రాగించవలెను. (పిప్పలి, మోడి, చవ్యము, చిత్రమూలము, శుంఠి, ఇవి పంచకోలములు.)

వాతకాసహరమాంససిద్ధపేయాపానము.

మూ. మాత్స్యకౌక్కుటవారాహైః ఆమిషైర్వా ఘృతాన్వితాం,
సిద్ధాం ససైన్ధవాం పేయాం వాతకాసీ పిబేన్నరః. 80

వ్యా. మత్స్యములయొక్కయు, కోడియొక్కయు, పందియొక్కయు మాంసముల జేర్చి సిద్ధముచేయబడి సైంధవలవణమును నేతిని చేర్చి సంస్కరింపబడిన పేయను వాతకాసపీడితుడు త్రాగవలెను.

వాతకాసమున శాకాదులు.

మూ. వాస్తుకో వాయసీశాకం మూలకం సునిషణ్ణకం,
స్నేహాస్తైలాదయో భక్ష్యాః క్షీరేక్షురసగౌడికాః. 81
దధ్యారనాళాఽమ్లఫలప్రసన్నాపానమేవ చ,
శస్యతే వాతకాసే తు స్వాద్వమ్లలవణాని వా. 82

(ఇతి వాతకాసచికిత్సా)

వ్యా. చక్రవర్తియాకుకూర, కాచాకుకూర, కసివెందాకుకూర, ముల్లంగి, చెంచలాకుకూర, ఇవి శాకముల కుపయోగింపదగును. నువ్వులనూనె మున్నగు స్నేహంబులును,

పాలను చెరకురసమును బెల్లమును చేర్చి చేయబడిన భక్ష్యంబులును; పెరుగు, ఆరనాళము (పుల్లనిగంజి), దానిమ్మపండ్లు మున్నగుఫలములపుల్లనిరసము, ప్రసన్నయను మద్యము, మధుర-అమ్ల-లవణరసంబులును వాతకాసమున హితకరములుగ నుండును. (ఇత్తెరంగున 'రూక్షస్యానిలం కాసం' అని యుపక్రమించి వాతికకాసచికిత్స పూర్తిగ జెప్పబడినది.)

పైత్తికకాసచికిత్సాక్రమము, అందు వమనవిధి.

మూ. పైత్తికే సకఫే కాసే వమనం సర్పిషా హితం,
తథా మదనకాశ్మర్యమధూకక్వథితైర్జలైః. 83
యష్ట్యాహ్వాఫలకల్కైర్వా విదారీక్షురసాయుతైః,
హృతదోష స్తతః శీతం మధురం చ క్రమం భజేత్. 84

వ్యా. కఫముతోఁగూడి పిత్తముచే జనించినకాసమునందు మ్రంగకాయ మున్నగు వమనద్రవ్యములతోఁ గూడినఘృతము నుపయోగించి తొలుత వమనము చేయించవలెను. లేక మ్రంగకాయ, పెద్దగుమ్ముడు, అతిమధురము, ఈమూటెని (సమభాగములుగ) జేర్చి కాచబడినజలముచైనను, అతిమధురము, ఈరెంటిని కల్కముజేసి నేలగుమ్మడిగడ్డరసమును చెరకురసమును కలిపినయాకల్కముచైనను త్రాగించి వమనము చేయించవలెను. ఈవమనముచేత కాసవేగమున వెడలుకఫము వెడలిన పిదప శీతవీర్యంబును మధురరసంబును కలపేయాదిక్రమమున సంసర్జనవిధి చేయనగును.(ఇచ్చట—ఉపకల్పనీయాధ్యాయమున "అథైనం సాయాహ్నే......ప్రకృతిభోజనమాగచ్ఛేత్"(సూ. అ. ౧౫. సూ. ౨౮) అని చెప్పబడినపేయాదిక్రమసంసర్జనము, "మధురం చ క్రమం భజేత్" అని యను వదింపబడినదని యెఱుంగునది.)

కఫసంబద్ధమైనపిత్తకాసమున విరేచనవిధి.

మూ. పైత్తే తనుకఫే కాసే త్రివృతాం మధురైర్యుతాం,
దద్యాత్, ఘనకఫే, తిక్తైః విరేకార్థే యుతాం భిషక్. 85

వ్యా. సూక్ష్మముగ కఫసంబంధముకల్గిన పిత్తకాసమునందును మధురద్రవ్యములతోఁ గూడిన తెగడను విరేచనమునకై యియ్యనగును. కఫము అధికమై ఘనీభూతమైయుండు పిత్తకాసమున తిక్తద్రవ్యములతోఁగూడిన తెగడను విరేచనమునకై యియ్యనగును.

విరేకానంతరము పేయాదిక్రమవిధి.

మూ. స్నిగ్ధశీత స్తనుకఫే రూక్షశీతః కఫే ఘనే,
క్రమః కార్యః; పరం భోజ్యైస్స్నైహైర్లైహైశ్చ శస్యతే. 86

వ్యా. పైజెప్పినరీతిగ విరేచనముచే కోష్ఠము శుద్ధమైనపిదప తనుకఫావస్థయందు స్నిగ్ధంబును శీతంబునైన పేయాదిక్రమంబును, కఫము ఘనముగనుండునవస్థయందు రూక్షంబును శీతంబునైన పేయాదిక్రమంబును ఆహారకాలమున నవలంబించవలెను. పేయాదిక్రమానంతరము క్రిందజెప్పబడు విధముగ భోజ్యములచేతను స్నేహములచేతను లేహములచేతను ఉపచరించుట చాల ప్రశస్తము.

## పిత్తకాసహరలేహ్యయోగము లైదు.

మూ. శృఙ్గాటకం పద్మబీజం నీలీ సారాణి పిప్పలీ,
పిప్పలీముస్తయష్ట్యాహ్వద్రాక్షామూర్వామహౌషధమ్. 87
లాజాఽమృతఫలాద్రాక్షా త్వక్క్షీరీపిప్పలీ సితా,
పిప్పలీ పద్మకం ద్రాక్షా బృహత్యాశ్చ ఫలాద్రసః. 88
ఖర్జూరం పిప్పలీ వాంశీ శ్వదంష్ట్రా చేతి పఞ్చ తే,
ఘృతక్షౌద్రయుతాః లేహాః శ్లోకార్ధైః పిత్తకాసినామ్. 89

వ్యా. శృంగాటకము (సింగాణి (నామ)దుంపలు), తామరవిత్తులు, నీలికాయల రసము, పిప్పళ్లు, ఈనాల్గిటినైనను; పిప్పళ్లు, తుంగగడ్డలు, అతిమధురము, ద్రాక్షపండు, చాగపట్ట, శుంఠి, ఈయారిటినైనను; వరిపేలాలు, ఉసిరికకాయలవలుపు, ద్రాక్షపండు, వెదురుప్పు, పిప్పళ్లు, చక్కెర, ఈయారిటినైనను; పిప్పళ్లు, పద్మకము, ద్రాక్షపండు, ములకఫండ్లరసము, ఈనాల్గిటినైనను; ఖర్జూరపుకాయలు, పిప్పళ్లు, వెదురుప్పు, పల్లేరు, ఈనాల్గిటినైనను; సమభాగములుగ జేర్చి చూర్ణముచేసి నేతిని తేనెను కలిపి సేవించవలెను. ఇత్తెరంగున పైశ్లోకములలో నొక్కొక అర్ధశ్లోకమున జెప్పబడిన యైదుగణద్రవ్యములను దేనినైన సేవించినయెడ పిత్తకాసములు శమించును.

## పిత్తకాసమున శర్కరాదిలేహ్యము.

మూ. శర్కరాచన్దనద్రాక్షామధుధాత్రీఫలోత్పలైః,
పైత్తే సముస్తమరిచస్సకఫే సఘృతోఽనిలే. 90

వ్యా. చక్కెర, చందనము, ద్రాక్షపండు, ఉసిరికకాయలబెరడు, నల్లకలువలు, వీని చూర్ణముచేసి తేనెలో కలిపి పిత్తకాసమున లేహము నిప్పింపనగును. మరియు నీ చూర్ణయోగమున తుంగగడ్డలను మిరియాలను కూడ చేర్చి చూర్ణముచేసి తేనెలో కలిపి కఫముతోకూడిన పిత్తకాసమున నుపయోగించునది. ఆయోగమునే వాతానుబంధమైనపిత్త కాసమున నేతిలో కలిపి సేవించవలెను.

### మృద్వీకాదిలేహ్యము.

మూ. మృద్వీకాఽర్ధశతం త్రింశత్పిప్పలీః శర్కరాపలం,
లేహయేన్మధునా గోర్వా క్షీరపం చ శకృద్రసమ్. 91

వ్యా. ఏబదిద్రాక్షపండ్లును, ముప్పదిపిప్పళ్లును, ఒకపలము చక్కెరయు, వీని నొక టిగ నూరి తేనెలో కలిపి పిత్తకాసమున సేవించునది. లేక ఆవుపేడరసమును తేనెలో కలిపి నాకించి అన్నమునకు బదులు ఆవుపాలనే యాహారము చేయనగును.

(ఇచ్చట "గోర్వాక్షీరపంచశకృద్రసం" అనుచోట "గోః క్షీరపమితి—క్షీర మాత్రాశినమ్" అని చక్రపాణిదత్తవ్యాఖ్యానమున నున్నది. ఈవ్యాఖ్య ననుసరించియే పైనివివరింపబడినది. కొన్ని పాతముద్రణప్రతులయందు"గోర్వా క్షీరపస్య శకృద్రసమ్" అని యున్నది. వాగ్భటాచార్యులును 'క్షీరపస్య' అనుపాఠమునే చెప్పిరి. ఈపాఠము ననుసరించి సర్వాంగసుందరవ్యాఖ్యలో "గోర్వా వత్సస్య క్షీరపస్య—క్షీరవృత్తేః, శకృద్రసం మధునా లిహేత్." (అ. హృ. చి. అ. 3. 30. శ్లోకవ్యాఖ్య). ఈవ్యాఖ్యనను సరించి పాలుద్రాగుచుండు ఆవుదూడపేడరసమును తేనెలో కలిపి యుపయోగించవలెనని తెలిసెడి.)

### కాసహరలేహ్యము.

మూ. త్వగేలావ్యోషమృద్వీకాపిప్పలీమూలపౌష్కరైః,
లాజాముస్తశటీరాస్నాధాత్రీఫలవిభీతకైః. 92
శర్కరాక్షౌద్రసర్పిర్భిః లేహః కాసవినాశనః,
శ్వాసం హిక్కాం క్షయం చైవ హృద్రోగం చ ప్రణాశయేత్.

వ్యా. లవంగపుపట్ట, ఏలకులు, త్రికటుకములు, ద్రాక్షపండు, మోడి, పుష్కరమూలము, వరిపేలాలు, తుంగగడ్డలు, కచోరములు, సన్నరాష్ట్రము, ఉసిరికకాయలు, తానికాయలు, పంచదార, తేనె, ఆవునెయ్యి, వీని సమభాగములుగగూర్చి చేయబడిన లేహము కాసమును హరించును. మరియు హిక్కాశ్వాసములను ధాతుక్షయమును హృద్రోగమును కూడ హరించును.

### కాసహరపిప్పల్యాదిలేహము.

మూ. పిప్పల్యామలకం ద్రాక్షాం లాక్షాం లాజాం సితోపలాం,
క్షీరే పక్త్వా ఘనం శీతం లిహ్యాత్ క్షౌద్రాష్టభాగికమ్. 94

వ్యా. పిప్పళ్లు, ఉసిరికకాయలబెరడు, ద్రాక్షపండు, లక్క, వరిపేలాలు, శీనాకల్కండ, వీనిని సమభాగములుగగూర్చి చూర్ణముజేసి ఆవుపాలలో నుడికించి లేహపక్వముగ ముద్దయై చల్లారినపిదప లేహమునకు సెనిమిదవవంతు తేనె కలిపి సేవించినచో పిత్తకాసము హరించును.

పిత్తకాసహరవిదార్యాదిరసపానము.

మూ. విదారీక్షుమృణాళానాం రసాః క్షీరం సితోపలాం,
పిబేద్వా మధుసంయుక్తం పిత్తకాసహరం పరమ్. 95

వ్యా. నేలగుమ్మడురసము, చెరకురసము, తామరకాడలరసము, ఆవుపాలు, ఈ ద్రవములను సమభాగముల్గుగ గూర్చి, అందు శీనాకల్కండపొడిని తేనెను కలిపి త్రాగినయెడ పిత్తకాసమును హరించును.

కఫాధికపిత్తకాసమున నాహారాదులు.

మూ. మధురైః జాఙ్గలరసైః శ్యామాకయవకోద్రవాః,
ముద్గాదియూషైః, శాకైశ్చ తిక్తకైర్మాత్రయా హితాః. 96
ఘనశ్లేష్మణి లేహాశ్చ (స్తు) తిక్తకా మధుసంయుతాః,

వ్యా. మిక్కిలి కఫముతోకూడి కఫము ఘనీభవించియుండు పిత్తకాసమునందు మధురముగనుండు జాంగలజంతుమాంసరసముతోనైనను, పెసలు మున్నగువానితో సిద్ధము చేయబడిన యూషములతోనైనను, చేదుగనుండు ఆకుకూరలతోనైనను, చామలయొక్కయు యవలయొక్కయు కొఱ్ఱలయొక్కయు అన్నమును జేర్చి మితమైన పరిమాణము భుజించుట పిత్తకాసమున చాలహితకరము. మరియు తిక్తరసము కలద్రవ్యములతో జేయబడిన లేహ్యపదార్థములను తేనెకూర్చి యుపయోగించుటయు హితకరము.

కఫము స్వల్పముగనుండు పిత్తకాసమున పథ్యాన్నపానములు.

మూ. శాలయస్స్న్గిగ్ధైః తనుకఫే షష్టికాశ్చ రసాదిభిః. 97
శర్కరామ్భోఽనుపానార్థం ద్రాక్షేక్షూణాం రసాః పయః,
సర్వం చ మధురం శీతం అవిదాహి ప్రశస్యతే. 98

వ్యా. కఫము స్వల్పముగనుండు పిత్తకాసమునందు రాజనంపుబియ్యముచేనైనను, అరువదినాళ్ల సంబావులబియ్యముచేనైనను స్నిగ్ధమైన యన్నమును మాంసరసములతో గూర్చి భుజించుట హితకరము. అనుపానమునకు శర్కరపానకమునైనను, ద్రాక్షపండ్ల

రసముసైనను, చెరకురసముసైనను, పాలసైన నుపయోగింపనగును. మరియు మధురసంబును, గుణవీర్యములచే శీతంబును, మంటబుట్టించకుండునదియునగు నన్నపానములన్నియు పిత్తకాసములయందు హితములుగనుండును.

### పిత్తకాసమున కాకోల్యాది సిద్ధమాంసరసాదిపానము.

మూ. కాకోలీ బృహతీ మేదా యుగ్మైః సవృషనాగరైః,
పిత్తకాసే రసాః క్షీరం యూషాంశ్చాఽప్యుపకల్పయేత్ 99

వ్యా. కాకోళి, క్షీరకాకోళి, వాకుడు, ములక, మేద, మహామేద, అడ్డసరము, శుంఠి, వీనిని చేర్చి సిద్ధముచేయబడిన మాంసరసములను పాలను యూషములను పిత్తకాసమునందు పానాదుల కుపయోగింపనగు. (ఇచ్చట 'యుగ్మైః' అనుపదము "ద్వన్ద్వాన్తే శ్రూయమాణం పదం ప్రత్యేకమనుసంబధ్యతే" అనున్యాయము ననుసరించి కాకోలి మున్నగుపదములతో ప్రత్యేక మన్వయించుటచే పైయర్థము లభించును.)

### పిత్తకాసమున క్షీరపానవిధి.

మూ. శరాదిపఞ్చమూలస్య పిప్పలీద్రాక్షయోస్తథా,
కషాయేణ శృతం క్షీరం పిబేత్సమధుశర్కరమ్. 100

వ్యా. తృణపంచమూలములు (కుశదర్భ, రెల్లుదర్భ, కాకివెదురు, దర్భ, చెరుకు, ఈయైదిటివేళ్లు), పిప్పళ్లు, ద్రాక్షపండు, వీనిని సమభాగములుగ గ్రహించి నాలుగింత నీళ్లు బోసి నాల్గవపాలు మిగుల కషాయము కాచి, అందు (సమభాగముగ) ఆవుపాలు బోసి క్షీరపాకవిధిప్రకారము పక్వముచేసి యాక్షీరము చల్లారినపిదప తేనెను చక్కెరనుజేర్చి పిత్తకాసమున త్రాగవలెను. మరియు వాగ్భటాచార్యులు—"సాధితాం తేన పేయాం వా సుశీతాం మధునాన్వితాం" (అ. హృ. చి. అ. 3) అని చెప్పిరి. కావున పైజెప్పిన తృణపంచమూలాది ద్రవ్యములచే సిద్ధమైన కషాయమును చేర్చి సిద్ధము చేయబడిన పేయను గూడ నుపయోగింపదగునని యెరుంగునది.

### పిత్తకాసమున స్థిరాదిసిద్ధక్షీరపానము.

మూ. స్థిరా సితాపృశ్నిపర్ణీశ్రావణీబృహతీయుగైః,
జీవకర్షభకాకోలీ తామలక్యృద్ధిజీరకైః. 101
శృతం పయః పిబేత్కాసీ జ్వరీ దాహీ క్షతక్షయీ,

వ్యా. ముయ్యాకుపొన్న, చక్కెర, కోలపొన్న, బోడతరము, ములక, వాకుడు, జీవకము, ఋషభకము, కాకోళి, నేలయుసిరిక, బుద్ధి, జీలకర, వీనిని సమభాగములుగ

జేర్చి క్షీరపాకవిధిప్రకారము పక్వముచేయబడిన క్షీరమును త్రాగినచో కాసంబును, జ్వరంబును, తాపంబును, ఉరఃక్షతమున గల్గిన క్షయంబును శమించును.

ఇచ్చట "ద్రవ్యాదష్టగుణం క్షీరం క్షీరాత్తోయం చతుర్గుణమ్, క్షీరావశేషః కర్తవ్యః క్షీరపాకే త్వయం విధిః." అను పరిభాషాప్రకారము పైజెప్పబడిన ముయ్యాకుపొన్న మున్నగు ద్రవ్యములను సమభాగములుగ జేర్చి దానికి నెనిమిదింతలు ఆవుపాలను, పాలకు నాల్గింతలు జలమును జేర్చి పాలు మాత్రము మిగులునట్లు కాచి త్రాగవలెను. క్షీరపాకవిధిస్థలములయందెల్ల నీవిధానమునే యతిదేశించునది.

### పిత్తకాసహర సర్పిర్గుడము.

మూ. తజ్జం వా సాధయేత్సర్పిః సక్షీరేక్షురసం భిషక్. 102
జీవకాద్యైః మధురకైః ఫలైశ్చాభిషుకాదిభిః,
కల్కైస్త్రికార్షికైః సిద్ధే పూతశీతే ప్రదాపయేత్. 103
శర్కరాపిప్పలీచూర్ణం త్వక్క్షీర్యా మరిచస్య చ,
శృఙ్గాటకస్య చావాప్య క్షౌద్రగర్భాన్ పలోన్మితాన్. 104
గుడాన్ గోధూమచూర్ణేన కృత్వా ఖాదేత్ హితాఽశనః,
శుక్రాఽసృగ్దోషశోషేషు కాసే క్షీణక్షతేషు చ. 105

వ్యా, పైజెప్పిన యోగప్రకారము ముయ్యాకుపొన్న మున్నగు ద్రవ్యముల జేర్చి పక్వముచేయబడిన క్షీరమును తోడుబెట్టి దానిని చిలికి యావెన్నచేసైన నేతియందు పాలను చెరకురసమును (రెండును సమముగచేరి ఘృతమునకు నాల్గింతలుగ నుండునట్లు) జేర్చి, అందు జీవనీయగణమున జెప్పబడిన జీవకాదిద్రవ్యముల పదిటిని, అభిషుకాది మధురఫలముల నాల్గిటిని ప్రత్యేకము మూడేసికర్షములవంతున కల్కముజేసి యాకల్కమును జేర్చి ఘృతపాకవిధిప్రకారము పక్వముజేసి సిద్ధమైనపిదప వడగట్టి చల్లారినపిదప, చక్కెర, పిప్పలిచూర్ణము, వెదురుప్పు, మిరియాలచూర్ణము, సింగాణిదుంపల చూర్ణమును, వీనిని నెయ్యి ముద్దయగునంతపరిమితిని కలిపి, తేనెను గోధుమపిండిని కలిపి, ఒక్కొక పలమువంతున గుడకములుచేసి యుపయోగించునది.

పైజెప్పిన గుడకములను సేవించుచు పత్థ్యముగ నాహారముల జేయుచున్నచో శుక్రదోషంబులును, ఆర్తవరక్తదోషంబులును, కాసంబులును, క్షతక్షీణంబును శమించును. (ఇది సర్పిర్గుడము.)

ఇచ్చట "జీవకాద్యైః మధురకైః ఫలైశ్చాభిషుకాదిభిః" అనుచోట జీవనీయ గణమున జెప్పబడిన జీవకము, ఋషభకము, మేద, మహామేద, కాకోళి, క్షీరకాకోళి,

పిల్లపెసర, కారుమినుము, పాలకూర (మనుబాల), అతిమధురము అనుపద్రవ్యములును; 'వాతామాఽభిషుకాక్షోటమకూలకనికోచకాః" (సూ. అ. ౨౭ శ్లో. ౧౫౫) అని నిర్దేశించబడిన అభిషుక, (పిస్తాపప్పు), అక్షోట (అక్రోడు), మకూలక, (అక్రోడుభేదము), నికోచకము, అను మధురఫలములు నాల్గును గ్రహింపనగును. జీవనీయగణము "జీవకర్షభకౌ...జీవనీయాని భవన్తి" (సూ. అ. ౪ సూ. ౨౮) అని చెప్పబడినది.

### పిత్తకాసమున శర్కరాదిస్వరసపానము.

మూ. శర్కరానాగరోదీచ్యం కణ్టకారీం శటీం సమాం,
పిష్ట్వా రసం పిబేత్పూతం వస్త్రేణ ఘృతమూర్ఛితమ్. 106

వ్యా. చక్కెర, తుంగగడ్డలు, శుంఠి, కురువేరు, వాకుడు, కచోరములు, వీనిని సమభాగములుగ గూర్చి నీళ్లుబోసి నూరి కల్కముజేసి వస్త్రగళితముజేసి యాకల్కరసమున నేతిని కలిపి త్రాగినచో పిత్తకాసము శమించును.

### పిత్తకాసహరఘృతము.

మూ. మహిష్యజాఽవిగోక్షీరధాత్రీఫలరసై(శ్శృ)తైః)స్సమైః,
సర్పిస్సిద్ధం పిబేద్యుక్త్యా పిత్తకాసనిబర్హణమ్ 107

(ఇతి పిత్తకాసచికిత్సా.)

వ్యా. ఎనుముపాలు, మేకపాలు, గొఱ్ఱెపాలు, ఉసిరికపండ్లరసము, ఆవునెయ్యి, వీనిని సమభాగములుగ గూర్చి ఘృతపాకవిధిప్రకారము పక్వముచేసి అగ్నిబలాద్యనుసారముగ త్రాగినయెడ పిత్తకాసము నివర్తించును. ("పైత్తికే సకఫే కాసే" అని యుపక్రమించి ఇంతదనుక పైత్తికకాసచికిత్స పూర్తిగ జెప్పబడినది).

### కఫజకాసచికిత్సాక్రమము, అందు శోధనవిధి.

మూ. బలినం వమనైరాదౌ శోధితం కఫకాసినం,
యవాన్నైః కటురూక్షోష్ణైః కఫఘ్నైశ్చాప్యుపాచరేత్. 108

వ్యా. కఫముచే గల్గిన కాసరోగము కలవాడు శరీరము చక్కగనున్నచో వానికి తొలుత విధ్యుక్తప్రకారము శోధకచికిత్స జేసినపిదప చక్కగ శుద్ధకోష్ఠునిగ నెరింగి యవాన్నములచేతను కటు-రూక్ష-ఉష్ణగుణంబులును కఫహరంబులును నగు నాహారాదుల చేతను నుపచారముల చేయనగును.

### కఫజకాసమున యూషములు.

మూ. పిప్పలీక్షారికైర్యూషైః కౌలుత్థైర్మూలకస్య చ,
లఘూన్యన్నాని భుఞ్జీత రసైర్వా కటుకాన్వితైః. 109
ధాన్వబైలరసైః స్నేహైః తిలసర్షపబిల్వజైః,

వ్యా. పిప్పళ్లు, యవక్షారము, వీనిని చేర్చి సంస్కరింపబడిన ఉలవకట్టుతోనైనను ముల్లంగిని చేర్చి సిద్ధముచేయబడిన యూషములతోనైనను, కారమును జేర్చి పక్వముజేయబడిన మాంసరసములతోనైనను, తేలికగ జీర్ణమగునన్నముల భుజింపనగును. మరియు జాంగలజంతువులయొక్కయు బొరియలలో నివసించు ఉడుము మొదలగు జంతువులయొక్కయు మాంసరసములను నువ్వులనూనెచేనైనను ఆవనూనెచేనైనను మారేడుగింజలనూనెచేనైనను సంస్కరించి, యామాంసరసములతో లఘ్వాహారమును జేయనగును.

### కఫజకాసమునందు పానీయములు.

మూ. మధ్వమ్లోష్ణామ్బుతక్రం వా మద్యం వా నిగదం పిబేత్. 110
పౌష్కరారగ్వధం మూలం పటోలం త్రైఫలం నిశాస్థితం,
జలం మధుయుతం పేయం కాలేష్వన్నస్య వా త్రిషు. 111

వ్యా. తేనెను పులుపురసమును చేర్చబడిన వేడినీళ్లనైనను మజ్జిగనైనను నిర్దుష్టమైన మద్యమునైనను త్రాగనగును. మరియు పుష్కరమూలమును రేలవేరును, చేదుపొట్లను, నలుగగొట్టి నీళ్లలో వేసి రాత్రియంతయు నానినిచ్చి ఉదయమున నాజలమును వడగట్టియందు కొంచెముగ తేనెను కలిపి భుజించునపుడు ఆదియందును మధ్యకాలమునను అంతమునందును త్రాగవలెను.(ఇచ్చట సామాన్యపరిభాషచేత క్వాథమునకు నాలుగింతలు జలముజేర్చి నాల్గవపాలుమిగుల కషాయము కాచవలెను.)

### కఫకాసహరకట్ఫలాదికషాయము.

మూ. కట్ఫలం కత్తృణం భార్గీం ముస్తం ధాన్యం వచాఽభయే,
శుణ్ఠీ పర్పటకం శృఙ్గీ సురాహ్వాం చ శృతం జలే. 112
మధుహిఙ్గుయుతం పేయం కాసే వాతకఫాత్మకే,
కణ్ఠరోగే ముఖే శూనే శ్వాసహిక్కాజ్వరేషు చ. 113

వ్యా. కాయఫలము, (టేకుమ్రానికాయలు), కామంచిగడ్డి, గంటుభారంగి, తుంగగడ్డలు, దనియాలు, వస, కరకకాయలు, శుంఠి, పర్పాటకము, కర్కాటకశృంగి, దేవదారుచెక్క, వీనినన్నిటిని సమభాగములుగ గూర్చి నలుగగొట్టి జలమున జేర్చి నాల్గవ పాలు మిగులకషాయముకాచి వడగట్టి అందు తేనెను ఇంగువపొడిని కలిపి వాతకఫముచే గల్గినకాసమునందు త్రాగనగును. మరియు కంఠరోగమునందును, ముఖమునకల్గినవాపు నందును, హిక్కా-శ్వాసములయందును, జ్వరమునందును, పైజెప్పినకషాయమును త్రాగ నగును.

## కఫకాసహరపాఠాదిస్వరసము.

మూ. పాఠాం శుణ్ఠీం శటీం మూర్వాం గవాక్షీం ముస్తపిప్పలీం,
పిష్ట్వా ఘర్మాఽమ్బునా హిఙ్గుసైన్ధవాభ్యాం యుతాం పిబేత్. 114

వ్యా. చిరుబొద్ది, శుంఠి, కచోరములు, చాగ, పిన్నపాపర, తుంగగడ్డలు, పిప్పళ్లు వీనిని సమభాగములుగ జేర్చి వేడినీళ్లు బోసి నూరి వడగట్టి యాస్వరసమున ఇంగువను సైంధవలవణమును కొద్దిగ జేర్చి కఫకాసమున త్రాగవలెను.

## నాగరాదిస్వరసము.

మూ. నాగరాఽతివిషే ముస్తం శృఙ్గీ కర్కటకస్య చ,
హరీతకీం శటీం చైవ తేనైవ విధినా పిబేత్. 115

వ్యా. శుంఠి, అతివస, తుంగగడ్డలు, కర్కాటకశృంగి, కరకకాయలబెరడు, కచోరములు, వీనిని సమభాగములుగ జేర్చి పైయోగమున జెప్పిన ప్రకారము (వేడినీళ్లు, బోసి నూరి వడగట్టి ఇంగువను సైంధవలవణమును జేర్చి) త్రాగనగును.

## కఫజకాసహరకులుత్థకషాయము.

మూ. తైలభృష్టం చ పిప్పల్యాః కల్కాఽక్షం ససితోపలం,
పిబేద్వా శ్లేష్మకాసఘ్నం కులుత్థరససంయుతమ్. 116

వ్యా. పిప్పళ్లను నూనెలో వేయించి చూర్ణముచేసి యులవకషాయమునకొకకర్ష పరిమితమును చేర్చి శీనాకల్కండచూర్ణమును కూడ కలిపి త్రాగినయెడ కఫజకాసమును హరించును.

## కఫజకాసహరకాసమర్దాదిస్వరసము.

మూ. కాసమర్దాఽశ్వవిట్ భృఙ్గరాజవార్తాకజో రసః,
సక్షౌద్రః కఫకాసఘ్నః సురసస్యాసితస్య చ. 117

వ్యా. కసివెంద, గుఱ్ఱపుపేడ, గుంటకలగర, ములక, నల్లతులసి, వీనిని నలుగ దంచి స్వరసముదీసి యందు తేనె కలిపి త్రాగిన కఫజకాసము హరించును.

### వాతానుబంధకఫజకాసహరదేవదార్వ్యాదిలేహ్యయోగములు.

మూ. దేవదారు శటీ రాస్నా కర్కటాఖ్యా దురాలభా,
పిప్పలీ నాగరం ముస్తం పథ్యాధాత్రీసితోపలాః. 118
మధుతైలయుతావేతౌ లేహౌ వాతానుగే కఫే,

వ్యా. దేవదారుచెక్క, గంధకచోరములు, సన్నరాష్ట్రము, కర్కాటకశృంగి, దూలగొండి, వీనిని సమభాగములుగ జేర్చి చూర్ణముజేసియైనను; పిప్పళ్లు, శుంఠి, తుంగగడ్డలు, కరకకాయబెరడు, ఉసిరికకాయలబెరడు, శీనాకల్కండ, వీనిని సమభాగములుగగూర్చి చూర్ణముచేసియైనను; అందు తేనెను నూనెను కలిపి నాకినయెడ వాతము అనుబంధముగనుండుకఫమునకల్గినకాసము నివర్తించును. (ఇచ్చట రెండుశ్లోకార్ధములచే జెప్పబడినద్రవ్యములు రెండుయోగములు.)

### కఫజకాసహరపిప్పల్యాదిచూర్ణయోగములు.

మూ. పిప్పలీ పిప్పలీమూలం చిత్రకో హస్తిపిప్పలీ. 119
పథ్యా తామలకీ ధాత్రీ భద్రముస్తా చ పిప్పలీ,
దేవదార్వభయా ముస్తం పిప్పలీవిశ్వభేషజమ్. 120
విశాలా పిప్పలీ ముస్తం త్రివృతా చేతి లేహయేత్,
చతురో మధునా లేహాన్ కఫకాసహరాన్ భిషక్. 121

వ్యా. పిప్పళ్లు, మోడి, చిత్రమూలము, ఏనుగుపిప్పళ్లు; (ఇది యొకయోగము) కరకకాయలబెరడు, నేలయుసిరిక, ఉసిరికకాయలబెరడు; భద్రముస్తలు; (ఇది రెండవయోగము), దేవదారుచెక్క, కరకకాయలబెరడు, తుంగగడ్డలు, పిప్పళ్లు, శుంఠి; (ఇది మూడవయోగము), పెదపాపర, పిప్పళ్లు, తుంగగడ్డలు, తెగడ, (ఇది నాల్గవయోగము), ఈనాల్గుయోగములయందు జెప్పబడినద్రవ్యములను సమభాగములుగ వేరువేరుగ గూర్చి చూర్ణములుజేసి తేనెలో కలిపి నాకినయెడ కఫజకాసమును హరించును.

### వాతకఫకాసహరసౌవర్చలాదిచూర్ణము.

మూ. సౌవర్చలాఽభయాధాత్రీపిప్పలీక్షారనాగరం,
చూర్ణితం సర్పిషా వాతకఫకాసహరం పిబేత్. 122

వ్యా. సౌవర్చలలవణము కరకకాయలబెరడు, ఉసిరికకాయలబెరడు, పిప్పళ్లు, యవక్షారము, శుంఠి, వీనిని సమభాగములుగ గూర్చి చూర్ణముచేసి నేతిలో కలిపి సేవించినయెడ వాతకఫకాసమును హరించును.

వాతకఫకాసాదులకు దశమూలాదిఘృతము.

మూ. దశమూలాఢకే ప్రస్థం ఘృతస్యాఽక్షసమైః పచేత్,
పుష్కరాహ్వాశటీబిల్వసురసవ్యోషహింగుభిః. 123
పేయానుపానం తత్పేయం కాసే వాతకఫాత్మకే,
శ్వాసరోగేషు సర్వేషు కఫవాతాత్మకేషు చ 124
(ఇతి దశమూలాద్యం ఘృతమ్.)

వ్యా. ఆఢక (నాల్గుప్రస్థముల) పరిమితమైన దశమూలకషాయమున నొకప్రస్థ (పదునారుపలముల) పరిమితమగు ఆవునెయ్యి చేర్చి, అందు పుష్కరమూలము, కంధకచోరములు, బిల్వవేరు, తులసివేరు, త్రికటుకములు (శుంఠి-పిప్పలి-మిరియాలు),ఇంగువ, వీనిని ప్రత్యేక మొక్కొకకర్షమువంతునచేర్చి చూర్ణముచేసి కలిపి, ఘృతపాకవిధిప్రకారము పక్వముచేసి యీఘృతమును వాతకఫజకాసమునందు (అగ్నిబలాద్యనుసారముగ) ప్రతిదినంబును పేయానుపానముతో సేవించునది. మరియు కఫవాతముచే జనించిన శ్వాసరోగము లన్నిటియందు నీఘృతమును సేవింపదగు.

ఇచ్చట దశమూలములు—మారేడు, దుండిగము, గుమ్మడి, కలిగొట్టు, తక్కెల, ముయ్యాకుపొన్న, కోలపొన్న, వాకుడు, పెద్దములక, పల్లేరు, ఇవి. ఈపదింటివేళ్లను చేరినసముదాయము నొకఆఢకపరిమితమును నలియకొట్టి నాలుగాఢకములనీళ్లలో జేర్చి చతుర్థాంశము మిగులునట్లు క్వాథముచేసినచో "క్వాథః క్వాథ్యసమో మతః" అనుపరిభాషాఽనుసారము క్వాథ్యమునకుసమముగ నొకఆఢకము క్వాథమేర్పడును. ఆక్వాథమున ప్రస్థపరిమితమైన ఘృతమునుచేర్చినచో క్వాథము ఘృతమునకు చతుర్గుణమగును. అందు పుష్కరమూలాదికల్కద్రవ్యములను ప్రత్యేకము కర్షమువంతున క్వాథమున నూరి కలిపి ఘృతపాకవిధిప్రకారము పక్వముచేయనగును. ఘృతపాకవిధులయందెల్ల సామాన్యముగ నిదేప్రక్రియ ననుసరింపవలెను.

సర్వకాసాదులయందును కంటకారీఘృతము.

మూ. సమూలఫలపత్రాయాః కణ్టకార్యా రసాఢకే,
ఘృతప్రస్థం బలావ్యోషవిడఙ్గశటిచిత్రకైః. 125

సౌవర్చలయవక్షారపిప్పలీమూలపౌష్కరైః,
వృశ్చీరబృహతీపథ్యాయవానీదాడిమర్ద్ధిభిః. 126
ద్రాక్షాపునర్నవాచవ్యదురాలమ్భాఽమ్లవేతసైః,
శృఙ్గీతామలకీభార్గీరాస్నాగోక్షురకైః పచేత్. 127
కల్కైః తత్సర్వకాసేషు హిక్కాశ్వాసేషు శస్యతే,
కణ్టకారీఘృతం హ్యేతత్ కఫవ్యాధినిషూదనమ్. 128

(ఇతి కణ్టకారీఘృతమ్.)

వ్యా. వాకుడుచెట్లను సమూలముగ (వేళ్లు కాయలు ఆకులు మున్నగువానితో గూడ) గ్రహించి దంచి రసముతీసి యాస్వరసము ఒకఆఢకముపరిమితమున నొకప్రస్థము ఆవునేతిని కలిపి, అందు చిట్టాముట్టివేరు, త్రికటుకములు, వాయువిడంగములు, గంధకచోరములు, చిత్రమూలము,సౌవర్చలలవణము,యవక్షారము, పిప్పలీమూలము( మోడి), పుష్కరమూలము, వృశ్చీరము ( తెల్లగలిజేరు), పెద్దములక, కరకకాయలబెరడు, ఓమము, దానిమ్మబెరడు, బుద్ధి, ద్రాక్షపండు, ఎఱ్ఱగలిజేరు, చవ్యము, దూలగొండి, అమ్లవేతసము, కర్కాటకశృంగి, నేలయుసిరిక, గంటుభారంగి, సన్నరాష్ట్రము, పల్లేరువేళ్లు, వీనినన్నిటిని సమభాగములుగజేర్చి ఘృతమునకు నాల్గవవంతు( నాల్గుపలములు)అగునట్లు చేర్చి కల్కము చేసి కలిపి, ఘృతపాకవిధిప్రకారము పక్వముజేసి యుంచుకొనునది. ఈఘృతమును అగ్నిబలాద్యనుసారముగ సేవించినయెడ కాసములనన్నిటిని హిక్కాశ్వాసముల నన్నింటిని హరించును. ఇయ్యది కఫవ్యాధిహరమైన కంటకార్యాది ఘృతమని ప్రశస్తిజెందినది. (ఇచ్చట సామాన్యపరిభాషచేత బలాదిసముదాయకల్కము ప్రస్థపరిమితమైన ఘృతమునకు నాలవవంతు నాల్గుపలము లుండవలెను. వాకుడుస్వరసము వలనుపడనియెడల ఆఢకపరిమితమైన వాకుడును సమూలముగ గ్రహించి చిదుకగొట్టి నాలుగాఢకములు నీళ్లుబోసి యాఢకశేషముగ కాచినకషాయమును జేర్పనగును.)

## కఫజకాస-హిక్కా-శ్వాసములకు కులుత్థాదిఘృతము.

మూ. కులుత్థరసయుక్తం వా పఞ్చకోలశృతం ఘృతం,
పాయయేత్కఫజే కాసే హిక్కాశ్వాసే చ శస్యతే. 129

(ఇతి కులుత్థాదిఘృతమ్.)

వ్యా. ఉలవచెట్లను పైజెప్పినరీతిగ సమూలముగ్రహించి రసముదీసి యారసమునకు నాల్గవపాలు ఘృతమును, ఘృతమునకు నాల్గవపాలు పంచకోలములకల్కమును జేర్చి

ఘృతమును పక్వముజేసి కఫముచే గల్గిన కాసమునందును హిక్కా-శ్వాసములయందును సేవించుట చాల ప్రశస్తము. (పిప్పళ్లు, మోడి, చవ్యము, చిత్రమూలము, శుంఠి, ఇవి పంచకోలములు.)

### కఫజకాసమున ధూమపానవిధి.

మూ. ధూమాంస్తానేవ దద్యాచ్చ యే ప్రోక్తా వాతకాసినాం,
కోశాతకీఫలాన్మధ్యం పిబేద్వా సమనశ్శిలమ్. 130

వ్యా. వాతకాసచికిత్సితమున "మనశ్శిలాలమధుక......ధూమః కాసవినాశనః" (శ్లో. ౬౯. ౭౫) అని చెప్పబడిన ధూమపానయోగములను కఫజకాసమునందును ఉపయోగించనగును. మరియు చేదుబీరకాయ నడుమనుండుగుంజును మణిశిలను జేర్చి విధ్యుక్త ప్రకారము ధూమపానము చేయదగును.

### కఫకాసమున కుపద్రవమైన తమకశ్వాసచికిత్స.

మూ. తమకః కఫకాసే తు స్యాచ్చేత్ పిత్తాఽనుబన్ధజః,
పిత్తకాసక్రియాం తత్ర యథాఽవస్థం ప్రయోజయేత్. 131

వ్యా. కఫమున జనించినకాసమున పిత్తము ననుబంధముగ జేసి తమకశ్వాసము (ఉపద్రవరూపముగ) సంభవించినయెడ నాయాయవస్థావిశేషమునకు దగినట్లు పిత్తకాసమునకు జెప్పినచికిత్సను జేయనగు.

### వాతాద్యనుబంధకాసచికిత్స.

మూ. వాతే కఫానుబన్ధే తు కుర్యాత్కఫహరీం క్రియాం,
పిత్తానుబన్ధయోర్వాతకఫయోః పిత్తనాశినీమ్. 132

వ్యా. కాసరోగమున కఫము వాతమున కనుబంధముగ నధికముగ నున్నచో కఫకాసహరమగు చికిత్సను చేయనగును. వాతకఫములు పిత్తమున కనుబంధములుగ నున్నయెడ (పిత్తము ప్రధానముకావున) పిత్తకాసహరచికిత్సను జేయనగును.

### వాతశ్లేష్మకాసచికిత్స.

మూ. ఆర్ద్రే విరూక్షణం శుష్కే స్నిగ్ధం వాతకఫాత్మకే,
కాసేఽన్నపానం కఫజే సపిత్తే తిక్తసంయుతమ్. 133

(ఇతి కఫజకాసచికిత్సా.)

వ్యా. వాతకఫములచే గల్గినకాసమునందు ఆర్ద్రముగ (కొంచెము కఫముతోగూడి)

కాసము వెడలుచున్నయెడ రూక్షములగు నౌషధ-అన్న-పానాదులు హితకరములు. కాసము శుష్కముగ(పొడిదగ్గు) వెడలుచున్నయెడ స్నిగ్ధంబులగు నౌషధాన్నపానములు హితములు. పిత్తముతోగూడిన కఫకాసమున తిక్తరసముతోగూడిన యన్నపానాదులు హితకరములు. (ఇత్తెరంగున "బలినంపన్నై రాదౌ" అని యుపక్రమించి యింతదనుక కఫజ కాసచికిత్సితము సక్రమముగ జెప్పబడినది.)

క్షతజకాసచికిత్స.

మూ. కాసమాత్యయికం మత్వా క్షతజం త్వరయా జయేత్,
మధురైర్జీవనీయైశ్చ బలమాంసవివర్ధనైః. 134

వ్యా. క్షతజకాసము మిక్కిలి యపాయకరము, కావున దానిని చక్కగ నెరింగి మధురంబులును జీవనీయంబులును శరీరమున బలమాంసముల వృద్ధినందించునవియు నగు నౌషధాహారాదులచే నతిశీఘ్రముగ చికిత్స జేసి శమింపజేయవలెను.

క్షతజకాసమునకు పిప్పల్యాదిలేహము.

మూ. పిప్పలీమధుకం పిష్టం కార్షికం ససితోపలం,
ప్రాస్థికం గవ్యమాజం చ క్షీరమిక్షురస స్తథా. 135
యవగోధూమమృద్వీకాచూర్ణమామలకాద్రసః,
తైలం చ ప్రసృతాంశాని తత్సర్వం మృదునాఽగ్నినా. 136
పచేల్లేహం ఘృతక్షౌద్రయుక్తః స క్షతకాసహా,
శ్వాసహృద్రోగకార్శ్యేషు హితో వృద్ధేఽల్పరేతసి. 137

వ్యా. పిప్పళ్లు, అతిమధురము, శీనాకల్కండ, ఈమూడిటిచూర్ణము ప్రత్యేక మొక్కొకకర్షము; ఆవుపాలు, మేకపాలు, చెరకురసము, ఇవి యొక్కొకప్రస్థము; యవలు, గోధుమలు, ద్రాక్షపండు, వీనిచూర్ణంబులును, ఉసిరికకాయలస్వరసంబును, నువ్వులనూనెయు ప్రత్యేకము రెండేసిపలములు, వీనినన్నిటి నొకటిగ జేర్చి మృదువైన యగ్నిచే లేహపాకముగ పక్వముచేసి, యందు ఆవునేతిని తేనెను కలిపి సేవించినయెడ కాసశ్వాసములను హరించును. హృద్రోగమునందును, శరీరము కృశించినప్పుడును, వృద్ధులకును, రేతస్సు మిక్కిలిస్వల్పముగనున్నపుడును ఇయ్యది చాల హితముగ నుండును.

క్షతజకాస సామాన్యచికిత్స.

మూ. క్షతకాసాఽభిభూతానాం వృత్తిస్స్యాత్ పిత్తకాసికీ,
క్షీరసర్పిర్మధుప్రాయా సంసర్గే తు విశేషణమ్. 138

వ్యా. క్షతజకాసముచే పీడింపబడినవారికి పిత్తకాసమునకు చెప్పినచికిత్సనే జేయనగును. అందును క్షీరంబును ఘృతంబును మధురంబును అధికముగ చికిత్స విశేషముగ జేయనగును. వాతపిత్తాదిసంసర్గము కల్గియున్న క్షతజకాసమునందు ఈక్రిందచెప్పబడు క్రమము ననుసరించి చికిత్సచేయనగును. (ఇచ్చట 'వృత్తిః' అన చికిత్సయని యర్థము.)

—— క్షయకాసమునం దవస్థానుసారముగ చికిత్సావిధి. ——

మూ. వాతపిత్తార్దితేఽభ్యఙ్గః గాత్రభేదే ఘృతైర్హితః,
తైలైర్వాతరోగఘ్నైః పీడ్యమానే చ వాయునా. 139
హృత్పార్శ్వార్తిషు పానం స్యాత్ జీవనీయస్య సర్పిషః,

వ్యా. క్షతజకాసమునందు వాత-పిత్తములచే సంబంధము కల్గియున్నను దానంజేసి శరీరమున నొప్పికల్గియున్నను ఘృతములచే నభ్యంగనముచేయుట చాల హితకరము వాతమునకు సంబంధించినబాధలు కల్గినపుడు వాతహారములగు తైలములచే నభ్యంగనము చేయనగును. హృదయమునందును ఇరుప్రక్కలయందును నొప్పికల్గియున్నయెడ వాతరక్తచికిత్సితమున జెప్పబడు జీవనీయఘృతమును పానము జేయనగును. (ఇచ్చట వాతరక్తచికిత్సితమున"ద్వే పఞ్చమూలే వర్షాభూ......పార్శ్వశూలం క్షయంకాసం......సర్వాఙ్గైకాఙ్గరోగాశ్చ మూత్రసఙ్గం చ నాశయేత్......జీవనీయమిదం సర్పిః" (అ. ౨౯. శ్లో. ౬౧—౭౦.) అని చెప్పబడిన జీవనీయఘృతము నెరుంగునది.)

—— క్షతజకాసమున కృశశరీరునకు చికిత్స. ——

మూ. సదాహం కాసినో రక్తం ష్ఠీవతః సబలేఽనలే. 140
మాంసోచితేభ్యః క్షామేభ్యో లావాదీనాం రసా హితాః,
తృష్ణార్తానాం పయశ్ఛాగం శరమూలాదిభిః శృతమ్. 141

వ్యా. క్షతజకాసమునందు రొమ్మున మంటతోకూడి దగ్గినపుడు రక్తము నోటనుమియుచున్నయెడ శరీరము కృశించియున్నను జాఠరాగ్ని బలిష్ఠముగ నున్నపుడు మాంసాహారము అలవాటుగనున్నవారికి లావుకపిట్ట మున్నగుపక్షులమాంసరసములు హితకరములు. దప్పి యధికముగనున్నచో శరాదితృణపంచమూలములజేర్చి కాచబడిన మేకపాలను త్రాగించవలెను. (కుశదర్భ, రెల్లుదర్భ, కాకివెదురు, దర్భ, చెరకు ఈయైదిటి మూలములు తృణపంచమూలములు.)

—— క్షతజకాసమున రక్తస్రావమునకు చికిత్స. ——

మూ. రక్తే స్రోతోభ్య ఆస్యాద్వాఽప్యాగతే క్షీరజం ఘృతం,

నస్యం పానం యవాగూర్వా శ్రాన్తే క్షామే హతాఽనలే. 142
స్తమ్భాయామేషు మహతీం మాత్రాం వా సర్పిషః పిబేత్,
కుర్యాద్వా వాతరోగఘ్నం పిత్తరక్తాఽవిరోధి యత్. 143

వ్యా. రొమ్ము పుండగుటవలన నాసాదిస్రోతోమార్గములనుండియైనను, నోట నుండియైనను, రక్తము బయలువెడలుచున్నయెడ పాలనుండి తీయబడిన వెన్నచే కల్గిన ఘృతమును నస్యముచేయుటయు, త్రాగుటయు హితము. మరియు బడలియున్నను, శరీరము కృశించియున్నను, జాఠరాగ్ని మందగించియున్న యవాగువులను పానముచేయనగును. శరీరము స్తంభించి బిగదీసినట్లున్నచో ఘృతమును ఒకయహోరాత్రమునకు జీర్ణమగునంత గొప్పపరిమాణముచేత త్రాగింపనగును. మరియు పిత్తమునకును రక్తమునకు విరోధముకాక వాతమును మాత్రము హరించునట్టి చికిత్స జేయనగును. (ఇచ్చట "మహతీం మాత్రాం" అన్నచోట ప్రాయికముగ యెనిమిదిపలముల ప్రమాణమును గ్రహించునది.)

క్షతజకాసమున ధూమపానవిధి.

మూ. నివృత్తే క్షతదోషే తు కఫే వృద్ధే ఉరఃక్షతే (ఉరఃశిరః),
దాల్యతే కాసినో యస్య స ధూమాన్నా పిబేదిమాన్. 144

వ్యా. రొమ్మున ఉరఃక్షతముచే కల్గిన వ్రణము పైజెప్పిన చికిత్సలచే మాని కఫము వృద్ధినొంది రొమ్మునందును శిరస్సునందును పగులగొట్టినట్లు బాధ కల్గినయెడ అట్టి క్షతజకాసమున నీక్రింద జెప్పబడు ధూమముల పానముచేయుట హితము. (ఇచ్చట "ధూమాన్ నా" అని ఛేదము.)

క్షతజకాసమున మేదాదిధూమపానము.

మూ. ద్వే మేదే మధుకం ద్వే చ బలే తైః క్షౌమలక్తకైః,
వర్తిర్తైర్ధూమమాపీయ జీవనీయఘృతం పిబేత్. 145

వ్యా. మేద, మహామేద, అతిమధురము, చిట్టాముట్టి, పేరాముట్టి, లక్క వీనిని నీళ్లుపోసి మెత్తగ నూరి తెల్లని పట్టుగుడ్డకు పూసి వర్తినిచేసి యెండించి నేతిలో తడిపి విధ్యుక్తప్రకారము పొగపీల్చి జీవనీయద్రవ్యములచే సిద్ధమయిన ఘృతమును వెంటనే పానముచేయనగును.

క్షతజకాసమున మనశ్శిలాదిధూమపానము.

మూ. మనశ్శిలా పలాశాఽజగన్ధా త్వక్ క్షీరినాగరైః,

భావయిత్వా పిబేత్ క్షౌమం అను చేక్షుగుడోదకమ్. 146

వ్యా. మణిశిల, మోదుగ, వాయింట, వెదురుప్ప, శుంఠి వీనినన్నిటిని సమభాగములుగగూర్చి నూరి తెల్లపట్టుగుడ్డను ఒకరాత్రియంతయు నానబెట్టి వర్తిచేసి యెండించి విధ్యుక్తప్రకారము యావర్తినుండి ధూమము పానముచేయునది. వెంటనే చెరకురసమునైనను, బెల్లముపానకమునైనను త్రాగవలయును.

## ఈ క్షతజకాసమున వటశృంగాదిధూమపానము. ఈ

మూ. పిష్ట్వా మనశ్శిలాం తుల్యాం ఆర్ద్రయా వటశృఙ్గయా,
ససర్పిష్కం పిబేద్ధూమం తిత్తిరిప్రతిభోజనమ్. 147

వ్యా. మణిశిలను, పచ్చిదియగు మఱ్ఱియూడను సమములుగ చేర్చి నూరి అందు నెయ్యి చేర్చి తెల్లపట్టుగుడ్డకు పూసి వర్తిచేసి విధ్యుక్తప్రకారము ధూమపానము చేయదగును. వెంటనే తీతువుపిట్ట మాంసరసమును త్రాగవలయును.

## ఈ క్షతజకాసమున జీవనీయాదిధూమపానము. ఈ

మూ. భావితం జీవనీయైర్వా కులిఙ్గాణ్డరసాయుతైః,
క్షౌమం ధూమం పిబేత్ క్షీరం శృతం చాయోగుడైరను. 148
(ఇతి క్షతజకాసచికిత్సా.)

వ్యా. జీవనీయగణద్రవ్యములు నూరి అందు ఊరపిచ్చుకగ్రుడ్లరసమును జేర్చి తెల్లనిపట్టుగుడ్డకు పూసి వర్తిచేసి దానిని కాల్చి ధూమపానము చేయవలయును. పిమ్మట ఇనుపగుండ్లను కాల్చి దానిజ్వాలయందు కాచబడిన యావుపాలను త్రాగవలయును. (ఇంతదనుక "కాసమాత్రైకమత్వా" అని యుపక్రమించి క్షతజకాసచికిత్స అవస్థాద్యనుసారముగ చెప్పబడినది.)

## ఈ క్షయజకాసచికిత్సాక్రమము. ఈ

మూ. సంపూర్ణరూపం క్షయజం దుర్బలస్య వివర్జయేత్,
నవోత్థితం బలవతః ప్రత్యాఖ్యాయాచరేత్క్రియామ్ 149

వ్యా. మిక్కిలి బలహీనమైనవానికి సంపూర్ణలక్షణములతో కూడి సంభవించిన ధాతుక్షయజకాసమును చికిత్సజేయక విడువవలయును. ఆట్టికాసము శరీరబలము క్షీణించక యున్నవానికి క్రొత్తగ (చాలకాలము గడవక జనించియున్నచో కుదురుట కష్టమని చెప్పి చికిత్సజేయ నుపక్రమించవల్లయును )

క్షయజకాసమున బృంహణదీపనావశ్యకత.

మూ. తస్మై బృంహణమేవాదౌ కుర్యాదగ్నేశ్చ దీపనం,
బహుదోషాయ సస్నేహం మృదు దద్యాద్విరేచనమ్. 150

వ్యా. క్షయమువలన జనించినకాసమునందు శరీరమునకు పుష్టిని బలమును కల్గించు బృంహణచికిత్సను, జాఠరాగ్నిని దీపింపజేయుచికిత్సను, మొట్టమొదట చేయదగును. దోషము మిక్కిలి యధికముగ నున్నయెడ స్నేహములతోకూడి మృదువైన విరేచనమును నీక్రిందచెప్పబడువిధముగ చేయదగును.

క్షయజకాసమున మృదుశోధనవిధి.

మూ. శమ్యాకేన (శమ్యాకేన) త్రివృతయా మృద్వీకారసయుక్తయా,
తిల్వకస్య కషాయేణ విదారీస్వరసేన చ. 151
సర్పిః సిద్ధం పిబేద్యుక్త్యా క్షీణదేహో విశోధనమ్,
(హితం తద్ధేహబలయోరస్య సంరక్షణం మతమ్.) 152

వ్యా. శరీరము కృశించి బలహీనుడుగనుండు క్షయజకాసరూపికి రేలజిగురుతోనైనను, తెగడకషాయముతోనైనను, ద్రాక్షపండ్లస్వరసముతోనైనను, లొద్దుగుచెక్కకషాయముతోనైనను, నేలగుమ్మడుస్వరసముతోనైనను గూర్చి విధిప్రకారము పక్వముచేయబడిన ఘృతమును దేశకాలబలాద్యనుసారముగ త్రాగి విరేచనము చేయించవలెను. ఈ శోధనము దేహమునకును, బలమునకును, హానికలిగించక కాపాడుచు దోషమును వెడలించును. కావున మిక్కిలి హితకరము.

క్షయజకాసమున కర్కట్యాదిఘృతము.

మూ. పిత్తే కఫే చ సంక్షీణే పరిక్షీణేషు ధాతుషు,
ఘృతం కర్కటకీక్షీరద్విబలాసాధితం పిబేత్. 153

వ్యా. క్షయజకాసమునందు పిత్తకఫములును, రసాదిధాతువులును క్షీణించియున్నపుడు కర్కాటకశృంగి, పాలు, చిట్టాముట్టి, పేరాముట్టి వీనినిచేర్చి కాచబడిన ఘృతము త్రాగించునది.

క్షయజకాసమున విదార్యాదిఘృతము.

మూ. విదారీభిః కదమ్బైర్వా తాలసస్యైస్తథా శృతం,
ఘృతం పయశ్చ మూత్రస్య వైవర్ణ్యే కృచ్ఛ్రనిర్గమే. 154

వ్యా. క్షయజకాసరోగికి మూత్రము స్వాభావికమైన వర్ణమును మారి మిక్కిలి కష్టముచే వెడలుచున్నయెడ నేలగుమ్మడిగడ్డలతోనైనను, కడిమిపట్టతోనైనను, తాటిపండ్లతోనైనను చేర్చి పక్వముచేయబడిన ఆవునేతినైనను, ఆవుపాలనైనను త్రాగించవలయును.

మూ. శూనే సవేదనే మేఢ్రే పాయౌ సశ్రోణివంక్షణే,
ఘృతమణ్డేన మధునా(లఘునా)ఽనువాస్యో మిశ్రకేణ వా. 155
జాఙ్గలైః ప్రతిభుక్తస్య వర్తకాద్యా బిలేశయాః,
క్రమశః ప్రసహాశ్చైవ ప్రయోజ్యాః పిశితాశినః 156
ఔష్ణ్యాత్ ప్రమాథిభావాచ్చ స్రోతోభ్యశ్చ్యావయన్తి తే,
కఫం శుద్ధైశ్చ తైరుః పుష్టిం కుర్యాత్సమ్యగ్వహా రసః. 157

వ్యా. క్షతజకాసరోగికి మేఢ్రము, గుదము, పిఱ్ఱలు, గజ్జలు ఈస్థలములయందు వాపుకల్గి బాధకల్గి యున్నయెడ ఘృతమండము, (నేతిమీద కట్టియుండు సన్ననిపొర), తేనె ఈరెంటితోనైనను, లేక మిశ్రక (నేతిని నూనెను సమభాగములుగ చేర్చి స్నేహముతోనైనను, అనువాసనవస్తిని విధ్యుక్తముచేసి లింక మొదలగు జాంగలజంతువుల మాంసములతో భోజనము నిప్పించవలయును. లేక వర్తకము (వెలిచెపిట్ట) మున్నగు పక్షులయొక్కయు, బిలములయందుండు ఉడుము మున్నగు జంతువులయొక్కయు, మాంసమును తినునట్టి పెద్దపులి మొదలగు ప్రసహాజంతువులయొక్కయు మాంసములను క్రమక్రమముగ నిడవలయును. ఈయాహారమువలన మాంసములు ప్రమాథిగుణమును, ఉష్ణగుణమును కల్గియుండుటవలన స్రోతోమార్గముల నడ్డగించియుండు కఫమును వెడలించును. పిదప రసాదిధాతువులు వ్యాపించు స్రోతోమార్గములు శుద్ధములై యుండుట వలన భుజించబడిన యాహారాదిరసము శరీరమునందంతట అడ్డములేక వ్యాపించి శరీరమునకు పుష్టిని కల్గించును.

ఇచ్చట ప్రమాథి యన "స్రోతాంసి దోషలిప్తాని ప్రమథ్య వివృణోతి యత్, ప్రవిశ్య సౌక్ష్మ్యాత్ తైక్ష్ణ్యాచ్చ తత్ప్రమాథీతి సంజ్ఞితమ్" అను ప్రమాణముచేత సూక్ష్మతీక్ష్ణగుణములు కల్గియుండుటవలన దోషము వ్యాపించియుండు స్రోతోమార్గములయందు ప్రవేశించి దోషములను పోగొట్టి స్రోతస్సులను శుద్ధిపరచునది ప్రమాథి యనబడును.

### క్షయజకాసహర ద్వీపఞ్చమూలాదిఘృతము.

మూ. ద్వీపఞ్చమూలీ త్రిఫలా చవికా భార్గిచిత్రకైః,
కులుత్థపిప్పలీమూలపాఠాకోలయవైర్జలే 158

శృతైర్నాగరదుస్పర్శాపిప్పలీశటిపౌష్కరైః,
కల్కైః కర్కటశృఙ్గ్యా చ సమైః సర్పిర్విపాచయేత్. 159
సిద్ధేఽస్మింశ్చూర్ణితౌ క్షారౌ ద్వౌ పఞ్చలవణాని చ,
దత్వా యుక్త్యా పిబేన్మాత్రాం క్షయకాసనిపీడితః. 160
(ఇతి ద్విపంచమూలాదిఘృతమ్.)

వ్యా. మహాపంచమూలములు, హ్రస్వపంచమూలములు (దశమూలములు) త్రిఫలములు, చవ్యము, గంటుభారంగి, చిత్రమూలము, ఉలవలు, మోడి, చిరుబొద్ది, రేగుపండ్లు, యవలు వీనిని సమభాగములుగ కూర్చి నలుగగొట్టి నాలుగింతలజలమున చేర్చి నాల్గవపాలు మిగులునట్లు కషాయముకాచి అందు శుంఠి, దూలగొండి, పిప్పళ్లు, కచోరములు, పుష్కరమూలము, కర్కాటకశృంగి వీనిని సమభాగములుగ గూర్చి కల్కముచేసి ఈకల్కమునకు నాల్గింతలు ఆవునేతిని చేర్చి ఘృతపాకవిధిప్రకారము పక్వముచేసి దించి చల్లబడినవెనుక అందు యవక్షారము, సర్జక్షారము, పంచలవణము వీనిని యథోచితముగ చూర్ణముచేసి కలిపి యుంచుకొని అగ్నిబలానుసారముగ క్షయజ కాసరోగపీడితుడు త్రాగవలయును.

ఇచ్చట కల్పనము—ద్రవస్నేహకల్కములకు ఇచ్చట ప్రమాణము చెప్పియుండ లేదు. కావున సామాన్యపరిభాష ననుసరించి, శుంఠ్యాదికల్కద్రవ్యములు సమములుగ జేర్చి కల్కముచేసి యాకల్కమునకు నాల్గింతలు ఘృతమును, ఘృతమునకు నాల్గింతలు క్వాథద్రవమును చేర్చి ఘృతపక్వమును చేయునది. సిద్ధమయిన ఘృతమున క్షారద్వయ మును, పంచలవణములును, చూర్ణముచేసి యాఘృతమున లవణరసము మితముగ నుండు నట్లు చేర్చవలయును. ఈవిషయమునే "దత్వా యుక్త్యా" అని తంత్రకారులు సూచించిరి. "జలస్నేహౌషధానాం చ" అను సామాన్యపరిభాష ఇచ్చట నెరుంగునది. దశ మూలవివరణమును స్థలాంతరమున జెప్పబడినది.

### గుడూచ్యాదిఘృతము.

మూ. గుడూచీం పిప్పలీం మూర్వాం హారిద్రాం శ్రేయసీం వచాం,
నిదిగ్ధికాం కాసమర్దం పాఠాం చిత్రకనాగరమ్. 161
జలే చతుర్గుణే పక్త్వా పాదశేషేణ తత్సమం,
సిద్ధం సర్పిః పిబేద్గుల్మశ్వాసార్తిక్షయకాసనుత్. 162
(ఇతి గుడూచ్యాదిఘృతమ్.)

వ్యా. తిప్పతీగె, పిప్పళ్లు, చాగ, పసుపు, సన్నరాష్ట్రము, వస, వాకుడు, కసివెంద, చిరుబొద్ది, చిత్రమూలము, శుంఠి ఈద్రవ్యములను సమభాగములుగ గూర్చి, నాల్గింతలు నీళ్లుపోసి నాల్గవపాలు మిగుల కషాయముకాచి వడగట్టి, యాక్వాథమునకు సమభాగముగ ఆవునేతిని కలిపి, ఘృతపాకవిధిగ పక్వముచేసి, అగ్నిబలాద్యనుసారముగ త్రాగినచో గుల్మంబులును, శ్వాసంబులును, ధాతుక్షయమున కల్గినకాసంబును నివర్తించును.

## కాసమర్దాదిఘృతము.

మూ. కాసమర్దాఽభయాముస్తపాఠాకట్ఫలనాగరైః,
పిప్పలీకటుకాద్రాక్షాకాశ్మర్యసురసైస్తథా. 163
అక్షమాత్రైః ఘృతప్రస్థం క్షీరద్రాక్షారసాఢకే,
పచేత్ శోషజ్వరప్లీహసర్వకాసహరం శివమ్. 164

వ్యా. కసివెంద, కరకకాయలబెరడు, తుంగగడ్డలు, చిరుబొద్ది, కాయఫలము (టేకుకాయలు), శుంఠి, పిప్పళ్లు, కటుకరోహిణి, ద్రాక్షపండు, నేలగుమ్మడి, తులసి వీనిని ప్రత్యేకముగ నొక్కొక కర్షప్రమాణమువంతున గూర్చి కల్కముజేసి యొకప్రస్థపరిమితమైన ఘృతమున జేర్చి, అందు ఆవుపాలు ఒక ఆఢకంబును, ద్రాక్షపండ్లరసము ఒక ఆఢకంబును కలిపి ఘృతపాకవిధిగ పక్వముజేసి సేవించునది. దీనివలన ధాతుశోషంబును, జ్వరంబును, ప్లీహంబును, కాసంబులన్నియు నివర్తించును. ఇది కాసమర్దాదిఘృతము.

## క్షయజకాసమునకు కొన్ని క్షీరయోగములు.

మూ. ధాత్రీఫలైః క్షీరసిద్ధైః సర్పిర్వాఽప్యవచూర్ణితం,
ద్విగుణే దాడిమరసే విపక్వం వ్యోషసంయుతమ్. 165
పిబేదుపరి భక్తస్య యవక్షారఘృతం నరః,
పిప్పలీగుడసిద్ధం వా చ్ఛాగక్షీరయుతం ఘృతమ్. 166

వ్యా. పాలయందు చక్కగ పండిన యుసిరికకాయల నుడికించి యెండించి చూర్ణముజేసి యాచూర్ణమును జేర్చి సిద్ధముచేయబడిన ఘృతమును పానము జేయనగును. ఘృతమునకు రెట్టింతలు దానిమ్మపండ్లరసమును కలిపి త్రికటుకములచూర్ణమును కలిపి పక్వము చేయబడిన ఘృతమును పానము జేయనగును. యవక్షారమును జేర్చి పక్వము జేయబడిన ఘృతమును భుజించినపిదప పానము జేయనగును. పిప్పళ్లను బెల్లమును ఘృతమున జేర్చి ఘృతమునకు నాలుగింతల మేకపాలను కలిపి పక్వముచేయబడిన ఘృతమును పానము చేయునది.

### క్షయజకాసమున ఘృతపానముచే గల్గుగుణము.

మూ. ఏతాన్యగ్నివివృద్ధ్యర్థం సర్పీంషి క్షయకాసినాం,
స్యుర్దోషబద్ధకోష్ఠోరఃస్రోతసాం చ విశుద్ధయే. 167

వ్యా. పైజెప్పబడిన ఘృతములను క్షయకాసరోగికి అగ్నిబలాద్యనుసారముగ త్రాగించినయెడ జాఠరాగ్ని వృద్ధినంది కఫముచే నిరోధింపబడిన కంఠంబును కోష్ఠంబును ఉరఃస్థలంబును స్రోతస్సులును శుద్ధమై కఫనిరోధము లేకయుండును. (కావున నీఘృతములను జఠరాగ్నిబలమును రోగిబలమును గమనించి ఆయాయవస్థానుగుణముగ నుపయోగింపనగును).

### శ్వాసకాసహరహరీతకీలేహము.

మూ. హరీతకీర్యవక్వాథద్వ్యాఢకే వింశతిం పచేత్,
స్విన్నా మృదిత్వా తాస్తస్మిన్ పురాణం గుడషట్పలమ్. 168
దద్యాన్మనశ్శిలాకర్షం కర్షార్ధం చ రసాఞ్జనాత్,
కుడవార్ధం చ పిప్పల్యాః సలేహః శ్వాసకాసనుత్. 169
(ఇతి హరీతకీలేహః.)

వ్యా. యవలను జేర్చి క్వాథము చేయబడిన రెండాఢకములకషాయమున నిరువది కరకకాయల నునిచి వండి యవి చక్కగా నుడికినపిదప వెలికిందీసి మెత్తగ దంచి విత్తుల దూరంబుచ్చి, అందు ఆరుపలములు ప్రాతబెల్లమును ఒకకర్షము మణిశిలను, అర్ధకర్షము రసాంజనమును, అర్ధకుడవము (రెండుపలములు) పిప్పళ్లను, చూర్ణముచేసి కలిపి లేహపక్వముగ జేయనగును. ఈలేహము శ్వాసకాసముల హరించును.

కల్పము—రెండాఢకములపరిమితమగు యవలయందు ఎనిమిదియాఢకములు జలమును జేర్చి నాల్గవపాలు మిగుల కషాయముకాచిన నాకషాయము క్వాథ్యసమమగును. ఆకషాయమును వడగట్టి యందిరువదికరకకాయలు చేర్చి కాయలు మెత్తగ నుడుకునంత వరకు వండి కాయలను పిసికి విత్తనముల దీసి మరల నాకషాయముననే వైచి, పైజెప్పిన ప్రకారము ప్రాతబెల్లమును మనశ్శిలారసాంజనచూర్ణమును చేర్చి లేహపాకవిధిప్రకారము మరల వండవలెను. ఈయోగమును వాగ్భటులు చెప్పిరికాని అందు "ప్రస్థోన్మితే యవక్వాథే వింశతిః విజయాః...పచేద్ధ్యాయ స్సలేహః శ్వాసకాసనుత్." (అ. హృ, చి. అ. 3 శ్లో. ౧౬౭) అని చెప్పిరి. వీరిమతమున యవక్వాథము సిద్ధమైనది ప్రస్థపరిమితమని భేదము కన్పట్టుచున్నది. సర్వాంగసుందరమున "రసాఞ్జనకర్షార్ధందత్వా అస్మిన్ క్వాథే పునః పచేత్" అని యున్నదికావున అన్నిటిని యథోక్తముగ నాకషాయముననే చేర్చి మరల లేహపాకము చేయవలెనని తెలిసెడి

### కాసహరచూర్ణయోగములు.

మూ. శ్వావిధస్సూచయో దగ్ధాః సఘృతక్షౌద్రశర్కరాః,
శ్వాసకాసహరా బర్హిపాదౌ వా క్షౌద్రసర్పిషా. 170
ఏరణ్డపత్రక్షారం వా వ్యోషతైలగుడాన్వితం,
లిహ్యాత్ ఏతేన విధినా సురసైరణ్డపత్రజమ్. 171
ద్రాక్షాపద్మకవార్తాకపిప్పలీః క్షౌద్రసర్పిషా,
లిహ్యాత్ త్ర్యూషణచూర్ణం వా పురాణగుడసర్పిషా. 172

వ్యా. ముండ్లపందియొక్క ముండ్లనైనను, నెమలియీకలకాడలనైనను, నిప్పున కాల్చి బూడిదజేసి అందు మొదటియోగమున నేతిని, తేనెను, చక్కెరను కలిపియు, రెండవయోగమున తేనెను, నేతిని కలిపి సేవించునది. మరియు ఆముదపాకును కాల్చి త్రికటుకములచూర్ణము, ప్రాతబెల్లమును, నూనెను, చేర్చి సేవించునది. ఇత్తెరంగున నే తులసిని ఆముదపాకును చేర్చి క్షారముచేసి యాక్షారము పైజెప్పినరీతిగ త్రికటుకచూర్ణమును నూనెను, బెల్లమును కలిపి సేవించునది. మరియు ద్రాక్షపండు, పద్మకము, (తామర తుత్తులు) వాకుడు, పిప్పళ్లు వీనిని సమభాగములుగ జేర్చి తేనెను ఆవునేతిని కలిపి సేవించునది. లేక త్రికటుకములను చూర్ణముచేసి ప్రాతబెల్లమును నేతిని కలిపి సేవించనగును.

### చిత్రకాదిచూర్ణము.

మూ. చిత్రకం త్రిఫలాజాజీకర్కటాఖ్యా కటుత్రికం,
ద్రాక్షాం చ క్షౌద్రసర్పిర్భ్యాం లిహ్యాద్దద్యాద్గుడేన వా. 173

వ్యా. చిత్రమూలము, కరక-తాని-ఉసిరికకాయలు, జీలకర, కర్కాటకశృఙ్గి, త్రికటుకములు, ద్రాక్షపండు వీనినన్నిటిని సమభాగములుగ గూర్చి తేనెను ఆవునేతిని కలిపియైనను, బెల్లముతో చేర్చియైనను సేవించునది.

### పద్మకాదిలేహము.

మూ. పద్మకం త్రిఫలాం వ్యోషం విడఙ్గం సురదారు చ,
బలాం రాస్నాం చ తుల్యాని సూక్ష్మచూర్ణాని కారయేత్. 174
సర్వైరేభిః సమం చూర్ణైః పృథక్ క్షౌద్రం ఘృతం సితాం,
విమథ్య లేహయేల్లేహం సర్వకాసహరం శివమ్. 175
(ఇతి పద్మకాదిలేహః)

వ్యా. పద్మకము, త్రిఫలములు, త్రికటుకములు, వాయువిడంగములు, దేవదారు, చిట్రాముట్టి, సన్నరాష్ట్రము, వీనినన్నిటిని సమభాగములుగ జేర్చి మెత్తని చూర్ణముగచేసి వస్త్రకళితముచేసి ఈచూర్ణమునకు సమభాగములుగ తేనెను, ఆవునేతిని కలిపి అన్నియు నొకటిగ కలియునట్లు చక్కగ కలిపి లేహమువలె చేయునది. ఈలేహమును బలాను సారముగ సేవించినయెడ కాసముల నన్నిటిని హరించును. (ఇచ్చట తేనె, నెయ్యి, చక్కెర ఈమూడును వేరువేరుగ చూర్ణమునకు సమభాగములై యుండవలయును.)

## కాసహరజీవంత్యాదిచూర్ణము.

మూ. జీవన్తీం మధుకం పాఠాం త్వక్క్షీరీం త్రిఫలాం శటీం,
ముస్తైలే పద్మకం ద్రాక్షాం ద్వే బృహత్యౌ వితున్నకమ్. 176
సారిబాం పౌష్కరం మూలం కర్కటాఖ్యాం రసాఞ్జనం,
పునర్నవాం లోహరజస్త్రాయమాణాం యవానికామ్. 177
భార్గీం తామలకీమృద్ధిం విడఙ్గం ధన్వయాసకం,
క్షారచిత్రకచవ్యామ్లవేతసవ్యోషదారు చ. 178
చూర్ణీకృత్య సమాంశాని లేహయేత్ క్షౌద్రసర్పిషా,
చూర్ణాత్పాణితలం, పఞ్చ కాసానేతత్ వ్యపోహతి. 179

వ్యా. మనుబాల, అతిమధురము, చిరుబొద్ది, వెదురుప్పు, త్రిఫలములు, గంధకచోరములు, తుంగగడ్డలు, ఏలకులు, పద్మకము, ద్రాక్షపండు, ములక, వాకుడు, దనిమూలు, సుగంధపాల, పుష్కరమూలము, కర్కాటకశృంగి, రసాంజనము, తెల్లగలిజేరు, ఇనుపరాపొడి, కానుగ, ఓమము, గంటుభారంగి, నేలయుసిరిక, ఋద్ధి, వాయువిడంగములు, దూలగొండి, యవక్షారము, చిత్రమూలము, చవ్యము, అమ్లవేతసము (పుల్లప్రబ్బలి), త్రికటుకములు, దేవదారుచెక్క వీనినన్నిటిని సమభాగములుగ గూర్చి మెత్తని చూర్ణముచేసి యుంచుకొని అందు పూట కొకకర్ష ప్రమాణమువంతున తేనెను నేతిని కలిపి సేవించునది. దీనివలన పంచకాసములును శమించును.

## కాసహరమరిచాదిచూర్ణము.

మూ. లిహ్యాన్మరిచచూర్ణం వా సఘృతక్షౌద్రశర్కరం,
(సర్వకాసహరం శ్రేష్ఠం లేహం కాసార్దితో నరః). 180
బదరీపత్రకల్కం వా ఘృతభృష్టం ససైన్ధవం,
స్వరభేదే (స్వరోపఘాతే)చ కాసే చ లేహమేతం ప్రయోజయేత్.

వ్యా. మిరియాలచూర్ణమును నెయ్యి, తేనె, పంచదారతో కలిపి సేవించునది. ఇయ్యది శ్రేష్ఠమయిన కాసహరయోగము. శేగుఆకులను కల్కముగ చేసి నేతిలో వేయించి సైంధవలవణమును కలిపి స్వరభేదమునందును కాసమునందును లేహనము చేయునది.

### క్షయజకాసహరయూషములు.

మూ. పత్రకల్కం ఘృతైర్భృష్టం తిల్వకస్య సశర్కరం,
పేయా చోత్కారికా ఛర్దితృట్కాసామాతిసారనుత్. 182

వ్యా. తెల్లలొద్దుగఆకును నూరి కల్కముచేసి నేతిలో పక్వముచేసి అందు చక్కెరను కలిపి సేవించునది. లేక ఆకల్కమును చేర్చి పక్వముచేయబడిన పేయను త్రాగినను లేక పైకల్కముతో చేయబడినకుడుములను తిన్నను, వాంతియు, దప్పియు, కాసములును, ఆమాతిసారమును శమించును.

### క్షయజకాసహరయవాగువు.

మూ. గౌరసర్షపగణ్డీరవిడఙ్గవ్యోషచిత్రకాః,
సాభయాః సాదయేత్తోయే యవాగూం తేన చామ్భసా. 183
ససర్పిర్లవణాం కాసే హిక్కాశ్వాసే సపీనసే,
పాణ్డ్వామయే క్షయే శోథే(షే) కర్ణశూలే చ దాపయేత్. 184

వ్యా. తెల్లావాలు, ఏరువంగ, వాయువిడంగములు, త్రికటుకములు, చిత్రమూలము, కరక్కాయబెరడు వీనినన్నిటిని సమభాగములుగకూర్చి క్వాథముచేసి యానీళ్లయందు యవాగువును (గంజిని) సిద్ధముచేసి నేతిని, ఉప్పును మితముగ చేర్చి ఈ యవాగువును కాసము, హిక్కాశ్వాసము, పీనసము, పాండురోగము, క్షయము, శోధము, కర్ణశూలము అను నీరోగములయందు త్రాగింపనగును.

### కంటకార్యాది సిద్ధయూషము.

మూ. కణ్టకారీరసే సిద్ధో ముద్గయూషః సుసంస్కృతః,
సగౌరామలకః సామ్లః సర్వకాసభిషగ్జితమ్. 185

వ్యా. వాకుడుకషాయమున పెసలపప్పు చేర్చి యూషముగ సిద్ధముచేసి అందు పంచయుసిరికకాయలను, పుల్లదానిమ్మ మొదలగువానిరసమును చేర్చి సైంధవలవణము, ఇంగువ మొదలగుద్రవ్యములను సంస్కరించి త్రాగినయెడ నియ్యది కాసములన్నిటికిని ముఖ్యమయిన యౌషధమగును.

### క్షీరాదులు.

మూ. వాతఘ్నౌషధనిష్క్వాథం క్షీరం యూషాన్ రసానపి,
వైష్కిరప్రతుదాన్ బైలాన్ దాపయేత్ క్షయకాసినే. 186

వ్యా. వాతహరములగు నౌషధముల చేర్చి పక్వముచేయబడిన క్వాథంబును, పాలును, యూషంబులును, మాంసరసంబులును, క్షయజకాసమున నుపయోగింపదగును. మరియు విష్కిరములు (కోడి మున్నగుజంతువులు), ప్రతుదములు (ముక్కుతో పొడిచి యాహారమును తినుపక్షులు), బైలములు (బిలములలోనుండు ఉడుము మొదలగుజంతువులు), వీనిమాంసములచేత సిద్ధమయిన మాంసరసములను క్షయకాసరోగికి నుపయోగింపదగును.

### ధూమపానములు.

మూ. క్షతకాసే చ యే ధూమాః సానుపానాః నిదర్శితాః,
క్షయకాసేఽపి తానేవ యథావస్థం ప్రయోజయేత్. 187

వ్యా. క్షతజకాసచికిత్సమున "ద్వే మేధే మధుకం ద్వే చ" అని యుపక్రమించి ధూమపానయోగములును, వానికి నిర్దేశింపబడిన యనుపానములును క్షయజకాసమున కూడ ఆయాయవస్థానుసారముగ నుపయోగించునది.

### క్షయజకాసమున దీపనాద్యుపయోగావస్థ.

మూ. దీపనం బృంహణం చైవ స్రోతసాం చ విశోధనం,
వ్యత్యాసాత్ క్షయకాసిభ్యో బల్యం సర్వం హితం భవేత్. 188

వ్యా. క్షయజకాసరోగముచే పీడితులకు దీపనము, బృంహణము స్రోతోవిశోధనమును నగు మూడువిధములయిన చికిత్సలను వ్యత్యాసము (నొకటిని మార్చి మరియొకదానిని) నుపయోగించుట చాల ముఖ్యము. మరియు బలకరంబును హితంబునైన ఔషధాన్నపానములన్నియుః హితముగ నుండును. (కావున రోగియొక్క బలాబలము చక్కగ గమనించి బలమునకు హాని కలుగనీయక పైజెప్పిన బృంహణాదులను ఆయాయవస్థకు దగునట్లు సమయోచితముగ మార్చుచు చికిత్సజేయవలయునని ముఖ్యభావము.)

### కాసములలో బలతారతమ్యములు.

మూ. సన్నిపాతభవోఽప్యేష క్షయకాసః సుదారుణః,
సన్నిపాతహితం తస్మాత్ సదా కార్యం భిషగ్జితమ్. 189

దోషానుబద్ధయోగాచ్చ హరేద్రోగబలాబలం,
కాసేష్వేషు గరీయాంసం జానీయాదుత్తరోత్తరమ్. 190

వ్యా. ఈక్షయజకాసము త్రిదోషముల సన్నిపాతముచే కల్గును; కావున నియ్యది క్రూరమయినది. దానంజేసి త్రిదోషసన్నిపాతమునకు హితమగుచికిత్సను ఎప్పుడును చేయదగును. అట్టి త్రిదోషములలో అనుబంధానుబంధ్యముల చక్కగ గమనించి తత్తదనుకూలముగ రోగబలాబలమును అనుసరించి చికిత్సజేయుచు రోగమును శమింపజేయవలయును. మరియు పైజెప్పిన కాసభేదము లైదిటిలో నుత్తరోత్తరము నొకదానికన్న నొకటి బలవత్తరమైనదని యెరుంగునది.

కాససామాన్యముగ చికిత్సాసంగ్రహము.

మూ. భోజ్యం పానాని సర్పింషి లేహాశ్చ సహపానకైః(పాచనకాని చ),
క్షీరం సర్పిర్గుడాః ధూమాః కాసభైషజ్యసఙ్గ్రహః 191

వ్యా. భోజ్యములు (భుజింపదగిన యాహారములు), పానములు, (యూషాది పానయోగ్యద్రవములు), ఘృతములు, లేహములు, పానకములు, (పాచనములు, క్షీరము, సర్పిర్గుడములు, ధూమపానములు ఇవియన్నియు కాసరోగమున చెప్పబడిన భైషజ్యములు. ఇది కాసరోగచికిత్సాసంగ్రహము.

(మరియు వాగ్భటాచార్యులు:—"కాస-శ్వాస-క్షయ-చ్ఛర్ది-హిధ్మాశ్చాన్యోన్యభేషజైః" (అ. హృ. చి. అ. ౪. శ్లో. ౫౯) అని చెప్పిరి. కావున కాసము, శ్వాసము, క్షయము, ఛర్ది, ఎక్కిళ్లు, అను నీవ్యాధులకు జెప్పిన చికిత్సలను ఒకదానిచికిత్సల నింకొకదానికి సమయోచితముగ మార్చుకొనవచ్చునని తెలిసెడి.)

అధ్యాయవిషయసంగ్రహము.

తత్ర శ్లోకః.—
మూ. సంఖ్యా, నిమిత్తం, రూపాణి, సాధ్యాసాధ్యత్వమేవ చ,
కాసానాం భేషజం ప్రోక్తం గరీయస్త్వఞ్చ కాసినః. 192

వ్యా. కాసరోగముయొక్క సంఖ్యాభేదములు, అవి జనించుకారణములు, వాని స్వరూపలక్షణములు, సాధ్యాసాధ్యభేదములు, వానికి చేయదగిన యౌషధములు, పంచవిధకాసములలో తారతమ్యభేదము, ఇవియన్నియు కాసచికిత్సమను నీయధ్యాయమున వివరింపబడినవి.

ఇత్యగ్నివేశకృతే తన్త్రే చరకప్రతిసంస్కృతే, దృఢబలసంపూరితే, చికిత్సాస్థానే, కాసచికిత్సితం నామ అష్టాదశోఽధ్యాయః.

ఇత్తెరంగున అగ్నివేశకృతంబును చరకప్రతిసంస్కృతంబు నగు చరకసంహితమను నాయుర్వేదతంత్రమున చికిత్సాస్థానమునందలి దృఢబలసంపూరితభాగమున కాసచికిత్స మనునది పదునెనిమిదవయధ్యాయము సంపూర్ణము.

---

## ఏకోనవింశాధ్యాయము.

అవతరణిక:—జాఠరాగ్ని మందగించుటచే గ్రహణీదోషము కల్గును. అతిసారంబును జాఠరాగ్నిమాంద్యమే కారణముగ జేసి సంభవించును. కావున గ్రహణీచికిత్సానంతరము జెప్పదగియున్నను, గ్రహణీ చికిత్సానంతరమున తీక్ష్ణాగ్నినిరూపణమున దానికి పిత్తప్రాధాన్యము జెప్పబడినది; అట్టిపిత్తప్రాధాన్యప్రస్తావవశమునంజేసి పిత్తప్రధానమైన పాండురోగచికిత్సితంబును, తదనుబంధముగ హిక్కా-శ్వాసాది చికిత్సితములును చెప్పబడినవి. పిదప నగ్నిమాంద్యరూపకారణ సాజాత్యమునంజేసి క్రమప్రాప్తమైన యతిసారచికిత్సితము నిరూపింపబడును. (ఈయధ్యాయము చరకప్రతిసంస్కృతము)

మూ. అథాతోఽతిసారచికిత్సితం వ్యాఖ్యాస్యామః. 1

ఇతి హ స్మాహ భగవానాత్రేయః. 2

వ్యా. కాసచికిత్సితమును జెప్పినపిదప నతిసారచికిత్సితము భగవానుడగు నాత్రేయు లుపదేశించినదానికన్న న్యూనాతిరేకము గాకుండునట్లు వివరింపబడును.

అతీసారము నుద్దేశించి యగ్నివేశుని ప్రశ్నము.

మూ. భగవన్తం ఖల్వాత్రేయం. కృతాహ్నికం, హుతాగ్నిహోత్రం, ఆసీనమృషిగణపరివృతం, ఉత్తరే హిమవతః పార్శ్వే వినయాదుపేత్య అభివాద్య చ అగ్నివేశః ఉవాచ.— భగవన్! అతీసారస్య ప్రాగుత్పత్తి-నిమిత్త-లక్షణోపశమాని ప్రజానుగ్రహార్థమాఖ్యాతుమర్హసీతి. 3

వ్యా. హిమాలయమునం దుత్తరభాగమున భగవత్స్వరూపుడును త్రికాలజ్ఞానవంతుడును నగు నాత్రేయులు (ఒకసమయమున) జపతపాద్యాహ్నికకృత్యముల నెరవేర్చి, అగ్నుల విధ్యుక్తప్రకారము వేల్చి, ఋషిగణపరివృతుడై సుఖముగ గూర్చునియుండ

నామునివర్యుని శిష్యుడగునగ్నివేశులు మిక్కిలి వినయముతో దగ్గఱ యభివాదనమొనర్చి యిట్లడిగెను:—త్రికాలజ్ఞానవేత్తలగు నోగురువర్యా! అతిసారముయొక్క ప్రాగుత్పత్తి క్రమమును, దానియుత్పత్తికారణమును, లక్షణములను అయ్యది శమించుటకు దగిన చికిత్సితమును, లోకమునందలి ప్రజల ననుగ్రహించుటకై యానతిండని యాత్రేయుల నడిగెను.

## అతీసారమునకు ప్రాగుత్పత్తినిరూపణము.

మూ. అథ భగవాన్ పునర్వసురాత్రేయః తదగ్నివేశవచనమనునిశమ్య, ఉవాచ.—శ్రూయతామగ్నివేశ! సర్వమేతదఖిలేన వ్యాఖ్యాయమానమ్.— ఆదికాలే ఖలు యజ్ఞేషు పశవః సమాలభనీయాః బభూవుర్నాలమ్భాయ ప్రక్రియన్తేస్మ. తతో దక్షయజ్ఞం ప్రత్యవరకాలం మనోః పుత్రాణాం నరిష్యన్నాభాగేక్ష్వాకునృగశర్యాత్యాదీనాం క్రతుషు పశూనామేవాఽభ్యనుజ్ఞానాత్ పశవః ప్రోక్షణమవాపుః. అతశ్చ ప్రత్యవరకాలం వృషఘ్రేణ దీర్ఘసత్రేణ యజతా పశూనామలాభాత్ గవామాలమ్భః ప్రవర్తితః. తం దృష్ట్వా ప్రవ్యథితా భూతగణాః; తేషాం చోపయోగాత్ ఉపాకృతానాం గవాం గౌరవాత్ ఔష్ణ్యాత్ అసాత్మ్యత్వాత్ అశస్తోపయోగాచ్చ ఉపహతాగ్నీనాం, ఉపహతమనసాం చ అతీసారః పూర్వముత్పన్నః వృషఘ్రయజ్ఞే. 4

వ్యా. పిమ్మట భగవానుడగునాత్రేయుడు అగ్నివేశునివచనమును విని యోయగ్నివేశా! నీవు అతిసారము నుద్దేశించి యడిగినవిషయముల నన్నిటిని వివరించి చెప్పెద వినుమని యిట్లు చెప్పందొడంగెను:—

చిరకాలమునకు పూర్వము (కృతయుగమున) ప్రాచీనులు యాగముల జేయు నప్పుడు యజ్ఞసంబంధములైనపశువులను (యజ్ఞార్థమైనఛాగములు మున్నగువానిని) యూపమునకు కట్టి ప్రోక్షణమును మాత్రముచేసి వదలివేయుచుండిరికాని వానిహోమమునకైన హవిస్సును గ్రహించుటకై వానిచంపుటలేదు. ఇట్లు జరుగుచుండ కొంతకాలమునకు దక్షయాగము జరిగిన కొలదికాలమునకు పిమ్మట మనువుకుమారులైన నరిష్యంతుడు, నాభాగుడు, ఇక్ష్వాకువు, నృగుడు, శర్యాతి, మున్నగురాజవరులు క్రతువుల జేయుంతరి యజ్ఞీయపశువుల(ఛాగముల)ను యూపమున గట్టి జలముచే ప్రోక్షించి

(అంతట వానిని విడువక) వేదములయందు "యజ్ఞములయందు హోమార్థముగ పశువుల హింసించుట దోషావహము కాదు" అను వేదప్రమాణవచనానుజ్ఞనొంది హోమార్థమై పశువుల హింసించుచుండిరి. పిమ్మట కొంతకాలమునకు పృషధ్రుడను రాజర్షి చిరకాలమునకు పూర్తికాగల (దీర్ఘసత్రమును) యాగమును జేయదొడంగి, అత్తరి యాగమునకు వలసినపశువులు (ఛాగములు)దొరకమింజేసి గోవులను పశువుగ గ్రహించి వానిని వేద విధ్యుక్తముగ సంజ్ఞపనము (సంహారము) చేసి యాగమును సాగించుచుండెను. అట్టి గోసంహారము మిగుల క్రూరకృత్యమని భూతగణంబులు తలంచి మనస్సున గుందుచు దుఃఖింపసాగెను.

అత్తెరంగున నుపాకరణముచేసి యజ్ఞమునకై సంహరింపబడిన గోవులమాంసము నుపయోగించి భూతగణములు గోమాంసమునందలి గురుత్వము ఉష్ణము అనుగుణముల వలనను, అట్టిగోమాంసము అలవాటున లేమింజేసియు, దానియుపయోగము అప్రశస్తమగుటంజేసియు, (ఈకారణముల నాల్గిటివలన) జఠరాగ్నిబలంబును మనశ్శక్తియు నశించి అక్కాలమున నతిసారము కల్గెను.

ఇచ్చట నీవిషయము నెరుంగునది:—"న హింస్యాత్సర్వాణి భూతాని" అనువిధి వాక్యముచేత జీవహింస నిషిద్ధమైనను యాగముల హోమార్థమైచేయు పశుహింస దోషావహము కాదనియు, అట్టియాగములవలన ననంతపుణ్యమును లోకోపకారంబును కల్గుననియు వేదములు పలువిధముల నుద్ఘోషించుచున్నవి. ఇంతియేకాక అట్టియాగముల యందు హవిష్యమునకై సంజ్ఞపనము చేయబడుపశువులపరంపరకు నుత్తమలోకములు సంప్రాప్తములగునని వేదములయం దిట్లు శాసింపబడినది:—"దైవ్యాశ్శమితారఆరభధ్వం ...అన్వేనంమాతామన్యంతాఉనుపితాఉను భ్రాతాఉనుసఖాసయూథ్యః. ఉదీచీనాం అస్య పదో నిధత్తాత్, సూర్యం చక్షుర్గమయతాత్, అన్తరిక్షమసుం, దిశశ్శ్రోత్రం, పృథివీం శరీరం" ఇట్టి వేదప్రమాణవచనములచే యాగములయందు పశుహననము దోషావహము కాదని తెలియుటయెగాక తుదకు యాగకర్తకును, యజ్ఞీయపశువులకును ఉత్తమగతి కల్గునని తెలియుచున్నది. కావున నిచ్చట మనుపుత్రుల యాగవిధానమున పశుహింస దుష్టమని యెంచదగదు. ఈవిషయమై చాల విమర్శింపవలసియున్నను అప్రస్తుతాంశ మగుటచే సూచనామాత్రముగ జూపబడినది.

ఈప్రాగుత్పత్తినిరూపణముచేత గుర్వాదిపదార్థముల భుజించుటయు, ఉష్ణ-అసాత్మ్య-అశస్తభోజనంబును దుఃఖ-ఉద్వేగాదులచే మనస్సునకుపఘాతము కల్గుటయు జాఠరాగ్నినాశమునకు కారణములై తత్కాలముగ నతీసారహేతువులగునని తెలుపబడినది.

ఈవిషయము "తేషాం చోపయోగాత్......ఉపహతమనసాం చాతీసారః పూర్వ ముత్పన్నః" అనువాక్యముచే సూచింపబడినది. (అతీసారసంఖ్యాభేదము అష్టోదరీయా ధ్యాయమున "షడతీసారా ఇతి—వాత-పిత్త-కఫ-సన్నిపాత-భయ-శోకజాః" (సూ. అ. ౧౯. సూ. ౧౧) అని నిర్దేశించబడినదిగావున నిచ్చట జెప్పబడదు).

## వాతికాఽతిసారనిదాన-సంప్రాప్తులు.

మూ. అథాఽవరకాలం వాతలస్య వాతాతపవ్యాయామాఽతిమాత్ర నిషేవిణః, రూక్షాఽల్పప్రమితాఽశినః, తీక్ష్ణ-మద్య-వ్యవాయనిత్య స్య ఉదావర్తయతశ్చ వేగాన్, వాయుః ప్రకోపమాపద్యతే పక్తా చోపహన్యతే, స వాయుః కుపితోఽగ్నావుపహతే, మూత్రస్వేదౌ పురీషాశయముపహృత్య, తాభ్యాం పురీషం ద్రవీకృత్య, అతీ సారాయ ప్రకల్పతే. 5

వ్యా. వాతప్రకృతికలమనుజుడు గాలిని ఎండను వ్యాయామమును అధికముగ సేవించినను; రూక్షములగు నన్నపానముల సేవించినను, తాను భుజించుపరిమితికన్న తక్కువగ భుజించినను, భోజనమునకు విధింపబడినకాలము నతిక్రమించి భుజించినను, మిక్కిలి తీక్ష్ణములగుమద్యముల నిరంతరము సేవించినను, అధికముగ స్త్రీసంభోగము చేసి నను, మలమూత్రాదివేగముల నధికముగ బలాత్కారముచేసి ప్రేరేపించినను, (ఇట్టికారణ ములచే) వాతము ప్రకోపించును. జాఠరాగ్ని మందగించును. ఇత్తెరంగున ప్రకోపము నొంది వాతము జాఠరాఽనలము మందగించియున్నపుడు శరీరమునందలి మూత్రమును చెమటను పురీషాశయమున (పక్వాశయమున) జేర్చి యారెండుద్రవముల సంబంధముచే పురీషమును ద్రవముగజేసి, అతిసారమును కల్గించును. (ఇచ్చట "వాతలస్య" అని చెప్పుటచేత వాతప్రకృతికలవాడు, వాతమును వృద్ధినందించు వాతాతపాదిసేవనము చేసి నచో వాతము మిగుల ప్రకోపమునొంది అతిసారమును కల్గించుసామర్థ్యము అధికముగ గల్గియుండునని యర్థము. కావున పిత్త-కఫప్రకృతులకు కూడ వాతాతపాదికారణ ములచే వాతము ప్రకోపమునొంది పైజెప్పినరీతిగ నతిసారమును కల్గించునని యెరుంగు నది. ఇత్తెరంగుననే పిత్తప్రకృతికలవారికి క్రింద జెప్పబడుకారణములచే పిత్తము ప్రకో పించి అతిసారమును కల్గించుటకు బలవత్తరముగ నుండుననియు,కఫప్రకృతులకు కఫంబును బలవత్తరముగ నుండుననియు నెరుంగునది. ప్రకృతి యేదియైనను వాతపిత్తకారణములకు వేరువేరుగ జెప్పినకారణములచే వాతాద్యతిసారములు జనించుననియు; ఆయాప్రకృతి కలవారికి ఆయాదోషమునగల్గు నతిసారమును కల్గింపసామర్థ్యమెక్కుడుగ నుండుననియు ముఖ్యభావము.)

### వాతికాతిసారరూపములు, అందు వాతిక-ఆమాతిసారలక్షణములు.

మూ. తస్య రూపాణి.— విజ్జల (విడ్ జల) విప్లుతమవసాది రూక్షం ద్రవం సశూలమామగన్ధమీషచ్ఛబ్దమశబ్దం వా విబద్ధమూత్రవాతమతిసార్యతే పురీషమ్; వాయుశ్చాన్తః కోష్ఠే సశబ్దశూలస్తిర్యక్చరతి విబద్ధ ఇత్యామోఽతిసారో వాతాత్. 6

వ్యా. వాతాతిసారమున పురీషము పక్వముకాని ద్రవముతో గూడి వ్యాపించు స్వభావము కల్గినదియు, పుడమింబడినపుడు భూమియందే యిమిడి లీనమగునదియు, జిడ్డు లేక రూక్షంబును, ద్రవంబును, శూల(నొప్పి)తోకూడినదియు, ఆమమైనదుర్గంధము కల్గినదియునై కొంచెము శబ్దముకల్గియైనను, శబ్దము లేకయైనను, మూత్రమును అపానవాతమును బద్ధగించి యధికముగ వెడలును. అట్టియెడ వాతము గడబిడశబ్దముతో గూడి నొప్పిని కల్గించుచు బైటవెడలక బద్ధగించి కోష్ఠములోభాగముననే యడ్డముగ నిటునటు సంచరించుచుండును. ఇవి వాతమువలన గల్గిన యామాతిసారలక్షణములు.

### పక్వవాతాతిసారలక్షణములు.

మూ. పక్వం వావిబద్ధమల్పాఽల్పం సశబ్దం సశూలఫేనపిచ్ఛాపరికర్తికం, హృష్టరోమా వినిశ్వసన్ శుష్కముఖః కట్యూరుత్రికజానుపృష్ఠపార్శ్వశూలీ భ్రష్టగుదో ముహుర్ముహుర్విగ్రథితముపవేశ్యతే, పురీషం వాతాత్; తమాహురనుగ్రథిక (త) మిత్యేకే వాతాఽనుగ్రథితవర్చస్త్వాత్. 7

వ్యా. మరియు వాతాతిసారమున మలము పక్వమై వెడలునెడ నురుగు జిగురును కల్గి, గుదస్థానమున రంపముతో కోసినవిధముగ బాధయు నొప్పియుకల్గి శబ్దముతోగూడి మిగుల కొంచెము కొంచెముగ బద్ధగించి వెడలును. అట్టియెడ రోగిమేన గగురుపొడిచి బుసకొట్టుచు ద్రవములేక నోరెండి, నడుము తొడలు నడుమునకు క్రిందిసంధిభాగము, మోకాలికి క్రిందిభాగము వీపు ఇరుప్రక్కలు ఈస్థలములయందు నొప్పికల్గి గుదము స్వస్థానమును వదలి జారి బాధపడుచు వాతనుచే నుండలుగ భేదింపబడిన మలమును పైజెప్పినలక్షణములతోగూడి మాటిమాటికిని వెడలించును. ఇది పక్వమైన యామాతిసారలక్షణము. దీనిని వాతముచే ఘనీభవించి యుండలుగనుండు మలము వెడలుటంజేసి అనుగ్రథితమనియు కొందరు చెప్పెదరు.

### పిత్తాఽతిసారనిదానము.

మూ. పిత్తలస్య పునః అమ్లలవణకటుకక్షారోష్ణ తీక్ష్ణాఽతిమాత్రనిషేవిణః, ప్రతప్తాఽగ్ని సూర్యసన్తాపోష్ణమారుతోపహత గాత్రస్య, క్రోధేర్ష్యాబహుళస్య, పిత్తం ప్రకోపమాపద్యతే, తత్రప్రకుపితం ద్రవత్వాదూష్మాణముపహత్య పురీషాశయవిసృతం ఔష్ణ్యాత్ ద్రవత్వాత్ సరత్వాచ్చ భిత్త్వా పురీషం అతిసారాయ ప్రకల్పతే 8

వ్యా. పిత్తప్రకృతికలమనుజుడు పులుపు-ఉప్పు-కారము అనురసములు కలపదార్థములనైనను క్షారములనైనను, ఉష్ణతీక్ష్ణగుణంబులనైనను, మితిమీరి సేవించినను; నిప్పుయొక్కయు సూర్యునియొక్కయు సంతాపము చేతను వేడిగాలితాకుడుచేతను శరీరమునకధికముగ స్పర్శము కల్గియున్నను మితిమీరినకోపంబును ఈర్ష్యయు (సోకోర్వమి) నధికముగకల్గియున్నను, అట్టివానికి పిత్తము అధికముగ ప్రకోపమునొందును; ప్రకుపితమైనయాపిత్తము తనయందలి ద్రవగుణముచేత శరీరమునందలి జాఠరాగ్నిరూపమైనయుష్ణమును చల్లార్చి, పురీషాశయమున జేరి, తనయందలి ఉష్ణము ద్రవము సరము (సంచారస్వభావము) అనుగుణములచేత పురీషమును భేదించి ద్రవీభూతముగజేసి బైటవెడలింపజేయుచు నతిసారమును కల్గింప సమర్థుడగును. (ఇచ్చట పిత్తము అగ్నికి సమానగుణముగనుండుటచే జాఠరాగ్నిని వృద్ధినొందించవలసియున్నను,తనయందలి ద్రవభావముచే నగ్నినాశకమగునని "ద్రవత్వాత్ ఊష్మాణముపహత్య" అని సహేతుకముగ జెప్పబడినది.)

### పిత్తాఽతిసారలక్షణములు.

మూ. తస్య రూపాణి—హారిద్రం హారితం, నీలం, కృష్ణం, రక్తపిత్తోపహితం, అతిదుర్గన్ధమతిసార్యతే పురీషమ్. తృష్ణాదాహస్వేదమూర్ఛాశూలబ్రధ్నసంతాపపాకపరీతః, ఇతి పిత్తాతిసారః 9

వ్యా. పిత్తప్రకోపమునగల్గిన యతిసారమున పసుపురంగు, ఆకుపచ్చనిరంగు, నీల-కృష్ణవర్ణములు, వీనిలోనొకరంగుకల్గి, పిత్తపసరుతో కలిసిన రక్తముతోకూడి, మిక్కిలి దుర్గంధమైనపురీషము పలుమారు వెడలును. అట్టియెడ రోగి దప్పి, మంట, చెమట, మూర్ఛ, నొప్పి, గుదస్థానమునమంట, అనునీయుపద్రవములతో బాధపడుచుండును. గుదకాండమున పుండగును. ఈలక్షణములుకల్గినది పిత్తాతిసారమని యెరుంగునది.

### శ్లేష్మాఽతిసారనిదానము.

మూ. శ్లేష్మలస్య తు గురుమధురశీతస్నిగ్ధోపసేవినః, సమ్పూరకస్య, అచిన్తయతః, దివాస్వప్నపరస్య అలసస్య, శ్లేష్మా ప్రకోపమాపద్యతే,

సస్వభావాత్ గురుమధురశీతస్నిగ్ధః ప్రస్తోఽగ్నిముపహత్య సౌమ్య స్వభావాత్ పురీషాశయముపహత్యోపక్లేద్య పురీషం అతి సారాయ కల్పతే. 10

వ్యా. శ్లేష్మప్రకృతికలవాడు గురుగుణంబును మధురరసంబును శీతవీర్యంబును స్నిగ్ధంబునైన యాహారముల నధికముగ సేవించినను, ఇంచుకైనను కొరంతలేక మిక్కుటముగ భుజించుఅలవాటు కల్గియున్నను, అట్టిభోజనముచేసియు చింతనరూపమైన మనోవ్యాపారములేక, పగటియందు నిద్రబోవుచున్నను, ఏవిధమైన వ్యాయామములేక అలసుడై యున్నను, అట్టికారణములచేత శ్లేష్మము ప్రకోపము నొందును. ప్రకుపితమైన యాశ్లేష్మము తనకు స్వాభావికములైన గురుమధురశీతస్నిగ్ధగుణములు పైజెప్పిన గురుమధురాద్యాహారములచే మరింత బలిష్ఠములైయుండ, అగ్నికివిరుద్ధమై తనకు స్వభావసిద్ధమైన సౌమ్యస్వభావమువలన జాఠరాగ్నిని చల్లార్చి, పురీషాశయమునజేరి పురీషమును ద్రవముగజేసి యతిసారమును కల్గించును. (ఇచ్చట "పురీషాశయం ఉపహత్య" అను చోట "హన హింసాగత్యోః" అనుగత్యర్థకమైన హనధాతువునకు ల్యబంతమున 'ఉపహత్య' అని రూపముకావున పురీషాశయమునకు పోయి అనునర్థము సంగతము.)

### శ్లేష్మాతిసారలక్షణములు.

మూ॥ తస్య రూపాణి —స్నిగ్ధం, శ్వేతం, పిచ్ఛిలం, తన్తుమదామం, గురు, దుర్గన్ధం, శ్లేష్మోపహితం, అనుబద్ధశూలమల్పాల్పం, అభీక్ష్ణమతిసార్యతే సప్రవాహికమ్ గురూదరగుదవస్తి వంక్షణదేశః, కృతేఽప్యకృతసంజ్ఞః, సలోమహర్షః సోత్క్లేశో నిద్రాలస్యపరీతః, సదనోఽన్న ద్వేషీ చేతి శ్లేష్మాఽతిసారః. 11

వ్యా. శ్లేష్మప్రకోపమున గల్గిన యతిసారమున స్నిగ్ధంబును శ్వేతవర్ణంబును పిచ్ఛిలంబును (జిగురుగను), తీగెలుసాగునదియు, పక్వముకానిదియు, భారముకల్గినదియు, దుర్గంధభూయిష్ఠంబును, కఫముతోకూడినదియునగు పురీషము శూలముతోగూడి కొంచెము కొంచెముగ మాటిమాటికి వెడలును. మలము వెడలునపుడెల్ల విశేషముగ ముక్కవలసి యుండును. అట్టియెడ రోగి కుదరంబును గుదంబును వస్తియు (మూత్రాశయంబు)ను, గెజ్జలును, (ఈప్రదేశములు) మిక్కిలి బరువుగనుండును. మలము తనంతట వెడలినను దాని నెరుంగకుండును (వానికి తెలియకయే తనంతట మలప్రవృత్తియగుచుండునని భావము). రోమహర్షము కల్గును. ఓకరింతలు కల్గును. నిదురకల్గి పనులయందుత్సాహములేకుండును,

అగ్ని చాల మందగించును. అన్నమున ద్వేషబుద్ధికల్గును. ఈలక్షణములు కల్గినది శ్లేష్మాతిసారమని యెరుంగునది.

ఇచ్చట నీవిషయము నెరుంగునది:—వాతాతిసారమునందుమాత్రము ఆమలక్షణములు వేరుగ జెప్పబడినది; పిత్త-కఫాతిసారములకు మాత్రము అట్టి ఆమలక్షణముల వేరుగ జెప్పియుండలేదు. ఐనను వాతాతిసారమునకు జెప్పినవిడ్జలత్వాది ఆమలక్షణములనే పిత్తకఫములయందు నూహించునది. క్షారపాణితంత్రమునను ఈవిషయమునే యిట్లు చెప్పిరి.—"వాతాఽతిసారస్సామశ్చ సశూలః ఫేనిలస్తనుః, శ్యావస్సశబ్దో దుర్గన్ధః విబద్ధోఽల్పాల్పఏవ చ, ఏవం పిత్తకఫే సామమతీసారం వినిర్దిశేత్" ఈవాక్యమున వాతాతిసారమునకు ఆమలక్షణముల జెప్పి, ఆలక్షణములే పిత్తకఫములకును అతిదేశింపబడినవి. ఈయుద్దేశముచేతనే ప్రకృతతంత్రకారులును ప్రత్యేకముగ జెప్పక వదలిన ట్లూహింపదగియున్నది.

## సాన్నిపాతికాఽతిసారనిదానము.

మూ. అతిశీతస్నిగ్ధరూక్షోష్ణగురుఖరకఠిన విషమవిరుద్ధాఽసాత్మ్యభోజనాత్, అభోజనాత్, కాలాఽతీతభోజనాత్, యత్కిఞ్చిదభ్యవహరణాత్, ప్రదుష్టమద్యపానీయపానాత్, అతిమద్యపానాత్, అసంశోధనాత్, ప్రతికర్మణాం విషమగమనాత్, అనుపచారాత్, జ్వలనాదిత్యపవనసలిలాఽతిసేవనాత్, అస్వప్నాత్, అతిస్వప్నాత్, వేగవిధారణాత్, ఋతువిపర్యయాత్, అయథాబలమారమ్భాత్, భయశోకచిత్తోద్వేగాతియోగాత్, కృమిశోషజ్వరాఽర్శోవికారాతికర్షణాద్వా వ్యాపన్నాఽగ్నేః త్రయో దోషాః ప్రకుపితాః భూయ ఏవాఽగ్నిముపహత్య, పక్వాఽఽశయమనుప్రవిశ్య, అతీసారం సర్వదోషలిఙ్గం జనయన్తి. 12

వ్యా. శీతవీర్యమును, స్నిగ్ధ-రూక్ష-ఉష్ణ-గురు-కఠినగుణంబులును కలపదార్థముల నధికముగ భుజించుట, విషమముగ భుజించుట, పరస్పరసంయోగాదులచే విరుద్ధములగు క్షీరమత్స్యాదుల నొకటిగ జేర్చి భుజించుట, దేశదోషాదులకును శరీరతత్త్వమునకును సాత్మ్యములుకానియాహారముల భుజించుట, ఆహారమును భుజించక యుపవాసముండుట, భోజనమునకు నియమితమైనకాలము నతిక్రమించి భుజించుట, పథ్యాపథ్యముల గలిపి భుజించుట, ఇట్టి యాహారముల జేసినను; చెడినమద్యమును జలమును త్రాగినను, మద్యము

మితిమీరిత్రాగినను, వమనవిరేచనాదులచే నియమితప్రకారము ఆయాసమయములయందు శోధనము చేసికొనకయున్నను, శోధనాదిపంచకర్మములను విధ్యుక్తమునకు విరుద్ధముగ నాచరించుట, అట్టిపంచకర్మముల జేసికొనినప్పుడు ఆహారాద్యుపచారములను విధ్యుక్త ప్రకారము చేయకున్నను, నిప్పుసెగ ఎండ గాలి జలము వీనిస్పర్శ మధికముగకల్గియుండి నను, రాత్రిపూట నిదురమేల్కొంచినను,అధికముగ నిద్రపోయినను, మలమూత్రాదివేగ ముల నిరోధించినను, ఆయాఋతువులయందుండవలసిన శీతోష్ణాదిఋతుధర్మములు మారి యున్నను, (లేక ఆయాఋతువులకు నియమింపబడిన యాహారవిహారాదుల వ్యత్యస్త ముగ జేసినను,) తనబలమునకు మిక్కుటమైన (సాహస) కృత్యముల జేసినను, భయంబును దుఃఖంబును చిత్తోద్రేకంబును అధికముగ కల్గినను, క్రిమిరోగము శోషజ్వరము అర్శో రోగము అనునీవ్యాధులచే శరీరము మిక్కిలి కృశించినను, ఈకారణములచేత జాఠరాగ్ని మందగించి దానిమూలముగ వాతాదిదోషములు మూడును ప్రకోపమునొంది, జాఠ రాగ్నిని బొత్తుగచెరిచి, పక్వాశయమున జేరి, మూడుదోషములచే గల్గినయతిసారములకు వేరువేరుగ జెప్పబడినలక్షణములన్నిటితో కూడినయతిసారమును కల్గించును. (ఇచ్చట పైజెప్పబడిన దోషప్రకోపణశీతాతిసేవనాది కారణములలో నాయాదోషప్రకోపకార ణములచే నాయాదోషములు యథాసంభవముగ ప్రకోపము నొంది అతిసారకారణము లగునని యెరుంగునది.)

### సన్నిపాతాతిసారవిశేషలక్షణములు, కృచ్ఛ్రసాధ్యత్వము.

మూ. అపి చ శోణితాదీన్ ధాతూనతిప్రకృష్టం (అతిప్రదుష్టాన్) దూష
యన్తో ధాతుదోషస్వభావకృతానతీసారవర్ణానుపదర్శయన్తి.—
తత్ర శోణితాదిషు ధాతుష్వతిప్రవృద్ధేషు హారిద్రహారితనీలమా
ఞ్జిష్ఠమాంసధావనసన్నికాశం రక్తం కృష్ణం శ్వేతం వరాహమేద
స్సదృశం అనుబద్ధవేదనమవేదనం వా సమాసవ్యత్యాసాత్ ఉప
వేశ్యతే శకృత్, గ్రథితమామం సకృత్; సకృదపి పక్వం అనతి
క్షీణమాంసశోణితబలో మన్దాగ్నిః విహతముఖరసశ్చ; తాదృశ
మాతురం కృచ్ఛ్రసాధ్యం విద్యాత్. 13

వ్యా. మరియు పైజెప్పినకారణసంకరముచే ప్రకుపితములైన వాతాదిదోషములు మూడును శరీరమునందలి రక్తాదిధాతువులను మిక్కిలి దుష్టములుగజేసి అట్టిధాతువులు చెడుటచే నతిసారమున నీక్రిందజెప్పబడు దోషధాతువులకు స్వాభావికములగువర్ణములను కల్గించును.—

అందు శోణితము మున్నగుధాతువులు త్రిదోషములచే దుష్టములై మిక్కిలివృద్ధి నొందియున్నపుడు పసుపురంగు, ఆకుపచ్చనిరంగు, నలుపు, మంజిష్ఠికషాయపురంగు, మాంసమునుకడిగినసీళ్ల రంగు, రక్తవర్ణము, కృష్ణవర్ణము, తెలుపు, పందిమేదస్సుతో సమానమైన వర్ణము, ఈవర్ణములుంకల్గి; బాధతోఁగూడియైనను బాధలేకయైనను, మలము గ్రంథివలె కఠినమై పక్వముగాక యొకప్పుడు వెడలును. మరియొకప్పుడు శరీరమునందలి మాంసరక్తబలములు మిక్కిలి క్షీణించక యగ్ని మందగించి నోటికి రుచి తెలియకయుండి పైజెప్పిన రంగులతోఁ గూడినమలము పక్వమై వెడలును. అట్టి యతిసారమున వైలక్షణములన్నియు కలిసియైనను, ఒకసమయమున వానిలోఁ వేరువేరుగ కొన్నిమాత్రము కలిసియైనను (ఏకరూపము కాక) మలము వెడలుచుండును. ఈలక్షణములతోఁ గూడిన సన్నిపాతాఽతిసారము కృచ్ఛ్రసాధ్యమగును.

### అసాధ్యవిశేషలక్షణములు.

మూ. ఏభిర్వర్ణైః అతిసార్యమాణం సోపద్రవమాతురం అసాధ్యోఽయమితి ప్రత్యాచక్షీత; తద్యథా:—పక్వశోణితాభం, యకృత్ఖణ్డోపమం, మేదోమాంసోదకసన్నికాశం, దధిఘృతమజ్జతైలవసాక్షీరవేసవారాభం, అతినీలం, అతిరక్తం, అతికృష్ణం, ఉదకమివాఽచ్ఛం, పునర్మేచకాభమతిస్నిగ్ధం, హరిత-నీల-కషాయవర్ణం, కర్బురమావిలం, పిచ్ఛిలం, తన్తుమదామం, చన్ద్రికోపగతం, అతికుణపపూతిపూయగన్ధ్యామామత్స్యగన్ధి, మక్షికాకా(క్రా)న్తం కుథితబహుధాతుస్రావం, అల్పపురీషం, అపురీషం వా, అతిసార్యమాణం; తృష్ణాదాహజ్వరభ్రమతమకహిక్కాశ్వాసాఽనుబన్ధం, అతివేదనమవేదనం వా, స్రస్తపక్వగుదం, పతితగుదవళిం, ముక్తనాళం, అతిక్షీణబలమాంసశోణితం, సహసోపరతవికారం, అతిసారిణమచికిత్స్యం విద్యాత్; ఇతి సన్నిపాతాఽతిసారః.　　14

వ్యా. మరియు సన్నిపాతాఽతిసారమున నీక్రింద జెప్పబడు వర్ణములతోఁడను తృష్ణాదాహాద్యుపద్రవములతోఁడను కూడి మలప్రవృత్తి యగుచున్నయెడ నయ్యది యసాధ్యము; కావున అట్టిరోగికి చికిత్సజేయంజనదు. ఆలక్షణము లెవ్వియన:—పక్వముచేయబడినరక్తము, యకృత్తుయొక్కఖండము, మేదస్సును మాంసమును కడిగినసీళ్లు, వీనిని బోలినరంగులుకల్గియైనను; పెరుగు నెయ్యి మజ్జ (ఎముకలలోనిక్రొవ్వు) పాలు వేసవారము అనువాని బోలియైనను, మిక్కిలి నీలవర్ణము కల్గియైనను, మిక్కిలి రక్తవర్ణంబైనను కృష్ణ

వర్ణంబైనను కల్గియైనను, నీళ్లవలె తేటగనైనను, నెమలిపురికన్నుబోలె చిత్రవర్ణముగనైనను, మిక్కిలి జిడ్డుకల్గియైనను, పచ్చరంగును నీలంబును కషాయవర్ణంబును నొకటిగ కలిసియైనను, అనేకవర్ణములు కలిసియైనను, కలకబారియైనను, పిచ్ఛిలముగనైనను, తీగెలుసాగుచు నామముగనైనను, తెల్లనితళుకులుకల్గియైనను, పురీషము వెడలుట, మరియు శవముయొక్కయు చీముయొక్కయు దుర్గంధంబైనను, ఆమగంధంబైనను, చేపలదుర్గంధమైనను, అధికముగ కల్గియుండుట, అట్టిమలముపై నీగెలు ఆసగొని వ్రాలుచుండుట, అనేకధాతువులు కుళ్లి మలమునగలిసి స్రవించుట, పురీషము కొద్దిగనుండుట, లేక పురీషము బొత్తుగ లేకుండుట; దప్పి, మంట, జ్వరము, భ్రమము, మైకము, ఎక్కిళ్లు, శ్వాసము, అనునీయుపద్రవము లనుబంధముగనుంటుట; వేదన (బాధ) మిక్కిలి యధికముగనైనను, బొత్తుగ లేకయైననుండుట; గుదముజారి పుండై యుండుట, గుదమునందలివళులు స్వస్థానము నుండి జారియుండుట, గుదకాండము పట్టువదలియుండుట, శరీరమునందలి రక్తమాంసములు మిక్కిలి క్షీణించియుండుట, అతిసారమున గల్గులక్షణములు వికారములన్నియు ప్రయత్నము లేకయే తమంతట తటాలున నివర్తించుట, ఈలక్షణములును సన్నిపాతాతిసారమున కల్గును. అట్టిలక్షణములు కల్గినయతిసారరోగికి చికిత్స జేయంజనదు. ఇత్తెరంగున సన్నిపాతాతిసారలక్షణములు పూర్తిగ వివరింపబడియె.

### సన్నిపాతాతిసారచికిత్సాకాలనియమము.

మూ. తమసాధ్యతామసంప్రాప్తం చికిత్సేత్; యథాప్రధానోపక్రమేణ
హేతూపశయదోషవిశేషపరీక్షయా చేతి. 15

వ్యా. (సన్నిపాతాతిసారమున సామాన్యముగ దోషత్రయమునకు వేరువేర జెప్పబడినలక్షణములన్నియు మిశ్రములుగ నుండునని "అతిసారం సర్వదోషలిఙ్గం జనయన్తి" అని సామాన్యముగ జెప్పబడినది. పిమ్మట "అపి చ దోషాదీన్" అని యుపక్రమించి సన్నిపాతాతిసారమునందు వాతాదిదోషములయొక్కయు రక్తాదిధాతువులయొక్కయు స్వభావముచే గల్గువర్ణాదిభేదములను వివరించుచు, అట్టివర్ణాదిభేదములచే కృచ్ఛ్రసాధ్యావస్థాభేదమును, ప్రత్యాఖ్యేయావస్థాభేదమును నిరూపింపబడినవి. అట్టియెడ నతిసారము అసాధ్యావస్థకు మారకమునుపే చికిత్స జేయవలెనని యీవాక్యముచే జెప్పబడినది.)

పైజెప్పిన రెండువిధములైనయవస్థలలో సన్నిపాతాతిసారము అసాధ్యావస్థనొందకమునుపే చికిత్స జేయుట ముఖ్యము. అందు త్రిదోషములు ప్రకోపమునొందియున్నను వానిలో ప్రధానమైన దోషమును హేతువులబట్టియు ఉపశయానుపశయములబట్టియు దోషముయొక్క విశేషలక్షణములబట్టియు పరీక్షించి నిర్ణయించి, అట్టి ప్రధానదోషానుసారముగ చికిత్స జేయవలెను.

## ఆగంతుజాతిసారలక్షణములు.

మూ. ఆగన్తూ ద్వావతీసారౌ మానసౌ భయశోకజౌ,
తత్తయోర్లక్షణం వాయోః యదతీసారలక్షణమ్. 16

వ్యా. ఆగంతుకాతిసారములు రెండు. అందొకటి మనోదోషమైన భయముచేతను రెండవది శోకముచేతను కల్గును. ఈరెండతీసారములును వాతాఽతిసారలక్షణములే కల్గియుండును. (ఇచ్చట భయశోకములు రెండును మనస్సంబంధములగు దోషములు కావున మానసికాతిసారము వేరని భ్రమింపదగదు.)

మూ. మారుతో భయశోకాభ్యాం శీఘ్రం హి పరికుప్యతి,
తయోః క్రియా వాతహరీ హర్షణాశ్వాసనాని చ. 17
ఇత్యుక్తాః షడతీసారాః, సాధ్యానాం సాధనం త్వతః,
ప్రవక్ష్యామ్యనుపూర్వేణ యథావత్తన్నిబోధత. 18

వ్యా. భయముచేతను, శోకముచేతను, వాతము (తక్కినకారణములకన్న) నతిశీఘ్రముగ, ప్రకోపము నొందును. (కావున నారెంటియందు వాతాతిసారులకు చెప్పిన లక్షణములే కల్గియుండునని భావము.) దానంజేసి భయశోకాతిసారముల రెంటికిని వాతహారంబులగుచికిత్సలను, మనస్సుకు సంతోషమును గల్గించుటయు, నూరడించుటయు చికిత్సలగును. ఇత్తెరంగున నుద్దేశప్రకారము ఆరువిధములయిన యతిసారభేదములు నిరూపింపబడినవి. అందు సాధ్యావస్థనుండు నతిసారములకు చికిత్సాక్రమము వరుసగ నీక్రింద వివరింపబడును.

ఇచ్చట నీవిషయము నెరుంగునది:—మానసికములగు భయశోకకారణములచే నాగంతుకాతిసారము జనించుననియు అయ్యవి వాతాతిసారలక్షణములనే కల్గియుండు ననియు పైన జెప్పబడినవి. అట్టియెడ వాతాతిసారము లక్షణముచేతనే యీరెండును గతార్థమగుచుండ వేరుగనెంచుకు చెప్పవలె నన్నచో, నీరెంటికిని వాతాతిసారమునకు చెప్పినచికిత్సలే కాక హర్షణాశ్వాసనరూపచికిత్సకూడ చేయవలసియుండును కాన నట్టి చికిత్సాభేదమునకై వేరుగచెప్పబడినది. మరియు వాతము నితరములగుమిథ్యాహారాదులచే సామాన్యముగ ప్రకోపించినను, భయశోకములచేత నతిశీఘ్రముగ ప్రకోపమునొంది యతితీవ్రముగ పనిచేయును కావున లక్షణభేదంబును వేరుగ గన్పట్టుచున్నది. ఈవిషయమునే తంత్రకారులు "శీఘ్రం హి పరికుప్యతి" అనియు "హర్షణాశ్వాసనాని చ"ననియు సూచించిరి. మరియు సన్నిపాతాతిసారమున భయశోకములు కారణములుగ జెప్పబడి

నవిగాని నయ్యాది యితరకారణములతోఁ గూడి యుండునుగాన నీరెంటికి సన్నిపాతనంతర్భావము జెప్పంజనదు. ఈ రెండును (భయశోకజములు) సమానలక్షణములై యున్నను, భయముచే కల్గినదానియందు ఆశ్వాసనంబును, శోకజమున హర్షణంబును చికిత్సలై యుండును. కావున వేరువేరుగ చెప్పబడినవి.

మరియు సుశ్రుతమున "తైస్తైర్భావైః శోచితోఽల్పాశనస్య బాష్పోష్మావై వహ్నిమావిశ్య జన్తోః" అని యుపక్రమించి శోకజమును వేరుగ జెప్పబడినది. అదియు ఇచ్చట సన్నిపాతనతిసారమున నంతర్భూతమగును. అచ్చటనే అన్నాజీర్ణాతిసారము ప్రత్యేకముగ చెప్పబడినది. అదియు నిచ్చట సాన్నిపాతికముననే అంతర్భూతమగును కావున అట్టి భేదములును నీతంత్రముననే సంగృహీతమని యెరుంగునది.

## అతిసారచికిత్సాక్రమము, ఆందావస్థయందు చికిత్సావిధి.

మూ. దోషాః సన్నిచితా యస్య విదగ్ధాహారమూర్ఛితాః,
అతీసారాయ కల్పన్తే భూయస్తాన్సంప్రవర్తయేత్. 19
న తు సంగ్రహణం దేయం పూర్వమామాతిసారిణే,
విబధ్యమానాః ప్రాగ్దోషా జనయన్త్యామయాన్ బహూన్. 20
దణ్డకాఽలసకాధ్మానగ్రహణ్యర్శోగదాంస్తథా,
శోథపాణ్డ్వామయప్లీహకుష్ఠగుల్మోదరజ్వరాన్. 21
తస్మాదుపేక్షేతోత్క్లిష్టాన్ వర్తమానాన్ స్వయం మలాన్,
కృచ్ఛ్రం వా వహతాం దద్యాదభయాం సంప్రవర్తినీమ్. 22

వ్యా. అతిసారమునందు దోషములు విదిగ్ధము, విష్టబ్ధము, ఆమము, రసశేషము, అనునాల్గువిధములయిన అజీర్ణములచే మిక్కిలి బలిష్ఠములై యున్నపుడు అట్టి పరిస్థితియందు విరేచనమును బంధించుచికిత్స జేయక తనంతటదోషమంతయు వెడలునట్లు తొలుత యుపేక్షించి యుండవలయును. ఒకవేళ విరేచనములు బద్ధగించి యగుచున్నపుడు ధారాళముగ వెడలింపజేయవలయును. కాని బంధించుచికిత్స చేయజనదు. అటుగాక ప్రారంభముననే ఆమావస్థయందున్న అతిసారమును బంధించినచో దోషములు కోష్ఠముననే బద్ధగింపబడి పలుతెరంగులయిన రోగముల కలిగించును అందు దండకము, అలసకము, ఆధ్మానము (కడుపుబ్బరము), గ్రహణీదోషము, అర్శోరోగము, వాపు, పాండురోగము, ప్లీహావృద్ధి,కుష్ఠము,గుల్మము, ఉదరము, జ్వరము, అనునీరోగములు సంభవించును. కావున దోషములుతనంతట ఆమావస్థయందు తనంతట సరళముగ వెడలుచున్న

యెడల కొంతవరకు బంధించు చికిత్స జేయక యుపేక్షించి యుండవలయును. ఒకవేళ బద్ధగించి మిక్కిలి కష్టముతో మలము వెడలుచున్నయెడ అప్పుడు కరకకాయలచే సిద్ధమయినయౌషధము నుపయోగించి మలము ధారాళముగ వెడలునట్లు చేయవలయును. ఇచ్చట "న తు సఙ్గ్రహణం పూర్వం" అని ఆమాతిసారమున తొలుత బంధనచికిత్స చేయక యుపేక్షించి దోషము వెడలిన వెనుక బంధనచికిత్స చేయదగునని తెలిసెడి.

మూ. తయా ప్రవాహితే దోషే ప్రశామ్యత్యుదరామయః,
జాయతే దేహలఘుతా జఠరాగ్నిశ్చ వర్ధతే. 23

వ్యా. పైజెప్పినరీతిగ ఆమాతిసారమున దోషమంతయు తొలుత బయలువెడలిన యెడ ఉదరమున గల్గుబాధలు శమించును. శరీరము చులకనగును. జాఠరాగ్ని వృద్ధి నొందును. (ఈచికిత్స దోషములుబట్టియు బలిష్ఠమై శరీరబలము చక్కగనుండువారికి చేయదగును.)

మధ్య-అల్ప దోషములయందు దీపన-పాచన-లంఘనములు.

మూ. ప్రమథ్యాం మధ్యదోషాణాం దద్యాద్దీపనపాచనీం,
లంఘనం చాల్పదోషాణాం ప్రశస్తమతిసారిణామ్. 24

వ్యా. అతిసారమునందు దోషములు ఉత్కటములుగాక మధ్యబలములుగ నున్నపుడు, అగ్నిని దీపింపజేసి ఆహారమును పచింపజేయుకషాయమునుపయోగించి చికిత్స చేయదగును. అట్టిదోషములు స్వల్పముగ నున్నయెడ అతిసారరోగికి లంఘనము చేయుట చాల ప్రశస్తము. ఇచ్చట నీవిషయము నెరుంగునది:—ఆమాతిసారమున ఆమదోషముమిక్కిలి బలవత్తరమై రోగి బలిష్ఠుడుగ నున్నపుడు తొలుత విరేచనౌషధములచే దోషముల పూర్తిగ వెడలించి బంధనచికిత్స చేయదగును. ఆమదోషము బలిష్ఠమై రోగి బలహీనముగనున్నయెడ తొలుత బంధనచికిత్స చేయక ఆమదోషము వెడలునంత దనుక నుపేక్షించి పిమ్మట బంధనము చేయదగును. ఇది ఆమదోషము బలిష్ఠముగ నుండునవస్థనుపట్టి చికిత్సావిధానము. మరియు ఆమదోషము మధ్యమముగ నున్నపుడు దీపనపాచనాద్యౌషధములచే సిద్ధముచేయబడినకషాయము నుపయోగించి తొలుత నగ్నిని దీపింపజేసి పిమ్మట బంధనము చేయదగును. ఆమదోషము మిగుల స్వల్పముగనున్నపుడు తొలుత లంఘనము చేయించి పిమ్మట బంధనచికిత్స చేయనగును. ఇత్తెరంగున ఆమదోషము బలతారతమ్యమును బట్టి చికిత్సావిధానము నెరుంగునది.

అతిసారమునకు దోషానుసారముగ ప్రమథ్య(కషాయ)కల్పనము.

మూ. పిప్పలీనాగరం ధాన్యం భూతీకమభయా వచా,

హ్రీబేరం భద్రముస్తాని బిల్వం నాగరధాన్యకమ్. 25
పృశ్నిపర్ణీ శ్వదంష్ట్రా చ సమఙ్గా కణ్టకారికా,
తిస్రః ప్రమథ్యా విహితాః శ్లోకార్ధైరతిసారిణామ్. 26

వ్యా. పిప్పళ్లు, శుంఠి, దనియాలు, కామంచిగడ్డి, కరక్కాయలు, వస, వీనిని సమభాగములుగ జేర్చి నూరి పక్వముచేసి యెనిమిదింతలు నీళ్లుపోసి నాల్గవపాలు మిగులునట్లు ప్రమథ్యకషాయముగ జేసి కఫాతిసారమున నుపయోగించునది. మరియు కురువేరు, తుంగగడ్డలు, బిల్వవేరు, శుంఠి, దనియాలు, వీనిని సమభాగములుగ జేర్చి పైజెప్పిన ప్రమథ్యవిధానముగ కషాయమునుచేసి పిత్తాతిసారమున నుపయోగించునది. ముయ్యాకుపొన్న, పల్లేరు, మంజిష్ఠి, వాకుడు, వీనిని సమభాగములుగ కూర్చి ప్రమథ్యకషాయముగ చేసి వాతాతిసారమున నుపయోగించునది. ఇత్తెరంగున పైజెప్పిన మూడర్ధశ్లోకములచే జెప్పబడినద్రవ్యములను వేరువేర మూడుకషాయయోగముల కల్పించి క్రమముగ కఫ-పిత్త-వాతాతిసారములయందు వరుసగ త్రాగింపవలయునని భావము.

ఇచ్చట ప్రమథ్యవిధానము తంత్రాంతరమున నిట్లు చెప్పబడినది:—"ప్రమథ్యా, ప్రోచ్యతే ద్రవ్యపలకల్కీకృతాత్ శృతాత్, తోయేష్టగుణితే తస్యాః పానమాహుః పలద్వయమ్" ద్రవ్యకల్కమున కెనిమిదింతలు జలముచేర్చి యెనిమిదవపాలు మిగులునట్లు కాచబడినది ప్రమథ్యమని యర్థము.

### అతిసారమున పానీయజలసంస్కారము.

మూ. వచాప్రతివిషాభ్యాం వా ముస్తపర్పటకేన వా,
హ్రీబేరశృఙ్గవేరాభ్యాం పక్వం వా పాయయేజ్జలమ్. 27

వ్యా. వస, అతివస, ఈరెంటినైనను; తుంగగడ్డలు, పర్పాటకము, ఈరెంటినైనను; కురువేరు, శుంఠి, ఈరెంటినైనను; పైజెప్పిన ప్రమథ్యముగ కల్కముచేసి కషాయముకాచి పైజెప్పినక్రమముగ కఫ-పిత్త-వాతాతిసారులకు త్రాగించునది.

### అతిసారమునందు హితాన్నసేవనము.

మూ. యుక్తేఽన్నకాలే క్షుత్క్షామం లఘూన్యన్నాని భోజయేత్,
తథా స శీఘ్రమాప్నోతి రుచిమగ్నిబలంబలమ్. 28

వ్యా. అతిసారరోగికి అన్నమును భుజించవలసినకాలమున ఆకలి తీవ్రముగ కల్గిన యెడల లఘుగుణము కల్గి శీఘ్రముగ జీర్ణములగు నాహారములను భుజింపచేయనగును,

అట్లుచేసినయెడ యారోగినోటికి శీఘ్రముగ రుచితెలిసి జఠరాగ్నిబలమును, శరీరబలమును శీఘ్రముగ నొందగలడు.

### అతిసారమున తక్రాదిపానములు.

మూ. తక్రేణావన్తిసోమేన యవాగ్వా తర్పణేన వా,
సురయా మధునా చాదౌ యథాసాత్మ్యముపాచరేత్. 29
యవాగూభిర్విలేపీభిః ఖడైర్యూషై రసోదనైః,
దీపనగ్రాహిసంయుక్తైః క్రమశ్చ స్యాదతః పరమ్. 30

వ్యా. పైజెప్పినరీతిగ లఘ్వాహారమును భుజించినపిదప మజ్జిగనైనను, పులిగంజినైనను, యవాగూనైనను, బొరుగులనీళ్లనైనను, సురయను మద్యమునైనను, మధుమద్యమునైనను, వారివారియలవాటు ననుసరించి యుపయోగించవలయును. మరియు యవాగువులచేతను విలేపియనుగంజిచేతను, ఖడయూషములచేతను, మాంసరసములతో కూడిన యన్నములచేతను నుపచరించవలయును. అట్టి యవాగూ మున్నగువానిని సిద్ధము చేయునపుడు దీపనీయగణమునను, గ్రాహిగణమునను చెప్పబడిన ద్రవ్యముల గూర్చి సంస్కరించి యుపయోగించునది.పిమ్మట చికిత్సాక్రమము నవలంబింపవలయును.(ఇచ్చట షడ్విరేచనశతాశ్రితీయమున 'పిప్పలీపిప్పలీమూల...దీపనీయాని భవన్తి" "ప్రియఙ్గ్వనన్తాస్థి...పురీషసఙ్గ్రహాణీని భవన్తి" (సూ. అ. ౪.) అని చెప్పబడిన దీపనీయ-పురీషగ్రాహిగణములను "దీపనగ్రాహిసంయుక్తైః" అనుపదముచే గ్రహింపదగును.)

### అతిసారమున నన్నపానములయందు జేర్పదగినద్రవ్యగణము.

మూ. శాలిపర్ణీం పృశ్నిపర్ణీం బృహతీం కణ్టకారికాం,
బలాం శ్వదంష్ట్రాం బిల్వాని పాఠాం నాగరధాన్యకమ్. 31
శటీం పలాశం హపుషాం వచాం జీవకపిప్పలీం,
యవానీం పిప్పలీమూలం చిత్రకం హస్తిపిప్పలీమ్. 32
వృక్షామ్లం దాడిమామ్లం చ సహిఙ్గుబిడసైన్ధవం,
ప్రయోజయేదన్నపానే విధినా సూపకల్పితమ్. 33
వాతశ్లేష్మహరో హ్యేషః గణో దీపనపాచనః,
గ్రాహీ బల్యో రోచనశ్చ తస్మాచ్ఛస్తోఽతిసారిణామ్. 34

వ్యా. ముయ్యాకుపొన్న, కోలపొన్న, ములక, వాకుడు, చిట్టాముట్టి, పల్లేరు, మారేడు, చిరుబొద్ది, శుంఠి, దనియాలు, కంధకచోరములు, మోదుగ, బోడతరము,

వస, జీవకము, పిప్పళ్లు, ఓమము, మోడి, చిత్రమూలము, గజపిప్పలి, చింతపండు, దానిమ్మరసము, ఇంగువ, బిడాలవణము, సైంధవలవణము, ఈద్రవ్యము గణము. వాతకఫ హరంబును అగ్నిని దీపింపజేసి యాహారమును పచింపజేయునదియు నగును. మలమును వెడలనీయక నిరోధించును, బలమును కల్గించును, ఆహారమున రుచికల్గించును. కావున నీ గణద్రవ్యములను యథోచితముగ యవాగ్వాద్యన్నపానములయందు జేర్చి సంస్కరించి అతిసారరోగి కుపయోగింపనగును.

అతిసారమునకు యూష-ఖడయూషములు.

మూ. ఆమే పరిణతే యస్తు విబద్ధమతిసార్యతే,
సశూలపిచ్ఛమల్పాఽల్పం బహుశః సప్రవాహికమ్. 35
యూషేణ మూలకానాం తం బదరాణామథాపి వా,
ఉపోదికాయాః క్షీరిణ్యాః యవాన్యా వాస్తుకస్య వా. 36
సువర్చలాయాశ్చుఞ్చ్వోర్వా శాకేనాఽవల్గుజస్య వా,
శట్యాః కర్కోటకానాం వా జీవన్త్యాః చిర్భటస్య వా. 37
లోణికాయాః సపాఠాయాః శుష్కశాకేన వా పునః,
దధిదాడిమసిద్ధేన బహుస్నేహేన భోజయేత్. 38

వ్యా. అతిసారమున ఆమము పక్వమైనపుడు శూలముతోగూడి జిగురుగ కొంచెము కొంచెముగ మాటిమాటికి పలుమారు ప్రవాహికముతో గూడి ప్రవర్తియగుచున్నచో ముల్లంగిని చేర్చి సిద్ధమైన యూషముతోనైనను, రేగుపండ్లను చేర్చి చేయబడిన యూష ముతోనైనను అధికముగ స్నేహమును (నేతిని) చేర్చి సంస్కరించి యాహారము చేయ వలెను. మరియు దుంపబచ్చలి, మనుబాల, ఓమము, చక్రవర్తికూర, ప్రొద్దుతిరుగుడు (సూర్యకాంతము)చెట్టు, ఎలుకజీడికూర, బావంచియాకు, కచోరములు, గుమ్మడి, మను బాల, దోస, పులిచింతాకు, చిరుబొద్ది, అనునీశాకములలో వేనినైనను పెరుగును దానిమ్మరసమును చేర్చి పక్వముజేసి నేతిని అధికముగ జేర్చి సంస్కరించి యాకూరతో చక్కగ పక్వముచేయబడిన యూషములనైనను ఖడయూషములనైనను ఆహారము చేయనగును.

ప్రవాహికాలక్షణము సుశ్రుతమున నిట్లు చెప్పబడినది:—"వాయుర్వివృద్ధో నిచితం బలాసం నుదత్యధస్తాత్ అహితాశనస్య, ప్రవాహతోఽల్పం బహుశోమలాక్తం ప్రవాహికాం తాం ప్రవదన్తి తద్జ్ఞాః" (సు. ఉ. అ. ౪౦.) (వాతమువృద్ధినొంది

సంచితమైనకఫమును ముక్కినప్పుడెల్ల కొంచెముగ మలముతోగూడి పలుమారు బైటవెడలు చున్న నయ్యది ప్రవాహికమని చెప్పబడును.)

ప్రవాహికాహారఖడయూషము.

మూ. కల్కస్స్యాత్ బాలబిల్వానాం తిలకల్కశ్చ తత్సమః,
దధ్నస్సరోఽమ్లః స్నేహాఢ్యః ఖడో హన్యాత్ ప్రవాహికామ్.39

వ్యా. లేతమారేడుపిందెలకల్కమును నువ్వులకల్కమును సమభాగములుగ గూర్చి పెరుగుమీదితేటలో కలిపి అందు దానిమ్మరసమును జేర్చి నేతిని మరింత కలిపి సంస్కరింపబడిన ఖడయూషమును త్రాగినయెడ ప్రవాహిక (బంకవిరేచనములు) శమించును.

అతిసారరోగికి మలక్షయాదులయందు ధాన్యయూషము.

మూ. యవానాం ముద్గమాషాణాం శాలీనాం చ తిలస్య చ,
కోలానాం బాలబిల్వానాం ధాన్యయూషం ప్రకల్పయేత్. 40
ఐకధ్యం యమకే భృష్టం దధిదాడిమసాధితం,
వర్చఃక్షయే శుష్కముఖం శాల్యన్నం తేన భోజయేత్. 41

వ్యా. యవలు, పెసలపప్పు, ఉద్దిపప్పు, ఎఱ్ఱవరిధాన్యపుబియ్యము, నువ్వులు, రేగుపండ్లు, లేతమారేడుపిందెలు, వీనిని వేరువేరుగ కల్కముగజేసి యాకల్కములను సమభాగములుగ నన్నింటి నొకటిగకలిపి, నూనెను నేతిని చేర్చి వేయించి, అందు పెరుగును దానిమ్మపండ్లరసమును కలిపి తిరుగబోతబెట్టి సంస్కరించిన నయ్యది ధాన్యయూషమనబడును. దీని అతిసారరోగికి పురీషము క్షీణించి ముఖము శుష్కించియున్నపుడు ఎఱ్ఱవరిబియ్యపు అన్నమున గూర్చి భోజనమిడవలెను. (ఇచ్చట యవలు మున్నగువాని నన్నింటిని కల్కములుగజేసి యన్నింటెని సమభాగములుగ కలిపి పైజెప్పినప్రకారము యూషమును గల్పింపవలెను. ఈవిషయమును వాగ్భటాచార్యులు "కోలానాం బాలబిల్వానాం కల్కైః శాలియవస్య చ, ముద్గమాషతిలానాం చ ధాన్యయూషం ప్రకల్పయేత్... తేన భోజయేత్" (అ. హృ. అ. ౯. శ్లో. ౭౯.) అని స్పష్టముగ జెప్పిరి.

క్షీణమలాతిసారరోగికి ఆహార-వ్యంజనములు.

మూ. దధ్నస్సరం వా యమకే భృష్టం సగుడనాగరం,
సురాం వా యమకే భృష్టాం వ్యఞ్జనార్థే ప్రదాపయేత్. 42
ఫలామ్లం యమకే భృష్టం యూషం గృఞ్జనకస్య వా,

లోపాకరసమమ్లం వా స్నిగ్ధామ్లం కచ్ఛపస్య వా. 43
బర్హితిత్తిరిదక్షాణాం వర్తకానాం తథా రసాః,
స్నిగ్ధామ్లాః శాలయశ్చాగ్ర్యాః వర్చఃక్షయరుజాపహాః. 44

వ్యా. మరియు పెరుగుమీదిమీగడను యమకస్నేహమున (నూనె నెయ్యి చేరి యమకస్నేహము) పక్వముచేసి అందు బెల్లమును శుంఠిపొడిని కలిపి దానినైనను; యమకస్నేహముతో పక్వముచేయబడిన సురయను మద్యమునైనను; వ్యంజనమునకై (అన్నముతో కలిపి భుజింపదగినసూపము, పచ్చడులు మున్నగుసాధకములు) యుపయోగింపదగును. మరియు వెల్లుల్లిని చేర్చి పక్వముచేయబడినయూషమున దానిమ్మపండ్లు మున్నగువాని పులుపురసమును జేర్చి పక్వముచేసి ఆయూషమునైనను; లోపాకమను జంతువుయొక్క మాంసరసమున దానిమ్మపులుపు చేర్చియైనను, తాబేటిమాంసరసమున నెయ్యిని పులుపురసమును జేర్చి పక్వముచేసియైనను, నెమలి తీతువుపిట్ట కోడి వెలిచెపిట్ట అనునీజంతువులమాంసరసములను పులుపును నేతిని చేర్చి పక్వముచేసి వానినైనను, వ్యంజనములకై యుపయోగించునది. మిక్కిలి శ్రేష్ఠములైన రాజనములు మున్నగు ధాన్యములు అన్నమున కుపయోగించునది. ఇట్టి వ్యంజనంబులును అన్నంబులును మలక్షయముచే కల్గిన యతిసారములను హరించుటకు మిగుల శ్రేష్ఠములు.

## క్షీణమలాతిసారరోగికి మాంసరసయుక్తభోజనము.

మూ. అన్తరాధిరసం పూత్వా రక్తం మేషస్య చోభయం,
పచేద్దాడిమసారామ్లం సధాన్యస్నేహనాగరమ్. 45
ఓదనం (భోజనం) రక్తశాలీనాం తేనాద్యాత్, ప్రపిబేచ్చ తత్,
తథా వర్చఃక్షయకృతైః వ్యాధిభిర్విప్రముచ్యతే. 46

వ్యా. పొట్టేలుయొక్క మాంసరసమును రక్తమును గ్రహించి రెంటిని నొకటిగ కలిపి పుల్లదానిమ్మపండ్లరసమును కూడ కలిపి పక్వముచేసి దనియాలను శుంఠిని పొడిచేసి నేతితో సంస్కరించి కలిపి యారసమును ఎఱ్ఱవరిబియ్యముచే సిద్ధమైనయన్నమున జేర్చి భుజించి యారసమునే త్రాగవలెను. దీనిని సేవించినయెడ మలక్షయముచే సంభవించు ముఖశోషము, దౌర్బల్యము, ఉదావర్తము, మున్నగురోగములు నివర్తించును.

## అతిసారమున గుదభ్రంశ చికిత్స.

మూ. గుదనిస్సరణే శూలే పానమమ్లస్య సర్పిషః,
ప్రశస్యతే నిరామాణాం అథ వాప్యనువాసనమ్. 47

వ్యా. అతిసారమున ఆమదోషము లేక గుదము జారి నొప్పియు పోటును కల్గి యున్నయెడ నమ్లరసముల జేర్చి సిద్ధముచేయబడిన (క్రింద జెప్పబడు) ఘృతమును త్రాగుటయు, అనువాసనవస్తి జేసికొనుటయు మిగుల ప్రశస్తము.

## గుదభ్రంశమునకు చాంగేరీఘృతము.

మూ. చాఙ్గేరీకోలదధ్యమ్లనాగరక్షారసంయుతం,
ఘృతముత్క్వథితం పేయం గుదభ్రంశరుజాపహమ్. 48
(ఇతి చాఙ్గేరీఘృతమ్.)

వ్యా. పులిచింతాకురసము, రేగుపండ్లరసము, పుల్లనిపెరుగు ఈమూడుద్రవములను కలిసి ఘృతమునకు నాలుగింతలుగ జేర్చి, శుంఠిచూర్ణమును యవక్షారమును కల్కముగ (ఘృతమునకు నాల్గవపాలు) గూర్చి ఘృతపాకవిధిప్రకారము పక్వముచేసి త్రాగిన గుదభ్రంశంబును దానగల్గినబాధలును శమించును.

## గుదభ్రంశమునకు చవ్యాదిఘృతము.

మూ. సచవ్యపిప్పలీమూలం సవ్యోషబిడదాడిమం,
పేయమమ్లం ఘృతం యుక్త్యా సధాన్యాఽజాజిచిత్రకమ్. 49
(ఇతి చవ్యాదిఘృతమ్.)

వ్యా. చవ్యము, మోడి, త్రికటుకములు, బిడాలవణము, దానిమ్మబెరడు, దనిమాలు, జీలకర, చిత్రమూలము ఈపదిద్రవ్యములను సమభాగములుగ గూర్చి నూరి కల్కము జేసి, కల్కమునకు నాల్గింతలఘృతమును పైయోగమున జెప్పిన పులిచింతాకుస్వరసము, రేగుపండ్లరసము, పెరుగును సమముగ జేర ఘృతమునకు నాల్గింతలు ద్రవముగను జేర్చి ఘృతపాకవిధిప్రకారము పక్వముజేసి అతిసారరోగికి గుదభ్రంశమున అగ్నిబలాద్యనుసారముగ యుక్తియుక్తముగ నుపయోగించునది.

ఈఘృతయోగములయందు "జలస్నేహౌషధానాం చ ప్రమాణం యత్ర నేరితమ్, తత్ర స్యాదౌషధాత్స్నేహః స్నేహాత్తోయం చతుర్గుణమ్" అనుసామాన్యపరిభాషచేత కల్క-ఘృత-ద్రవపరిమాణము క్రమముగ నొకటికన్న నొకటి చతుర్గుణమని యెఱుంగునది. అనుక్తపరిమాణస్థలములయందెల్ల నీన్యాయముచేతనే స్నేహాదిమానకల్పనము నెఱుంగునది. మరియు పైజెప్పినయోగమున చవ్యాదిద్రవ్యములు పదియు కల్కములు తంత్రాంతరమున "పఞ్చకోలబిడాఽజాజీధాన్యదాడిమవేతసైః, పచేదమ్లం ఘృతం తద్వన్నాగరక్షారసంయుతమ్" అని యీయోగము కొంచెముభేదముతో జెప్పబడినది.

గుదభ్రంశమునం దనువాసనవస్తికి దశమూలాదిస్నేహములు.

మూ. దశమూలోపసిద్ధం వా సబిల్వమనువాసనం,
శతాహ్వాశటిబిల్వైర్వా వచయా చిత్రకేణ వా. 50
(ఇతి గుదభ్రంశే అనువాసనమ్.)

వ్యా. దశమూలములతో మారేడువేరును జేర్చి కల్కముజేసి పక్వముజేయబడిన స్నేహముసైనను, సదాపవిత్తులను, గంధకచోరములను బిల్వవేరును జేర్చి పక్వముచేయబడిన స్నేహముసైనను, వసను, చిత్రమూలమును కల్కముగ జేర్చి పక్వముజేయబడిన స్నేహముసైనను, గుదభ్రంశమునం దనువాసనవస్తి కుపయోగించునది. (ఇచ్చట ద్రవమును జూపకుండుటచే జలమును జేర్చి స్నేహపాకము జేయవలెను. ఈవిషయము "ద్రవే ష్యను క్తే జలమేవ దేయం" అనుపరిభాషచే డెలిసెడి.)

(వస్తి (మేక మున్నగుజంతువులమూత్రపుతిత్తి)యందు కషాయాదులనింపి దాని మూలమున గుదద్వారమునుండి శరీరములో నౌషధమును ప్రయోగించుట వస్తికర్మము. అందు తైలఘృతాదిస్నేహములను చేర్చి చేయబడునది అనువాసనవస్తి. "యస్స్నేహైర్దీయతే సస్యాదనువాసననామకః" అని నిర్దేశింపబడినది. గుదభ్రంశమున విహితమగువస్తి విధానమున పైజెప్పబడిన దశమూలాదిసిద్ధస్నేహములమూటిని యుపయోగించనగునని యర్థము. మరియు అనువాసనవస్తివిధులయందు ప్రాయికముగ తైలమే జెప్పబడియుండుటవలన నిచ్చటను దశమూలాదిసిద్ధతైలములనే యుపయోగింపవలెనని కొందరియభిమతము. ఇచ్చట ఘృతప్రకరణమున జెప్పబడినది కావున ప్రకరణవశమునంజేసి ఘృతము నుపయోగింపదగునని మరికొందరియాశయము.) వాగ్భటాచార్యులు "ప్రవాహణే గుదభ్రంశే......శృతం తైలం ఘృతం వాప్యనువాసయేత్" (అ. హృ. చి. అ. ౯.) అని ఘృతతైలముల రెండిటిని చెప్పిరి.)

గుదభ్రంశమునకు ప్రవేశవిధి.

మూ. స్తబ్ధభ్రష్టగుదే పూర్వం స్నేహస్వేదౌ ప్రయోజయేత్,
సుస్విన్నం మృదు భూతం చ పిచునా సమ్ప్రవేశయేత్. 51

వ్యా. అతిసారమున గుదము స్వస్థానమునుండి వెలుపలికి జారి స్తంభించియున్న యెడ తొలుత గుదమునకు తైలముచే మర్దనముచేసి స్వేదనమునుచేసి అయ్యది మెత్తబడిన పిదప గుదముపై ఘనముగనుండు గుడ్డపేలికలచే మూసి లోపలికి ప్రవేశింపజేసి స్వస్థానమున జేర్చవలెను.

## అతిసారమున వాతబంధనాదినివర్తకక్షీరపానవిధి.

మూ. విబద్ధవాతవర్చాస్తు బహుశూలప్రవాహికః,
సరక్తపిచ్ఛః తృష్ణార్తః క్షీరసౌహిత్యమర్హతి. 52

వ్యా. అతిసారమున అపానవాతంబును మలంబును బద్ధగించి అధికమైన పోటు కల్గి అధికముగముక్కుచు, రక్తముతోకూడి బంక విరేచనము వెడలుచున్నయెడ మిక్కిలి దాహముకల్గినప్పుడు ఆవుపాలను తృప్తిగ త్రాగవలెను.

## ధారోష్ణక్షీరపానము.

మూ. యమకస్యోపరి క్షీరం ధారోష్ణం వా పిబేన్నరః,
శృతమేరణ్డమూలేన బాలబిల్వేన వా పయః (పునః.) 53
ఏవం క్షీరప్రయోగేణ రక్తం పిచ్ఛా చ శామ్యతి,
శూలం ప్రవాహికా చైవ విబన్ధశ్చోపశామ్యతి. 54

వ్యా. పైజెప్పినరీతిగ నతిసారమున విబంధశూలాదులు కల్గినప్పుడు, తొలుత యమక (నూనెను నేతిని ఒకటిగ కలిపి) స్నేహమును త్రాగించి వెంటనే ధారోష్ణమైన (అప్పుడుపిండి వేడిగనుండు) యావుపాలను త్రాగించవలెను. ఆవుపాలలో నాముదపు వేరును చేర్చి కాచియైనను, లేతమారేడుకాయను చేర్చి కాచియైనను త్రాగింపనగును. ఇత్తెరంగున పాలను త్రాగించినయెడ రక్తంబును బంకయు విరేచనములగుట మానును. నొప్పి శమించును. ముక్కుడము నిలుచును. మలవాతములు బంధమువదలి ధారాళముగ వెడలును.

## పిత్తాఽతిసారచికిత్సాక్రమము, అందు లంఘనపాచనములు.

మూ. పిత్తాఽతిసారం పునః నిదానోపశయాంకృతిభిః, ఆమాన్వయముప
లభ్య, యథాబలం లఙ్ఘనపాచనాభ్యాం ఉపాచరేత్. 55

వ్యా. పిత్తాతిసారమున అతిసారోత్పత్తికారణములచేతను, ఉపశయాపశయములచేతను, స్వరూపలక్షణములబట్టియు పరీక్షించి, అవ్యాధి ఆమసంబంధము కల్గియున్నట్లు స్పష్టముగ దెలిసినయెడ దోషములయొక్కయు రోగియొక్కయు బలమును గమనించి, తదనుసారముగ లంఘనౌషధముచేనైనను, ఆహారమును పచింపజేయుచికిత్సచేనైనను ఉపచరించవలెను.

ఇచ్చట నీవిషయము నెరుంగునది:—చికిత్సాసామాన్యముగ ఆమాతిసారమునందు ఆమదోషముల వెడలించుటకై విరేచనము విధింపబడినది. ఈవిషయము "దోషాస్సన్ని

చితాయస్య......భూయస్తాఁ, సంప్రవర్తయేత్, న తు సఙ్గ్రహణం దేయం" అని చెప్పబడినది. పిత్తము సర (స్రవించు) స్వభావముకల్గినది కావున, దాన జనించిన పిత్తాతిసారమున ఆమము వెడలునిమిత్తము రేచనమును ప్రయోగించినచో నతియోగరూపమైన వ్యాపత్తు సంభవించునని యుద్దేశించి, దానికపవాదముగ లంఘనపాచనరూపచికిత్స పైవాక్యముచే విధింపబడినది. పిత్తాతిసారమున సామావస్థయందు తొలుత లంఘనపాచనములనే చేయవలెనుగాని సామాన్యవిధిప్రకారము దోషనిర్హరణము చేయజనదని ముఖ్యభావము.

పిత్తాతిసారమున దప్పికి పానీయకషాయములు.

మూ. తృష్యతస్తు ముస్తపర్పటకోశీరసారిబాచన్దనకిరాతతిక్తకోదీచ్య వారిభిరుపచారః. 56

వ్యా. పిత్తాతిసారరోగికి దప్పికల్గినయెడ తుంగగడ్డలు, పర్పాటకము, వట్టివేళ్లు, సుగంధపాల, మంచిగంధము, నేలవేము, కురువేరు, వీనిని చేర్చి కాచబడినకషాయముల ద్రాగించి యుపచరింపనగును.

పిత్తాతిసారమున యవాగ్వాద్యాహారసంసర్జనము.

మూ. లఙ్ఘితస్య చాహారకాలే బలాఽతిబలా శూర్పపర్ణీ శాలిపర్ణీ పృశ్నిపర్ణీ బృహతీ కణ్టకారికా శతావరీ శ్వదంష్ట్రా నిర్యూహ సంయుక్తేన, యథాసాత్మ్యం యవాగూమణ్డాదినా తర్పణాదినా వా క్రమేణోపచారః. 57

వ్యా. పిత్తాతిసారము, ఆమావస్థయందు పైజెప్పినరీతిగ లంఘనముచేసిన పిదప ఆహారము చేయుసమయమున చిట్టాముట్టి, పేరాముట్టి, అడవిపెసర, ముయ్యాకుపొన్న, కోలపొన్న, వాకుడు, ములక, పిల్లిపీచర, పల్లేరు, వీటిని చేర్చి సిద్ధముచేయబడినకషాయమున యవాగువు-మండ-పేయాది రూపములయినగంజిని సిద్ధముచేసి శరీరముయొక్క సాత్మ్యముననుసరించి సంతర్పణమయిన యాహారమును పేయాదిక్రమముగ పెట్టి నుపచరించునది. (ఇచ్చట పైజెప్పిన బలాది ద్రవ్యములలో యథాసంభవము గ్రహించి షడఙ్గ విధానముగ జలమును సిద్ధముచేసి యాజలమునుచేర్చి యవాగ్వాదులును విద్యుక్తప్రకారము పక్వముచేసి యథాక్రమముగ సాత్మ్యానుసారము నుపయోగించునది.

పిత్తాతిసారమున యూషాదిపానము.

మూ. ముద్గమసూరహరేణుమకుష్ఠకాఢకీయూషైర్వా, లావకపిఞ్జలశశ

హారితైణకాలపుచ్ఛకరసైః ఈషదమ్లైరనమ్లైర్వా క్రమశోఽగ్నిం
సంధుక్షయేత్. 58

టీక. మరియు పెసలు, చిరుసెనగలు, రేణుకలు, అడవిపెసలు, కందులు, వీనిలో నేదైన నొకదానిని చేర్చి పక్వము చేయబడిన యూషములనైనను, లావుకపిట్ట, కపింజలము, కుందేలు, లేడి, ఇఱ్ఱి, పొడలయిఱ్ఱి, అనునీజంతువులమాంసరసములనైనను; అందు కొంచెముగ దానిమ్మరసము, మొదలగు అమ్లరసములను చేర్చియైనను; అమ్లరసముల చేర్పకనైనను; ఆహారకాలమున పిత్తాతిసారరోగికి యుపయోగించి నానాట జాఠరాగ్నిని రగులునట్లు చేయవలయును.

### పిత్తాతిసారమున దీపనీయాది ప్రయోగము.

మూ. అనుబద్ధే త్వస్య దీపనీయపాచనీయోపశమనీయసఙ్గ్రాహిణీయాన్
యోగాన్ ప్రయోజయేదితి. 59

టీక. పైజెప్పినచికిత్సాక్రమమున క్రమముగ చేసినను, పిత్తాతిసారము నివర్తించక అనుసరించియే బాధించుచున్నయెడ నీక్రిందజెప్పంబడు దీపనీయ-పాచనీయ-ఉపశమనీయసంగ్రాహిణీయయోగములు నుపయోగించవలయును.

### పిత్తాతిసారహరౌషధము.

[illegible]:—

మూ. [illegible] పిష్ట్వా వత్సకస్య ఫలత్వచం,
[illegible] తణ్డులోదకసంయుతమ్. 60

టీక. [illegible], కొడిశపాలవిత్తులు, కొడిశపాలపట్ట ఈమూటిని సమభాగములుగ చేర్చి [illegible] బియ్యపుకడుగునీటిలో కలిపి అందు తేనెను కూర్చి త్రాగినచో పిత్తాతిసారము శమించును.

### పిత్తాతిసారహరయోగములు.

మూ. కిరాతతిక్తో ముస్తం వత్సకః సరసాఞ్జనః,
బిల్వం దారుహరిద్రా త్వక్ హ్రీబేరం సదురాలభమ్. 61
చన్దనఞ్చ మృణాలఞ్చ నాగరం లోధ్రముత్పలం,
తిలాః మోచరసో లోధ్రం సమఙ్గా కమలోత్పలమ్. 62

ఉత్పలం ధాతకీపుష్పం దాడిమత్వఙ్మహౌషధం,
కట్ఫలం నాగరం పాఠా జమ్బ్వామ్రాస్థిదురాలభాః. 63
యోగాః షడేతే సక్షౌద్రాః తణ్డులోదకసంయుతాః,
పేయాః పిత్తాతిసారఘ్నాః శ్లోకార్ధేన నిదర్శితాః. 64

వ్యా. నేలవేము, తుంగగడ్డలు, కొడిశపాలవిత్తులు, రసాంజనము, (ఇవియొక యోగము) మారేడు, మ్రానిపసుపు, లవంగపట్ట, కురువేరు, దూలగొండి (ఇవి రెండవ యోగము); శ్రీగంధము, తామరతూండ్లులేక (పట్టివేళ్లు), శుంఠి, లొద్దుగచెక్క,నల్లకలువలు (ఇవి చేరి మూడవయోగము); నువ్వులు, బూరుగబంక, లొద్దుగు, మంజిష్ఠి లేక (కాచు),తామరపువ్వులు, నల్లకలువలు, (ఇవి చేరి నాల్గవయోగము); నల్లకలువలు, ఆరెపువ్వు, దానిమ్మకాయబెరడు, శుంఠి, (ఇవి చేరి ఐదవయోగము); కాయఫలము (లేక టేకు), శుంఠి, చిరుబొద్ది, మారేడువిత్తులు, మామిడిపప్పు; దూలగొండి (ఇవిచేరినది ఆరవ యోగము); పైజెప్పబడిన శ్లోకార్ధముచే నేర్పడినయోగముల నారింటిని వేరువేరుగ ఆయాయోగములయందలి ద్రవ్యములను సమభాగములుగ కూర్చి నూరి కల్కములచేసి బియ్యపుకడుగునీటిలో కలిపి అందు తేనె చేర్చి త్రాగించినయెడ పిత్తాతిసారమును హరించును.

## పిత్తాతిసారమున ఆహారోపయోగవిధి.

మూ. జీర్ణౌషధానాం శస్యన్తే యథాయోగప్రకల్పితైః,
రసైః సాంగ్రాహికైర్యుక్తాః పురాణా రక్తశాలయః. 65

వ్యా. పైజెప్పినయౌషధయోగములను సేవించిపిదప నయ్యది జీర్ణమైనపుడు ఆయాయోగముల ననుసరించి సిద్ధముచేయబడిన మాంసరసములతోడను, మలప్రవృత్తిని బద్ధగించునౌషధద్రవ్యములతోడ సిద్ధముచేయబడిన పేయాదులతోడను ప్రాబి యగు నెఱ్ఱవరిబియ్యముచే సిద్ధమగునన్నమును భుజియింపవలెను.

## పిత్తాతిసారమున క్షీరప్రయోగము.

మూ. పిత్తాతిసారో దీప్తాగ్నేః క్షిప్రం సముపశామ్యతి,
అజాక్షీరప్రయోగేణ బలం వర్ణశ్చ వర్ధతే. 66

వ్యా. పిత్తాతిసారరోగికి జఠరాగ్నిదీప్తి కల్గియున్నపుడు మేకపాలను త్రాగించినచో శీఘ్రముగ అతిసారము శమించును. శరీరబలంబును, కాంతియువృద్ధినొందును.

### పిత్తాతిసారమున మృదువిరేచనవిధి.

మూ. బహుదోషస్య దీప్తాగ్నేః సప్రాణస్య న తిష్ఠతి,
పైత్తికో యద్యతీసారః పయసా తం విరేచయేత్. 67
పలాశఫలనిర్యూహం పయసా పాయయేత తం,
తతోఽనుపాయయేత్ కోష్ణం క్షీరమేవ యథాబలమ్. 68
ప్రవాహితే తేన మలే ప్రశామ్యత్యుదరామయః,
పలాశవత్ ప్రయోజ్యా వా త్రాయమాణా విశోధినీ. 69

వ్యా. అగ్నిదీప్తికల్గి దోషము బలిష్ఠమైయున్నవానికి పిత్తాతిసారము శమించకున్న యెడ పాలచేత వానికి మృదువిరేచనము చేయించదగును. ఆవుపాలయందు మోదుగ విత్తులకషాయముచేర్చి విరేచనమునకై త్రాగి వెంటనే కొంచెము వేడిగనుండు ఆవుపాలను అగ్నిబలానుసారముగ త్రాగించవలయును. ఈక్షీరప్రయోగముచేత మలముబయలు వెడలి అతిసారమునగల్గు కడుపులోని వికారములు శమించును. ఈకల్పము ననుసరించియే మోదుగవిత్తులకు బదులు త్రాణుగవిత్తులను కషాయముబెట్టి యాకషాయముతో పాలను కలిపి విరేచనమునకై యుపయోగింపదగును.

### పిత్తాతిసారమున అనువాసనవస్తివిధి.

మూ. సాంసర్గ్యాం క్రియమాణాయాం శూలం యద్యనువర్తతే,
స్రుతదోషస్య తం శీఘ్రం యథావదనువాసయేత్. 70
శతపుష్పావరీభ్యాం చ పయసా మధుకేన చ,
తైలపాదం ఘృతం సిద్ధం సబిల్వమనువాసనమ్. 71

వ్యా. పైజెప్పినరీతిగ విరేచనరూపశోధనముచే దోషము వెడలినపిదప పేయాది క్రమమును ననుసరించి సంసర్జనమును చేసినప్పుడును కుక్షిలో శూలకల్గి యనుసరించియున్న యెడ అట్టిసమయమున విధ్యుక్తప్రకారము అనువాసనవస్తి ప్రయోగింపదగును.

సదాపవిత్తులు, పిల్లిపీచర, అతిమధురము, బిల్వపువేరు,వీనిని సమభాగములుగగూర్చి కల్కముచేసి నాల్గవవంతునూనెతో కూడినఘృతముచేర్చి ఘృతమునకు నాల్గింతలు ఆవు పాలను కల్పి ఘృతపాకవిధిప్రకారము పక్వముచేసి ఈఘృతముచేత అనువాసనవస్తిని విధ్యుక్తప్రకారము చేయదగును. (ఇచ్చట సదాపమున్నగు కల్కద్రవ్యములకల్కము నకు నాల్గింతలు స్నేహమును, స్నేహమునకు నాల్గింతలుపాలును కలిపి విధ్యుక్తప్రకారము పక్వముచేయునది.)

### పిత్తాతిసారమున పిచ్ఛావస్తివిధి.

మూ. కృతానువాసనస్యాస్య కృతసంసర్జనస్య చ,
వర్తతే యద్యతీసారః పిచ్ఛావస్తిరతః పరమ్. 72

వ్యా. అనువాసనవస్తిని చేసి తదనుసారముగ పేయాదిసంసర్జనమును చేసినపిదప ఇంకను అతిసారము నివర్తించక అనుసరించియున్నయెడ క్రిందజెప్పబడువిధి ప్రకారము పిచ్ఛావస్తిని ప్రయోగించవలయును.

### పిచ్ఛావస్తిప్రయోగక్రమము.

మూ. పరివేష్ట్య కుశైరార్ద్రైరార్ద్రవృన్తాని శాల్మలేః,
కృష్ణమృత్తికయాఽఽలిప్య స్వేదయేత్ గోమయాగ్నినా. 73
సుశుష్కాం మృత్తికాం జ్ఞాత్వా తాని వృన్తాని శాల్మలేః,
శృతే పయసి మృద్నీయాదాఫోఖ్యోలూఖలే తతః 74
పిణ్డం ముష్టిసమం ప్రస్థే తత్ పూతం తైలసర్పిషా,
యోజితం మాత్రయా యుక్తం కల్కేన మధుకస్య చ. 75
వస్తిమభ్యక్తగాత్రాయ దద్యాత్ప్రత్యాగతే తతః,
స్నాత్వా భుంజీత పయసా జాఙ్గలానాం రసేన వా. 76

వ్యా. పచ్చిదిగనుండుబూరుగపువ్వులయొక్క కాడలనుగ్రహించి యొకటిగజేరి పచ్చిదర్భలచే దానిపై జుట్టి దర్భలపైన నల్లనిమట్టిని కలిపి లేపనముచేసి పిడకలయం దునిచి పుటము వేయునది. దానిపైనిపూయబడినమట్టి చెమ్మలేకయెండినపుడు వానిని వెలికిం దీసి యాబూరుగపువ్వులతొడిమలు చక్కగ నుడికియున్నయెడ దానిని రోటిలోనునిచి మెత్తగ దంచి ముద్దచేసి, నీళ్లతో కలిపి పక్వముచేయబడిన ప్రస్థపరిమితమైన ఆవుపాల యందు పైజెప్పినపిష్టమును ముష్టిపరిమితమును, (ఒకపలపరిమాణముగ కలిపి చక్కగకలియు నట్లు మర్దనముచేసి వడియగట్టి అందు నూనెను, నేతిని తగుపరిమాణముతో కలిపి అతిమధు రము కల్కమునుకూడ మితముగచేర్చి యాద్రవమును వస్తిలోనుంచి, రోగికి శరీరము అభ్యఙ్గనముచేయించి వస్తిప్రయోగమును చేయునది. ఆవస్తిజౌషధము కోష్ఠమునుండి బయటవెడలినపిదప స్నానముచేసి పాలతోడను జాంగలజంతువులమాంసరసములతోడను భోజనముచేయదగును. (ఇచ్చట, సిద్ధమైనద్రవమున నూనెను నేతిని ద్రవము స్నిగ్ధ మగునంతపరిమాణంబును, అతిమధురకల్కము ద్రవము కొంచెము ఘనమగునంతపరిమితిగ నుండవలెను.

## పిచ్ఛావస్తిప్రయోగమున గల్గుగుణములు.

మూ. పిత్తాతిసారజ్వరశోథగుల్మాజీర్ణాతిసారగ్రహణీప్రదోషాన్,
జయత్యయం శీఘ్రమతిప్రవృద్ధాన్ విరేచనాస్థాపనయోశ్చ వస్తిః.

వ్యా. పైజెప్పిన వస్తిప్రయోగమువలన పిత్తాతిసారము, జ్వరము, శోథము (వాపు), గుల్మము, పక్వావస్థయందుండు అతిసారము, గ్రహణీదోషము, ఇవి మిక్కిలి వృద్ధినొందియున్నను వీనినన్నిటి శీఘ్రముగ శమింపజేయును. విరేచనముచేతను ఆస్థాపన వస్తిప్రయోగముచేతను కల్గు అతియోగాదివ్యాపత్తులను అన్నిటిని శమింపజేయును.

## రక్తాతిసారనిదాన-లక్షణములు.

మూ. పిత్తాఽతిసారీ యస్త్వేతాం క్రియాం ముక్త్వా నిషేవతే,
పిత్తలాన్యన్నపానాని తస్య పిత్తం మహాబలమ్. 78
కుర్యాద్రక్తాతిసారం తు రక్తామాశు ప్రదూషయేత్,
తృష్ణాం శూలం విదాహం చ గుదపాకం చ దారుణమ్. 79

వ్యా. పిత్తాతిసారముచే పీడింపబడినవాడు పైజెప్పిన చికిత్సాక్రమమును చేసికొనక వదలి, పిత్తమును వృద్ధినొందించునన్నపానముల సేవించుచుండిన, వానికి పిత్తము మిగుల ప్రకోపమునొంది బలవత్తరమై రక్తమును శీఘ్రముగ చెరిచి రక్తాతిసారమును కల్గించును, అట్టి రక్తాతిసారమున దప్పి యధికమగును. నొప్పియు మంటయు మిగుల తీవ్రమై గుదము పుండగును.

ఇచ్చట పిత్తాతిసారమున పథ్యమును క్రమముగ నాచరింపక పిత్తవృద్ధికరములగు నన్నపానాదుల సేవించుటచే రక్తము పిత్తముచే దుష్టమై యధికముగ వెడలును. అయ్యది రక్తాతిసారమనిచెప్పుటచేత పిత్తాతిసారమే రక్తాతిసారముగ పరిణమించుననియు, అయ్యది పిత్తాతిసారానంతరము జనించుననియు నేర్పడినది; కాని పిత్తము మిక్కిలి ప్రకోపము నొంది రక్తమును చెరిచినప్పుడు పిత్తాతిసారముతో సంబంధము లేకయే రక్తాతిసారము, (పాండురోగములేకున్నను కామలారోగము స్వతంత్రముగ జనించునట్లు) స్వతంత్రముగ గూడజనించునని యెరుంగునది. అట్టిరక్తాతిసారమునకు నుత్కటముగ వృద్ధినొందినపిత్తమే కారణమగును. కావున దానిని, వేరుగ పరిగణనముచేయక 'షడతీసారాః' అని పరిగణనముచేసినది సంగతము. కావున స్వోక్తివ్యాఘాతము కాదని యెరుంగునది.

## రక్తాతిసారమున మేకపాలనుపయోగించుట.

మూ. తత్ర ఛాగం పయః శస్తం శీతం సమధుశర్కరం,

పానార్థం భోజనార్థం చ గుదప్రక్షాళనే తథా. 80

వ్యా. రక్తాతిసారమునందు త్రాగుటకును, భోజనానుపానమునకును, గుదస్థానమున కడుగుటకును మేకపాలను కాచి చల్లార్చి యందు తేనెను చక్కెరను కలిపి యుపయోగించుట చాల ప్రశస్తము.

రక్తాతిసారమున భోజనము.

మూ. ఓదనం రక్తశాలీనాం పయసా తేన భోజయేత్,
రసైః పారావతాదీనాం ఘృతభృష్టైస్సశర్కరైః. 81

వ్యా. రక్తాతిసారమున ఎఱ్ఱవరిబియ్యపుటన్నమును మేకపాలతోనైనను, పావురము మున్నగువానిమాంసరసమును నేతితో పక్వముచేసి చక్కెర కలిపి యామాంసరసములతోనైనను భుజింపజేయవలెను.

రక్తాతిసారమున మాంసరసములు.

మూ. శశపక్షిమృగాణాం చ శీతానాం ధన్వచారిణాం,
రసైరనమ్లైస్సఘృతైః భోజయేత్తం సశర్కరైః. 82
రుధిరం మార్గమాజం వా ఘృతభృష్టం ప్రశస్యతే,

వ్యా. కుందేలు, పక్షులు, మృగములు, ఇవి శీతవీర్యముకల్గి జాంగలదేశమున సంచరించుచున్నయెడ నట్టిజంతువుల మాంసరసమున పులుపున చేర్చక, నేతితో పక్వముచేసి నేతిని కూడ కలిపి పైజెప్పిన శాల్యోదనమునగూర్చి, భోజనముచేయదగును. మరియు జింక రక్తమునైనను మేకపోతురక్తమునైనను నేతితో పక్వముచేసి చక్కెరను కూడ కలిపి భుజించుట ప్రశస్తము.

రక్తాతిసారమున యూషాదిపానము.

మూ. కాశ్మర్యఫలయూషో వా కిఞ్చిదమ్లస్సశర్కరః. 83
నీలోత్పలం మోచరసం సమఙ్గాపద్మకేసరం,
అజాక్షీరయుతం దద్యాత్ జీర్ణే చ పయసౌదనమ్. 84
దుర్బలం పాయయిత్వా వా తస్యైవోపరి భోజయేత్,
ప్రాగ్భక్తం నవనీతం వా దద్యాత్సమధుశర్కరమ్. 85

వ్యా. గుమ్మడిపండురసమును జేర్చి పక్వముచేయబడిన యూషమున కొంచెము, బాసిమ్మపండ్లు మొదలగువాని పులుపురసమును చేర్చి చక్కెరనుకూడకలిపి రక్తాతిసారము

కలవానికి త్రాగించవలెను. మరియు—నల్లకలువలు, బూరుగబంక, మంజిష్ఠి, తామర పువ్వులలోని కింజల్కములు, వీనిని చూర్ణము చేసి మేకపాలలో కలిపి త్రాగించి, అయ్యది జీర్ణమైనవెంటనే మేకపాలతో నన్నమును భుజింపజేయవలెను. రోగి బలహీనుడుగనున్న యెడ పైజెప్పినరీతిగ పాలు ద్రాగించి అప్పుడే భోజనము చేయించవలెను. లేక బలహీనత యందు వెన్నలో తేనెను చక్కెరను కలిపి భోజనమునకు మునుమున్ను తినిపించి యప్పుడే భుజింపవలెను.

## రక్తాతిసారమున ఘృతప్రాశము.

మూ. ప్రాశ్య క్షీరోత్థితం సర్పిః కపిఞ్జలరసాశనః,
త్ర్యహాదారోగ్యమాప్నోతి పయసా క్షీరభుక్తథా. 86

వ్యా. పాలనుండి చిలికి తీయబడినవెన్నను కాచి *దానగల్గునేతిని తిని యూర పిచ్చుకలమాంసరసమును పాలతో కలిపి యాహారము చేయుచున్నను, లేక పాలనే యాహారముగ జేయుచున్నను మూడుదినములకు రక్తాతిసారము నివర్తించి యారోగ్యము నొందును.

## రక్తాతిసారమున శతావరీకల్కపానము.

మూ. పీత్వా శతావరీకల్కం పయసా క్షీరభుగ్జయేత్,
రక్తాతిసారం, పీత్వా వా తయా సిద్ధం ఘృతం నరః. 87

వ్యా. పిల్లిపీచరగడ్డలను పాలతో నూరి కల్కము జేసి పాలలో కలిపి త్రాగి పాలనే ఆహారముగ జేయుచున్నను, పిల్లిపీచరగడ్డలరసమును కల్కమును జేర్చి పక్వము చేయబడిన ఘృతమును త్రాగి పాలను ఆహారముగ జేయుచున్నను రక్తాతిసారము నివర్తించును.

## రక్తాతిసారహరకుటజఘృతము.

మూ. ఘృతం యవాగూమణ్డేన కుటజస్య ఫలైశ్శృతం,
పేయం తస్యాఽనుపాతవ్యా పేయా రక్తోపశాన్తయే. 88

వ్యా. కొడిసెపాలవిత్తుల జేర్చి పక్వము చేయబడినఘృతమును యవాగూమండముతో కలిపి త్రాగి వెంటనే పేయను త్రాగినచో రక్తాతిసారము శమించును.

## రక్తాతిసారహరదారుహరిద్రాదిఘృతము.

మూ. త్వక్చ దారుహరిద్రాయాః కుటజస్య ఫలాని చ,
పిప్పలీ శృఙ్గబేరం చ ద్రాక్షా కటుకరోహిణీ. 89

షడ్భిరేతైశ్శృతం సిద్ధం పేయామణ్డావచారితం,
అతీసారం జయేచ్ఛీఘ్రం త్రిదోషమపి దారుణమ్. 90

వ్యా. మ్రానిపసుపుపైబెరడు, కొడిసెపాలవిత్తులు, పిప్పళ్లు, శుంఠి, ద్రాక్షపండు, కటుకరోహిణి, ఈయారిటిని సమభాగములుగ గూర్చి కల్కముజేసి ఆవునేతిలో గూర్చి విధిప్రకారము పక్వముచేయబడిన ఘృతమును పేయ, మండము అనుగంజితో కూడ కలిపి త్రాగినయెడ త్రిదోషములచే గల్గు క్రూరమైన యతిసారంబును అతిశీఘ్రముగ నివర్తించును. (ఇచ్చట "షడ్భిరేతైశ్శృతం" అని చెప్పుటవలన పైజెప్పిన యారిటిని తప్పక చేర్చవలెనని యర్థము.)

రక్తాతిసారమున కృష్ణమృత్తికాదియుతతండులోదకపానీయము.

మూ. కృష్ణమృత్ మధుకం శఙ్ఖం రుధిరం తణ్డులోదకం,
పీతమేకత్ర సక్షౌద్రం రక్తసఙ్గ్రహణం పరమ్. 91

వ్యా. నల్లనిమట్టి, అతిమధురము, శంఖభస్మము, ఈమూడిటిని చూర్ణముచేసి రక్తమునందును బియ్యపుకడుగునీళ్లయందును కలిపి తేనెను కూడ చేర్చి త్రాగినచో నిది రక్తాతిసారమును నిలుపుటకు ఉత్తమమైనయౌషధము.

రక్తాతిసారమున ప్రియంబగుకల్కపానము.

మూ. పీతః ప్రియఙ్గుకాకల్కః సక్షౌద్రస్తణ్డులామ్భసా,
రక్తస్రావం జయేచ్ఛీఘ్రం ధన్వమాంసరసాశినః. 92

వ్యా. ప్రేంకణపుచెక్కచూర్ణమును తేనెతోనూరి కల్కముజేసి బియ్యపుకడుగు నీటిలో కలిపి త్రాగి జాంగలజంతువులమాంసరసమునే యాహారముగభుజించుచున్న రక్తాతిసారము శీఘ్రముగ నివర్తించును.

రక్తాతిసారహరతిలకల్కపానము.

మూ. కల్కస్తిలానాం కృష్ణానాం శర్కరాపఞ్చభాగికః,
ఆజేన పయసా పీతః సద్యో రక్తం నియచ్ఛతి. 93

వ్యా. నల్లని నువ్వులను నాల్గుభాగములను మెత్తగ మేకపాలతోనూరి కల్కము చేసి అందు నువ్వులకల్కమునకు నాల్గవపాలకు సమానభాగముగ (ఐదవభాగముగ) చక్కెరచేర్చి మేకపాలతో కలిపి త్రాగినచో రక్తాతిసారమును శీఘ్రముగ నివర్తించును. నాల్గుభాగములు నువ్వులకల్కము, ఐదవభాగము చక్కెర కలుపవలెను. (ఈవిషయ

మునే జతూకర్ణతంత్రమున "కృష్ణతిలాన్ శర్కరాపాదికాన్ ఛాగీపయసా" అని చెప్పియున్నది.)

రక్తాతిసారహరవత్సకబీజరసము, చందనకల్కము.

మూ. పలం వత్సకబీజస్య శ్రపయిత్వా రసం పిబేత్,
యో రసాశీ జయేచ్ఛీఘ్రం సపైత్తం జఠరామయమ్. 94
పీత్వా సశర్కరాక్షౌద్రం చన్దనం తణ్డులామ్బునా,
దాహతృష్ణాప్రమేహేభ్యో రక్తస్రావాచ్చ ముచ్యతే. 95

వ్యా. ఒకపలము కొడిసెపాలవిత్తులను కషాయము కాచి త్రాగి మాంసరసమును ఆహారముగ జేసినయెడ పిత్తముచేకల్గిన రక్తాతిసారము శీఘ్రముగ నివర్తించును. మరియు చందనచూర్ణమును బియ్యపుకడుగునీళ్లతో నూరి కల్కముచేసి చక్కెరను తేనెను కూడ కలిపి త్రాగినయెడ తాపంబును (మంటయు), దప్పియు, ప్రమేహంబులును, రక్తాతిసారంబును నివర్తించును.

గుదపాకమునందు సేచనము.

మూ. గుదే బహుభిరుత్థానైః యస్య పిత్తేన పచ్యతే,
సేచయేత్తం సుశీతేన పటోలమధుకామ్బునా. 96
పఞ్చవల్కమధూకానాం రసైరిక్షురసైః ఘృతైః,
ఛాగైర్గవ్యైః పయోభిర్వా శర్కరాక్షౌద్రసంయుతైః. 97

వ్యా. పలుమారు విరేచనములగుటవలన పిత్తప్రకోపమునంజేసి గుదస్థానమున పుండైనచో చేదుపొట్లను అతిమధురమును కషాయము కాచి చల్లార్చి యాకషాయముచే గుదస్థానమును తడుపుచు కడుగుచుండవలెను.

మరియు పంచవల్కములయొక్కయు (మఱ్ఱి, అత్తి, రావి, ప్రబ్బలి, జువ్వి, అను నీయైదిటిపట్టలు చేరి పంచవల్కములు), అతిమధురముయొక్కయు కషాయములచేనైనను, చెరకురసముచేనైనను, ఘృతముచేనైనను, చక్కెరను తేనెనుకలిపిన ఆవుపాలచేనైనను, మేకపాలచేనైనను, తడుపుచున్నను గుదస్థానమున కల్గినపుండు మానును.

(ఇచ్చట "సేకే చతుర్గుణం ద్రవ్యాత్ జలమష్టావశేషితమ్" అనుపరిభాషనుబట్టి పంచవల్కాలాదులకు నాల్గింతలుజలమును చేర్చి యెనిమిదవపాలు మిగులునట్లు కషాయము కాచనగును. సేకకషాయస్థలములయందెల్ల నీపరిభాషచే కషాయమును సిద్ధము చేయనగును.)

## అతిసారమునందలి గుదపాకమున లేపాదులు.

మూ. ప్రక్షాలనానాం కల్కైర్వా ససర్పిష్కైః ప్రలేపయేత్,
ఏషాం వా సుకృతైః శ్చూర్ణైః తం గుదం ప్రతిసారయేత్. 98
ధాతకీలోధ్రచూర్ణైర్వా సమాంశైః ప్రతిసారయేత్,
తథా స్రవతి నో రక్తం గుదం తైః ప్రతిసారితమ్ 99
పక్వేతా ప్రశమం యాతి వేదనా చోపశామ్యతి,

వ్యా. గుదస్థానమున పుండైనపుడు గుదప్రక్షాళనకషాయమునకై పైని చెప్పబడిన చేదుపొట్ల మున్నగువానిని మెత్తగ నూరి చూర్ణముచేసి అందు నెయ్యి కలిపి పుండైన గుదస్థానమున పూయవలయును. లేక చేదుపొట్ల మొదలగు నీద్రవ్యములనే మెత్తని చూర్ణముగచేసి గుదస్థానమున చల్లవలయును. మరియు ఆరెపువ్వులను లొద్దుగుపట్టను సమభాగములుగ చూర్ణముచేసి పైజెప్పినరీతిగ గుదస్థానమున చల్లవలయును. ఈ చికిత్సచేత గుదస్థానమునుండి రక్తము స్రవించదు. పుండును దాన గల్గు బాధలన్నియు శమించును.

## రక్తాతియోగమున గుదసేచనవిధి.

మూ. యథోక్తైః సేచనైః శీతైః శోణితేఽతిస్రవత్యపి 100
గుదవంక్షణకట్యూరు సేచయేత్ ఘృతభావితం,
చన్దనాద్యేన తైలేన శతధౌతేన సర్పిషా. 101
కార్పాససంగృహీతేన సేచయేత్ గుదవంక్షణౌ,

వ్యా. పైజెప్పబడిన చల్లనికషాయాదులచే ప్రక్షాళనముచేసినను రక్తవిరేచనము నిలువక అధికముగ స్రవించుచున్నయెడ గుదస్థానమునందును, గజ్జలయందును, తొడల యందును, నేతినిపూసి పైజెప్పిన కషాయాదులచే సేచనముచేసి కడుగవలయును. పిమ్మట చందనాదితైలమునైనను, శతధౌతఘృతమునైనను, ప్రత్తితో తడిపి గుదస్థానము, గజ్జల యందును, తొడలయందును పూయవలయును. (ఇచ్చట ఆయావ్యాధికి తగిన యౌషధ ములచే సిద్ధమయిన కషాయాదిద్రవములయందు ఘృతమును చేర్చి కవ్వముతో నూరు పర్యాయములు చిలికిన నందేర్పడుఘృతము శతధౌతమని యెరుంగునది.)

## రక్తాతిసారమున రక్తాతిప్రవర్తియందు పిచ్ఛ-అనువాసనవస్తిప్రయోగము.

మూ. అల్పాల్పం బహుశో రక్తం సశూలముపవేశ్యతే. 102

యదా వా యుర్విబద్ధశ్చ కృచ్ఛ్రం చరతి వా న వా,
పిచ్ఛావస్తిం తదా తస్య యథోక్తముపకల్పయేత్. 103
ప్రపౌణ్డరీకసిద్ధేన సర్పిషా చానువాసయేత్,

వ్యా. రక్తాతిసారమున కొంచెము కొంచెముగ రక్తము నొప్పితోకూడి పలుమారు వెడలుచున్నను, అధికముగ రక్తము వెడలుచున్నను, అపానవాతము బంధింపబడి కష్టముగ వెడలుచున్నను, బొత్తుగ వెడలకున్నను, అట్టియవస్థయందు "పరివేష్ట్య కుశైరార్ద్రై...... జాఙ్గలానాం రసేన వా" (శ్లో. ౭౩—౭౬.) అని పైనచెప్పబడిన పిచ్ఛావస్తిని ప్రయోగింపదగును. పిదప ప్రపౌండరీకమును చేర్చి పక్వముచేయబడిన ఘృతముచే విధ్యుక్త ప్రకారము అనువాసనవస్తిని ప్రయోగింపదగును. (ప్రపౌండరీకమన పుండరీకమను గ్రంథద్రవ్యవిశేషము.)

### చిరకాలానువృత్తాతిసారమున స్నేహసేచనావశ్యకత.

మూ. ప్రాయశో దుర్బలగుదాః చిరకాలాతిసారిణః. 104
తస్మాదభీక్ష్ణశస్తేషాం గుదే స్నేహం ప్రయోజయేత్,

వ్యా. చిరకాలముపరకు అతిసారము శమించక అనుసరించియుండువారికి గుదస్థానము చాల బలహీనమైయుండును. కావున అట్టి పరిస్థితియందు ప్రత్తిని ఘృతము, తైలము మున్నగు స్నేహములయందు తడిపి భావనచేసి గుదస్థానమున మాటిమాటికి ప్రయోగించుచుండవలయును.

### వాతప్రాబల్యమున వస్తికర్మప్రాశస్త్యము.

మూ. పవనోఽతిప్రవృత్తో హి స్వస్థానే లభతేఽధికమ్. 105
బలం తస్య సపిత్తస్య జయార్థే వస్తిరుత్తమః,

వ్యా. విరేచనము లధికముగ నగుటవలన వాతము పక్వాశయము కటిప్రదేశము మున్నగు స్వస్థానములయందు మిక్కిలి యధికముగ బలమునొందును. అట్టివాతంబును పిత్తంబును శమించుటకై వస్తిప్రయోగము మిక్కిలి యుత్తమముగనుండును.

### రక్తాతిసారమున శతావరీఘృత-నవనీతోపయోగము.

మూ. రక్తం విట్సహితం పూర్వం పశ్చాద్వా యోఽతిసార్యతే. 106
శతావరీఘృతం తస్య లేహార్థముపకల్పయేత్,
శర్కరార్ధాంశికం లీఢం నవనీతం నవోద్ధృతమ్. 107
క్షౌద్రపాదం జయేచ్ఛీఘ్రం తం వికారం హితాశినః,

వ్యా. అతిసారమునందు రక్తము మలముతో కూడియైనను, మలము వెడలుటకు ముందుగనైనను, వెనుకనైనను పలుమారు నధికముగ వెడలుచున్నయెడ యోనివ్యాపత్తు చికిత్సయందు చెప్పబడిన శతావరీఘృతమున రోగికి నాకించవలయును. లేక అప్పుడు చిలికి క్రొత్తగతీయబడిన వెన్నయందు వెన్నకు సమభాగముగ శర్కరను నాల్గవభాగము తేనెను కలిపి నాకి హితముగ పథ్యాహారముచేసినయెడ అట్టి రక్తాతిసారము శీఘ్రముగ నివర్తించును. ఇచ్చట యోనివ్యాపత్సికిత్సయందు "శతావరీమూలతులాశ్చతస్రః... వాతపిత్తాత్మకాన్ జయేత్" (చికిత్స. అ. ౩౦. శ్లోకం. ౬౪—౬౮.) అని చెప్పబడు శతావరీఘృతమును అనుకర్షించునది.

మూ. న్యగ్రోధోదుమ్బరాశ్వత్థశుఙ్గానాపోథ్య వాసయేత్. 108
అహోరాత్రం జలే తప్తే ఘృతం తేనామ్బునా పచేత్,
తదర్ధశర్కరాయుక్తం లిహ్యాత్ సక్షౌద్రపాదికమ్. 109
అధో వా యది వా ఉపూర్ధ్వం యస్య రక్తం ప్రవర్తతే,

వ్యా. మఱ్ఱిచిగుళ్లు, అత్తిచిగుళ్లు, రావిచిగుళ్లు ఈమూటిని సమభాగములుగ చేర్చి నలియగొట్టి చక్కగ కాచబడిన వేడినీళ్లలో నునిచి యొకయహోరాత్రము నానబెట్టి యాజలమును వడియగట్టి అందు ఆవునేతిని చేర్చి ఘృతపాకవిధిప్రకారము పక్వముచేసి పిదప ఘృతమున కర్ధభాగము చక్కెరను, నాలుగవవంతు తేనెను గలిపి యుంచునది. ఈఘృతమును అధోమార్గముగనైనను, ఊర్ధ్వమార్గముగనైనను రక్తము వెడలుచున్న యెడల అగ్నిబలానుసారముగ సేవించునది.

రక్తాతిసారమున పిత్తవర్ధకాహారనిషేధము.

మూ. యస్త్వేవం దుర్బలో మోహాత్ పిత్తలాన్యేవ సేవతే. 110
దారుణం స వలీపాకం ప్రాప్య శీఘ్రం విపద్యతే,

వ్యా. ఇత్తెరంగున పిత్తాతిసారచికిత్స చెప్పబడినది. అట్టి యతిసారముచే జఠరాగ్ని శరీరబలము మిక్కిలి క్షీణించియున్నపుడు పైనియమము ననుసరించక పిత్తమును వృద్ధినందించుపదార్థములను నజ్ఞానంబునం జేసి సేవించుచున్నయెడ వానికి గుదమునందు వళులయందు క్రూరమైన పుండుకల్గి అతిశీఘ్రముగ నాపత్తునొందును. ఇంతదనుక పిత్తాతిసారచికిత్స చెప్పబడినది.

కఫాతిసారచికిత్సాక్రమము, అందు లంఘనపాచనవిధి.

మూ. శ్లేష్మాతిసారే ప్రథమం హితం లఙ్ఘనపాచనమ్. 111
యోజ్యశ్చామాతిసారఘ్నం యథోక్తో దీపనో గణః,

వ్యా. శ్లేష్మాతిసారమున తొలుత లంఘనమును పాచనౌషధముల ప్రయోగించవలయును. పిదప ఆమాతిసారమునందు "శాలిపర్ణీ పృశ్నిపర్ణీ" అని యుపక్రమించి చెప్పబడిన దీపనీయగణద్రవ్యములను అన్నపానాదివిధులయం దుపయోగింపదగును. ఇచ్చట వాతాతిసారమున "శాలిపర్ణీ పృశ్నిపర్ణీం......గణో దీపనపాచనః" (30—33) అని చెప్పబడిన దీపనపాచనగణద్రవ్యములను అన్నపానములయందు నుపయోగింపవలెనని యెఱుంగునది.

### కఫాతిసారమున లంఘనానంతరము చికిత్సావిధి.

మూ. లఙ్ఘితస్యానుపూర్వ్యేణ కృతాయాం న నివర్తతే. 112
కఫజో యద్యతీసారః కఫఘ్నైస్తముపాచరేత్,

వ్యా. పైజెప్పినవిధిప్రకారము లంఘనము చేయించి పేయాదిక్రమము నాచరించినను, నతిసారము నివర్తింపకున్నయెడ అట్టి కఫాతిసారమున నీక్రింద చెప్పబడు కఫహరౌషధములచే చికిత్సచేయదగును.

### శ్లేష్మాతిసారమున నాల్గుకషాయయోగములు.

మూ. బిల్వం కర్కటికా ముస్తమభయావిశ్వభేషజమ్. 113
వచా విడఙ్గం భూతీకం ధాన్యకం దేవదారు చ,
కుష్ఠం సాతివిషా పాఠా చవ్యం కటుకరోహిణీ. 114
పిప్పలీ పిప్పలీమూలం చిత్రకం హస్తిపిప్పలీ,
యోగాః శ్లోకార్ధవిహితాః చతురస్త్రాన్ ప్రయోజయేత్. 115
శృతాః శ్లేష్మాతిసారేషు కాయాగ్నిబలవర్ధనాః,

వ్యా. మారేడుపిందెలు, కర్కాటకశృంగి, తుంగగడ్డలు, కరక్కాయబెరడు, శుంఠి, ఈయైదిటినైనను; వస, వాయువిడంగములు, కామంచిగడ్డి, దనియాలు, దేవదారుచెక్క, యీయైదిటినైనను; చెంగల్వకోష్టు, అతివస, చిరుబొద్ది, చవ్యము, కటుకరోహిణి, ఈయైదిటినైనను; పిప్పళ్లు, మోడి, చిత్రమూలము, గజపిప్పళ్లు ఈనాల్గిటినైనను; (పైజెప్పినశ్లోకార్ధములచే నేర్పడు నాల్గుయోగములును విధ్యుక్తముగ వేరువేరుగ కషాయము కాచి శ్లేష్మాతిసారములయందు త్రాగించినయెడ జాఠరాగ్నిని శరీరబలమును వృద్ధినొందించును.

### కఫాతిసారహర అజాజ్యాదిచూర్ణము.

మూ. అజాజీమసితాం పాఠాం నాగరం మరిచాని చ. 116

ధాతకీ ద్విగుణాం దద్యాత్ మాతులుఙ్గరసాప్లుతం,

వ్యా. జీలకర, పిప్పళ్లు, చిరుబొద్ది, శుంఠి, మిరియాలు ఇవి యొక్కొక్కభాగము ఆరెపువ్వు రెండుభాగములు వీనినన్నిటి నొకటిగ జేర్చి చూర్ణము చేసి, మాదీఫలరసమునకలిపి కఫాతిసారమున సేవించునది.

**రసాంజనాదిచూర్ణము.**

మూ. రసాఞ్జనం సాతివిషం కుటజస్య ఫలాని చ. 117
ధాతకీద్విగుణాం దద్యాత్పాతుం సక్షౌద్రనాగరం,

వ్యా. రసాంజనము, అతివస, కొడిశపాలవిత్తులు, శుంఠి, ఇవి ఒక్కొక్కభాగము ఆరెపువ్వు రెండుభాగములు ఇత్తెరంగున వీనినన్నిటిని కల్కముచేసి మాదీఫలరసమునకలిపి తేనెను కూడ చేర్చి త్రాగవలయును.

**కఫాతిసారమున ఖడయూషములు.**

మూ. ధాతకీనాగరీబిల్వం లోధ్రం పద్మస్య కేసరమ్. 118
జమ్బ్వాత్వక్ నాగరం ధాన్యం పాఠా మోచరసో బలా,
సమఙ్గా ధాతకీ బిల్వమధ్యం జమ్బ్వామ్రయోస్త్వచః 119
కపిత్థాని విడఙ్గాని నాగరం మరిచాని చ,
చాఙ్గేరీకోలతక్రామ్లాం శ్చతురస్తాన్కఫోత్తరే. 120
శ్లోకార్ధవిహితాన్దద్యాత్ సస్నేహలవణాన్ ఖడాన్,

వ్యా. ఆరెపువ్వు, శుంఠి, మారేడుపిందెలు, లొద్దుగచెక్క, తామరపువ్వునందలి కేసరములు, ఈయైదిటినైనను; నేరేడుపట్ట, శుంఠి, దనియాలు, చిరుబొద్ది, బూరుగుబంక, చిట్టాముట్టి, యీయారిటినైనను; మంజిష్ఠి, ఆరెపువ్వు, మారేడుగుజ్జు, నేరేడుపట్ట, మామిడిపట్ట, ఈయైదిటినైనను; వెలగపండుగుజ్జు, వాయువిడంగములు, శుంఠి, మిరియాలు, ఈనాల్గిటినైనను; పులిచింతాకురసము, రేగుపండ్లరసము, పులిమజ్జిగ వీనితో కూడ చేర్చి ఖడయూషములను సిద్ధముచేసి యందు నేతిని ఉప్పును యథోచితముగ కలిపి కఫాతిసారమున త్రాగవలయును. (ఇచ్చట ఒక్కొక్క శ్లోకార్ధముచే చెప్పబడిన ద్రవ్యములను నొక్కొక్కగణముగ చేసి నాల్గుఖడయూషయోగములని యెరుంగునది.

**కఫజాతిసారమున కపిత్థసేవనము.**

మూ. కపిత్థమధ్యం లీఢ్వా తు సవ్యోషక్షౌద్రశర్కరమ్. 121

కట్ఫలం మధుయుక్తం వా ముచ్యతే జఠరామయాత్,

వ్యా, వెలగకాయగుంజును త్రికటుక (శుంఠి, పిప్పళ్లు, మిరియాల) చూర్ణముతో కలిపి అందు చక్కెరను, తేనెను కలిపి నాకినయెడ నతిసారము నివర్తించును. లేక కాయఫలమును చూర్ణముచేసి తేనెతో కలిపి సేవించినను అతిసారమున కల్గిన కడుపునొప్పి శమించును.

కఫాతిసారమున పిప్పల్యాదిచూర్ణము.

మూ. కణాం మధుయుతాం పీత్వా తక్రం పీత్వా సచిత్రకమ్. 122
జగ్ధ్వా వా బాలబిల్వాని, ముచ్యతే జఠరామయాత్,

వ్యా. పిప్పళ్లను చూర్ణముచేసి తేనెతో కలిపి త్రాగినను, చిత్రమూలమును నూరి పుల్లనిమజ్జిగలో కలిపి త్రాగినను, లేతమారేడుపిందెలను నమలి తిన్నను కఫజాతిసారము నివర్తించును.

కఫాతిసారమున బాలబిల్వాదిచూర్ణము.

మూ. బాలబిల్వం గుడం తైలం పిప్పలీం విశ్వభేషజమ్. 123
లిహ్యాద్వాతే ప్రతిహతే సశూలస్సప్రవాహికః,

వ్యా. లేతమారేడుపిందెలు, బెల్లము, నూనె, పిప్పళ్లు, శుంఠి, వీనినన్నిటిని సమభాగములుగ గూర్చి నూరి లేహ్యముగ జేసి నాకినయెడ కఫాతిసారమున వాతము బద్ధగించి శూలముతో గూడి ముక్కుచు ప్రవర్తులగుచున్న నయ్యది శమించును.

కఫాతిసారమున భోజనవిధి.

మూ. భోజ్యం మూలకషాయేణ వాతఘ్నైశ్చోపసేవనైః. 124
వాతాఽతిసారవిహితైః యూషైర్మాంసరసైః ఖడైః,

వ్యా. ముల్లంగిని చేర్చి పక్వముచేయబడిన యూషముతోడను, వాతహరములగు వ్యంజనములతోడను, వాతాతిసారమున విధింపబడిన యూషములు, మాంసరసములు, ఖడయూషములు మున్నగువానితోడను భోజనకాలమున నాహారముల భుజింపవలెను.

కఫాతిసారమున నమ్లఘృతోపయోగము.

మూ. పూర్వోక్తమమ్లసర్పిర్వా షట్పలం వా యథాబలమ్. 125
పురాణం వా ఘృతం దద్యాత్ యవాగూమణ్డమిశ్రితమ్,

వ్యా. మరియు కఫాతిసారమున ముందు చెప్పబడిన అమ్ల (చాంగేరీ) ఘృతమునైనను, షట్పలఘృతమునైనను, ప్రాతనేతినైనను, యవాగులయందును, మండముల

యందును కలిపి, అగ్నిబలాద్యనుసారముగ నుపయోగింపందగును. (ఇచ్చట "చాంగేరీ కోల...చిత్రకం" (శ్లో. ౭౮) అని చెప్పబడిన ఘృతయోగయను, "అమ్లసర్పిర్వా" అనుపదముచే నతిదేశింపబడినది.)

కఫాతిసారమున పిచ్ఛావస్తివిధానము.

మూ. వాతశ్లేష్మవిబద్ధే వా కఫే వాఽతిస్రవత్యపి. 126
శూలే ప్రవాహికాయాం వా పిచ్ఛావస్తిం ప్రయోజయేత్;
పిప్పలీబిల్వకుష్ఠానాం శతాహ్వావచయోరపి 127
కల్కైస్సలవణైర్యుక్తం పూర్వోక్తం సన్నిధాపయేత్,

వ్యా. కఫాతిసారమున వాతశ్లేష్మములు బంధింపబడియున్నను, కఫము అధికముగ విరేచనరూపముగ స్రవించుచున్నను, నొప్పియు ప్రవాహికయు కల్గియున్నను పిచ్ఛావస్తిని ప్రయోగింపవలెను. అందు—పిప్పళ్లు, మారేడుపిందెలు, చెంగల్వకోష్టు, సదాపవిత్తులు, వస, సైంధవలవణము, వీనిని సమభాగములుగ గూర్చి కల్కముచేసి పిత్తాతిసారచికిత్సయందు "పరివేష్ట్య కుశైరార్ద్రైః" అని చెప్పిన పిచ్ఛావస్త్యౌషధమున గూడ చేర్చి విధ్యుక్తప్రకారము పిచ్ఛావస్తిని ప్రయోగించవలెను.

కఫ-వాతాఽతిసారమున కనువాసనవస్తివిధి.

మూ. ప్రత్యాగతే సుఖం స్నానం కృతాహారం దినాత్యయే. 128
బిల్వతైలేన మతిమాన్ సుఖోష్ణేనాఽనువాసయేత్,
వచాద్యైరథవా కల్కైః తైలం పక్త్వాఽనువాసయేత్. 129
బహుశః కఫవాతార్తః తథా స లభతే సుఖం,

వ్యా. పైజెప్పబడిన పిచ్ఛావస్తిప్రయోగముచే దోషము సుఖముగ బైటవెడలిన పిదప సుఖోష్ణమైనజలమున స్నానముచేసి విధ్యుక్తప్రకారము పథ్యాహారమును చేసిన పిదప సాయంకాలమున (సిద్ధిస్థానమున జెప్పబడిన) బిల్వమును చేర్చి సిద్ధముచేయబడిన సుఖోష్ణముగనుండు బిల్వతైలముచే విధ్యుక్తప్రకారము, అనువాసనవస్తిని ప్రయోగించునది. లేక పైజెప్పిన పిచ్ఛావస్తియందలి "పిప్పలీ-బిల్వ-కుష్ఠ-శతాహ్వా-వచ," అని నిర్దేశింపబడినద్రవ్యములను కల్కముగజేసి విధ్యుక్తముగ తైలమును పక్వముజేసి యాతైలముచేనైనను అనువాసనవస్తి నుపయోగించునది. ఈవస్తిప్రయోగములవలన వాతకఫములచే బాధింపబడినరోగి మిక్కిలి సుఖమునొందును.

(ఇచ్చట సిద్ధిస్థానమున "దశమూలంబలాం రాస్నాం, సర్వవాత...వికారనుత్" (సిద్ధి-అ-౪. శ్లో. ౭) అని చెప్పబడు అనువాసనయోగ్యబిల్వతైలము గ్రహింపబడును.)

మూ. స్వేస్థానే మారుతోఽవశ్యం వర్ధతే కఫసంక్షయే. 130
స వృద్ధస్సహసా హన్యాత్ తస్మాత్తం త్వరయా జయేత్,

వ్యా. అతిసారములన్నిటియందును చికిత్సావిధానముచే కఫము క్షీణించినపుడు (స్నేహము బొత్తుగ లేకపోవుటవలన పక్వాశయమున వ్యాపించినవాతము శరీరము రూక్షమగుటంజేసి అవశ్యముగ స్వస్థానమున వృద్ధినొందును; అట్లు వృద్ధినందినవాతము (శీఘ్రకారిస్వభావము కల్గియుండుటంజేసి) అతిశీఘ్రముగ రోగిని చంపును; కావున కఫము క్షీణించినపుడు వెంటనే వాతహరచికిత్సను తప్పక చేయవలెను.

(అతిసారములన్నిటియందును పక్వాశయమున వాతము వ్యాపించి వృద్ధినొందియే యుండును. కఫము క్షీణించినపుడు మరింత వృద్ధినంది శరీరమునం దెల్ల నిరంతరముగ వ్యాపించును. అట్టియెడ స్నేహప్రధానమైన అనువాసనవస్తి మున్నగుచికిత్సను చేసినయెడ శరీరము స్నిగ్ధమగును. అట్టి స్నేహసంబంధముచే రూక్షప్రధానమైనవాతము శమించి వ్యాపకము తగ్గియుండునని భావము.)

సాన్నిపాతికాఽతిసారచికిత్సాక్రమము.

మూ. వాతస్యాఽనుజయేత్ పిత్తం పిత్తస్యాఽనుజయేత్ కఫమ్. 131
త్రయాణాం వా జయేత్పూర్వం యో భవేద్బలవత్తరః,

వ్యా. మరియు త్రిదోషములును సమములుగ ప్రకోపించి జనించిన సన్నిపాతాతిసారమునందు తొలుత వాతమును హరించుచికిత్స జేసి వాతము శమించినపిదప పిత్తమును శమింపజేయనగును. పిత్తముశమించినపిమ్మట కఫమును శమింపజేయవలెను. అందు త్రిదోషములలో తారతమ్యమున్నపుడు పైజెప్పినక్రమమునే యపేక్షించక వానిలో నెద్ది బలవత్తరముగ నుండునో దానికే తొలుత చికిత్సచేయవలెను.

ఇచ్చట నీవిషయము నెరుంగునది:—సన్నిపాతజ్వరమునందు దోషములుమూడును ప్రకోపించియున్నపుడు మూడుదోషములను సమకాలమున హరించు నౌషధములేదు కావున, అట్టియెడ జ్వరమున కుత్పత్తిస్థానమైన యామాశయము కఫమునకును ముఖ్యస్థానముకావున, తొలుతజ్వరస్థానమున (ఆమాశయమున) ప్రధానమైనకఫమునకు చికిత్స జేసి, పిదప పిత్తమునకును, అటుపిమ్మట వాతమునకును వరుసగ చికిత్సచేయవలెనని— "సంసృష్టాన్ సన్నిపతితాన్...కఫస్థానానుపూర్వ్యా వా సన్నిపాతజ్వరం జయేత్"

(చి. అ. 3.) అనువాక్యముచే జెప్పబడినది. ఈవిషయమే భేలసంహితయందును ఇట్లు చెప్పబడినది:—"సన్నిపాతజ్వరే పూర్వం కుర్యాదామకఫాపహమ్, పశ్చాచ్ఛ్లేష్మణి సంక్షీణే శమయేత్పిత్తమారుతౌ" ప్రకృతమున అట్టిన్యాయము ననుసరించి సన్నిపాతాతిసారమునందును కఫానుపూర్వచికిత్సజేయక తొలుత వాతహరచికిత్సజేసి, పిత్తకఫములకు పిమ్మట చికిత్సజేయవలెనని "వాతస్యాను" అనువాక్యముచే విధింపబడినదని యెరుంగునది. ఈచికిత్సానుపూర్వినే వాగ్భటాచార్యులు నిట్లుపదేశించెను:—"వాయోరనన్తరం పిత్తం పిత్తస్యానన్తరం కఫం, జయేత్పూర్వం త్రయాణాం వా భవేద్యో బలవత్తరః" (అ. హృ. చి. అ. ౯. శ్లో. ౧౨౧.)

మూ. ప్రాగుత్పత్తిర్నిమిత్తాని లక్షణం సాధ్యతా న చ. 132
క్రియా చావస్థికీ సిద్ధా నిర్దిష్టా హ్యాతిసారిణాం,

వ్యా. అతిసారరోగముయొక్క ప్రాగుత్పత్తి(విప్రకృష్టకారణ)క్రమంబును, సన్నికృష్టకారణంబులును, ప్రత్యేకలక్షణంబులును, సాధ్య-అసాధ్యవిభాగంబులును, వానియవస్థానుసారముగ చికిత్సాక్రమంబును, సిద్ధయోగంబులును, (ఇవియన్నియు) నీయతిసారచికిత్సాధ్యాయమున నిర్దేశించి చెప్పబడినవి.

ఇత్యగ్నివేశకృతే తన్త్రే, చరకప్రతిసంస్కృతే, దృఢబలసంపూరితే,
చికిత్సాస్థానే, అతిసారచికిత్సితం నామ ఏకోనవింశోఽధ్యాయః.

వ్యా. ఇత్తెరంగున నగ్నివేశకృతంబును, చరకప్రతిసంస్కృతంబును నగుచరకసంహితయను నాయుర్వేదతంత్రమునందలి చికిత్సాస్థానమున దృఢబలసంపూరితభాగమున పందొమ్మిదవయధ్యాయము సంపూర్ణము.

---

## వింశాధ్యాయము.

అవతరణిక:—శరీరమునందు అధోమార్గమైనగుదంబును ఊర్ధ్వమార్గమైనముఖంబు (నోరు)ను ప్రధానమార్గములు. అందు అధోమార్గముననుండి దోషము లధికముగ వెడలు నతిసారమునకు చికిత్స పైయధ్యాయమున జెప్పబడినది. పిమ్మట నూర్ధ్వమార్గదోషాతిప్రవృత్తిరూపచ్ఛర్దిచికిత్సిత మీయధ్యాయమున జెప్పబడును.

మూ. అథాతశ్ఛర్దిచికిత్సితం వ్యాఖ్యాస్యామః. 1
ఇతి హ స్మాహ భగవానాత్రేయః. 2

వ్యా. అతిసారచికిత్సితమును జెప్పినపిదప చ్ఛర్దిచికిత్సితమును భగవానుడగు నాత్రేయు లుపదేశించినదానికన్న న్యూనాతిరేకము గాకుండ వివరించి చెప్పెదనని యర్థము.

## ఛర్దినుద్దేశించి యగ్నివేశునిప్రశ్నము.

మూ. యశస్వినం బ్రహ్మతపోద్యుతిభ్యాంజ్వలన్తమగ్న్యర్కసమప్రభావం,
పునర్వసుం భూతహితే నివిష్టం పప్రచ్ఛ శిష్యోఽత్రిజమగ్నివేశః 3

వ్యా. ప్రశస్తమైన కీర్తికలవాడును, తత్వజ్ఞానముయొక్కయు, తపస్సుయొక్కయు తేజోవిశేషముచే ప్రకాశించువాడును, అగ్నికిని, సూర్యునకును సమానమయినప్రభావముకలవాడును, ప్రపంచమునందలి ప్రాణికోటులకు హితము చేయుటయందు అభినివేశముకలవాడును, అత్రికుమారుడును, పునర్వసువను నామాంతరముకలవాడునగు నాత్రేయమహర్షిని శిష్యుడైనయగ్నివేశుడు యీక్రిందచెప్పబడువిధముగ నడిగెను.

మూ. యాశ్ఛర్దయః పఞ్చ పురాత్వయోక్తారోగాధికారే భిషజాంవరిష్ఠ!
తాసాంచికిత్సాంసనిదానలిఙ్గాంయథావదాచక్ష్వనృణాంహితార్థమ్.

వ్యా. ఓగురువర్యా! యింతకుమున్ను అష్టోదరీయాధ్యాయమున రోగసంఖ్యాభేదమును చెప్పుతరి ఛర్దులు ఐదువిధములని నిర్దేశింపబడినవి. ఆయైదిటికి వేరువేరుగ నిదానమును లక్షణములను చికిత్సలను యథాక్రమముగ మనుజులకు హితమునకై చెప్పవలయునని ప్రార్థించెద (అని యగ్నివేశుడు ఆత్రేయులనడిగెనని భావము.) ఇచ్చట "పఞ్చ చ్ఛర్దయ ఇతి:—ద్విష్టాన్నసంయోగ-వాత-పిత్త-కఫ-సన్నిపాతోద్రేకాత్మికాః" (చ. సూ. అ.౧౯. శ్లో.౧౯.) అనినిర్దేశింపబడినదాని ననువదించి శిష్యుడు ప్రశ్నచేసెను.

## ఆత్రేయప్రతివచనము.

మూ. తదగ్నివేశస్య వచో నిశమ్య ప్రీతో భిషక్శ్రేష్ఠ ఇదం జగాద,
యాశ్ఛర్దయః పఞ్చ పురామయోక్తాస్తా విస్తరేణ బ్రువతోనిబోధ.

వ్యా. వైద్యులలో మిగుల ప్రశస్తిగాంచిన నాత్రేయమహర్షి పైజెప్పిన యగ్నివేశవాక్యమునువిని చాలప్రీతచిత్తుడై ఓయగ్నివేశా! యింతకుముందు ఐదువిధములుగ నాచే నిర్దేశింపబడిన ఛర్దులను విస్తరించి నేను చెప్పెదను. సావధానముతో వినుము అని యాత్రేయులు చెప్పదొడంగను.

## ఛర్దిభేదములు.

మూ. దోషైః పృథక్ త్రిప్రభవాః చతస్రః (చతుర్థీ) ద్విష్టార్థయోగా
దపి పఞ్చమీ స్యాత్,

వ్యా. వాతపిత్తకఫములు అనుమూడుదోషములచే వేరువేరుగను, మూడుదోషములసన్నిపాతముచేతను కల్గిన ఛర్దులు నాలుగును, మనస్సునకు ఇంపుగాని పదార్థముల శబ్ద-స్పర్శ-రూప-రస-గంధములయొక్క సంబంధమున గల్గినచర్ది యైదవదియు కలిసి ఛర్ది భేదము లైదుగనుండును.

ఛర్ది యనుశబ్దము "ఛద-అపవారణే, అర్ద హింసాయాం" అనురెండుధాతువులచే నిష్పన్నమైనది, కావున నోటియందు వ్యాపించి, శరీరావయవముల బాధించుచు దోషమును బైటవెడలించువ్యాధివిశేషమని యన్వర్థముగ జెప్పబడును. (వమనమని భావము.)

## ఛర్దిరోగపూర్వరూపములు.

మూ. తాసాం హృదుత్క్లేశకఫప్రసేకౌ ద్వేషోఽశనే చైవ హి పూర్వ రూపమ్. 6

వ్యా. అట్టి ఛర్దిరోగములు కల్గుటకు మునుమున్ను హృదయమున నుత్క్లేశము ఆశయముననుండుదోషము వమనమున కభిముఖమై యోకరింతలు కల్గును. నోట కఫము కారుచుండును. ఆహారముపై నేవగింపు కల్గును. (ఇవిచ్ఛర్ది రోగమునకు పూర్వరూపములు.)

## వాతికచ్ఛర్దినిదానము, సంప్రాప్తి.

మూ. వ్యాయామతీక్ష్ణౌషధ శోకరోగభయోప వాసాద్యతికర్శితస్య, వాయుర్మహాస్రోతసి సమ్ప్రవృద్ధః ఉత్క్లేశ్య దోషాఁ తత ఊర్ధ్వమస్యన్. 7

అమాశయోత్క్లేశకృతాం చ మర్మ ప్రపీడయఁచ్ఛర్దిముదీరయేత్తు, (క్రుద్ధో మహాస్రోతసి మాతరిశ్వా దోషాఁ సముత్క్లిశ్య తదూర్ధ్వమస్యన్, ఆమాశయోద్రేకకృతాం చ మర్మ ప్రపీడయఁ చ్ఛర్దిముదీరయేచ్చ,)

వ్యా. వ్యాయామము (శరీరమున కాయాసముగల్గించుపనుల) నధికముగ జేసినను, మిక్కిలి తీక్ష్ణములగు నౌషధముల సేవించినను, శోకము రోగము భయము ఉపవాసము మున్నగుకృత్యముల జేసినను శరీరము మిక్కిలి కృశించినవానికి కోష్ఠమున వాతము మిగుల ప్రకోపమునొంది అందలి దోషములను పైకి పెకలించి యచ్చటనుండి పైకి వెడలింపుచు హృదయమర్మమును బాధింపుచు ఛర్దిని (వమనమును) కల్గించును. మరియు నామాశయమున నుత్క్లేశమును కల్గించు (వేళ్లు మున్నగువానిచే పెకలించు) వారికిని పైజెప్పిన రీతిగ వాతము ప్రకోపమునొంది హృదయమర్మమును బాధించుచు వమనమును కల్గించును.

## వాతికచ్ఛర్దిలక్షణములు.

మూ. హృత్పార్శ్వపీడాముఖశోషమూర్ధనాభ్యార్తికాసస్వరభేదతోదైః.
ఉద్గారశబ్దప్రబలం సఫేనం విచ్ఛిన్నకృష్ణం తనుకం కషాయం,
కృచ్ఛ్రేణ చాల్పం మహతా చ వేగే నాఽఽర్తోఽనిలాత్ ఛర్దయతీహ దుఃఖం. 9

వ్యా. పైజెప్పినరీతిగ వాతప్రకోపమున గల్గి ఛర్దిరోగమునందు హృదయమునందును, ఇరుప్రక్కలయందును నొప్పికల్గును. నోరెండును. శిరస్సునందును నాభిస్థానమునను నొప్పి కల్గును. దగ్గు కల్గును. కంఠస్వరముమారి కుత్తుకయందును ఒడలియందును సూదులగ్రుచ్చినవిధముగ బాధ కల్గును. వమనము వెడలునపుడు మిక్కిలి ప్రబలమైనశబ్దముతోగూడి నురుగుతో కలిసి కొద్దిగనలుపుగల్గి పలుచనై వగరుతో గూడిన దుష్టద్రవమును కొంచెము కొంచెముగ ప్రబలమైన వేగముతోగూడి మిగుల కష్టముచే బాధించుచు వెడలును. (ఈలక్షణములుకల్గినది వాతికచ్ఛర్దియని యెరుంగునది.)

## పైత్తికచ్ఛర్దినిదానము, సంప్రాప్తి.

మూ. అజీర్ణకట్వమ్లవిదాహ్యశీతైః ఆమాశయే పిత్తముదీర్యవేగం,
రసాయనీభిః విసృతం ప్రపీడ్య మర్మోర్ధ్వమాగమ్య వమిం కరోతి.

వ్యా. భుజించినయాహారము జీర్ణముకాకుండునపుడు మరల భుజించినను, కటు-అమ్లరసముల విశేషముగ సేవించినను, విదాహకరములును ఉష్ణవీర్యంబులును నగుపదార్థములసేవించినను, ఆమాశయమునందలి పిత్తము ప్రకోపమునొంది యందలి పిత్తద్రవమును శీఘ్రముగ రసమును వహించునాడులను బాధించి హృదయమర్మమునకు పైభాగమున వ్యాపింపజేసి వాంతిని కల్గించును.

## పైత్తికచ్ఛర్దిలక్షణములు.

మూ. మూర్ఛా పిపాసా ముఖశోషమూర్ధతాల్వక్షిసన్తాపతమోభ్రమార్తః, పీతం భృశోష్ణం హరితం సతిక్తం ధూమ్రం చ పిత్తేన వమేత్ సదాహమ్. 11

వ్యా. పిత్తముచే కల్గినచ్ఛర్దియందు మూర్ఛ, దప్పి, నోట ద్రవములేక యెండుట, శిరస్సు తాలువులు కన్నులు ఈస్థలములయందు మంట, చీకటిలోనున్నట్లు కన్నులుకానరాకుండుట, ఒడలు తిరుగుట, ఈలక్షణములు కల్గును. పసుపురంగైనను ఆకుపచ్చనివర్ణంబైనను కల్గి, చేదై ధూమ్రవర్ణమై మిక్కిలి వేడిగనుండుపసరు వాంతియగును.

## కఫజచ్ఛర్దినిదానసంప్రాప్తి.

మూ. స్నిగ్ధాఽతిగుర్వామవిదాహిభోజ్యైః స్వప్నాదిభిశ్చైవ కఫోఽతి వృద్ధః, ఉరశ్శిరోమర్మ రసాయనీశ్చ సర్వాస్సమావృత్య వమిం కరోతి. 12

వ్యా. స్నిగ్ధపదార్థములను మిక్కిలి గురుత్వముకలపదార్థములను విదాహకరపదార్థములను విశేషముగ భుజించుటచేతను, పగటినిద్ర మున్నగు కఫవృద్ధికరహేతువులచేతను కఫము మిక్కిలి వృద్ధినొంది రొమ్మునందును, శిరస్సునందును హృదయమునందును రసమును వ్యాపింపజేయు నాడులన్నిటియందును ఆవరించి వాంతిని కల్గించును.

## కఫజచ్ఛర్దిలక్షణములు.

మూ. తన్ద్రాస్యమాధుర్యకఫప్రసేకసన్తోషనిద్రాఽరుచిగౌరవార్తః, స్నిగ్ధం ఘనం స్వాదు కఫాద్విశుద్ధం సలోమహర్షోఽల్పరుజం వమేత్తు. 13

వ్యా. కఫముచే గల్గిన వమనరోగమునందు కునికిపాటు కల్గును. నోరు తీపికల్గియుండును. నోట కఫము స్రవించును. అప్పుడే భుజించినవానివలె తృప్తికల్గియుండును. ఎల్లపుడును నిదురవచ్చును. నోట రుచిదెలియదు. శరీరమంతయు బరువుగనుండును. జిడ్డునుతీపియుకల్గి చిక్కనై తెల్లనైయుండుద్రవము వాంతియగును. అప్పుడు శరీరమున రోమాంచము కల్గును. కొంచెముగ బాధకల్గును. ఈలక్షణములుకల్గినది కఫజచ్ఛర్దియని యెరుంగునది.

## సాన్నిపాతికచ్ఛర్దినిదానము, సంప్రాప్తియు.

మూ. సమశ్నతః సర్వరసాన్ ప్రసక్తమామప్రదోషర్తువిపర్యయైశ్చ, సర్వే ప్రకోపంయుగపత్ప్రపన్నాశ్ఛర్దింత్రిదోషాంజనయన్తిదోషాః.

వ్యా. పథ్యంబులును అపథ్యంబులును నగుపదార్థముల నన్నిటిని ఒకటిగగూర్చి నిరంతరముగ తినుటచేతను, ఆమదోషముచేతను, ఋతుధర్మములైన శీతోష్ణపరిస్థితులు మారుటచేతను, వాత-పిత్త-కఫములుమూడును సమకాలమున ప్రకోపమునొంది సాన్నిపాతికచ్ఛర్దిని కల్గించును. (ఇచ్చట 'సమశ్నతః సర్వరసాన్'' అనుచోట సర్వరసముల నపథ్యాపథ్యరూపభోజ్యపదార్థములని యర్థము. అట్టిపథ్యాపథ్యముల గలిపి తినుటయే సమశనమని "పథ్యాఽపథ్యావిహైకత్ర భుక్తం సమశనం మతమ్''(చి. అ. ౧౫.) అను వాక్యముచే స్థలాంతరమున తంత్రకారు లుపదేశించిరి. ఇదియే సమంజసమైనయర్థము.

మధురాదిసర్వరసముల ప్రతిదినంబును సేవించుట పథ్యమే యగునుకాని వ్యాధిజనకము కానోపదు. కావున 'సర్వరసాః' అనుదానికి మధురాదిరసములని యర్థము చేయదగదు. వాగ్భటాచార్యులు "నిత్యం సర్వరసాభ్యాసః స్వస్వాధికమృతావృతౌ" (అ. హృ. సూ. అ. 3.) అనియు, "సర్వరసాభ్యాసో బలకారణమ్" అనియు, సర్వరసాభ్యాసము హితకరమని స్ఫుటముగ జెప్పిరి.

మూ. శూలాఽవిపాకాఽరుచిదాహతృష్ణాశ్వాస ప్రమోహా ప్రబలా ప్రసక్తం, ఛర్ది స్త్రిదోషాత్ లవణాఽమ్లనీలసాన్ద్రోష్ణరక్తం వమతాం నృణాం స్యాత్. 15

వ్యా. సన్నిపాతముచే గల్గినచ్ఛర్దియందు కడుపులో నొప్పి పుట్టును. భుజింపబడిన యాహారము జీర్ణముకాదు. అరోచకము మంట దప్పి శ్వాసము మైకంబును ప్రబలముగ కల్గును. అధికముగ రక్తముతో గూడి ఉప్పను పులుపునుకల్గి నీలవర్ణంబును రక్తవర్ణంబునై చిక్కగనుండు ద్రవము నిరంతరముగ వాంతియగును.

## ఛర్దిఅసాధ్యలక్షణములు.

మూ. విట్స్వేదమూత్రాఽమ్బువహాని వాయుః స్రోతాంసి సంరుధ్య, యదోర్ధ్వమేతి, ఉత్సన్నదోషస్య సమాచితం తం దోషం సముద్ధూయ నరస్య కోష్ఠాత్. 16

విణ్మూత్రయోస్తత్సమవర్ణగన్ధం తృట్ శ్వాసహిక్కార్తియుతం ప్రసక్తం, ప్రచ్ఛర్దయేద్దుష్టమివాతివేగాత్ తయాఽర్దితశ్చాశు వినాశమేతి. 17

వ్యా. ఛర్దిరోగమునందు వాతము మిగుల ప్రకోపమునొంది శరీరమునందలి మలమును చెమటను మూత్రమును జలమును ప్రవహింపజేయు స్రోతోమార్గముల నిరోధించి యెప్పుడు పైకి వ్యాపించునో అప్పుడు శరీరమునందలి మల-స్వేద-మూత్ర జలములు వ్యాపించుటకు త్రోవలేమింజేసి స్వస్థానముననే సంచితమగును. అట్టి సంచితదోషమును ఊర్ధ్వముగ వ్యాపించువాతము మలమూత్రకోశములనుండియు కోష్ఠమునుండియు నూర్ధ్వముగ నెగురగొట్టి వమనమును కల్గించును. అట్టి వమనము మలమూత్రాద్యాశయములు వాతముచే దుష్టములగుటవలన మలమూత్రములతో సమానమైనవర్ణంబును గంధంబును కల్గి మిక్కిలి వేగముతో వెడలును. అట్టియెడ దప్పియు, హిక్కా-శ్వాసంబులును, నొప్పియు, కల్గి నిరంతరముగ సంబంధించియుండును. అట్టివమనముచే పీడింపబడినమనుజుడు శీఘ్రముగ మృతినొందును. (అసాధ్యమనుట.)

## ఆగంతుకఛర్దిలక్షణము.

మూ. ద్విష్టప్రతీపాఽశుచిపూత్యమేధ్యబీభత్సగన్ధాఽశనదర్శనైశ్చ,
యచ్ఛర్దయేత్ తప్తమనా మనోఘ్నైః ద్విష్టార్థసంయోగభవా
మతా సా. 18

వ్యా. మనస్సుకు వికారమును కల్గించునట్టియు, ద్వేషమును పుట్టించునట్టియు, సాత్మ్యమునకు విపరీతంబును, అపరిశుద్ధంబును, దుర్గంధముతో కూడినవియు, మలినములును, మనస్సున కేవగింపుకల్గించునదియు, నగుపదార్థములయొక్క గంధము మూర్కొనుటచేతను అదుష్టములైన భోజ్యపదార్థములను తిన్నను, అట్టి యింపుగానిపదార్థములను చూచినను, (వానిగుణాదుల విన్నను, వానిస్పర్శము శరీరమునకు కల్గినను) మనస్సునకు యేవగింపుకల్గి దానంజేసి వాంతియగును. ఇయ్యది ద్విష్టార్థసంయోగముచే కల్గిన ఛర్దియగును.

లోకమున ప్రతిమానవునకును కొన్నివస్తువులయందు ప్రీతిలేక ద్వేషము పుట్టును. అట్టిద్వేషము ఆయావస్తువులయందు నియతముగ గల్గక కొందరికి ప్రీతిని పుట్టించునవియు, కొందరికి ద్వేషమును కల్గించునవియై యుండును. ఎట్లనగ:—మత్స్యమాంసాదులను అలవాటుగ భుజించువారికి వానియందు దర్శనస్పర్శనాదులచే ప్రీతికల్గును కాని ద్వేషము పుట్టదు. అలవాటులేనివారికి అట్టివస్తువులయందు దర్శనస్పర్శనాదులచేత ద్వేషబుద్ధి కల్గి మనస్సునకు ఏవగింపుపుట్టి యాకారణముచే తప్పక వాంతియగును. కావున ఏమనుజునకు ఏయేవస్తువులయందు దర్శనాదులచే నేవగింపుపుట్టునో అయ్యవి ద్విష్టములగును. వానిసంబంధమువలన వమనము కల్గును. కావున నియ్యది ద్విష్టార్థసంయోగజమని చెప్పబడును. (ఈఛర్దియందు ద్విష్టార్థసంబంధము కల్గియున్నను వాతాదిదోషములు సంబంధించియుండును కాన అందు ఏదోషలక్షణ మధికముగ గానవచ్చునో దానికి తగినచికిత్స చేయవలయును.)

## అసాధ్యచ్ఛర్దిలక్షణము.

మూ. క్షీణస్య యా ఛర్దిరతిప్రవృద్ధా సోపద్రవా శోణితపూయయుక్తా,
సచన్ద్రికాం తాం ప్రవదన్త్యసాధ్యాం సాధ్యాం చికిత్సేదనుప
ద్రవాం చ. 19

వ్యా. శరీరమునందలి రసరక్తాదిధాతువులు క్షీణించినవానికి జనించిన ఛర్దియు, యెడలేక సర్వకాలమునందును వెడలుచున్నఛర్దియు, పైజెప్పిన నుపద్రవములతోకూడిన

ఛర్దియు, రక్తముతోడను చీముతోడనుకూడి వెడలునట్టిఛర్దియు,శరీరమునందలి మేదస్సు క్రొవ్వు మొదలగు స్నేహపదార్థములతోకూడి వెడలునట్టిఛర్దియు నసాధ్యమగును. ఇట్టి యసాధ్యలక్షణములు లేక యుపద్రవములతోకూడక సాధ్యావస్థలోనుండుఛర్దికి నీక్రింద జెప్పబడుక్రమమున చికిత్స జేయనగును. (ఇచ్చట నుపద్రవములు "విట్స్వేదమూత్రాం బువహాని" అని యుపక్రమించి చెప్పబడినవి.)

ఛర్దిచికిత్సాక్రమము, అందు లంఘనవిధి.

మూ. ఆమాశయోత్క్లేశభవా హి సర్వాః ఛర్ద్యో మతాః లఙ్ఘనమేవ తస్మాత్, ప్రాక్కారయేన్మారుతజాం విముచ్య సంశోధనం వా కఫపిత్తహారి. 20

వ్యా. ఛర్దులన్నియు ఆమాశయమునుండి యుద్రేకముచే కల్గును. కాన తొలుత లంఘనమునే జేయనగును. అందును వాతముచే కల్గిన ఛర్దియందు మాత్రము లంఘనము చేయదగదు. లేక ఛర్దులన్నిటియందును కఫపిత్తహరములయిన సంశోధనముచేయుట యుక్తము. (ఇచ్చట సంశోధనశబ్దముచే వమనవిరేచనములు రెండును గ్రహింపబడును. కొందరు ప్రతిలోమచికిత్స ననుసరింపవలయునని విరేచనము మాత్రమే చేయదగునని చెప్పెదరు. మరియు దోషము స్వల్పముగ నున్నపుడు లంఘనచికిత్సయు బలిష్ఠముగ నున్నపుడు శోధనచికిత్సయు చేయదగును.)

ఛర్దిరోగమున శోధనము, అందు విరేచనము.

మూ. చూర్ణాని లిహ్యాత్ మధునాభయానాం, హృద్యాని వా యాని విరేచనాని, మద్యైః పయోభిశ్చ యుతాని యుక్త్యా నయత్యధో దోషముదీర్ణమూర్ధ్వమ్. 21

వ్యా. కరకకాయలబెరడుచూర్ణమును తేనెతో కలిపి విరేచనమునకై నాకించవలెను. లేక హృదయమునకు హితకరంబులును, విరేచనకరంబులును నగుద్రవ్యములను చూర్ణములుచేసి యాచూర్ణములను మద్యములతోనైనను, పాలతోనైనను కలిపి యుక్తియుక్తముగ త్రాగించవలెను. ఈచికిత్సచేత నూర్ధ్వముగ వెడలుదోషమును మరలించి అధోమార్గమున వెడలునట్లుచేయును.

ఛర్దిరోగమున బలతారతమ్యముచే వమన-శమనచికిత్సావిధి.

మూ. వల్లీఫలాద్యైర్వమనం పిబేద్వా,యో దుర్బలస్తంశమనైశ్చికిత్సేత్,

వ్యా. రోగి బలిష్ఠుడుగనున్నయెడ వల్లీఫలము (దేవదాళి చేదుసొరకాయ చేదు

బీరకాయ) మున్నగువానిచే విధ్యుక్తప్రకారము వమనము చేయించవలెను. రోగి బల హీనస్థితినున్నపుడు శోధనముగాక దోషములను సమస్థితినుంచు శమనచికిత్స చేయదగును.

ఇచ్చట సంశమనమన "న శోధయతి యద్దోషాన్ సమాన్నోదీరయత్యపి, సమీ కరోతి విషమాన్ తత్సంశమనముచ్యతే" అను పుష్కలావతవచనప్రకారము దోషముల శోధించకయు సమస్థితినుండుదోషముల రేపెట్టకయు విషమస్థితినుండుదోషములమాత్రము శమింపజేయుచికిత్సయని యెరుంగునది. ఫలాద్యై అనుపదముచేత సిద్ధిస్థానమున ఫల మాత్రావస్తిసిద్ధియందు "కఫపిత్తహరం పరం ఫలేష్వథ జీమూతకమాహ శౌనకః" (సిద్ధి. అ. ౧౧.) అని యుపక్రమించి చెప్పబడిన దేవదాళి చేదుసొర, చేదుబీరమున్నగు వమన ద్రవ్యములు గ్రహింపబడును.

ఛర్దిరోగమున మాంసరసభక్ష్యభోజ్యములు.

మూ. రసైర్మనోజ్ఞైః లఘుభిర్విశుష్కైః భక్ష్యైస్సుభోజ్యైః వివిధైశ్చ పానైః. 22

వ్యా. మరియు మనసుకింపైన మాంసరసములచేతను, తేలికగ జీర్ణమగునవియు, నేతిలో కాల్చబడినవియు నగుభక్ష్యములచేతను, భోజ్యములచేతను, పలుతెరంగులైన పానీయములచేతను రోగి నుపచరించవలెను.

ఛర్దిరోగమున మాంసరస-యూషములు.

మూ. సుసంస్కృతాస్తిత్తిరిబర్హిలావరసాః వ్యపోహన్త్యనిలప్రవృత్తామ్,
ఛర్దిం, తథా కోలకులుత్థధాన్యబిల్వాదిమూలాఽమ్లయవైశ్చ
యూషః. 23

వ్యా. తీతువుపిట్ట, నెమలి, లావుకపిట్ట, వీనిమాంసరసములను విధ్యుక్తప్రకారము చక్కగ సంస్కరించి యాహారాదులయం దుపయోగముచేసినయెడ వాతప్రకోపమున కల్గినఛర్ది శమించును. మరియు రేగుపండ్లను ఉలవలను దనియాలను మారేడు మున్నగు వానివేళ్లను, దానిమ్మ మున్నగువానిరసమును యవలను జేర్చి సిద్ధముచేయబడినయూషమును త్రాగినను వాతికచ్ఛర్దిని హరించును.

వాతికచ్ఛర్దియందు ఘృతోపయోగము.

మూ. వాతాత్మికాయాం హృదయద్రవార్తః నరః పిబేత్సైన్ధవవద్ఘృతంతు
సిద్ధం తథా ధాన్యకనాగరాభ్యాందధ్నా చ తోయేన చ దాడిమస్య.

ఛ్యోషేణ యుక్తాం లవణైస్త్రిభిశ్చ ఘృతస్య మాత్రామథవా విదధ్యాత్, స్నిగ్ధాని హృద్యాని చ భోజనాని రసైః సయూషైః దధిదాడిమామ్లైః. 25

వ్యా. వాతమున జనించిన ఛర్దిరోగమున హృదయము శ్రమనొందించుపనుల జేసినవానివలె సంక్షోభమునొందియున్నయెడ సైంధవలవణమును చేర్చి కాచబడిన ఘృతమును త్రాగవలెను. మరియు దనియాలను శుంఠిని, పెరుగును, పుల్లదానిమ్మపండ్లరసమును సమభాగములుగ ఘృతమున జేర్చి పక్వముచేయబడిన ఘృతమునైనను, శుంఠి, పిప్పలి, మిరియాలను, సైంధవలవణమును, బిడాలవణమును, సౌవర్చలలవణమును సమభాగములుగగూర్చి ఘృతపాకవిధిప్రకారము పక్వముచేయబడిన ఘృతమునైన అగ్నిబలాద్యనుసారముగ త్రాగినయెడ పైజెప్పిన వాతికఛర్ది నివర్తించును. మరియు పెరుగును, దానిమ్మరసమును జేర్చి సిద్ధముచేయబడిన మాంసరసములను యూషములను కలిపి స్నిగ్ధంబులును హృదయమునకు హితంబులునైన యన్నాదుల భుజించినను వాతికచ్ఛర్ది నివర్తించును.

### పైత్తికఛర్దిచికిత్సాక్రమము, అందు సంశోధనము.

మూ. పిత్తాత్మికాయామనులోమనార్థం ద్రాక్షావిదారీక్షురసైః త్రివృత్ స్యాత్, కఫాశయస్థం త్వతిమాత్రవృద్ధం పిత్తం హరేత్స్వాదుభిరూర్ధ్వమేవ. 26

వ్యా. పిత్తప్రకోపమున జనించిన ఛర్దిరోగమునందు దోషమును అనులోమముగ వెడలించుటకై ద్రాక్షపండు, నేలగుమ్మడు, చెరకు వీనిరసములతో తెగడచూర్ణమును కలిపి విరేచనమునకై యుపయోగించనగును. పిత్తము కఫస్థానమునకు పైభాగమున (రొమ్మున) చేరి మిక్కిలి వృద్ధినొందియున్నయెడ మధురములైన ద్రవ్యములచే వమనముచేయించి దోషమును హరింపజేయునది.

### పైత్తికఛర్దిరోగికి శోధనానంతరము ఆహారవిధి.

మూ. శుద్ధాయ కాలే మధుశర్కరాభ్యాం లాజైశ్చ మన్థాయది వాఽపి పేయామ్, ప్రదాపయేత్, ముద్గరసేన వాపి శాల్యోదనం జాఙ్గలజై రసైర్వా. 27

వ్యా. పైజెప్పిన వమనవిరేచనరూపమయిన శోధనములను చేసినపిమ్మట యాహారకాలమునందు వరిపేలాలతో విధ్యుక్తప్రకారము మంథమునుచేసి అందు తేనెను చక్కె-

రను చేర్చి త్రాగించవలయును. లేక (జఠరాగ్ని మందముగ నున్నపుడు) అట్టి వరిపేలాలతోనైనను, పెసలకట్టుతోనైనను, పేయయనుద్రవమును సిద్ధముచేసి యాహారకాలమున త్రాగింపనగును. లేక జాంగలమాంసరసములచే రాజనంపుబియ్యపుటన్నమును భుజింపచేయనగును. (ఇచ్చట మంథమన "సక్తవః సర్పిషా యుక్తాః శీతవారిపరిప్లుతాః, అనత్యచ్ఛాతిసాన్ద్రాశ్చ మన్థ ఇత్యభిధీయతే" అనువచనము ననుసరించి పేలపిండిని నేతిలో కలిపి నీళ్లుపోసి మిక్కిలి పలుచనయు ఘనంబును కాకుండునట్లు సిద్ధముచేయబడిన ద్రవరూపాహారమని యెరుంగునది.)

### కొన్నిఛర్దిహరయోగములు.

మూ. సితోపలామాక్షికపిప్పలీభిః కుల్మాషలాజాయవసక్తుగృఞ్జాన్, [త్.
ఖర్జూరమాంసాన్యథ నారికేలం ద్రాక్షామథో వా బదరాణి లిహ్యా

వ్యా. కుల్మాషములు(యవలపిండిని నీళ్లయావిరిచేనుడికించి చేయబడిన భక్ష్యవిశేషములు),వరిపేలాలు, యవలచే చేయబడిన సత్తుపిండి, గృంజము (గంజితోకూడిన యవాన్నము) ఖర్జూరపండులోనిగుంజు,టెంకాయలోని కొబ్బెర, ద్రాక్షపండు, రేగుపండులోని గుంజు వీనిలోదేనినైనను, శీనాకల్కండతోనైనను తేనెతోనైనను, పిప్పళ్లతోనైనను కలిపి సేవించునది. (ఇచ్చట కుల్మాషము మున్నగువానిని శీనాకల్కండ మున్నగువానిలో దేనితోనైనను కూర్చిసేవించినను పిత్తముచే జనించినఛర్ది నివర్తించునని భావము.)

### పైత్తికచ్ఛర్దిహరచూర్ణములు.

మూ. స్రోతోజలాజోత్పలకోలమజ్జచూర్ణానిలిహ్యాన్మధునాఽభయాఽఽచ్ఛ,
కోలాస్థిమజ్జాఞ్జనమక్షికావిట్ లాజాసితామాగధికాకణాన్వా. 29

వ్యా. స్రోతోంజనము, వరిపేలాలు, నల్లకలువలు, రేగుపండ్లలోనిపప్పు, కరక్కాయబెరడు వీనిని సమభాగములుగ చేర్చి చూర్ణముచేసి తేనెతో కలిపి సేవించినను; రేగుపండ్లలోనిపప్పు, సౌవీరాంజనము, తేనెటీగలమలము, వరిపేలాలు, చక్కెర, పిప్పళ్లలోనిగింజలు, వీనినన్నిటిని సమభాగములుగ గూర్చి చూర్ణముచేసి తేనెతోకలిపి సేవించినను; పిత్తముచే జనించినఛర్ది శమించును.

### పైత్తికఛర్దిహరశీతకషాయయోగములు.

మూ. ద్రాక్షారసం వాపి పిబేత్సుశీతంమృద్భృష్టలోష్టప్రభవం జలం వా,
జమ్బ్వామ్రయోః పల్లవజం కషాయం పిబేత్సుశీతం మధుసంయుతం వా. 30

వ్యా. ఛర్దిరోగమున పానీయమునకు ద్రాక్షపండ్లరసమునైనను, వేపుడుచట్టిలో ఇసుకను వేసి వేయించి దానిని పారబోసి కాగుచుండు నాచట్టిలో నీళ్లుపోసి చల్లారిన యానీళ్లనైనను, మామిడిచిగుళ్లను నేరేడుచిగుళ్లను చేర్చి కాగిచల్లారిన యాకషాయము నైనను తేనెతోకూర్చి త్రాగవలయును.

**ముద్గాదిసిద్ధశీతకషాయము.**

మూ. నిశి స్థితం వారి సముద్గకృష్ణం సోశీరధాన్యం చణకోదకం వా,
గవేధుకామూలజలం గుడూచ్యా జలం పిబేదిక్షురసం పయోవా.

వ్యా. పెసరపప్పును, పిప్పళ్లను చూర్ణముచేసి నీళ్లలోనునిచి యొకరాత్రియంతయు నానబెట్టి యానీళ్లనైనను; వట్టివేళ్లను, దనియాలను, కొట్టివేసి రాత్రి నానపెట్టబడిన జలమునైనను, సెనగలను నీటియందువేసి యొకరాత్రి నానబెట్టి యాజలమునైనను, అడవిగోధుమలవేళ్లనైనను, తిప్పతీగనైనను, నీళ్లలోనానబెట్టి యాశీతకషాయమునైనను, చెరకురసమునైనను, పాలనైనను త్రాగవలయును.

**తృష్ణా-వమిహరతండులోదకపానీయము.**

మూ. సేవ్యం పిబేత్కాంచనగైరికం వా సవాలకం తణ్డులధావనేన,
ధాత్రీరసేనోత్తమచన్దనం వా తృష్ణావమిఘ్నాని సమాక్షికాణి.

వ్యా. వట్టివేళ్లను, కాంచనగైరికము (బంగారురంగుకావిరాయి)ను, ఈరెంటిని కురువేరును చేర్చి బియ్యపుకడుగునీళ్లలో పుచ్చుకొనవలయును. లేక తెల్లనిగంధమును ఉసిరికపండ్లరసములో కలిపి త్రాగవలయును. పైజెప్పిన శీతకషాయయోగము లన్నిటియందును యథోచితముగ తేనెను చేర్చి పుచ్చుకొనదగును. ఇవియన్నియు దప్పిని వాంతిని శమింపజేయును. (ఇచ్చట శీతకషాయవిధి తంత్రాంతరమున నిట్లు చెప్పబడినది:— "క్షుణ్ణం ద్రవ్యపలం సమ్యక్ షడ్భిర్నీరపలైః ప్లుతం, నిశోషితం హిమస్సస్స్యాత్ తథా శీతకషాయకః.")

**పైత్తికచ్ఛర్దిహరచందనాదిచూర్ణము.**

మూ. కల్కం తథా చన్దనసేవ్యమాంసీద్రాక్షోత్తమావాలకగైరికాణాం,
శీతాంబునాగైరికశాలిచూర్ణం మూర్వాం తథా తణ్డులధావనేన.

వ్యా. చందనము, చవ్యము, జటామాంసి, ఉత్తమమైనద్రాక్షపండు, కురువేరు, కావిరాయి వీనిని చూర్ణముచేసి చల్లనినీళ్లతోనైనను; కావిరాయి, ఎఱ్ఱవరిపడ్లబియ్యము

ఈరెంటిలోనైనను, చాగపట్టనైనను, చూర్ణము చేసి బియ్యపుకడుగునీళ్లలోనైనను కలిపి త్రాగవలయును.

కఫజచికిత్సాక్రమము, అందు వమనవిధి.

మూ. కఫాత్మికాయాం వమనం ప్రశస్తం సపిప్పలీసర్షపనిమ్బతోయైః, పిణ్డీతకైః సైన్ధవసంప్రయుక్తైర్వమ్యాం కఫామాశయశోధనార్థమ్.

వ్యా. కఫముచే జనించినఛర్దియందు పిప్పళ్లు, ఆవాలు, వేపపట్ట, వీనిని సమభాగములుగ జేర్చి కషాయము పెట్టి యాకషాయమున మ్రంగచెక్కను, సైంధవలవణమునుకలిపి యాకషాయము చేత వమనము చేయించనగును. ఇట్టివమనచికిత్స చేత కఫంబును, కఫస్థానమయినయామాశయంబును శుద్ధమగును.

కఫజచ్ఛర్దియందు భోజనవిధి.

మూ. గోధూమశాలీన్సయవాన్పురాణాన్యూషైః పటోలామృతచిత్రకాణాం, వ్యోషస్య నిమ్బస్య చ తక్రసిద్ధైర్యూషైః ఫలామ్లైః కటుభిస్తథాఽద్యాత్. 35

వ్యా. ప్రాతవియగు గోధుమలు, ఎఱ్ఱవరిబియ్యము, యవలు వీనిచే పక్వము చేయబడినయన్నమును, చేదుపొట్ల, తిప్పతీగె, చిత్రమూలము, వీనినిచేర్చి సిద్ధము చేయబడిన యూషములతోనైనను; త్రికటుకములు, వేపపట్ట, వీనినిచేర్చి సిద్ధము చేయబడిన మజ్జిగతోనైనను; దానిమ్మపండ్లరసము, చేదుపొట్ల మున్నగువానిరసమునుచేర్చి సిద్ధముచేయబడిన యూషములతోనైనను భుజింపదగును. ఇచ్చట గోధుమలును యవలును మధురత్వము కల్గియుండుటచే కఫకరములైనను ప్రాతవి కఫకరములుకావు. కావున నిచ్చట యాగికము లగును. ఈవిషయము నీతంత్రకారుడు "ప్రాయః శ్లేష్మలం మధురమన్యత్ర మధునః పురాణాచ్చ శాలియవగోధూమాత్" (సూ. అ. ౨౭.) అని చెప్పెను.

కఫజచ్ఛర్దియందు వ్యంజనములు, పానీయములు.

మూ. రసాంశ్చ శూల్యానిచజాంగలానాంమాంసాని జీర్ణాన్మధుశీధ్వరిష్టాన్ రాగాంస్తథా షాడబపానకాని ద్రాక్షాకపిత్థైః ఫలపూరకైశ్చ.

వ్యా. జాంగలదేశమునపుట్టిన జంతువులయొక్క మాంసరసములను, శూలమున గ్రుచ్చి పక్వము చేయబడినమాంసములను, వ్యంజనములకై చేర్చుకొనదగును. ప్రాతవియగు మధ్వాసవమును, శీధువనుమద్యమును, అరిష్టములను; ద్రాక్షపండ్లను, వెలగపండ్లను, మాదీ

ఫలరసమును చేర్చి సిద్ధముచేయబడిన రాగములు, షాడబములు, పానకములు, అను పానీయములను; భోజనసమయమున పానమునకై చేర్చుకొనవలయును. (రాగ-షాడబ-పానకవివరణము స్థలాంతరమున జూచునది.)

కఫజచ్ఛర్దిహరముద్గాదిచూర్ణయోగములు.

మూ. ముద్గాన్ మసూరాన్ చణకాన్ కలాయాన్ భృష్టాన్ యుతా
న్నాగరమాక్షికాభ్యాం, లిహ్యాత్తథైవ త్రిఫలావిడఙ్గచూర్ణం,
విడఙ్గప్లవయోరథో వా (రసో వా). 37

వ్యా. పెసలు, చిరుసెనగలు, సెనగలు, బటానులు, వీనిని సమములుగ జేర్చి వేయించి పొడిచేసి అందు శుంఠిపొడిని తేనెను కలిపి తినవలెను. అత్తెరంగుననే త్రిఫలములను వాయువిడంగములను సమభాగములుగ చూర్ణముచేసియైనను, వాయువిడంగములను తుంగగడ్డలను చూర్ణముజేసియైనను తేనెతో కలిపి సేవించవలెను.

ఛర్దినిగ్రహజాంబవాదిచూర్ణయోగములు.

మూ. సజామ్బవం వా బదరామ్లచూర్ణం (బదరస్య చూర్ణం) ముస్తా
యుతాం కర్కటకస్య శృఙ్గీం, దురాలభాం వా మధుసమ్ప్ర
యుక్తాం లిహ్యాత్కఫచ్ఛర్దివినిగ్రహార్థమ్. 38

వ్యా. నేరేడువిత్తులను రేగువిత్తులను చూర్ణముచేసియైనను, తుంగగడ్డలను కర్కాటకశృంగిని చూర్ణముచేసియైనను, దూలగొండివిత్తులచూర్ణమునైనను తేనెతో కలిపి సేవించినచో వమనమును నివర్తింపజేయును.

ఛర్దిహరమనశ్శిలాదిచూర్ణయోగములు.

మూ. మనశ్శిలాయాః ఫలపూరకస్య రసైః, కపిత్థస్య చ పిప్పలీనామ్,
క్షౌద్రేణ చూర్ణం మరిచైశ్చ యుక్తం లిహన్ జయేత్ ఛర్దిము
దీర్ణవేగామ్. 39

వ్యా. మణిశిలచూర్ణమును మాదీఫలరసమునకలిపి అందు మిరియాలపొడిని తేనెను చేర్చి సేవించినను, పిప్పళ్లచూర్ణమును వెలగపండ్లరసమునగూర్చి, అందు మిరియాలచూర్ణమును కలిపి తేనెతోగూర్చి సేవించినను, మిక్కిలి వేగముతోగూడిన (కఫమునజనించిన) ఛర్దిరోగము శమించును.

సాన్నిపాతికఛర్దిచికిత్సావిధి.

మూ. యైషా పృథక్త్వేన మయా క్రియోక్తా తాం సన్నిపాతేఽపి సమస్య

(సమీాక్ష్య)బుద్ధ్యా, దోషర్తురోగాఽగ్నిబలాన్యవేక్ష్య ప్రయోజ
యేచ్ఛాస్త్రవిదప్రమత్తః. 40

వ్యా. ఈచ్ఛర్ది చికిత్సయందు వాతపిత్తకఫముల నుద్దేశించి వేరువేరుగ చెప్పబడిన చికిత్సితములను, త్రిదోషముల ప్రకోపమునకల్గిన సాన్నిపాతికచ్ఛర్దియందును వాతాది దోషములయొక్కయు, శిశిరాదిఋతువులయొక్కయు రోగముయొక్కయు, జాఠరాగ్నియొక్కయు బలములను చక్కగగమనించి తత్తదనుగుణముగ పైజెప్పిన చికిత్సల సమ్మేళముచేసి, (మూడుదోషములలో ప్రధానముగనుండుదోషమునకు విరోధములేకుండు నట్లు శాస్త్రవేత్తయగువైద్యవరుడు చికిత్సను కల్పించి చికిత్సచేయనగును.

### ద్విష్టార్థసంబంధముచే గల్గినచ్ఛర్ది చికిత్స.

మూ. మనోఽభిఘాతే తు మనోఽనుకూలాః వాచస్సమాశ్వాసనహర్షణాని,
లోకప్రసిద్ధాశ్శ్రుతయో వయస్యాః శృఙ్గారికాశ్చైవ హితా
విహారాః. 41

వ్యా. మనసుకు ఇంపుగానివస్తువులసంబంధము (ఇంద్రియార్థములైన శబ్ద-స్పర్శ-రూప-రస-గంధములలో నాయాయింద్రియములకు సంబంధము) కల్గుటవలన మనస్సు వికృతిజెంది, దానగల్గినచ్ఛర్దియందు మనస్సుకనుకూలములగు (ఇంపైన) మాటలచెప్పుట, ఊరడించుట, సంతోషమును కల్గించుట, లోకమునప్రసిద్ధములుగనున్న ఆఖ్యానక-ఆఖ్యాయిక-ఇతిహాసములు మున్నగుచరిత్రముల వినిపించుట, వానిమనసుకు హితులగుస్నేహితులు గోష్ఠిగచేరియుండుట, శృంగారరసమునకు సంబంధించి వనవిహారాదిచేష్టలజేయుట, ఇవి యన్నియు హితకరములుగనుండును.

### ద్విష్టార్థసంబంధముచేనైన చ్ఛర్దినివర్తకగంధాదులు.

మూ. గన్ధావిచిత్రామనసోఽనుకూలాః మృత్పుష్పశుక్తామ్లఫలాదికానామ్,
శాకాని భోజ్యాన్యథ పానకాని సుసంస్కృతాఃషాడబరాగలేహాః.
యూషా రసాః కామ్బలికాః ఖడాశ్చ మాంసానిధానా వివిధాశ్చ
భక్ష్యాః, ఫలానిమూలానిచగన్ధవర్ణరసైరుపేతాని వమిం జయన్తి.

వ్యా. మనసుకు చిత్రములై యింపైన మట్టి, పుష్పములు, శుక్తము మున్నగు పుల్లనివస్తువులు, మంచివాసనగల పండ్లు మున్నగువానిపరిమళములును, మనసుకింపైన శాకంబులును,భోజ్యపదార్థంబులును, చక్కగ సంస్కరించి సిద్ధముచేయబడినపానకములు షాడబములు రాగములు లేహములు (పచ్చడులు) యూషములు మాంసరసములు

కాంబలికములు ఖడయూషములు మాంసములు బొరుగులు పలుదెరంగులైనభక్ష్యములు మున్నగువ్యంజనాదులును మనసుకింపైన గంధ-వర్ణ-రసములు కలఫలమూలాదులును, ఇవి యన్నియు మనోఽభిఘాతముచే గల్గినఛర్దిని శమింపజేయును.

(లోకమున నేదైనబాహ్యకారణములచే మనసుకేవగింపుకల్గి వాంతియగుచున్నపుడు ఎండలో కాలియుండుమట్టిపెళ్లపై నీళ్లుబోసి దానిగంధమును మూర్కొనుటయు, సువాసనకలపుష్పములను పులుపుకల్గిన ద్రవపదార్థములను నిమ్మపండు మున్నగుఫలములను మూర్కొనుటయు వాడుకకలదు. దానివలన వాంతినిలచుటయు కలదు. ఆవిషయమునే "గంధా విచిత్రా మనసోఽనుకూలా మృత్పుష్పశుక్తామ్లఫలాదికానాం" అనువాక్యముచే నుపదేశించిరని యెరుంగునది.)

## ఇష్టార్థసంబంధరూపమైన చికిత్సాసంగ్రహము.

మూ. గన్ధం రసం స్పర్శమథాపి శబ్దం రూపం చ యద్యత్ ప్రియమప్యసాత్మ్యమ్, తదేవ దద్యాత్ ప్రశమాయ తస్యాః తజ్జో హి రోగః సుఖమేవ జేతుమ్. 44

వ్యా. మనసుకు ఏవగింపుపుట్టించు గంధరసాదులసంబంధముచేగల్గినవమనమునందు, అట్టిరోగికి మనసుకు చాలప్రియములుగనుండు గంధ-రస-స్పర్శ-శబ్ద-రూపములు ఎవ్వికలవో అయ్యవి వానికి అసాత్మ్యముగనున్నను, ఆయాగంధరసాదులచేగల్గిన ఛర్దిరోగము శమించుటకై వానికుపయోగింపవలెను. ఒకవేళ అట్టియసాత్మ్యము నుపయోగించుటవలన నితరరోగమేదైన జనించినను, అయ్యది సులభోపాయముచేతనే సాధింపదగియుండును. (ప్రధానమైన వమనరూపమైనవ్యాధి, ప్రియములైన గంధరసాదులచే నివర్తించినపిదప, అసాత్మ్యగంధరసాద్యుపయోగమునంజేసి రోగాంతరము జనించినను అయ్యది యప్రధానమగుటవలన సులభసాధ్యమే యగునని భావము).

ఇచ్చట నీవిషయము నెరుంగునది:—ఘ్రాణేంద్రియమునకు మనుజునకప్రియమైన దుష్టగంధముతో సంబంధముకల్గినను, రసనేంద్రియమునకు మనుజునకప్రియమైన రసముతో సంబంధముకల్గినను, స్పర్శనేంద్రియమునకు అప్రియమైనవస్తువుతో స్పర్శము కల్గినను, శ్రవణేంద్రియమునకు అప్రియమైనశబ్దముతో సంబంధముకల్గినను, చక్షురింద్రియమునకు అప్రియమైనరూపముతో సంబంధముకల్గినను, అట్టియింద్రియములకు ప్రేరకమైనమనస్సు వికృతిజెంది, దానివలన వమనరోగము కల్గును. అట్టియెడ నేయింద్రియమునకు సంబంధించిన తన్మాత్రతో మనసుకు ఏవగింపుకల్గినదియో అట్టియింద్రియమునకు

ప్రియమైనసంబంధమును కల్గించిన దానజనించిన మనోవికృతి నివర్తించి ఛర్దియు శమించును. కావున అట్టికారణమును గమనించి ఆయాయింద్రియము లప్రియములైన, గంధాదులసంబంధము గల్పించిన దానగల్గుఛర్ది నివర్తించును. ఇది హేతువిపరీతచికిత్స, ఒకవేళ చికిత్సార్థమై యాశ్రయింపబడిన గంధరసాదులు అసాత్మ్యములై దానివలన నితరవ్యాధిజనించినను అయ్యదియు ప్రధానముకావున సుఖసాధ్యముగనుండును; కావున ప్రత్యవాయజనకము కానోపదు. ఈవిషయమునే "ప్రియమప్యసాత్మ్యమ్, తదేవ దద్యాత్ ప్రశమాయ తస్యాః; తజ్జో హి రోగః సుఖమేవ జేతుమ్" అని తంత్రకారులుపదేశించిరి. ఇట్టి గంధరసాదిసంబంధరూపచికిత్సితమే 'మనోఽభిఘాతేతు' అని యుపక్రమించి పైని చెప్పబడినది.

ఛర్దిరోగమునం దుపద్రవములకు చికిత్స.

మూ. ఛర్ద్యుత్థితానాం చ చికిత్సితాత్ స్వాత్ చికిత్సితం కార్యముపద్రవాణాం, అతిప్రవృత్తాసు విరేచనస్య కర్మాఽతియోగే విహితం విధేయమ్. 45

వ్యా. ఛర్దిరోగమున నుపద్రవరూపముగ నితరరోగములు జనించినయెడ నాయారోగములు శమించుటకై చెప్పబడిన ఆయాచికిత్సల జేయదగును. వాంతులు మిక్కిలి యధికముగ వెడలుచున్నయెడ విరేచనాతియోగమున జెప్పబడిన స్తంభనాదిచికిత్సను జేయనగును.

మూ. వమిప్రసఙ్గాత్ పవనోఽప్యవశ్యం ధాతుక్షయాద్వృద్ధిముపైతి తస్మాత్, చిరప్రవృత్తాస్వనిలాపహాని కార్యాణ్యుపస్తమ్భనబృంహణాని. 46

సర్పిర్గుడాః క్షీరవిధిర్ఘృతాని కల్యాణకత్ర్యూషణజీవనాని,
వృష్యాః తథామాంసరసాస్సలేహాః చిరప్రసక్తాం చ వమింజయన్తి.

వ్యా. వమనము నిలువక చాలకాలమువరకు ననుసరించి వెడలుచున్నయెడ రసాది ధాతువులు క్రమముగ క్షీణించును. దానంజేసి వాతంబును అవశ్యము మిక్కుటముగ వృద్ధినొందును. కావున వమనము చిరకాలమువరకు వెడలుచున్నయెడ వాతమనువమనములను స్తంభింపజేయునవియు, వాతహారంబులును, ధాతువుల వృద్ధినందించి పుష్టినికల్గించునవియు నగుచికిత్సల జేయనగును. మరియు నట్టిగుణములగల్గించు సర్పిర్గుడములును, క్షీర

విధులును, కల్యాణఘృతంబును, త్రూ్యషణఘృతంబును, జీవనీయఘృతంబును, వృష్య యోగంబులును, మాంసరసంబులును, చ్యవనప్రాశాదిలేహంబులును, ఉపయోగింపం దగును. వీనిని సేవించుటవలన చిరకాల మనుసరించియుండు వాంతులును శమించును.

మరియు వమనాతియోగహరమంథవిధి తంత్రాంతరమున నిట్లు చెప్పబడినది:— "అఞ్జనం చన్దనోశీరమజ్జాఽసృక్ఛర్కరోదకమ్, లాజచూర్ణైః పిబేన్మన్థం అతియోగహరం పరమ్" చందనము, వట్టివేరు, మజ్జ, రక్తము, చక్కెర వీనిని కలిపినజలమున అంజనమును, పరిపేలాలపిండిని కలిపి చేయబడినమంథము వమనాతియోగమును హరించునని యర్థము.

## అధ్యాయవిషయసంగ్రహము.

మూ. హేతుం సంఖ్యాం లక్షణముపద్రవాన్ సాధ్యతాం చ యోగాంశ్చ, ఛర్దీనాం ప్రశమార్థం ప్రాహ చికిత్సితం మునివర్యః. 48

వ్యా. ఛర్దిరోగము జనించుటకు కారణము వానిసంఖ్య, లక్షణములు, ఉపద్రవములు, సాధ్యాసాధ్యవిభాగము, ఛర్దిని శమింపజేయుచికిత్స, ఈవిషయముల నన్నిటిని మునిపుంగవుడు ఈచ్ఛర్దిచికిత్సితాధ్యాయమున చెప్పెను.

ఇత్యగ్నివేశకృతే తన్త్రే చరకప్రతిసంస్కృతే, దృఢబలసంపూరితే, చికిత్సాస్థానే, ఛర్దిచికిత్సితం నామ వింశోఽధ్యాయః.

వ్యా. ఇత్తెరంగున నగ్నివేశకృతంబును, చరకప్రతిసంస్కృతంబును నగుచరకసంహితయను నాయుర్వేదతంత్రమునందలి చికిత్సాస్థానమున దృఢబలసంపూరితభాగమున ఛర్దిచికిత్సితమనునది వింశాధ్యాయము సమాప్తము.

---

# ఏకవింశాధ్యాయము.

అవతారిక— పైయధ్యాయమున జెప్పబడిన ఛర్దివేగమును నిరోధించిన యెడ దానివలన విసర్పంబును జనించునని నవేగాన్ధారణీయాధ్యాయమున నిట్లు చెప్పబడినది— "కణ్డూకోఠారుచివ్యఙ్గ.........శుష్కహృల్లాసవీసర్పాః ఛర్దినిగ్రహజా గదాః"(సూత్ర అ. ౭. శ్లో. ౧౮.) అట్టిసంబంధమునుబట్టి ఛర్దిచికిత్సితమును జెప్పినపిదప విసర్పచికిత్సితము చెప్పబడును.—(ఈయధ్యాయము చరకప్రతిసంస్కృతము.)

మూ. అథాతో విసర్పచికిత్సితం వ్యాఖ్యాస్యామః. 1

ఇతి హ స్మాహ భగవానాత్రేయః. 2

వ్యా. ఛర్ది చికిత్సితమును జెప్పినపిదప విసర్పచికిత్సితమును చెప్పునట్టి యధ్యాయమును వివరించి యాత్రేయమహర్షి యుపదేశించినదానికి న్యూనాతిరేకము గాకుండునట్లు చెప్పెదనని యర్థము.

విసర్పమును కూర్చి ప్రశ్నావతరణము.

మూ. కైలాసే కిన్నరాకీర్ణే బహుప్రస్రవణౌషధే,
పాదపైర్వివిధైః స్నిగ్ధైః నిత్యం కుసుమసమ్పదా. 3
వహద్భి(వమద్భిః)ర్మధురాన్ గన్ధాన్ సర్వతస్సర్వభ్యలఙ్కృతే,
విహరన్తం జితాత్మానం ఆత్రేయమృషివన్దితమ్. 4
మహర్షిభిః పరివృతం సర్వభూతహితే రతం,
అగ్నివేశో గురుం కాలే వినయాదిదముక్తవాన్. 5

వ్యా. కిన్నరులచే సేవింపబడినదియు, పలుదెరంగులైన యూటనీళ్లచేతను ఓషధులచేతను వ్యాప్తమైనదియు, ఎల్లపుడును కుసుమభరితములగుటచే రమ్యమైనగంధముతో గూడి సుందరములైన వృక్షములచే నలంకరింపబడినదియునగు కైలాసమున తనకడ్డులేక స్వేచ్ఛగ సంచరించువాడును; ఇంద్రియవ్యాపారముల జయించినవాడును, ఋషిపుంగవులచే నమస్కృతుండును, గొప్పఋషివర్యులచే బరివేష్టితుండును, సకలప్రాణులకు నెల్లపుడు హితమునుకోరువాడును, తనకు గురువునైన యాత్రేయమహర్షికి మిక్కిలి వినయముతో నమస్కరించి యగ్నివేశుడు ఉచితమైనసమయమును కనిపెట్టి యిట్లు ప్రశ్న జేసెను.

విసర్పమునుకూర్చి యగ్నివేశుని ప్రశ్నములు.

మూ. భగవన్ దారుణం రోగం ఆశీవిషవిషోపమం,
విసర్పన్తం శరీరేషు దేహినాముపలక్షయే. 6
సహసైవ నరాస్తేన పరీతాః శీఘ్రకారిణా,
వినశ్యన్త్యనుపక్రాన్తాః తత్ర నస్సంశయో మహాన్. 7
స నామ్నా కేన విజ్ఞేయః? సంజ్ఞితః కేన హేతునా ?,
కతి భేదః ? కియద్ధాతుః ? కిం నిదానః ? కిమాశ్రయః ? 8

సుఖసాధ్యః కృచ్ఛ్రసాధ్యో జ్ఞేయో యశ్చాఽనుపక్రమః,
కథం ? కైర్లక్షణైః? కిఞ్చ భగవన్! తస్య భేషజమ్. 9

వ్యా. "భగవత్స్వరూపుడగు నోగురువర్యా! లోకమున మనుజులశరీరమున సర్పవిషమునుబోలె పలుతెరంగుల నతిశీఘ్రముగ వ్యాపించు మిగుల క్రూరమైనవ్యాధి యొకటి కనపట్టుచున్నయది. శీఘ్రముగ పనిచేయుస్వభావముగల యీవ్యాధిచే నాక్రమింపబడిన మనుజులకు వెంటనే చికిత్సజేయకున్నయెడ నతిశీఘ్రముగ మృతినొందుచున్నారు. అట్టి యీక్రూరవ్యాధివిషయమై నాకు గొప్పసంశయము. ఎద్దియన—పైజెప్పినరీతిగ వ్యాపించు నీవ్యాధికి పేరెద్ది? 1; దీనికి నిర్ణీతమైనపేరు ఏకారణముచే కల్గినది? 2; ఈ రోగము ఎన్నిభేదములు కల్గినది? 3; రోగములెల్ల దోషదూష్యరూపములగు ధాతువులను కారణములుగ గల్గియుండునుకదా, ఈరోగము అట్టిదోషదూష్యములలో నెన్నిధాతువులను కారణములుగ గల్గియుండును? 4; (ఈరోగమునకు దోషదూష్యము లెవ్వియనుట); దీనికి నిదానమెద్ది? 5; దీనికాశ్రయమెద్ది? 6; ఈవ్యాధిభేదములలో సుఖసాధ్య కృచ్ఛ్రసాధ్య ప్రత్యాఖ్యేయభేదముల నెట్లు తెలిసికొనవలెను? 7; ఈవ్యాధిభేదములను ఏలక్షణములచే తెలియదగును, (ఈవ్యాధిభేదములకు వేరువేరులక్షణము లెవ్వి యనుట)? 8; దీనికి చికిత్సయేది? 9;" అని యిత్తెరంగున నగ్నివేశులు ప్రశ్నజేసెనని పైశ్లోకముతో నన్వయము.

వ్యాధిసముదాయములో వ్యంగము, తిలకాలకము మున్నగు కొన్నివ్యాధులు చికిత్సజేయకున్నను కొంతకాలమునకు తమంతటనే శమించుస్వభావము కల్గియుండును. కొన్నిరోగములు (ప్రమేహములు గుల్మములు మున్నగునవి) తగుచికిత్సజేసినను తాత్కాలికముగ శమించినట్లు కనుబడి చిరకాలమునకు మరల పొడసూపి చంపుస్వభావము కల్గియున్నవి. ఈవ్యాధి యటుగాక, సంభవించినతోడనే చికిత్సచేయక జాగుచేసినచో నతిశీఘ్రముగ తప్పక చంపునని సర్పవిషసాదృశ్యముచేతను, 'సహసైవ' అనువాక్యముచేతను స్ఫుటముగ జెప్పబడినది. కావున నతిశీఘ్రముగ ప్రాణహరమైన యీవ్యాధి కించుకేనియు కాలహరణముచేయక త్వరితముగ చికిత్స చేయవలెనని భావము.

## ఆత్రేయప్రతివచనము.

మూ. తదగ్నివేశస్య వచశ్శ్రుత్వాత్రేయః పునర్వసుః,
యథావదఖిలం సర్వం ప్రోవాచ మునిసత్తమః. 10

వ్యా. పైజెప్పినవిధముగనడిగిన యగ్నివేశులవాక్యమును పునర్వసువను నామాంతరముకల ఋషివర్యుడైన యాత్రేయులు విని, యాప్రశ్నములకన్నిటికిని వరుసగ బదులు ఈక్రింద జెప్పబడువిధముగ జెప్పందొడంగెను.

### 1-2 విసర్పవ్యాధినామము, అట్టిపేరు గల్గుటకు కారణంబును.

మూ. వివిధం సర్పతియతో విసర్పస్తేన స స్మృతః,
పరిసర్పోఽథవా నామ్నా సర్వతః పరిసర్పణాత్. 11

వ్యా. పైజెప్పినవ్యాధి శరీరమునందు పలుదెరంగుల (ఒకనియమములేక క్రిందుగ నైనను, ఊర్ధ్వముగనైనను, అడ్డముగనైనను స్ఫోటములు శోఫము మున్నగు రూపభేదములుగల్గి) వ్యాపించుటంజేసి విసర్పమనియు, శరీరమునందంతటను దేశనియమములేక యిచ్చవచ్చినస్థలములయందెల్ల వ్యాపించుటంజేసి పరిసర్పమనియు రెండునామములచే జెప్పబడును. "వివిధం సర్పతీతి-విసర్పః, పరితః (సర్వత్ర శరీరే) సర్పతీతి పరిసర్పః." అనువ్యుత్పత్తిచే నన్వర్థనామములని యెరుంగునది. (ఇది వ్యాధినామ మెద్ది? పేరుకు కారణమేమి? అను రెండుప్రశ్నముల కుత్తరము).

### 3. విసర్పరోగభేదములు.

మూ. స చ సప్తవిధో దోషైః విజ్ఞేయస్సప్తధాతుకః,
పృథక్ త్రయః త్రిభిశ్చైకో విసర్పో ద్వన్ద్వజాః త్రయః. 12
వాతికః పైత్తికశ్చైవ కఫజస్సాన్నిపాతికః,
చత్వార ఏతే వీసర్పాః, వక్ష్యన్తే ద్వన్ద్వజాస్త్రయః. 13
ఆగ్నేయో వాతపిత్తాభ్యాం, గ్రన్థ్యాఖ్యః కఫవాతజః,
యస్తు కర్దమకో ఘోరః స పిత్తకఫసమ్భవః. 14

వ్యా. అట్టి విసర్పము దోషభేదముచే ఏడుధాతువులు కారణములుగ గల్గి యేడు విధముల నుండును. అందు వాత-పిత్త-కఫములచే వేరువేరుగ జనించినవి మూడును, మూడుదోషముల సన్నిపాతముచే జనించినది యొకటియు, వాతాదిదోషయసంసర్గముచే జనించినవి మూడును కలిసి విసర్పభేదము లేడువిధములుగ నుండును. అందు వాతముచే జనించినది వాతికము, పిత్తమున జనించినది పైత్తికము, కఫముచే గల్గినది కఫజము, త్రిదోషముల నేకకాలమున ప్రకోపమునొందుటచే కల్గినది సాన్నిపాతికము, ఇవినాల్గు; ద్వంద్వజములలో వాతపిత్తములచే గల్గినది యాగ్నేయము, కఫవాతములచే గల్గినది గ్రంథివిసర్పము, పిత్తకఫములచే గల్గినది కర్దమకమునని చెప్పబడు ద్వంద్వజములు మూడును చేరి విసర్పభేదములు ఏడువిధములనుండును. అందు కర్దమకము మిక్కిలి క్రూరమైనది. (ఇచ్చట వాత-పిత్త-కఫములు వికృతి జెందినపుడు శరీరమును చెరచును కావున దోషములని చెప్పబడు). ఇది 'కతి భేదః?' అను మూడవప్రశ్నమున కుత్తరము.

## 4. విసర్పోత్పత్తికి ప్రారంభక కారణములు.

మూ. రక్తం లసీకా త్వఙ్మాంసం దూష్యం దోషాస్త్రయో మలాః,
విసర్పాణాం సముత్పత్తౌ విజ్ఞేయాః సప్తధాతవః. 15

వ్యా. రక్తము, లసీక (త్వగ్గతమైనద్రవము), చర్మము, మాంసము అను నీదూష్యములు నాల్గును; మలరూపములైన (దుష్టములైనపుడు శరీరమును మలినముగ జేయునట్టి) వాత-పిత్త-కఫములను మూడుదోషములును చేరి సప్తధాతువులును విసర్పరోగముల యుత్పత్తికి (ఆరంభక) కారణములగును. (ఇది "కియద్ధాతుః" అను నాల్గవప్రశ్నమున కుత్తరము).

ఇచ్చట 'దోషాః త్రయః' అనుటచేతనే వాత-పిత్త-కఫములని యర్థమగుచున్నను 'మలాః' అనియు చెప్పుటవలన నీవ్యాధియందు దోషము మిక్కిలి ప్రకుపితములై శరీరమును అత్యంతమలినముగ జేయునని యర్థము. మరియు వాతాదులు మూడును శరీరమును (దుష్టములైనపుడు) చెరచుస్వభావము కల్గియుండుటవలన దోషములనియు, మలినముగ జేయుటవలన మలములనియు, సామ్యావస్థయందు శరీరమును ధరింపజేయుటంజేసి ధాతువులనియు, తంత్రకారులు చెప్పెదరు. ఈవిషయము స్థలాంతరమున నిట్లు చెప్పబడినది.—"శరీరదూషణాద్దోషాః మలినీకరణాన్మలాః, ధారణాద్ధాతవశ్చ స్యుః వాతపిత్తకఫాస్త్రయః." మరియు, కుష్ఠమునందు—"వాతాదయస్త్రయో దుష్టాః త్వగ్రక్తం మాంసమమ్బుచ, దూషయన్తి సకుష్ఠానాం సప్తకో ద్రవ్యసఙ్గ్రహః." (చి. అ. ౭ శ్లో. ౯) అనుశ్లోకముచే వాతాదులు మూడును త్వగ్రక్తమాంసలసీకములును చేరి యేడును ఆరంభక కారణములని చెప్పబడినది. అచ్చట జెప్పినయారంభక కారణములు స్థిరములై చాలకాలమునకు కుష్ఠముల గల్గించుననియు, ఈవిసర్పమునందు అతిశీఘ్రముగ పలుతెరంగుల సంచరించు స్వభావముగల్గి, అతిశీఘ్రమున వ్యాధిని కల్గించుననియు భేదము నెరుంగునది.

## 5. విసర్పసామాన్యనిదానము (హేతువులు)

మూ. లవణాఽమ్లకటూష్ణానాం రసానామతిసేవనాత్,
దధ్యమ్లమస్తుశుక్తానాం సురాసౌవీరకస్య చ. 16
వ్యాపన్నబహుమద్యోష్ణరాగషాడబసేవనాత్,
శాకానాం హరితానాం సేవనాచ్చ విదాహినామ్. 17
కూర్చికానాం చ కిలాటానాం సేవనాన్మన్థకస్య చ,
దధ్నః శాణ్డాకిపూర్వాణాం ఆసుతానాం చ సేవనాత్. 18

## 1-2 విసర్పవ్యాధినామము, అట్టిపేరు గల్గుటకు కారణంబును.

మూ. వివిధం సర్పతియతో విసర్పస్తేన స స్మృతః,
పరిసర్పోఽథవా నామ్నా సర్వతః పరిసర్పణాత్. 11

వ్యా. పైజెప్పినవ్యాధి శరీరమునందు పలుతెరంగుల (ఒకనియమములేక క్రిందుగనైనను, ఊర్ధ్వముగనైనను, అడ్డముగనైనను స్ఫోటములు శోఫము మున్నగు రూపభేదములుగల్గి) వ్యాపించుటంజేసి విసర్పమనియు, శరీరమునందంతటను దేశనియమములేక యిచ్చవచ్చినస్థలములయందెల్ల వ్యాపించుటంజేసి పరిసర్పమనియు రెండునామములచే జెప్పబడును. "వివిధం సర్పతీతి-విసర్పః, పరితః (సర్వత్ర శరీరే) సర్పతీతి పరిసర్పః." అనువ్యుత్పత్తిచే నన్వర్థనామములని యెరుంగునది. (ఇది వ్యాధినామ మెద్ది? పేరుకు కారణమేమి? అను రెండుప్రశ్నముల కుత్తరము).

## 3. విసర్పరోగభేదములు.

మూ. స చ సప్తవిధో దోషైః విజ్ఞేయస్సప్తధాతుకః,
పృథక్ త్రయః త్రిభిశ్చైకో విసర్పో ద్వన్ద్వజాః త్రయః. 12
వాతికః పైత్తికశ్చైవ కఫజస్సాన్నిపాతికః,
చత్వార ఏతే వీసర్పాః, వక్ష్యన్తే ద్వన్ద్వజాస్త్రయః. 13
ఆగ్నేయో వాతపిత్తాభ్యాం, గ్రన్థ్యాఖ్యః కఫవాతజః,
యస్తు కర్దమకో ఘోరః స పిత్తకఫసమ్భవః. 14

వ్యా. అట్టి విసర్పము దోషభేదముచే ఏడుధాతువులు కారణములుగ గల్గి యేడువిధముల నుండును. అందు వాత-పిత్త-కఫములచే వేరువేరుగ జనించినవి మూడును, మూడుదోషముల సన్నిపాతముచే జనించినది యొకటియు, వాతాదిదోషయసంసర్గముచే జనించినవి మూడును కలిసి విసర్పభేదము లేడువిధములుగ నుండును. అందు వాతముచే జనించినది వాతికము, పిత్తమున జనించినది పైత్తికము, కఫముచే గల్గినది కఫజము, త్రిదోషముల నేకకాలమున ప్రకోపమునొందుటచే కల్గినది సాన్నిపాతికము, ఇవినాల్గు; ద్వంద్వజములలో వాతపిత్తములచే గల్గినది యాగ్నేయము, కఫవాతములచే గల్గినది గ్రంథివిసర్పము, పిత్తకఫములచే గల్గినది కర్దమకమునని చెప్పబడు ద్వంద్వజములు మూడును చేరి విసర్పభేదములు ఏడువిధములనుండును. అందు కర్దమకము మిక్కిలి క్రూరమైనది. (ఇచ్చట వాత-పిత్త-కఫములు వికృతి జెందినపుడు శరీరమును చెరచును కావున దోషములని చెప్పబడు). ఇది 'కతి భేదాః?' అను మూడవప్రశ్నమున కుత్తరము.

## 4. విసర్పోత్పత్తికి ప్రారంభక కారణములు.

మూ. రక్తం లసీకా త్వఙ్మాంసం దూష్యం దోషాస్త్రయో మలాః,
విసర్పాణాం సముత్పత్తౌ విజ్ఞేయాః సప్తధాతవః. 15

వ్యా. రక్తము, లసీక (త్వగ్గతమైనద్రవము), చర్మము, మాంసము అను నీదూష్యములు నాల్గును; మలరూపములైన (దుష్టములైనపుడు శరీరమును మలినముగ జేయునట్టి) వాత-పిత్త-కఫములను మూడుదోషములును చేరి సప్తధాతువులును విసర్పరోగముల యుత్పత్తికి (ఆరంభక) కారణములగును. (ఇది "కియద్ధాతుః" అను నాల్గవప్రశ్నమున కుత్తరము).

ఇచ్చట 'దోషాః త్రయః' అనుటచేతనే వాత-పిత్త-కఫములని యర్థమగుచున్నను 'మలాః' అనియు చెప్పుటవలన నీవ్యాధియందు దోషము మిక్కిలి ప్రకుపితములై శరీరమును అత్యంతమలినముగ జేయునని యర్థము. మరియు వాతాదులు మూడును శరీరమును (దుష్టములైనపుడు) చెరచుస్వభావము కల్గియుండుటవలన దోషములనియు, మలినముగ జేయుటవలన మలములనియు, సామ్యావస్థయందు శరీరమును ధరింపజేయుటంజేసి ధాతువులనియు, తంత్రకారులు చెప్పెదరు. ఈవిషయము స్థలాంతరమున నిట్లు చెప్పబడినది.—"శరీరదూషణాద్దోషాః మలినీకరణాన్మలాః, ధారణాద్ధాతవశ్చ స్యుః వాతపిత్తకఫాస్త్రయః." మరియు, కుష్ఠమునందు—"వాతాదయస్త్రయో దుష్టాః త్వగ్రక్తం మాంసమమ్బుచ, దూషయన్తి సకుష్ఠానాం సప్తకో ద్రవ్యసఙ్గ్రహః." (చి. అ. ౭ శ్లో. ౯) అనుశ్లోకముచే వాతాదులు మూడును త్వగ్రక్తమాంసలసీకములును చేరి యేడును ఆరంభక కారణములని చెప్పబడినది. అచ్చట జెప్పినయారంభక కారణములు స్థిరములై చాలకాలమునకు కుష్ఠముల గల్గించుననియు, ఈవిసర్పమునందు అతిశీఘ్రముగ పలుదెరంగుల సంచరించు స్వభావముగల్గి, అతిశీఘ్రమున వ్యాధిని కల్గించుననియు భేదము నెరుంగునది.

## 5. విసర్పసామాన్యనిదానము (హేతువులు)

మూ. లవణాఽమ్లకటూష్ణానాం రసానామతిసేవనాత్,
దధ్యమ్లమస్తుశుక్తానాం సురాసౌవీరకస్య చ. 16
వ్యాపన్నబహుమద్యోష్ణరాగషాడబసేవనాత్,
శాకానాం హరితానాం సేవనాచ్చ విదాహినామ్. 17
కూర్చికానాం చ కిలాటానాం సేవనాన్మన్థకస్య చ,
దధ్నః శాణ్డాకిపూర్వాణాం ఆసుతానాం చ సేవనాత్. 18

తిలమాషకులుత్థానాం తైలానాం పైష్టికస్య చ,
గ్రామ్యానూపౌదకానాం చ మాంసానాం లశునస్య చ. 19
ప్రక్లిన్నానామసాత్మ్యానాం విరుద్ధానాం చ సేవనాత్,
అత్యాదానాత్ దివాస్వప్నాదజీర్ణాఽధ్యశనాత్ క్షతాత్. 20
క్షతబన్ధప్రపతనాత్ ఘర్మకర్మాఽతిసేవనాత్,
(వధబన్ధపతనాత్ దంష్ట్రాదన్తనఖక్షతాత్)
విషవాతాగ్నిదోషాచ్చ విసర్పాణాం సముద్భవః. 21
ఏతైర్నిదానైః వ్యామిశ్రైః కుపితా మారుతాదయః,
దూష్యాన్ సన్దూష్య రక్తాదీన్ విసర్పన్త్యహితాశినామ్. 22

వ్యా. ఉప్పు, పులుపు, కారము, అనురసముల నధికముగ సేవించుట; పుల్లని పెరుగు, పెరుగుమీదిమీగడ, శుక్తము, సురయనుమద్యము, సౌవీరకమను కాంజికము, అనువాని నధికముగ సేవించుట; చెడినమద్యమును సేవించుట, అధికమద్యపానముచేయుట, ఉష్ణమును కల్గించురాగములనైనను షాడబములనైనను సేవించుట, తాపమును బుట్టించు హరితశాకవర్గమున జెప్పబడిన అల్లము మున్నగుశాకముల సేవించుట, కూర్చికములను (పాలలో సమభాగముగ పెరుగునైనను మజ్జిగనైనను చేర్చి పక్వముచేయబడిన ద్రవములను), కిలాటములను (అట్లు పక్వముచేయబడిన కూర్చికలో ఘనపదార్థము, జున్ను), మందకమును (తోడుపెట్టబడి చక్కగ పేరకుండు పెరుగును) అధికముగ సేవించుట, శాండాకి మున్నగువానిని సేవించుట, నువ్వులు, ఉద్దులు, ఉలవలు, తైలములు, పిండితో జేయబడినభక్ష్యములు, వీనిని సేవించుట; గ్రామములనుండుకోడి మున్నగుజంతువులయొక్కయు, జలప్రాంతమున నుండుజంతువులయొక్కయు, జలముననుండు మత్స్యాదులయొక్క మాంసములను, వెల్లుల్లిని అధికముగ సేవించుట, కుళ్లినమాంసాదులను, శరీరమునకు ఇమడని యాహారపదార్థముల సేవించుట, సంయోగాదివిరుద్ధములగు క్షీరమత్స్యాదుల నొకటిగ చేర్చి భుజించుట, తాను భుజించుపరిమితికన్న నధికముగ భుజించుట, పగటియందు నిదురించుట, ముందుదినము భుజించినయాహారము చక్కగ జీర్ణము కాకుండునపుడు మరల భుజించుట, భుజించినవెంటనే మరల భుజించుట, హృదయమున నభిఘాతముచే పుండగుట, దంతనఖాదులచే గాయములు కల్గుట, బంధనాదులచే నొరిబిడికల్గుట, ఎండలోనుండుట, పనులనధికముగచేయుట, విషసంబంధముకల గాలియొక్కయు అగ్నియొక్కయు స్పర్శముకలుగుట, ఈకారణములచే విసర్పములు సంభవించును.

పైజెప్పినకారణములలో కొన్ని మిశ్రములై కల్గుటవలన వాతాదిదోషములు ప్రకోపమునొంది పైజెప్పిన రక్త-లసీక-త్వక్కు-మాంసము, అనుదూష్యముల చెరిచి వానితోగూడి అపత్యసేవనము చేయువారిశరీరమున పలుదెరంగుల వ్యాపించును. (ఇది "కిం నిదానః" (ఈవ్యాధికి నిదాన మెద్ది) యనునైదవప్రశ్నమున కుత్తరము.)

శాండాకిస్వరూపము తంత్రాంతరమున నిట్లు చెప్పబడినది:—"శాణ్డాకీ సంధి తాజ్ఞేయా మూలకైస్సర్ష పాదిభిః" (ముల్లంగియందు నీళ్లుపోసి పసుపు, ఆవాలు, ఇంగువ, సైంధవలవణము, జీలకఱ్ఱ, శుంఠి మున్నగువానిచూర్ణముమ కలిపి యొక కుండలోబోసి మూతబెట్టి చీలమన్ను చే సంధి బిగించి మూడునాల్గుదినములకు నుంచిన నయ్యది శాండాకి యని యర్థము.)

### 6. విసర్పముల కాశ్రయములు.

మూ. బహిః శ్రితః శ్రితశ్చాన్తస్తథా చోభయసంశ్రితః,
విసర్పో బలమేతేషాం జ్ఞేయం గురు యథోత్తరమ్.　　23

వ్యా. విసర్పము శరీరమునందలి బహిఃప్రదేశమైన రక్తాదిశాఖల నాశ్రయించి జనించునది యొకటి. శరీరమునందలి కోష్ఠాదుల నాశ్రయించినది వేరొకటి. అట్టి యంత ర్బహిఃప్రదేశముల రెండిటి నాశ్రయించినది మరియొకటి. (ఇత్తెరంగున నాశ్రయ భేదములచే మూడువిధములుగ నుండును.) అందు క్రమముగ నొకదానికన్న నొకటి బలవత్తరముగ నుండును. (బహిరాశ్రయమునకంటె నంతరాశ్రయంబును, దానికన్న నుభయాశ్రయంబును బలిష్ఠముగ నుండునని భావము).

(శరీరమునందలి మూడువిధములైన ప్రదేశముల నాశ్రయించి విసర్పము జనించును. అందు రక్తాదిధాతువులును త్వక్కును శాఖ లనబడును.) అట్టి బహిర్మార్గములైన శాఖల నాశ్రయించినది బహిరాశ్రయము. శరీరాంతర్భాగమైన కోష్ఠము (ఆమ-పక్వాశయములకును మూత్రాశయమునకును ఆశ్రయమై కంఠమువరకును వ్యాపించియుండు మహాస్రోతస్సు) నాశ్రయించి జనించినది అంతరాశ్రయము. ఈరెండిటి నాశ్రయించినది యుభయాశ్రయము. ఈమూడిటిలో నొకదానికన్న నొకటి బలవత్తరమని ముఖ్యభావము. ఇది "కిమాశ్రయః" అను నారవప్రశ్నమున కుత్తరము.

### 7. విసర్పమున కాశ్రయములబట్టి సాధ్యాసాధ్యవిభాగము.

మూ. బహిర్మార్గాశ్రితం సాధ్యం అసాధ్యముభయాశ్రితం,
విసర్పం దారుణం విద్యాత్ సుకృచ్ఛ్రం త్వన్తరాశ్రయమ్.　　24

వ్యా. పైజెప్పినరీతి నాశ్రయభేదముచే మూడువిధములైన విసర్పములలో బహిర్మార్గము నాశ్రయించినది సాధ్యము. ఉభయమార్గముల నాశ్రయించినది యసాధ్యము. అంతర్మార్గము నాశ్రయించినది కృచ్ఛ్రసాధ్యము. (ఇది సుఖసాధ్యాదిలక్షణము లెవ్వి యను నేడవప్రశ్నమున కుత్తరము.

విసర్పముల కాశ్రయభేదవివరణము.

మూ. అన్తః ప్రకుపితా దోషాః విసర్పన్త్యన్తరాశ్రయే,
బహిర్బహిః ప్రకుపితాః, సర్వత్రోభయసంశ్రితాః. 25

వ్యా. అంతరాశ్రయవిసర్పమున ప్రకుపితములైన దోషములు శరీరాంతర్భాగమైన కోష్ఠమున వ్యాపించి విసర్పమును కల్గించును. అట్టిదోషములు రక్తాదిశాఖల నాశ్రయించి వ్యాపించి బహిరాశ్రయమును కల్గించును. అంతర్బహిర్మార్గముల రెంటియందును వ్యాపించి యుభయాశ్రయమును కల్గించును.

అన్తరాశ్రయవిసర్పలక్షణము.

మూ. మర్మోపఘాతాత్ సమ్మోహాత్ అయనానాం విఘట్టనాత్,
తృష్ణాతియోగాద్వేగానాం విషమాణాం ప్రవర్తనాత్. 26
విద్యాద్విసర్పమన్తర్జమాశు చాగ్నిబలక్షయాత్,

వ్యా. అంతర్విసర్పమునందు హృదయాదిమర్మస్థానములయం దభిఘాతముకల్గినట్లు వ్యథయు, మూర్ఛయు, అయనమార్గములయందు సంఘర్షణంబును, అధికముగదప్పియు, మలమూత్రాదివేగములు విషమములుగ ప్రవర్తించుటయు, శీఘ్రముగ జాఠరాగ్నినాశంబును శరీరబలనాశంబును కల్గును. ఈలక్షణములబట్టి యంతర్విసర్పమని యెరుంగునది.

బహిరాశ్రయవిసర్పలక్షణము.

మూ. అతో విపర్యయాద్బాహ్యం అన్యైర్విద్యాత్స్వలక్షణైః. 27

వ్యా. పైజెప్పినలక్షణములు లేక యీక్రిందజెప్పబడు వాతాదివిసర్పలక్షణములు మాత్రము కల్గినది బాహ్యవిసర్పమని యెరుంగునది. (అంతరాశ్రయవిసర్పమునకు జెప్పిన మర్మోపఘాతాదిలక్షణములు లేక కేవలము వాతాదివిసర్పములకు జెప్పినలక్షణములు మాత్రము కల్గినది బాహ్యవిసర్పము. ఈరెంటిలక్షణములు మిశ్రములుగ నున్నయెడ నుభయాశ్రయమని యర్థాల్లభ్యము.

### విసర్పసామాన్యముగ నసాధ్యలక్షణములు.

మూ. యస్య సర్వాణి లిఙ్గాని బలవద్యస్య కారణమ్,
యస్య చోపద్రవాః కష్టాః, మర్మగో యశ్చ హన్తి సః 28

వ్యా. అంతరాశ్రయ-బహిరాశ్రయలక్షణములన్నియు కల్గినవిసర్పంబును, ప్రబలములగు కారణములచే జనించినవిసర్పంబును, కష్టములగు నుపద్రవములతోఁగూడిన విసర్పంబును, మర్మస్థలముల జనించినవిసర్పంబును, మనుజుని తప్పక చంపును. (అసాధ్యమని భావము).

### ౮. వాతికవిసర్పనిదానము.

మూ. రూక్షోష్ణైః కేవలైర్వాయుః పూరణైర్వా సమావృతః,
ప్రదుష్టో దూషయన్ దూష్యాన్ విసర్పతి యథాబలమ్. 29

వ్యా. రూక్షగుణంబును ఉష్ణవీర్యంబును కలపదార్థములసేవించుటచేత, వాతము సంచరించుమార్గము ఇతరదోషములచే నిండి యడ్డగింపబడుటచేతను వాతము మిక్కిలి దుష్టమై ప్రకోపించి రక్తాదిదూష్యముల చెరచి శరీరమున స్వేచ్ఛగ వ్యాపించి విసర్పమును కల్గించును. (ఇచ్చట రూక్షాదిసేవనచే వాతము స్వతంత్రముగను, మార్గనిరోధముచే పరతంత్రముగను వాతము ప్రకోపమునొందును. మరియు నుష్ణము వాతవర్ధకము గాకున్నను రూక్షయుక్తమై వాతప్రకోపణమగునని యెరుంగునది).

### వాతికవిసర్పలక్షణము.

మూ. తస్య రూపాణి:—భ్రమదవథుపిపాసానిస్తోదశూలాఽఙ్గమర్దోద్వేష్టనకమ్పజ్వరతమకకాసాఽస్థిసన్ధిభేద విశ్లేషణలేపనాఽరోచకాఽవిపాకాః, చక్షుషో రాకులత్వం, అస్రాగమనం, పిపీలికాసఞ్చార ఇవచాఽఙ్గేషు; యస్మింశ్చాఽవకాశే విసర్పో విసర్పతి(విసర్పోఽనుసర్పతి) సోఽవకాశః శ్యావాఽరుణాభాసః శ్వయథుమాన్, నిస్తోదభేదశూలాయామసఙ్కోచహర్షస్ఫురణైరతిమాత్రం ప్రపీడ్యతే; అనుపక్రాన్తశ్చోపచీయతే శీఘ్రభేదైః స్ఫోటకైః తనుభిరరుణాభైః శ్యావైర్వా, తనువిశదారుణాఽల్పాస్రావైః; విబద్ధవాతమూత్ర పురీషశ్చ భవతి, నిదానోక్తాని చాస్య నోపశేరతే. విపరీతాని చోపశేరతే ఇతి వాతవిసర్పః. 30

వ్యా. వాతముచే గల్గినవిసర్పమున భ్రమము (చక్రముపై నున్నవానివలె నొడలు తిరుగుట) దవథువు (కన్నులు మొదలగువానియందు మంట), దప్పి, సూదులబొడిచిన విధముగ చురుకుచురుక్కను బాధ, శూలమున గ్రుమ్మినరీతి పోటు, ఒడలినొప్పులు, హస్తపాదాదులయందు కొంకరలుబోవుట, వణకు, జ్వరము, మైకము, దగ్గు, అస్థులయందును కీళ్లయందును పగులదీయువిధముగ బాధ, కీళ్లు తొలగినవిధముగ బాధ, సందులయందు కంపము, అరుచి, ఆహారము జీర్ణముకాకుండుట, కన్నులు కలకబారియుండుట, కన్నీరుగారుట, అవయవములపై చీమలు పారుకాడినవిధముగ నుండుట, అను నీలక్షణములు కల్గియుండును. మరియు నేప్రదేశమున విసర్పము వ్యాపించునో ఆప్రదేశమున శ్యామవర్ణంబును అరుణవర్ణంబును కిల్గి వాపుకల్గును. ఆవాపు వ్యాపించినప్రదేశములయందెల్ల సూదులబొడిచినట్లు పోటును శూలమున గ్రుమ్మినట్లు బాధయు కల్గును. ఈడువబడినట్లును ముడువబడినట్లును బాధకల్గును. అచ్చోట రోమములు గగురుపొడిచి యదరుచుండును. ఈబాధలెల్ల విసర్పము వ్యాపించుస్థలములయందెల్ల గల్గుచుండును. దీనికి వెంటనే తగుచికిత్స జేయనియెడ శీఘ్రముగ పగులునవియు, సూక్ష్మాకారంబులును, అరుణవర్ణంబైనను శ్యామవర్ణంబైనను కల్గినవియు, పలుచనై లేటనై యెరుపుకల్గినద్రవమును కొంచెముగ స్రవించునవియు, నగుబొబ్బలచే నావరింపబడును. అట్టిరోగికి అపానవాత-మూత్ర-పురీషంబులు బద్ధగించును. దీనికి నిదానముగ జెప్పబడిన రూక్షోష్ణాదిద్రవ్యములు మున్నగువానిని సేవించినచో మరింత వృద్ధినొందును. వానికి విరుద్ధగుణములైన స్నిగ్ధశీతాదిద్రవ్యముల యుపయోగముచేత కొంచెము శమించును. (ఇది యుపశయానుపశయరూపముగ పరీక్షించువిధము) ఈలక్షణములన్నియు వాతవిసర్పమున కల్గును.

## పిత్తవిసర్పనిదానము.

మూ. పిత్తముష్ణోపచారేణ విదాహ్యమ్లాశనైశ్చితం,
దూషాన్ సన్దూష్య ధమనీః (మార్గాంశ్చ) పూరయన్ వై
విసర్పతే.

వ్యా. ఉష్ణవీర్యంబులును ఉష్ణగుణంబులు నగు నన్నపానాద్యుపచారములచేతను, విదాహకరములును అమ్లరసంబులు నగు నన్నాదుల భుజించుటచేతను పిత్తము ప్రకోపించి రక్తాదిదూష్యముల చెరచి శరీరమునందలి ధమనుల పూరించి పలుచెరంగుల వ్యాపించి విసర్పమును కల్గించును.

ఇచ్చట "ధమనీః పూరయన్" అనునది పిత్తవిసర్పముననే చెప్పబడినను తక్కిన విసర్పములయందును సామాన్యముగ నన్వయింపవలెను. "సమానేష్వన్యేషు ఏకత్రాభిహితో

విధిః అన్యత్రాప్యనుషఙ్గనీయః" అను న్యాయము ననుసరించి వీసర్పసామాన్యవిధిగ జెప్పబడిన యీవాక్యమును తక్కిన విసర్పములయందును అన్వయించుటచే నన్నిటియందును ధమనులను దోషము పూరించునని యెఱుంగునది. ఇది సామాన్యవిధియైనను విసర్పములన్నియు పిత్తప్రధానము లగుటం జేసి పిత్తవిసర్పమున జెప్పబడినది.

### పిత్తవిసర్పలక్షణములు.

మూ. తస్య రూపాణి:—జ్వరతృష్ణామూర్ఛా మోహచ్ఛర్ద్యరోచకోఽఙ్గభేదః స్వేదోఽతిమాత్రం అన్తర్దాహః ప్రలాపః శిరోరుక్ చక్షుషోరాకులత్వమస్వప్నమరతిః భ్రమః శీతవాతవారితర్షోఽతిమాత్రం హరితహారిద్రనేత్రమూత్రవర్చస్త్వం హరితహారిద్రరూపదర్శనం చ; యస్మింశ్చావకాశే విసర్పోఽనుసర్పతి, సోఽవకాశః తామ్రహరితహారిద్రనీలకృష్ణరక్తానాం వర్ణానామన్యతమం పుష్యతి; సోత్సేధైశ్చ అతిమాత్రం దాహసమ్భేదనపరీతైః స్ఫోటైరుపచీయతే తుల్యవర్ణస్రావైః చిరపాకైశ్చ నిదానోక్తాని చాస్య నోపశేరతే, విపరీతాని చోపశేరతే, ఇతి పిత్తవిసర్పః. 32

వ్యా. పిత్తమున జనించినవిసర్పమున—జ్వరము, దప్పి, మూర్ఛ, మైకము, వాంతి, అరోచకము, ఒడలినొప్పులు, అధికముగ చెమట, శరీరాంతర్భాగమున నధికమైనమంట, ప్రలాపము (సంబంధములేక వదరుట), తలనొప్పి, కన్నులు కలఁబారుట, నిదురబట్టకుండుట, అన్నిటియందును ఆసక్తిలేకుండుట, ఒడలుతిరుగుట, చల్లనిగాలిని జలము అధికముగ గోరుట, కన్నులును మూత్రంబును పురీషంబును ఆకుపచ్చనిరంగైనను పసుపురంగైనను కల్గియుండుట, కండ్లకగపడువస్తువులన్నియు ఆకుపచ్చనిరంగుగనైనను పచ్చగనైనను కనబడుట ఈలక్షణములు కల్గును.

మరియుఁ:—శరీరమునం దేప్రదేశమున విసర్పము వ్యాపించుచుండునో ఆస్థలమెల్ల తామ్రవర్ణము ఆకుపచ్చనిరంగు నీలవర్ణము నలుపు ఎరుపు అను నీవర్ణములలో నేదైన నొకరంగు వృద్ధినొందుచుండును. ఉన్నతములై మంటయు పగులదీయునట్లు బాధయు నధికముగ గల్గిన బొబ్బలచే వ్యాప్తమై వానినుండి బొబ్బ లేరంగు కల్గియుండునో అట్టిరంగు కలద్రవము స్రవించుచుండును. ఆస్ఫోటములు చిరకాలమునకుపక్వములగును. ఈవిసర్పమునకు చెప్పిననిదానములైన నుష్ణోపచారాదులచే మరింత వృద్ధినందును.

అందుకు విపరీతగుణములైన శీతాదులచే కొంచెము శమించును. ఇట్టిలక్షణముల గల్గినది పిత్తవిసర్పమని యెఱుంగునది.

## శ్లైష్మికవిసర్పనిదానము.

మూ. స్వాద్వమ్లలవణస్నిగ్ధగుర్వన్నస్వప్నసంచితః,
కఫః సందూషయన్ దూష్యాన్ కృచ్ఛ్రమఙ్గే విసర్పతి. 33

వ్యా. మధుర-అమ్ల-లవణరసములును, గురుగుణముకల యన్నాదుల భుజించుట చేతను, పగటియందు నిదురించుటచేతను మిక్కిలి వృద్ధినొందినకఫము ప్రకుపితమై రక్తాదిదూష్యములను చెరిచి కఫజవిసర్పము కల్గించును. ఈవిసర్పము శరీరమునందు మెల మెల్లగ చిరకాలమునకు వ్యాపించును.

## శ్లైష్మికవిసర్పలక్షణములు.

మూ. తస్య రూపాణి—శీతకః శీతకజ్వరో గౌరవంనిద్రాతన్ద్రాఽరోచకో మధురాస్యత్వమాస్యోపలేపో నిష్ఠీవికా ఛర్దిరాలస్యం స్తైమిత్య మగ్నినాశో దౌర్బల్యం చ; యస్మింశ్చావకాశే విసర్పోఽను సర్పతి సోఽవకాశః శ్వయథుమాన్ పాణ్డుర్నాతిరక్తః స్నేహ సుప్తిస్తంభగౌరవైరన్వితోఽల్పవేదనః, కృచ్ఛ్రపాకైశ్చిరకారిభిః బహులత్వగుపలేపైః స్ఫోటైః శ్వేతపాణ్డుభిరనుబధ్యతే; ప్రభిన్న స్తు శ్వేతం పిచ్ఛిలం తంతుమద్ఘనమనుబద్ధం స్నిగ్ధమాస్రావం స్రవ త్యూర్ధ్వం చ గురుభిః స్థిరైః జాలావతతైః, స్నిగ్ధైర్బహులత్వగుప లేపైః వ్రణైరనుబధ్యతేఽనుషఙ్గీచ భవతి; శ్వేతనఖనయనవదనత్వ఼ ఙ్మూత్రవర్చస్త్వం, నిదానోక్తాని చాస్య నోపశేరతే, విపరీతాని చోపశేరతే. ఇతి శ్లేష్మవిసర్పః. 34

వ్యా. శ్లేష్మమునగల్గినవిసర్పమునకు శరీరము చల్లగనుండును. చలితో కూడిన జ్వరము కల్గును. శరీరము బరువుగ నుండును. నిద్రయు, కునికిపాటును కల్గును. నోరు రుచి తెలియక తీపికల్గి జిగటగ నుండును. నోట ద్రవము నుమియుచు, వాంతియు నగును. పనులయం దలసటకల్గి జడముగ నుండును. జఠరాగ్ని మందగించును. చాల బల హీనము కల్గును. మరియు ఈవిసర్పము యేస్థలమునందు వ్యాపించునో ఆస్థలమునం దెల్ల వాపుకల్గి పాండువర్ణంబైనను, కొంచెముగ రక్తవర్ణంబైనను కల్గియుండును. చమురు

పూసినవిధముగ జిడ్డుకల్గి స్పర్శను నెరుంగక స్తంభించి బరువుగ నుండును. బాధమాత్రము కొద్దిగ నుండును. అట్టివాపు కల్గినచోట తెల్లనిరంగైనను, పాండువర్ణంబైనను కల్గినబొబ్బలు వ్యాపించును. అట్టి బొబ్బలు మిగుల కష్టముచే చిరకాలమునకు పక్వములై చాలకాలమునకు బాధకల్గించును. ఆబొబ్బలపై చర్మము ఘనమై జిగటకల్గియుండును. అట్టి విసర్పము పగిలినపుడు శ్వేతవర్ణముగను, పిచ్ఛిలముగను, తీగలుసాగునదియు ఘనీభవించినదియు, చాలకాలము అనుబంధించునదియు, జిడ్డుతో కూడినదియు నగుద్రవమును స్రవించును. శరీరమునం దూర్ధ్వభాగమున వ్రణములు వ్యాపించును. అట్టివ్రణములు చాల గొప్పవిగను, కఠినములుగను, జల్లెడకంతలవంటి రంధ్రములచే వ్యాపించినవిగను, జిడ్డుకల్గినవియు, ఘనమైన చర్మముతోకూడి జిగటకల్గినవియు నైయుండును. ఈవిసర్పము చాలకాలము అనుసరించియుండును. ఈరోగముచే పీడింపబడిన వానికి గోళ్లును, కన్నులును, ముఖంబును, చర్మంబును, మలమూత్రములు తెల్లగనైయుండును. దీనికి నిదానముగ జెప్పబడిన మధురాదియాహారములచే నియ్యాది మరింత వృద్ధినొందును. అట్టి నిదానమునకు విరుద్ధమయినవానిచే కొంచెము శాంతమునొందును. ఈలక్షణములు కలవి శ్లేష్మవిసర్పమని యెరుంగునది.

### వాతపిత్తజవిసర్ప (అగ్నివిసర్ప) నిదానము.

మూ. వాతపిత్తం ప్రకుపితమతిమాత్రం స్వహేతుభిః,
పరస్పరం లబ్ధబలం దహద్గాత్రం ప్రసర్పతి. 35

వ్యా. వాతపిత్తములు రెండును వానివానికి వేరువేరుగ పైజెప్పబడిన కారణములసంసర్గముచే రెండు నేకకాలమున మిక్కిలి ప్రకుపితములై యొకదానిచే నొకటి బలమునొంది శరీరమును దహించుచు (మంటబుట్టించుచు) పలుతెరంగుల వ్యాపించి విసర్పమును కల్గించును. ఇయ్యది యగ్నివిసర్పమని చెప్పబడును.

### వాతపిత్తజవిసర్ప (అగ్నివిసర్ప) లక్షణములు.

మూ. తదుపతాపాదాతురః సర్వశరీరమఙ్గారైరివ ఆకీర్యమాణం మన్యతే,
ఛర్ద్యతీసారమూర్ఛాదాహ మోహజ్వరతమకారోచకాస్థిసన్ధిభేద
తృష్ణాఽవిపాకాఙ్గభేదాదిభిశ్చాభిభూయతే, యం యం చావ
కాశం విసర్పోఽనుసర్పతి సోఽవకాశః శాన్తాఙ్గారప్రకాశోఽతి
రక్తో వా భవతి, అగ్నిదగ్ధప్రకారైశ్చ స్ఫోటైరుపచీయతే, స శీఘ్ర
గత్వాదాశ్వేవ మర్మానుసారీ భవతి, మర్మణి చోపతప్తే పవనోఽతి

బలో భిన త్త్యజ్ఞాన్యతిమాత్రం, ప్రమోహాయతి సంజ్ఞాం హి క్కా
శ్వాసౌ జనయతి, నాశయతి నిద్రాం,సనష్టనిద్రః ప్రమూఢసంజ్ఞో
వ్యథితచేతాః, న క్వచన సుఖముపలభతే, అరతిపరీతః స్థానాదాస
నాత్ శయ్యాం క్రాన్తుమిచ్ఛతి. క్లిష్టభూయిష్ఠశ్చాశు నిద్రాం
భజతి, దుర్బలో దుఃఖప్రబోధశ్చ భవతి, తమేవంవిధమగ్ని
విసర్పపరీతమచికిత్స్యం విద్యాత్. 36

వ్యా. పైజెప్పినరీతిగ సంప్రాప్తమయి అగ్నివిసర్పముచే పీడితుడగురోగి అట్టి
సంతాపమువలన శరీరమునందంతటను నిప్పుకణములు జల్లినట్లు తలచును. (ఓరువరాని
మంట కలుగునని యర్థము.) వాంతి, విరేచనము, మూర్ఛ, శరీరాంతర్భాగమున మంట,
అజ్ఞానము, జ్వరము, మైకము, అరోచకము, అస్థులయందు కీళ్లయందును పగులదీయు
నట్లు బాధ, దప్పి, అజీర్ణము, ఒడలెల్ల పగులదీయునట్లు నొప్పి ఇవి మున్నగునుపద్రవము
లచే చాల బాధనొందును. మరియు నేయేప్రదేశమున నీవిసర్పము సంచరించుచుండునో
ఆస్థలములెల్ల చల్లార్పబడిన నిప్పు (బొగ్గు)వలె మిక్కిలి నల్లగనయినను, రక్తవర్ణముగనైన
నుండును. మరియు నాస్థలములయందు నిప్పునకాలినవిధముగ నుండుబొబ్బలచే వ్యాపిం
చును. ఈవ్యాధి వాతాగ్నిసంబంధము కల్గుటచే నతిశీఘ్రముగ వ్యాపించుస్వభావముకల్గి
శీఘ్రముగనే మర్మస్థలములయందు వ్యాపించును. మర్మస్థానములయందు ఈవ్యాధిచే
సంతాపము గల్గినప్పుడు వాతము మిక్కిలి బలిష్ఠమై అవయవములన్నిటిని భేదించును.
శరీరముపై ప్రజ్ఞను తప్పించి చిత్తభ్రమము కల్గించును. వెక్కిళ్లను శ్వాసమును పుట్టిం
చును. నిద్రను నాశమునొందించును. అట్టిరోగి నిదురపట్టక శరీరముపై ప్రజ్ఞదప్పి
మనస్సు కలతనొంది ఒకచోటనయిన ఒకనిముసమయిన సుఖము నొందనేరడు. అన్నివిష
యములయందును ప్రీతిలేక నిలబడియున్నపుడును, కూర్చొనియున్నపుడును, శయనించు
టకే ప్రయత్నపడుచుండును. ఇట్టికష్టములచే చాల బాధపడి శీఘ్రముగ గాఢనిద్రను
బొందును. అట్టి నిద్రయందు చాల బలమంతయు నుడిగి నిదురనేలొక్కలిపినను మేల్కొ
నక దీర్ఘనిద్ర పొందును. ఇట్టిలక్షణములుగలదే అగ్నివిసర్పమని చెప్పబడును. దీనిచే
బాధితుడగురోగికి చికిత్స చేయంజనదు. ఈవిసర్పమున "మర్మోపఘాతాత్" అని చెప్ప
బడిన అంతరాశ్రయవిసర్పలక్షణములన్నియు గల్గియుండును గాన నియ్యది ప్రత్యా
ఖ్యేయమని యెరుంగునది.)

### కఫపిత్తజవిసర్ప (కర్దమవిసర్ప) నిదానము.

మూ. కఫపిత్తం ప్రకుపితం బలవత్ స్వేన హేతునా,

విసర్పత్యేకదేశే తు ప్రక్లేదయతి దేహినమ్.                    37

వ్యా. కఫపిత్తములు రెండును బలిష్ఠములగు వానివానికారణములచే మిక్కిలి ప్రకోపమునొంది శరీరమునం దెచ్చటనైన నొకప్రదేశమున విసర్పము కల్గించును. అట్టి విసర్పముకల్గునప్పుడే శరీరమును కుళ్లజేయును. ఇది కఫపిత్తసంసర్గముచే గల్గినకర్దమమను విసర్పము.

కఫపిత్తజవిసర్ప (కర్దమవిసర్ప) లక్షణములు.

మూ. తద్వికారాః—శీతజ్వరః, శిరోగురుత్వం దాహః, స్తైమిత్యం, అఙ్గావసదనం, నిద్రా,తన్ద్రా, మోహోఽన్న ద్వేషః ప్రలాపోఽగ్నినాశః, దౌర్బల్యమస్థిభేదో మూర్ఛా, పిపాసా స్రోతసాం ప్రలేపో జాడ్యమిన్ద్రియాణాం ప్రాయోపవేశనమఙ్గవిక్షేపోఽఙ్గమర్దోఽరతిరౌత్సుక్యం చోపజాయతే; ప్రాయశ్చామాశయే విసర్పత్యలసకఏకదేశగ్రాహీ చ యస్మింశ్చావకాశే విసర్పో విసర్పతి, సోఽవకాశో రక్తపీతపాణ్డుపిడకావకీర్ణ ఇవ, మేచకాభః కాలో మలినః స్నిగ్ధో బహూష్మా, గురుః స్తిమితవేదనః శ్వయథుమాన్, గమ్భీరపాకో నిరాస్రావః, శీఘ్రక్లేదః, స్విన్నక్లిన్నపూతిమాంసత్వక్ క్రమేణాల్పరుక్, పరామృష్టోఽవదీర్యతే; కర్దమ ఇవావపీడితోఽన్తరం ప్రయచ్ఛత్యుపక్లిన్నపూతిమాంసత్యాగీ; సిరాస్నాయుసందర్శీ, కుణపగన్ధీ చ భవతి, సంజ్ఞాస్మృతిహన్తా చ; తం కర్దమవిసర్పపరీతమచికిత్స్యం విద్యాత్.                    38

వ్యా. కఫపిత్తము రెండిటి ప్రకోపమునగల్గిన విసర్పమునందు శీతజ్వరము కల్గును. తల బరువుగనుండును. మంటబుట్టును. శరీరము మొద్దుబారి యుండును. శరీరము కృశించును. నిద్రయు కునికిపాటును చిత్తభ్రమంబును కల్గును. అన్నముపై ద్వేషము కల్గును. అర్థములేనిమాటల మాట్లాడును. జాఠరాగ్ని నశించును. బలము తగ్గును. అస్థులలో పగుల దీయునట్లు నొప్పిపుట్టును. మూర్ఛ గ్రమ్మును, దప్పి యధికమగును. నాసాదిస్రోతోరంధ్రములయందు జిగటకల్గును. చక్షురాదీంద్రియములు తమతమవ్యాపారముల జేయుటయందు మందముగ నుండును. పక్వముగాని మలము తరుచుగ వెడలును. అవయవములను పలుపెరంగులు విదర్చును. శరీరమునందు నొప్పికల్గును. చేసియుండును ఆసక్తిలేకనుండును.

శరీరమున శక్తిలేకున్నను మనస్సున నుత్సాహముమాత్రము కల్గియుండును. మరియు నీ విసర్పము ప్రాయికముగ నామాశయమునందుకల్గి మెల్లగ వ్యాపించును. ఏకదేశముననే యుండునుగాని పలువిధముల స్థలాంతరములకు జనదు.

మరియు నీవిసర్పము ఏస్థలమునందునో ఆప్రదేశము రక్త-పీత-పాండువర్ణంబులైన బొబ్బలచే వ్యాప్తమై కప్పురంగును మలినంబునై నెమలిపురికన్నువలె చిత్రవర్ణమై జిడ్డు కల్గి యుండును. తాకినయెడ మిక్కిలి వేడికల్గియుండును. బరువుగనుండును. స్వల్పమైన బాధకల్గును. వాపుకల్గును. మిక్కిలి లోతున పక్వమగును. ద్రవము స్రవించదు. శీఘ్రముగ కుళ్లును. చర్మముపై చెమటబట్టి కుళ్లి కంపెత్తినమాంసము కల్గియుండును. అది నానాట కుళ్లుటవలన బాధనుడిగి చేత తాకినయెడ పగులును. చేత పీడించినచో లోపల కుళ్లి దుర్గంధమైన బురుదవంటిమాంస మూడిపడును. అట్టియెడ లోపలనుండుసిరలును స్నాయువులును కనంబడుచుండును. పీనుగకంపు కల్గియుండును. ఈలక్షణములు కల్గినది కర్దమవిసర్ప మనబడును. ఈవ్యాధి యసాధ్యముకావున రోగికి చికిత్సజేయం జనదు.

## కఫవాతజవిసర్ప(గ్రంథివిసర్ప)నిదానలక్షణములు.

మూ. స్థిరగురుకఠినమధురశీతస్నిగ్ధాఽన్నపానాఽభిష్యంది సేవినాం, అవ్యాయామాదిసేవినామ్, అప్రతికర్మశీలానాం, శ్లేష్మా వాయుశ్చ ప్రకోపమాపద్యేతే, తావుభౌ దుష్టప్రవృద్ధావతిబలౌ ప్రదూష్య దూష్యాన్ విసర్పాయ కల్పేతే. తత్ర వాయుః శ్లేష్మణా విబద్ధమార్గః తమేవ శ్లేష్మాణం అనేకధా భిన్దన్ క్రమేణ గ్రన్థిమాలాం కృచ్ఛ్రపాకసాధ్యాం కఫాశయే సఞ్జనయతి, ఉత్పన్నరక్తస్య వా ప్రదూష్య రక్తం సిరాస్నాయుమాంసత్వగాశ్రితం గ్రన్థీనాం మాలాం కురుతే, తీవ్రరుజానాం స్థూలానాం అణూనాం వాదీర్ఘవృత్తరక్తానామ్. 39

వ్యా. స్థిరగురు-కఠినగుణంబులును, మధురరసంబులును, శీతవీర్యంబులును, స్నిగ్ధంబులునైన యన్నపానముల సేవించినను, స్రోతోమార్గముల ద్రవమును బుట్టించుపదార్థముల సేవించినను, శరీరపరిశ్రమమును విధ్యుక్తప్రకారము చేయకున్నను, వమనవిరేచనాదిపంచకర్మముల వానివానికి నియతకాలమున జేయకున్నను, శ్లేష్మంబును వాతంబును సమకాలమున ప్రకోపమునొందును. అరెండును నొకదానిచే నొకటి దుష్టములై మిక్కిలి

వృద్ధినొంది యెక్కుడుబలముకల్గి రక్తాదిదూష్యములను చెరచి గ్రంథివిసర్పమును కల్గింప సమర్థములగును.

అందు వాతము ప్రకుపితమైన కఫముచే సడ్డగింపబడి, తనమార్గమున కడ్డుపడిన యాకఫమును పలువిధముల తునియలుగ భేదించును. పిదప మిగుల కృచ్ఛ్రసాధ్యమైన గ్రంథులను కఫాశయమున వరుసగ కల్గించును. మరియు తొలుతనే వృద్ధినొందినరక్తము కలమనుజునియొక్క సిరలను స్నాయువులను మాంసమును త్వక్కును ఆశ్రయించినరక్తమును చెరచి గ్రంథులను మాలికవలె వరుసగకల్గించును. అట్టిగ్రంథిమాల తీవ్రమైన బాధకల్గి గొప్పవిగనైనను సూక్ష్మాకారములుగనైనను దీర్ఘములుగనైనను గుండ్రములుగనైన ఎఱ్ఱనిరంగు కల్గియుండును. ఇది గ్రంథివిసర్పము.

## గ్రంథివిసర్పోపద్రవములు.

మూ. తదుపతాపాత్ జ్వరాఽతీసార కాసహిక్కా-శ్వాసశోష ప్రమోహ
వైవర్ణ్యాఽరోచకాఽవిపాక ప్రసేకచ్ఛర్ది మూర్ఛాఽఙ్గభఙ్గ నిద్రా
రతిసదనాద్యాః ప్రాదుర్భవన్త్యుపద్రవాః; స ఏభిరుపద్రుతః సర్వ
కర్మణాం విషయమతిపతితో వివర్జనీయో భవతి ఇతి గ్రన్థివిసర్పః.

వ్యా. ఈవిసర్పమున జ్వరము, అతిసారము, కాసము, హిక్కా-శ్వాసములు, శోషము, మైకము, వివర్ణత్వము, అరోచకము, అజీర్ణము, నోట ద్రవము స్రవించుట, వాంతి, మూర్ఛ, అవయవములు పగులదీయునట్లు నొప్పి, నిద్ర, అరతి, కృశత్వము మున్నగునుపద్రవములు కల్గును. అట్టి యుపద్రవములతో కూడినగ్రంథి విసర్పము శోధన శమనాదిచికిత్సలకు, అన్నిటికి దూరమయినది కావున చికిత్సజేయక విడువందగును. (అసాధ్యమని భావము.)

## ఉపద్రవరోగస్వరూపము.

మూ. ఉపద్రవస్తు ఖలు రోగోత్తరకాలజో రోగాశ్రయో రోగ ఏవ
స్థూలోఽణుర్వా, రోగాత్ పశ్చాజ్జాయతే ఇత్యుపద్రవః. తత్ర
ప్రధానో వ్యాధిః వ్యాధేః గుణ (ణీ) భూత ఉపద్రవః; తస్య
ప్రాయః ప్రధానప్రశమే ప్రశమో భవతి. స తు పీడాకరో
భవతి పశ్చాదుత్పద్యమానో వ్యాధిపరిక్లిష్టశరీరత్వాత్ తస్మా
దుపద్రవం త్వరమాణోఽభిబాధేత.

వ్యా. ఉపద్రవమనః—జ్వరాదిరోగములలో నేదైన నొకరోగము కల్గినపిదప నట్టిరోగమునాశ్రయించి (ఆరోగము యొకకారణముచేతనే) గొప్పదిగనైనను సూక్ష్మముగనైన (తొలుత గల్గినరోగము వ్యాపించియుండుసమయముననే) కల్గినవ్యాధియే యుపద్రవ మనబడును. ఒకరోగము కల్గినపిదప జనించుటంజేసి యుపద్రవమని యన్వర్థముగ జెప్పబడును. ('ఉప (వ్యాధ్యుత్పాదసమీపే కాలే) ద్రవతి ఉపైతి, ఇతి ఉపద్రవః'' అనువ్యుత్పత్తిచేత పైజెప్పిన యన్వర్థసంజ్ఞ యేర్పడునని భావము.)

అందు తొలుత సంభవించినది ప్రధానమైనవ్యాధి. పిమ్మట దాని నాశ్రయించి యప్రధానముగ కల్గినరోగ ముపద్రవము. అట్టి యప్రధానరూపమైన యుపద్రవ రోగము, తొలుత ప్రధానముగబుట్టినవ్యాధికి చికిత్సజేయ నయ్యది శమించినచో (ఉపద్రవంబును) తనంతనే ప్రాయికముగ శమించును. (తొలుతబుట్టిన ప్రధానవ్యాధి యే దోషప్రకోపముచేగల్గునో, దానినాశ్రయించిన యుపద్రవంబును అట్టిదోషముననే గల్గును. కావున ప్రధానవ్యాధికి చికిత్సజేసినయెడ దానితోగూడనే యుపద్రవంబును (ఏకకారణజనితము కావున) శమించునని భావము.)

మరియు అట్టియుపద్రవము వెనుకసంభవించుటచే నప్రధానముగనున్నను, ప్రధానవ్యాధిచే చాలకష్టబడిన శరీరముకలరోగికి సంభవించినదియగుటంజేసి రోగికి మరింతబాధకల్గింప సమర్థమగును. కావున అట్టియుపద్రవమునకు మూలభూతమైన ప్రధానవ్యాధి శామకచికిత్సామూలమున త్వరితముగ చికిత్సజేయవలెను.

ఇచ్చట "రోగాశ్రయో రోగఏవ" అని నియమించుటవలన ప్రధానరోగోత్తరకాలమున రోగమధ్యమున బుట్టినరోగమే యుపద్రవమనబడునుగాని రోగోత్పత్తి సమయముననేబుట్టిన శిరశ్శూలసంతాపాదులు ఉపద్రవములు కానేరవు. అవియన్నియు రోగమునకు స్వరూపలక్షణములే యగునని భావము. మరియు కొన్నిరోగములకు లక్షణములుగ జెప్పబడినవి కొన్ని రోగోత్పత్త్యనంతరముకూడ కాదాచిత్కముగ సంభవించినను అయ్యవికూడ నావ్యాధికి లక్షణములే యగును కాని యుపద్రవములు కానేరవు. (వ్యాధిలక్షణములలో పరిగణింపబడినవానిలో కొన్ని యొకవేళ వ్యాధి మధ్యకాలమున సంక్రమించినను నవి వ్యాధిలక్షణమగునేకాని యుపద్రవము కాదనుట.)

'రోగాశ్రయః' అనుటచేత ప్రధానరోగము నాశ్రయించి ప్రధానరోగకారణముచేతనే కల్గినది యుపద్రవమగునుకాని వేరొండుకారణముచేత వ్యాధి మధ్యమున కల్గిన రోగానంతరము నుపద్రవము కానోపదు. ఎట్లులన గలగండరోగము కల్గినపుడు జ్వరమునకుజెప్పిన కారణములచే మధ్యకాలమునబుట్టిన జ్వరము గలగండమున కుపద్రవముకాదు. ఇత్తెరంగుననే తక్కినవానికి నూహించునది.

మరియు 'రోగ ఏవ' అనిచెప్పుటచేత ప్రధానరోగమున కనుబంధముగ జనించిన రోగమే యుపద్రవమగునుకాని, ప్రధానరోగమునకు కాలాంతరమునగల్గు నవస్థాభేద ముపద్రవము కానేరదు. ఎట్లులన:—తొలుత జనించిన వ్రణశోథము కొంతకాలమునకు వ్రణరూపముగ పరిణమించిన నయ్యది శోథమునకు రూపాంతరమే యగును కాని యుపద్రవము కాదు. అవస్థారూపముగ వచ్చువ్యాధి ప్రధానవ్యాధికే తప్పక సంభవించునవస్థయగును. (ఉపద్రవరూపమగువ్యాధికి అవశ్యము సంభవించునని నియమము లేదని భావము.)

మరియు కొన్నిసమయములయందు అనేకరోగములు కూడ నేకకాలముననే సంప్రాప్తించుటయు కలదు. అయ్యది బలవత్తరకారణసంకరముచే గల్గిన వ్యాధిసంకరమని యెరుంగునది. పైజెప్పినవివరణమునే సుశ్రుతాచార్యులు "తత్ర ఔపసర్గికో నామ యః పూర్వోత్పన్నం వ్యాధిం జఘన్యకాలజాతో వ్యాధిః ఉపసృజతి, స ఉపద్రవః" (సు. సూ. అ. 35.) అని స్పష్టముగ నుపదేశించిరి.

మరియు "తస్య ప్రాయః......భవతి" అని చెప్పుటవలన నొకసమయమున ప్రధానవ్యాధి చికిత్సచేతనే యుపద్రవముశమింపక యుత్కటమగునెడ నట్టియుపద్రవమునకు స్వతంత్రచికిత్సయు జేయదగునని ప్రాయశ్శబ్దముచే ననుగ్రహించిరి. అట్టిచికిత్స ప్రధానవ్యాధికి విరుద్ధము కాకుండవలెను. దీనినే "ప్రధాన మవిరోధయన్" అని స్థలాంతరమున జెప్పిరి. ఈయుపద్రవవివరణమంతయు చికిత్సాసౌకర్యమునకై చెప్పబడినది.

## సన్నిపాతవిసర్పలక్షణములు.

మూ. సర్వాయతనసముత్థం, సర్వలిఙ్గవ్యాపినం సర్వధాత్వనుసారిణం, ఆశుకారిణం, మహాత్యయికమితి సన్నిపాతవిసర్పం, అచికిత్స్యం విద్యాత్. 42

వ్యా. వాతాదివిసర్పములకు వేరువేరుగ జెప్పబడిన కారణములన్నింటిచేత వానికి జెప్పిన లక్షణములన్నింటితో గూడి విసర్పములకు జెప్పిన రక్తాదిధాతువుల నాల్గిటినేగాక తక్కిన మేదోమజ్జాదులతో గూడిన సర్వధాతువుల ననుసరించి వ్యాపించిన విసర్పము సాన్నిపాతికము. ఇయ్యది తక్కినవానికన్న నతిశీఘ్రముగ వ్యాపించు స్వభావముగల్గి మిక్కిలి యసాధ్యమగును; కావున చికిత్సజేయంజనదు. (ఇచ్చట విసర్పసామాన్యముగ "రక్తం లసీకా త్వఙ్మాంసం......సప్తధాతవః" అని సప్తధాతువులు ఆశ్రయములుగ

జెప్పబడినవి. సన్నిపాతమున దోషములు మిక్కుటముగ దుష్టములై పైనియమము నతిక్రమించి యితరధాతువులకూడ నాశ్రయించి జనించునని "సర్వధాత్వనుసారిణం" అను పదముచే సూచింపబడినది. వాగ్భటాచార్యులును "సర్వజో లక్షణైస్సర్వైః సర్వధాత్వతిసర్పణః" (అ. హృ. ని. అ. ౧౩. శ్లో. ౬౪.) అని యీవిషయమునే జెప్పిరి.)

### విసర్పసాధ్యాసాధ్యవిభాగవివరణము.

మూ. తత్ర వాత-పిత్త-శ్లేష్మనిమిత్తా విసర్పాస్త్రయః సాధ్యా భవన్తి.అగ్ని
కర్దమాఖ్యౌ పునరనుపసృష్టే మర్మణి, అనుగతే వా సిరాస్నాయు
మాంసక్లేదే, సాధారణక్రియాభిరుభావేవ అభ్యస్యమానౌ
ప్రశాన్తిమాపద్యేయాతామ్; అనాదరోపక్రాన్తః పునః తయో
రన్యతరో హన్యాద్దేహమాశ్వేవ ఆశీవిషవత్. తథా గ్రన్థివిసర్ప
మజాతోపద్రవం ఆరభేత చికిత్సితుమ్; ఉపద్రవోపద్రుతం త్వేనం
పరిహరేత్. సన్నిపాతజస్తు సర్వధాత్వనుసారిత్వాత్, ఆశుకారి
త్వాత్, విరుద్ధోపక్రమత్వాచ్చ, అసాధ్యం విద్యాత్. 43

వ్యా. పైజెప్పబడిన విసర్పములలో వాత-పిత్త-కఫములచే వేరువేరుగ జనించినవి (ఏకదోషజములు) మూడును వానివాని చికిత్సలచే సాధింపదగియుండును. ద్వంద్వజ విసర్పములలో (వాతపిత్తసంసర్గముచేగల్గిన) అగ్నివిసర్పంబును, (కఫపిత్తములచే గల్గిన) కర్దమవిసర్పంబును, ప్రధానములగు హృదయాదిమర్మముల వ్యాపించకయు, సిరలయొక్కయు స్నాయువులయొక్కయు మాంసముయొక్కయు కుళ్లినద్రవము స్రవించకయు నున్నయెడ, అట్టిదోషముల రెంటికిని సాధారణముగనుండు చికిత్సలచే మిక్కిలి మెలకువతో చాలకాలము విడువక చికిత్సజేసినయెడ శాంతినొందును. అట్టిచికిత్సలయందు గమనము పూర్తిగలేక పొరబడి వ్యత్యస్తముగచేసినయెడ నవియు నసాధ్యములై యారెండిటిలో నేదైనను సర్పమునుబోలె శీఘ్రముగ రోగిని చంపును.

(వాత-కఫములసంసర్గముచే గల్గిన) గ్రంథివిసర్పము 'జ్వరాతీసార' అని చెప్పబడినజ్వరము మున్నగునుపద్రవములు కలుగకముందుగనే చికిత్సజేయ నుపక్రమింపదగు. (అట్టి యవస్థయందు సాధ్యమనుట). అటుగాక యుపద్రవముల గూడియున్నయెడ నసాధ్యమగును గాన చికిత్స జేయంజనదు.

సన్నిపాతమునగల్గిన విసర్పము రసాదిధాతువుల నన్నిటి నాశ్రయించి జనించుటవలనను, శీఘ్రముగ వ్యాపించి కష్టపెట్టుస్వభావము కల్గియుండుటచేతను, వాతాదిదోష

ములకు పరస్పరవిరుద్ధములగు చికిత్సలచే నుపక్రమింపవలసియుండుటంజేసియు మిక్కిలి యసాధ్యమగును. (ఇచ్చట "కైర్లక్షణైః జ్ఞేయః" (విసర్పవ్యాధిభేదముల వేరువేరులక్షణములెవ్వి?) యను నెనిమిదవప్రశ్నమునకు, "రూక్షోష్ణైః కేవలైః" అని యుపక్రమించి చెప్పబడినగ్రంథ ముత్తరమని యెరుంగునది.)

## విసర్పచికిత్సాప్రారంభము.

మూ. తత్ర సాధ్యానాం సాధనమనువ్యాఖ్యాస్యామః. 44

వ్యా. పైజెప్పబడిన విసర్పభేదములలో సాధ్యములుగ పరిగణింపబడిన విసర్పములకు దగుచికిత్స యీక్రింద వివరించి చెప్పబడును. (ఇది మొదలు విసర్పచికిత్సితమెద్ది? యను తొమ్మిదవప్రశ్నమున కుత్తరము.)

## విసర్పచికిత్సాక్రమము, అందు లంఘనాదిసంగ్రహము.

మూ. లఙ్ఘనోల్లేఖనే శస్త్రే తిక్తకానాం చ సేవనం,
కఫస్థానగతే సామే రూక్షశీతైః ప్రలేపయేత్. 45
పిత్తస్థానగతేఽప్యేతత్ సామే కుర్యాచ్చికిత్సితం,
శోణితస్యాఽవసేకం చ విరేకం చ విశేషతః. 46
మారుతాశయసంభూతేఽప్యాదితస్స్యాద్విరూక్షణం,
రక్తపిత్తాఽన్వయేఽప్యాదౌ స్నేహనం న హితం మతమ్. 47
వాతోల్బణే తిక్తఘృతం పైత్తికే చ ప్రశస్యతే,
లఘుదోషే; మహాదోషే పైత్తికే స్యాద్విరేచనమ్. 48
న ఘృతం బహుదోషాయ దేయం యన్న (తం చ) విరేచయేత్,
తేన దోషోఽప్యుపష్టబ్ధః త్వఙ్మాంసరుధిరం పచేత్. 49
తస్మాద్విరేకమేవాదౌ శస్తం విద్యాద్విచక్షణః,
రుధిరస్యాఽవసేకం చ తద్ధ్యస్యాశ్రయసంజ్ఞితమ్. 50

వ్యా. కఫస్థానమైన శరీరోర్ధ్వభాగమున వ్యాపించిన ఆమదోషముతో కూడిన విసర్పమున తొలుత లంఘనవమనములను చేయించి తిక్తరసముతో కూడిన ద్రవ్యముల సేవించుటయు, రూక్షగుణంబును శీతవీర్యంబు నగునౌషధముల లేపనముచేయుటయు ప్రశస్తము. పిత్తస్థానమైన శరీరమధ్యమున జేరి ఆమదోషయుక్తమైనను అట్టి విసర్పమున రక్తమోక్షణంబును విరేచనమును విశేషచికిత్సగ జేయనగును. వాతస్థానమైన శరీరమునం